రాజాజీ రామాయణం

(" చక్రవర్తి తిరుమగన్ " అను తమిళ గ్రంథానువాదం)

సాహిత్య అకాడమీవారి బహుమతి పొందిన గ్రంథం

*

మూలం:

శ్రీమాన్ చక్రవర్తి రాజగోపాలాచారి

అనువాదం:

కె. శ్రీనివాసాచార్యులు, పి. ఓ. యల్.

న్యాయశాస్త్ర శిరోమణి

*

NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11297

ప్రకాశకులు:

వ్యాస ప్రచురణాలయం

12, తంబుచెట్టి వీధి

మద్రాస్-1

ద్వితీయ ముద్రణ:

1967

T
294.5922
RAJ

Copy right

వుప్పలూరి కాళిదాసు

వెల: రు. 5-00

కాలికో ప్రతి వెల : రు. 6-00

ము ద్ర ణ :

టి యన్ ఆర్ ప్రెస్

హై ద రా బా ద్.

T

తొలిపలుకు

"చక్రవర్తి తిరుమగన్" అనే పేరుతో నేను తమిళంలో వ్రాసిన రామాయణపు తెలుగు అనువాదం వెలువడుతున్నందుకు నేను ఎంతో ఆనందిస్తున్నాను. ఇంటింటా ఉండదగినదీ, ప్రతివారూ పఠింపదగినదీ, రామాయణం కంటె వేరే గ్రంథం మరేమున్నది? సీతారాములు, హనుమంతుడు, భరతుడు–వీరు మన ఆత్మబంధువులు. వీరికంటె వేరే ఆశ్రయం మన కెవరున్నారు? రామాయణం తరతరాలుగా మనకు సంక్రమించిన పెన్నిధి. దీనిని తిరిగి సరళమైన భాషలో రచించే అవకాశం లభించడం నా భాగ్యం. దేశానికి నేను పలువిధాల సేవచేశానని మిత్రులు తరచు ప్రశంసిస్తూ ఉంటారు. ఐతే "వ్యాసర్ విరుందు" అనే పేరుతో భారతాన్ని, "చక్రవర్తి తిరుమగన్" అనే పేరుతో రామాయణాన్ని నేను తిరిగి వ్రాయడమే అన్నిటి కంటె గొప్పసేవ అని నేను భావిస్తున్నాను. ఈ కృషియే నా చిత్తానికి శాంతినీ, ఆనందాన్నీ ప్రసాదించింది.

ఎంతకాలం గంగానదీ, గోదావరీ, కావేరీ ప్రవహిస్తూ ఉంటాయో, అంతకాలం సీతారాముల పుణ్యచరిత్రం చల్లని తల్లియై భారతీయులను చేరదీసి రక్షిస్తూనే ఉంటుంది. బిడ్డలలో ఎన్ని లోపాలున్నా, తల్లి సహించి కాపాడుతుంది. ఈ తల్లి కూడా ఆ విధంగానే కరుణామయియై ఆశ్రయించిన వారిని ఉద్ధరిస్తుంది. బిడ్డలు, తల్లులు, అందరూ ఈ గ్రంథాన్ని భక్తితో చదవాలని కోరుతున్నాను. చదివినకొద్దీ దాని ఫలితం నిత్య నూతనముగా అనుభవానికి వస్తూనే ఉంటుంది.

త్యాగరాయనగర్
మద్రాసు

సి. రాజగోపాలాచారి

మనవి

వ్యాస ప్రచురణాలయం తొలి కానుకగా రాజాజీ రామాయణాన్ని ఆంధ్ర పాఠక మిత్రులకు సమర్పించ గలుగుతున్నందుకు నేను ఆనందిస్తున్నాను. ఈ పుస్తకమాలకు "వ్యాస" ప్రచురణాలయమనే పేరు స్వయంగా రాజాజీయే సూచించారు. వ్యాసుడు "నిగమ విభజన విద్యాజని తోల్లాసు" డైన మహర్షి. ఆయన మన ప్రశస్త భారతీయ సభ్యతా సంస్కృతులకు ప్రథమ వ్యాఖ్యాత. మన సంస్కృతి సంపదను అందరికీ వెల్లడించడానికే ఆయన ఎనలేని మన పురాణేతిహాసాల నన్నిటినీ అంత దీక్షతో రచించాడు. విశిష్ట సాహిత్యాన్ని ఆంధ్ర మహాజనులకు అంద జేయడమే ఆశయంగా ఏర్పడిన ఈ సంస్థకు "వ్యాస" ప్రచురణాలయ మనే పేరు సముచితంగా ఉన్నదని భావిస్తున్నాను.

అందుకు తగినట్లుగా మొదట రాజాజీ సుబోధక మైన శైలిలో తిరిగి చెప్పిన రామాయణాన్ని, భారతాన్ని ప్రకటిస్తున్నాను. ఆంధ్రులకు దైవ భక్తి పుట్టుకతోనే అలవడే సొత్తని, తెనుగునాడు ఎందరో పరమ భాగవత శిఖామణులు జన్మించిన పుణ్యభూమి అని రాజాజీ విశ్వాసం. అందుకే ఆయన తెలుగులో, ఈ పుస్తకాలు ప్రచురితం కావడం ప్రత్యేక విశేష మని భావించారు. ఇప్పుడివి వెలువడుతున్నందుకు అమితంగా ఆనందిస్తున్నారు. రాజాజీ రామాయణాన్ని తమిళం నుండి అనువదించి యిచ్చిన శ్రీ కే. శ్రీనివాసాచార్యులు గారికీ, ఈపుస్తకాన్ని ప్రచురణకు సిద్ధంచేసి యిచ్చిన శ్రీ రాంభట్ల కృష్ణమూర్తి, గరికపాటి దక్షిణామూర్తి, ముద్దా చిట్టిబాబుగార్లకూ, చక్కగా ముద్రించిన టి యన్ ఆర్ ప్రెస్ వారికీ కృతజ్ఞుడను.

మంచి పుస్తకాలను సాధ్యమైనంత తక్కువ ధరలకు ప్రకటించి ఆ విధంగా ఉత్తమ సాహిత్యాన్ని అందరికీ అందుబాటులో ఉండేటట్లు చేయాలని, నేటి సాంస్కృతిక పునరుజ్జీవనానికి యథాశక్తి తోడ్పడాలని వ్యాస ప్రచురణాలయ సంకల్పం. ఉత్తమలక్ష్యాన్ని ప్రోత్సహించడానికి, ఎన్నడూ వెనుకాడని ఉదార హృదయులైన ఆంధ్రసోదరులు తమ సహకారాన్ని ఇస్తారని విశ్వసిస్తున్నాను.

వుప్పలూరి కాళిదాసు

ప్రకాశకుడు, వ్యాస ప్రచురణాలయం.

12, తంబుచెట్టి వీధి
మద్రాసు - 1

'ఖాసా ఫోరం' కానుక

'రాజాజీ రామాయణం' తొలిముద్రణ ప్రతులు చెల్లిపోయి నప్పటినుంచి, పునర్ముద్రణకోసం వస్తున్న అభ్యర్థనలు, వ్యాస ప్రచురణాలయం చేస్తున్నకృషి ఫలించి మలిముద్రణను వెలువరించ గలిగినందుకు సంతోషిస్తున్నాను. మూలగ్రంథ రచయిత రాజాజీ, తొంభయ్యోపడిలో అడుగు పెట్టిన ఈ శుభతరుణంలో మలిముద్ర ణను అందజేయగలగటం మరింత ఆనందం కలిగిస్తూంది.

ఈప్రచురణలు వెలువడటానికి మొదటప్రోత్సాహం ఇచ్చిన వారు, కీర్తిశేషులు ఖాసా సుబ్బారావుగారు. ఈనాడు, వారి జ్ఞాపక చిహ్నంగా నెలకొల్పబడుతున్న (ఖాసా ఫోరం) సహకారంతో ఈముద్రణ వెలువడుతున్నది.

ఇది బయటికి రావటానికి, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారకులైన పాఠకులకి, మిత్రులకి, టి ఎన్ ఆర్ ప్రెస్ వారికీ కృతజ్ఞతలు చెప్పుకొంటున్నాను.

ఇంతకుముందులానే, ఇంకముందుకూడా, వ్యాస ప్రచుర ణాలయం పాఠకుల ఆదరాభిమానాలు పొందుతూ ఇతోధిక కృషి చేయగలదని గాఢంగా విశ్వసిస్తున్నాను.

డిసెంబరు, 67

పుప్పలూరి కాళిదాసు.

ప్రకాశకుడు, వ్యాస ప్రచురణాలయం.

శ్రీ రాజాజీ

ఆశీస్సులు

నేను రాసిన రామాయణ మహాభారతాలకు శ్రీ శ్రీనివాసాచార్యులు, 'శ్రీ వాత్సవ'గార్లు చక్కటి తెలుగు అనువాదాలు చేశారు. వ్యాస ప్రచురణాలయం వారిచేత ప్రచురింపబడ్డ ఈ పుస్తకాలకు తెలుగు పాఠకులు ఇచ్చిన ఆదరణ నన్నెంతో సంతోషపరిచింది. మొదటి ముద్రణ ప్రతులు త్వరగా అమ్ముడుపోవటంవల్ల శ్రీకాళిదాసుగారు ఒక్కొక్క పుస్తకానికి పదివేల ప్రతులచొప్పున రెండో ముద్రణాన్ని విడుదల చేస్తున్నారు. అధిక సంఖ్యలయిన తెలుగు పాఠకులు ఈ పుస్తకాలు చదవటం నాకు సంతోషకారణం. అందుకు నేను కృతజ్ఞుణ్ణి. వ్యాస వాల్మీకి మహర్షుల బోధలు స్త్రీ పురుషులలో పిన్నలకు, పెద్దలకు అందరికీ ఆత్మవికాసం కలిగిస్తాయి.

చక్రవర్తి రాజగోపాలాచార్య

7-4-1968



విషయసూచిక

	పేజి
కొలిపలుకు	1
శోకంగా మారిన శోకం	5
1. కథా ప్రారంభం	7
2. కొరత తీరింది	8
3. విశ్వామిత్రుడు	11
4. బ్రహ్మదండం	15
5. త్రిశంకువు	17
6. వసిష్ఠుడి నోటితో	22
7. రాముడు కావాలి:	25
8. తాటక	29
9. యాగ సంరక్షణం	33
10. నాగేటి చాలులో బాల	37
11. సగరుడు	40
12. భగీరథుడు	43
13. అహల్య	48
14. సీతాకల్యాణం	54
15. పరశురాముడు	57
16. సుఖజీవనం	61
17. యౌవరాజ్యం	62
18. కైకేయి	70
19. గూనిదాని బోధ	76
20. ఆదిలప్పరాదు	79
21. పెళ్లామా పిశాచమా?	84
22. కైకేయి ఆశ్చర్యం	91
23. కోపం-శాంతం	99
24. సీత నిర్ణయం	105
25. నార బట్టలు	109
26. వనవాసానికి ప్రయాణం	114
27. గంగోత్తరణం	121
28. చిత్రకూటం	127
29. కన్నతల్లి దుఃఖం	130
30. ముందు కథ	134
31. ప్రాణత్యాగం	138
32. భరతుడికి వర్తమానం	141
33. పవిత్ర హృదయం	146
34. పాపం పండింది	151
35. భరతుని నిర్ణయం	155
36. గుహుడి సందేహం	161
37. భరద్వాజాశ్రమం	166
38. అదిగో: రాముడి ఆశ్రమం :	171
39. లక్ష్మణుడి కోపం	174
40. రామ భరత సమాగమం	178
41. భరతుడి తిరుగు ప్రయాణం	183
42. విరాధుడి వధ	192
43. పదేళ్ల తరువాత ...	199
44. జటాయువు	206
45. శూర్పణఖ	210
46. కంబరుకవి చిత్రించిన శూర్పణఖ	217
47. ఖర వినాశనం	223
48. మతిపోయిన మహీపతి	231
49. ఐ గారు లేడి	239
50. జటాయువు పరాక్రమం	248
51. చెర	256
52. వీఱ్ఱులు-పెదబొబ్బలు	263
53. తండ్రివంటివాడు	270
54. ఎడమకన్ను అదిరింది	275

	పేజి
55. నగల మూట	282
56. సుగ్రీవుడి కథ	286
57. సుగ్రీవుడి సందేహం	289
58. వాలి వధ	295
59. తారా విలాపం	301
60. కోపం చల్లారింది	308
61. సీతాన్వేషణ	317
62. సంపాతి	322
63. వాయుపుత్రుడు	326
64. సముద్ర లంఘనం	331
65. అన్వేషణ	335
66. అశోకవనంలో సీత	343
67. రావణుడి ప్రార్థన— సీతాదేవి సమాధానం	347
68. బుద్ధిమతాం వరిష్ఠమ్	353
69. జానకి ఊరడిల్లింది	359
70. జగన్మాతా—మారుతి	368
71. కర్యానికి కాలు దువ్వుతున్నాడు	374
72. శ్రీరామ దూత	377
73. బంధితుడు	381
74. లంకాదహనం	386
75. వానరుల కోలాహలం	393
76. దొరికింది సీతమ్మ— తెలిసింది తోవ:	398
77. దండు కదిలింది	402
78. లంకలో కలవరం	406
79. మంత్రాలోచన	411
80. తప్పబుట్టినవాడు	415
81. శత్రువా? — మిత్రుడా?	420
82. విభీషణ శరణాగతి	425
83. సేతుబంధనం	430
84. యుద్ధారంభం	434
85. సీతకు శుభవార్త	440
86. నాగాస్త్రాలు	446
87. "రేపు రా!"	452
88. కుంభకర్ణుడికి మేలుకొలుపు	458
89. నారాయణుడేనా?	464
90. ఇంద్రజిత్తు మరణం	468
91. రావణుడి అంతం	473
92. మంగళం	478
మలి పలుకు	485
భూమిక	491

తొలిపలుకు

వాల్మీకి - కంబరుకవి

సర్వేశ్వరుడి లీలలు తెలిసిన వారెవరూలేరు. ఆ లీలల్లోని చిన్న చిన్న కిరణాలే మనం చేసే పనులు. వాల్మీకి రచించిన రామచరితాన్ని సరళమైన భాషలో తెలుగువారికి అందించ దలచాను. పండితుడను కాకపోయినా ఈ పనికి పూనుకొన్నాను. కంబరుకవి చెప్పినట్లు సవినయంగా మనవి చేస్తున్నాను. నేను రామాయణాన్ని సరళశైలిలో చక్కగా చెప్పబూనడం పాలసముద్రాన్ని పూర్తిగా త్రాగాలని అనుకున్న పిల్లికోరిక లాంటిది. అయినా రామకథను ఎవరేవిధంగా చెప్పినా సముద్రాలను అవలీలగా దాటిన ఆంజనేయుడు వారికి తోడ్పడతాడు.

భక్తితో ఒకరు చేసే పనిలో పెదలు లోపాలు చూడరు. వారిని ఉత్సాహపరిచి పని జరిగేలాగా చూస్తారు.

పశు పక్ష్యాదులు లాగానే చెట్లకు కూడా ఎముకలు, కండరాలు, చర్మం ఉంటాయి. కొన్నిచెట్లకు మనలాగే లోపల ఎముకలు, పైన చర్మమూ ఉంటాయి.

పనస, మామిడి, చింత, టేకు మొదలైన చెట్లకు పెబెరడే చర్మం. ఈ పైబెరడు మూలంగానే జీవసారం చెట్టుకు చేరుతుంది. ఇక చెట్టు మధ్యనుండి బరువునంతా మోసే లోపలికర్ర దాని ఎముక, అయితే చెట్టుకు కావలసిన జీవసారమంతా దా పైబెరడు ద్వారానే ప్రవహిస్తుంది. లోపల ఎముక, పైన బెరడూ, జీవసార ప్రవాహమూ, ఇదీ వృక్షాల జీవన విధానం. అరటి, కొబ్బరి, తాటి, పోక, వరి, గరిక, జొన్న, చెరకు మొదలైనవి పోలికలో దీనికి పూర్తిగా విరుద్ధంగా వుంటాయి. వీటిపైన ఎముక, లోన దంటులో జీవసారం ఉంటాయి.

తాటి, కొబ్బరి, చెరకువంటి స్థావరాలలాగా జంగమ ప్రాణులైన తాబేలు, శంఖం, నత్త, గవ్వ మొదలైనవాటికి పైన ఎముక లోపల

ప్రాణం ఉంటాయి. గవ్వ, శంఖం మొదలైనవాటిని మనం ఆ ప్రాణులు చనిపోయాక ఉపయోగించుకుంటున్నాం. ఇవి జీవించి ఉన్నప్పుడు పెంకు లోపల చర్మం, కండరాలు ఉంటాయి. మనకు శరీరంలో ఎముకలున్నట్లే వీటికి శరీర పైభాగమైన ఎముక పెంకు. చర్మాన్నీ కండరాలనూ పైపెంకు కవచంలాగా కాపాడుతూ ఉంటుంది.

అలాగే గ్రంథాలుకూడా రెండురకాలు. ఒకరకం గ్రంథానికి శబ్దంలో ఉన్న అర్థమే ప్రాణం. మరొక రకానికి దాని ఆకారమే ప్రాణం. విషయం, వివరణవుండే రసాయన శాస్త్రం, వైద్య శాస్త్రం, దేశచరిత్ర, భూగోళం; గణిత శాస్త్రం మొదలైన గ్రంథాలు అర్థమే ప్రాణంగాగల తరగతికి చెందుతాయి. పద్య కావ్యాలు, మహాకావ్యాలు మొదలైనవాటికి భావానికి కవి కల్పించిన ఆకార సౌందర్యంలోనే ప్రాణం ఉంది.

పద్యాన్ని విడదీసి వచన రూపంలోకి మారిస్తే చప్పగా వుంటుంది. కవి కల్పించిన ఆకారాన్ని ఛేదించినప్పుడు దానికి ప్రాణం వుండదు. గణిత, వైద్యాది గ్రంథాలు అలాక్కాదు. మళ్లీ మళ్లీ చదువుకోటానికి వీలుగా గ్రంథకర్త వాటికి పద్యరూపమిచ్చి ఉండవచ్చు. పూర్వం శాస్త్ర గ్రంథాలన్నీ ఇలాగే పద్యరూపంలో ఉన్నై. కాని ఆ గ్రంథాలను వచనరూపంలో వ్రాసినప్పటికీ వాటి జీవం చెడదు. వాటి ప్రాణం అర్థంలో ఉంది. కాబట్టి, అర్థంతోపాటు జీవం కూడా నిలిచి ఉంది.

కంబరుకవి పద్యాలను కాని, భారతకవి పద్యాలను కాని వచనంచేస్తే అర్థం లోపించదు. కాని జీవంలేని శరీరంమాత్రమే నిలుస్తుంది. వచనంగా మారిన పద్యం బతికున్న శవంలాగా ఉంటుంది. దానికితోడు ప్రతిపదార్థం, నిశేషార్థం, వ్యాకరణాంశాలు జతచేస్తే అది శవశోధనాలయంగా తయారవుతుంది. శవశోధనాలయం జ్ఞాపకవృద్ధి చేసుకోటానికి బాగా పనికొస్తుంది. కాని అక్కడ సౌందర్యం ఉండదు. పద్యానికిగల ప్రత్యేక ప్రయోజనం కూడ మిగలదు.

"ఏనుగు బ్రతికినా చచ్చినా వేయి వరహా"లన్నట్లు కొన్ని గ్రంధాలు రెండు విధాలా ఫలితాన్నిస్తాయి. కావ్యాలను, పద్యాలను ఇతరులకోసం అనువదించడం ఈ కాలపు అలవాటు. తమిళులు కంబరు కావ్యాన్ని, భారతికవి కృతులను, తిరుక్కురళును ఆంగ్లంలోకి అనువదించడానికి ఉబలాట పడుతున్నారు. అలా అనువదించిన వాటిని చదవడానికి కొందరు తమిళులు ఆసక్తి చూపుతున్నారు. వాల్మీకి కావ్యానికి నా అనువాదం కూడా ఈ కోవకు చెందిందే. మరణించిన ఏనుగులాగానే అనువదించిన రామాయణానికి కూడ విలువ ఉంది. ఈ విషయాన్ని వివరించడానికే ఇంత దూరం తిప్పాను.

* * *

వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించిన కాలమూ శ్రీరామచంద్రుడు ఈ భూలోకంలో అవతరించిన కాలమూ ఒక్కటే అని పౌరాణికులు వరసగా అనుకుంటూ వచ్చారు. కాని లోకాను భవాన్నిబట్టి విమర్శించి చూస్తే వాల్మీకి మహర్షి రామాయణం రచించడానికి పూర్వం అనేక శతాబ్దాలుగా సీతారాముల కథ ప్రచారంలో ఉన్నట్లు తోస్తుంది. అది అప్పటికి అక్షర రూపం పొందక ఆ చెవినుండి ఆ చెవికి వస్తున్న గాథ. వాల్మీకి మహర్షి అలా వినికిడిగా వస్తున్న ఆ గాథకు గ్రంధరూప మిచ్చినట్లు తోస్తుంది. అందువల్ల కథ నడకలో అనేక చిక్కులు ఏర్పడినట్లు మనం గుర్తించవచ్చు. వాలిని సంహరించిన నీతిలేని పద్ధతి, సీతను అడవికి పంపటంలో అధర్మమూ మొదలైన వెన్నో చిక్కులున్నాయి.

వాల్మీకి మహర్షి తన కావ్యంలో రాముణ్ని దేవుడుగా భావించలేదు. కొన్ని కాండలలో అక్కడక్కడ రాముణ్ని భగవదవతారంగా వర్ణించే శ్లోకాలున్నాయి. కాని మొత్తంమీద వాల్మీకి రామాయణంలో కానవచ్చే రాముడు ఒక ఉత్తమ రాజకుమారుడు. వీరపురుషుడు. అపూర్వ దైవాంశ పొందినవాడు. అంతే. ఈశ్వరుడిలాగా అతడేపనీ చేయలేదు.

వాల్మీకి మహర్షి కాలంలోనే శ్రీరాముడు దేవుడి అవతారమనే ఒక అభిప్రాయం ప్రజల్లో ఉంది. వాల్మీకి రామాయణం

రచించిన అనేక శతాబ్దాల తర్వాత కంబరుకవి, తులసీదాసు రామాయణ కావ్యగానం చేశారు. అప్పటికి శ్రీరాముడు మహావిష్ణువు అవతారమనే భావం దేశంలో బాగా నాటుకుంది. రాముడన్నా, కృష్ణుడన్నా మహావిష్ణువే. శ్రీమహావిష్ణు వంటేనే రాముడూ, కృష్ణుడున్నూ-ఇదీ ప్రజల నమ్మకం. దీనికి తగినట్టుగానే రాముడిమీద భక్తి, ఆయనకు దేవాలయాలు, పూజాక్రమం క్రమంగా ఏర్పడినై.

మానవుల విశ్వాసమూ పూజా క్రమమూ, ఈ విధంగా పరిణమించిన తర్వాత కంబరు కవిగాని, తులసీదాసుగాని రాముణ్ణి సామాన్య వీరుడని వర్ణించడమెలా సాధ్యమవుతుంది? అలా వర్ణించాలని ప్రయత్నించినా వీలు కాలేదు. కంబరుకవి, తులసీదాసులు గొప్ప భక్తులు. వారు నేటి చరిత్రకారులవంటివారు కాని, నవలా రచయితల వంటివారుకాని కారు. రామావతారాన్ని వాల్మీకిలాగా ఒక సాధారణ వీర పురుషుని కథగా చెప్పడానికి వీలుకాని కాలంలో కంబరుకవీ, తులసీదాసూ రామాయణ కావ్యగానం చేశారు. రాముడికి మానవజన్మ ఆపాదించడానికి కంబరుకవి భక్తిలో చోటులేదు. కనుకనే కంబరుకవి రామాయణంలో మిక్కిలి రసవత్తర ఘట్టాలలో శ్రీరాముడు మహా విష్ణువుగా, భగవంతుడుగా మాటి మాటికి మనకు కనిపిస్తాడు. రాముడు అన్ని చోట్లలోనూ వుండే పరబ్రహ్మస్వరూపుడే అన్నట్టుగా హృద్యంగా అద్భుతంగా వర్ణన చేశాడు కంబరుకవి.

మహా కవులైనవారు దేశ కాల పరిస్థితులకు తగినట్లు కావ్య రచన చేస్తారేకాని కేవల శుష్క విమర్శలను పద్యాలల్లి పాడరు.

వాల్మీకి రామాయణానికీ కంబరు రామాయణానికీ మరొక పెద్ద తేడా ఉంది. వాల్మీకి మహర్షి రచించిన గ్రంథం ద్విపద కావ్యపద్ధతిలో ఉందని చెప్పొచ్చు. కంబరుకవి రచన నాట్యానికి అనువైనపాట. ఇంగ్లీషులో చెప్పాలంటే వాల్మీకి రామాయణం గంభీరనాదం పొదిగిన "బ్లేంక్ వెర్స్" (యతిప్రాసలు లేక చెప్పిన కావ్యం). కంబరామాయణం ఒక 'లిరిక్' (గాన రూపంగా వుండే కావ్యం). కంబరుకవి రచనలో ప్రతి పద్యమూ యతి, ప్రాస, ఛందస్సులు కలిసి తళుకుమనే మెరుగు బంగారు చీరగట్టిన స్త్రీలాగా

తళుక్కు తళుక్కుమని మెరసి నృత్యం చేస్తుంది. డైవికమైన ఆవ తారం మనుష్యులో ఉండడంవల్ల కలిగే భావావేశంతోపాటు నాట్య రుచికూడా కలిగి కంబ రామాయణం మహా సౌందర్యాన్ని సంత రించుకొంది. కాని దానిని ఒక్క తమిళులు మాత్రమే గ్రహించి ఆనం దించ గలుగుతారు. దాని సౌందర్యం ఇతరులకు చక్కగా బోధపడదు. కంబ రామాయణాన్ని ఇతర భాషల్లోకి అనువదించడం వల్లగాని తమిళంలోనే వచనం చేయడం వల్లగాని సత్ఫలితం ఏమీ ఉండదు.

శ్లోకంగా మారిన శోకం

ఒకనాడు ఉదయాన నారదమహర్షి వాల్మీకి ఆశ్రమానికి విచ్చే శాడు. వాల్మీకి ఆయనను ఆదరించి, నమస్కరించి "నారద మహర్షీ! మీరు సర్వజ్ఞులు. ఈ లోకంలో సకల సద్గుణ సంపన్నుడైన వీరుడు, జ్ఞాని అయిన ఉత్తమపురుషుడు ఎవరు?" అని అడిగాడు.

వాల్మీకి మహర్షి ఇలాగ ఎందుకు అడుగుతున్నాడూ? అని నార దుడు తన దివ్యదృష్టిచేత గ్రహించి ఇలా అన్నాడు: "నీ వడిగిన మహావీరుడు రాముడు. సూర్యవంశంలో పుట్టాడు. ఇప్పుడు అయోధ్యలో రాజ్య మేలుతున్నాడు."

అలాగ చెప్పి నారద మహర్షి వాల్మీకికి రామచరితాన్ని సంగ్ర హంగా వివరించాడు. అదివిని వాల్మీకి చాలా సంతోషించాడు. నార దుడు వెళ్ళిపోయిన తర్వాతకూడా వాల్మీకి ఆ విషయాన్నే చాలసేపు మననంచేస్తూ కాలకృత్యాలు తీర్చుకొనడానికి తమసానదికి వెళ్లాడు.

స్నానాలరేవు చేరడానికి ఏటిగట్టునే వెళుతూ ఉండగా అక్క డొక చెట్టుకొమ్మమీద ఆనందపరవశమైన ఒక కౌజుపిట్టల జంట కని పించింది. ఇంతలో మాటునుండి ఒక కిరాతుడు విడిచిన బాణం తగిలి ఆ జంటలో మగపక్షి నేలకూలింది. ఆడపక్షి తన జతపిట్ట నేలబడి కొట్టుకొనడం చూసి వలవలఏడ్చింది.

వాల్మీకి ఇదిచూసి "ఓరీ! పాపాత్ముడా! ఎంతపని చేశావురా? నీ బ్రతుకంతా నిలవ నీడలేక తిరుగుతావులే!" అని తనకి తెలియకుం

డానే కిరాతుణ్ని శపించాడు. మరుక్షణమే తేరుకొని "ఇలా ఎందుకు అన్నానా" అని ఎంతో విచారించాడు. "కిరాతుణ్ని నే నెందుకు శపించాను. ఇలా శపించడానికి నాకేం అధికారం ఉంది? కోపావేశానికి లొంగిపోయాను కదా?" అని చింతించాడు.

మహర్షి నోట వెలువడిన శాపవచనం ఒక అద్భుతమైన స్వరంతో, ఛందస్సుతో అతని చెవిలో ప్రతిధ్వనించింది. మహర్షి చాలా ఆశ్చర్యపడ్డాడు. పక్షుల దుఃఖం చూసి తన హృదయంలో కలిగిన కరుణ, తీరనివ్యధ శాపరూపం దాల్చి తనకు తెలియకుండానే ఒక అద్భుత శ్లోకంగా అవతరించింది. వాల్మీకి ఆశ్చర్యంతో "ఇది నాకు తెలియని ఈశ్వరలీలా విశేషం" అని అనుకుని ధ్యానంలో మునిగిపోయాడు.

అంతట చతుర్ముఖ బ్రహ్మ వాల్మీకికి ప్రత్యక్షమై "ఋషి శ్రేష్ఠుడా! చింతించకు. శ్రీరామ చరితం వ్రాయడానికి నిన్ను పురికొల్పటానికే ఇది జరిగింది. శోకంవలన పుట్టిన ఈ శ్లోకాన్నే ఛందస్సుగా చేసుకొని రఘునాయకుని కథను రచించి లోకోపకారం చేయగల శక్తిని మీకు వరంగా ఇచ్చాను" అని ఆనతిచ్చి మాయమయ్యాడు.

కిరాతునిపై కోపంతో చెప్పిన ఆ శాపాన్ని వాల్మీకి, ఆయన శిష్యులూ పదేపదే మననం చేసుకొని ఆ శ్లోకపద్ధతిని మనస్సులో నిల్పుకొన్నారు. తర్వాత అదే ఛందస్సుతో వాల్మీకి మహర్షి శ్రీరామ చరితాన్ని పూర్తిగా రచించి తన శిష్యులకు బోధించాడు. ఇలాగ వాల్మీకి రామాయణం అనే పవిత్రగ్రంథం పుట్టింది.

పార్వతీ పరమేశ్వరులు మానవులుగాపుట్టి మనుష్యుల దుఃఖాలను స్వయంగా అనుభవించి ధర్మం స్థాపించిన పుణ్యకథను వాల్మీకి మహర్షి మృదుమధురమైన గొప్పశైలిలో రచించి లోకానికందించాడు. ఈ భూమిపై నదులు, కొండలు ఎంతకాలముంటాయో అంతకాలం ఈ రామాయణం జనాదరణ పొందుతుందనీ, లోకుల పాపాలు పోగొడుతుందనీ అన్న బ్రహ్మ మాట అసత్యం కానేరదు.

రా జా జీ రా మా యు ణ ం

1. కథా ప్రారంభం

కోసలదేశం గంగానదికి ఉత్తరాన ఉంది. సరయూనదీ జలాలతో సారవంతమైన విశాలదేశ మది. దానికి రాజధాని అయోధ్య. దాన్ని సూర్యవంశ నాయకమణి అయిన మనువు నిర్మించాడు. ఆ కాలంలో అతిసుందరమైన కీర్తి బడసిన మహానగరం. వాల్మీకి వర్ణనలనుబట్టి చూస్తే అయోధ్య నేటి రాజధానుల కేమాత్రమూ తీసిపోదు. ఆ ప్రాచీన కాలంలోనే భారతదేశంలో పట్టణ నాగరికత గొప్పస్థితిలో వుందని తెలుస్తుంది.

దశరథ చక్రవర్తి ఈ అయోధ్యలోవుండి రాజ్యపాలన చేస్తూ ఉండేవాడు. అతడు దేవతలకు యుద్ధాలలో తోడ్పడి ముల్లోకాలలోనూ కీర్తి గడించాడు. ఇంద్ర కుబేరులకు సాటివాడనిపించుకొన్నాడు. కోసల ప్రజలు ఏ కొరతాలేక సుఖంగా ఉండేవారు. లెక్కలేనంతమంది వీరవరులతో గొప్పసేన ఎల్లప్పుడూ రాజ్యాన్ని రక్షిస్తూ ఉండేది. దశరథుడు అయోధ్యా నగరాన్ని శత్రువులు అడుగు పెట్టటానికి వీలులేకుండా చేశాడు. సేనాబలం, కోట, అగడ్తమున్నగు రక్షణఏర్పాట్లతో శత్రువుకు చొరరానిదవడంవల్ల దానికి "అయోధ్య" అని పేరు వచ్చింది. అయోధ్య అంటే యుద్ధంచేసి లొంగదీయరానిదని అర్థం.

దేవరాజువలె కీర్తి, ఐశ్వర్యం పొంది రాజ్యమేలుతున్న దశరథునికి తగినవారు ఆయన మంత్రులు. ఆలోచన చెప్పటంలోనూ, చెప్పిన పనిని వెంటనే నెరవేర్చటంలోనూ, చతురత సామర్థ్యమూగల ఎనమండుగురు మంత్రులు దశరథునిదగ్గర కొలువుచేస్తూ ఉండేవారు. ధర్మోపదేశానికీ, పూజలూ,యజ్ఞాలూ జరిపించడానికీ వసిష్ఠుడు, వామదేవుడు మున్నగు ఋషులూ, బ్రాహ్మణోత్తములూ రాజు సమీపవర్తులై ఉండేవారు.

ప్రజలకు బాధలేనివిధంగా వారి శక్తికి తగినట్లు పన్నులు విధించే వారు. ఉపాయశాలురు, రాజకార్య నిపుణులూ అయిన మంత్రి సామంతులతో దశరథమహారాజు ఉదయభానునివలె తేజరిల్లాడు.

2. కొరత తీరింది

చాల సంవత్సరాలు చక్కగా గడిచిపోయాయి. అయినా పుత్రులు లేని కొరత రాజును పీడిస్తూ ఉండేది. వసంతకాలంలో ఒక నాడు రాజు కొక ఆలోచన తట్టింది. "అశ్వమేధ యాగం. పుత్ర కామేష్టి చేస్తే పుత్ర భాగ్యం కలగవచ్చునేమో !" అనుకొన్నాడు. గురువుల నడుగగా వారు ఋష్యశృంగ మహాముని ని రప్పించి అతని ఆధ్వర్యంలో యాగం జరప నిశ్చయించి అందుకు తగు ఏర్పాట్లు చేశారు. రాజ్యమంతటా ఆహ్వానాలు వెళ్లాయి. యాగశాలా నిర్మాణం మొదలైన పనులు చాలా చురుకుగా సాగాయి.

ఆ కాలంలో యాగమంటే సామాన్యమైన పనికాదు. విధి విహితమైన కొలతలతో యజ్ఞవేదికను చాల జాగ్రత్తగా నిర్మించాలి. అందుకు ప్రత్యేకనిపుణు లుండేవారు. వారంతా కలిసి నిర్ణయించి పురమాయించినట్లు పని జరగాలి. యజ్ఞ పాత్రలనుకూడ తగిన నిపుణులచేత తయారు చేయించాలి.

వడ్రంగులు, శిల్పులు, ఉప్పర్లు, ముచ్చెవారు, గాయకులు, వాద్యనిపుణులు, నర్తకులు మొదలైన అనేకమంది కళాకుశలురను రప్పించాలి. అతిథుల నివాసానికి ఒక పెద్దనగరాన్నే నిర్మించాలి. వేలసంఖ్యలో అతిథులకు భోజనాది వసతులు ఏర్పరచాలి. దానం చేయడానికి గోవులు, వస్త్రాలు తెప్పించి ఉంచాలి. ఆటలు, పాటలు మున్నగు వేడుకలు ఏర్పాటుచేసి జనసమూహానికి సంతృప్తి కలిగించాలి. నేడు ప్రభుత్వాదరంతో జరిగే పెద్ద పెద్ద మేళాలు, ఉత్సవాలు సమావేశాలవలెనే ఆ కాలంలో యజ్ఞయాగాదులు జరిగేవి.

అన్ని కార్యాలూ శాస్త్రోక్తంగా త్వరగా జరిగాక, యాగాశ్వాన్ని సైన్యంతో దేశదేశాలు తిరిగిరావటానికి పంపించారు. ఒక

సంవత్సరం గడిచినవెనుక ఎట్టి అంతరాయమూలేక యాగాశ్వం, దాని వెంటనున్న వీరులు జయజయధ్వానాలు చేస్తూ ఉండగా అయోధ్యానగరానికి తిరిగి వచ్చింది.

తర్వాత యజ్ఞం శాస్త్రోక్తంగా మొదలుపెట్టారు. ఇక్కడ అయోధ్యలో ఇలా జరుగుతూ ఉండగా ఆక్కడ దేవలోకంలో జరిగిన విశేషాలను వాల్మీకి ఇలాగ చెపుతున్నాడు:

"దేవతలందరూ బ్రహ్మదేవునితో ఇలా చెప్పుకొన్నారు. "మహాను భావా! రావణుడనే రాక్షసుడు మీ వరంపొంది మమ్మల్ని పీడించుకు తింటున్నాడు. అతడిని అణచుటకు కాని, జయించుటకు కాని, సంహరించుటకు కాని మాకు శక్యం కాకున్నది. మీ వరం అతడికి కవచమైంది. పెచ్చుపెరిగిన అహంకారంతో ఆ దుష్టు డెవ రినీ లెక్కచేయడంలేదు. ఇంద్రుణ్ని తరిమివేసి దేవలోకాన్నే ఆక్ర మించాలని చూస్తున్నాడు. అతడ్ని చూసి వాయువు, అగ్ని, వరు ణాది దిక్పాలురు భయంతో వణకుతున్నారు. అందుకని అతని అహంకార మణచి అతని రాక్షసచేష్టలు అణచగల ఉపాయం కూడా మీరే చెప్పాలి."

అది విని బ్రహ్మదేవుడు "ఈ రావణుడు తపస్సుచేసి వరం పొందాడు. వర మడిగేటప్పుడు మన అదృష్టంకొద్దీ ఒక విషయాన్ని మరిచిపోయాడు. దేవ దానవ గంధర్వులవల్ల తనకు మృత్యువు కలుగ కుండా వరమడిగాడే గాని మానవులమాట ఆ వరంలో చేర్చలేదు. మరపువల్లనో, నిర్లక్ష్యంవల్లనో మానవజాతిని విడిచిపెట్టాడు. అందువల్ల దీనికొక మార్గముంది. మీ రందరూ మహావిష్ణువును శరణు వేడండి" అని చెప్పాడు.

దేవతలందరూ సంతోషించి వెంటనే మహావిష్ణువు కడకేగి శరణు వేడారు. "ఓ లోకనాథా! రావణుడనే దుష్టుడు బ్రహ్మవల్ల వరంపొంది లోకాన్ని హింసిస్తున్నాడు. వాని రాక్షస బాధలు మాకు విపరీతంగా ఉన్నాయి. అతడు అమరత్వాన్ని వరంగా పొందినప్పుడు మనిషివల్ల మరణం రారాదన్న అంశాన్ని చేర్చలేదు.

మరపువల్లనో, అలక్ష్యంవల్లనో కాని అతడు దానిని అడగలేదు. కనుక తమ కృపను వేడుతున్నాం. మానవజన్మమెత్తి తామే మమ్ము కాపాడాలి'' అని వారు విష్ణువును వేడుకొన్నారు.

నారాయణుడు 'సరే' నని సమ్మతించాడు. "భూలోకాన పుత్ర భాగ్యంకోసం తపస్సు చేస్తున్న దశరథునకు కుమారులుగా అవతరించి రావణుని సంహరించి మిమ్ము కాపాడుతా"నని అభయమిచ్చాడు. అట్లే దశరథుని ముగ్గురుభార్యల గర్భాలలో ప్రవేశించడానికి మహా విష్ణువు సంకల్పించాడు.

ఋష్యశృంగుడు యాగాగ్నిలో నెయ్యి హోమం చేశాడు. నేతిని ప్రింగటానికా అన్నట్లు జ్వాలలు పైకిలేచాయి. ఆ జ్వాలలలో నుంచి అగ్నిబింబమువంటి ఆకారంతో యజ్ఞపురుషుడు తేచాడు. అతని కాంతి సూర్యుడిలాగా కండ్లకు మిరుమిట్లు కొలిపింది. అతడు తన రెండు చేతులతోను ఒక దివ్యమైన బంగారు పాత్రను పట్టుకొని నిలిచాడు. నిలిచి, దుందుభి మ్రోగినట్లు గంభీరస్వరంతో: "దశరథ మహారాజా! దేవతలు నీ ప్రార్థనను మన్నించారు. ఈ పాయసాన్ని పర్సిాదించారు. నీకు పుత్రభాగ్యం కలుగుతుంది. దీనిని తీసికొని నీ భార్యలకు పంచిపెట్టు'' అని అన్నాడు.

దశరథుడు పట్టరాని ఆనందం పొందాడు. పసిపాప నెత్తు కొన్నట్లు ప్రీతితో ఆ పాత్ర నందుకొన్నాడు. వెంటనే యజ్ఞపురు షుడు మాయమయ్యాడు.

యజ్ఞం ముగిసిన తర్వాత రాజు, పాయసపాత్రను తీసికొని అంతఃపురానికి వెళ్లాడు. తన భార్యలను పిలిచి "ఇదిగో, దేవతల ప్రసాదం. దీనిని మీరు ముగ్గురూ పుచ్చుకొని పుత్రభాగ్యం పొందండి" అన్నాడు.

ఈ సంతోషవార్త వారు వినగానే అంతఃపురం శరత్కాలపు పండు వెన్నెలలాంటి కాంతితో విరాజిల్లింది.

దశరథుడికి కౌసల్య, సుమిత్ర, కైకేయి అని ముగ్గురు భార్యలు. పాత్రలోవున్న పాయసంలో సగం కౌసల్యాదేవి పుచ్చు

కుంది. మిగిలినదానిలో సగం సుమిత్రాదేవి పుచ్చుకుంది. ఆ మిగిలినదానిలో సగం కైకేయి ఆరగించింది. ఆమె ఆరగించగా మిగిలిన పాయసాన్ని దశరథుడు మళ్లా సుమిత్ర కిచ్చాడు.

పెన్నిధి దొరికిన పేదలాగా దశరథుడి ముగ్గురు భార్యలూ సంతోషంతో ఉప్పొంగిపోయారు.

3. విశ్వామిత్రుడు

యజ్ఞపాయస ప్రభావంవల్ల దశరథుడి ముగ్గురు భార్యలూ గర్భం ధరించారు. కాలక్రమాన కౌసల్యాదేవి రాముణ్ని కన్నది. కైక భరతుణ్ని కన్నది. సుమిత్రాదేవి ఇద్దరు కుమారులను కన్నది. వాళ్లే కవలలు-లక్ష్మణ శత్రుఘ్నులు. పాయసం పుచ్చుకొన్న విధానాన్ని అనుసరించి ఈ నలుగురు కుమారులూ విష్ణు అంశ పంచుకుని పుట్టారని వాడుక. రాముడు విష్ణువులో సగమనీ, లక్ష్మణుడు పాతిక భాగమనీ, భరత, శత్రుఘ్నులూ చెరొక పరక భాగమనీ, చెబుతారు. కాని ఈ విషయాలేమంత ముఖ్యమైనవి కావు. భగవంతుణ్ని విభజించి లెక్కకట్టడం వీలుకాని పని. పరబ్రహ్మంలోని ఏ చిన్న భాగమయినా పూర్ణంగానే ఉంటుందని వేదవాక్యం.

"ఓం పూర్ణమదః పూర్ణమిదం
పూర్ణాత్పూర్ణ ముదచ్యతే!
పూర్ణస్య పూర్ణ మాదాయ
పూర్ణమేవావశిష్యతే"

"అక్కడ ఉన్నది పూర్ణము. ఇక్కడ ఉన్నది పూర్ణము. పూర్ణమునుంచి పూర్ణము పుట్టింది. పూర్ణమునుంచి పూర్ణమును తీసివేస్తే మిగిలి ఉండేదీ పూర్ణమే!"

పరబ్రహ్మం భౌతికాలైన గణిత గ్రంథ నియమాలకు లోబడదు.

నలుగురు రాజకుమారులూ శాస్త్రవిహితమైన సకల విద్యలూ నేర్చుకున్నారు. చిన్ననాటి నుండీ లక్ష్మణుడికి రాముడంటే భక్తి.

రాముడికి లక్ష్మణుడంటే ప్రేమ. ఆలాగే భరత శత్రుఘ్నులకు ఒకరి మీద ఒకరికి మిక్కిలి అనురాగం. వాళ్లు ఎప్పుడూ కలిసి మెలిసి ఉండేవారు. ఇదికూడా తల్లులు పాయసం పుచ్చుకొన్న ఫలితంగా కలిగిన అనురాగ బంధమే అని భావించుకోవచ్చు.

ఇలాగ నలుగురు కుమారుల గుణగణాలూ, శక్తి సామర్థ్యాలూ పరస్పర ప్రేమా, తేజస్సూ పెంపొందుతూ ఉండగా దశరథ మహారాజు, దేవతలమధ్య కొలువుదీరిన చతుర్ముఖుడిలాగా సంతోషంతో తేజరిల్లుతూ ఉండేవాడు.

ఒకనాడు దశరథ మహారాజు తన మంత్రులతో కొలువై కుమారుల వివాహాలను గురించి ఆలోచిస్తున్నాడు. అప్పుడు ద్వార పాలకులు తొట్రుపాటుతోవచ్చి "దేవరా! విశ్వామిత్ర మహర్షి ఏలినవారి దర్శనంకోసం వచ్చి కాచుకున్నారు" అని మనవి చేశారు. విశ్వామిత్రుడంటే అందరికీ హడలు.

మహా శక్తిసంపన్నుడూ, కీర్తిమంతుడూ అయిన ఆ మహర్షి తలవని తలంపుగా తన్ను చూడటానికి వచ్చాడని తెలిసిన వెంటనే దశరథుడు సింహాసనం దిగి మహర్షి కెదురేగి, స్వాగతం పలికి శాస్త్రోక్త మర్యాదలు చేసి ఉచితాసనంమీద కూర్చోబెట్టాడు.

మొట్టమొదట విశ్వామిత్రుడూ ఒక రాజే. తర్వాత తపస్సు చేసి మహర్షి అయ్యాడు. ఘోర తపస్సుచేసి సిద్ధిపొందాడు. గురు శాపానికి గురి అయిన త్రిశంకు మహారాజుమీద దయదలచి ఒకప్పుడు ఒక కొత్త బ్రహ్మనూ, కొత్త ప్రపంచాన్ని సృష్టించడానికి సంకల్పించాడు. తన తపోబలంతో నక్షత్రాలను సృష్టించి ఆకాశానికి దక్షిణ దిక్కున వాటిని నిలిపాడు. తర్వాత దేవతల మొర ఆలించి తన సృష్టిని అంతటితో విరమించివేశాడు. ఇదంతా రామాయణానికి పూర్వం జరిగిన గాథ.

* * *

విశ్వామిత్రుడు మహర్షి అవటానికి పూర్వం అతనికి కౌశిక మహారాజని పేరు. ఒకప్పుడాయన తన సేనను తీసికొని జైత్రయాత్ర

చేస్తూ వసిష్ఠ మహర్షి ఆశ్రమానికి వెళ్లాడు. విశ్వామిత్రుడు వసిష్ఠ మహర్షికి మొక్కి దీవన పొందాడు.

కుశల ప్రశ్నలయిన తర్వాత వసిష్ఠ మహర్షి "మీకూ మీపరివారానికీ ఆతిథ్య మియ్యాలని నా కోరిక. నా కోరికను మన్నించి నా సత్కారాన్ని స్వీకరించవలసిం"దని విశ్వామిత్రుణ్ణి కోరాడు.

విశ్వామిత్రుడు "తాపసోత్తమా! తాము నాకు మంచినీళ్ళిచ్చి చేసిన మర్యాదనే గొప్ప విందుగా భావిస్తున్నాను. తమ దర్శనం లభించడమే నాకు మహాభాగ్యం. 'నీకు అతిథి పూజ చేయ గోరుతున్నాను' అని తాము పలికిన ప్రియవచనాలే చాలు. నాకూ నాసేనకూ గొప్ప విందుచేసినట్లే భావిస్తున్నాను. నాకిక సెలవు అనుగ్రహించాలి" అని వేడుకొన్నాడు.

గొప్ప సేనతో వచ్చిన రాజుకు ఋష్యాశ్రమంలో విందు చేయడానికి వీలేది? కనుక వసిష్ఠుడు చెప్పినది మాటవరసకు అన్న ఆదర వాక్యం తప్ప మరొకటికాదని విశ్వామిత్రుడు భావించాడు. అందుకని వసిష్ఠుడి మనసు నొప్పించకూడదన్న తలంపుతో అలాగ అన్నాడు.

కాని వసిష్ఠుడు మాత్రం భోజనంచేసి వెళ్లవలసిందని విశ్వామిత్రుణ్ణి బలవంత పెట్టాడు.

విశ్వామిత్రుడు "కోపగించకండి. తమ భోజనోపచారాలను నేను తిరస్కరించినట్లు అనుకోవద్దు. ఈ ఆశ్రమంలో నాకూ, నా పరివారానికీ ఉన్నపాటున భోజన పదార్థాలు దొరకడ మెలాగా అన్న చింత ఒక్కటే నన్ను బాధిస్తూంది" అని స్పష్టంగా చెప్పేశాడు.

అంతట వసిష్ఠమహర్షి చిరునవ్వుతో తన ఆవును పిలిచి "బిడా! శబలా! ఈ రాజుగారికీ, వీరి పరివారానికీ కావలసిన భోజనాలు వెంటనే సమకూర్చి పడించ వలసింద"ని ఆనతిచ్చాడు.

అప్పుడు కౌశిక మహారాజు విస్తుపోయేటు ఒక అద్భుతం జరిగింది. రాజుగారికీ ఆయన పరివారానికీ సైనికులకూ కూడా కావలసిన సమృద్ధిగా మృష్టాన్నాల రాశి వచ్చి పడింది. చవులూరే రకరకాల

అన్నపానీయాలు, భక్ష్యాలు, నెయ్యి, పెరుగు, పువ్వులు, సుగంధ ద్రవ్యాలు ఒకటేమిటి_మనసులో అనుకున్నవల్లా ఆశ్రమంలోవున్న అందరికీ లభించాయి. కౌశికుడి భార్యలూ, మంత్రులూ, బంధు పరివారామూ, పురోహితులూ, సైనికులూ, సేవకులూ, అంతా ఆ ఋష్యాశ్రమంలో సంతృప్తితో విందారగించి మహర్షి తపోబలాన్ని చూసి ఆశ్చర్యనిమగ్నులయ్యారు.

విశ్వామిత్రుడు వసిష్ఠుడికి తన కృతజ్ఞతను తెలిపి కడకు ఇలా ప్రార్థించాడు:

"ఈ శబలను నాకియ్యండి. దీని శక్తిని నేను కళ్లారా చూశాను. రాజధర్మాన్ననుసరించి ఇలాటిది రాజునైన నాకే చెందవలసి ఉంది."

ఇదివిని వసిష్ఠుడు చాలా చింతించాడు. "శబలను విడిచి నేనుండలేను. ఇందుకు అనేక కారణాలున్నాయి" అని చెప్పి గోవును ఇవ్వడానికి నిరాకరించాడు. వసిష్ఠుడలా నిరాకరించిన కొద్దీ విశ్వామిత్రుడికి ఆశ ఎక్కువైంది. ఆవుకు బదులు ఇది ఇస్తాను అది ఇస్తాను అని కౌశికుడు వసిష్ఠుడి మనసు మార్చుదామని చూశాడు. కాని లాభం లేకపోయింది. "ఈ ఆవుకు బదులుగా మీ రివ్వగలిగిన సంపదలన్నీ ఇచ్చినా లాభంలేదు. శబలను మీ కివ్వడానికి వీల్లేదు" అని ఖండితంగా చెప్పేశాడు.

అందుమీద విశ్వామిత్రుడు ఆగ్రహించి తన సైనిక బలంతో శబలను బలవంతంగా తీసుకు పోవాలని చూశాడు.

శబల వలవల ఏడ్చింది. "నేను మహర్షికి ఏమి అపచారం చేశాను. వీళ్లు నన్ను బలిమిని తీసుకు పోవాలని చూస్తూ ఉంటే నన్ను పెంచిన ఈ మహర్షి మిన్నకున్నాడేమిటి?" అని ఏడ్చింది. ఇక ఊరుకోరాదనుకొని తన చుట్టూ ఉన్న సైనికులను కొమ్ములతో కుమ్మరితివేసి వసిష్ఠుని వద్దకు పోయింది.

తన తోబుట్టువులాంటి ఈ ఆవు శోకించడం చూసి వసిష్ఠుడు "బిడ్డా! నిన్ను హింసిస్తున్న వాళ్లని మట్టుపెట్టగల మహాసేనను నీవు సృష్టించు" అని ఆనతిచ్చాడు.

వెంటనే ఆవు "హూం, హూం" అని హుంకరించింది. లెక్క లేనన్ని సేనలను సృష్టించి విశ్వామిత్రుడి సేవకులను చెదరగొట్టింది.

దీన్ని చూసి విశ్వామిత్రుడు కోపం ముప్పిరికొనగా కండ్లెర్రచేసి రథమెక్కి బాణాలు వేశాడు. శబలకూడ తన శరీరంనుంచి అసంఖ్యాకులైన వీరులను సృష్టించి విశ్వామిత్రుణ్ని ఓడించింది. అతని సేనను నాశనం చేసేసింది. విశ్వామిత్రుడి కుమారులలో కొందరు వసిష్ఠుణ్ని చంపడానికి మీదకురాగా ఆయన అదలించే సరికి వాళ్లంతా భస్మమై పోయారు.

అవమానం పొందిన విశ్వామిత్రుడి ముఖకాంతి తగ్గింది. అతడక్కడే తన కుమారులలో ఒకడికి రాజ్యం అప్పజెప్పి ఏలాగైనా వసిష్ఠుణ్ని సాధించాలనే తలంపుతో ఉమాపతిని ఆరాధించటం కోసం హిమాలయాలకు బయలుదేరి పోయాడు.

4. బ్రహ్మదండం

విశ్వామిత్రుడి ఉగ్రతపస్సుకు పరమశివుడు ప్రసన్నుడై దర్శనమిచ్చాడు.

"రాజా! నీ కేం కావాలి? దేనిని కోరి ఈ తపస్సు చేస్తున్నావు?" అని మహాదేవుడు అడిగాడు.

విశ్వామిత్రుడు చేతులు జోడించి నమస్కరించి "స్వామీ! నాకు ధనుర్వేదాన్ని పూర్ణంగా అనుగ్రహించాలి. సమస్త అస్త్రాలూ నాకు వశమయ్యేలాగా వరం దయచేయించాలి" అని ప్రార్థించాడు.

"తథాస్తు!" అని మహాదేవుడు, దేవతలు, దానవులు, గంధర్వులు, ఋషులు, యక్షులు మొదలైన వాళ్లందరికీ తెలిసిన అస్త్రాలన్నింటినీ విశ్వామిత్రుడికి ప్రసాదించాడు.

పరమేశ్వరు డిచ్చిన వరాన్ని గైకొని విశ్వామిత్రుడు తిరిగి వచ్చాడు. తపస్సువలన పొందిన శక్తిని తలచుకొని అహంకారంతో

పున్నమనాటి సముద్రంలాగా పొంగిపోయాడు. "ఇక వసిష్ఠుని పని సరి!" అని తనలో తాననుకొంటూ వసిష్ఠాశ్రమానికి వెళ్లాడు.

యమునిలాగా ఉగ్రకోపంతో వస్తున్న విశ్వామిత్రుణ్ణి చూచి వసిష్ఠుడి శిష్యులు ఆశ్రమ మృగాలలాగా భీతితో కకావికలైనారు.

విశ్వామిత్రుడు విడిచిన ఆగ్నేయాస్త్రం వేడికి ఆశ్రమం కాలి బూడిదై పోయింది. 'భయంలేదు' అని వసిష్ఠు డెంత ఊరడించినా వినక, శిష్యులు భయంతో పరుగులు పెడుతూనే ఉన్నారు.

వసిష్ఠుడిది చూచి "ఈ కౌశికుని గర్వమణచాలి" అనుకొన్నాడు. కాలాగ్నిలాగా మండుతున్న తన బ్రహ్మదండాన్ని చేత బట్టి విశ్వామిత్రుణ్ణి చూచి "మూర్ఖుడా!" అన్నాడు. విశ్వామిత్రుడికి రోషమెక్కింది "ఓరీ! వసిష్ఠా! నిలు నిలు!" అని అదలించి తాను కొత్తగా నేర్చిన ఆగ్నేయాస్త్రాన్ని అతనిపైకి పంపించాడు.

వసిష్ఠ మహర్షి "ఇదిగో నిలిచే వున్నాను. పరుగెత్తడంలేదు" అనిచెప్పి బ్రహ్మదండాన్ని తనకెదురుగా నిలబెట్టాడు. విశ్వామిత్రుడు వేసిన అస్త్రాలన్ని ఆ బ్రహ్మదండం ముందు నీటిలోబడ్డ నిప్పులా చల్లారి పోయాయి.

విశ్వామిత్రుడు తాను నేర్చిన అస్త్రాలన్నింటినీ ప్రయోగించాడు. వాటి నన్నిటినీ వసిష్ఠుని బ్రహ్మదండం మింగివేసింది. మహర్షి సుఖంగా నిలబడి ఉన్నాడు. ఈ అద్భుతాన్నిచూచి విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

ఈ బ్రహ్మాస్త్రంవల్ల ఏం ఉపద్రవం ముంచుకు వస్తుందో అని ఋషులూ దేవతలూ తల్లడిల్లారు. మహర్షి బ్రహ్మదండం ఆ బ్రహ్మాస్త్రాన్ని కూడా మింగివేసింది. ఆ అస్త్రాన్ని మింగిన బ్రహ్మదండం నుంచి అగ్నికణాలు నలుదిక్కులకూ ఎగిరాయి. దండాన్ని పట్టిన వసిష్ఠుడుకూడా అగ్నిలాగ జ్వలించాడు.

విశ్వామిత్రుడు విసుగుతో నిట్టూర్పు విడిచాడు. "నేను ఓడిపోయాను. క్షత్రియ బలమెందుకు? ఈ ఋషి తన దండంతో నా

అస్త్రాలన్నిటిని వృథా చేసివేశాడు. పరమశివుడు నన్ను మోసగించాడు. నేనుకూడ ఈయనలాగా బ్రహ్మర్షిని కావాలి. వేరే మార్గంలేదు'' అని యుద్ధాన్ని చాలించి తిరిగి ఘోరతపస్సు చేయడం కోసం దక్షిణ దిక్కుగా బయల్దేరాడు.

విశ్వామిత్రుడు బ్రహ్మను ఉపాసించి అనేక సంవత్సరాలు తపస్సు చేశాడు. చివరకు బ్రహ్మదేవుడు ప్రసన్నుడై "కుశిక పుత్రా! నీ తపస్సువల్ల రాజర్షి పదవి పొందావు. లే'' అని ఆనతిచ్చి అంతర్ధానుడయ్యాడు.

తన ఉగ్ర తపస్సు ఫలితంగా బ్రహ్మ రాజర్షి పదవిని మాత్రమే ఇచ్చినందుకు విశ్వామిత్రుడు పెతచెంది ఇంకా ఉగ్రమైన తపస్సు చేయసాగాడు.

5. త్రిశంకువు

విశ్వామిత్రుడిలాగ తపస్సు చేస్తూ ఉన్నకాలంలో సూర్యవంశపు రాజైన త్రిశంకువు అఖండకీర్తితో అనేక సంవత్సరాలు రాజ్యంచేసి బొందితో స్వర్గానికి పోవాలని కుతూహలు డయ్యాడు. అందు కొక యాగం చేయగోరి తన కులగురువైన వసిష్ఠనివద్దకు వెళ్ళి ఆ యాగం చేయించవలసిందని ప్రార్థించాడు.

వసిష్ఠుడు "రాజా! ఇది నీకు అలవి కాని పని. వద్దు. ఈ ఆలోచన మానుకో'' అని హితవు చెప్పాడు.

త్రిశంకువుకు ఆ హితవు నచ్చలేదు. అప్పుడాయన వసిష్ఠుని కుమారులవద్దకు పోయి "మీ తండ్రిగారు నాకు గురువులు. ఆయన వీలుకాదని చెప్పిన ఈ యజ్ఞాన్ని మీరు జరిపించాలి. నా గురువుగారు నన్ను విడిచిపెట్టారు. మీరైనా ఆదుకోవాలి'' అని ప్రార్థించాడు.

వసిష్ఠ కుమారులకు కూడ ఆయనపై చాలకోపం వచ్చింది.

"నీ కీ దుర్బుద్ధి ఎందుకు పుట్టింది? నీకు గురువు, మాకు తండ్రి అయిన వారు చెప్పినమాట వినక మావద్ద కెందుకు వచ్చావు?'' అని వారడిగారు.

కాని త్రిశంకువు వారిమాట వినక మళ్లా మళ్లా తన కోర్కెను తెలుపుతూ వాళ్లని బలవంతపెట్టసాగాడు.

"మూర్ఖుడా! మా తండ్రిని అవమానించడంకోసం మమ్మల్ని ఉపయోగించుకో చూస్తున్నావు. పో, పో" అని వాళ్లు కసరికొట్టారు.

"ఈ పని మీవల్ల కాకపోతే నేను మరెవరినైనా వెతికి కార్యక్రమం పూర్తి చేసుకుని తీరుతాను" అని త్రిశంకువు వాళ్లకి మరింత కోపం వచ్చేట్లు చెప్పాడు.

వసిష్ఠపుత్రులది సహించలేకపోయారు. వాళ్లు రాజును చూచి "గురువును ధిక్కరించిన రాజా! నీవు చండాలుడవయిపో" అని శపించారు.

ఆ రాత్రి నిద్రించిన త్రిశంకువు ఉదయం లేచి చూసుకోగా తన అందమైన రూపాన్ని, కాంతిని, ఛాయను పోగొట్టుకొని అనాకారి అయిపోయాడు, పీతాంబరానికి మారు మురికిపాతలున్నవి. ధరించిన ఆభరణాలన్నీ మారిపోయాయి. మంత్రులూ, పరిజనులూ, పురజనులూ రాజుగారి వికారపురూపు చూసి దూరంగా తొలగిపోయారు. అందరూ అతన్నిచూచి ఏవగించుకొన్నారు. రాజు ఈ అవమానమూ, దుఃఖమూ భరించలేక నగరం విడిచి, నిద్రాహారాలు మాని, ఒంటరిగా తిరుగసాగాడు.

చండాలవేషంలో ఉన్న త్రిశంకురాజు అలా తిరిగి తిరిగి, తపోధనుడైన విశ్వామిత్రుడి ఆశ్రమానికి చేరుకున్నాడు. ఆతనిని చూచిన తోడనే విశ్వామిత్రుడికి దయకలిగి "నీవు త్రిశంకురాజువు కాదా? ఈ వికారమైన ఆకార మేమిటి? ఇది ఎవరిశాపం?" అని అడిగాడు.

త్రిశంకువు జరిగినదంతా చెప్పి "నేను ధర్మం తప్పక రాజ్యపాలన చేశాను. సత్యజీవితం గడిపాను. నే నేపాపమూ చేసి ఎరుగను. ఎవరికీ ఏ విధమైన కీడూ చేయలేదు. నా గురువూ వారి కుమారులూ నన్ను విడనాడి, పైగా ఈ స్థితికి వచ్చేటట్లు శపించారు. నన్ను మీరే కాపాడాలి" అని ఆయన పాదాలమీద పడ్డాడు.

శాపంవల్ల చండాలుడుగా మారిన రాజుమీద విశ్వామిత్రుడికి దయ పుట్టింది. విశ్వామిత్రుడి స్వభావమే అంత. అతని దయ, ప్రేమ, కోపం ఏదైనా అతితీవ్రంగా ఉంటాయి.

విశ్వామిత్రుడు అతణ్ని చూచి మధురవాక్కులతో "నాయనా! ఇక్ష్వాకుకుల రాజా! నీకు స్వాగతం. నీధార్మికజీవితం నాకు బాగా తెలుసు. నీకు అభయ మిచ్చాను. ఋషులతో కూడా అందరినీ రప్పించి నీవు జరపదలచిన యాగాన్ని నేను జరిపిస్తాను. గురువుగారి కోపంవల్ల నీకువచ్చిన ఈ రూపంతోనే నీవు స్వర్గాన్ని చేరగలవు, ఇది నిశ్చయం" అని మాట ఇచ్చాడు.

పిమ్మట యజ్ఞానికి కావలసిన ఏర్పాట్లు గావించాడు. "నీ గురువువల్ల వచ్చిన ఈ చండాలరూపంతోనే నీవు స్వర్గం చేరగలవు. నీవు కౌశికుణ్ని ఎప్పుడు శరణువేడావో అప్పుడే నీ కోరిక నెరవేరిందనుకో" అని త్రిశంకు మహారాజుకు విశ్వామిత్రుడు ధైర్యం చెప్పాడు. ఇలాగా చెప్పి, అతడు తనశిష్యులను పిల్చి "మీరు వెళ్ళి ఋషులందర్నీ శిష్యులతోకూడా యజ్ఞానికి రావలసిందని నా ఆహ్వానంగా చెప్పండి" అని ఆజ్ఞాపించాడు.

శిష్యులు ఆ విధంగానే పెద్దలందరివద్దకూ వెళ్ళి విశ్వామిత్రుడి పిలుపు నందించారు. ఇంచుమించు అందరూ రావడానికి ఒప్పుకొన్నారు. మహాతపస్వి అయిన విశ్వామిత్రుడి ఆహ్వానాన్ని నిరాకరించే ధైర్యం ఎవరికి వుంది?

కాని వసిష్ఠుడి కుమారులను పిలిస్తే వాళ్ళు "మేము రానే రామని మహర్షితో చెప్పండి. ఆయన ఎంత తపస్వి అయినా క్షత్రియుడు. క్షత్రియు డెలాగ యాగకార్యం జరుపుతాడు? అందులో చండాలుడికోసం యజ్ఞం చేయించడమా?" అని ఆక్షేపించారు.

ఇది విన్న విశ్వామిత్ర మహర్షికి తీవ్రమైనకోపం వచ్చింది. "నేను చేసేపనిలో దోషంలేదు. గర్విష్ఠులైన వసిష్ఠకుమారులు భస్మమగుదురుగాక! వారు ఏడుజన్మలవరకు కుక్కను తినే హీనజాతిలో

పుట్టెదరుగాక !" అని శపించాడు. తర్వాత యథావిధిగా యాగం మొదలుపెట్టాడు.

అక్కడ చేరిన పెద్దలందరికీ తాను తలపెట్టిన కార్యాన్ని గురించి ఇలాగ చెప్పాడు :

"ఈ త్రిశంకువు మహాధర్మాత్ముడు. సత్యసంధుడు. ఇక్ష్వాకు కుల రాజు. ఇతడు బొందితో స్వర్గానికి వెళ్లాలని నేను ఈ యాగం తలపెట్టాను."

అంతా కలిసి ఈ కార్యం నెరవేర్చాలని ప్రార్థించాడు.

అతని ప్రార్థన విన్న మునులు "ఇతడు గొప్ప తపోబలుడు. ఇతనికి కోపంవస్తే మనం భరించలేం" అని భయపడి అందరూ యజ్ఞానికి తోడ్పడ్డారు. కౌశికుని ఆధ్వర్యాన అన్నికార్యాలూ చక్కగా జరిగాయి.

యాగం ముగిసేసమయాన దేవతలను పిలిచి "హవిస్సు పుచ్చుకొండి" అని చెప్పాలి. విశ్వామిత్రుడు అలాగే మంత్రం చెప్పి దేవతలను ఆహ్వానించాడు. కాని ఎవ్వరూ రాలేదు. యాగం చెడిపోయింది. భయపడి వచ్చిన ఋషులు మనస్సుల్లోనే విశ్వామిత్రుణ్ణి ఎగతాళిచేశారు.

విశ్వామిత్రుడికి పట్టరాని కోపం వచ్చింది. తన చేతిలోవున్న నేతిగరిటెను పైకెత్తి త్రిశంకురాజును చూచి "త్రిశంకూ : నా సంకల్ప బలం, తపస్సు, శక్తి అంతా నీకు ఉపయోగిస్తున్నాను. చూడు, నా తపస్సులో ఏ మాత్రం శక్తి ఉన్నా నీవు బొందితో స్వర్గానికి వెళతావు. దేవతలు హవిస్సు తీసుకోక పోవడంవల్ల నాకు చింత లేదు. రాజా ! వెళ్లు ! పైకివెళ్లు" అన్నాడు.

అప్పుడొక అద్భుతం జరిగింది. అచటచేరిన ఋషులు, బ్రాహ్మణులు రెప్పవేయక చూస్తూవుండగా చండాలుడైన రాజు అలాగే ఆకాశానికి ఎగిరాడు. విశ్వామిత్రుడి తపోబలాన్ని లోకం అప్పుడు గుర్తించింది.

త్రిశంకువు స్వర్గాన్ని చేరాడు. ఇంద్రుడిది చూచి "చండాల దేహంతో ఎవడిక్కడికి వస్తున్నాడు? ఓహో! త్రిశంకుడా? సరి. గురు శాపం పొందిన మూఢుడా, వెళ్లిపో!" అని క్రిందికి అతణ్ని తోసివేశాడు. త్రిశంకువు గోలపెడుతూ స్వర్గంనుంచి తలకిందులుగా పడ్డాడు. కిందపడుతూ "అయ్యా! నన్ను కాపాడు" అని మొరపెట్టాడు.

దీన్ని చూస్తున్న విశ్వామిత్రుడు తన తపోబలాన్ని ఈ విధంగా దేవతలు కించపరుస్తున్నారని కోపావేశంతో "నిలు నిలు" అని చెప్పి ఆ మునులమధ్య ఒక చతుర్ముఖ బ్రహ్మలాగ జ్వలించాడు. తలకిందుగా పడుతున్న త్రిశంకువు, విశ్వామిత్రుడు నిలు అని చెప్పగానే ఆకాశం మధ్యన ఒక నక్షత్రంగా ప్రకాశిస్తూ అలాగే నిలిచిపోయాడు. ఆకాశాన త్రిశంకువు నిలిచినచోటికి దక్షిణంగా ఒక కొత్త సప్తర్షి మండలాన్ని, అనేక నక్షత్రాలను ఆ క్షణాన్నే విశ్వామిత్రుడు సృష్టించాడు.

"కొత్త ఇంద్రుణ్ని సృష్టించి ప్రతిష్ఠిస్తాను. కొత్త దేవతలను సృష్టిస్తాను, చూడండి, నా శక్తి" అని చెప్పి, విశ్వామిత్రుడు సిద్ధపడ్డాడు.

"ఇదేమిటి ఈ విపరీతం!" అని దేవతలూ, మునులూ విశ్వామిత్రుడి వద్దకు వచ్చారు.

వాళ్లు విశ్వామిత్రుడితో సవినయంగా ఇలా మనవి చేశారు: "మహాత్మా? వద్దు వద్దు. త్రిశంకువు మొదలైన నక్షత్రాలన్నీ తాము నిర్ణయించినతీరుగానే శాశ్వతంగా ఉంటాయి. తమ కీర్తికి కొరతలేదు. తాము శాంతించి మమల్ని కాపాడాలి."

వాళ్లు ఏదో ఒక విధంగా విశ్వామిత్రుణ్ని సమాధాన పరచి వెళ్లిపోయారు. అంతవరకూ కూడబెట్టిన విశ్వామిత్రుని తపోబలం ఈ విధంగా ప్రతిసృష్టివల్ల నాశనమై పోయింది.

6. వసిష్ఠుడినోటితో

కోపంవల్లా, శాపంవల్లా విశ్వామిత్రుని తపస్సు నశించింది. అది చూచి ఆయన మళ్లీ ఘోర తపస్సు చేయడం కోసం పడమటి దిక్కున ఉన్న పుష్కర తీర్థానికి బయల్దేరాడు.

అక్కడా అనేక సంవత్సరాలు తపస్సు చేసిం తర్వాత, తీరా అది సిద్ధించే సమయానికి ఒక సంగతి జరిగింది. విశ్వామిత్రుడు మళ్లా కోపంతో శాంతం మరచిపోయి తన కొడుకులనే తాను శపించి వేశాడు. ఆ తర్వాత కోపానికి తావివ్వరాదని నిశ్చయించి మళ్లీ తపస్సు ప్రారంభించాడు. అలాగ అనేక సంవత్సరాలు గడిచాక బ్రహ్మదేవుడు, దేవతలు అతనికి దర్శనమిచ్చారు.

"కౌశికా : నీ తపస్సు ఫలించింది. నీవికమీద రాజుల లెక్కలోకి రావు. ఇప్పుడు పూర్ణ ఋషివి" అని చతుర్ముఖుడూ, దేవతలూ వెళ్లిపోయారు.

కాని ఇంత మాత్రాన విశ్వామిత్రుడికి సంతృప్తి కలుగుతుందా ? అతడు పరమశివుడి వల్ల దివ్యాస్త్రాలు పొందాడు. ఇప్పుడు ఋషి పదవి పొందాడు. కాని వసిష్ఠుడితో సమానం కావడమే అతని కోరిక. కోరిక తీరేదాకా మళ్లీ ఘోరతపస్సు చేయడానిక నిశ్చయించాడు.

దేవతలకిది నచ్చలేదు. తపస్సుకు విఘ్నం కలిగించడం కోసం వారు పుష్కర తీర్థానికి మేనకను పంపించారు. ఆ అప్సరస పుష్కర తీర్థంలో స్నానం చేయడానికి వచ్చింది. ఆమె అందంచూచి విశ్వామిత్రుడు విభ్రాంతుడయ్యాడు. తన తపస్సును మరచి ఆమెతో పది సంవత్సరాలు సుఖంగా గడిపాడు. ఈ పది సంవత్సరాలూ ఒక రాత్రీ ఒక పగలులా గడిచిపోయాయి.

అతర్వాత విశ్వామిత్రుడు మేల్కొన్నాడు "అయ్యో : ఇలాగ అయిందే !" అని దుఃఖించాడు. మేనక భయంతో అల్లాడిపోయింది. విశ్వామిత్రు డెక్కడ శపించి పోతాడో అని చేతులు కట్టుకొని నిలచింది. కాని మహర్షి కోపం అణచుకున్నాడు. "ఇందులో నీ

దోషంలేదు. నా అజ్ఞానమే దానికి కారణం'' అని మధుర వచనాలు పలికి ఆమెను పంపివేశాడు. తర్వాత హిమాలయానికి వెళ్ళి ఇంద్రియాల నణచి వేయి సంవత్సరాలు ఉగ్రతపస్సు చేశాడు.

అప్పుడు చతుర్ముఖుడు దేవతలతో సహా ప్రత్యక్షమై "విశ్వామిత్రా! నీవు మేనకను శపించక ఓర్పు వహించావు. నీవు మహర్షిపదం పొందావు" అని ఆశీర్వదించాడు.

విశ్వామిత్రుడు సంతోషించాడు. కాని అతని కోరిక మాత్రం తీరలేదు. కనుక అతడు ముందెప్పుడూ ఆచరించనంతటి ఘోరమైన తపస్సు మళ్ళీ వేయేండ్లు చేశాడు.

దానితో దేవతలు భయపడ్డారు. తపస్సును చెడగొట్టడానికి ఈసారి రంభ అనే అప్సరసను పంపించారు.

"రంభా! నీ దయ కావాలి. నీవు ఏలాగైనా సరే విశ్వామిత్ర మహరిని మెమరపించి ఆయన తపస్సుకు భంగం కలిగించాలి'' అని ఇంద్రుడు ఆమెను కోరాడు. తొలుత ఆమె భయపడింది. అయినా ఇంద్రుడి ఆనతి ననుసరించి వెళ్ళి విశ్వామిత్రుడి మనస్సును కలత పెట్టింది. విశ్వామిత్రుడు తన వాంఛను అణచుకొన్నాడు. కాని ఆమె తనను వంచించడానికి వచ్చిందన్న కోపంతో "నీవు శిలవై పో" అని శపించాడు. ఋషుల మనస్సున పుట్టే కోపమే వాళ్ళ శాపం. వాళ్ళ తలచిందల్లా తపోబలంవల్ల వెంటనే నెరవేరుతుంది. కాని దాంతోపాటే వారి తపోబలం నష్టమై పోతుంది.

విశ్వామిత్రుడు మళ్ళా గట్టి నిశ్చయం చేసుకొన్నాడు. అన్న పానాలు మాని పంచేంద్రియాలు బంధించి అదివరకెవరూ చేయని ఉగ్రతపస్సు చేశాడు.

ఇదికూడ వేయి సంవత్సరాలూ సాగింది. అతని తపస్సును భంగపరచడానికి దేవతలెన్ని ప్రయత్నాలు చేసినా అవి సాగలేదు. విశ్వామిత్రుని దేహం కొయ్యలా అయిపోయింది. ఇంద్రియ వ్యాపారాలు ఆగిపోయాయి. ప్రాణం మాత్రం నిలిచి ఉంది.

దేవతలంతా విశ్వామిత్రుడి ఉగ్రతపస్సుకు భీతిల్లారు. ఆ తపస్సు వేడికి తాళలేక వారు బ్రహ్మదగ్గరికి వెళ్ళి చేతులు జోడించి "దేవా! కౌశిక మహర్షి తపస్సు ధాటికి తాళలేకున్నాం. తపో విఘ్నానికి మేం చేసిన యత్నాలేవీ ఫలించలేదు. అతని తపస్సు వేడికి మేం మాడిపోతామేమో అని భయం కలుగుతూంది. అతడు కోరిన వరాలిచ్చి కాపాడండి!" అని ప్రార్థించారు.

అప్పుడు చతుర్ముఖుడు దేవతలు వెంటరాగా విశ్వామిత్రుడికి దర్శనమిచ్చి "నీవు బ్రహ్మర్షి వయ్యావు. నీకు సర్వ శుభాలూ కలుగుతాయి!" అని ఆశీర్వదించాడు. విశ్వామిత్రుడు సంతసించాడు. "కాని ఈ మాట వసిష్ఠుని నోట వచ్చినప్పుడు కదా నాకు తృప్తి!" అని బ్రహ్మదేవునితో వినయంగా చెప్పాడు.

అప్పుడు వసిష్ఠుడు తమ పాత జగడాన్ని తలచుకొని చిరునవ్వుతో "మీరు చేసిన కఠిన తపస్సుకు తగు ఫలితం పొందారు. మీరు బ్రహ్మర్షి అయినారన్న విషయంలో సందేహమేమీ లేదు" అన్నాడు. ఆ మాటలకంతా సంతోషించారు.

ఇలాగ అద్భుతమైన పట్టుదలతో మహాద్భుతమైన తపస్సు చేసి సిద్ధిపొందిన మహర్షి తలవని తలంపుగా దశరథుని సభకు వచ్చాడు.

ఇంద్రుని సభకు బ్రహ్మదేవుడు వచ్చినప్పుడు దేవరాజు స్వాగతమిచ్చినట్టు దశరథుడు లేచి మహర్షికి స్వాగతమిచ్చి అతని పాదాలకు నమస్కరించాడు. "ఇవాళ సుదినం. తమ రాకవల్ల నా కర్మబంధం తెగిపోయింది. ఇది మా పూర్వీకుల తపఃఫలం. రాత్రి గడిచి సూర్యోదయం అవుతున్నట్లున్న ఈ శుభసమయాన తమ ముఖపద్మాన్ని దర్శించాను. ఇక నాకేమిటి లోటు? రాజుగా రాజ్యాన్ని పాలించి తపస్సుచేత బహ్మర్షి పదవిని సాధించిన తాము నన్ను అనుగ్రహించడానికి వేంచేశారు. నా వల్ల కాగల కార్యమేమిటి? ఆనతీయండి! తమ ఆజ్ఞకు బద్ధుణ్ణి" అని సవినయంగా పలికాడు.

దశరథుని మాటలకు విశ్వామిత్రుడు చాలా సంతోషించాడు. ఆ సంతోషంలో అతని తేజస్సు మిక్కిలిగా ప్రకాశించింది.

"రాజా : ఈ విలువగల మాటలు మీకే తగును. ఈ విధంగా మీరు తప్ప మరెవరు మాట్లాడగలరు ? మీరు పుట్టిందా ఇక్ష్వాకు వంశం. మీ కులగురువా వసిష్ఠ మహర్షి. అలాంటి మీరు ఇలాగ మాట్లాడంలో అబ్బురమేమిటి? నేను అడుగకుండానే మీరు ఒక మాట ఇచ్చారు. అది నా మనస్సునకెంతో నచ్చింది. నేను వచ్చిన కార్యం మీ వలనే అవుతుంది" అని విశ్వామిత్రుడు తన వచ్చినపని ఏమిటో వెంటనే చెప్పసాగాడు.

7. రాముడు కావాలి!

"నేను నియమంతో ఒక యాగం చేస్తున్నాను. అది పూర్తి కానున్న సమయంలో మారీచుడు, సుబాహుడు అనే ఇద్దరు రాక్షసులు ఆ యాగాన్ని పాడుచేస్తున్నారు. వాళ్లు బలవంతులు. యుద్ధంలో నిపుణులు. నేనూ, తక్కిన ఋషులూ వాళ్ళకి శాపమిచ్చి మట్టుపెట్టగలం. కానీ మా నియమానికీ, తపస్సుకూ భంగం రాకుండా చూచుకోవలసివుంది. ఈ రాక్షసులవల్ల మాకు చాలా కష్టంగా వుంది. వారు రక్తమూ, మాంసమూ యజ్ఞవేదికపై చల్లి యజ్ఞానికి అడ్డుపడుతున్నారు. వీరులైన మీ కుమారులలో పెద్దవాడైన రాముణ్ణి నాతో పంపితే మా కష్టాలు గట్టెక్కగలవు. నా రక్షణలో అతని శౌర్యం పెరుగుతుంది. దివ్యబలం వస్తుంది. అత డీరక్కసులను మట్టుబెట్టి గొప్ప కీర్తి పొందుతాడు. ఇది నిశ్చయం. రాజకుమారుణ్ణి కొన్ని రోజులవరకూ నాకు అప్పజెప్పండి. నే నడిగినదాన్ని కాదనవద్దు. నే నడగడానికి మునుపే మీరు మాట ఇచ్చారుకదా. ఆ మాట నిలుపుకొండి. అతని క్షేమాన్ని గురించి ఏమీ సందేహించవద్దు. ఈ పని మీరు చేసే ములోకాలలో తరగని కీర్తి పొందుతాడు రాముడు. వసిష్ఠుడూ, మీ మంత్రులూ నేను చెప్పినదాన్ని కాదనరు" అన్నాడు విశ్వామిత్రుడు.

మహర్షి సభకు వచ్చినపుడు పరమానందభరితుడైన చక్రవర్తి ఈ మాటలు వినగానే చెప్పలేని భయంతో అవేదనతో, వణికిపోయాడు.

తను ఎంతో ప్రాణంతో చూసుకుంటున్న కన్నకొడుకులను ఈ రాక్షసులకు బలి ఇవ్వవలసి వచ్చిందికదా అని దుఃఖించాడు. విశ్వామిత్రుని కోరికను నిరాకరిస్తే అతని కోపానికి గురి కావలసి వస్తుంది. అందుకని ఏమి చేయడానికీ తోచక నిశ్చేష్టుడయ్యాడు. కొంతసేపటికి ఎలాగో తేరుకొన్నాడు.

"రాముడికి పదహారు సంవత్సరాలైనా నిండలేదు. అలాంటి పసివాడు రాక్షసులతో యుద్ధం చేయగలడా? అతడినే పంపమంటున్నారే? దానివల్ల కలిగే ఫలిత మేమిటి? యుద్ధ మర్మాలేవీ వాడికి తెలియవే! రాక్షసులు చేసేది మాయాయుద్ధం. అట్టి రాక్షసుల నెదిరించడానికి పసిబాలుణ్ణి పంపడమా? ఇది న్యాయమా? నేనున్నాను. నా చతురంగబలాలూ ఉన్నాయి, సేనతో నన్ను రమ్మనక పసిబిడ నడుగుతున్నా రేమిటి? రాక్షసు లెక్కడ? ఈ బాలు డెక్కడ? వారిని ఇతడెలాగ ఎదిరించగలడు? మీ యజ్ఞాన్ని ఎలా రక్షించగలడు? మీ శత్రువుల మర్మాలన్నీ నాకు చెప్పండి. నా సైన్యంతో కూడా మీతో వచ్చి మీకు కావలసిందంతా చేస్తాను" అని దశరథుడు మాట మార్చడానికి అడిగాడు.

విశ్వామిత్రుడు మారీచుణ్ణి గురించీ. సుబాహుణ్ణి గురించీ. వారి ఏలికైన రావణుణ్ణి గురించీ సవిస్తరంగా చెప్పి రాముణ్ణి తనవెంట పంపవలసిందని బలవంతపెట్టాడు.

"తపస్సుచేసి వరంగా పొందిన నా రాముణ్ణి విడిచిపెడితే నా ప్రాణాలే పోతాయి. కావలసి ఉంటే నేను సైన్యంతో వస్తాను. మీరు చెప్పిందాన్ని చూస్తే ఈ కార్యం నాకే దుస్తరమని తోస్తూంది. అలాంటి పనికి నా కుమారుని పంపడమా? వీలుపడదు" అన్నాడు దశరథుడు.

అప్పుడు కలిగిన మతివిభ్రమంవల్ల దశరథుడు సందర్భశుద్ధి లేని రీతిగా మాటాడసాగాడు. అతడలా మాట్లాడడమూ, రాముణ్ణి పంపడానికి నిరాకరించడమూ చూసేసరికి విశ్వామిత్రుడి కోపం నేయి పోసిన మంటలాగ భగ్గుమంది.

"మొదట ఆపిగిందంతా ఇస్తానని ధారాళంగా చెప్పారు. ఇప్పుడు ఆడినమాట తప్పుతున్నారు. ఇది ఇక్ష్వాకుల వంశ మర్యాదకు తగదు. నువ్వు పుట్టి ఈ గొప్పవంశానికే ఎగ్గు చేస్తున్నావు. ఇదే నిశ్చయమైతే వచ్చిందారినే తిరిగిపోతాను. ఆడితప్పినవాడవు. బంధు మిత్రులతో సుఖంగా ఉండు" అని విశ్వామిత్రు డన్నాడు. ఆ మహర్షి కోపానికి భూమి కంపించింది. దేవతలు భయపడ్డారు. అప్పుడు వసిష్ఠుడు రాజును చూచి మెల్లగా ఇలా చెప్పాడు:

"ధర్మమే రూపుదాల్చిం దన్నట్లు ఇక్ష్వాకువంశలో జన్మించి కీర్తి గడించిన మీరు ఆడినమాట తప్పరాదు. "చేస్తాను" అని ఒక సారి మీ నోటివెంట మాట వచ్చింతర్వాత ఆ మాటను నిలబెట్టుకోక పోవడం తగదు. ఆడితప్పినందువల్ల మీ దాన ధర్మ యజ్ఞ ఫలాలన్నీ నశిస్తాయి. మహర్షి వెంట రాముణ్ణి పంపండి. యుద్ధాన్ని గురించి మీరేమీ చింతించవద్దు. ఈ మహర్షి రక్షణలో ఉంటే మీ కుమారులను రాక్షసులు కన్నెత్తయినా చూడలేరు. అగ్ని చక్రం అమృతాన్ని రక్షించేట్టుగా వీరు రాముణ్ణి రక్షిస్తారు. వీరి మహిమ మీకు తెలియదు. తపస్సునే శరీరంగా బడసినవారు వీరు. వీరులలో వీరులు. జ్ఞానానికీ తపస్సుకూ పరమావధి వీరు. వీరికి తెలియని అస్త్రాలు లేవు. అస్త్రవిద్యలో వీరితోసమానులు ముల్లోకాలలోను లేరు, ఉండరు. వీరు రాజుగా ఉన్నప్పుడు అస్త్ర విద్యలన్నిటినీ వరంగా పొందారు. జరిగిన దానినీ, జరుగుతున్న దానినీ, జరుగనున్న దానినీ చూడగల శక్తిగలవారు. ఇలాటి మహాతేజస్సుగల విశ్వామిత్ర మహర్షి వెంట మీ కుమారుడైన రాముణ్ణి పంపడానికి సందేహ మెందుకు ? తమ కార్యాన్ని తామే చక్కబెట్టుకోగల శక్తిమంతు డీమహర్షి. మీ కుమారునికి మేలుచేయడంకోసమే ఆయనిక్కడికి వచ్చి మిమ్మ్ము అడుగుతున్నారు. జంకుగొంకులేకుండా మీ అబ్బాయిని వారి కోరిక మేరకు వారి వెంట పంపండి" అని మహాజ్ఞాని అయిన వసిష్ఠుడు చెప్పిన మాటలు విన్నాక రాజు మనసు కుదుట పడింది. రామలక్ష్మణులను ఇద్దర్నీ పంపించాలని దశరథుడు నిశ్చయించాడు.

రామలక్ష్మణులు వచ్చి ఎదుట నిలిచారు. మంగళ మంత్రం చెప్పింతర్వాత రాజు, తల్లులు, వసిష్ఠుడు వారి శిరస్సు మూర్కొని మహర్షి వెంట వెళ్ళండని చెప్పి సాగనంపారు.

ఆ సమయాన గాలి హాయిగా వీచించి. ఆకాశంనుంచి పూల వాన కురిసింది. అశరీరవాణి పలికింది. చేతి విల్లమ్ములతో ఇద్దరు వీరులూ మహరి వెంట గంభీరంగా బయలుదేరారు.

తన తపోబలంతో ఒక కొత్త ప్రపంచాన్నే సృష్టించగల శక్తి మంతుడు, గురువు. రాక్షస సంహారంకోసం అవతరించినవారు, శిష్యులు. ఇలాంటి గురుశిష్యులలోని సొంపును వాల్మీకిమహర్షి గంభీరంగా ఎనిమిది శ్లోకాలలో వర్ణించారు. నడుమున విజయఖడ్గం వ్రేలాడగా, శిలాతలంవలె విశాలమైన భుజంపై ఒక పక్క విల్లు, ఒక పక్క అమ్ములపొది. వాటి మధ్య కొంచెం ఎత్తుగా గంభీరంగా నిలిచిన శిరస్సు, ఇలాగ మూడు తలల కోడెనాగు పడగవిప్పి పోతున్నట్టు రాజకుమారులు ఆయనకు దర్శనమిచ్చారు.

కంబరుకవి తన ప్రత్యేకశైలిలో ఇలా పాడుతున్నారు:

చ. జగముల గాచు రాముడు ని
శాత కృపాణము సవ్య పార్శ్వమం
దు గడక దల్చి గొప్ప మల
దోయిని పోలిన యున్నతంపు దో
ర్యుగమున సత్య ధర్మముల
యెప్పు వహించి కొరంతకాని యా
ఋగ యుత తూణముల్ చెరివి
సూటిగ దాల్చి జయిష్ణు చాపమున్.
తన్ను బోలిన తమ్ముడు దాను జనకు
తీపి ప్రాణముల్ వెలిబైలుదేరు కరణి
నియతు గాధేయు వెన్నంటు నీడవోలె
గాంచనమయ దుర్గంబుల గడచి చనియె

8. తాటక

నాటి రాత్రి మహర్షి, రాజకుమారులు సరయూనది ఒడ్డునే పరుండి నిద్రిపోయారు. పడుకోటానికి ముందు వారికి విశ్వామిత్రుడు "బల" 'అతిబల' అనే రెండు మంత్రాలు ఉపదేశించాడు. ఈ మంత్రాలు జపించినవాళ్ళకి ఎలాటి ఆపదా రాదని చెప్పి ఆయన రాజకుమారులను ఆశీర్వదించాడు.

మరునాడు పొద్దున్నే లేచి బయలుదేరి అంగదేశములోని కామాశ్రమానికి చేరుకొన్నారు. అక్కడి ఋషులకు రామ లక్ష్మణులను పరిచయంచేసి కామాశ్రమ కథను వారికి చెప్పాడు.

"ఇది శంకర భగవానుడు చిరకాలం తపస్సుచేసిన చోటు. మతిలేని మన్మథుడు ఇక్కడే శంకరుడిమీద పూలబాణాలు వేసి ఆయన మూడోకంటి మంటకు కాలి బూడిదయ్యాడు. అందువల ఈ స్థలానికి కామాశ్రమం అని పేరు కలిగింది."

ఆ రాత్రి కామాశ్రమంలో ఋషులిచ్చిన ఆతిథ్యాన్ని మహర్షి, రాజకుమారులూ స్వీకరించారు.

ఉదయమే నిత్యకృత్యాలు తీర్చుకొని బయలుదేరారు. గంగా తీరంలో అక్కడి ఋషులు ఏర్పాటుచేసిన పడవ ఎక్కి నదిని దాటారు.

ఏటి మధ్యకి పడవ చేరుకోగానే వారి కొక గొప్పధ్వని వినవచ్చింది. అదేమిటని రాజకుమారులు మహర్షిని ప్రశ్నించారు. అది సరయూనది గంగలో కలియడంవల్ల వచ్చిన ధ్వని అని ఆయన చెప్పాడు. అక్కడ రాకుమారులు ఆ రెండు పుణ్యనదులనూ ధ్యానించి నమస్కరించారు. దేవుణ్ణి ధ్యానించడానికి నదులూ, కొండలూ, వృక్షాలూ, మేఘాలూ ఉపకరిస్తాయి. అయినా తరతరాలుగా భక్తిని చూరగొన్న నదులూ, దేవతామూర్తులూ, దేవాలయ తటాకాలూ మన హృదయాలను ముక్తిమార్గానికి సులభంగా తీసుకుపోతాయి.

వాళ్ళు గంగనుదాటి, నడక సాగించారు. ఆ దారి ఒక భయంకరమైన అడవిలోకి పోయింది. అక్కడ చెట్లూ, పొదలూ అతిదట్టంగా అలుముకుని ఉన్నందువల్ల దూరి వెళ్ళడానికక్కడా చాలకష్టంగా ఉంది. క్రూరమృగాలు భయంకరంగా అరుస్తున్నాయి.

ఆ అడవిని గురించి మహర్షి రామలక్ష్మణుల కిలా వివరించి చెప్పాడు. "ఇదే తాటకవనం. ఇప్పుడు అతిభయంకరంగా ఉన్న ఈ చోట్లో పూర్వం సిరిసంపదలు తొణికిసలాడేవి. ఒకప్పుడు ఇంద్రుడు వృత్రాసురుణ్ని చంపి బ్రహ్మహత్యా పాతకం పొందాడు. అందువల్ల చాల చింతించాడు. దేవరాజైన ఇంద్రుడి పాపం పోగొట్టడానికి దేవతలంతా చాలా శ్రమపడ్డారు. పుణ్యతీర్థాలనుంచి పెద్ద పెద్ద పాత్రలతో తీర్థంతెచ్చి మంత్రాలతో అతనికి స్నానం చేయించారు. ఆ మంత్రజలాలవల్ల అతని మాలిన్యం తొలగింది. ఆ మాలిన్యం భూమికి సోకగానే దాన్ని భూమి తన శక్తివల్ల జీర్ణించుకోగా, అది సత్తువగా మారింది. అందువల్ల ఆ ప్రదేశం మిక్కిలి సారవంతమై సస్య శ్యామలమైంది.

నాగా కుళ్ళి పురుగులుపట్టిన ఏ వస్తువైనా సరే. కంపుకొట్టే శవమైనా సరే, భూమిలో పూడిపోయినట్లయితే మట్టిలో కలిసి పనికి వస్తుందికదా. అదే గరిక, చెట్లు, పండ్లు, దుంపలు వీటికి అమృతం లాంటి ఆహారంగా మారుతుంది. ఇదే భూదేవి అనుగ్రహ శక్తి.

చాల కాలంవరకు ఇక్కడ జనులు సుఖంగా ఉన్నారు. తర్వాత సుందుడనే యక్షుని భార్య తాటకీ, ఆమె కుమారుడు మారీచుడూ ఈ దేశాన్ని నాశనంచేసి కారడవిగా మార్చివేశారు. వారింకా ఈ అడవిలోనే ఉంటున్నారు. భద్రంతే! (భద్రంతే అంటే నీకు శుభమగుగాక అని అరం. ఈ మాట రామాయణంలో మాటిమాటికీ వస్తుంది. ఇది ఒక ఆశీర్వచనం. భయాన్నో దుఃఖాన్నో కలిగించే సంగతులు చెప్పినప్పుడు ప్రేమతో ఈ విధమైన రక్షణ వచనం చేర్చి చెప్పటం వాడుక.)

ఆ తాటక భయంవల్ల ఇక్కడికి ఎవ్వరూరారు. ఆమెకు వేయి యేనుగుల బలం ఉంది. ఆమెవల్ల కలిగే బాధలనుంచి తప్పించ

డానికి మిమ్మల్ని తీసుకువచ్చాను. ఋషులను బాధిస్తున్న ఈ రక్కసికి నీ చేతిలో ఉంది చావు, సందేహం లేదు'' అన్నాడు విశ్వామిత్రుడు.

విశ్వామిత్రుని పలుకులు విన్న రాముడు "స్వామీ! తాటక యక్షస్త్రీ అని చెప్పారు కదా. యక్షుల కంతటి దేహబలం ఉంటుం దని నేను వినలేదే! యక్షులకు, రాక్షసులకు ఉన్నంత శరీరబలం ఉండ దని ఇంతవరకు అనుకున్నాను. అందులో ఆడదానికి ఇంతబలం ఎలా వచ్చింది?''

''సబబైన ప్రశ్నే అడిగావు నాయనా! బ్రహ్మ ఇచ్చిన వరమే దీనికి కారణం. సుకేతుడనే ఒక యక్షుడుండేవాడు. అతనికి సంతతి లేక తపస్సు చేశాడు. బ్రహ్మదేవుడు అతని సత్ప్రవర్తనకూ, తపస్సుకూ మెచ్చి 'అందకతె అయిన ఒక ఆడుశిశువు నీకు కలుగుతుంది' అని వర మిచ్చాడు.ఆమెకు వేయి ఏనుగుల బలం ఉంటుందనీ, 'నీకు మగ సంతానయోగం లేద'ని కూడా చెప్పాడు.

అలాగే అతనికి ఒక కూతురు పుట్టింది. ఆమెయే తాటక. రూపవతి అయిన ఆమెను సుందుడనే యక్షుడికిచ్చి వివాహం చేశాడు. వాళ్ళిద్దరికి మారీచుడు పుట్టాడు.

ఒకప్పుడు అగస్త్య మహాముునికి కోపం తెప్పించి ఆయన శాపంవల్ల సుందుడు మరణించాడు. సుందుడి భార్య తాటక, కుమారుడు మారీచుడూ కోపంతో అగస్త్యుని ఎదిరించారు. దేహబలంతో తనను ఎదిరించటానికి వచ్చిన వాళ్ళని చూచి అగస్త్య మహర్షి శపించాడు. దాని ఫలితంగా వారు నరమాంసం తినే రాక్షసులైపోయారు. తాటక అందమంతాపోయి ఘోరమైన రాక్షసరూపం వచ్చింది.

నాటినుంచీ తాటకా, మారీచుడూ అగస్త్యుడి ఆశ్రమ ప్రాంతంలో వుండి, ప్రజలను అనేక బాధలు పెడుతున్నారు. స్త్రీని చంపటం క్షత్రియ ధర్మానికి విరుద్ధమని నీవు జంకవద్దు. ఈమె చేసే అకృత్యాలను సహింప వీల్లేదు. ఆమె మహా క్రూర రక్కసి. ఆలాంటి వారు మగవారైనా, ఆడువారైనా వారిని దండించడం రాజధర్మం. అందరి క్షేమం కోసం అడవి మృగాలను చంపేలాగా రాక్షసిని చంపటం

కూడా న్యాయమే. రాజ్యభారం వహించేవారి కర్తవ్యమే ఇది. అధర్మం చేసిన మనుష్య స్త్రీలకూడా ఇలాంటి మరణ దండనే తగినది. కనుక నీవు జంకవలసిన పనిలేదు'' అని విశ్వామిత్రుడు అన్నాడు.

అప్పుడు రాముడిలా అన్నాడు: "పరాయి దేశాల్లో కూడా స్త్రీలను దండించవలసి వస్తే వారికి మరణదండన విధించరాదన్న ప్రాచీన సంప్రదాయం ఉంది. కాగా సామాన్య విధులన్నింటికీ విశేష విధులు ఉండి తీర్తాయి. లేనట్లయితే సంఘానికి క్షేమం ఉండదు'' అని.

"గురుదేవా! తాము చెప్పినట్లు మేము నడుచుకోవాలని సభలో మా తండ్రిగారు ఆజ్ఞాపించారు. తమమాట ప్రకారం ప్రజా క్షేమం కోసం ఈ తాటకను సంహరిస్తాను'' అని చెప్పి కోదండాన్ని వంచి అల్లెతాడు ఎక్కించి భుజందాకా లాగి బాణం వదిలాడు. ఆ ధ్వని అడవంతటా వ్యాపించి అష్టదిక్కులూ ప్రతిధ్వనించింది. అడవిలో ప్రాణులన్నీ భయపడ్డాయి.

తాటక ఈ ధ్వని విని ఎవరికింత ధైర్యం వచ్చిందని ఆశ్చర్యపడింది. శబ్దం వచ్చిన తావును తెలిసికొని పట్టలేని కోపంతో రాముడి మీదికి ఉరికింది. మొదట ఆమె చేతులూ, కాళ్లూ నరికివేసి వికారంగా చేస్తే చాలునని రాము డనుకున్నాడు. కాని తాటక ఆగడం మితి మీరింది. ఆమె అటూ ఇటూ తిరిగి రాళ్ళవాన కురిపించింది. రామ లక్ష్మణులిద్దరూ బాణాలతో ఆ రాళ్లవానను అడ్డగించారు.

ఇలాగ యుద్ధం చాలా సేపు సాగింది. "ఇక లాభం లేదు. దీని మీద దయ చూపరాదు. సూర్యాస్తమయమైంది. చీకటి పడిం తర్వాత రాక్షసులకు బలం ఎక్కువవుతుంది. ఇక ఆలస్యం చేయ తగదు'' అని మహర్షి రామలక్ష్మణులను హెచ్చరించాడు.

ఇక రాక్షసిని చంపడమే మంచిదని రాముడు ఒక సంహారాస్త్రాన్ని ప్రయోగించాడు. అది రాక్షసి రొమ్ము చీల్చుకు పోయింది. అది పర్వతంలాగా భూమ్మీదపడి ప్రాణాలు వదిలింది.

అప్పుడు దేవతలు కోలాహలం చేశారు. మహర్షి పట్టలేని సంతోషంతో రామచంద్రుణ్ని కౌగలించుకున్నాడు.

తాటక మరణించిన వెంటనే ఆ అడవంతా శాపం తొలగినట్లు మిక్కిలి రమణీయంగా ప్రకాశించింది. విశ్వామిత్రుడూ రాజకుమారులూ ఆ రాత్రి అక్కడే గడిపారు. వేకువజామునే లేచి నిత్యకృత్యాలు ముగించుకొని అక్కడ్నించి విశ్వామిత్రుడి ఆశ్రమం చేరుకున్నారు.

9. యాగసంరక్షణం

సూర్యోదయం కాగానే మహర్షి, రామచంద్రుణ్ణి తనపక్కన కూర్చోబెట్టుకొని, "నాయనా! నీకు శుభం కలుగుతుంది. నా మనస్సు నిండింది. నీవు చేసినపనికి నేను చేయగల ప్రత్యుపకారం ఏముంది? ఇప్పుడు నీకు అస్త్రోపదేశం చేయాలని ఉంది. నేర్చుకో" అని చెప్పి రాముడికి తన తపస్సుచేత సంపాదించిన దివ్యాస్త్రాలన్నీ ఉపదేశించాడు.

ఆ అస్త్రాలు ప్రయోగించడానికీ ఉపసంహరించడానికీ కావలసిన మంత్రాలన్నీకూడా ఉపదేశించాడు. ఆ అస్త్రదేవతలంతా రాముడికి కనబడి "నీ ఆజ్ఞకు లోబడి నువ్వు చెప్పింది చేస్తాం" అని చెప్పి మాయమయ్యారు. రామచంద్రుడాఅస్త్రాలన్నిటినీ తన తమ్ముడు లక్ష్మణుడికూడా ఉపదేశించాడు.

అస్త్రమంత్రాలను రాముడు చక్కగా గ్రహించాడో లేడో అని పరీక్షచేసి విశ్వామిత్రుడు తృప్తి చెందాడు. "ఈ అస్త్రాలతో నీవు యుద్ధంలో దేవతలూ, రాక్షసులూ, గంధర్వులూ, నాగులూ—వీళ్లందర్నీ గెలవగలవు" అని ఆశీర్వదించాడు.

కొంతదూరం నడిచి వెళ్ళింతర్వాత "అదిగో అలా చూడండి—ఆ మహా పర్వతమూ, రమణీయమైన ఆ వనమూ కనిపిస్తున్నాయి కదా. అక్కడికే! మనం పోవలసింది" అని మహర్షి చెప్పాడు.

"మీ యాగాన్ని పాడుచేస్తున్న దుర్మార్గులెవరు? వాళ్ళని మట్టుపెట్టడానికి మేం ఏంచేయాలి? వివరంగా చెప్పండి" అని రాముడు మహర్షిని అడిగాడు.

రామచంద్రుడి చేతులు ఆవేశంలో వణికాయి. యుద్ధంచేసి గెలిచి మహర్షి ఆశీర్వాదం పొందాలని అతడు ఉర్విళ్ళూరాడు.

"నాయనా ! మనం అక్కడికే పోతున్నాం. అదే ఆదినారాయణుడు పూర్వం తపస్సు చేసిన ప్రదేశం. మహావిష్ణువు వామనుడై అవతరించిన స్థలం కూడా అదే. ఆ స్థలానికి సిద్ధాశ్రమం అని పేరు" అని మహర్షి చెప్పాడు.

"ప్రహ్లాదుడి మనుమడూ, విరోచనుడి కుమారుడూ అయిన మహాబలి గొప్ప కీర్తితో రాజ్యంచేస్తూ ఉండేవాడు. అతని ఐశ్వర్యం చూసి దేవతలు భయపడ్డారు. ఇంద్రుడి సామ్రాజ్యాన్నంతా మహాబలి ఆక్రమించుకున్నాడు.

ఆ సమయంలోనే ఇంద్రుడితండ్రి కశ్యపమహర్షీ, తల్లి అదితీ మహావిష్ణువునుగూర్చి తపస్సు చేశారు. "లోకనాథా ! మా కడుపున ఇంద్రుడికి తమ్ముడివై పుట్టి ఇంద్రుణ్ణీ, దేవతలనూ మహాబలి బాధనుంచి రక్షించు" అని విష్ణువును ప్రార్థించారు. మహావిష్ణువు వామనావతార మెత్తాలని సంకల్పించి అదితి కుమారుడై పుట్టి పెరిగాడు.

మహాబలిచేసిన యాగానికి సుందరుడు, మరుగుజ్జుఅయిన బ్రహ్మచారిగా వామనుడు వెళ్ళాడు. అసురగురువూ, మహాబలికి ఆచార్యుడూ అయిన శుక్రుడు వామనుడి సంకల్పాన్ని పసికట్టి "ఈ వటువు యాచించినదాన్ని ఇవ్వొద్దు, జాగర్త" అని బలిని హెచ్చరించాడు.

"మహావిష్ణువే నా దగ్గరకు వచ్చి 'దేహి' అని చెయ్యిచాపటం కన్న నాకు కావలసిందేముంది?" అని మహాబలి గురువుతో అన్నాడు.

"నా అడుగులతో కొలిచిన మూడడుగుల మేర నాకు కావాలి" అని ఆ పొట్టివాడు కోరగా "ఇచ్చాను" అని బలిచక్రవర్తి దానధార విడిచాడు.

వామనుడు వెంటనే త్రివిక్రముడుగా వర్ధిల్లాడు. భూలోకాన్నంతటినీ ఒక అడుగుతోనూ, ఆకాశాన్ని రెండవ అగుడుతోనూ ఆక్రమించుకొన్నాడు. మూడవ అడుగుగా శ్రీమన్నారాయణుడు

తన పాదారవిందాన్ని బలిచక్రవర్తి తలమీదనే మోపి అతనికి అభయమిచ్చాడు. దీన్నిబట్టి "భక్తుని శిరస్సు లోకమంత విశాలమైనది" అన్న విషయం స్పష్టమవుతూంది. నాటినుంచి ఏడుగురు చిరంజీవులలో మహాబలి ఒకడయ్యాడు."

విశ్వామిత్రుడు రాముడికి ఈ పుణ్యకథను చెప్పి "పూర్వం నారాయణుడు తపస్సు చేసిందీ, తర్వాత కశ్యపుడు దేవతలను కాపాడడం కోసం తపస్సు చేసిందీ, వామనుణ్ణి పొందిందీ అయిన ఈ స్థలం సిద్ధాశ్రమం అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది. నేనుకూడ నా ఆశ్రమాన్ని ఈ పుణ్యస్థలంలో నెలకొల్పుకొని ఇక్కడే ఉంటాను. నా యాగాన్ని పాడుచేయడంకోసం రాక్షసులు ఈ తపోవనానికి వచ్చి బాధలు పెడతారు. ఇప్పుడు నీ రాకవల్ల వారికి అవసానకాలం సమీపించింది" అన్నాడు.

"అలాగే స్వామీ!" అన్నాడు రాముడు.

రాజకుమారులను వెంటబెట్టుకొని వచ్చిన విశ్వామిత్రుణ్ణి చూసి అక్కడి ఋషులు సంతోషించారు. వాళ్లు ఒకరొకరే వచ్చి మహర్షికి నమస్కరించి స్వాగతవచనాలు పలికారు. శాస్త్ర మర్యాద ననుసరించి రాజకుమారులకు అతిథిపూజ చేశారు.

'నేడే తమరు తమరు యాగదీక్ష స్వీకరించవచ్చు' అనిరామచంద్రుడు మహర్షికి విన్నవించాడు. విశ్వామిత్రుడు ఆ రాత్రే యాగదీక్ష పూనాడు.

మరునాడు ఉదయమే రాజకుమారులు లేచి యజ్ఞశాలలో ఉన్న మహర్షికి నమస్కరించారు. "రాక్షసులు ఎప్పుడు వస్తారో, మనం ఏమరిపాటుగా ఉండరాదుగదా? వాళ్లు ఎప్పుడు వస్తూవుంటారో మాకు చెప్పండి" అని కోరారు.

ఈ మాటలు విని అక్కడి ఋషులు చాలా సంతోషించారు. "విశ్వామిత్ర మహర్షి మౌనవ్రతంలో ఉన్నారు. కనుక ఆయన మీతో ఇంక మాట్లాడరు. ఆరురోజులపాటు రాత్రీ పగలూ అనక రెప్పవాల్చకుండా మీరు యాగాన్ని కాపాడాలి" అని వాళ్లు చెప్పారు.

రాజకుమారులు విల్లు పట్టుకొని ఆరురోజులు యాగాన్ని రక్షించారు. ఆరవనాటి ఉదయం రాముడు "తమ్ముడూ! ఇప్పుడు మనం అతి మెలకువగా ఉండాలి. ఇదే రాక్షసులు వచ్చే సమయం" అని లక్ష్మణుడితో చెప్పాడు.

రాముడిలాఅన్న క్షణాన్నే హోమగుండంనుంచి అగ్ని జ్వాలలు పైకెగశాయి. రాక్షసులు వచ్చి ఆకాశాన నిలిచిన సంగతి అగ్నికి ముందుగానే తెలిసింది. యాగం సక్రమంగా జరుగుతూ ఉండగా ఇంతలో ఆకాశాన ఒక గర్జన వినిపించింది. రాముడు పైకి చూశాడు.

మారీచుడూ, సుబాహువూ వాళ్ల పరివారంతోసహా వచ్చి, రక్తమాంసాలను పైనుంచి విరజిమ్మి యాగాన్ని పాడుచేయడానికి సిద్ధంగా ఉన్నారు. రాముడు ఇది చూశాడు. ఆకాశమంతా కారుమబ్బు కమ్మినట్లు రాక్షసులు నిలబడి ఉన్నారు. వెంటనే రాముడు మానవాస్త్రాన్ని సంధించి "లక్ష్మణా చూడు!" అని దాన్ని విసిచాడు.

ఆ అస్త్రం మారీచుడ్ని దూసుకుని వాణ్ని నూరు యోజనాలు అవతల సముద్రం ఒడ్డున పడవేసింది.

తరవాత రాముడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. దాని ధాకకు సుబాహువు ప్రాణాలు విడిచాడు. రాక్షస సమూహాన్ని రాజకుమారులు నిశ్శేషంగా సంహరించివేశారు.

ఆకాశం మళ్లీ తెరిపి యిచ్చింది.

యాగం చెరచడానికి వచ్చిన రాక్షసులు ఈ విధంగా చచ్చారు. మునుల కార్యం నిర్విఘ్నంగా ముగిసింది. విశ్వామిత్రుడు చాలా సంతోషించాడు.

"దశరథచక్రవర్తికి ధన్యవాదాలు అర్పిస్తున్నాను. అతని ఆజ్ఞానుసారం మీరు కార్యాన్ని జరిపించారు. మీ పరాక్రమం సాటి లేనిది. ఈ ఆశ్రమం మళ్లా మాకు సిద్ధాశ్రమమైంది" అని చెప్పి రాజకుమారులను విశ్వామిత్రుడు ఆశీర్వదించాడు.

ఆ రాత్రి రాజకుమారులు సిద్ధాశ్రమంలో నిద్రించి వేదతీర్చుకున్నారు.

మర్నాడు ఉదయం రామలక్ష్మణులు నిత్యకృత్యాలు తీర్చుకుని మహర్షి దగ్గరచేరి నమస్కరించి "ఏమి ఆజ్ఞ!" అని అడిగారు.

మహర్షికి అవతార రహస్యం పూర్తిగా తెలుసు. తాను ఉపదేశంచి ప్రసాదించిన అస్త్రాల సామర్థ్యం కూడా ఆయనకు తెలుసు. అయినా తాను సంకల్పించిన పని నెరవేరింది కనుక ఆయన తన సంతోషాన్ని వెల్లడించారు.

ఆ సంతోషంతో ఆయన ముఖం యాగాగ్నిలాగా ప్రకాశించింది. ఇంక రామచంద్రుడి విషయంలో తాను చేయవలసిన పనిని గురించి మహర్షి ఆలోచించాడు. అదే సీతా కల్యాణం.

* * *

అక్కడి మునులూ, విశ్వామిత్రుడూ రాముడితో ఇలా చెప్పారు:

"మేము మిథిలా నగరానికి పోవాలనుకుంటున్నాం. రాజశ్రేష్ఠుడైన జనకుడు ఒక యాగం చేస్తున్నాడు. మీరుకూడా మాతో వస్తే మంచిది. జనకునివద్ద ఒక అద్భుతమైన ధనుస్సు ఉంది. దాన్ని మీలాంటి మహారాజకుమారులు దర్శించడం ఉచితం."

రామలక్ష్మణులు వాళ్ల వెంట వెళ్లడానికి నిశ్చయించి విశ్వామిత్రునితో మిథిలా నగరానికి బయలుదేరారు.

10. నాగేటిచాలులోబాల

విదేహ దేశాన్ని జనకమహారాజు ఏలుతున్నాడు. ఈయన దశరథచక్రవర్తికి చిరకాల మిత్రుడు. దశరథుడు పుత్రులకోసం యాగం చేసినప్పుడు ఇతర రాజులలాగా ఈయన వద్దకు దూతలను పంపలేదు. తన మంత్రులను ఈయన వద్దకు పంపి తన ప్రత్యేకాహ్వానాన్ని తెలియజేశాడు. జనకుడు ఒక రాజర్షి; శూరుడు; సకలశాస్త్రాలనూ లెస్సగా నేర్చినవాడు; వేదవేదాంగవేత్త; నిష్ఠాగరిష్ఠుడు; బ్రహ్మజ్ఞాని. కర్మ

ద్వారానే సిద్ధిపొందవచ్చని శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పినప్పుడు జనకుణ్ణి ఉదాహరణగా చెప్పాడు. దేవిఅవతారమైన సీత ఆయన కూతురు.

ఒకప్పుడు జనక మహారాజు యాగం చేయాలని సంకల్పించి యజ్ఞభూమిని దున్నడానికి నాగలి పట్టాడు. మిట్టపల్లాలుగల నేలను దున్ని చదునుచేస్తూ ఉండగా మట్టిలో దివ్యరూపంగల ఒక పసిపాప ఆయనకు కనిపించింది. జనకుడికి పిలలు లేరు. మట్టిలో పొరుతూ ఒళంతా మట్టికొట్టుకొనిఉన్న ఆ శిశువు, భూదేవి తనకిచ్చిన వర ప్రసాదమని భావించి పరమానందభరితుడయ్యాడు. ఆ బిడ్డ నెత్తుకొని భార్యవద్దకు వెళ్ళి "ఇదిగో మనకు గొప్ప నిధి దొరికింది. యాగ భూమిలో దొరికింది. చూడు, ఈ బిడ్డ ఇంక మనదే" అని ఆ బిడ్డను పట్టమహిషి చేతికి ఇచ్చాడు. ఆమె ఆ బిడ్డను కన్న బిడ్డలాగా పెంచింది. ఈ సందర్భంలో కంబరుకవి పాడిన అందమైన పద్యాన్నిఇక్కడ చెప్పవలసి ఉంది.

భూదేవి శక్తిని మనం సూటిగా చూడలేంకదా! దున్నిన నాగేటి చాలులో భూదేవి తన అపార సౌందర్యాన్ని పచ్చని పైర రూపంలో చూపిస్తుంది. ఉదయభానుడి కిరణాల్లాగ మెరుస్తూ మొలక లెత్తే పైరులతో తేజరిల్లుతుంది. భూదేవిలో మర్లుగున్న దేవీ సౌందర్య మంతా మనకుకనబడదు. భూదేవి అందమే సీతగా రూపొంది జనకుడికి నాగేటిచాలులో దొరికింది. సముద్రమథన సమయంలో అమృ తంతోపాటు పుట్టిన లక్ష్మీదేవికూడా సీతాదేవి అందానికి ఆశ్చర్య పోయిందని కంబరుకవి గానం చేస్తున్నాడు.

సీ॥ ఇనుము బోలిన దీర్ఘ శృంగముల్ బలితంపు
టల్లులుగల కోడె లమరబూన్చి
బంగారు మడకకు వజ్రంపు కట్టున
రత్నాల నొగయును రంజిలంగ
స్ఫటికంపు గాడి యొప్పగగూర్చి జన్నంబు
నకు సమపఱపంగ నొక పొలంబు

మును దున్నగా గట్టుమొననుండి బాల భా
స్కరుబోలు కాంతులు గలగి భూమి

తే॥ దేవి వెల్వడినట్లొప్పి తేజరిల్లి
పాలకడలిలో సుధతోడ దేలినట్టి
సిరియు దీనయ్యె యొదుగు మేల్చెలువు గలుగు
కలుకులకు రాణిగా సీత గానిపించె.

పద్యంలో శబ్దాలు తక్కువా, భావం ఎక్కువాను. ఇదే కంబరుకవి పద్యాలలోని ప్రత్యేకత.

దైవమిచ్చిన బిడ్డ సీతను జనకుడూ, ఆయన భార్యా ఎంతో గారాబంగా పెంచారు.

ఆమెకు పెళ్లి ఈడువచ్చింది. కనక, ఆమెను విడిచి ఉండవలసి వస్తుందికదా అని జనకుడు ఎంతో విచారించాడు. దేవుడిచ్చిన బిడ్డ అయిన ఈమెకు తగిన వరుడెవరా? అని ఆలోచించాడు. ఎవరూ కనిపించక చాలాకాలం విసిగిపోయాడు. రాజులెందరో వచ్చి పిల్లనిమ్మని అడిగారు. కాని వాళ్లలో ఎవరూకూడా సీతకు తగినవాళ్లుగా జనకుడికి కనిపించలేదు. ఇలాఉండగా ఒకనాడు జనకుడికి ఒక ఆలోచన తట్టింది. ఒకప్పుడు తాను యాగంచేయగా వరుణదేవుడు ఆ యాగానికి మెచ్చి శివధనుస్సునూ, రెండు అమ్ములపొదులనూ ఇచ్చాడు. అది పురాతనమైన శివధనుస్సు. సామాన్యులు దానిని కదిలించలేరు. మరి, అలాంటిదాన్ని ఎత్తి, వంచి అల్లెతాడు కూర్చడమంటే సామాన్యమా? అది ఎవరివల్లా జరిగేపని కాదు. ఆ విషయాన్ని జనకుడు రాజులందరికీ తెలియపరచాడు.

"వరుణదేవుడు ప్రసాదించిన ఈ శివధనుస్సును ఏ రాజకుమారుడు వంచి అల్లెతాడు బిగిస్తాడో అతనికి నా కుమార్తె సీత నిస్తాను. ఇదే నా కుమార్తె స్వయంవర నియమం" అని.

సీత అందాన్ని గురించి విన్న ఎందరో రాజకుమారులూ ఆ ధనుస్సును ఎత్తడానికి ప్రయత్నించి చేతకాక తిరిగిపోయారు.

11. సగరుడు

వసిష్ఠునులంతా ఎడ్ల బండ్లెక్కి విశ్వామిత్రుడి వెంట ఉత్తర దిశగా మిథిలానగరానికి బయలుదేరారు. ఆశ్రమంలోని పక్షులూ, జింకలూ 'మాకేమి ఆజ్ఞ' అన్నట్లుచూచాయి. విశ్వామిత్రుడు వాటిని ప్రేమతో చూచి అక్కడనే ఉండిపొమ్మని ఆనతిచ్చాడు.

వాళ్లు శోణానదీతీరం చేరేసరికి సాయంకాల మైంది. వాళ్లా రాత్రి అక్కడ విశ్రమించారు. రాజకుమారులకు మహర్షి ఆ స్థలపురాణాలను చెబుతూండగా రాత్రి ఆనందంగా గడిచిపోయింది. మర్నాడు ఉదయమే లేచి వారు నదిని దాటారు. అట్టే లోతు లేనందువల్ల నడిచే వెళ్లారు. మధ్యాహ్నమయేసరికి గంగాతీరం చేరుకొన్నారు. అందరూ గంగలో స్నానంచేసి దేవతలకు, ఋషులకు, పితరులకు తర్పణాలు విడిచారు. అక్కడే వంటచేసుకొని పూజలు గావించి భోంచేశారు. భోజనాలయ్యాక అంతా విశ్వామిత్రుడి చుట్టూ చేరారు. అప్పుడు రాజకుమారులు "మహర్షీ! మాకు గంగా వృత్తాంతం వివరించాలి" అని అడిగారు. విశ్వామిత్రుడిలాచెప్పాడు:

"పర్వత రాజైన హిమవంతుడి భార్య మనోరమకు అపూర్వ లక్షణాలుగల ఇద్దరు కుమార్తెలు కలిగారు. పెద్దకూతురు గంగాదేవి. దేవతల ప్రార్థన మన్నించి హిమవంతుడామెను దేవలోకానికి పంపించాడు. రెండవ కూతురు ఉమ. శంకరుణ్ణి పతిగాకోరి గొప్ప తపస్సు చేసింది. పరమశివుడు మెచ్చి ఆమెను పత్నిగా స్వీకరించాడు. హిమవంతుడి కూతుళ్లిద్దరూ ఇలాగ గొప్ప స్థితిని పొందారు. పాపాలను కడిగివేయగల గంగాదేవి దేవలోకంలోనే ఉంటూ వచ్చింది.

అయోధ్య రాజయిన సగరుడికి చిరకాలం సంతానం లేదు. ఆందుకని కేశిని, సుమతి అనే తన ఇద్దరు భార్యలనూ తోడ్కొని హిమవత్పర్వతం చేరి తపస్సు చేశాడు.

భృగుమహర్షి అతని తపస్సుకు మెచ్చి "సంతానవంతుడ వగుదువు గాక!" అని వరమిచ్చాడు.

"వీరుడా! మహిమగల సంతానాన్ని పొందగలవు. అపార కీర్తిని కూడా గడిస్తావు. నీ పత్నులలో ఒకతె ఒక కుమారుని కంటుంది. అతనివల్ల నీ వంశం వృద్ధి పొందుతుంది. మరొక పత్ని బలశాలులైన ఆరువేలమంది పుత్రులను కంటుంది" అని భృగు మహర్షి రాజును ఆశీర్వదించాడు.

రాజపత్నులు మహర్షికి నమస్కరించి "స్వామీ! మాలో ఒక్క పుత్రుడు కలిగేది ఎవరికి? ఎవరికి పలువురు పుత్రులు కలుగుతారు?" అని అడిగారు.

"ఒకరికి కలిగిన ఏకపుత్రునివల్లనే వంశం వర్ధిల్లుతుంది. రెండవయామె కన్నకుమారులు బలశాలులై పెరిగి గొప్ప కీర్తిని ఆర్జిస్తారు. మీలో ఎవరికి ఏది ఇష్టం?" అని మహర్షి వాళ్లనే ఎదురు ప్రశ్న వేశాడు.

మానవుల కోరికలు పలురకాలు. కేశిని వంశవర్ధనుడైన ఒక్క కుమారుడు తనకు చాలునన్నది. సుమతి బలవంతులూ, కీర్తిమంతులూ అయిన పలువురు కుమారులను కోరింది. "తథాస్తు" అన్నాడు మహర్షి. వరమిచ్చిన మహర్షికి రాజు తన భార్యలతో సహా ప్రదక్షిణ నమస్కారాలుచేసి సంతృప్తితో నగరానికి తిరిగి వెళ్లాడు.

కొంతకాలం గడిచింది. కేశిని అసమంజసుడనే కుమారుణ్ణి కన్నది. సుమతి రూపురేఖలులేని ఒక పిండాన్ని ప్రసవించింది. ఆ పిండం పగిలి మహర్షి చెప్పినట్లు దానినుంచి అరువైవేలమంది శిశువులు పుట్టారు. ఆ శిశువులను దాదులు చక్కగా పెంచారు.

కాలక్రమాన వారికి యౌవనం వచ్చింది. వాళ్లు అందగాళ్లనీ, శౌర్యవంతులనీ పేరుపొందారు. పెద్దభార్య కుమారుడు అసమంజసుడు పెరుగుతున్న కొద్దీ వాడిలో క్రూరగుణాలు అంకురించసాగాయి. ఊరివాళ్ల పిల్లలను అమాంతంగా తీసుకుపోయి, ఏటిలోనూ, మడుగులలోనూ పారవేసి, వాళ్లు విలవిల తన్నుకొని చావడం చూచి పకపక నవ్వేవాడు.

ఇలా పిచ్చిచేష్టలుచేసే అసమంజసుణ్ణి జనులు ద్వేషించేవారు.

రాజాజ్ఞ ప్రకారం అసమంజసుణ్ణి దేశంనుంచి తరిమివేశారు. కాగా అసమంజసుడి కుమారుడు అంశుమంతుడనే వాడున్నాడు. వాడు గుణవంతుడు. అందరి ప్రేమనూ మన్ననలనూ చూరగొన్నాడు. అతడు శీలవంతుడై జ్ఞానవంతుడై పెరిగి పెద్ద వాడయ్యాడు.

* * *

సగరుడు ఒక అశ్వమేధయాగాన్ని చేయ సంకల్పించాడు. దానికి కావలసిన ఏర్పాట్లన్నీ అయ్యాయి. యాగాశ్వాన్ని రాజ కుమారుడైన అంశుమంతుడు రక్షిస్తున్నాడు. అప్పుడు ఇంద్రుడు రాక్షసవేషం ధరించి ఆ గుర్రాన్ని ఎత్తుకు చక్కాపోయాడు.

ఇలా అశ్వమేధ యాగానికి విఘ్నం కల్పించడం దేవతలకు పరిపాటి. ఈ యాగంవల్ల ఇంద్రపదవికి పోటీవస్తుందని ఇంద్రుడి భయం. కాగా అడ్డాలు తొలగి యాగం జరిగినప్పుడుమాత్రం యజ్ఞంలో ఇచ్చే హవిస్సులను దేవతలు తీసుకుపోవలసి ఉంటుంది. అప్పుడు యాగం చేసినవాళకీ యజ ఫలం సిదిస్తుంది.

గుర్రం కనబడలేదని తెలియగానే రాజు చాలా చింతించాడు. ఎలాగైనాసరే గుర్రాన్ని వెతికి తేవాలని సుమతి పుత్రులైన అరువై వేలమంది రాజకుమారులనూ నియమించాడు. భూమండలమంతా గాలించి రమ్మని ఆజ్ఞాపించాడు.

"యాగాశ్వం కనిపించక పోవడంవల్ల యజ్ఞం పాడవడమే కాదు, యాగానికి సంబంధించిన వాళ్లందరికీ పాపం చుట్టుకుంటుంది. కనుక మీరు వెళ్ళి గుర్రాన్ని దొంగిలించినవాడు దాన్ని ఎక్కడ దాచాడో కనిపెట్టి ఆ గుర్రాన్ని తీసుకురావాలి" అని సగరుడు శౌర్య వీర్య గుణసంపన్నులైన తన కుమారులను ఆజ్ఞాపించాడు.

సగరపుత్రులు మహా ఉత్సాహంతో లోకమంతా చుట్టి అట్టహాసం చేశారు. కాని గుర్రమెక్కడా కనబడందే!

కనిపించిన చోటల్లా తవ్వి చూశారు. అందర్నీ హడలెత్తించారు. కనిపించిన వాళ్లనల్లా పట్టుకొని "నీవే గుర్రాన్ని దొంగిలించా-

వ"ని నేరం మోపి బెదరించాడు. కాని ఎంత వెతికినా గుర్రం జాడ కానరాలేదు. ఆ మాట రాజుకు చెప్పగా ఆయన దుఃఖించి "మీరు భూమిని చీల్చి పాతాళ లోకానికిపోయి వెతకండి!" అని మళ్ళీ ఆజ్ఞాపించాడు.

తండ్రి ఆనతి ప్రకారం సగరపుత్రులు భూమిని తవ్వి, పాతాళ లోకం ప్రవేశించారు. అక్కడ భూమిని మోస్తున్న ఏనుగులకు నమస్కరించి యాగాశ్వాన్ని వెతుకుతూ ముందుకు సాగారు. అలా పోగా పోగా ఆఖరికి ఈశాన్య దిక్కున ఒక చోట వాళ్ళ గుర్రం కనబడింది.

అక్కడ కపిలుడు యోగ సమాధిలో ఉన్నాడు. పక్కన యాగాశ్వం గడ్డిమేస్తూంది. అది చూచి సగర పుత్రులు "ఇదుగోనర్రా దొంగ! మన గుర్రాన్ని దొంగిలించిన దొంగ వీడే. మునిలాగా వేషం వేసుకొని ఏమీ తెలియనట్లు కూర్చున్నాడు" అని కోపావేశంతో కపిలుడి మీదికి ఉరికారు.

యోగ సమాధిలో ఉన్న కపిలుడు కళ్లుతెరచి "హూం" అని హుంకరించాడు. ఆ హుంకారానికి రాజపుత్రులు అరువై వేలమందీ భగ్గున మండి, బూడిదై పోయారు. ఇంద్రుడు గుర్రాన్ని తీసుకు వచ్చి పాతాళ లోకంలో దాచాడు. ఆ సంగతి తెలియని సగర పుత్రులు ఈ విధంగా శాపం పొంది నాశనమయ్యారు.

12. భగీరథుడు

యాగాశ్వాన్ని వెతుకుతూ పోయిన కొడుకులు తిరిగి రాలేదే అని రాజు చింతించాడు. కొన్నిరోజులు ఎదురుచూసి, తర్వాత మనుమడైన అంశుమంతుణ్ణి పిలిచి "పాతాళానికి వెళ్ళిన నీ చిన్నాయనలు ఏమయ్యారో తెలియడంలేదు. నీవు వీరుడవు కదా! ఆయుధపాణివై చూచిరా. నీకు విజయం కలుగుగాక!" అని ఆశీర్వదించి అంశుమంతుణ్ణి పంపించాడు.

అంశుమంతుడు తన పినతండ్రులు భూమిని తవ్వుతూపోయిన దారివెంబే వెళ్లాడు. దిగ్గజాలు కనపడగానే వాటికి నమస్కరించి

పూజించి తను వచ్చినపని విన్నవించుకొన్నాడు. "నీవు కార్యసిద్ధి పొందగలవ"ని ఆ ఏనుగులు రాజకుమారుణ్ణి ఆశీర్వదించి ధైర్యం చెప్పి సాగనంపాయి. అంశుమంతుడు ఆలశ్యంచేయక ఉత్సాహంతో ముందుకు సాగాడు.

పాతాళలోకమంతా కలయదిరిగాడు. ఒకచోట పెద్ద బూడిద గుట్ట, దాని పక్కనే యాగాశ్వమూ కనిపించాయి. అది చూచి అంశుమంతుడు నివ్వెరపోయాడు.

సగరమహారాజు భార్య ఐన సుమతికి సోదరుడు గరుత్మంతుడు. ఆయన తలవనితలంపుగా అక్కడికి వచ్చాడు. ఆయన అంశుమంతుణ్ణి చూచి "ఆశ్చర్యమెందుకు నాయనా! ఈ బూడిదగుట్ట నీ పినతండ్రులైన సగరపుత్రుల తాలూకుదే. కపిలదేవుడి శాపంవల్ల ఇలా భస్మమయ్యారు. నాయనా! ముందు నువ్వు గుర్రాన్ని తీసుకుపోయి యజ్ఞం పూర్తిచేయించు. శాపంపొందిన ఈ రాజకుమారులు సద్గతి పొందాలంటే దేవలోకంనుంచి గంగను దింపి ఈ భస్మాన్ని గంగాజలాల్లో కలపాలి. అని గరుత్మంతుడు అంశుమంతుడికి తెలియజేశాడు.

అంశుమంతుడు గుర్రాన్ని తీసుకుని వాయువేగంతో వెళ్లిపోయాడు. విషయమంతా తాతకు విన్నవించాడు.

తన కుమారులకు పట్టిన గతి విని రాజు చాలా దుఃఖించాడు. గుర్రం తిరిగి వచ్చిందికనుక యాగం సక్రమంగా పూర్తిచేశాడు. తర్వాత తన కుమారుల ఉత్తరగతులను గురించీ, గంగను గురించీ ఆలోచించాడు. ఆలోచించి ఆలోచించి ఏంచేయాలో తోచక ఆఖరికి ఆ దుఃఖంతోనే ప్రాణాలు విడిచాడు.

ముప్పయివేల సంవత్సరాలు రాజ్యపాలన చేసి౦తర్వాత సగరుడు మరణించాడని రామాయణంలో ఉంది. రామాయణంలో ముప్పయివేలూ, అరువైవేలూ అన్న పెద్దసంఖ్యలు చూచి మనం ఆశ్చర్యపడనక్కరలేదు. ఏమీ అంటే-ముప్పది "వర్షసహస్రము" అనగా అనేక సంవత్సరాలు అనికాని లేదా ముప్పయి సంవత్సరాలే అనికాని భావించవచ్చు. "సహస్ర" అన్నమాటను "వర్షము" అన్న

మాటను మంగళ వాచకాలుగా మనం భావించవచ్చు. "షష్టిసహస్ర ప్రజ" లంటే ఆరువై మంది ప్రజలు మాత్రమే అనికూడా మనం అనుకోవచ్చు. నమ్మకమున్నట్లయితే ఆ నమ్మకాన్ని అలాగే ఉంచుకోనూవచ్చు.

సగరుడి తర్వాత అంశుమంతుడు, అంశుమంతుడి అనంతరం దిలీపుడు, దిలీపుడివెనక భగీరథుడు అయోధ్యను పరిపాలించారు. అంశుమంతుడూ, దిలీపుడూ తమ పితరుల సద్గతికి ఏమీచేయలేక పోయామే అని చాలా చింతించారు. ఎంతకీర్తి, ఎంతసంపదఉన్నా ఈ కొరతవల్ల వాళ్లు దుఃఖిస్తూనే కాలంచేశారు.

దిలీపుడి తర్వాత అతడి కుమారుడు భగీరథుడు అయోధ్యకు రాజయ్యాడుకదా ! అతడు మహాధీరుడు. భగీరథునికి పుత్రసంతానం లేదు. ఆ లోపం తీర్చుకొనడానికి గంగను భూమిమీదికి తేవడానికి తపస్సు చేయాలని సంకల్పించి రాజ్యాన్ని మంత్రులకు అప్పజెప్పి గోకర్ణమనే ప్రదేశానికి వెళ్లాడు. నాలుగు పక్కలా చితులురగిల్చి, పైన ఎర్రని ఎండ కాయగా నెలకొకతడవే ఆహారం తీసుకొంటూ ఎన్నో సంవత్సరాలు ఉగ్ర తపస్సు చేశాడు. భగీరథుడి పేరు పట్టుదలకు పర్యాయపదమై పోయింది.

బ్రహ్మదేవుడు భగీరథుడి తపస్సుకు మెచ్చి దర్శనమిచ్చి "ఏం కావా"లని అడిగాడు. భగీరథుడు తన రెండు కోరికలనూ తెలిపాడు. "నామీద తమకు దయవుంటే నా వంశం అంతరించకుండా పుత్ర భాగ్యం కలిగించాలి. నా తాతలు శాపకారణంగా భస్మమై, పాతాళలోకంలో పడిఉన్నారు. ఆ భస్మాన్ని గంగాజలంలో కలిపి వారికి తర్పణం విడిచి పుణ్యలోకాలు కలిగేటట్లు చేయాలి. అందు కోసం గంగను భూమికి దింపి మా వంశానికి పట్టిన ఈ దుఃఖాన్ని నివారించాలి. ఇదే నేను కోరే వరం" అని భగీరథుడు బ్రహ్మను మిక్కిలి వినయంతో ప్రార్థించాడు.

"నీ తపస్సు దేవతలకు ప్రీతి కలిగించింది. నీ అభీష్టాలు నెరవేరతాయి. భయపడకు. అయితే ఒక మాట. హిమవంతుడి పెద్ద కూతురైన గంగ భూమికి దిగినట్లయితే ఆ వేగాన్ని ఈ భూమి భరించ

లేదుగదా ? దాన్ని భరింపగలిగినవాడు ఉమాపతి ఒక్కడే. అందుకని ఉమాపతిని తపస్సుచేత మెప్పించి ప్రసన్నుణ్ని చేసుకో !" అని చెప్పి బ్రహ్మ తన వెంటనున్న దేవతాగణంతో కూడా మాయమయ్యాడు.

భగీరథుడు మళ్లా అన్నపానాలు మాని ఘోర తపస్సుచేసి శివుడి అనుగ్రహం పొందాడు. పరమశివుడు ప్రత్యక్షమై "నీ కోరిక నెరవేరుస్తాను. పర్వతరాజ పుత్రి అయిన గంగ కిందికి దిగేటప్పుడు నా శిరస్సున ఆమెను భరిస్తాను. ఆమె నీకు ప్రసన్నురాలగు గాక !" అని చెప్పాడు.

పరమేశ్వరుడు భగీరథుడికి ఈ వరం ఇవ్వడంతోనే బ్రహ్మ దేవుడు చెప్పినట్లు గంగాదేవి కిందికి దిగింది. తన ప్రచండ వేగంతో ఆకాశంనుండి కింద మహాదేవుని శిరస్సుపై పడింది. తన అపార వేగంతో శంకరుణ్ని కూడ పడతోసి తిన్నగా పాతాళం చేరాలని ఆమె తలంపు. కాని ఆమె గర్వమణచాలని త్రినేత్రుడనుకొన్నాడు. అతని తలమీదికి దిగిన పవిత్ర ప్రవాహం ఉమాపతి తలచినంతలోనే అతని జడలలో చిక్కుకు పోయింది.

గంగ ఎంతో ప్రయత్నించింది. కాని హిమవత్పుత్రత స్వరూపుడైన మహాదేవుని జడల గుహనుండి బయటికి రాలేక పోయింది. ఆమె అలాగే ఆశ్చర్యంతో నిలిచిపోయింది.

తపస్సుచేసి గంగను ప్రసన్నను చేసుకొన్న భగీరథుడు "అయ్యో ! ఇదేమిటి ? జలప్రవాహమంతా ఏమైపోయింది ? " అనుకొని తిరిగి మహాదేవుని గురించి తపస్సు చేశాడు.

మహాదేవుడు అతణ్ని కనికరించి గంగను మెల్లగా బిందు సరస్సులో విడిచాడు. అక్కడనుంచి గంగ ఏడుపాయలై మిక్కిలి అడకువతో బయలుదేరింది. అందులో మూడుపాయలు తూర్పు దిక్కుగాను, మూడు పడమటి దిక్కుగాను వెళ్ళాయి.ఏడవది భగీరథుడి వెనుక వెళ్లింది. భగీరథుడు పరమానందభరితుడయ్యాడు. తరతరాలుగా కాచుకొని ఉన్న తన పితృదేవతలకు సద్గతి కలిగిందికదా అని అతని మనస్సు ఉప్పొంగిపోయింది. విజయరథం ఎక్కి అతడు

ముందుగా సాగాడు. అతని వెనుక ఎగురుతూ దుముకుతూ గంగా ప్రవాహం బయలుదేరింది. నీటితో పలువిధాలైన జల జంతువులు, పక్షులు ఆటలాడుతూ వెళ్లగా గంగాదేవి మెరుపు మెరిసినట్లు కని పించింది. ఆ సుందర దృశ్యాన్ని చూడానికి గంధర్వులు ఆకాశాన గుమిగూడారు. కొన్నిచోట్ల మెల్లగా, కొన్నిచోట్ల వేగంగా, కొన్ని చోట వెనుంచి కిందికి దూకుతూ. మరి కొన్నిచోట కిందినుంచి పైకి ఎగిరి గంగానది మనోహర భంగిమలతో నృత్యం చేస్తూ భగీరథుడి వెంట వెళ్లింది. ఆకాశాన దేవ గంధర్వగణాలుకూడా ఆ నది వెంటనే సాగిపోయారు.

ఇలా వెళ్లుతూ ఆ పుణ్యానది ఒకచోట జహ్ను మహర్షి యజ్ఞ వేదికను కలియబెట్టి ముంచివేసింది. యజ్ఞవేదికను తప్పుకొని పోవ డానికి మారు ఇలా చేసినందుకు మహర్షి ఆ నదిని అట్టే చేత ఎత్తి ఆచమనం చేసివేశాడు. గంగానది మహర్షి కడుపున ప్రవేశించి మాయమై పోయింది.

అప్పుడు భగీరథుడు అయ్యో అని మరల విలపించాడు. దేవ తలూ, ఋషులూ మహర్షికి నమస్కరించి గంగచేసిన అపరాధాన్ని మన్నించవలసిందనీ, భగీరథుడి తపస్సు సఫలమయేటట్లు చేయవల సిందనీ ప్రార్థించారు. మహర్షి కనికరించి గంగను తన కుడి చెవి నుంచి విడిచిపెట్టాడు.

"మహర్షి శరీరంనుంచి వెలువడినావు కనుక నీవు ఆయనకు కుమా రెవెనావు. ఇక మీదట నీకు జాహ్నవి అనికూడా పేరువస్తుంది." అని దేవతలు ఆనందంతో గంగను ఆశీర్వదించారు.

ఆ తర్వాత గంగ ఏ అడ్డమూ లేకుండా సముద్రాన్ని చేరింది. అక్కడినుంచి పాతాళం ప్రవేశించి సగరపుత్రులు భస్మమైన స్థలానికి చేరింది. భగీరథుడు తన పితరులకు జలతర్పణంచేసి వారికి ఉత్తమ గతులు కలిగించాడు.

భగీరథుడు తన మహాప్రయత్నంవల్ల భూలోకానికి తెచ్చిన పుణ్యనది కాబట్టే 'భాగీరథి' అని పేరు వచ్చింది.

నీ పూర్వీకులైన సగరపుత్రులు తవ్విన సాగరచరిత్రనూ, భగీరథుడి తపస్సువల్ల ఆకాశగంగ భూమికి దిగిన చరిత్రనూ విన్నావు. నీకు శుభమగుగాక! సాయంకాలమైంది. నీ పూర్వీకులు లోకానికి ప్రసాదించిన గంగలో దిగి సంధ్యావందన మాచరించుదాం, పద'' అని విశ్వామిత్రుడు రామచంద్రుడితో అన్నాడు.

గంగలో స్నానంచేసినా, లేక ఈ పుణ్యకథను భక్తితో చదివినా, చదవగా విన్నా వారి పాపాలు తొలగి, నిర్మలమైన మనస్సునూ, మంచి శీలాన్నీ. తలపెట్టిన పనులలో పట్టుదలనూ పొందుతారు.

13. అహల్య

విశాలా నగరంలో అంతా ఒకరోజు ఆగి మర్నాడు వేకువ జామున మిథిలకు బయలు దేరారు.

జనక మహారాజు పట్నం ఇక కొద్ది దూరం ఉందనగా వారికి కడురమణీయమైన ఒక ఆశ్రమం కానవచ్చింది. దాన్ని చూచి రాముడు "మునిపుంగవు లెవరూ ఇక్కడ కానరావడంలేదే! ఈ ఆశ్రమం ఎవరిది? ఇంత చక్కని ఆశ్రమం ఎందుకిలా నిర్జనంగా ఉంది?'' అని అడిగాడు.

దానికి మహర్షి ఇలా జవాబు చెప్పాడు: "ఇది నీవు అవశ్యం తెలిసికోవలసిన విషయం. ఈ ఆశ్రమం ఒక శాపానికి గురి అయింది. ఇది గౌతమ మహర్షి ఆశ్రమం. పూర్వం ఆయన ఇక్కడ ఉండేవారు. ఆయనా, ఆయన భార్య అహల్యా చిరకాలం ఇక్కడే ఉన్నారు. వారి తపస్సు నిర్విఘ్నంగా సాగింది.

ఒకనాడు ఇంద్రుడు ఆశ్రమంలో మహర్షి లేని సమయం చూసి తాను గౌతముని వేషంలో ఆశ్రమానికి వచ్చాడు. అహల్య అతిలోక సుందరి. ఆమె నెలాగైనా పొందాలనే తలంపుతో ఇంద్రుడు వచ్చాడు. ఇలా దొంగవేషంతో వచ్చిన ఇంద్రుడు అహల్యను చూసి "సుందరీ!

నాకు కామం మిక్కుటంగా ఉంది. ఈ స్థితిలో కాల నియమం పాటించడం తగదు. మనం ఏక శయ్య చేరుదాం" అని మహర్షి చెప్పినట్లే చెప్పాడు.

మునిపత్ని వెంటనే విషయం గ్రహించింది. ఇతడు తన భర్త కాడు, ఇంద్రుడు అన్న సంగతి ఆమెకు తెలిసిపోయింది. అయినా దేవరాజంతటివాడే తన్ను వలచి వచ్చాడు కదా అని తన సౌందర్యానికి గర్వపడింది. మనస్థైర్యాన్ని కోల్పోయింది. దేవరాజు కోరికకు లొంగిపోయింది.

తర్వాత "దేవేంద్రా! త్వరగా వెళ్లిపో! లేకుంటే అపాయం రాగలదు" అని హెచ్చరించింది. ఇంద్రుడు ఆమెకు కృతజ్ఞత తెలిపి వెంటనే బయలుదేరాడు.

"బయటకు వెళ్లిన మహర్షి స్నానం సంధ్యా ముగించుకొని ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. దేవతలూ, రాక్షసులూ కూడా భయపడే టంతటి తపోబలసంపన్నుడాయన. స్నానంచేసి ఉదికిన బట్టలను, నాడు హోమానికి కావలసిన దర్భలను, సమిధలను చేతగొని ముఖం అగ్నిభగవానునిలాగా తేజరిల్లుతూండగా ఆయన ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. అంతవరకు ధైర్యంగా ఉన్న ఇంద్రుడు ఆయనను చూడ్డంతోనే బెదిరిపోయాడు.మహర్షికి నమస్కరించి వేలముఖంతో ఆయన ఎదుట నిలబడాడు. "మూర్ఖుడా! నా వేషంలో ఆశ్రమానికి వచ్చి చేయరాని పని చేస్తావా? నీవు నపుంసకుడివయిపో!" అని మహర్షి కోపావేశంతో శపించాడు. ఆ క్షణమే ఇంద్రుడికి పురుషత్వం పోయింది. దేవతలు పరితపించారు.

మహర్షి అంతటితో ఊరుకోలేదు. తన భార్యకూడా ప్రాయశ్చిత్తం విధించాడు.

"అహల్యా! నీవిక్కడ ఆహారమైనాలేక వాయుభక్షణ చేస్తూ బూడిదవై ఎవరి కంటికీ కనబడక మరుగున పడిపోదువుగాక! చాలాకాలానికి దశరథుని కుమారుడు ఇక్కడికి వస్తాడు. ఆ వీరుడు ఈ ఆశ్రమాన కాలిడినప్పుడు నీపాపం తొలగిపోతుంది. నీవు అతనికి

అతిథిపూజ చేయి. అప్పుడు నీకు నీ పూర్వరూపమూ, సుగుణమూ కలుగుతాయి. అప్పుడు నాతో మునుపటిలాగే నివసించగలుగుతావు.''

గౌతము డిలా చెప్పి శీలం చెడిన భార్యను విడిచి హిమవత్పర్వతానికి వెళ్లిపోయాడు. ఆయన అక్కడ తపస్సు చేస్తున్నాడు.

పద! ఆశ్రమానికి పోదాం. దిక్కులేని అహల్యకు మహర్షి చెప్పినట్టు నీవు విమోచన కలిగించాలి'' అని విశ్వామిత్ర మహర్షి రాముడితో అన్నాడు.

అలాగే వారు ఆశ్రమానికి వెళ్లారు. రాముడి పాదం సోకగానే అహల్యాదేవికి పాపం తొలగిపోయింది. పోయిన కాంతి తిరిగి వచ్చింది. అలా కాంతితో ప్రకాశిస్తున్న అహల్యను రాముడు చూశాడు. ప్రపంచంలోని స్త్రీల అందాన్నంతటినీ రాసిపోసి బ్రహ్మ ఈ అహల్యను సృష్టించాడు. ఆకులలోను, తీగలలోను దాగి ఎవరికీ తెలియకుండా అనేక వేల సంవత్సరాలు వ్రతంచేసిన ఆమె ఈనాడు ఆశ్రమంలోకి వెళ్లగానే మంచుకప్పిన చంద్రుడిలాగా, పొగకమ్మిన అగ్నిజ్వాలలాగా, కదిలే నీటిలో సూర్యబింబంలాగ కనబడింది.

రామలక్ష్మణులు మునిపత్ని పాదములంటి నమస్కరించారు.

చిరకాలం వేచి ఉన్న అహల్య తనకు విమోచనకాలం వచ్చిందని సంతోషించి రాజకుమారులకు అర్ఘ్యపాద్యాలిచ్చి ఆదరించింది. రాముడామె ఆతిథ్యాన్ని అంగీకరించాడు. ఆకాశంనుంచి పూలవాన కురిసింది. ఘోరపాపం అంతరించగా ఆమె దేవకన్యలాగా ప్రకాశించింది. గౌతముడు సరిగా ఆ సమయానికే అక్కడికి విచ్చేశాడు.

* * *

ఇది వాల్మీకి రామాయణంలోని అహల్య కథ. మిగతా పురాణ కథలకూ దీనికీ కొంత వ్యత్యాసం కనిపిస్తుంది. అది చూచి కలతచెంద పనిలేదు.

రామాయణం, భారతం మొదలైన పురాణాలు చదివే ఈ కాలంవారికి ఇక్కడ నాలుగుమాటలు చెప్పాలి.

పురాణాలలో దేవతలు, రాక్షసులు మాటిమాటికీ వస్తారు. రాక్షసులనేవాళ్లు అధర్మానికి అణుమాత్రం జంకని దుష్టగణం. సర్వ సాధారణంగా వాళ్లు చెడ్డపనులే చేస్తూ ఉంటారు.

''కనికర మింతయేని మది
గల్గని రక్కసిమూక పాప వ
ర్తనమున గష్టపెట్టి చెడు
దారులుతీసి తపంబు పాడుగా
నొనరించి.....''

అని కంబరుకవి వివరించాడు. అసురులూ రాక్షసులవంటి వాళ్లే.

రాక్షసులలోనూ కొందరు బుద్ధిమంతులూ, మంచివాళ్ళూ ఉన్నారు. ఎంత మంచి కులంలోనైనా కొందరు చెడ్డవాళ్లుంటారుకదా. అలాగే ఎంత చెడ్డకులంలోనైనా ఒక్కొక్కప్పుడు కొందరు మంచివాళ్లుంటూనే ఉంటారు. అయితే కంబరుకవి చెప్పినట్లు రాక్షసులూ, అసురులూ చెడు పనులుచేసి సంతోషించగల గుంపు. వాళ్లే తమిళులనీ. వాళ్ల పూర్వులనీ ఈనాడు కొందరు అనుకోటం విచారకరమైన విషయం. ప్రాచీన తమిళ గ్రంధాలలోగాని, చరిత్రలోగాని, కావ్యాలలోగాని, జానపద గేయాలలోకాని ఎక్కడా ఇలా చెప్పినట్లు లేదు. "పురాణాలలో రాక్షసులుగా వర్ణింపబడినది మీరే" అని తమిళులకు కొత్త యోగ్యతాపత్రం ఇవ్వడానికి ప్రాచీన తమిళ గ్రంధాలలో ఎక్కడా ఆధారంలేదు. అందునుంచి భయంలేదు.

సాధారణంగా అధర్మానికి భయపడే జనసమూహాన్ని దేవతలని పిలిచేవారు. రాక్షసులను తొలగించడమే దేవతల పని. ఇందుకు పురాణాలలో చెప్పినట్లు కొన్ని సమయాలలో దేవతలు ధర్మవిరుద్ధమైన పద్ధతికి కూడా దిగటం కద్దు. రాక్షసులు తపస్సుచేసి సంపాదించిన వరాలే ఇందుకు కారణం. తపస్సుచేసి వరబలంపొంది లోకాన్ని బాధించే అసురులను ఎదిరించడం దేవతలకు చేతగాదు. అటువంటప్పుడు దేవతలు కూడా ఏదో ఒకదారి వెతికి అధర్మపద్ధతి నైనాసరే అనుసరించవలసి ఉంటుంది. కాగా, మొత్తంమీద దేవతలు మంచి స్వభావంగలవారు.

వాళ్ళలోకూడా చాలామంది చెడ్డపనులుచేసి దానివల్ల కష్టాలు అనుభవిస్తారు. అధర్మానికి ఫలితాన్ని దేవతలుకూడా అనుభవించాల్సిందే. దేవతలు కదా అని వాళ్లకి వేరేమార్గం లేదు. కర్మవిధులకు వాళ్లూ లోబడక తప్పదు.

దేవతలు సహజంగా సన్మార్గాన్ని అనుసరించే వాళ్ళయినందువల్ల వాళ్లలో ఎవరైనా తప్పుచేస్తే ఆ తప్పు చాలా గొప్ప తప్పుగా మన మనస్సుకు తోస్తుంది. అది సహజమే. తెల్లని బట్టకు అంటిన మరక కంటికి బాగా కనిపిస్తుంది కదూ. అలాగే ఈ తప్పులుకూడా స్పష్టంగా కనబడతాయి.

ఎప్పుడూ చెడ్డపనులే చేసే రాక్షసుల తప్పిదాలను చదివేటప్పుడు మనకు అవి అంత పెద్దవిగా కనిపించవు. నల్లని బట్టకంటిన మరకలాగానే అవికూడా మరుగుపడిపోతాయి.

యోగ్యులు సన్మార్గం తప్పితే అది మనకెంతో బాధకలిగిస్తుంది. ఎప్పుడూ చెడ్డఆలోచనలు చేసేవాళ్ళనీ, చెడుపనులు చేసేవాళ్ళనీ చూసి, అయ్యో పాపం అని విడిచి పెడతాం. కాని ధర్మసంకటంలో చిక్కుకొని ఏదైనా తప్పుచేసేవాళ్ళని మాత్రం కఠినముగ ఖండించి విమర్శించందే వదలం. కానీ ఇది న్యాయసమ్మతం కాదు.

పురాణ పురుషులే దేవతలను అప్పుడప్పుడు అవినీతికీ, పాపానికీ పాల్పడ చేస్తూ ఉంటారు. ఆ విషయాన్ని మనం చాలా విమర్శతో చూడాలి. అందులో ఉన్న గుణపాఠాలను నేర్చుకోవాలి. ఇంద్రుడు మొదలైన దేవతలుకూడ కొన్ని సమయాలలో మహా భయంకరమైన పాపాలు చేసినట్లు పురాణకర్త లెందుకు చెప్పారు? ధర్మ సంకటాలనూ, చిక్కులనూ తామే ఎందుకు కలగజేసుకుంటున్నారు? ఈ విషయాలను మనం సావధానంగా విమర్శించుకోవాలి. మానవులకు వినయం, వివేకం, భక్తి కలిగించడమే వీటి ఉద్దేశం. లేకపోతే మహర్షులు తమ అభిమతాలకు, ఆశయాలకు విరుద్ధంగా తామే మంచివారికి బాధలు కలిగించవలసిన అవసరం ఉండదు.

ఇలాంటి ధర్మసూక్ష్మాలను పట్టుకొని కొందరు మూర్ఖులు చెడు నిర్ణయాలు చేసి సంతోషిస్తూ ఉంటారు. "రావణుడు చాలా మంచి

వాడు. వాల్మీకి మహర్షి రావణుని పనులను గురించి లేనిపోనివి కల్పించి నిందించాడు. రాముడు ఒకప్పుడు అవినీతికి పాల్పడినాడు కదా? సీత ఒకప్పుడు అబద్ధమే ఆడిందిగదా?" అని ఇలాగ వితండ వాదం చేయడం మనం చూస్తూనే ఉన్నాం.

దేన్నెలా రాసినా వాల్మీకిని కాదనగలవారు లేరు. అటువంటిది ఆయన తన భావాలకే విరుద్ధంగా తన కథానాయకునికే తలవంపులు తెచ్చే ఉదంతాలను ఎందుకు రాయాలి? రాముడూ, రావణుడూ వాల్మీకి సృష్టించిన పాత్రలేకదా? రావణుడ్ని గురించి వేరే కథకాని చరిత్రకాని లేదా? లేదు. వాల్మీకికి పూర్వం ఒక పురాణంకానీ, చరిత్రకానీ లేదా ఒక శిలాశాసనం కాని ఎవరైనా రచించారా? అందులో ఈ విషయాలను వేరేవిధంగా పేర్కొన్నారా? లేదు. అలాంటిది ఏదైనా ఉండివున్న పక్షంలో వాల్మీకిమహర్షి రాముడి పట్లా, సీతపట్లా, దేవతలపట్లా పక్షపాతం చూపి, వాస్తవాలను దాచి మనల్ని మోసం చేశాడని వాదించడానికి అవకాశం ఉండేది.

వాల్మీకి గ్రంథంవల్లనే రామకథ లోకానికి వెల్లడి అయింది. మరొకనోట ఆ కథ మనకు రాలేదు. నాటి ధర్మసందేహాలను చూపిందికూడా ఈ గ్రంథమే. దోషాలుగా తోచే ఉదంతాలనుకూడా ఆ గ్రంథంలోనే చూస్తున్నాం. మనసులో కలత, అసూయ లేకుండా వీటన్నింటికీ కారణం ఏమిటని లోతుగా ఆలోచించి చూస్తే వాటి అన్నింటిలోను సామాన్యప్రజల జీవితంలోని చిక్కులూ, చిత్రాలూ మనకు కనిపిస్తాయి. మనం అనుసరించదగిన ఉపదేశాన్ని వాటినుంచి గ్రహిస్తాం. మనం నడుచుకోవలసిన సన్మార్గాన్ని గ్రహించి సత్ఫలితాలను పొందగలుగుతాం.

ఎంత గొప్ప పాపంచేసినా, పశ్చాత్తాపం చెంది, శిక్షను ఓర్చుకొని తపస్సు చేస్తే ముక్తి సాధించవచ్చు. అహల్యా ఉదంతంనుంచి మనం నేర్చుకోవలసిన గుణపాఠం ఇదే. పాపం చేసినవారు ఇతరులను నిందించక తమ మనస్సులోని దోషాన్ని తొలగించుకోడానికి ప్రయత్నించాలి. ఎంత పరిశుద్ధస్థితిలో ఉన్నా సదా జాగరతో ఉండడం చాలా అవసరం అని ఈ కథనుంచి మనం గుణపాఠం నేర్చుకోవచ్చు.

14. సీతా కల్యాణం

మిథిలానగరంలో జనకమహారాజు యజ్ఞానికి అన్ని ఏర్పాట్లూ అయ్యాయి. దేశదేశాల నుంచీ ఋషులూ, బ్రాహ్మణశ్రేష్ఠులూ వచ్చారు. విశ్వామిత్రుడికీ, రాజకుమారులకూ తగిన విడిది ఏర్పాటు చేశారు. జనకుడి పురోహితుడైన శతానందుడు విశ్వామిత్రమహర్షికి ఎదురువెళ్లి ఆదరించాడు. ఆ తర్వాత జనకుడే స్వయంగా ఎదురు వచ్చాడు.

"తమరు రావటం నా భాగ్యం" అన్నాడు జనకుడు.

"ఈ పిల్లలెవరు? వీళ్లని చూస్తే దేవలోకంనుంచి దిగినట్టు కనిపిస్తున్నారు. ఆయుధాలు ధరించిన తీరుచూడగా ఆరితేరిన వీరుల్లాగ కనిపిస్తున్నారు. వీళ్లిద్దరూ ఒకే అచ్చులో పోసినట్టున్నారు. వీళ్లని కన్న ఆ భాగ్యశాలి ఎవరు?" అని జనకుడు అడిగాడు.

వాళ్లు దశరథచక్రవర్తి కుమారులని విశ్వామిత్రమహర్షి చెప్పాడు. తన యజ్ఞాన్ని కాపాడి రాక్షసులను సంహరించిన విషయాన్ని జనకమహారాజుకు తెలియపరిచాడు.

వృత్తాంతమంతా చెప్పి "మీ దగ్గరవున్న శివధనుస్సును గురించి విన్నారు. తాము అనుమతిస్తే దాన్ని చూడాలని ఆశపడుతున్నారు" అని సంగ్రహంగా మహర్షి చెప్పగా విని జనకుడు అమితానందం పొందాడు.

"దానికేమిటి, తప్పకుండా చూడొచ్చు. ఆ ధనుస్సును వంచి ఎక్కుపెట్టగలిగితే నా కుమార్తెనుకూడా ఇచ్చి పెళ్లి చేస్తాను. ఎందరో రాజకుమారులు ఈ విల్లును చూచి దాన్ని కదిలించలేక వెళ్ళిపోయారు. దేవుడిచ్చిన నా సీతకు భర్తగా, దశరథకుమారుడే లభిస్తే, అంతకంటె నాకేం కావాలి" అన్నాడు. వెంటనే ధనుస్సును తెమ్మని తన సేవకులకు ఆజ్ఞాపించాడు.

పూజాపురస్కారాలతో భద్రంగా ఇనప్పెట్టెలో వుంచిన ఆ ధనుస్సును ఎనిమిది చక్రాలుగల బండిమీద ఎక్కించి వేలాది జనం దాన్ని ఉత్సవరథంలాగా తోసుకుంటూ వచ్చారు సభామంటపానికి.

* * *

"ఇదిగో - ఇదే నేనూ, నా పూర్వీకులూ పూజించిన శివధనుస్సు నా కూతురు సీతకోసం ఎందరో రాజకుమారులు దీన్ని వంచి అల్లెతాడు ఎక్కించటానికి ప్రయత్నించారు. కాని చేతగాక తిరిగి పోయారు" అన్నాడు జనకుడు.

సభలో జనకుడు ఇలా చెప్పగా "నాయనా, రామచంద్రా చూడవోయ్" అన్నాడు విశ్వామిత్రుడు.

గురువు ఆజ్ఞతో రాముడు ఇనప్పెట్టె తెరిచాడు. ధనుస్సు చూశాడు. అప్పుడు వినయంగా "అల్లితాడు బిగించమంటారా?" అని అడిగాడు.

జనకుడూ, విశ్వామిత్రుడూ "మంగళమగుగాక!" అని దీవించారు.

సభలో వాళ్లంతా రెప్పవాల్చక చూస్తూనే వున్నారు.
రాముడు ఒక పూలమాలను ఎత్తినట్లు ఆ ధనస్సును ఎత్తాడు.

తే॥ కనక కంకణములు సంకు గాజు లొప్పి
పొంద నరుదైన రత్నంబుబోని సీత
మెడను వైవ నెత్తిన విరివడ మనంగ
నెత్తె రాముడు మేరువు నెనయు విల్లు.

ఎత్తి నిలబెట్టి, కాలి బొటనవేలితో నొక్కిపట్టి వంచి, అల్లితాడు ఎక్కించాడు. చెవిదాకా లాగాడు.

ఉ॥ తోరపు విఘ్నముల్ సలుపు
తొంగలి తెప్పల వాల్పకే సభా

స్తారులు చూచుచుండినను
సభ్యుల నొక్కడునేని చాపమున్
వారక కాలద్రొక్కుటయు
నారి తగుల్చుట గానరైరి చే
నారగ జూచి రంత విని
రారవ మా విలు తున్గి కూలుటల్.

అల్లితాడు లాగినప్పుడు ధనుస్సు వంగుతూ వచ్చింది. తటాలున పిడుగుపడినంత శబ్దమయింది. ధనుస్సు విరిగింది. దేవతలు పూలవాన కురిపించారు.

"నా ప్రాణంకన్నా ప్రియమైన సీతను రామునికి ఇచ్చివేశాను" అని జనకుడు ప్రకటించాడు.

"వాయువేగంతో పోగల దూతలను అయోధ్యకు పంపి దశరథ మహారాజును వెంటనే రప్పించండి" అని విశ్వామిత్రుడు జనకుడితో చెప్పాడు.

అలాగే దూతలు వెళ్లారు.

జనకమహారాజు పంపిన దూతలు, మూడురోజులు ప్రయాణం చేసి అయోధ్య చేరుకున్నారు. దేవేంద్రుడిలాగా నిండుకొలువులో వున్న దశరథచక్రవర్తితో వాళ్లిలా మనవి చేశారు: "మహారాజా! విశ్వామిత్ర మహర్షి. జనకమహారాజూ తమకు శుభ వర్తమానం పంపించారు. తమ కుమారుడు మిథిలకు వచ్చి సీతా స్వయంవరానికి నిర్ణయించిన శివధనుస్సు వంచి, అల్లితాడు ఎక్కించి ధనుస్సును విరిచారు. మీ రామచంద్రుడికి సీతనిచ్చి వివాహం చెయ్యటానికి తమ రాకకు జనకమహారాజుగారు ఎదురు చూస్తున్నారు. తాము సపరివారముగా వెంటనే మిథిలకు వచ్చి, మమ్ములందరినీ ఆనందింప జేయవలసిందని మా మనవి."

దశరథుడు ఈ సంతోషవార్త వినగానే ఆనందం పట్టలేక పోయాడు. మంత్రులతోచెప్పి అన్ని ఏర్పాట్లు చేయించి మర్నాడే సపరివారంగా మిథిలానగరానికి బయలుదేరాడు.

దశరథుడు సకల పరివారంతోనూ, రత్నాభరణాలతోనూ కోకొల్లలుగా కానుకలతోను మిథిలకు చేరుకున్నాడు. జనక మహారాజు దశరథుడికి ఎదురువెళ్లి ఆదర సత్కారాలు జరిపాడు. తర్వాత. "యాగం త్వరలో ముగుస్తుంది. ఆవెంటనే వివాహం జరపడం బాగుంటుంది. మీ ఉద్దేశం ఏమిటి ?" అని అడిగాడు. అందుకు దశరథుడు పమ్మతిస్తూ:

"మీరు కన్యాదాతలు, కాగల కార్యాలన్నింటికీ మీరే కర్తలు. మీరు చెప్పినట్లే అన్నీ జరగడం ఉచితం" అన్నాడు.

"ఇదిగో నా కుమార్తె సీత. కుమారా : నీవాచరించే ధర్మానికి ఈమెను తోడునీడగా చేబట్టి స్వీకరించు. నీకు శుభమవుతుంది. ఈమె గుణవంతురాలు, ఎన్నడూ నిన్ను ఎడబాయదు."

శ్లో॥ ఇయం సీతా మమ సుతా
సహధర్మ చరీ తవ।
ప్రతీచ్ఛ చైనాం భద్రంతే
పాణిం గృహ్ణీష్వ పాణినా ॥
పతివ్రతా మహాభాగా।
ఛాయే వానుగతా సదా ॥

ఉత్తరదేశంలో అన్ని వివాహాలలోను కన్యాదానం చేసేటప్పుడు ఈ సీతాకల్యాణ మంత్రాన్నే చెబుతారు.

ఇలాగజనకుడు సీతను రాముడికి అప్పజెప్పాడు. సీతాదేవి• రామచంద్రుడూ సాక్షాత్తు ఆ లక్ష్మీనారాయణులే. కనుక మళ్లా ఈ జన్మలోనూ ఒకటై మహదానందాన్ని పొందారు.

15. పరశురాముడు

దశరథుడు తనకు అప్పజెప్పిన రామలక్ష్మణులను విశ్వామిత్రుడు మళ్ళీ క్షేమంగా మిథిలలో అప్పగించాడు. శుభకార్యం ముగియగానే రాజులిద్దరివద్దా సెలవు తీసుకొని విశ్వామిత్రుడు హిమత్పర్వ

తానికి వెళ్లిపోయాడు. రామాయణంలో విశ్వామిత్రుడి పాత్ర ఇంతటితో ముగిసింది.

రామచరిత్ర అనే పెద్ద గోపురానికి విశ్వామిత్రుడు పునాది రాయివంటివాడు. ఇటుమీదట విశ్వామిత్రుడి ప్రస్తావనే రామాయణంలో రాదు. వాల్మీకి రామాయణంలో ప్రత్యేకించి గమనించవలసిన విశేషం ఒకటుంది. ఒక కాండలో అతిప్రధానముగా కనిపించే పాత్రలు చాలావరకు ఆ కాండతోనే మరుగుపడిపోతాయి. బాలకాండలో చూడండి- విశ్వామిత్రుడు మళ్లీ తిరిగి రానేరాడు. అయోధ్యాకాండలో వచ్చే కైకేయి మరెక్కడా ఘాటయినా లేకుండా మరుగైపోతుంది. గుహుడూ అంతే. భరతుడూ అంతే. చిత్రకూటం నుంచి తిరిగిపోయిన భరతుడు మళ్లా రాముడు అయోధ్యకు వచ్చేదాకా మనకు కనబడడు. రాముడి కష్టనిష్ఠూరాల సమయంలో భరతుణ్ణి మన ముందుకు తీసుకుని రావడమేలేదు కవి. సాధారణ నాటకాలలో పాత్రలు ఆఖరిదాకావుండి అప్పుడప్పుడు 'మేమూ ఉన్నాం' అంటూ తమ ఉనికి మనకు తెలియపరుస్తూ ఉంటాయి. వాల్మీకి ఇతిహాసంలో అలాక్కాదు. ఎక్కడిపాత్ర లక్కడే గప్‌చిప్. పాత్ర పోషణలో విశేషంగా కృషిచేసే మన నవలా రచయితలకు ఇదో ముఖ్యవిషయం.

* * *

వివాహం కాగానే దశరథచక్రవర్తి సపరివారంగా అయోధ్యకు బయలుదేరాడు.

దారిలో ఒకచోట కొన్ని అపశకునాలయ్యాయి. అవి చూసి దశరథుడు దిగులుతో వాటికి కారణం ఏమిటని వసిష్ఠుణ్ణి అడిగాడు.

"ఈ దుర్నిమిత్తాలు రావలసే వచ్చాయి. అయినా వాటివల్ల మనకు చెరుపు ఏమీలేదు. పక్షి శకునాలు చూడగా అశుభంగా కనిపిస్తున్నాయి. కాని నేలపై తిరిగే జంతువుల శకునాలు శుభాన్ని సూచిస్తున్నాయి. కనుక భయపడవలసిన పనిలేదు." అన్నాడు వసిష్ఠుడు.

ఇలాగ మహర్షి, రాజూ మాట్లాడుతూ ఉండగానే భయంకర మైన గాలి వీచింది. చెట్లు విరిగిపడ్డాయి. భూమి అదిరింది. దుమ్ము పైకిలేచి సూర్యుణ్ణి కప్పివేసింది. ఎనిమిది దిక్కులా చీకటికమ్మింది. అందరూ భయపడారు. తర్వాత తెలిసింది కారణం. క్షత్రియుల పాలిటి యముడై అవతరించిన పరశురాముడు వచ్చి వాళ్లముందు నిలబడ్డాడు!

భుజాన ధనుస్సు, గొడ్డలి, చేతికో మెరుపువరె మెరిసే బాణం ఒకటి ధరించి త్రిపురాసురుణ్ణి చంపి వాడి రక్తం తాగిన రుద్రుడి లాగా జడలతో, చూచినవారు జడుసుకునేలాగా ప్రత్యక్షమయ్యాడు. అతని ముఖంనుంచి కాలాగ్నివంటి ఓర్వశక్యంకాని తేజస్సు వెలువడుతూంది. తరతరాలుగా క్షత్రియులను హతమార్చిన జమదగ్ని కుమారుడు పరశురాముడు ఎక్కడికి వెళ్లినా భూకంపమూ, పెనుగాలీ ఆయనకు ముందుగా ఉంటాయి. అదిచూచి క్షత్రియగణమంతా గడగడ వణికిపోతుంది.

దశరథుని పరివారంలోని బ్రాహ్మలు తమలో తామిలా అనుకున్నారు: "జమదగ్ని కుమారుడైన ఈ పరశురాముడు తన తండ్రిని ఒక క్షత్రియుడు చంపాడన్న కోపంతో క్షత్రియ కులాన్నే హతమార్చడానికి ప్రతిజ్ఞ చేశాడు. ప్రతిజ్ఞను నిలబెట్టుకోడానికని వందలకొద్దీ రాజులను హతమార్చాడు. అంతటితో అతని కోపం చల్లారిందని అనుకున్నాం. ఇప్పుడు తిరిగి ఆయన ఘోరయుద్ధానికి దిగుతున్నా డేమిటి?" బ్రాహ్మలు గుసగుసలాడుకుంటూ భయపడుతూనే ఆయనకు అర్ఘ్యపాద్యాలిచ్చి సత్కరించారు.

వారి ఉపచారాల్ని స్వీకరించాక, పరశురాముడు రామచంద్రుణ్ణి చూచి ఇలా అన్నాడు:

"దశరథకుమారా! నీ శౌర్యాన్ని గురించి విన్నానులే. జనకుడి సభలో పరమశివుని ధనుస్సును నీవు వంచిన విషయమూ, అది విరిగిన విషయమూ కూడా విన్నాను. విని అది ఎలా జరిగిందా అని ఆశ్చర్యపడ్డాను. ఇప్పుడు నిన్ను చూడ్డానికే వచ్చాను. ఇదిగో, నా చేతిలోని ఈ ధనుస్సు నీవు విరిచిన విల్లుతో సమానమైంది.

నా తండ్రి జమదగ్ని సంపాదించిన విష్ణుధనుస్సు ఇది. దీనిని వంచి ఆల్లితాడు బిగించగలవా ? బాణంకూడా ఇస్తాను. ఆ పనిచేసి మన మిద్దరమూ యుద్ధం చేద్దాం రా !"

దశరథు డిదిచూచి చాలా దిగులు చెందాడు. క్రూరుడైన పరశురాముడి బారినుండి తన కుమారుణ్ని ఎలాగైనా రక్షించా లనుకొని దీనముగా పరశురాముణ్ని ప్రార్థేయపడ్డాడు.

"అయ్యా ! తమరు బ్రాహ్మలు, క్షత్రియజాతిపై తమకు కలిగిన కోపం ఇదివరకే చల్లారిపోయిందిగదా ? నా కుమారుడు పసి వాడు. అతడితోనా తమరు యుద్ధం చేయడం ? అభయం దయ చేయించండి. ఇక ఆయుధం ఎత్తనని దేవరాజుకు తమరు మాట ఇచ్చారు. కశ్యపుడికి భూమండలాధిపత్యం ఇచ్చి తమరు మహేంద్ర పర్వతంమీద తపస్సు చేయడానికి వెళ్ళారుకదా ? తమలాంటివారు ఆడినమాట తప్పవచ్చునా ? మా ప్రాణాలన్నీ రాముడిమీదే ఉన్నాయి. అతణ్ని తమరు చంపితే, మేమంతాకూడా ప్రాణాలు విడుస్తాం."

ఇలాగ దశరథు డెంతబతిమిలాడినా పరశురాముడు లెక్కచేయ లేదు. ఆయన దశరథుడివైపే చూడక రామాచంద్రుడితోనే మాట్లాడు తున్నాడు.

"పూర్వం విశ్వకర్మ రెండు గొప్ప ధనుస్సులను నిర్మించాడు. రెండూ సమానమైన మహత్తుగలవి. ఒకదానిని త్రిపురాసురుణ్ని చంపిన శివుడికి ఇచ్చాడు. రెండవ ధనుస్సును మహావిష్ణువుకు ఇచ్చాడు. ఆ విష్ణువు ధనుస్సే ఇది. నీవు వంచింది శివధనుస్సు. ఈ ధనస్సును నీవు వంచగలవా ? చూడు దీన్ని వంచగలిగితే నీ పస తెలుస్తుంది. అప్పుడు మనం ఇద్దరమూ యుద్ధం చేద్దాం."

తనకీడైన వాడెవడూ లేడని తలపోస్తున్న పరశురాముడు ఇలా గొంతెత్తి మాట్లాడడం విని రాముడు వినయంగా, మెల్లగా ఇలా అన్నాడు:

"జమదగ్ని కుమారా ! తండ్రిని చంపినవారిపై మీరు కసి తీర్చుకొన్నారు. బాగానే ఉంది. కాని నన్ను మాత్రం మీరు అణచ

లేరు. దయచేసి ఆ ధనుస్సు ఇలా ఇవ్వండి'' అని దశరథరాముడు పరశురాముడివద్దనుంచి విల్లూ, బాణమూ తీసుకున్నాడు. విల్లు వంచాడు. బాణం తొడిగి, ఎక్కు-పెట్టాడు.

"బ్రాహ్మణోత్తమా! ఇప్పుడేమిటి సెలవు? ఈ బాణం వ్యర్థం కాకూడదు'' అని చక్రవర్తి కుమారుడు చిరునవ్వుతో అడిగాడు.

ఇద్దరు రాములనూ చూడ్డానికి దేవతలూ, గంధర్వులూ, యక్షులు మొదలైన దేవగణాలు ఆకాశాన గుమిగూడారు.

దశరథరాముడు విల్లు వంచగానే పరుశురాముడి తేజస్సు అంతా పోయింది. అతని అవతారశక్తి ఆ క్షణంలోనే మటుమాయమైంది.

"నీ ప్రభావం చూశాను. చాలు. నీవు నా గర్వాన్ని అణచివేశావు. అందుకు నేను చింతించడంలేదు. నీ వెవడవో తెలుసుకొన్నాను. అదే చాలు. నా తపస్సు అంతా నీకు ధారపోస్తున్నాను. కశ్యపుడికి నేను మాట ఇచ్చినందువల్ల అతడి కిచ్చివేసిన ఈ భూమిమీద నేను రాత్రిపూట ఉండకూడదు. కనుక సూర్యాస్తమయానికి మునుపే నేను నా తపోబలంవల్ల మహేంద్రపర్వతానికి చేరుకోవాలి. అందుకు అనుజ్ఞ ఇవ్వు. నీ చేతనున్న బాణానికి నా తపోబలాన్ని ఆహుతి చేస్తున్నాను. తీసుకో'' అని చెప్పి చక్రవర్తి కుమారునికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, పరుశురాముడు తిరిగిపోయాడు.

16. సుఖజీవనం

చక్రవర్తి, రాజకుమారులూ తిరిగి రావడం చూసిన అయోధ్య నగరవాసులు ఆనందపరవశులయ్యారు. దశరథుడికి, ఆతని పరివారానికీ, రాజకుమారులకూ స్వాగతం ఇవ్వడానికి అలంకరించిన అయోధ్యానగరం దేవలోకంలాగా కలకల్లాడుతూవుంది.

* * *

సీతారాములు ఏలోటులేక ఆనందంతో అయోధ్యలో పన్నెండు సంవత్సరాలు గడిపారు. రాముడు తన హృదయాన్ని సీతకు అర్పించాడు. గుణాలలోనూ, సౌందర్యంలోనూ వాళ్లు ఇద్దరి

కిద్దరే. వారికి సాటిలేరు. అందుకే కాబోలు, వాళ్ల ప్రేమ రాను రాను అభివృద్ధి పొందింది. సీతారాముల హృదయాలు ఒక దాన్ని తో ఒకటి మాట్లాడుకొంటాయి అంటున్నాడు కవి. ఇలాగ రాముడి ప్రేమను చూరగొన్న సీత దేవలోకంలో సాక్షాత్ శ్రీదేవిలాగా ప్రకాశించింది.

చాలాకాలానికి, వనవాస సమయంలో మహాతపస్విని అయిన అనసూయాదేవి సీతారాముల ప్రేమను కొనియాడింది. అప్పుడు సీత ఏం చెప్పిందనుకున్నారు: "రాముడు సకల సద్గుణ సంపన్నుడు. ఆయన ప్రేమ నా ప్రేమతో సమానమైంది. ఎట్టి స్థితిలోనూ ఆ ప్రేమకు తిరుగులేదు. ఆయన ఆలోచన కళంకంలేనిది. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోగల శక్తిమంతుడాయన. తల్లిలాగా, తండ్రిలాగా, నన్ను ఆయన చూసుకుంటున్నారు. ఇంక ఆయనను ప్రేమించకుండా నేనెలా ఉండగలను?"

ప్రేమను గురించి ఆలోచించేవారూ, వివాహమాడి సుఖంగా ఉండాలని ఆశించే యువతీ యువకులూ సీత అనసూయతో చెప్పిన ఈ మాటలు గుర్తుంచుకొండి. ఆ మాటలలో ఎంత భావం వుందో చూడండి. ఇద్దరి ప్రేమా సమానముగా ఉండాలి. ఒకటి ఎక్కువగాను ఒకటి తక్కువగాను ఏదో అప్పు తీర్చినట్లుగా ఉండకూడదు. జీవితంలో రకరకాల సంఘటనలు జరుగుతూ వుంటాయి. ఏది జరిగినా, దాని వల ప్రేమలో మార్పు రాకూడదు. కట్టుకొన్న భార్యకు పురుషుడే సమ మును, అలా ఉంటేనే జీవితం ఆనందప్రదంగా ఉంటుంది. అలాటివాళ్లనే దేవుడు చల్లగా చూస్తాడు.

17. యౌవరాజ్యం

సీతారాములు పన్నెండేళ్లు సుఖంగా. ఆనందంగా అయోధ్యలో గడిపారు. ఇకమీదట లోకంలో మానవులు అనుభవించే దుఃఖాలూ, కోపతాపాలూ, విఘ్నాలూ అన్నింటినీ భగవానుడూ - శ్రీదేవీ ప్రత్యక్షంగా ఈ మానవ శరీరంతో అనుభవింపబోతున్నారు. "నేను ఏ

అవతారాన్ని ఎత్తుతున్నానో ఆ అవతారానికి తగిన దేహాంతోను, చైతన్యంతోను నా దివ్యలీలలు జరుగుతూ ఉంటాయి'' ఇది భగవంతుని వాక్యం.

తన దేహ, ప్రాణ, చైతన్యాలతో ఇతర మానవులలాగే కష్ట పడి మానవుల కష్టాలను బాపిన చక్రవర్తి తనూజు డెవడు? అంతటా అన్నిటిలో లోపల్లా - వెలుపలా ఉన్న లోకనాథుడే! ఈ విషయాన్ని పెద్ద లెరుగుదురని చెప్పి కంబరు మహాకవి అయోధ్యాకాండ మొదలు పెడుతున్నాడు :

సీ॥ రాజు రెండవభార్య రాముని పినతల్లి
కుబ్జయౌ మంథర కొడిమసేయ
రాజ్యంబు వీడి యరణ్యంబు సేరి స
ముద్రంబు దాటి సన్మని సురేంద్ర
మానవాళి యిడుములు తీర్చ శ్రీపాద
ములు గల శ్రీరామ భూవరుండె
మూల ప్రకృతి దోచి భువనంబులందు వ్యా
పి్తం బొందు పాంచభౌతికములైన

తే. జంగమ స్థావర పదార్థ పంక్తి యందు
మేను ప్రాణముల్ ప్రాణ విజ్ఞానములును
గూడియున్నట్లు లోవెలి గూడియుండు
నాత్మయని పల్కుచుంద్రు మహాత్ము లెపుడు.

* * *

నలుగురు కుమారులమీదా దశరథునికి ఎంతో ప్రేమ. అయినా రాముడంటే అందరికన్నా ఎక్కువ ప్రేమ. అందుకు కారణం- తగిన రాజలక్షణాలూ, శీలమూ రాముడిలో ఉండటమే. కౌసల్యా దేవి ఇంద్రుని కన్న అదితిలాగ రాముడు తన కడుపున పుట్టినందుకు చెప్పలేని ఆనందం పొందుతూంది.

ఈ చక్రవర్తి కుమారుని గుణాల వర్ణనతో వాల్మీకిమహర్షి పుటలకు పుటలు నింపాడు. రామగుణాలు అనే సముద్రంనుంచి దోసిళ్లతో ఎంతత్రావినా మహర్షికి తనివితీరలేదు. ఆ గుణాలను ఒక చోట తానే చెప్పినట్లు, ఒకచోట దశరథుడు చూచి ఆనందించినట్లు, మరొకచోట ప్రజలు పొగడినట్లు ఇలా అనేకవిధాలుగా రాముని గుణాతిశయాన్ని ఆయన వర్ణించారు. వాల్మీకి కవితలో అక్షరాల పొదుపు ఎక్కువ. అయినా రామగుణాలు పుటలకు పుటలే నిండి వున్నాయి. మానవులకు కావలసిన సద్గుణాలూ, శుభలక్షణాలూ అన్నీ రాముడికి ఉన్నాయని మహర్షి భావం. ఆ గుణాలను గురించి చదివీ, విని మానవులు మేలుపొందాలని వాల్మీకిమహర్షి రాముడి గుణగణాలను మాటిమాటికీ సవిస్తరంగా వర్ణించారు.

* * *

రాముని అందమూ, పరాక్రమమూ. అమాయకత్వమూ, మంచి నడవడీ, కరుణా, మాటల తీయందనమూ, శాంతమూ, పరిపూర్ణ జ్ఞానమూ, వీటన్నింటికీతోడు అపూర్వ దేహబలమూ, ఆరోగ్యమూ, రాజ్య పాలనకు కావలసిన నీతిశాస్త్ర జ్ఞానమూ—ఇవన్నీ చూసి రాముడు ఎప్పుడు రాజు అవుతాడా అని ప్రజలు అనుకునేవారు. దశరథుడికి ఈ విషయం బాగా తెలుసు. తనకు ముసలితనం వచ్చింది. కనుక రాముడికి యువరాజ పట్టాభిషేకం చేసి రాజ్యభారాన్ని అతడికి అప్పజెప్పాలనుకొన్నాడు. ఒకనాడు సభలో ఈ విషయాన్ని మంత్రులతో చెప్పాడు.

ఋషులూ, జ్ఞానులూ, అయోధ్యానగర పౌర నాయకులూ, నానాదేశాల రాజులూ ఆ సభకు వచ్చారు. తమ స్థానాలు అలంకరించారు. అంతా వచ్చింతర్వాత, దశరథుడు లేచి మాట్లాడాడు. ఆ మాటలు దుందుభి మోగినట్లు, మేఘగర్జనలాగ, గంభీరంగా సభామంటపంలో మారుమోగాయి. దశరథుడి ముఖంలో రాజవర్చస్సు వెలిగింది. అతనిమాటలు అందరి మనస్సులను ఆకర్షించాయి.

"నా పూర్వీకులలాగే నేనుకూడా ఈ రాజ్యాన్ని కన్నబిడ్డవలె కాపాడుతూ వచ్చాను. సోమరితనంలేక ప్రజలకోసం శ్రమపడ్డాను.

ముసలితనంవల్ల ఇప్పుడు నా శరీరం సడలిపోయింది. నా పెద్ద కుమారుని యువరాజుగా నియమించి అతనికి రాజ్యభారం అప్పగించి నేను విశ్రాంతి తీసుకోవాలని వుంది. నా పూర్వీకుల మార్గాన్ని అనుసరించి నేనూ ఈ నా శేషజీవితాన్ని వనవాసంలో గడపాలనీ ఆశిస్తున్నాను.

నా పెద్దకొడుకు రాముడు నాలాగానే చక్కగా రాజ్య భారం వహిస్తాడు. అందుకు కావలసిన అన్ని సద్గుణాలూ అతడిలో ఉన్నాయి. అతడు రాజ్యశాస్త్ర నిపుణుడు. నీతి శాస్త్రాన్ని చక్కగా ఎరిగినవాడు. శత్రువులను అణచగల బలసంపన్నుడు. నేను వహిస్తున్న భారాన్ని అతని బుజానమోపి రాజ్యక్షేమాన్ని గురించి నిశ్చింతగా ఉండాలని కోరుకొంటున్నాను. ఇందుకు సభలోని పెద్దలూ, రాజులూ, మహాజనులూ ఆమోదిస్తారని ఎదురు చూస్తున్నాను. నా ఆలోచనలో దోషం ఉంటే ఆ సంగతి చెప్పండి"అన్నాడు.

ప్రభువు మాటలు వినగానే సభలో సంతోషసూచకమైన చప్పట్లు అలలు అలలుగా బయలుదేరాయి. రాముడికి యువరాజ పట్టాభిషేకం చేస్తారన్న మాట వినగానే కారుమొగుళ్లు చూచి పురివిప్పి ఆడే నెమళ్లలాగ ఆనందిస్తూ "అలాగే చేయండి - తప్పక చేయండి" అని సభలో నలుదిక్కులనుంచీ కోలహలం బయలు వెడలింది. బ్రాహ్మలు, సేనాపతులు, పౌరశ్రేష్ఠులు, గ్రామాలనుంచి వచ్చిన జనపద నాయకులు అందరూ "రాముడికి యౌవ రాజ్యాభిషేకం చేసి రాజకార్యాలను అతడికి అప్పజెప్పడం మా కందరికీ ఇష్టమే" అని ఏకగ్రీవంగా చెప్పారు.

అది విని రాజు మళ్లీ ఇలా అన్నాడు: "మీ అభిప్రాయానికి కారణం ఏమిటో తెలియజేయకుండా నేను చెప్పిందాన్ని ఆమట్టునే అంగీకరించడం నాకు తృప్తిగా లేదు. పెద్దలు విషయాలు వివరించి మాట్లాడాలని ప్రార్థిస్తున్నాను" అన్నాడు.

అప్పుడు సభలో అనేకులు లేచి రాముని గుణగణాలను గురించీ, రాజ్యభారం వహించడానికి అతనికిగల అర్హతలను గురించీ సవిస్తరంగా చెప్పారు. అది విని రాజు హృదయం ఆనందంతో ఊగులాడింది. చివరకు "ఆలస్యం వద్దు. రాముడికి వెంటనే పట్టాభిషేకం

చేయించండి'' అని జనులంతా లేచి నిలబడి చేతులు జోడించి ప్రార్థించారు.

బిడ్డలారా! మీరు చెప్పింది విని నేను అమితానందం పొందాను. మీ యిష్టప్రకారమే చేస్తాను. యువరాజ పట్టాభిషేక శుభకార్యం సక్రమంగా జరుగుతుంది'' అని రాజు అన్నాడు.

* * *

వసిష్ఠుడూ, వామదేవుడూ మొదలైన పెద్దలను చూచి దశరథుడు ''ఇది చైత్రమాసం. మంగళకరమైన సమయం. వనాలన్నీ పుష్పించి అందంగా వెలుగొందే వసంతఋతువు. అభిషేకానికి కావలసిన ఏర్పాట్లన్నీ చేయించండి'' అని చెప్పాడు.

ఇలా ఉత్తర్వు ఇవ్వగానే ప్రజలు పెద్ద కోలాహలం చేశారు.

* * *

రాజాజ్ఞను తలదాల్చి అంతరంగ సచివుడైన సుమంత్రుడు రాముణ్ని తీసుకురావడానికి వెళ్లాడు. రాముడికి ఏ విషయమూ తెలియదు. వచ్చి తండ్రి ఎదుట నిలిచాడు. యౌవరాజ్య పట్టాభిషేక నిర్ణయాన్ని గురించి తండ్రి చెప్పగా విని ''తమ ఆజ్ఞానుసారమే నడుచుకొంటాను'' అని అన్నాడు, రాముడు.

''నీకు నేను చెప్పవలసిందేదీ లేదు. నీవు గుణవంతుడవు. జనులంతా నిన్ను ప్రేమిస్తున్నారు. ఇక నీవు మునుపటికన్న ఎక్కువ వినయంతోను, మెలకువతోను నడుచుకొంటూ సకల సౌభాగ్యాలనూ, కీర్తినీ పొందవలసింది'' అని రాజు కుమారుణ్ని ఆశీర్వదించాడు. సెలవు తీసుకొని రాముడు తన నివాసస్థానానికి తిరిగి వెళ్లాడు.

* * *

అంతలోనే రాజు మళ్లీ ఏదో ఆలోచించి రాముణ్ని తొందరగా రమ్మని సుమంత్రుణ్ని ఆజ్ఞాపించాడు. ''ఏమిటి సంగతి? నన్ను మళ్లీ చక్రవర్తి ఎందుకు రమ్మన్నారు?'' అని రాముడు అడిగాడు.

''నాకు తెలియదు. రాజుగారు తీసుకురమ్మని ఆజ్ఞాపించారు. నాకు తెలిసింది అంతే'' అని సుమంత్రుడు జవాబిచ్చాడు.

"యువరాజ పట్టాభిషేకం విషయంలో మంత్రాలోచన చేసినప్పుడు సందేహం ఏదైనా కలిగి ఉండవచ్చు. ఏమైనా సరే, నేనీ విషయంలో తొందరపడకూడదు" అని రాముడు అనుకున్నాడు. రాజ్యాధికారం వహించాలనే ఆత్రం రాముడికి ఎంతమాత్రమూ లేదు. రాజ్యాధికార నిర్వహణ ఒక కర్తవ్యం అన్నట్లుగా అతడు భావించాడు. రాజు ఒప్పుకొన్నా సరే లేకపోయినా సరే అనుకొన్నాడు రాముడు.

కంబరు కవి పద్యం ఈ విషయాన్నే వివరిస్తుంది:

మ॥ జనకుం డివ్విధి బల్క రాముడెద ని
ష్టంబింత లేకున్న మా
అనివాడై విధియించు దండ్రి మదినా
రం జూచి బోధించు నా
పని యేదైనను మాఱుపల్క కొనరిం
పంబూనుటే నీతి పు
త్రునకం చూహాము చేసి యొప్పికొన
సుచ్యోగించి వల్లే యనెన్.

* * *

వెంటనే రాముడు రాజువద్దకు వెళ్లాడు. దశరథుడు కుమారుని కౌగలించుకొని, కూర్చోబెట్టి, "నాయనా, రామా! నాకు వయస్సు మీరుతూంది. సకల సుఖాలనూ, దీర్ఘాయుష్యాన్ని అనుభవించాను. చేయవలసిం దేదీలేదు నీకు పట్టాభిషేకం చేసి, సింహాసనం మీద కూర్చుండబెట్టడంతప్ప మరోకోరిక ఏదీ నాకు లేదు. నేను నిన్ను ఒక పీడకల కన్నాను. అదీకాక నా జాతకం ప్రకారం నా కిప్పుడు మరణమూ, గొప్ప దుఃఖమూ కలుగుతుందని దైవజ్ఞులు చెపుతున్నారు. కనుక రేపే నీకు పట్టాభిషేకం చేయాలని నా సంకల్పం. రేపు పుష్యమీ నక్షత్రం. మంచిరోజని పెద్దలు చెపుతున్నారు. ఈ పని వెంటనే ముగించాలని మనస్సులో ఏదో నన్ను తొందరపెడుతూంది.

నీవూ, సీతా వెంటనే పట్టాభిషేక దీక్ష పూనండి. శాస్త్రప్రకారం ఈ రోజు ఉపవాసం ఉండాలి. నేలను పండుకోవాలి. ఈ మంగళ కార్యానికి ఎట్టి విఘాతమూ రాకుండా పూజలు చేయాలి. భరతుడు ఊళ్లో లేడు. వాడు మేనమామల ఊరు- కేకయదేశం వెళ్లాడు. వాడ్లూ వెళ్లి చాలారోజులయింది. కేకయదేశం చాలాదూరాన ఉంది. వాణ్ని కబురంపి పిలిపించడానికా వ్యవధిలేదు. వాడు వచ్చేవరకూ కార్యం నిలిపి ఉంచడం ఉచితంకాదు" అన్నాడు.

* * *

దశరథు డాడిన మాటలో కవి మన ఆలోచనకు తావు కల్పిస్తున్నాడు. కైకేయిని వివాహ మాడినప్పుడు దశరథుడు ఆమెకు ఒకమాట ఇచ్చాడు. ఆ సంగతి అతనికి జ్ఞాపకంవచ్చి అతని మనస్సున వేదన కలిగినట్టుంది. భరతుడు చాలా మంచివాడు. అన్నమీద అతనికి గాఢభక్తి, ప్రేమ ఉన్నాయి. కనక కైకేయి ఏమన్నా అతడు లెక్కచేయడు. రాముడి పట్టాభిషేకాన్ని అతడు ఆక్షేపించడు. అయినా మానవుడి మనస్సు నమ్మరానిది. మంచివాళ్ల బుద్ధి కూడా కొన్ని సమయాలలో మారిపోతుంది అని దశరథుడు భయపడ్డాడు.

"దశరథుడు అన్నను గురువుగా భావిస్తాడు. మంచి మనస్సు గలవాడు. ఆశలను అణచుకొనగల శక్తి గలవాడు. అయినా మనస్సు ఎప్పుడూ ఒకేతీరుగా ఉండదుకదా" అని దశరథుడు అనుకున్నాడు. మర్నాడే పట్టాభిషేకం పూర్తికావాలని రాముడితో చెప్పాడు. భరతుడి రాకకోసం వేచిఉండ పనిలేదని వసిష్ఠునికి కూడా తెలిపాడు.

* * *

తండ్రిదగ్గర సెలవు తీసుకొని రాముడు వెంటనే కౌసల్యాదేవి అంతఃపురానికి వెళ్లాడు. కన్నతల్లికి ఈ సంగతి వివరించి చెప్పి ఆమె ఆశీర్వచనం పొందాలని అతని వుద్దేశం. అంతకుముందే ఈ సమాచారం కౌసల్యకు అందింది. సుమిత్ర, సీత, లక్ష్మణుడూ అంతా కౌసల్యదగ్గరే ఉన్నారు.

కౌసల్య పట్టుచీరకట్టి కుమారునికి శుభంకోరి పూజలో కూర్చుని ఉంది.

తండ్రి ఆజ్ఞను రాముడు కౌసల్యకు చెప్పాడు.

"విన్నాను నాయనా! నే విన్నది నిజమని నీవూ చెప్పావు. చిరంజీవివై రాజ్యభారం వహించి, విరోధుల నణచి, ప్రజలను, బంధువులను కాపాడు! నీ గుణాలవల్ల తండ్రిగారికి తృప్తి కలిగించావు. అది నా భాగ్యం" అని ఆమె కుమారుణ్ణి ఆశీర్వదించింది.

రాముడు తన పక్కన నిలిచిన లక్ష్మణుణ్ణి చిరునవ్వుతో పలకరించి "లక్ష్మణా, సకల సంపదలు నిండిన ఈ రాజ్యాన్ని నాతో సమానముగా ఏలుదువుగాని. నాకు నువ్వు మరొక ప్రాణానివి. కనుక, నా భాగ్యమంతా నీదే" అన్నాడు.

లక్ష్మణుడిమీద రాముడికి వున్న ప్రేమవల్ల ఇలా అన్నాడు.

రామలక్ష్మణులు ఇద్దరూ తల్లులకు నమస్కరించారు. రాముడు సీతను వెంటబెట్టుకుని తన నగరుకు వెళ్లాడు.

రాజాజ్ఞ ప్రకారం వసిష్ఠుడు రాముడి నగరుకు వచ్చాడు. రాముడు ఎదురెళ్లి నమస్కరించి స్వయంగా వాహనంనుంచి దింపి లోపలికి తీసుకువెళ్లాడు.

వసిష్ఠుడు మంత్రపూర్వకంగా ఉపవాస సంకల్పం చేయించి రాజువద్దకు తిరిగి వెళ్లాడు.

జనులు రాజమార్గాన అక్కడక్కడ గుంపులుగా చేరి పట్టాభిషేక మహోత్సవాన్ని గురించి సంతోషంతో మాట్లాడుకొంటున్నారు. నగరవాసులు ఇళ్లను అలంకరించి పతాకాలను ఎగరవేస్తున్నారు. వసిష్ఠుడు మెల్లగా ఆ గుంపులను ఒత్తిగించుకొని వెళ్లాడు.

వసిష్ఠుడు రాగానే రాజు సింహాసనం దిగి "ఉపవాస సంకల్పం చేయించారా?" అని అడిగాడు. "ఆ! అయింది" అని వసిష్ఠుడు చెప్పగానే రాజు ఆనందించాడు. ఏదైనా విఘ్నం కలుగుతుందేమో నని దశరథుడు ఇంతవరకూ దిగులుగానే కూర్చున్నాడు.

నగరమంతా ఆనందంలో మునిగివుంది. ఈ పట్టాభిషేకం తమ ఇంటి శుభకార్యంగా ఎంచి నగరంలోని ఆబాలగోపాలమూ ఉత్సాహంతో ఆ సుముహూర్తానికి ఎదురు చూస్తున్నారు.

ఈ మహోత్సవం మర్నాడు ఉదయమే జరుగుతుందని తెలిసే సరికి ప్రజలలో ఆనందం, ఆతురత అధికమైనాయి. చుట్టుపక్కల దేశాలవారు ఆ పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించడానికి అయోధ్యకు తరలివచ్చారు. ఎక్కడ చూచినా మంగళవాద్యాలే!

రాముడూ, సీతా తమ నగరులో నారాయణుణ్ణి ధ్యానించి హోమాగ్నిలో నెయ్యి ఆహుతిచేసి, మిగిలిన నేతిని భక్తితో సేవించి ఇరువురూ నేలపై దర్భలు పరచుకొని ఆ రాత్రి నిద్రించారు. ఉషఃకాలాన మంగళ వాద్యాలతో ఇద్దరూ మేల్కొన్నారు.

18. కైకేయి

అంతఃపుర ఆచారం ప్రకారం కైకేయికి ఒక చెలికత్తె ఉంది. అది గూనిదీ, ముసలిదీని. కైకేయి అంటే దానికి చాలా చనువు. దాని పేరు మంథర. రామాయణ కథలో ప్రసిద్ధికెక్కిన పాత్ర ఇది. మనదేశంలో ఆబాలగోపాలం అంతా చీదరించుకునే పాత్ర. రాముణ్ణి అడవికి పంపేలాగా చేసింది మంథరే. ఆ పని ఎలా చేసిందనుకున్నారు.

దశరథుడు సభలో మర్నాడు రాముడికి పట్టాభిషేకం చేయాలని నిర్ణయించాడు. ఆ రోజున ఈమె తలవని తలంపుగా అంతఃపురం మేడమీది కెక్కి నిలబడింది. పైనుండి నగరాన్నిచూస్తే వీధులన్నీ నీళ్లు చల్లి అలంకారాలు చేయడం కనిపించింది. ప్రజలు ఇళ్లకు తోరణాలు కట్టి అలంకరించారు. కొత్తబట్టలూ, ఆభరణాలూ, చందన పుష్పాలూ ధరించి ఎక్కడ చూచినా జనం గుంపులు గుంపులుగా ఎంతో సంతోషంతో ముచ్చటించుకుంటున్నారు. దేవాలయాల్లో బాజాభజంత్రీలు వినిపిస్తున్నాయి. ఇవన్నీ చూడగా ఏదో గొప్ప మంగళకరమైన ఉత్సవం జరగనున్నట్లు తెలిసింది.

మంథర తన పక్కనున్న అంతఃపుర పరిచారికను పిలిచి "ఏమే, నీవు పట్టుచీరకట్టావేమే? ఒళ్లో ఏమిటి విశేషం? కౌసల్యాదేవి బ్రాహ్మలకు దక్షిణ లిస్తున్నది. ఆమె సాధారణంగా దుబారా ఖర్చు చేయదే? ఎక్కడ చూచినా అలంకారాలు, బాజాభజంత్రీలు వినబడుతున్నాయి, ఏమిటిదంతా?" అని అడిగింది.

"నీకు తెలియనే తెలియదా? మన రామచంద్రుడికి రేపు ఉదయం యువరాజ పట్టాభిషేకం!" అని ఆమె చెప్పి మంథర బుజం తట్టింది.

ఈ మాట వినగానే మంథర కోపం పట్టలేకపోయింది. గబగబా మేడదిగి తిన్నగా కైకేయి మందిరానికి వెళ్లింది. అప్పుడు కైకేయి పడుకుని ఉంది.

"పిచ్చిదానా, లే! లే! ప్రళయం ముంచుక వస్తూంది. మోస పోయావే అమాయకురాలా! ఇంకా నిద్రేనా?" అని కైకేయిని కసిరింది

మంథర దుఃఖాన్ని చూచి ఆమెకు ఏదో ఆపద వచ్చిందని అనుకుంది కైకేయి. "మంథరా! నీకేం ఆపద వచ్చింది? ఎందుకిలా శోకిస్తున్నావు!" అని మెల్లగా అడిగింది.

మాటకారి అయిన మంథర ఇలా అందుకుంది:

నీకూ, నాకూ సర్వనాశనం దాపురించిందే, కూతురా! ఇంకేముంది, రాముణ్ని యువరాజుగా చేసివేశారు. ఇంతకన్న నా దుఃఖానికి కారణం ఇంకేం కావాలే? నీకు కష్టంపస్తే నేనెలా సహించేదీ? పరుగెత్తుకుంటూ వచ్చాను. రాజకులంలో పుట్టి పెరిగావు. మహారాజుకు రాణివయ్యావు. అయ్యో, ఎంతగతి వచ్చిందే నీకు; అభం శుభం ఎరగని దానివి. ఇంత అమాయకురాలివయితే ఎలాగే! తీయని మాటలు చెప్పి నీ భర్తే నిన్ను మోసం చేశాడే, వంచకుడు! అన్నీ కౌసల్య కిచ్చి నిన్ను వాడవాడలా తిరగమని విడిచిపెట్టాడే మోసగాడు. భరతుణ్ని మేనమామ ఇంటికి పొమ్మని, దూరదేశం పంపి, ఇక్కడ తొందర తొందరగా రాముడికి పట్టాభిషేకం చేసెయ్యడానికి

చూస్తున్నాడు. రేపే అన్నీ అయిపోతాయి. ఇక నువ్వో! గుడ్లప్ప గించి చూస్తూ పడుకున్నావు. నీవూ, నిన్ను నమ్ముకొన్న వాళ్లూ అంతా నాశనమైనట్టే'' అని ఇలా మంథర చెపుతూఉన్నా, ఆమాటలు చెవినపడ్డా వాటి అర్థం మాత్రం తెలియలేదు కైకేయికి. ఆమె మనస్సు కెక్కినదమాట ఒకటే. అది రాముడికి పట్టాభిషేకం జరుగుతుందన్న విషయం.

"నా కుమారుడు రాముడికి పట్టాభిషేకం జరుగుతుందన్న వార్త తెచ్చావు. మంథరా, ఇంతకు మించిన సంతోష వార్త మరే ముంటుంది? ఇదిగో, ఇది తీసుకో. ఇంకా ఏం కావలసినా అడుగు!'' అని తన మెడలోని హారం తీసి మంథర కిచ్చింది. శుభవర్తమానం తెచ్చిన వారికి ఏదో ఒక బహుమతి ఇవ్వడం రాజమర్యాద.

* * *

మంథర అనవసరంగా భయపడుతూంది. ఇంతకూ ఆమె పరిచారిక కదా! గొప్పఇంటి వ్యవహారాలు ఆమెకేం అర్థమవుతాయి. ఆమెకు పట్టిన భయాన్ని తొలగించి ధైర్యం కలిగించడం కోసం ఆభరణాన్ని ఆమెకిచ్చి, తన సంతోషాన్ని ఆమెక్కూడా కలిగించ వచ్చని కైకేయి అనుకుంది.

కైకేయి మనస్సు అంత తేలిగ్గా లేదు. విరిగి పోలేదు. చెడ్డ ఆలోచనలకు అంత త్వరలో ఆమె మనస్సులో తావు కలగలేదు. అది చూచి మంథరకు దుఃఖం ముంచుకువచ్చింది.

కైకేయి ఇచ్చిన కంఠహారం విసిరికొట్టింది. "ఓసి పిచ్చిదానా! అవతల ముంచుకవస్తూందే వెర్రిదానా! హా హా హా అని నవ్వి ఆనందిస్తున్నావా. కడగళ్లు వచ్చి నీ బతుకు తలకిందుచేయడానికి నిలిచి ఉంటే నీవు కళ్లుమూసుకొని ఉన్నావే. నిన్నుచూచి నవ్వాలా?, ఏడవాలా?. నీ సవతి తన కుమారుడికి పట్టం కట్టడానికి ఏర్పాటు చేసుకుంటూ వుంటే, ఇదీ ఒక శుభవార్తే అనుకొని మధ్యని నువ్వెగురు తున్నావే! రాముడు పట్టాభిషిక్తుడైతే తర్వాత భరతుడి గతేంకాను? భరతు డున్నంతవరకూ అతడివల్ల తనకు అపాయం తప్పదని రాము

డనుకొంటాడుకదా ? లోకంపోకడ రాముడికి తెలుసు. అందువల్ల భరతుడు రాముడికి శత్రువైపోయాడు. తమకు కలిగే భయంవల్లనే రాజులు విరోధులను చంపుతారు. రాముడు పట్టాభిషిక్తుడు కాగానే భరతుణ్ని చూచి భయపడతాడు. భయంవల్లనేకదా పాములను చూడగానే చంపడం ? కనుక, భరతుడి ప్రాణాన్ని గురించి ఇకమీదట సందేహిస్తూనే ఉండవలసివస్తుంది. రేపు తెల్లవారేసరికి కౌసల్య భాగ్యవతి అయిపోతుంది. నీవు ఆమెకు దాసివౌతావు. ఆమె ముందు చేతులు జోడించి నమస్కరించి ఒక పనికత్తెలాగా నిలబడతావు. రేపటినుంచీ నీ కుమారునికి స్వేచ్ఛ లేనట్టే. అతడికమీదట రాముడికి ఒక సేవకుడు. అంతే. మన అంతఃపురంలో ఇక మానమర్యాదలూ సంతోషాలూ ఉండవు'' అంటూ, మంథర దు.ఖాతిశయంతో ఇక మాట్లాడలేక పోయింది.

ఇదంతా విని కైకేయి ఆశ్చర్యపోయింది. "మంథర ఎందుకిలా భయపడుతుంది ? రాముడి గుణం ఈమెకు తెలియదా ? ధర్మమూర్తికదా అతడు" అనుకుంది.

"మంథరా ! రాముడి సత్యమూ, శీలమూ, వినయమూ చూచి మనమంతా ఆనందించాం కదా ? అతడు జ్యేష్ఠుడు. రాజ్యానికి ఉత్తరాధికారి. అతని తర్వాత భరతుడే రాజ్యాధికారి కాబోతున్నాడు. ఇందులో తప్పేముంది ? నువ్వెందుకు దుఃఖిస్తున్నావు ? రాముడి తర్వాత నూరుసంవత్సరాలు భరతుడుకూడా రాజ్యం చేస్తాడులే ! ఏడవకు ! నేనంటే రాముడికి ఎంతప్రేమ ! కన్నతల్లిమీద కూడా అతనికంత ప్రేమ లేదన్నమాట. తమ్ముళ్లను తన ప్రాణంగా ఎంచుకొంటాడు. అలాంటివాణ్ని గురించి నీవు భయపడ్డం బాగాలేదు'' అని చెప్పి సహజమైన తన ప్రేమతో కైకేయి మంథర భయాన్ని పోగొట్టజూచింది.

"అయ్యో, నీబుద్ధి ఎందుకు ఇలా చెడిపోయింది ? రాముడు రాజుగా పట్టంకట్టుకున్న తర్వాత భరతుడికి తావేది ? రాజవంశ సంప్రదాయాలు నీకు బొత్తిగా తెలియవు. రాముడు సింహాసనం ఎక్కడమేమిటి ? అతని తర్వాత భరతుడు రాజవట మేమిటి

రాముడి తర్వాత రాముడి పెద్దకొడుకూ, అతని తర్వాత అతని పెద్ద కుమారుడు అలాగ వరసక్రమంలో అధికారంలోకి వస్తారు. రాముడి తమ్ముల ప్రసక్తే ఉండదు. జ్యేష్ఠకుమారుల రాజ్యం గొలుసు కట్టుగా సాగిపోతుంది. తమ్ముడు ఎంత గుణవంతుడై తేమట్టుకి, అతడికి చోటుండదు. ఇదే, రాజవంశ మర్యాద. రాముడికి పట్టాభిషేకం అయిందంటే నీ కుమారుడు అనాథ అవుతాడు. రాజవంశంలో అతనికికాని అతని బిడ్డలకుకాని తావేలేదు. ఈపాటి తెలియక పాయెనే, బిడ్డా, నేనేం చేసేదే!

రాముడు పట్టాభిషిక్తుడై, భరతుణ్ని ఊరికే విడిచిపెట్టుతా డనుకున్నావా? పసివాడి ప్రాణానికే ప్రమాదం కలుగుతుంది. జాగర్త. భరతుడు ప్రణాలతో ఉండాలనే నీకుంటే అతడు మేన మామల ఇంటినుంచి ఎక్కడికైనా పోయి దాక్కొని క్షేమంగా ఉండనీ. ఇక్కడికి వచ్చాడో, అతనికి ఆపద తప్పదు. కౌసల్యకు నీపైన కసి. రాజుగారి ఆదరాన్ని పొందానుకదా అనుకొని ఎన్నో సార్లు నువ్వు ఆమెను అలక్ష్యం చేశావు. ఇప్పుడామె నీపై కసి తీర్చు కొంటుంది. సందేహమే లేదు. సవతికోపం సామాన్య మనుకున్నావా? ఇంతెందుకు–రాముడు పట్టం కట్టుకోవడంతో మన భరతుడు మరణించాడే అనుకో! ఇప్పుడే ఏదో గట్టిగా నిర్ణయించుకో. ఎలాగైనా భరతుడికి పట్టాభిషేకం జరిగితీరాలి. రాముణ్ని రాజ్యంనుంచి తరిమి వేయాలి."

మంథర ఇలా చెప్పడంతో కైకేయి మనస్సులో భయం ప్రవే శించింది. మంథర విజయం పొందింది. భయపడిన కైకేయి ముఖం ఎర్రబడింది. నిట్టూర్పు వేడెక్కింది. ఏం చేయాలో తెలియక మంథరనే శరణు వేడింది.

* * *

పుత్రులు లేనప్పుడు దశరథుడు రాజవంశ మర్యాద ననుసరించి కైకేయిని వివాహమాడాడు. ఈమె కడుపున పుట్టిన బిడ్డకే రాజ్యం ఇవ్వాలని అప్పుడు కైకేయి తండ్రి కేకయరాజు దశరథుడివద్ద మాట తీసుకున్నాడు. అప్పుడు దశరథుడు మాట ఇవ్వడంలో ఆశ్చర్యం

లేదు, దోషమూలేదు. అప్పుడు రాణులెవరికీ సంతానంలేదు. పెద్ద భార్యలకు పుత్రసంతానంలేదు. పుత్రభాగ్యంకోసమే దశరథుడు ఈ మూడవ భార్యను పెండ్లాడాడు. కాని ఆ ఆశ తీరలేదు. చాలాకాలం తర్వాత యజ్ఞం చేశాక ముగురు భార్యలూ సంతానవతులైనారు. పట్టపురాణి కుమారుడు రాముడు, నలుగురు పుత్రులలోనూ పెద్ద వాడు. సకల సద్గుణాలూ కలవాడు. రాజ్యభారం వహించగల శక్తగలవాడు. మంత్రులూ, సామంతులూ, పౌరులూ, అంతా యువరాజు పదవికి తగినవాడితడే అనేటట్టుగా అందరి ప్రేమనూ చూరగొన్నాడు. అలాంటి రాముడి హక్కునూ రాజవంశ మర్యాదనూ తిరస్కరించి భరతుడికి పట్టం కట్టడం ఏమి న్యాయం? అదీ కాక భరతుడికి కాని, కైకేయికికాని ఇంతవరకూ రాజ్య లోభం లేదు. అలాంటి ఆలోచనే వారికి కలగలేదు. అందుకని న్యాయం ప్రకారం రాముణ్ని యువరాజుగా చేస్తే ఎట్టి ఇబ్బంది ఉండబోదని దశరథుడు అనుకొన్నాడు. కైకేయి మనస్సులో కూడా ఎట్టి కల్మషమూ లేదు. కైకేయి నడవడివల్ల ఆ విషయం స్పష్టంగా తెలుస్తూనే ఉంది. భరతుడి మనస్సును గురించి చెప్పనే అక్కరలేదు.

ఐనా దశరథుడు రాముడితో చెప్పినట్లు మంచివాళ్ల మనస్సు కూడా ఒక్కొక్కప్పుడు హఠాత్తుగా మారిపోతూ ఉంటుంది. చెడ వాళ్ల దుర్బోధ, దానికి విధి తోడైతే, ఎంత మంచి వాళైనాసరే చెడిపోతారు. కైకేయి విషయంలోనూ ఇంతే జరిగింది.

ఆ॥ పలువ దాసి యిట్లు పలుక దివ్యుల మాయ
వలన వారు పొందు వరబలమున
ఘనులు చేయు తపము కతమున గైకేయి
విమల మనము మాటి వెడగునొందె.

అని పాడుతున్నాడు కంబరుకవి. ఆలసిస్తే ఒక వేళ విఘ్నం కలగవచ్చని భరతుడి రాకకోసంకూడా చూడకుండా పట్టాభిషేకం త్వరగా జరిపించాలని దశరథుడు ఏకారణంవల్ల త్వరపడ్డాడో ఆ కారణమూ, ఆ తొందరపాటూ కైకేయి మనస్సును తప్పుదారి పట్టించడానికి మంథరకు బాగా ఉపయోగపడ్డాయి.

"చూడు! ఇంత తొందర ఎందుకు? నీ కొడుకు ఊళ్లోలేని సమయం చూచి అతగాణ్ని మోసగించడానికేకదా ఈ తొందర పాటు? కల్లబొల్లి ప్రేమ ఒలకబోస్తున్న నీ రాజుగారి వంచనా చమత్కారం చూడు!" అని నూరిపోసింది మంథర.

మంథర కైకేయి మనసు విరిచేసింది. తను చెప్పిందానికి ఆమె సమ్మతించేలా చేసింది. మొత్తంమీద కైకేయిది సహజ స్త్రీస్వభావం. ఆమెకు సద్భావం ఉంది. సత్ప్రవర్తనకూడా ఉంది. సునిశితమైన బుద్ధీ ఉంది. కాని లోకవ్యవహారాలు ఎక్కువగా తెలియవు. అయితే పట్టుదల ఎక్కువ. ఇతరుల మాటలలో తేలికగా పడిపోతుంది. తాను చేసే పని ఎలాంటి ఫలితాల నిస్తుందో తెలుసుకొనే శక్తి ఆమెకు లేదు. ఇదే రామాయణంలోని విషాదఘట్టానికి మొదలు.

19. గూనిదాని బోధ

ఇంతవరకు రాముణ్ని తన కడుపున పుట్టిన బిడ్డగానే భావిస్తూవచ్చిన కైకేయి ఇప్పుడు మంథర దుర్బోధలోపడి చెడిపోయింది.

"భయంగా ఉందే మంథరా! ఏంచేయాలో చెప్పు మంథరా! కౌసల్యకు అణగిమణగి ఆమె పరిచారికగా నేను పడి ఉండడమా? ఎంతమాత్రం వీల్లేదు. నా భరతుడికి పట్టాభిషేకం జరిగే తీరాలి. నీవు చెప్పింది ఎంతో బాగుంది. అయితే, రాముణ్ని అడవికి పంపించి తీరాలి కదా? మరి అందుకు ఉపాయం ఏమిటో చెప్పు" అని కైకేయి మంథరను వేడుకుంది. ఆ సమయాన కైకేయి కళ్ళకు గూనిరూపు మంథర దేవతలా కనిపించింది. ఇది వేళాకోళానికి అన్నమాట కాదు. మనస్తత్వ సూక్ష్మ రహస్యం.

"కైకా! ఇదేమి చోద్యమే! నన్నా ఉపాయం అడుగుతున్నావు? నీకు ఇంతటి మతిమరుపు ఎలా కమ్ముకువచ్చింది తల్లీ? లేక నాదగ్గర వేషాలు వేస్తున్నావా? నేనే చెప్పాలంటే, చెపుతా విను, మరి!" అని మంథర అగింది.

"చెప్పుచెప్పు, మంథరా! ఎలాగైనా మన భరతుడికి పట్టం కట్టించాలి. రాముడికి పట్టాభిషేకం జరగకుండా చేయాలి" అని కైకేయి తొందరపెట్టింది.

"ఉండు మరి. తొందర పడకు. ఒకప్పుడు నీ భర్త ఐన దశరథచక్రవర్తి, దక్షిణదిక్కున వున్న శంబరుడితో యుద్ధం చేశాడు. జ్ఞాపకముందా? నువ్వుకూడా అప్పుడు ఆయనవెంటే ఉన్నావు. నీ భర్త అప్పుడు ఇంద్రుడికి సహాయంగా వెళ్లాడు. శంబరుడి ధాటికి వైజయంతీనగరం తల్లడిల్లింది. అప్పుడు దశరథుని సహాయం కోరారు. దశరథుడు యుద్ధంచేసి ఒళ్లంతా గాయాలతో స్పృహతప్పి పడిపోయాడు. జ్ఞాపకం ఉందా? అప్పుడు నువ్వే రథం నడిపి, అతి నేర్పుతో రథాన్ని యుద్ధరంగం దాటించావు. అవునా? రాజు శరీరానికి గుచ్చుకొన్న బాణాలన్నీ మెల్లగా ఊడదీసి ఆయనకు స్పృహ తెప్పించి ప్రాణాలు కాపాడావు. ఇదంతా మరిచిపోయావా అప్పుడే?

ఆ సమయంలో ఆయన ఏమన్నాడో గుర్తుందా? 'నీకు ఇష్టమైన రెండు వరాలు అడుగు' అన్నాడు: కదూ? 'ఏ మడిగినా సరే ఇస్తా'నని అన్నాడు. అందుకు నువ్వు 'నాకు కావలసినప్పుడు కోరుకొంటాను లెండి' అన్నావు. 'అలాగే, కానీ' అన్నాడాయన. అవునా? జ్ఞాపకం వచ్చిందా? నువ్వేకదా నాకు ఈ సంగతులన్నీ చెప్పావు. నువ్వు మరిచిపోయావు కాని నేను మరవలేదు. ఆ రెండు వరాలూ ఇప్పుడు కోరుకొని కార్యం సాధించుకో. రాముడి పట్టాభిషేకం ఆపి భరతుడికి పట్టం కట్టాలి అని నీ భర్తను అడుగు. ఇది మొదటివరం. రాముణ్ణి పధ్నాలుగేళ్లు అడవికి పంపాలి అని రెండవ వరం అడుగు. పాపమేమోనని జంకకు. భయపడి వణికిపోతావేమో. నేను చెప్పేది విను. రాముణ్ణిలా అడవికి పంపితే, ఆయనపట్లగల ప్రేమా, భక్తి క్రమేణా ప్రజలు మరిచిపోతారు. నీ కుమారుని యువ రాజ పదవి సిరమవుతుంది. పోయి, కోపగృహంలో వరిగిన చీర కట్టుకుని నేలమీద పడుకో. రాజు వచ్చినప్పుడు మాట్లాడకు. కన్నెత్తయినా చూడకు. నీ దుఃఖాన్ని ఆయన చూడలేడన్న సంగతి నాకు తెలుసు. మన మనుకొన్న పని చక్కగా నెరవేరుతుంది.

VANIVILAS MEMORIAL LIBRARY
V.P.R.I. NARASARAOPET
Acc. No. 11297

రాజు ఏవేవో ఆశలు చూపిస్తాడు. దానికి లోబడేవు సుమా: నువ్వు కోరిన రెండు వరాలే కావాలనీ, మరేవీ వద్దనీ పట్టు పట్టు. సత్యానికి కట్టుబడి, రాజు తప్పకుండా దారికి వస్తాడు. అతనికి నీమీద ఎంత చిక్కటి మక్కువ ఉందో నే నెరుగుదును. నీ కోసం ప్రాణాలనై నాసరే విడుస్తాడు. నిప్పులో పడమంటే పడతాడు. నేను చెప్పినట్లుగా చెయ్యి. ఏమీ భయపడకు. రాముణ్ని అడవికి పంపితేకాని నీ కార్యం నెరవేరదు. లేకపోతే నీ కుమారుడికి వచ్చిన పదవి కల లాగ కరిగిపోతుంది. ఈ మాట మాత్రం గుర్తుంచుకో. పట్టు విడవకు సుమా! ఈ విషయంలో మాత్రం పట్టువిడవకు. జాగ్రత్త!" అని మంథర పదేపదే హెచ్చరిక చేసింది.

భయంతో వాడిపోయిన కైకేయి ముఖం ఈ గూనిదాని ఉపదేశంతో వికసించింది. "నీ బుద్ధికుశలతను ఏమని పొగడనే మంథరా! నన్ను కాపాడావే!" అని లేచి గుర్రపు పిల్లలాగా ఎగిరి గంతేసింది కైకేయి.

"ఆలస్యం చెయ్యకు. చేయవలసిన పని వెంటనే చేయాలి. తీరా గట్టుతెగిన తర్వాత చెరువుకు కట్ట కట్టడానికి వీలుపడదు. చెప్పిందంతా జ్ఞాపకం ఉంచుకో. పట్టుదల వదలకు. నీ కార్యం నిశ్చయంగా జయమవుతుంది" అని రాముణ్ని అడవికి పంపడాన్ని గురించి మళ్లీ మళ్లీ నూరిపోసింది, మంథర.

అందుకు కైకేయి "నన్నుగురించి సందేహించకు, మంథరా! నేను పట్టుదల విడవనే విడవను. ఇదిగో చూడు!" అని, అప్పుడే కోపగృహంలో ప్రవేశించి తన ఆభరణాలను చెల్లాచెదరుగా పారేసింది. మాసిన కోక కట్టి నేలపై పడుకుంది. అలా పడుకుని ఏడుపుగొంతుతో మంథరను పిలిచింది. "మంథరా! నా తండ్రి కేకయరాజుగారి వద్దకు పోయి, నీవే చెప్పు. భరతుని పట్టాభిషేకమనో, కైకేయి మరణించిందనో, ఏదో ఒకటి చెప్పు" అంది. దశరథుడు చేసిందంతా మోసమని నిజంగానే నమ్మింది, కైక. కోపం పట్టలేక, అలాగే నేలపై పడుకుంది.

అప్పుడుకూడా ఆమె అందం తగ్గలేదు. అందమైన స్త్రీ నవ్వినా, కోపించినా అందమే !

పాపపు తలంపు బాగా కైకేయి తలకెక్కింది. ఆమె స్వభావమే పూర్తిగా మారిపోయింది. తన బతుకు బానిస బతుకై పోతుందనీ, భరతుడి ప్రాణానికి ముప్పు వాటిల్లిందనీ, ఒక దిగులు పిశాచంలాగా ఆమెను పట్టుకుంది. ఫలితంగా ఇంతవరకూ ఎన్నడూ చేయని పనికి ఆమె పూనుకుంది. అతీతమైన ఒక విషయాన్ని గురించి భర్తను నిర్బంధించడమా అన్న సంకోచం, రాముణ్ణి అడవికి పంపాలని కోరడమా అన్న సిగ్గు, పాపభీతి, అన్నింటినీ మనస్సునుంచి తొలగించుకుంది. మనస్సు రాయి చేసుకుంది.

దుఃఖావేశంతో ఎగిరెగిరి పడింది. ఒళ్ళంతా చెమటలు పోశాయి. కళ్ళు మూసుకుంది. తలవెండ్రుకలు జీరాడగా ఆమె అందమైన నాగకన్నెలాగ నేలమీద పడుకుంది. ఒక అందమైన పక్షి బోయవాడి బాణం తగిలి తటాలున నేలకూలినట్లుగా, ఆమె నేలమీద పడి ఉంది. ఆమె నగలు చిందరవందరగా పడి నల్లటి ఆకాశంలో నక్షత్రాలలాగా ఆ కోపగృహంలో మెరుస్తున్నాయి.

20. ఆ ది త ప్ప రా దు

సభలో దశరథుడు రాచకార్యాలన్నీ ముగించుకున్నాడు. పట్టాభిషేక మహోత్సవానికి కావలసిన ఏర్పాట్లకు ఉత్తర్వులిచ్చాడు. ఇక ఏ చింతా లేదని సంతోషించి ముద్దుల భార్య కైకేయి అంతఃపురానికి బయలుదేరాడు. రాజధర్మాన్ని అనుసరించి అడగవలసిన వారినందరినీ అడిగి, వారి సమ్మతి పొందింతర్వాతనే పట్టాభిషేకానికి నిశ్చయం చేశారు. గొప్పబరువు దిగి విశ్రాంతి ఏర్పడినప్పుడు శరీరంలో పిచ్చి కోరికలు తల ఎత్తడం సహజం. వెంటనే పోయి భువనైక సుందరి అయిన తన ప్రేయసికి ఈ విషయం ఎరుకపరచి, సరస సల్లాపాలతో సుఖించవచ్చని సంతోషించాడు. తెల్లవారితే ఉత్సవం.

అంతవరకు తనివితీరా భోగాల్లో మునిగితేలవచ్చుకదా అనుకొన్నాడు. ఈ ఆలోచనలతోనే ఆయన అంతఃపురం ప్రవేశించాడు.

చిన్నభార్య నగరు ఎప్పుడూ చాలా అందంగా ఉంటుంది, రమణీయమైన తోట, సరస్సులు, పైకి ఎగిరే పిట్టలు, నీటిలో ఆటలాడే పక్షులు, అందంగా పించాలు విప్పి ఆడే నెమిళ్లూ, చెట్లనిండా రంగు రంగుల పువ్వులూ ఇవన్నీ చూసేసరికి ఆ రాణివాసం ఎన్నడూలేని అందంతో వెలుగుతూ వుంటుందని దశరథుడు అనుకున్నాడు. ఆకాశంలో రాహువు పొంచివున్నాడని తెలియక పదహారు కళలతోనూ నిర్భయంగా ఉదయించిన చంద్రుడిలాగా దశరథుడి ముఖం ఆనందంతో ప్రకాశించింది. కైకేయి అంతఃపురం ప్రవేశించాడు. అక్కడ ఏ దుర్విధి కాచుకొని వుందో ఆయన కేంతెలుసు పాపం !

అంతఃపురంలో సుగంధ ద్రవ్యాలూ, పానీయాలూ యథాస్థానాలలో అమరి ఉన్నాయి. అతనిలో ఉద్రేకం కలిగింది. పరచిన పడక లన్నింటినీ పరికించాడు. ఎక్కడా ప్రియురాలు కానరాలేదు. అతను మక్కువపడి, విలాసాల కోసం ప్రత్యేకంగా తెచ్చుకున్న భార్య కైకేయి. ఆమె ఎన్నడూ రాజవ్యవహారాలలో జోక్యం కలిగించు కోలేదు. ఆమె అంతఃపురంలో ప్రవేశించగానే రాజుకు ఉద్రేకం కట్టలు తెగి పొంగుతుంది. రాజు రాకకు నిరీక్షించి ఎదురువెళ్ళి కౌగలించుకోవడం ఆమెకు పరిపాటి. ఈనాడెందుకో ఆమె కనిపించనేలేదు. రాజు దిగ్భ్రమ చెందాడు. శయ్యలూ, ఆసనాలూ అన్నీ మళ్లీ మళ్లీ బాగా పరికించి చూశాడు. సరసానికి దాగుడుమూతలాడుతూందనుకున్నాడు. సంతోషించాడు. మళ్లీ మళ్లీ అంతటా పరికించి చూశాడు. ఎన్నడూ ఇలా కాలేదే ! ఏమిటి కారణం ? అని ఆలోచించి అక్కడఉన్న ఒక దాసీని అడిగాడు. ఆమె చేతులు జోడించి "దేవరా ! దేవిగారు మహాకోపంతో లోపలికి వెళ్ళిపోయారు" అని విన్నవించింది.

భయపడ్డాడు రాజు. లోపలికి వెళ్ళి మెల్లగా కోపగృహంలో ప్రవేశించాడు. ఎన్నడూ ఊహించని విపరీత దృశ్యం కంటపడింది.

కైకేయి రాజును కన్నెత్తి అయినా చూడలేదు. కల్లాకపటం ఎరగని రాజుకు ఇదేమీ అర్థం కాలేదు. ఎలా అర్థమవుతుంది? అతడు కల్మషంలేనివాడు. కైకేయి మనసు పాపచింతతో నిండి ఉంది. రాజుకు వయస్సు ముదిరింది. ఆమె ఇంకా వయస్సులో వుంది. రాజు కామోద్రేకంతో ఉన్నాడు. ఆ స్థితిలో అతనికేమీ తోచలేదు. పిచ్చివాడిలాగా అయిపోయాడు.

కిందపడుకొన్న కైకేయివద్ద నేలను చతికిలపడ్డాడు. ఆమె తలను మెల్లగా ఎత్తి ఒళ్ళో పెట్టుకొని, తల నిమురుతూ, "ఏమిటిలా పడుకున్నావు. ఒంట్లో బాగుండలేదా? ఏమిటి బాధ? నీకు సేవ చేయడానికి ఘనవైద్యులే కరువైనారా? వెంటనే పిలిపిస్తానుండు. ఇట్టే నయంచేస్తారు" అన్నాడు.

కైకేయి నిట్టూర్పు విడిచింది. మాట్లాడలేదు.

"నగరులో ఎవరైనా నిన్ను సూటి పోటి మాటలతో నొప్పించారా? ఎవరైనా తప్పుచేస్తే నాతో చెప్పు. కఠినంగా శిక్షిస్తాను. నిన్ను తగినట్లు గౌరవించక ఎవరైనా నీకు కోపం తెప్పించారా? లేవా, నేనే నీకేదైనా లోటు చేశానా? చెప్పు!"

ఇలాగా సాధారణంగా గొప్ప ఇళ్లల్లో జరిగే కొరతలన్నింటినీ ఏకరువుపెట్టాడు రాజు.

కైకేయి ఇవేవీ వినిపించుకోనేలేదు. దెయ్యంపట్టిందానిలాగ అలాగే పడిఉంది.

"నీ కేంకావాలో అడుగు రాణీ! ఎవరినైనా శిక్షించాలా? చెప్పు. శిక్షిస్తాను. ఎవరినైనా శిక్షనుంచి తప్పించాలా? చెప్పు. హంతకుడైనా సరే విడిచిపెట్టేస్తాను" అని ఇలాగ రాజు కామానికి, మోహానికీ లోబడి ఆమెను పరిపరి విధాల బతిమాలుకొన్నాడు.

"నాకున్న సర్వాధికారం నీకు తెలియదా? ఎవరికి ఏమివ్వాలి? ఏదేశంలో ఎవర్ని ఏంచేయాలి? చెప్పు. వెంటనే అలా చేయిస్తాను" అన్నాడు.

కైకేయి లేచి కూర్చుంది. రాజుకెంతో సంతోషం కలిగింది. కైకేయి చిలకపలుకులు మొదలు పెట్టింది.

"నిన్ను లెక్కచేయకుండా ఎవరూ మాట్లాడలేదు, ఎవరూ నిందించనూ లేదు. అవమానపరిచింది అంతకన్నా లేదు. రాజా! మీవల్ల కావలసిన కార్యం ఉంది. అది మీరు నెరవేరుస్తానని మాట ఇవ్వాలి. ఇస్తానంటే చెపుతాను."

అది వినగానే కల్లాకపటం లేని మహారాజు మనస్సు ఉప్పొంగి పోయింది. "ఏది కావలిస్తే అది చేయగల శక్తి నాకు ఉండగా, ఇక చింత దేనికి?" అని ధైర్యం తెచ్చుకున్నాడు. ఆయన ముఖం విప్పారింది. "కైకేయీ! వెంటనే చెప్పు. నీకేం కావాలి? ఏది కావాలంటే అది చేస్తాను. దేనిపై ఒట్టుపెట్టమంటావు? నీకు ప్రియమైందేది? స్త్రీలలోకెల్లా నీవే నా ప్రేమకు పాత్రురాలివి. పురుషులలో రామచంద్రుడి కన్నా ప్రియతములు నాకు మరొకరు లేరు. అలాంటి రాముడి పైనే ఆన పెట్టి చెపుతున్నాను. విను, నీవు కోరింది చేస్తాను. మాటకు తిరుగు లేదు" అన్నాడు.

పాపం ముదురుతూ వచ్చింది. "రాముడి పైనే ఆన" అనడంతోనే కైకేయికి ఎక్కడలేని ధైర్యం కలిగింది.

"అయితే సరి! మీరన్నట్టు రాముడి మీదే ఒట్టుపెట్టుకొని చెప్పండి. నేనడిగింది కాదనక ఇస్తానని మరొక మారు శపథం చేయండి" అంది కైకేయి.

"నా ముద్దుల రాణీ! అలాగే! ఇదుగో శపథం చేస్తున్నాను. నా ప్రేమపాత్రుడైన రాముడి మీద ఒట్టు. నేను సంపాదించిన సకల ప్రజ్ఞాలమీదా ఒట్టు. నీవు కోరింది తప్పకుండా ఇస్తాను. ఇది మమ్మాటికీ నిజం" అన్నాడు దశరథుడు.

ఈ సందర్భంలో కైకేయికి తన పాపిష్టి తలంపును గురించి తనకే కొంత సందేహం కలిగింది. "వీలు కాదు. ఇది మహా పాపం. ఒట్టుకోసం, శపథం కోసం ఇంతటి మహా పాపానికి ఒడిగట్టడానికి వీలు లేదు" అని ఒకవేళ రాజు అనేస్తాడేమో అని ఆమెకు జంకు కూడా

కలిగింది. ఆమె లేచి నిలబడింది. చేతులు జోడించి నలుదిక్కులూ చూచి ఉచ్చస్వరంతో "ఓ దేవతలారా! నా భర్త చేసిన శపథానికి మీరంతా సాక్షులు. ఓ సూర్య చంద్ర గ్రహాల్లారా! మీరుకూడా సాక్షులు. ఓ పంచభూతాల్లారా! మీరున్నూ సాక్షులే. ఆడితప్పి ఎరగని నా భర శపథానికి మీరంతా సాక్షులుగా ఉండండి!" అంది.

ఆనందంతో విప్పారిన ముఖంతో దశరథుడు ఆమెను రెప్పవేయకుండా చూశాడు. కామ మోహాలకు లొంగి రాజు మతిభ్రష్టుడై తన వలలో పడ్డాడని ఆమె నిశ్చయించుకుంది. ఆపైన ధైర్యంగా ఇలా మొదలుపెట్టింది:

"మహారాజా, జ్ఞాపకం ఉందా? పూర్వం యుద్ధ భూమిలో మీరు గాయాలు తగిలి ప్రాణాపాయస్థితిలో ఉండగా చీకటిలో నేనే రథాన్ని నడిపి అవతలికి తీసుకోపోయాను. మీ ఒంటిని దూసుకున్న బాణాలను తీసివేసి మీకు స్వస్థత చేకూర్చాను. మూర్ఛతేరిన వెంటనే మీరు ఏమన్నారు నాతో?— 'శత్రువులు నన్ను చంపేసుండేవారు. నువ్వుకదా నా ప్రాణం కాపాడావు. నీకు కావలసిన వరాలు రెండు కోరుకో' అని చెప్పారు. జ్ఞాపకముందా? దానికి నేను, 'ఇప్పుడు అవసరంలేదులెండి. మరెప్పుడైనా కావలసి వచ్చినప్పుడు అడుగుతాను' అని చెప్పాను 'ఇప్పుడు మీ ప్రాణం దక్కడమే నాకు గొప్ప సంతోషం' అనికూడా అన్నాను. జ్ఞాపకం లేదా?" అని ప్రశ్నలు వేసింది కైకేయి.

"ఎందుకు లేదు? బాగా జ్ఞాపకముంది. అంతేనా?— అడుగు ఆ రెండువరాలూ తప్పకుండా అడుగు, ఇప్పుడే ఇస్తాను" అన్నాడు దశరథుడు.

"శపథంచేశారు. రాముడిమీద ఆనవెట్టి మరీ శపథం చేశారు. ఇందుకు దేవతలూ, పంచభూతాలూ సాక్షులుగా ఉన్నారు. ఇదుగో, అడుగుతున్నాను. మాట తప్పకూడదు సుమా: మీ పూర్వీకుల మార్గాన మీరూ సద్గతి పొందగలరు. మరి, మాట తప్పకూడదు. రాముడి పట్టాభిషేకంకోసం చేసిన ఈ సరంజామాతో భరతుడికి పట్టం కట్టండి. ఇది నా మొదటివరం. ఇక రెండవది మీ కుమారుడైన

రాముణ్ని పధ్నాలుగేళ్లు వనవాసం చేసిరమ్మని. వెంటనే దండకారణ్యానికి పంపెయ్యండి. చేసిన ప్రతిజ్ఞను పాటించే తీరాలి. మీ కుల గౌరవాన్ని, పుణ్యాన్ని కాపాడుకొండి'' అంది.

21. పెళ్లామా, పిశాచమా?

ఏమిటిది? చెడ్డకల కన్నానా? మేలుకునే ఉన్నానా? నిద్రిస్తున్నానా? మతిభ్రమ కలిగిందా, నాకు? పూర్వజన్మంలో, చేసుకున్న పాపాలు ఇప్పుడు కళ్లకు కట్టుతున్నవా? లేక ఏదైనా, గ్రహం పట్టి పీడిస్తూందా? పిచ్చి ఎత్తి ఏదో అదేపనిగా చూస్తున్నానా? ఏమీ తెలియడంలేదే!'' అని దశరథుడు చిత్తం తల్లడిల్లగా మనస్సున పుట్టిన భయానికి తాళలేక, తపించి తపించి మైకంతో పడాడు. కొంత సేపటికి కన్నుతెరిచి, పులిని చూసిన లేడిలాగా కైకేయిని చూసి వడ వడ వణికి పోయాడు. "అయ్యో'' అని నేలగూలి కేకలు పెట్టాడు. మంత్రగాడి చేతికి చిక్కిన పాములాగ విలవిల్లాడాడు. మళ్లీ మూర్ఛలో మునిగాడు. చాలాసేపటికి తేరుకొని కళ్లు నిప్పులుగక్కుతూ, "ఓ రాక్షసీ! కులాన్ని చెరచడానికి వచ్చిన పాపాత్మురాలా! నీకేం చెరుపుచేశాడే నా రాముడు? నిన్ను కన్నతల్లిలాగా చూసుకొన్నాడు కాదటే! నీవూ ఒక సామాన్య స్త్రీవే అనుకొన్నాను కాని. విషసర్పానివని తెలియక పోయిందే! తెలియక నిన్ను ఎక్కడనుండో తెచ్చి మెడను వేసుకొన్నానే'' అంటూ దూషించాడు.

కైకేయి మాట్లాడ లేదు.

"దేశమంతా పొగడుతున్న నా రామచంద్రుడినా నేను పంపి వేయడం? కౌసల్యను కాదని బతకగలను. ధర్మస్వరూపిణి అయిన సుమిత్రను విడిచి జీవించగలను. రాముణ్ని విడిచివుంటే నాకు ప్రాణాలు నిలుస్తాయా? నీరు లేకుండా బతకగలను. సూర్యకాంతి లేకున్నా బతకగలను. కాని రాముణ్ని ఓడి ఈ ప్రాణాలు నిలుపు కోడం మాత్రం నా వశంకాదు. ఈ మహాపాపపు ఆలోచన నీ మనస్సులోనుంచి తుడిచెయ్. నీ పాదాలకు శిరస్సు ఆన్చి బతిమాలి అడుగు

తున్నాను. ఎన్నోసార్లు నువ్వే చెప్పావు, నీకు ప్రియమైన బిడలు ఇద్దరు అని. వారిలో పెద్దవాడైన రాముడే నీకు ఎక్కువ ప్రియమైన వాడన్నావు. ఎల్లప్పుడూ నువ్వు మనస్సులో తలుస్తున్నదాన్నే నేను కార్యరూపంగా పెట్టదలచాను. అంతే. అలాంటిది, ఎందుకిటువంటి ఘోర వరాలు అడుగుతున్నావు? కాదు. కాదు. నన్ను పరీక్షిస్తున్నావు. భరతుడిపై నాకెంత ప్రేమ ఉందో చూడ్డానికి ఇలా చేస్తున్నావా? గొప్పకీర్తిని ఆర్జించిన వంశం మనది ఇలాంటి పాపకార్యాలతో ఆ కీర్తి కాస్తా నాశనం చేయకు" అని వేడుకొన్నాడు. అప్పటికీ కైకేయి మాట్లాడలేదు. కాని కోపంతో వాడిచూపులు చూసింది

"ఇంతవరకు నాకు దుఃఖం కలిగించే పని ఏదీ నువ్వు చెయ్యలేదు. పెడసరంగా ఒక్కమాటయినా మాట్లాడలేదు. ఇప్పుడు ఎవరు నీ బుద్ధిని చెరిచారు? ఇది నీకు పుట్టినబుద్ధి అంటే నేను నమ్మను. ప్రేయసీ, భరతుడు కడు ఉదారస్వభావుడేకాని రాముడికి ఎందునా సమానుడుకాడని నీ వెన్నిసార్లు సంతోషంతో నాతో చెప్పలేదు? అలాంటి రాముణ్ణి ఇప్పుడు అడవికి పంపమని జంకులేకుండా చెపుతున్నావు? – రాముడు అడవిలో ఉండగలడా? ఇదేనా నీవు కోరుతూంది? క్రూరమృగాలతో భయంకరమైన అడవికి మన రాముణ్ణి పంపమంటున్నావా? అతడు ఎంత ప్రేమతో నీకు సేవ చేశాడు? అదంతా ఎలా మరచిపోగలిగావు? అతణ్ణి అడవికి పంపమని నోటితో చెప్పడానికి మనస్సు ఎలా ఒప్పింది? ఇంతకూ రాముడు చేసిన నేరం ఏమిటి? ఈ అంతఃపురంలో వందలకొలదీ స్త్రీలున్నారు. వారిలో ఒకరైనా రాముడిమీద ఒక్కమాట, ఒక్కఅపవాదు, ఒక్క తప్పు చెప్పిన వారున్నారా? లోకమంతా వాణ్ణి ప్రేమిస్తూందే! తన గుణాలవల్లా, శీలంవల్లా అతడందరి ప్రేమనూ చూరగొన్నాడే! నీ కెందుకు అతడిపై ఈ కార్పణ్యం? ఇంద్రాది దేవతలతో సమానముగా ఉన్నాడే నా జ్యేష్ఠపుత్రుడు! అతని ముఖాన ఋషులకువుండే తేజస్సుందే! రాముని సత్యం, శీలం, స్నేహభావం, ప్రజ్ఞ, విద్య, శౌర్యం, వినయం, ఈ గుణగణాలను అందరూ కొనియాడు

తున్నారే! అతనినోట ఒక్క పరుషవాక్కు కూడా ఎన్నడూ వచ్చి నట్లు నేను వినలేదే! "నువ్వు అడవికి పో!" అని తండ్రినైన నేను అతడికెలా చెప్పేది? ఇది సాధ్యమా? నేను ముసలివాణ్ణి. ఈ అవసాన కాలంలో నా మీద దయచూపు. కైకేయీ! ఈ రాజ్యంలో గల సంపదలలో ఏది కావాలన్నా కోరుకో! ఇస్తాను. నన్నుమాత్రం యముడి దగ్గరికి పంపకు. నీకు చేతులెత్తి మొక్కుతున్నాను. నీ రెండు పాదాలూ పట్టి బతిమాలుతున్నాను. నీ శరణుచొచ్చాను. రాముణ్ణి కాపాడు. నన్ను అధర్మానికి దింపకు!" అని వేడుకొన్నాడు.

ఇలాగ శోక సముద్రంలో మునిగి దారి దొరక్క ఎన్నోమార్లు స్పృహతప్పి పడిపోయి, భోరున ఏడ్చి, కేకలువేసి, వేదన అనుభవిస్తున్న రాజును చూసిన కైకేయికి కొంచమైనా మనస్సు కరగలేదు. ఆమె నిర్దయగా, క్రూరంగా మాట్లాడ సాగింది.

"రాజా! ముందు వరాలు రెండూ ఇచ్చానని చెప్పి, ఇచ్చిం తర్వాత అయ్యో ఎరక్క ఇచ్చానే అని చింతించి వాటిని కాదంటే, రాజులైన మీకు సత్యాన్ని గురించి, ధర్మాన్ని గురించి మాట్లాడానికి నోరెలా వస్తుంది? మిగతా రాజులలో తల ఎత్తగలరా? 'అవును, నన్ను కాపాడి నాకు ప్రాణదానం చేసిన కైకేయికి వరాలిచ్చాను. తర్వాత అది నాకు నచ్చలేదు. ఆడినమాట తప్పాను' అని చెపుతారా? మరేమంటారు? ఇందువల్ల రాజకులానికే తీరని మచ్చ తెస్తున్నారు. 'రాజులు భార్యలకు మాట ఇచ్చి తప్పుతారు. చెప్పింది చేయరు' అన్న అపకీర్తి మీ రాజకులానికి చుట్టుకుంటుంది. శిబిచక్రవర్తి ఒక పక్షికి మాట ఇచ్చి ఆ మాట నిలుపుకోడం కోసం తన శరీరంలోని మాంస్నానే కోసి ఇచ్చిన సంగతి మీకు తెలియదా? సముద్రం ఒప్పందం చేసుకొని, ఆ ఒప్పందానికి కట్టుపడి గట్టు దాటకుండా నిలిచింది కదా; చేసిన ప్రతిజ్ఞను కాదనకండి. మీరు గొప్పకులంలో పుట్టారు. మీ పూర్వీకుల మార్గాన్ని అనుసరించండి. లేదు, లేదు – మీరు ధర్మాన్ని తప్పి, రాముడికి పట్టంకట్టి, కౌసల్యతో భోగాలు అనుభవిస్తారు. సత్యమెలాపోతే మీకేం? ధర్మం ఎలాపోతే మీకేం? మీరు నాకిస్తానని మాట యిచ్చిన వరాలు ఇవ్వకపోతే, ఇప్పుడే, మీ ఎదుటే విషం

త్యాగి చస్తాను. రాముడికి మీరు ఏనాడు పట్టాభిషేకం చేస్తారో ఆనాడే, మాటతప్పిన మీముందు ప్రాణాలు విడుస్తాను. ఇదే నిశ్చయం. నేను భరతుడిమీద ఆనపెట్టి చెపుతున్నా, వినండి: చెప్పిన మాటప్రకారం రాముణ్ణి అడవికి పంపుతారా సరేసరి. లేకపోతే నేను ప్రాణాలు విడుస్తాను" అని కైకేయి ఖచ్చితంగా చెప్పి ఊరుకుంది.

కనికరమే లేని ఆ భార్య ముఖాన్ని రెప్పవాల్చకుండా చూస్తూ,దశరథుడు అలాగే కొయ్య అయిపోయాడు. ఈమె కైకేయా లేక పిశాచమా అని సందేహంలో పడ్డాడు. తరువాత గొడ్డలివేటుకు పడిన మానులాగా, విరుచుకుపడిపోయాడు.

కొంతసేపటికి తేరుకొని దీనస్వరంతో మెల్లగా ఇలా అన్నాడు. "నీ కీదుర్బోధ చేసి, నీ బుద్ధివిరిచిన వారెవరు? కైకేయీ, వేమ చచ్చాను. నావంశం నశించింది. నిన్నేపిశాచం ఆవహించిందిఁ ఏ భూతం ఇలా సిగ్గులేకుండా ఆడిస్తూంది? నువ్వేమనుకొంటున్నావుఁ నా కుమారుడు భరతుడు తన అన్న అయిన రాముణ్ణి అడవికి పంపి, తాను రాజు అవడానికి ఒప్పుకుంటాడా? ఎన్నటికైనా ఒప్పుకుంటాడా? ఈ సంగతి నీకు తెలియదా? రాముణ్ణి వనవాసానికి వెళ్లమని నా నోటితో నన్ను చెప్పమంటావా? ఇది జరిగే పనేనా? లోకంలో రాజులంతా నన్ను ఏమంటారు? 'భార్య బలవంతానికి లోబడి, ఈ ముసలి రాజు ఉత్తముడైన తన జ్యేష్ఠ కుమారుడు రాముణ్ణి రాజ్యం లేకుండాచేసి తరిమివేశాడే' అని నవ్వి పోరా? ఈపాటి నీకు తెలియదా? రాముణ్ణి అడవికి పంపమని ఎంతో తేలిగ్గా చెబుతున్నావు. రాముడు అడవికిపోతే కౌసల్య బతికి వుంటుందా? నాకు ప్రాణాలు నిలుస్తాయా? పోతే జనకతనయను గురించి ఆలోచించావా? రాముడు దండకారణ్యానికి పోవాలి అన్న మాట చెవిని పడగానే ఆమె ప్రాణాలు విడుస్తుందే! నీవూ ఒక స్త్రీవే అని నమ్మి, భార్యగా స్వీకరించాను. నీ రూపులేఖలు చూసి మోసపోయాను. మతి పోయినవాడు విషం కలిపిన తేనె తాగినట్లు, నీ అందాన్ని చూసి, నన్ను నే మరచి నిన్ను కట్టుకొన్నాను. బోయవాని పాటవిని జింక

వాడి వలలో చిక్కుకున్నట్లు నీవలలో చిక్కుకుని ఇప్పుడు చావ సిద్ధంగా వున్నాను. లోకం 'ఛీ!' అని నన్ను తిరస్కరించి, విడిచి దూరంగా పోతుంది. కల్లుతాగిన బ్రాహ్మణ్ణి చూచి నలుగురూ ఎలా చీవరించుకుంటారో, నా గతీ అంతే!

ఆహా! రక్కసీ! ఎంత క్రూరమైన వరం అడిగావే. నీ కోరిక వల్ల మా కులమే నశించబోతూంది. ఒక ఆడదాని కివఱుడెపోయి తన ముద్దుకుమారుణ్ణి, అడవికి పంపుకొన్న మూఢుడా వీడు అనే అపవాదు నాకు శాశ్వతంగా నిలిచిపోతూందే 'నీవు అడవికి పో' అని నేను రాముడితో చెపితే అతడు మారుమాటాడతాడా. 'పోతున్నా నన్నగారూ!' అని తక్షణమే సంతోషంగా వెళ్లిపోతాడు. ఆ క్షణమందే నేనూ, కౌసల్యా సుమిత్రా ప్రాణాలు విడుస్తాం. ఈ విధంగా సంపాదించుకున్న రాజ్యాన్ని నీవు సుఖంగా అనుభవిద్దువుగాని. ఛీ, పాపిష్ఠిదానా! ఈ పనికి భరతుడు సమ్మతిస్తాడా? దీనికి సమ్మతిస్తే అతడు నాకు ఉత్తరక్రియలు కూడ చేయక్కరలేదు. సిగ్గులేనిదానా! భర్తను పోగొట్టుకొని విధవవై నీ కుమారుడితో హాయిగా రాజ్యాన్ని అనుభవించు!

హా! రాముణ్ణి అడవికి పంపాలా? ఆహా! స్త్రీ స్వభావం ఎంత పాపపంకిలమైందీ? స్త్రీ లెంతటి క్రూరులు! కాదు కాదు. స్త్రీ లందరూ కాదు. ఈ కైకేయి మాత్రమే క్రూరురాలు. అందరినీ నే నెందుకు నిందించడం? పొరపాటు. అయ్యో! భరతుడివంటివాడు దీని కడుపున పుట్టాడే! రామా! నీ కాళ్లు పట్టుకు బతిమాలుతున్నాను. ప్రార్థిస్తున్నాను. మొక్కుతున్నాను. కనికరం చూపు! కాస్త కనికరం చూపించు!" అంటూ ఏడుస్తూనే దశరథుడు నేలమీద పడి పొరలాడు.

* * *

అనేక సంవత్సరాలు రాజ్యపాలనచేసి గొప్ప కీర్తిగడించిన దశరథ చక్రవర్తి నేలను పడి దొర్లుతూ ఏడుస్తూ భార్యాపాదాలంటి బతిమిలాడే ఆ పరిస్థితిని ఏమని వర్ణించాలి? ఆర్జించిన పుణ్యం కాస్తా

ఆయిపోగానే యయాతి స్వర్గంనుంచి జారి భూమిని పడిన దృశ్యంలాగా ఉంది ఇది.

మహారాజు ఎంతదీనముగా ప్రార్థించినా కైకేయి పట్టు వదలలేదు. "మీరు సత్యసంధులు. ఆడినమాట జవదాటనివారు అని ఇన్నాళ్ళుగా అందరివద్దా గొప్పగా చెప్పుకొంటూ ఉండేవారు, ఇప్పుడు దేవతల సాక్షిగా నాకు వరం ఇచ్చికూడా కాదనచూస్తున్నారు. మీరు మాట తప్పితే నేను ప్రాణాలు విడవడం నిశ్చయం" అని ఖండితంగా చెప్పివేసింది.

"అలాగయితే సరే, పాపాత్మురాలా ! రాముడు అడవికి వెళతాడు. నేను చస్తాను. నీవు నాకూ నా వంశానికీ ద్రోహివి. నీ కోరిక తీరి, ఏలాంటి సుఖం పొందగోరుతున్నావో ఆలాంటి సుఖాన్నే అనుభవించు" అన్నాడు దశరథుడు, నిస్పృహగా.

"రాముణ్ణి అడవులపాలు చేసి నువ్వు సాధించే దేమిటి ? లోక నింద పడటం తప్ప నువ్వు బావుకునేది ఏమీలేదు. నామాట నమ్ము. పుత్రభాగ్యంలేక అనేక సంవత్సరాలు తపించి, తర్వాత భగవదను గ్రహంవల్ల రాముణ్ణి కన్నాను. వరప్రసాదంవల్ల కన్న అతణ్ణి ఇప్పుడు అడవి పంపుతున్నాను. ఆహా ! ఇంతకంటె దౌర్భాగ్యమేముంది!" అని ముసలిరాజు విలపించాడు.

తర్వాత అతడు ఆకాశంవంక చూచి "హా! కాళరాత్రీ నీవు తొలగి తెల్లవారితే నేనేం చేసేది ? పట్టాభిషేకానికి ఎదురు చూస్తున్న వారికి ఏం చెప్పేది ? ఆకాశమా ! నా కోసం ఈ నక్షత్రాలతో ఇలాగే నిలిచి ఉండలేవా ? అయ్యో ! వద్దు. వద్దు. అలా అయితే ఈపాపాత్మురాలి ముఖం చూస్తూనే ఉండవలసి వస్తుంది. కాళరాత్రీ ! పో, త్వరగా తొలగిపో! తెలవారితే దీని ముఖం చూడవలసిన బాధైనా తప్పుతుంది" అని ఇలా పిచ్చివాడిలాగా పేలుతూ మూర్ఛలో మునుగుతూ తేలుతూ తీవ్రవేదన అనుభవించాడు అరవైవేల సంవత్సరాలు రాజ్యమేలిన వృద్ధమహారాజు - దశరథుడు.

"కైకేయీ! కనికరించు, నన్ను కనికరించు. నేను పిచ్చి కోపంలో అన్నదంతా మరిచిపో, నీకు నాపైగల ప్రేమ నాకు తెలి

యదా ? మళ్ళీ అడుగుతున్నాను. రాజ్యం నీకు ఇచ్చివేశాననే అనుకో. అది నీదిగానే భావించి నీ చేతులతోనే రాముడికి రేపు పట్టాభిషేకం చేయించు. రేపే మన రాముడికి పట్టాభిషేకమని సభలో పెద్దలకూ రాముడికీ కూడా చెప్పాను. ఆ మాట బోటు పోనివ్వకు. నాపైన దయచూపు. నీ చేతులతో నువ్వు రాముడికి రాజ్యం ఇస్తే ఈలోకం ఉన్నంతవరకూ నిలిచే గొప్ప కీర్తిని పొందుతావు. నా కోరిక, పెద్దలకోరిక, భరతుడికోరిక కూడా ఇదే. అలాచెయ్యి, నా రాణీ!" అని పదేపదే కైకేయి కాళ్ళపై పడి వేడుకొన్నాడు.

అలా వేడుకొంటున్న రాజును చూచి కైకేయి "వీల్లేదు. నోటారా ఇచ్చిన వరాన్ని అబద్ధం చెయ్యకు. సత్యం సత్యం అని అప్పుడు మాటలుచెప్పి ఇప్పుడు అసత్యానికి పాల్పడుతున్నారా ? అలా అయితే ఈ నిమిషాన్నే నా ప్రాణాలు పోతాయని తెలుసుకొండి. వ్యర్థంగా కాలయాపన చేయకండి !" అంది.

"మంత్ర యుక్తంగా నీ చేయిపట్టి అగ్నిదేవుని ఎదుట నిన్ను చేసుకొన్నాను. ఇప్పుడు నిన్ను విడిచి పెట్టాను. నాకూ నీకూ పుట్టిన కుమారుణ్ణి కూడా విడిచిపెట్టాను. రాత్రి పోయి తెల్లవార బోతుంది. పట్టాభిషేకం లేదు. లేదు. నేను రాముడికి పట్టాభిషేకం చెయ్యటానికి బదులుగా రాముడే నాకు ఉత్తరక్రియలు చేస్తాడు" అన్నాడు రాజు.

"అనవసరంగా పరితపిస్తున్నారు. రాముడికి కబురంపి వెంటనే ఇక్కడికి రప్పించండి, భరతుడికే రాజ్యం అని చెప్పి, రాముణ్ణి వనానికి పంపి. సత్యవాక్య పరిపాలన చేయండి. ఆలస్యం చెయ్యకండి" అని కైకేయి తొందర పెట్టింది.

"అలాగా ?" అన్నాడు దశరథుడు. "సరే ఒక్కసారి నా రాముడి ముఖమైనా చూస్తాను. నా చావు నిశ్చయం. వెంటనే అతణ్ణి రమ్మను. చచ్చేముందు అతని ముఖమైనా చూస్తాను. సత్యమనే తాడుతో కట్టువడిన ఈ మూఢుడు, ఈ ముసలిరాజు ఇంకేం చెయ్యగలడు ?" అంటూ దీన స్వరముతో చెప్పి మళ్ళీ మూర్ఛలో పడిపోయాడు.

22. కైకేయి ఆశ్చర్యం

ఒకపక్క రాముడిపై గల ప్రకృతిసహజమైన గాఢప్రేమ, మరొక పక్క ఆడినమాట తప్పడం తనవంటివానికి తగునా అన్న ధర్మ సంకటం దశరథుణ్ణి బాధించింది. కైకేయి కడకు కరుణిస్తుంది, ఈ ధర్మసంకటం తీరుతుంది అని దశరథుడు ఆశించాడు. కాని అది కేవలం అడియాస మాత్రమేనని ఇప్పుడు తేలిపోయింది.

ఇక మిగిలివున్న కడపటి ఆశ ఒక్కటే. అదేమిటంటే తానిచ్చిన వరాలకు కట్టుబడవలసిన పని రాముడికి లేదు. కనుక, తన ప్రతిజ్ఞ విషయంలో అతని కెందుకు ధర్మసంకటం ? అతనికా, బలం ఉంది. పరివారం ఉంది. అతడు తన మాటకు అడ్డుచెప్పనూవచ్చు, కాని అది అతని స్వభావానికే విరుద్ధం అయినా, ఒకవేళ దేవుడి దయవల్ల తన్నెదిరించే తలంపు అతడికి కలగకూడదా ? అలా జరిగితే తన సత్యవ్రతానికి భంగం వాటిల్లదు. అతడు తన్నెదిరిస్తే చాలును వంశ గౌరవం, ధర్మం, ప్రజల కోరిక అన్నీ దక్కుతాయి. రాముడు తన మాట వినకుండా పోతే అన్నీ సక్రమంగా జరిగిపోతాయి.

దశరథుడి ఆలోచనలు ఈ విధంగా సాగిపోయాయి. పితృ వాక్య పరిపాలనమనే ధర్మాన్ని రాముడు తిరస్కరించడు అన్న విషయాన్ని దశరథుడు మరిచిపోయి, శోకంతో నిండి చికాకుగా ఉన్న తన మనస్సును ఊరడించుకొన్నాడు.

తనకు మరణం తప్పదని ఆయన నిశ్చయించుకొన్నాడు. ఈ ధర్మసంకట స్థితిలో అది కొంత ఊరడింపు. తర్వాత రాబోయే కష్టాలను తన కళ్ళతో చూడవలసిన పని ఉండదుగదా ?

మృత్యువు ఆసన్నం కాగానే పూర్వపు విషయాలు గుర్తుకు వచ్చాయి. చిన్ననాడు తానుచేసిన ఒక పాపం గుర్తుకు వచ్చింది. "దాని ఫలితమే ఇప్పుడు అనుభవిస్తున్నాను. ఋషికుమారుణ్ణి చంపి అతని ముసలి తలిదండ్రులకు ఎంత దుఃఖం కలిగించాను ! అది ఊరికే పోతుందా ? అదేమో స్తరుగా నేను కూడా పుత్రుని వీడిన

శోకాన్ని అనుభవిస్తే, ఆ పాపం తీరుతుంది" అని దశరథుడు తన మనస్సును సమాధాన పరచుకున్నాడు.

ఏది ఏమైనా, క్రూరురాలైన భార్య తనవద్ద పొందిన వరాలను తీర్చడం తప్ప, వేరు మార్గంలేదని నిశ్చయానికి వచ్చాడు. కనుక కాగల పనినంతటిని కైకేయికే విడిచిపెట్టాడు.

* * *

తెల్లవారింది. సుముహూర్తం సమీపిస్తూంది. వసిష్ఠుడూ, ఆయన శిష్యులూ బంగారుపాత్రల్లో పుణ్యానదుల తీర్థాన్నీ, పట్టాభిషేకానికి కావలసిన ఇతర సంభారాలను పట్టుకుని రాజవీధిని బయలుదేరారు. మహోత్సవానికి వీధులన్నీ అలంకరింపబడి వున్నాయి. ప్రజ బారులు తీర్చి నిలబడ్డారు. ఎప్పుడెప్పుడు ! అని కుతూహలంతో ఎదురుచూస్తున్న ప్రజలు వసిష్ఠమహర్షినీ ఆయన శిష్యులనూ చూసి పరమానందభరితులయ్యారు. పూర్ణకుంభాలు, ధాన్యాలు, రత్నాలు, తేనె, పెరుగు, నేయి, పేలాలు, దర్భలు, సమిధలు, పూలు, పాలు, పండ్లు, ఏనుగు, గుర్రం, రథం, వెల్లగొడుగు, చామరం, ఆబోతు, వ్యాఘ్రాజినం, ఇవన్నీ మంగళవాద్య ఘోషతో కొనిపోవడం చూసిన జనులలో కోలాహలం, ఉత్సాహం ముకుపటికన్న ఎక్కువయ్యాయి.

వసిష్ఠుడు నగరువాకిట సుమంత్రుణ్ణి చూసి "అందరూ కని పెట్టుకున్నారు. ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయని రాజుగారికి వెంటనే తెలియజేయండి" అన్నాడు.

సుమంత్రుడు చేతులు జోడించి నమస్కరించి రాజ శయనాగారం వెలుపల నిలిచి మామూలు ప్రకారం మంగళస్తుతి చేసి వసిష్ఠుని వాక్యాలు నివేదించాడు.

"ఇంద్రుడితో సమానుడవైన ఓరాజా ! ఇంద్రుని సూతుడైన మాతలిలాగా నేను తమను మేల్కొల్పుతున్నాను. దేవతలందరూ తమకు విజయం చేకూర్చేదరుగాక ! పెద్దలూ, సేనాధిపతులూ, నగరాధిపతులూ తమ దర్శనానికై వేచి ఉన్నారు. నిశాదేవి మరుగైంది. తమ ఆజ్ఞలను శిరసావహించడానికి ఉదయం నిలిచి ఉంది.

రాజాధిరాజా, లేచి అనుగ్రహించాలి. వసిష్ఠభగవానుడు బ్రాహ్మలతో వేచివున్నారు'' అన్నాడు సుమంత్రుడు.

ఆ సమయాన రాజు మాట్లాడే స్థితిలో లేడు. అతని వేదన అతిశయించి వుంది. కనక రాజుకు బదులు కైకేయి సుమంత్రునితో ధైర్యంగా ఇలా చెప్పింది :

"సుమంత్రా ! మహారాజుగారు రాత్రి అంతా నిద్రలేక రామ పట్టాభిషేకాన్ని గురించే మాట్లాడుతూ గడిపారు. "ఇప్పుడే అలసి కొంచెం నిద్రపోతున్నారు. శీఘ్రంగా వెళ్లి రాముణ్ని తోడ్కొని రండి !" అని చమత్కారంగా చెప్పి సుమంత్రుణ్ని రాముని వద్దకు పంపింది.

దశరథుడు తన ఆలోచనకు ఒప్పుకున్నాడు. అయినా దాన్ని పూర్తి చేయగల శక్తి ఆయనకు లేదు. కనక ఇక చేయవలసిందంతా తానే చేయాలని కైకేయి నిశ్చయించుకుంది.

* * *

సుమంత్రుడు రాముడి నగరుకు వెళ్లాడు. అప్పుడే సీతారాములు మహోత్సవానికి సిద్ధమవుతున్నారు.

ఆ సమయానికే సుమంత్రుడు వెళ్లి, ''మహారాజుగారూ, చిన్న రాణీగారూ తమర్ని వెంటనే దయచేయమన్నారు'' అని మనవి చేశాడు.

రాముడు వెంటనే బయలుదేరాడు. ఈ ఆలస్యమూ ఈ తంతూ చూస్తే అందరికీ ఏదో సందేహం కలిగింది. అయినా ఎవరికీ అసలు విషయం మాత్రం బోధపడలేదు, దాన్ని గురించి మాట్లాడాలనే తలంపుకూడా కలగలేదు. అన్నీ సవ్యంగానే జరిగిపోతాయనే నమ్మకంతో ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు.

వీధుల్లో చూడబోతే ఒకటే ఉత్సాహం ! ఒకటే కోలాహలం! సుముహూర్తం దగ్గరపడింది. ఇదిలా ఉండగా అక్కడ అంతఃపురంలో ప్రజలు ఎన్నడూ ఊహించని పనులు జరుగుతున్నాయి.

అనవసరంగా, ఏమిటీ జాగు? శాస్త్ర ప్రకారం జరిపించవలసిన కార్యకలాపాలను ఊరికే పొడిగిస్తూ పోతున్నారా, అని ప్రజ లనుకొన్నారు.

వీధుల్లో ప్రజాసమూహంమధ్య కోలాహలం అంతకంతకు అధికమైంది.

సుమంత్రుడు రాముణ్ని తీసుకువచ్చాడు. జన సమూహాన్ని మెల్లగా ఒత్తిగించి, తోవ చేసుకొని వాళ్లు వెళ్లారు. అంతఃపురంలో తండ్రిగారి శయనాగారంలో రాముడు ప్రవేశించాడు. ప్రవేశించిన వెంటనే పామును తొక్కినవాడిలాగా రాముడు బెదిరిపోయాడు! అక్కడ దశరథుని స్థితిని చూసి, రాముడికి ఏమీ బోధపడలేదు.

రాజు ఏదో గొప్పదుఃఖంలో మునిగివున్నాడు. అతని ముఖం ఎండకు వాడిన మలిపూవులాగా ఐపోయింది? తండ్రి పాదాలకు నమస్కరించాడు, రాముడు. తర్వాత కైకేయికి కూడా పాదాభి వందనం చేశాడు.

దశరథుడు "రామా" అని ఒక్కమాట మాత్రమే దీనస్వరంతో అనగలిగాడు. ఆ తర్వాత ఆయన మాట్లాడలేకపోయాడు. కన్నెత్తి రాముడి ముఖంకూడా చూడలేకపోయాడు.

తనతో మాట్లాడలేక, చూడలేక, పడుకొనివున్న తండ్రి స్థితిని చూసి రాముడికి భయమూ వేసింది, ఆశ్చర్యమూ కలిగింది.

* * *

భరింపరాని వేదనలో ఉన్న మహారాజును చూసిన రాముడికి ఏమీ బోధపడలేదు. అతడు కైకేయిని చూసి "అమ్మా! ఏమిటిది? ఆశ్చర్యంగా ఉందే!— ఎంతకోపం ఉన్నా నాన్నగారు నాతో ఇంపు గానే మాట్లాడతారే! తెలియక నే నేదైనా నేరం చేశానా? నాయనగారికి అకస్మాత్తుగా ఈ అనారోగ్యం ఏమిటి? ఎవరైనా ఆయనకు కోపం గలిగించే మాటలు అన్నారా? దయచేసి జరిగింది జరిగినట్టు చెప్పమ్మా. ఈ స్థితి భరించలేనమ్మా!" అన్నాడు.

ఇలా రాముడు దుఃఖంతో, ఆశ్చర్యంతో, అడిగిన ప్రశ్నలకు కైకేయి సంకోచం లేకుండా, తన పని నెరవేరే ధోరణిలో జవాబు చెప్పింది :

"చక్రవర్తికి ఎవరిమీదా కోపంలేదు. ఏదో ఆయన మనస్సులో ఉన్న విషయం నీతో చెప్పడానికి భయపడుతున్నారు. అంతే. ఆ విషయం చెపితే నీవు బాధపడతావని ఆయన భయం. అందుచేత మాట్లాడ లేకుండా ఉన్నారు. మునుపు ఒకప్పుడు నన్ను మెచ్చుకుని నాకు వరం ఇచ్చాడు. ఇప్పుడు ఎందుకిచ్చానా అని పామరులవలె చక్రవర్తి చింతిస్తున్నారు. ఇది ఆయనకు తగదు. రాజైనవాడు మాట ఇచ్చిం తర్వాత విచారించటం వట్టి పెర్రితనం. ఆయన ఇచ్చిన వరాన్ని నెర వేర్చడం నీ చేతిలో పని. నీకు చెప్పడానికి భయపడి ఇచ్చిన వరాన్నీ, చేసిన ప్రతిజ్ఞనూ అబద్ధాలపాలు చేయాలని యోచిస్తున్నారు. ఇది ఆయనకు తగదు. 'భయపడకండీ. నా కోసం మీరు ఆడితప్పకండి' అని నీవు ఆయనకు ధైర్యం చెప్పగలిగితే ఆయన మాట్లాడుతారు. ఆయనకు నీవు సహాయం చేయాలి. ఇప్పుడంతా నీ చేతిలో ఉంది. 'మాట నెరవేరుస్తాను. దానికి అడ్డులేదు' అని ముందు నాకు మాట ఇస్తే తర్వాత విషయం చెపుతాను" అంది.

ఇది విన్న రాముడు చాలా విచారించాడు. రాజు పక్కన నిలిచిన కైకేయిని చూచి ఇలా అన్నాడు :

"అమ్మా ! నన్నుగురించేనా ఈ కష్టం ? నా విషయంలో మీరీవిధంగా సందేహించడం బాగాలేదు. నేనంత చెడిపోయినవాణ్ణి కాను. నన్ను నాన్నగారు నిప్పుల్లో దూకమన్నా దూకుతానని మీ రెరుగుదురుకదా ? ఇదిగో అమ్మా ! శపథం చేస్తున్నాను. విను. దేనికీ విచారించవలసిన పనిలేదు చక్రవర్తి ఇలా చేయాలి అని నావల పిలెన పనికి ఆజ్ఞాపించవచ్చు. ఆయన ఏం చెప్పినానరే. శిరసా వహిస్తాను. ఇది ముమ్మాటికీ నిజం" అన్నాడు.

* * *

ఇలా రాముడు అనగానే కైకేయి "పని పూర్తి అయింద"ని సంతోషించింది. ఇక తప్పించుకోడానికి వీల్లేదని రాజు దుఃఖంలో మునిగిపోయాడు.

అప్పుడు పాపాత్మురాలు కైకేయి కొంతైనా సిగ్గూ ఎగ్గూ, దయా దాక్షిణ్యం లేకుండా ఇలా చెప్పింది:

"నాయనా, రామా! నీవు చెప్పినమాట నీకే తగును. తండ్రిని సత్యసంధుని చేయడం కన్న కుమారునికి గొప్పకార్యం మరేముంది? విషయాన్ని ఇప్పుడు చెపుతున్నాను విను. చక్రవర్తి నీకావిషయం చెప్పడానికి ఎందుకు భయపడ్డారో నీకు బోధపడుతుంది. ఒకప్పుడు శంబరుడితో నీ తండ్రి యుద్ధంచేసి గాయపడ్డారు. అప్పుడు నేను ఆయన ప్రాణాలు కాపాడాను అప్పుడాయన నా కిష్టమైన రెండు వరాలు ఇస్తానన్నారు. కాని, నేను "ఇప్పుడు వద్దులెండి. అవసరమైనప్పుడు అడుగుతా" నన్నాను. అలాగే నని ఆయన ఒప్పుకున్నారు. ఇప్పుడు ఆ వరాలను అడిగాను. ఆయన ఇచ్చారు. భరతుడికి పట్టాభిషేకం చేయాలనీ, ఈ రోజే నువ్వు రాజ్యం విడిచి వనవాసానికి పోవాలనీ ఈ రెండు వరాలనూ చక్రవర్తి నాకు ప్రసాదించారు. ఇక నీవు నీ ప్రతిజ్ఞనూ, నీ తండ్రిగారిచ్చిన మాటనూ నిలబెట్టాలి. ఇక ఆలస్యం చేయకుండా నీ కోసం తెచ్చిన పుణ్యాజలాలతోనే భరతుడికి పట్టాభిషేకం జరిపించాలని చెప్పు. జడలూ, నారబట్టలూ ధరించి నీవు వెంటనే దండకారణ్యానికి బయలుదేరు. 'ఇందుకు ఒప్పుకున్నాను' అని చెప్పి చక్రవర్తికి వచ్చిన కష్టాన్ని తీర్చు. దీనివల్ల నీకూ కీర్తి వస్తుంది" అంది కైకేయి.

"కీర్తి వస్తుంది" అని కైకేయి నోటవచ్చిన మాట నిజమే. అందుకనే హిమవత్పర్వతమూ, గంగానదీ, సముద్రమూ ఉన్నంత వరకు రామునికీర్తి ఉండటం నిశ్చయం.

ఇదంతా వింటూ ఉండిన దశరథుడి హృదయం తల్లడిల్లింది. అయితే కైకేయికి ఒకటే ఆశ్చర్యం. రాముని ముఖంలో దుఃఖమన్నది ఎక్కడా మచ్చుకైనా కనబడలేదు. ఎప్పటిలాగానే చిరునవ్వుతో ఇలా అన్నాడు:

"అలాగేనమ్మా! నాన్నగారి మాట నెరవేరుస్తాను. ఇప్పుడే జడలూ, నారబట్టలూ ధరించి అడవికి వెళుతున్నాను" అన్నాడు.

* * *

రాముడు కైకేయిని చూసి గంభీరంగా ఇంకా ఇలా అన్నాడు :

"అమ్మా! నాకేమాత్రమూ దుఃఖంలేదు. భరతుడికి ఏం కావాలన్నా సరే ఇస్తాను అదే నాకు పరమసంతోషం. మీరెవరూ అడక్కుండానే నేను అతనికి ఇద్దును. ఇక తండ్రిగారి ఆజ్ఞ అయిం తర్వాత ఒక్కక్షణమైనా వెనకాడుతానా ? అటువంటప్పుడు చక్ర వర్తి ఇలా సందేహించటం ఎందుకో నాకర్థం కావటంలేదు. తన కోరికను నాకు సూటిగా చెప్పడానికి ఆయనకు ఎందుకు సిగ్గు ? ఆయనకు నేను దాసుడను కదా ? ఆయన మాటను నిలపడంకన్న నాకు కావలసింది ఏముంది ? అంతకన్న నాకు భాగ్యం ఏముంది ? ఇందుకేనా నాన్నగారు నాతో ప్రేమతో మాట్లాడటం మానేసి ముఖం తిప్పుకొని కుమిలిపోతున్నారు ? ఆయనే స్వయంగా నన్ను పిలిచి ఈ మాటలు చెప్పకపోవడం నన్ను బాధిస్తూంది. ఏమైనా సరే, ఈరోజే ఏ విచారమూలేక అడవికి వెళుతున్నాను. వెంటనే దూత లను పంపి భరతుణ్ణి రప్పించే ఏర్పాట్లు చేయండి. ఆలస్యం చేయ కండి" అన్నాడు.

రాముడి ముఖం ఆ సమయంలో ఆజ్యంపోసిన అగ్నిలోగా తేజస్సుతో ప్రకాశించింది. పాపాత్మురాలైన కైకేయి మాత్రం తాను విజయం పొందినట్లు సంతోషించిందే కాని రాబోయే ఆపదలు తెలుసుకోలేక పోయింది. ఆడడానికి కన్నకొడుకుచేత మాటపడటం కన్న వేరే దుఃఖం ఏముంది ?

* * *

నాలుగుపక్కలా అడగించగా, మధ్య చిక్కిన అడవి ఏనుగు లాగా దశరథుడు పరితపిస్తూ ఉండగా కైకేయి నిర్లక్ష్యంగా "పిత్ర వాక్యం పరిపాలించటంలో ఆలశ్యం ఎందుకు?"- అని రాముణ్ణి తొందరపెట్టింది.

"అమ్మా నన్ను నీవు తెలుసుకోలేదు" అన్నాడు రాముడు. "తండ్రి మాటను నెరవేర్చడంకన్న గొప్పసుఖం నాకు మరొకటిలేదు. ఈ సంపదకు ఆశపడతానని అనుకోవద్దు. భరతుడు రాజ్యభారం

వహించి ముసలితండ్రిని చక్కగా చూస్తూ ఉంటే అదే నాకు పరమానందం.''

ఇదంతా వింటున్న దశరథుడు "హా" అని కేకలువేస్తూ వల వల ఏడ్చాడు. రాముడు చక్రవర్తికీ, కైకేయికీ పాదాభివందనం చేసి తక్షణమే అక్కణ్ణించి బయలు దేరాడు.

* * *

రాముడి వెనకాలవున్న లక్ష్మణుడు కోపంతోనే రాముణ్ణి అనుసరించాడు.

దారిలో అభిషేక జలాలుగల పూర్ణకుంభాలు కానవచ్చాయి. మనస్సులో ఏ మాత్రమూ దుఃఖంలేక గంభీరంగా రాముడు వాటికి ప్రదక్షిణం చేసి వెళ్లాడు. తన వెంటనున్న వెల్లగొడుగు చామరం మొదలైన రాజలాంఛనాలను విసర్జించాడు. అక్కడవున్న పురజనులకు వీడ్కోలుచెప్పి, కౌసల్యాదేవి అంతఃపురానికి వెళ్ళాడు. తల్లికి విషయమంతా చెప్పి అడవికి వెళ్లేందుకు ఆవిడ అనుజ్ఞకూడా పొందాలని రాముడి కోరిక.

* * *

ఈ ఘట్టంలో కలిగే భావావేశాన్ని రాతలో చదివి తెలుసుకోటం కష్టం. ఎవరికిగల కల్పనా సంపదతో వారు మనస్సులోనే ఆ ఉదంతాలను చూడాలి. దశరథుడి అంతరంగమూ, రాముడి అంతరంగమూ, ఆశకు బలి అయిన భరతమాత అంతరంగమూ జీవితంలో నిత్యమూ అతలాకుతలమయ్యే మన అంతరంగాల లాంటివే.

వాల్మీకి తన దివ్యదృష్టితో రామచరిత్రను సందర్శించి గానం చేశాడు. కంబరుకవికూడా అలాగే గానం చేశాడు. ఆచార్యులు కూడా హృదయాలు కరిగేలాగా పాఠం చెప్పారు. రామాయణ గాథను ఎక్కడ చెప్పుతున్నా అక్కడ "బాష్పవారి పరిపూర్ణలోచను'' డై అంటే నీళ్లతో నిండిన కళ్లతో ఆ నేయుడు చేతులు జోడించి వింటూ నిలబడతాడని పెద్దలు చెప్పడంలోవుండే ఆంతర్యం ఇదే.

ఈ ఘట్టాన్ని భక్తితో చదివిన స్త్రీ పురుషులకు ఎప్పుడెలాంటి దుఃఖంవచ్చినా ఆ దుఃఖాన్ని భరించేశక్తి శ్రీ రాముడి కృపవల్ల కలుగుతుంది.

23. కోపం - శాంతం

రాముడు కౌసల్యాదేవి నగరుకు వెళ్ళాడు. అక్కడ బ్రాహ్మలు, అతిథులు, స్త్రీలు అంతా సంతోషంతో పట్టాభిషేక సుముహూర్తానికి ఎదురు చూస్తూవున్నారు. కౌసల్యాదేవి తెల్లటి చీరకట్టుకుని, కుమారుడి క్షేమంకోసం నేతితో హోమం చేస్తూ దేవతలను ప్రార్థిస్తూంది. రాముడు రాగానే లేచి కౌగలించుకొని శిరస్సు మూర్కొని యువరాజు కాబోయే కుమారుణ్ణి ఉచితాసనంమీద కూచోబెట్టింది.

"అమ్మా! నాకు ఈ ఆసనం తగదు. నేలమీద దర్భలు పరిచి కూచోవలసిన తపస్విని నేను. నీకు దుఃఖం కలిగించే వార్త ఒకటి తెచ్చాను. శాంతంగా విని, నన్ను ఆశీర్వదించు" అని రాముడు జరిగిందంతా సంగ్రహంగా కౌసల్యకు తెలియపరచాడు.

"నాన్నగారు రాజ్యాన్ని భరతుడికి ఇవ్వగోరుతూన్నారు. నేను పధ్నాల్గు సంవత్సరాలు దండకారణ్యంలో ఉండాలని ఆయన ఆజ్ఞ. సీతో చెప్పి సెలవు తీసుకొని ఈ రోజుననే నేను వెళ్ళవలసి ఉంది." అన్నాడు.

ఇది వినగానే మొదలు నరికిన అరటిచెట్టులాగా చతికిలబడిపోయింది, కౌసల్య. రామలక్ష్మణులు ఆమెను లేవనెత్తి కూచోబెట్టారు.

"నా హృదయం ఇనుమా ? రాయా ? నేనింకా ప్రాణాలతో ఎలా ఉన్నాను ?" అని కొడుకును కౌగలించుకొని కౌసల్య బావురుమంది.

కౌసల్య దుఃఖాన్ని లక్ష్మణుడు సహించలేక పోయాడు. చక్రవర్తిమీద అతనికి చాలా కోపం వచ్చింది. ఆ కోపంతో ఇలా అన్నాడు:

"మహాపాపాలు చేసిన దుర్మార్గులకు విధించే శిక్షను ఈ ముసలి రాజు రామచంద్రుడికి విధించాడు. ఇంతటి శిక్ష విధించడానికి రాముడు చేసిన తప్పు ఏమిటి ? విరోధులుకూడా రాముడిలో తప్పు లెంచలేదే. ఈ ముసలితనంలో మా తండ్రికి మతిపోయింది. ఇక ఈయన రాజుగా ఉండడానికి తగడు.

ఆడదాని మాటలు విని అధర్మానికి పాల్పడ్డవాడు రాజుగా ఎలా అవుతాడు? శత్రువులుకూడా నిన్ను చూస్తే వాత్సల్యం చూపుతారు. అలాంటి నిన్ను అడవికి పొమ్మంటున్నాడే. అన్నా ! నీవూ నేనూ కలిసి ఈయనను తుదముట్టించి నేటినుంచి ఈ రాజ్యాన్ని ఏలుదాం. మనల్ని ఎవరు ఎదిరించగలరు ? ఎవరైనా ఎదిరిస్తే వాళ్ళని హతమారుద్దాం. నీవు అనుమతిస్తే చాలు. నే నొక్కడినే చూచుకుంటాను. భరతుడు రాజు అవుతాడట ! నీవు అడవికి వెళ్ళాలట ! ఔవ్వ ! లోకం నవ్వదూ ? నీవు దీనికి సమ్మతించకు. నే నూరుకోలేను, ఎదిరించేవాళ్ళందరినీ హతమార్చి ఏ యుద్ధాలూ లేకుండా నీ రాజ్యం నీకు దక్కేలాచేస్తాను. ఆపాటిశక్తి నాకుంది. సూర్యుడు ఉదయించడానికి బదులు పెనుకచీటి ఆవరించింది పట్టాభిషేకంకోసం ఎదురుచూస్తూ ఉంటే వనవాసం అంటున్నాడు. రాజు. ఈ అధర్మాన్ని సహించి మంచిమాటలు చెప్పడంవల్ల ప్రయోజనంలేదు. ఇక నేను ఏ మాత్రమూ సహించలేను. నా ధర్మాన్ని నేను నెరవేర్చి తీరుతాను. అమ్మా ! చూడండి. నువ్వూ, అన్నా చూడండి, ఈ లక్ష్మణుడి శక్తి" అన్నాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడి మాటలు విని కౌసల్య ఊరట చెందింది. అయినా భరతుణ్ణి రాజ్యాధికారంనుంచి తొలగించడం, రాజ్యాన్ని ఆక్రమించుకోడం మొదలైన అకార్యాలను గురించి విని భయపడింది.

"రామా ! లక్ష్మణుడు చెప్పినమాటలు చక్కగా ఆలోచించి చూడు. అడవికి పోవద్దు పోతే ఒంటరిగా ఈ శత్రువులమధ్య నేనెలా ఉండగలను ? నేనుకూడా నీతో వచ్చేస్తాను" అంది కౌసల్య.

తమ్ముడు చెప్పిన మాటలన్నీ రాముడు శాంతంగా విన్నాడు. లక్ష్మణుడి కోపం పూర్తిగా పొంగి దానంతట అది తగ్గిపోవాల్సిందే.

అంతేగాని, ఆ కోపాన్ని అణచడం సాధ్యంకాదు. అందుకనే ఆ కోపం అంతా తీరేలాగా లక్ష్మణుణ్ని మాట్లాడనిచ్చాడు, రాముడు.

తర్వాత కౌసల్యాదేవిని చూచి "అమ్మా! నాతో ఎవరూ అడవికి వస్తామనవద్దు. వృద్ధుడైన నాన్నగారికి శుశ్రూషచేస్తూ మీరు ఇక్కడే వుండాలి. అది మీ కర్తవ్యం. మహారాజును భర్తగా బడిసిన పటమహిషి భరలేని స్త్రీలాగా నాతో అడవికి రావచ్చునా? కూడదు. నేను వనవాసం పూర్తిచేసి తిరిగి వచ్చేస్తాను. అందరమూ సుఖంగా వుందాం. తండ్రిగారి మాట ధర్మమైనా, అధర్మమైనా, స్వయంగా చెప్పింది అయినా, చెప్పుడుమాటలు విని మోసపోయి చెప్పిందైనా, ఏదైనా సరే శిరసావహించడం నా కర్తవ్యం. ఈ ధర్మాన్ని నేను తిరస్కరించి ఎంత సంపదపొందినా, ఎట్టి పదవిని పొందినా దీనివల్ల నాకు సుఖమూ ఉండదు,కీర్తీ ఉండదు. లక్ష్మణా! నీ ఆలోచన తప్పు. నీశక్తి నేనెరుగుదును. అందర్నీ ఓడించి, హత మార్చి నాకు నీవు రాజ్యం సంపాదించి ఇవ్వగలవు. అందులో సందేహం లేదు. నాపై నీకెంత ప్రేమ ఉందోకూడా నాకు తెలుసు. పితృవాక్య పరిపాలన అన్నది చాలా గొప్ప ధర్మం. ఆ ధర్మాన్ని వదిలివేసి ఎంత గొప్ప ఐశ్వర్యం సంపాదించినా ఫలితం ఉండదు. అది మన వంశానికే తీరని మచ్చ" అన్నాడు.

ఇలాగ రాముడు వాళ్ళిద్దర్నీ సమాధానపరచడానికి ప్రయత్నించాడు. కానైతే, లక్ష్మణుడి కోపం అంత సులభంగా చల్లారుతుందా? తన వ్యవహారం అయితే కోపం సులభంగా తగ్గి ఉండేదేమో. నిష్కారణంగా రాముడికి దుఃఖం కలిగిందనీ అన్యాయం జరిగిందనీ లక్ష్మణుడికి కోపం వచ్చింది. ఆ కోపం చల్లారదు. పడగ విప్పి బుస కొట్టే తాచుపాములాగ కళ్ళల్లో నిప్పులు చెరుగుతున్న లక్ష్మణుణ్ని కూచోబెట్టి రాముడు మెల్లగా ఇలా నచ్చజెప్పాడు:

* * *

"తమ్ముడూ! నీవు నా బయటి ప్రాణానివి. నేను చెప్పేది విను. నీవు చాలా ధైర్యశాలివి. నా విషయంలో కలిగిన కోపాన్ని దుఃఖాన్ని అణచుకోవాలి. ఆ కోపం నీకు వెర్రెత్తిస్తుంది. దానికి

తావివ్వకు. ధర్మానికి కట్టుబడి ఉంటే, ఇప్పుడు మనకు కలిగిన ఈ అవమానాన్ని గొప్ప సంతోషంగా మార్చుకోవచ్చు. పట్టాభిషేకాన్ని మనం పూర్తిగా మరిచిపోయి మన మనస్సులను ఇతర మార్గానికి మళ్ళిద్దాం. కన్నతండ్రి స్థితి ఇప్పుడెలా ఉందో ఆలోచించి చూడు. ఆయనకు ఎలాంటి భయం పట్టుకుందో తెలుసుకు నడుచుకుందాం. ఏ కారణంవల్ల నే తేనేమి ఆయన మాట ఇచ్చారు. ఇప్పుడు ఆడినమాట తప్పితే అసత్యదోషం, చుట్టుకుంటుంది. ఇంతవరకు ఆయన చేసిన దానాలు, ధర్మాలు, పుణ్యకార్యాలు అన్నీ నిష్ఫలమైపోతాయి. ఈ భయంతోనే మన తండ్రిగారు వేదనపడుతున్నారు. ఆయన భయం తీర్చడమేగదా మన కర్తవ్యం? నన్ను గురించి ఆయన చింతిస్తున్నారు కాని నాకు దుఃఖం ఏమాత్రమూ లేదు. నీకుకూడా దుఃఖం లేదని చెప్పి ఆయన సందేహాన్ని పూర్తిగా పోగొట్టి ఆయనకు మనం ఒకదారి చూపవలసి ఉంది. మన జన్మదాత అయిన తండ్రిగారి భయాన్ని పోగొట్టి ఆయన మనస్సు కుదుటపడేటట్లు చేయడం మన కర్తవ్యం. పరలోకాన్ని గురించి తండ్రిగారు భయపడుతున్నారు. ఆ భయాన్ని మనం పోగొట్టాలి. ఇంతవరకూ మనం ఆయనకు ఎటువంటి దుఃఖంగానీ, అసంతృప్తికాని కలిగించలేదు. ఇప్పుడు ఆయన పరలోకాన్ని చూచి భయపడానికి మనం కారణమయ్యాం. ఆ భయాన్ని మనం సులభంగా తీర్చవచ్చు. అలా చేయడంపోయి ఆయన విచారాన్ని ఇంకా ఎక్కువచేయడం మనకు తగదు. కనక లక్ష్మణా! ఈ కారణంవల్ల నా మనస్సులో ఇప్పుడు పట్టాభిషేకం చాయ కూడా లేదు. అది పూర్తిగా వనవాసం మీద లగ్నమైపోయింది. నేను అడవికి వెళ్లడం భరతుడికి పట్టాభిషేకం చేయించడం అదే ఇప్పుడు నా కోరికకూడా. అదే నాకు ఆనందం. ఇక ఆలస్యం చేస్తే కైకేయికి సందేహం కలుగుతుంది. అందుకని నేడే అడవికి బయలుదేరి ఆమె మనస్సు నిమ్మళించేలాగా చేయాలి. సత్యనిష్ఠను గురించిన భయంపోయి మన తండ్రిగారు సుఖంగా ఉంటారు. నేను దుఃఖిస్తానని కదా ఆయన బాధపడుతున్నారు. నాకు దుఃఖం ఏ మాత్రమూ లేదని ఆయనకు స్పష్టమైతే చాలు. ఆయనకు బాధ వుండదు. అందుకనే నేనూ తొందర పడుతున్నాను. కైకేయిమీద మనకు కోపం తగదు.

మనమంటే ఆమెకు ఇంత వరకూ ఎంత ప్రేమవుందో గుర్తుకు తెచ్చుకో!

ఆమెకు హఠాత్తుగా ఇలాంటి బుద్ధి పుట్టడం విధి విలాసమే. మనం ఎవర్నీ నిందించరాదు. మానవులు ఏమేమో అనుకుంటారు. కానీ, విధి విలాసం వేరుగా ఉంటుంది. ఇది కైకేయి పనికాదు. విధి ఆమెను అలా ఉపయోగించుకుంది. ఆ నిందను మోసే దుఃఖం ఆమెకు కటిబెట్టింది. ఆమెనూ, ఆమె మనస్సునూ మనం ఎప్పటి లాగానే గౌరవించాలి. ఆదినుంచీ వంచన ఉన్నట్లయితే ఆమె నడవడి వేరేవిధంగా ఉండి ఉండేదే. హఠాత్తుగా ఇలాగ నిర్దాక్షిణ్యంగా "రామా! నీవు అడవికి పో" అని ఆమె తననోట చెప్పడం కేవలం దైవ ప్రేరణవల్లనే. అందులో సందేహములేదు. మనం ఆమెను తిట్టకూడదు. అసలు ఆమె గుణాలు ఎంతదొడ్డవి. మనలను కన్నతల్లిలా చూసేది. మంచి శిక్షణగలది. అలాంటి ఆమె ఈ విధంగా భర్తఎదుట సిగ్గువిడిచి ఎందుకు ప్రవర్తించింది? ఇది దైవ చేష్టగాని వేరేమీకాదు. విధిని ఎవరు దాటగలరు? మహాధీరులైన ఋషులు తటాలున తపస్సు వదిలివేసి, పతితులవుతున్నారు. దైవాన్ని ఎదిరించగల శక్తి కైకేయికి ఎక్కడిది? మనం మనస్థైర్యంతో దీన్ని సంతోష ఘటనగా మార్చుకుందాం. మన పరాక్రమానికి అదే గురు. లక్ష్మణా! పెద్ద ఆశీర్వాదం పొంది నేను వెంటనే బయలుదేరవలసి ఉంది. ఆలశ్యానికి తడవులేదు. అభిషేకానికి తెచ్చిన గంగాజలాన్ని తీసుకురా దాన్నే వనవాసవ్రత సంకల్పానికి...వద్దు, వద్దు. అది పట్టాభిషేకానికి ఉపయోగపడవలసిన రాజద్రవ్యం. దాన్ని మనం తాకరాదు. మనమే గంగకువెళ్లి జలం తెచ్చుకోవడం మంచిది. తమ్ముడూ! లే. రాజ్యాన్ని గురించీ, సంపదలను గురించీ చింతించకు. వనవాసమే నాకు మహాభాగ్యం. పిన్నిమీద కోపగించకు. అభిషేక మహోత్సవాన్ని చెడగొట్టింది ఆమెకాదు. దేవుడు. దైవం చేసిన పనికి ఆమెమీద నింద మోపడం తగదు" అని ఈ విధంగా రాముడు ప్రశాంతంగా తన మనస్సులోని భావాలను తమ్ముడికి సవిస్తరంగా వివరించి చెప్పాడు.

* * *

ఈ ఘట్టములో వాల్మీకి సర్వత్రా "దైవం" అన్న పదాన్ని ప్రయోగించాడు. సంస్కృతంలో దైవం అంటే విధి అని అర్థము. దైవం, అదృష్టం. భాగ్యం, నియతి, విధి అన్న ఈ పదాలన్నీ తనకు తెలియకుండా జరిగే సంఘటనలకూ. కారణము తెలుసుకోటానికి వీల్లేని విషయాలకూ పర్యాయపదాలు. తన ప్రయత్నం కానీ, ఇతరుల దురాలోచన కానీ లేకుండా జరిగే ఘటనలను ఈ పేర్లతో పిలుస్తారు. "అంతా ఈశ్వరలీల" అన్న సిద్ధాంతంవల్ల ఈశ్వర సంకల్పం వల్లా, విధి వల్లా, కొన్ని కష్టాలు కలుగుతాయని భావించడం సహజం. రాముడు ఈ సందర్భాన తమ్ముడికి ఉపదేశం చేసినప్పుడు కైకేయి చేసిన పని దైవకృత్యమన్నాడు. అది ఆయన తెలిసి అన్నమాటకాదు. సాధారణముగా మానవుడు జీవితములో కలిగిన దుఃఖాలను "దేవుడి చేష్టలు" అనడం, ఇందుకు ఎవరిమీదా నెపం మోపరాదనడం పరిపాటి. ఆ విధంగా వారు తమ్ము తాము ఊరడించుకొంటారు. అంతే.

కంబ రామాయణంలో కూడా రాముడు ప్రళయ కాలాగ్నిలా లేచిన తమ్ముడితో ఇలా అంటున్నాడు :

తే॥ నీరు వట్టిపోక నదికి నింద కాదు
తల్లి తండ్రుల కిది యల్లె తప్పు కాదు
భరతు దోష మింతయు లేదు వత్స ! దైవ
కృతము దీనికై నీ కింత కినుక యేల ?

* * *

రాముడి సమాధానంవల్ల తమ్ముడి కోపం కొంత సేపు అణగి ఉంది. కాని అంతలోనే చండవేగంతో మళ్లా విజృంభించింది. "ఇది విధి కృతమా? పినతల్లి మతి చెడిపోవడానికి అది కారణమై ఉండవచ్చునంటే ఒప్పుకుంటాను. ఆమె మీద నాకు కోపంలేదు. కాని విధి వశాత్తు యుద్ధం జరుగుతూందని ఊరుకుంటామా? అనర్థాలను తొలగించి న్యాయాన్ని ప్రతిష్ఠించడం క్షత్రియ ధర్మం కదా? వీర పురుషుడు విధికి తల ఒగ్గడు. రాముడికి పట్టాభిషేకం అని దేశమంతా చాటించి, ఎన్నడో ఇచ్చి మరచి పోయిన వరాలను ఇప్పుడు పైకి త్రవ్వి నిన్ను అడవికి పొమ్మని ఒక

వంచకుడు ఆజ్ఞాపిస్తే అది విధిక్కృతం అనుకొని తల ఒగ్గి ఊరుకోడం పురుషలక్షణం కాదు. దుర్బలులు మాత్రమే విధికి తల వంచుతారు. మనలాంటి వీరులు విధిని ఎదిరించి విజయం పొందాలి. విధిబలానికీ వీర పురుషుడి బలానికీ తేడా ఏమిటో ఈనాడు చూస్తాను. విధి అనే మదపు టేనుగు మదమణచి మరలించు కొని రాబోతున్నాను. మిమ్మల్ని అడవికి పంపాలని దురాలోచన చేసిన వారినే అడవికి పంపుతాను. మీరు అడవికి వెళ్లాలనే కోరిక ఉంటే దాన్ని తర్వాత తీర్చుకోవచ్చు. దానికి తగిన సమయం వస్తుంది. చిరకాలం రాజ్యమేలి మన పూర్వీకులు చేసి చూపి నట్లు రాజ్యాన్ని పుత్రుల కప్పజెప్పి అడవికివెళ్లి తపస్సు చేసుకోవచ్చు. ఇప్పుడు మీ పరిపాలనను ఎదిరించిన వాళ్లందరినీ హతమార్చడానికే నే నున్నాను. ఈ భుజాలూ, ఈ ధనుస్సూ బాణాలూ, నడుమున వేలాడు తున్న ఈ ఖడ్గం–ఇవన్నీ అలంకారం కోసమా? ఇవి నాటకంలో వేషం వెయ్యటానికా? నేను మీ సేవకుణ్ని. ఆజ్ఞాపించండి. ఆ తర్వాత చూడండి మీ సేవకుడి ప్రతాపం!''

ఇలాగ మళ్లా ప్రజ్వరిల్లిన లక్ష్మణుడి క్రోధాగ్నిని రాముడు మెల్లగా చల్లార్చాడు.

"మన తలిదండ్రులు బ్రతికి ఉన్నంత వరకూ వాళ్ల మాట ప్రకారం నడుచుకోడం మన ధర్మం. నాన్నగారి ఆజ్ఞ ఉల్లంఘించడం నావల్ల కాని పని. ఆయన మాట నిలబెట్టి, ఆయన సత్యనిష్ఠను కాపా డడం మన ప్రథమ కర్తవ్యం. తల్లిదండ్రులను అవమానించి ధర్మ స్వరూపు డైన భరతుణ్ని సంహరించి ఈ రాజ్యాన్ని సంపాదించడమా? అలా చేశామే అనుకో. దానివల్ల మనకు సంతోషం కలుగుతుందా? నా మాట విను" అని చెప్పి లక్ష్మణుడి కళ్లు తుడిచి బుజ్జగించి సమాధాన పరిచాడు. రాముడు. లక్ష్మణుడు శాంతించాడు.

24. సీతనిర్ణయం

అంతఃపురంలో జరిగిన ఈ విశేషాలు ఇంకా పురజనులకు పూర్తిగా తెలియవు. రాముడు అడవికి వెళ్లాలని నిశ్చయించుకొని అందు కావలసిన ఏర్పాట్లు అన్నీ త్వరగా చేసుకుంటున్నాడు.

ఏర్పాట్లు ముగిసిం తర్వాత తల్లి కౌసల్య దీవెన పొందడానికి వెళ్లాడు.

"నీవు వెళ్లిపోయింతర్వాత ఈ అయోధ్యలో నేను ఎలా ఉండ గలను నాయనా? నీతోకూడా నేనూ వస్తాను" అంది కౌసల్య.

రాముడు ఆమెను వారించాడు. ఇక్కడే ఉండడం ధర్మమన్నాడు. చక్రవర్తి అయిన భర్తను విడిచిపెట్టి కొడుకుతో అడవికి రాకూడదు. నాన్నగారు వృద్ధులు. ఆయనకు సేవచేస్తూ కష్టమైనా సుఖమైనా భరిస్తూ అయోధ్యలో ఉండడమే మీకు ధర్మం. అన్నాడు, రాముడు. ఇది ఆమెకు తెలియని సంగతా?- కాదు. అయినా ఇప్పుడు ఆమె మనస్సు మనస్సులో లేదు. అందుకని రాముడు ఈ ధర్మాన్ని వివరించి, కర్తవ్యం చెప్పాడు. రాముడి మాట ఆమె కాదనలేకపోయింది.

కొడుకును స్వస్తి మంత్రాలతో ఆశీర్వదించి "తండ్రి ఆజ్ఞను నిర్వర్తించి విజయముతో తిరిగి రా, నాయనా!" అంది కౌసల్య కళ్ల నీళ్లు తుడుచుకుంటూ.

"భయంలేదమ్మా! పద్నాల్గు సంవత్సరాలు ఇట్టే గడిపివేసి వస్తాను" అని రాముడు నవ్వుతూ చెప్పి ఆమెకు ఊరట కలిగించాడు.

తల్లి ఆశీర్వాదం పొందిన రాముడి ముఖం గొప్ప తేజస్సుతో ప్రకాశించిందని వాల్మీకి మహర్షి వర్ణిస్తున్నాడు. కర్తవ్యం నిర్వహించ టానికి గొప్ప త్యాగమైనాసరే చేయడానికి సిద్ధపడినవారి ముఖం చూసి నప్పుడే మహర్షి చేసిన వర్ణనలోని అంతరార్థం మనకు బోధ పడుతుంది.

"చక్రవర్తి రమ్మన్నారు. అని వార్త తెచ్చిన సుమంత్రుడితో వెళ్లాడు రాముడు. ఛత్రం, చామరాలతో రథమెక్కి పరివారం వెంటరాగా ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తూ కూర్చుంది, సీతా దేవి. పితృవాక్య పరిపాలనకోసం అడవికి వెళ్లుతున్నానని తన ప్రియు రాలితో ఎలా చెప్పాలా అనే చింతతో ఆమె నగరుకు బయలు దేరాడు, రాముడు. ఛత్ర చామరాలు మొదలైన రాజలాంఛనా

లేవీ లేకుండా ఒంటరిగా వస్తున్న రాముణ్ని చూసింది, సీత. ఆయన ముఖం చిన్నవోయినట్లు కూడా ఆమె కనిపెట్టింది.

"నా నాథుడు ఎందుకో కష్టపడుతున్నాడు. ఏది ఏమైనా మా ఇద్దరికీ ప్రేమ ఉంది. అంతేచాలు." అని మనస్సులో అనుకొని 'ఏమిటి విశేషం?_ అని అడిగింది, సీత.

రాముడు జరిగిందంతా చెప్పాడు. చెప్పి "వైదేహీ! నీవు నన్నెడబాసి ఇక్కడ ఒంటరిగా ఉండడం ఎంత బాధాకరమో నాకు తెలుసు. అయినా నువ్వూ ధర్మ మెరిగిందానవు. జనకుడి కుమార్తెకు నేను వేరే చెప్పవలసిం దేమీలేదు. మహారాజుగారి వద్దా, తల్లులు ముగ్గురివద్దా మెలకువతో మసులుకో! ఇతర అంతఃపుర స్త్రీలకన్న ఎక్కువగా ఏదీ ఆశించకు. ఏదీ కోరకు. రాజైన భరతుడివద్ద కూడా మెలకువగా మసులుకో! అతనికి నీపట్లగల గౌరవం తగ్గకుండా ఉండే లాగ చూసుకో. జానకీ! నాపై నీ ప్రేమ తరగనీయకు. నేను అడవిలో పధ్నాలు సంవత్సరాలూ గడిపి తిరిగి వచ్చేస్తాను. అంతవరకూ పూజలు చేస్తూ ఉండు. మా అమ్మ కౌసల్యాదేవి బెంగపెట్టుకుంటుంది. ఆమెను శ్రద్ధగా చూడు. భరత శత్రుఘ్నులు నాకు చాలా ఇష్టమైన వాళ్లు. వాళ్లని నీ సోదరులుగా చూసుకో. రాజవంశ మర్యాదలను గుర్తెరిగి మసులుకో. నన్నెక్కువ పొగడకు, నేను ఈ రోజే అడవికి వెళ్లాలి. మనస్సు నికలడగా ఉంచుకో!" అన్నాడు రాముడు.

ఈ మాటలు విన్న సీతాదేవికి చర్రున కోపం వచ్చింది. ఆమె పేర్మి అంతా కోపంగా మారిపోయింది.

"చాలు! మహబాగా చెప్పారు. ధర్మం తెలిసిన రాజకుమారులు! మీ మాటలు వింటే నాకు నవ్వు వస్తూంది. భర్త వేరు, భార్య వేరు అన్న విషయాన్ని ఈ రోజే మీవల్ల తెలుసుకొన్నాను. రాముడు అడవికి వెళ్లాలన్న ఆజ్ఞ సీతకు వర్తించదా? అదేమీ కుదరదు. అడవికి వెళ్లేటప్పుడు నేను ముందుండి ముళ్లూ, దర్భలూ పెరికేసి దారిని శుభ్రం చేస్తాను. మొండిపట్టు పడుతున్నానని కోప్పడకండి. ధర్మం అంటే ఏమిటో నాకు నా తల్లిదండ్రులు బోధించారు. మీరు ఈనాడు చెప్పింది, నేను ఇంతకుముందు విన్నదానికి పూర్తిగా విరుద్ధముగా

ఉంది. మీ రెక్కడికి వెళ్లినా మిమ్మల్ని అనుసరించా లన్నదే నేను నేర్చుకున్న ధర్మం. మీరు అడవికి వెళతానంటే నేనూ సిద్ధమే. ఇక ఎక్కువ మాట్లాడవలసిన పనిలేదు. అడవికి వస్తే నేను కష్ట పడతానని భావించవద్దు. చాలా ఆనందముతో వనవాసాన్ని గడుపు తాను. మీ వెంట ఉంటే వనవాసం నాకు ఒక ఆటలాగ ఉంటుంది. ఇక్కడ నన్ను ఒంటరిగా విడిచిపోవద్దు. మీరు అడవికి వెళ్లిపోతు న్నప్పుడు ఇంక ఈ అయోధ్యతో నాకేం పనీ? అడవిలో నావల్ల మీకు ఎలాంటి ఇబ్బందులూ కలగవు. కాయలూ గడ్డలూ తింటూ ఎప్పుడూ మీకు ముందే ఉంటాను. మీతో వచ్చి కొండలను, సెల యేళ్లను చూసి ఆనందించాలని నా కోరిక. పిట్టలతో పూవులతో కల కలలాడే అడవిలో మీతోనే ఉంటాను. నదుల్లో ఆనందంగా స్నానాలు చేసి నిత్యకర్మలు నెరవేర్చి సుఖంగా కాలం గడుపుదాం. మీరు లేని స్వర్గమైనా నాకు వద్దు. నన్ను ఒంటరిగా విడిచి వెళితే, నా చావు మాత్రం నిశ్చయం. నన్ను మీవెంట తీసుకుపొండి. నాపై దయ దలచండి. నన్ను గతిలేనిదానిని చేయకండి. మిమ్మల్ని వేడుకొంటు న్నాను'' అంది సీతాదేవి. కోపంతో మాటలు మొదలుపెట్టి ఇలా దీనంగా ప్రార్థించసాగింది.

అడవిలో కలిగే కష్టాలనూ, భయాలనూ రాముడు సవి స్త రంగా వివరించి చెప్పాడు. చెప్పి మళ్లీ 'నీవు నాతో అడవికి రావద్దు' అన్నాడు.

సీత కళ్లనీళ్లు పెట్టుకుంది. "పులులూ, సింహాలూ. ఎలుగులూ, పాములూ అన్నీ మిమ్మల్ని చూడగానే పారిపోవూ?— మీరు చెప్పే ఎండవానలు, పెనుగాడ్పులు, ఆకలి ఇవన్నీ నేను సంతోషంగా ఓర్చు కోగలను. వనవాసము అంటే నాకేమీ భయంలేదు. నే చెప్పేది ఒక్కటే మాట — మీరు నన్ను విడిచి వెళ్లిపోతే నా ప్రాణం పోవడం మాత్రం నిశ్చయము'' అని నిష్కర్షగా చెప్పింది, సీతాదేవి.

అంతటితో విడిచిపెట్టలేదు. "నేను మిథిలలో ఉన్నప్పుడు బ్రాహ్మలూ దైవజ్ఞులూ నాకు వనవాస యోగం ఉందని మా అమ్మతో చెప్పారు. అది ఎప్పటికైనా తప్పదుకదా?—నేను ఒంటరిగా

వనవాసం చేయడం నావల్ల కాదు. ఇప్పుడు మీవెంట వచ్చి వనవాస యోగాన్ని సుఖంగా అనుభవిస్తాను. వనవాసం వల్ల కష్టం కలిగే దెవరికి? ఇంద్రియాలు వశంలోని స్త్రీ పురుషులకు మాత్రమే. మీరూ నేనూ అలా కష్టపడంలెండి. ఇక నన్ను మాత్రం వారించకండి'' అంది.

25. నారబట్టలు

రాముడితోపాటు సీతకూడా అడవికి వెళ్లటం నిశ్చయమైపోయింది. సీత పేద బ్రాహ్మల్ని పిలిపించి తన వస్తువులన్నీ వాళ్లకి దానం చేసి వనవాసానికి సిద్ధమైంది.

లక్ష్మణుడు కూడా అన్నకు తోడుగా అడవికి వెళ్లిడానికి నిశ్చయించుకొని రాముడిచేత ఒప్పించాడు. ముగ్గురూ కలిసి దశరథ మహారాజు అనుమతి పొందడానికి వెళ్లారు. వీధులలో రెండు వేపులా మేడలమీదా, కిటికీల దగరా జనం గుంపులు గుంపులుగాకూడి సీతా రామలక్ష్మణులు, కాలినడకను వెళ్లడం చూశారు. వారికి పట్టరాని దుఃఖమూ, ఆశ్చర్యమూ, కోపమూ వచ్చాయి. ''ఇలాంటి తండ్రు లెక్కడైనా ఉంటారా? కన్నకొడుకును, అందులో పెద్దవాడ్ని అడవికి పంపించి వేస్తారా? అయ్యో! పాపం! నడివీధిని కాలినడకను బయలు దేరిందే సీతమ్మతల్లి! ఎండ వానలను ఈమె ఓర్చుకోగలదా? ఏమిటీ విపరీతము? నడవండి. మనంకూడా ఈ నగరం విడిచి వాళ్లతో అడవికే పోదాం. మన సామానులు తీసుకొని బయలుదేరండి. రాముడు వున్నచోటే మనకు అయోధ్య. ఈ నగరంలో ఇంక పాములు చేరుతాయి. పుట్టలు పెడతాయి, ఎలకబు ఇళ్లన్నీ పాడు చేస్తాయి. ఇంక కైకేయినే పరిపాలించుకోమనండి. మనం వెళ్లే అడవిలోని మృగాలు, రాబందులూ అడవి విడిచి ఈ అయోధ్యకు చేరుకొంటాయి. ఇదే అడవి అవుతుంది. అడవి నగర మవుతుంది'' అని ఇలాగ ప్రజలు చెప్పుకొంటున్నారు. ఈ మాటలు రాముడి చెవిని పడ్డాయి. అయినా వాటిమీద రాముడు అటు ధ్యాస ఉంచలేదు. రాజనగరు మొగసాలలో చిన్నబోయిన ముఖంతో కూర్చుని ఉన్నాడు.

సుమంత్రుడు, అతణ్ని చూచి రాముడు "చక్రవర్తి దర్శనానికి ముగ్గురమూ వచ్చాం. తెలియజేసి లోపలికి వెళ్లటానికి అనుమతి కొనిరండి" అని చెప్పాడు. సుమంత్రుడు లోపలికి వెళ్లాడు.

చక్రవర్తి రాహువు మింగిన సూర్యుడిలాగా, నివురుగప్పిన నిప్పులాగా, నీరింకిన చెరువులాగ కనిపించాడు.

సుమంత్రుడు చేతులు జోడించి "రాజకుమారుడు నగరు వాకిట నిలచి ఉన్నాడు. తన సొమ్ములన్నీ బ్రాహ్మలకు దానం చేసి దండకారణ్యానికి వెళ్లడానికి ముందు అందరి అనుమతీ పొంది తమ దర్శనం చేసుకుందుకు వచ్చాడు" అని బొంగురుగొంతుకతో మాటలు తడబడతూ చెప్పాడు. చక్రవర్తి వాళ్లని రమ్మనమన్నాడు.

* * *

రాముడు వచ్చి చేతులు కట్టుకొని ఒదిగి నిలబడాడు. పడుకున్న చక్రవర్తి రాముణ్ని చూడగానే తటాలున లేచి చేతులుసాచి కౌగలించుకోడానికి ముందుకు అడుగు వేశాడు. కాని అంతలోనే మూర్ఛ వచ్చి పడిపోయాడు. రామలక్ష్మణులు చక్రవర్తిని లేవదీసి పడుకోబెట్టి ఒళ్లు నిమిరారు. కాస్సేపటికి దశరథుడు తేరుకున్నాడు.

"నాన్నగారూ! తమ అనుజ్ఞకోసం వచ్చాం. నాతో లక్ష్మణుడూ వైదేహీకూడా అడవికి వస్తున్నారు. తమరు అనుమతి యిచ్చి దీవించి పంపండి" అన్నాడు, రాముడు.

అప్పుడు దశరథుడు "నాయనా కైకేయికి నేనిచ్చిన వరానికి కట్టుబడిపోయాను కాని నీవు కట్టుబడలేదు. నీ భుజబలంతో అయోధ్యను ఆక్రమించుకుని రాజ్యం ఏలుకోవచ్చుకదా?" అన్నాడు.

అంతవరకూ మనస్సులో ఉన్నమాటను చక్రవర్తి ఇప్పుడీవిధంగా బైటపెట్టాడు

"తామింకా వేయేళ్లు ఏలవలసిన ఈ రాజ్యానికి నేను ఆశ పడటం లేదు. నేను పధ్నాలుగేళ్లూ వనవాసంచేసి తిరిగివచ్చి తమ

పాదాలంటి నమస్కరిస్తాను" అన్నాడు రాముడు. రాముణ్ని ఆప గలనన్న ఆశ చక్రవర్తికి లేదని తేలిపోయింది.

"నాయనా! మన వంశానికి వాసితేగలవు. పోయిరా, నీకు శుభం కలగాలి. భయం అన్నది నీ మార్గాన కనిపించదు. ధర్మంతప్పని ఉత్తముడవు నీవు. దృఢసంకల్పంగల వీరుడవు. నీ నిశ్చయాన్ని ఎవరూ మరల్చలేరు. కాని ఈ రోజే బయలుదేరకు. ఒక రాత్రిఉండి వెళ్ళు. నిన్ను మనసారా చూసైనా తృప్తి పొందాలని నా కోరిక. రేపు తెల్లవారగానే నీవు బయలుదేరవచ్చును. రామా ! నేను కైకేయి వల్ల మోసపోయాను. ఆమెకు నేనిచ్చిన మాటకు కట్టువడి ఈ పాప కార్యం చేయవలసి వచ్చింది. ఆమె నన్ను వంచించింది. నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆమె భావం నేను తెలుసుకోలేక పోయాను. ఏమరు పాటున ఆమె వలలో పడాను. ఇక నీవో "పితృవాక్యాన్ని పరిపాలించి తీరుతాను, తండ్రికి అసత్య దోషం రానీయను" అని రాజ్యాన్నీ, దేశాన్నీ విడిచి, అడవికి వెళ్లాలని నిశ్చయించుకున్నావు. లోకంలో నీవంటి ఉత్తముడెవడు? ఈ అనర్థం నా ఇష్టప్రకారం కలిగింది కాదని సత్యప్రమాణంగా చెప్పుతున్నాను" అని వణకుతున్న గొంతుతో చక్రవర్తి చెప్పాడు.

ఈ అవసానకాలంలో రాముడి మీద ప్రేమ తగ్గకుండా ప్రాణాలు విడవాలని దశరథుడి కోరిక.

"నాన్నగారూ ! భరతుడికి వర్తమానం పంపండి మీరు నా పినతల్లికి ఇచ్చిన వరాన్ని పూర్తిచేయండి. రాజ్యాన్ని నేను మనస్ఫూర్తిగా విడిచి పెడుతున్నాను. నా మనస్సంతా ఇప్పుడు అడవిపైనే ఉంది. మీరు మనస్సులో ఏ సంకోచమూ పెట్టుకోక భరతుడికి పట్టం కట్టి దీవించండి. నా కీరాజ్యంమీద, ఈ సంపద మీదా మనస్సులేదు. నాన్నగారూ ! మీరు దుఃఖించకండి. కంట తడిపెట్టకండి. సముద్రం లాగా ధీరులైన మీరు ధైర్యం వదలకూడదు. సముద్రం ఎక్కడైనా ఎండి పోతుందా? మిమ్మల్ని సత్యసంధులను చేయడమే నా కోరిక. మీకు అసత్య దోషం కలిగించి ఈ సంపదలవల్ల నేను ఏం సుఖం పొమ్మంటారు? మీరు మనస్సును శాంతపరచుకోండి. నేను అడవిలో

హాయిగా కాలం గడుపుతాను. అడవుల్లోని అందమూ హాయీ మరెక్కడ దొరుకుతుంది? తండ్రియైన మీరే నాకు దైవం. కనుక నేను దైవ వాక్యం ప్రకారమే అడవికి వెళుతున్నాను. పధ్నాలుగు ఏళ్ల తర్వాత నన్ను తిరిగి చూస్తారు. మనస్సు కష్టపెట్టుకోకండి. ఈ రాత్రికి ఉండి రేపు వెళ్లమంటున్నారు. దానివల్ల కలిగే ప్రయోజనం ఏమిటి? ఇవాళలాగానే ఉంటుంది రేపున్ను. కనుక ఈ రోజే వెళ్లటానికి నాకు అనుమతి ఇవ్వండి" అన్నాడు రాముడు.

దశరథుడు సుమంత్రుణ్ని చూచి "సరే! మన సేనానితో చెప్పి చతురంగ బలాలతో సేనను ఆయత్తపరచి రాముడితోపాటు అడవికి వెళ్లడానికి సన్నాహాలు చేయించండి. రాముడు అడవిలో ఋషులతో కాలం గడపడానికి కావలసిన సంభారాలన్నీ సమకూర్చి సేనతో పంపండి. ధనం, ధాన్యం, సేవకులు- సమకూర్చి, నా బిడకు ఏ కొరతా లేకుండా పంపండి" అని ఆజ్ఞాపించాడు.

పాపం! వనవాసాన్ని రాజుల విలాస యాత్రలాగ చేదామను కొన్నాడు దశరథుడు.

పక్కనున్న కైకేయి ఇది విని పకపక నవ్వింది. "అలాగా! వరాన్ని చాలా చక్కగా నెరవేరుస్తున్నారే! భరతుడికి రాజ్యం ఇచ్చానని చెప్పి రాజ్యంలోని సిరిసంపదలన్నింటినీ రాముడికి ఇచ్చివేసి పాడుపెట్టిన రాజ్యం భరతుడికిస్తారా ?" అని అడిగింది.

దశరథుడు కోపావేశంతో ఏదో మాట్లాడుదామను కొన్నాడు. ఇంతలో రాముడు అమాత్యులను చూసి ఇలా అన్నాడు:

"నేను సవినయంగా మనవి చేసుకుంటున్నాను. నేను అడవికి వెళ్లాలనుకుంది ఈ విధంగా కాదు. రాజ్య భోగాలన్నింటినీ విడిచి పెట్టి తాపసులవలే జీవితం గడపడానికే అడవికి వెళుతున్నాను. పరివార సంభారాలు నా కెందుకు? ఏనుగును దానమిచ్చిం తర్వాత ఏనుగను కట్టే మోకు కోసం ఆశపడటమా? దయచేసి నారబట్టలు తెప్పించండి. తవ్వుగోలా గంపా ఇప్పించండి. అవి చాలు."

కైకేయి పరుగున పోయింది. సిద్ధంగా ఉంచిన నార బట్టలు తెచ్చి సిగ్గులేకుండా తన చేతులతోనే రాముడికి ఇచ్చింది. రాముడు

వాటిని అక్కడే కట్టుకొన్నాడు. ఋషుల లాగా కాంతితో ప్రకాశించాడు. లక్ష్మణుడు కూడా తన బట్టలు విడిచి నారబట్టలు ధరించాడు. దశరథుడు ఇదంతా కన్నార్పక చూస్తూనే వున్నాడు.

సీతకోసం కూడా నారచీరలు తెచ్చింది కైకేయి. ఆ చీర తీసుకొని ఏం చేయాలో తోచక సీతాదేవి ఒక్కక్షణం అలాగే నిలబడింది. అంతకు ముందు అలాంటి చీరలు ఆమె కట్టి యెరుగదు.

పక్కన గంధర్వ రాజులాగా అందాలు చిందే భర్తను చూసి చిరు సిగ్గుతో "ఈ చీర ఎలా కట్టుకోవాలో కాస్త చెప్పండి" అంది.

రాముడు సీత కట్టిన పట్టు చీరపైన ఆ నారచీర చుట్టి ముడి వేశాడు. అది చూచిన అంతఃపుర స్త్రీలంతా "హా" యని ఎలుగెత్తి విలపించారు. దశరథుడు స్పృహదప్పి పడిపోయాడు.

తెలివి వచ్చిం తర్వాత దశరథుడు అందరి ఎదుటా కైకేయిని కఠినముగా దూషించాడు. కాని ఆమె దాన్ని లెక్కచేయలేదు. ఇప్పుడిక ఎవరేం చేయగలరు? సీత అడవికి వెళ్లటానికి బాధపడలేదు. రాముడితో కలసి వెళ్లడంలో సుఖముందని భావించింది. ఎవరు చెప్పినా ఇక ఆమె వినదు. పోయేముందు నేలకేసి చూసి చక్రవర్తికి నమస్కరించాడు రాముడు.

"నాన్నగారూ! తల్లి కౌసల్యాదేవిని ఇక్కడ విడిచిపెట్టి పోతున్నాను. ఆమెకు ఎవరిమీదా కోపం లేదు. మహారాజా! ఆమెను సరిగా చూడండి. నన్ను విడిచి, ఆమె ఎన్నడూ ఎరగని దుఃఖంలో మునిగి ఉంది. అయినా మీ కోసం ప్రాణాలు నిలుపుకొని ఉంది. నేను అడవినుంచి తిరిగి రాగానే తర్వాత ఆమెను ఇక్కడే చూడగలగాలి. ఆమెను ఆ లోకంలో వెతక వలసిన స్థితి రాకుండా చూడండి. అదే నా కోరిక" పట్టరాని దుఃఖంతో అన్నాడు రాముడు.

అలా చెప్పి రాముడు బైటికి వచ్చాడు. ఆ దృశ్యాన్ని ముసలి రాజు చూడలేక పోయాడు. రెండు చేతులతోనూ మొహం మూసేసుకున్నాడు.

26. వనవాసానికి ప్రయాణం

కొడుకు నారబట్టలు కట్టి చెప్పిన కడపటి మాటలు విన్న చక్రవర్తి గుండె చెరువయింది. మంచంమీద కూలబడ్డాడు. రాముణ్ణి తలచుకొని కుమిలిపోయాడు. నోటమ్మట మాట రాలేదు.

మాట్లాడానికి కొంత శక్తిరాగానే "నేను ఎన్ని లేగలను చంపి గోమాతలను హింసించానో! లేకపోతే నాకు ఇంతటి దుఃఖం రాదు. మరణం కూడా మనం కోరినప్పుడు మన ఇష్టానుసారం రాదు. కైకేయి పెట్టే హింసను నేను భరించవలసి ఉంది.

అగ్నిదేవుడివంటి కాంతిగల నా కుమారుడు తన పట్టుబట్టలు విడిచి నారబట్టలు కట్టాడు. అది చూచి కూడా నేనింకా ప్రాణాలతో ఉన్నాను. రామా...రామా...రామా.... పోయావా?...అడవికి పోయావా నా తండ్రీ?"అని పలుకుతూ అలా మగతలో పడి పోయాడు.

తెలివి వచ్చింతర్వాత "సుమంత్రా! రథం తెచ్చి బిడ్డలనూ జానకినీ ఎక్కించి, రాజ్యం పొలిమేరదాకా తీసుకువెళ్లు" అన్నాడు.

* * *

లక్ష్మణుడు సుమిత్రాదేవికి పాదాభివందనం చేసి "అమ్మా"అని ఆపైన మాట్లాడలేక పోయాడు.

సుమిత్ర అతడ్ని చేరదీసి శిరస్సు మూర్కొని "నాయనా! నీకు అన్నపైగల ప్రేమ చాలా గొప్పది. నిన్ను కనడం నా భాగ్యం. బాబూ! రాముడి రక్షణ నీ కర్తవ్యం. అడవిలో సదా అన్నకు తోడుగా అతి మెలకువతో ఉండాలి. తమ్ముడికి అన్న గురువూ, రాజూను. ఇది మన కుల ధర్మం. పోయిరా. లక్ష్మణా! అడవిలో రాముణ్ని నాయనగారిలాగ, వదినను నాలాగ చూసుకో. అడవినే అయోధ్యగా ఎంచుకో. సంతోషంతో వెళ్లిరా. నాయనా!" అంది.

* * *

రామాయణ కథలో ఎక్కువగా మాట్లాడకుండా కనిపించే మహాజ్ఞాని సుమిత్రాదేవి. ప్రతి విషయాన్ని పరిపూర్ణ జ్ఞానంతో తెలుసుకుని నడుచుకుంటుంది, ఆవిడ. రాముడి అవతార రహస్యం సుమిత్రకు బాగా తెలుసునని పెద్దలంటారు. కౌసల్యాదేవిలాగా ఆమె కుమారుడికి అడ్డు చెప్పలేదు. పోయిరమ్మని ధైర్యం చెప్పి సాగనంపింది.

"మహారాజకుమారా! రధా న్నెక్కండి. కీర్తి శిఖరాన్ని అందుకొండి. మీకు మంగళ మవుతుంది. మీ ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళవచ్చు. పధ్నాలు సంవత్సరాల వనవాసం ఇప్పటినుంచే మొదలైంది" అన్నాడు, సుమంత్రుడు.

* * *

సీతాదేవి చిరునవ్వుతో సంతోషంగా రధం ఎక్కింది. ఆమెకు కావలసిన బట్టలను కట్టి ఇచ్చింది, కౌసల్య. అన్నదమ్ములిద్దరికీ కవచాలూ, ఆయుధాలూ, దుంపలూ, గడలూ, తవ్వుకోటానికి తవ్వుగోలా, గంపా అన్నీ రధంలో పెట్టారు. వనవాసానికి గంపా, తవ్వుగోలా చాలా అవసరం. రామలక్ష్మణులు కూడా రధం ఎక్కారు. సుమంత్రుడు రధం నడిపాడు.

* * *

ఈ ఘట్టంలో మనం కాస్త ఆగి భగవంతుణ్ణి ధ్యానిద్దాం. వనవాసం ప్రారంభమైన ఈ పుణ్యఘట్టంలో మన పాపాలను పోగొట్టుకుని పవిత్రతను పొందడంకోసం ప్రార్ధనచేద్దాం. సత్యం, ధర్మం, ప్రేమ ఇవి రామాయణంనుంచి మనం పొందే ప్రసాదం. అందుకే ఈ రామావతారం. నారబట్టలు ధరించిన రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, జానకిని మనస్సులో నిలిపి భగవత్కృపకోసం ప్రార్ధన చేద్దాం.

* * *

"పగ్గాలు లాగిపట్టు! సారధీ! పగ్గాలు లాగిపట్టు! రధాన్ని మెల్లగా తోలు! రాముడి ముఖమైనా ఒక్కసారి చూస్తాం" అని వీధుల్లో నిలిచిన ప్రజలు కోరారు.

"అయ్యో! ఇలాంటి పుత్రులను కని అడవికి పంపుతున్నారే! వీరిని కన్న తల్లుల కడుపులో అగ్ని రగలదా? వారికి ప్రాణాలు నిలుస్తాయా? చూశారా వై దేహిని? ఈమెకదా సౌభాగ్యవతి! ఈ లక్ష్మణుడేకదా భాగ్యశాలి! తమ్ముడంటే అతడే తమ్ముడు. ధర్మం ఎరిగిన ధీరుడు."

పురజనులు ఇలా మాట్లాడుతూ రథంవెంట పరుగులు పెట్టారు. వారి దుఃఖం ఏరులై పారింది.

రథాన్ని వేగంగా తోలమంటున్నాడు రాముడు. మెల్లగా తోలమంటున్నారు ప్రజలు. చూస్తూండగానే జనసమూహం పెరిగి పెద్దదైంది.

సుమంత్రుడు ఎలాగైతేనేం రథాన్ని అయోధ్య దాటించాడు. నగరం దుఃఖంలో మునిగిపోయింది. ప్రతియింటా కన్నీరు! ఉపవాసాలు! రాజ దూషణలు!

* * *

చక్రవర్తి అంతఃపురంనుంచి బైటకివచ్చాడు. రథం పోయినవైపే చూస్తూ చాలాసేపు అలా నిలబడిపోయాడు. రథచక్రాలవల్ల రేగిన ధూళినే రాముడి ఆకారంలా భావించి అది కంటికి కనిపించినంతవరకూ అలాగే నిలబడ్డాడు. ఆ ధూళి అణగారింతర్వాత 'అయ్యో' అని అరచి నేలకూలాడు. ఆయనకు ఒక పక్క కౌసల్యా ఒక పక్క కైకేయి ఉన్నారు.

దశరథుడు కైకేయిని చూసి "పాపాత్మురాలా! నన్ను ముట్టుకోకు. దుర్మార్గురాలా నీ ముఖం కూడా చూడకూడదు. నీకూ నాకూ సంబంధం తెగిపోయింది. పో, నిన్నువిడిచివేస్తాను. పో పో" అన్నాడు.

"భరతుడు ఈ రాజ్యాన్ని సంతోషంతో అంగీకరిస్తే నా కతడు తర్పణంకూడా విడవక్కరలేదు. అతడు విడిచే తర్పణం నాకు అందదు" అన్నాడు.

"రాముడు అడవిలో ఎలా ఉంటాడో ? తాతినో, కొయ్యనో దిండుగా జేసుకొని కటికనేలను పరుంటాడు. అయ్యో ! అతడు కాయ కసరు తిని ఎలా బతుకుతాడో !''

ఇలాగ దశరథుడు పరిపరి విధాల విలపించాడు. తానుగా నిప్పులో చేయిపెట్టి కాల్చుకుని ఏడ్చినట్లు దశరథుడు తాను చేసిన పని ఎలాంటి ఫలితాన్నిచ్చిందో తలచుకొని తలచుకొని విలపించాడు.

"కైకేయీ ! నీవు సుఖంగా ఉండు. నీ పని పూర్తిగా నెర వేర్చానుగదా ? భర్త లేనిదానివై సంతోషంగా ఉండు'' అని ఆమెను తలచుకొని కోపంతో అన్నాడు. శ్మశానం నుంచి స్నానంచేసి తిరిగి వచ్చిన వాడిలా అంతఃపురం చేరుకున్నాడు.

"ఇక్కడవద్దు. నన్ను కౌసల్య నగరుకు చేర్చండి" అన్నాడు.

సేవకులు అలాగే చేశారు. దశరథుడు విలపిస్తూ కౌసల్యాదేవి నగరులో పరున్నాడు.

* * *

అర్ధరాత్రివేళ లేచి "కౌసల్యా నీ వున్నావా ? ఏదీ చేతులతో నన్ను ముట్టుకో. నా కళ్లు మసకలు కమ్మాయి. నా చూపు రాముడితోనే పోయింది'' అన్నాడు.

కౌసల్యాదేవి దుఃఖం అంతా ఇంతా కాదు. తన దుఃఖాన్ని దిగమింగింది. చక్రవర్తికి ఏం సమాధానం చెప్పాలి?

ఈ రాత్రిపూట కూడా మధ్యాహ్నపు ఎండలాగ శరీరం కాలుతూందే అని ఆమె కూడా, విలపించింది.

సుమిత్ర కౌసల్యను చూచి "అక్కా ! శాస్త్రం, ధర్మం తెలిసిం దానివి నీవే ఇలా దుఃఖిస్తే ఎలాగే ? ఇతరులకు దారి చూపవలసిన నీవు ఇలా బేలవవడం బాగాలేదు సుమా, సత్యం కోసం కదా రాముడు అడవికి వెళ్లాడు. రాజ్యాన్ని తుచ్ఛమని భావించి తండ్రి సత్యాన్ని కాపాడమే తన ధర్మంగా ఎంచి అడవికి వెళిన ధీరుణ్ణి కన్నావు. భాగ్యశాలివి. కష్టమైన ధర్మాన్ని ఏలోటూ రాకుండా పాలించి సత్ఫలితం పొందవలసిన నీ కుమారుణ్ణి గురించి ఇలా దుఃఖించడం తగునా ? మన పూర్వులలాగా శాశ్వతమైన కీర్తి పొందే రాముణ్ణి

గురించి మనం దుఃఖించకూడదు. నా కొడుకు లక్ష్మణుడు కూడా అన్నతో వెళ్లాడు గదా అని నేను సంతోషిస్తున్నాను. వనవాసంవల్ల కలిగే కష్టాలు బాగా తెలిసికూడా జానకి నీ కుమారుడి వెంట వెళ్ళింది. రాముడి కీర్తి వర్ధిల్లి లోకమంతా వెలుగులు విరజిమ్ముతుంది. మనం దుఃఖించకూడదు. మహాత్ముడైన నీ కుమారుడి సద్గుణాలే అతనికి కవచమై కాపాడుతాయి. సూర్యకిరణాలు అతణ్ణి బాధించవు. గాలి హాయిగా వీస్తుంది. రాత్రి నిద్రించే టప్పుడు చంద్రుడి కిరణాలు జోలపాడి, చిచ్చి కొడతాయి. మన వీర రాఘవుణ్ణి గురించి నీవు చింతించవద్దు. ఎలాంటి శత్రువూ కూడా అతడ్ని ఎదిరించి ప్రాణాలతో తిరిగి పోలేడు. మన రాముడు సకల కల్యాణ గుణాభిరాముడు. శూరుడు. అతడు తప్పక తిరిగి వస్తాడు. వచ్చి అయోధ్యాపతిగా సింహాసనం ఎక్కుతాడు. లోకనాథుడే రాముడు. అతడి వెంట వెళ్లిన నీ కోడలు సీత ఆదిలక్ష్మికాని వేరు కాదు. రాముడు తిరిగి వచ్చిన తర్వాత భూదేవినికూడా పొందుతాడు. నీవు సందేహించకు. అతడు అడవికి వెళ్లుతున్నప్పుడు పురజనుల పరితాపాన్ని నీవు చూశావు కదా. నా వీరపుత్రుడు లక్ష్మణుడు విల్లమ్ములు, కత్తి పట్టుకుని అతణ్ణి రక్షించడానికి వెంట వెళ్లాడు. రాముడికి ఏలోటూ రాదు. ఎట్టి భయమూ ఉండదు. ప్రతిజ్ఞాపాలన ముగిసిం తర్వాత అతడు తిరిగి రావడాన్ని ఈ కళ్లతోనే చూస్తావు. నేను చెప్పింది నిజం. శోకించకు. నీ కుమారుడు పూర్ణచంద్రుడిలాగా కళలు విరజిమ్ముతూ తిరిగివచ్చి నీ పాదాలంటి నమస్కరించి నిలవడం చూస్తావు. అప్పుడు నీ కళ్లు ఆనంద బాష్పాలు రాలుస్తాయి. అక్కా కౌసల్యా! ఏడవకే. ముగ్గురూ తిరిగి వస్తారు. నన్నూ అంతఃపుర జనాన్నీ నువ్వే ఓదార్చి ధైర్యం చెప్పాల్సిందానివి. అలాంటిది నువ్వే గుండె చెరువు చేసుకూర్చుంటే ఎలాగ? ఊరుకో. లోకంలో రాముడిలాగా ధర్మంకోసం నిలబడే వారెవరు? దాన్ని గురించి మనం దుఃఖించవచ్చా? సంతోషించాలి గాని!" ఇలాగ సుమిత్ర కౌసల్యను ఓదార్చింది. సుమిత్ర ధైర్యవచనాలు విని కౌసల్య దుఃఖం కాస్త తగ్గింది.

* * *

పురజనులు రాముడి రథాన్ని వెంబడించారు.

"అడవికి వెళ్లవద్దు! మరలండి!" అని రథానికి అడ్డుపడుతూ పరుగులు పెట్టారు.

"నాన్నగారిని సత్యసంధుణ్ని చేయడంకోసం నేను అడవికి వెళ్లుతున్నాను. దీనికి మీరు విచారించకండి. నన్ను ఆపకండి" అని ఎంత బ్రతిమాలినా వాళ్లు వినలేదు. రథాన్ని అలా వెంటడిస్తూనే వున్నారు. రాముడిమీద వాళ్ళకున్న సాటిలేని ప్రేమ "అడవికి వెళ్లవద్దు. వెళ్లవద్దు!" అంటూ వాళ్లచేత రథంవెంట పరుగులు పెట్టించింది.

రాముడు రథాన్ని నిలిపి వారిని ప్రేమతోచూసి ఇలా అన్నాడు:

"అయోధ్యా పురజనులారా! నామీద మీకు గల ప్రేమాదరాలను నే నెరుగుదును. ఆ ప్రేమాదరాలను మీరు ఇకమీద భరతుడిమీద చూపించాలి. అలా చేస్తేనే నాకు తృప్తి. భరతుడూ శీలం గలవాడు. అతడి మనస్సుకు నచ్చినట్లు నడుచుకోండి. అతడికి విధేయులై ఉండండి. అతడు వయస్సున పిన్నవాడైనా జ్ఞానంలో పెద్దవాడు. శౌర్యమూ, మృదుత్వమూ కలిగిన గొప్పమనస్సు అతడిది. మిమ్మల్ని క్షేమంగా కాపాడగల శక్తి అతడికి ఉంది. అతడే మీకు నాథుడు. తండ్రిగారి మాటను పాలించడంకోసం నేను అడవికి వెళుతున్నాను. చక్రవర్తి భరతుణ్ని యువరాజుగా నియమించారు. అతడు ఆ పదవికి తగిన గుణాలు గలవాడు. నేనూ, మీరూ కూడా మహారాజు ఆజ్ఞ ప్రకారం నడుచుకోవాలి. మా నాన్నగారికి కలిగిన దుఃఖాన్ని పోగొట్టడానికి మీరు సకలప్రయత్నాలూ చేయాలి."

ఇలాగ రాముడు వాళ్లకి మంచిమాటలు చెప్పాడు.

రాముడి మాటల్లోగల నీతిని, ధర్మాన్ని, ప్రేమను గమనించిన ప్రజానీకానికి ఆయనయందు ప్రేమ ఇంకా ఇనుమడించింది.

సద్గుణ సంపన్నులూ వయోవృద్ధులూ అయిన బ్రాహ్మలు కొందరు వేగంగాపోతున్న ఆ రథాన్నిచూసి "ఓఅశ్వాల్లారా! మా రాముణ్ని ఎందుకు అడవికి తీసుకుపోతున్నారు? వద్దు. గుర్రాలకు

చెవులు చాలా నిశితంకా ఉంటాయని అంటారు. మేం చెప్పినమాట వినండి. రాముణ్ని మళ్లా వెనకకు తీసుకురండి? అని విలపించారు.

అమాయకజనులూ, నగర ముఖ్యులూ, జ్ఞానంలో వయస్సులో వ్రతనిష్ఠలో సిద్ధిపొందిన బ్రాహ్మలూ. ఆఖరికి అయోధ్యలో ఎగిరే పిట్టలూ రాముణ్ని అడవికి వెళ్లవద్దని నిర్భంధించడం చూసి, తమసానది కూడా వచ్చి అడ్డంగా నిలిచినట్లు కనిపించింది. తమసానది ఒడున రథం ఆగింది. సుమంత్రుడు గుర్రాలను విప్పి, నీళ్లుపెట్టి మేతకు వదిలాడు.

"లక్ష్మణా! ఇదే మన వనవాసంలో మొదటిరాత్రి. ఈ పుణ్య నదీతీరాన ఈ రాత్రి ఆగుదాం. వనవాసం ఎంత సుఖంగా ఉంటుందో చూడు. అడవిలోని పక్షులూ, మృగాలూ, వృక్షాలూ మనమీద అభిమానం చూపుతున్నట్లు కనిపిస్తున్నాయి. అయోధ్యలో మన తల్లి దండ్రుల దుఃఖాన్ని తలుచుకుంటేమాత్రం కష్టంగానే ఉంది. భరతుడి గుణాలు తలుచుకొని ధైర్యం తెచ్చుకుంటున్నాను. అతడు మన తలిదండ్రులను ప్రేమతో చూస్తాడు. సందేహం లేదు. సుమంత్రా! గుర్రాలసంగతి చూడు.!" అన్నాడు రాముడు.

తర్వాత నదిలో సాయం సంధ్యావందనం చేసి రాముడు "ఈ రాత్రి ఉపవాసముందాం. ఇది మన వనవాసంలో మొదటిరాత్రి. లక్ష్మణా: నీవు నాతో ఉన్నందున నా కే చింతా లేకుండా హాయిగా ఉంది" అన్నాడు.

సీతా రాములకు పరుండటానికి గడిపరచి లక్ష్మణుడు ఆ రాత్రంతా సుమంత్రుడితో మాట్లాడుతూ గడిపాడు. అతడికి కన్ను మీద కునుకులేదు.

* * *

వేకువజామున రాముడు లేచి సుమంత్రుణ్ని చూసి "పుర జనులు పరుగెత్తి వచ్చారు. వాళ్లు అలిసిపోయి, ఏటిగట్టున ఎక్కడెక్కడో మైమరచి నిద్రిస్తుంటారు. మామీద వాళ్లకిగల ప్రేమ తలచుకుంటే నాకు దుఃఖం వస్తుంది. నన్నెలాగైనాసరే నిర్భంధించి

తిరిగి తీసుకొనిపోవాలని వాళ్ల పట్టుదల. కనక మనం ఇప్పుడే బయలు దేరుదాం" అన్నాడు.

గుర్రాలను రథానికి కట్టి మెల్లగా నదిని దాటి ఆవలి ఒడ్డుకు చేరారు. అక్కడ నిలబడి రాముడు సుమంత్రుడితో ఇలా చెప్పాడు: "రథాన్ని ఆవలి ఒడ్డుకు తీసుకుపోయి అక్కడనుంచి అయోధ్యదిశగా కొంతదూరం తోలుకుపో. ఆ తర్వాత తిప్పి ఇక్కడికి తీసుకురా. ప్రజలు మేల్కొనడానికి పూర్వమే మనం బయలుదేరుదాం. రథం చార చూసి మనం నగరానికి తిరిగిపోయా మనుకొని వాళ్లుకూడా తిరిగిపోతారు. లేకపోతే ఈ జన సమూహం మన వెంటపడతారు."

సుమంత్రుడు అలాగే చేశాడు. రథం తిరిగిరాగానే ముగ్గురూ ఎక్కి దక్షిణదిక్కుగా బయలుదేరారు.

27. గంగోత్తరణం

శ్రమసానది ఒడ్డునే మైమరచి నిద్రించిన అయోధ్యావాసులు ఉదయాన్నే లేచి చూశారు. రాముడి రథం కనిపించలేదు. ఇటూ అటూ చూశారు. రథచక్రాల జాడను వెతుకుతూ పోయారు. ఆ జాడ మళ్లా అయోధ్యకు వెళ్లే దారిలో కలిసివుంది. అది చూసి భ్రమపడి తమ ఇళ్లకు తిరిగి పోయారు. కైకేయిని అనేక విధాల ఆడిపోసుకున్నారు. రాముడు లేని నగరం దుఃఖంతో ఉస్సురుమంటూ వుంది.

* * *

తెల్లారకముందే బయలుదేరిన రథం అడవిలో చాలాదూరం పోయింది. అనేకమైన వాగులూ వంకలూ దాటి కోసలదేశం దక్షిణ సరిహద్దుకు బయలుదేరింది. దారిపొడుగునా రాముడు సుమంత్రుడితో మాట్లాడుతూనే ఉన్నాడు. "నేను తిరిగి సరయూనదీ తీరాన అడవిలో ఎప్పుడు వేటాడుతానో ! అసలింతకూ, వేట మంచిదేనా ? కొంతవరకూ ఇది సమంజసమే అనుకుంటాను. అలాంటి పనుల్లో రాజకుమారులు పాల్గొనాలి. కాని మితిమీరితే, అది దురభ్యాసం అవుతుంది."

ఇలాగ వారు పొద్దుపుచ్చడం కోసం ఎన్నో విషయాలు ముచ్చటిస్తూ వెళ్తున్నారు.

కోసలదేశం దక్షిణ సరిహద్దుకు చేరగానే రాముడు అయోధ్య దిక్కుగా తిరిగి నమస్కరించాడు.

"నగరాలకెల్లా తలమానికమైన నగరమా! ఇక్ష్వాకు వంశ రాజధానీ నగరమా! నా వనవాస వ్రతాన్ని ముగించుకుని తలితండ్రులనూ, నిన్నూ తిరిగి ఎప్పుడు చూస్తాను? అలాంటి సంతోషాన్ని నాకు ప్రసాదించు!" అని ప్రార్థించాడు.

రథం గంగాతీరం చేరింది. గంగానది సౌందర్యాన్ని తిలకిస్తూ వారు వెళ్లారు. అక్కడ చాలా అందంగా ఉన్న ఒక స్థలాన్ని చూసి 'ఈ రాత్రి ఇక్కడ విశ్రమిద్దాం' అన్నాడు రాముడు.

గుర్రాలను విప్పి, ఒక చెట్టుకింద అందరూ కూర్చున్నారు. ఆ ప్రదేశానికి అధిపతి గుహుడు. రాముడు వస్తున్నాడన్న సంగతి ముందుగానే తన సేవకులద్వారా అతడు విన్నాడు. రామలక్ష్మణులను దర్శించడానికి తన పరివారంతో వచ్చాడు.

రాముడంటే గుహుడికి అపారమైన ప్రేమ. గంగా తీరంలోని నిషాదులకు అతడు అధిపతి. మంచి పేరూ పలుకుబడీ గలవాడు. గుహుని రాక అల్లంత దూరాన చూసి రామలక్ష్మణులు లేచి అతనికి ఎదురు వెళ్లారు. గుహుడు రాముణ్ని కౌగిలించుకొని స్వాగతమిచ్చాడు.

గుహుని ఆదర మర్యాదలు గొప్పగా ఉన్నాయి. అతని సేవకులు పలువిధాలైన భోజ్య పదార్థాలూ, భక్ష్యాలూ తెచ్చారు. "మీరు నా రాజ్యంలో సుఖంగా ఉండండి. పదునాలు సంవత్సరాలూ హాయిగా గడపవచ్చు. మీకు ఏ కొరతా ఉండదు. మీ సేవ నా కెంతో ఆనందం. నన్ను దయచూడండి" అన్నాడు గుహుడు.

రాముడతనిని గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. "నాయనా, నీ ప్రేమ ఎటువంటిదో నే నెరుగుదును. నీ ఆదర మర్యా

దలను ఇక్కడ పొందాను. నే నిప్పుడు ఒక వ్రతానికి కట్టుబడి ఉన్నాను. వనవాసానికి వచ్చాను కదా? ఇవిగో, ఇవి నా తండ్రికి మిక్కిలి ప్రియమైన గుర్రాలు వాటికి మంచి మేత ఏర్పాటు చేయించు. వనవాసానికి తగిన ఆహారాన్ని మాత్రమే మేం తీసుకొని పడుకుంటాం'' అన్నాడు.

ఆ రాత్రి సీతారాములు చెట్టుకింద విశ్రమించారు. లక్ష్మణుడు గుహునితోను, సుమంత్రుని తోనూ ముచ్చటిస్తూ రాత్రంతా నిద్ర లేకుండానే గడిపాడు.

గుహుడు లక్ష్మణునితో ఇలా చెప్పాడు:

"నాయనా! నీ వింక పడుకో, విశ్రాంతి తీసుకో! అదిగో: అక్కడ నీ కోసం పడక ఏర్పరిచారు. ఈ అడవిలో నాకు తెలియ కుండా ఎవరూ ఏమీ చేయలేరు. మా వారు కడు మెలకువతో కావలి కాస్తున్నారు. రాముణ్ని గురించిన చింతకాని, భయంకాని నీకు ఎంత మాత్రం అవసరంలేను. సుఖంగా నిద్రపో.''

లక్ష్మణు డిది విని "గుహా! నాకు నిద్ర రావడంలేదు. అదిగో సీతాదేవి. జనక రాజపుత్రి. చక్రవర్తి కోడలు. అటువంటి సుకుమార ప్రాణి, హా! కటికనేలను పడుకుంది. యుద్ధంచేసి ముల్లోకాలనూ గెలవగల పురుషోత్తముడు, నేలపైన దర్భశయ్యమీద పడుకున్నాడు. ఇదంతా చూస్తూ, నాకు నిద్ర ఎలా వస్తుంది గుహా!'' అన్నాడు.

"రాముడు అడవికి వచ్చేసిం తర్వాత అయోధ్యానగరం ఎలా ఉందో? రాచనగరు విలాపాలతో ప్రతిధ్వనిస్తూ ఉంటుందో? కౌసల్యాదేవీ, మా అమ్మా ఇప్పుడు బతికి వున్నారో, లేరో! సందే హంగానే ఉంది. 'అడవికి వెళ్లు' అని నాయనగారు అనేశారే గాని, రాముణ్ని పంపివేసింతర్వాత ఆయన ప్రాణాలు నిలిచి వుంటాయా? వట్టిది. కల్ల! ఆయన మరణిస్తే మా తల్లుల గతి ఏం కావాలె? వారి అంత్యక్రియలు చేయడానికూడా మేం పెట్టి పుట్టలేదన్నమాట. వన వాసం ముగిసింతరువాత మేం తిరిగి అయోధ్య చేరేనాటికి నాయన గారూ, మా తల్లులూ ప్రాణాలతో ఉండి, మమ్మల్ని చూసి సంతో షిస్తారన్న విషయము అనుమానమే'' అన్నాడు.

ఇలాగ దుఃఖముతో మనస్సు కలతచెందగా, మాట్లాడాడు లక్ష్మణుడు. లక్ష్మణుడి మాటలువిన్న గుహుడు కంట తడిపెట్టాడు. ఇలా పరిసంగాలతో ఆ రాత్రి గడిచిపోయింది.

వేకువనే రాముడులేచి లక్ష్మణుణ్ణి పిలిచాడు. "నది దాటాలి. గుహుడితో చెప్పి ఈ విశాల గంగను దాటడానికి పడవ ఏర్పాటు చేయించమను" అన్నాడు.

గుహుడు తన పనివారికి చెప్పి ప్రత్యేకమైన ఒక మంచి పడవను ఏర్పాటు చేయించి, రాముడికి తెలిపాడు. ఆయుధపాణులై, రామ లక్ష్మణులూ, సీతాదేవీ నదీతీరానికి బయలుదేరారు.

సుమంత్రుడు రాముడికి నమస్కరించి, "నా కేమి సెలవు?" అని అడిగాడు.

రాముడు సుమంత్రుని బుజంతట్టి "సుమంత్రా! నువ్వు ఇప్పుడే అయోధ్యకు తిరిగివెళ్లు. చక్రవర్తిని కనిపెట్టుకొని ఉండు" అన్నాడు.

"లోకంలో శీలం, విద్య, సత్ప్రవర్తనా ఎందుకూ కొరగావని ఇప్పుడు తెలుసుకున్నాను. తమరు తమ్ముడితోనూ, వైదేహితోనూ అడవిలో ఉండబోతున్నారు. మరి మా గతేమిటి? కైకేయిరాజ్యంలో మేము ఎలా బతికేది?" అని సుమంత్రుడు పసిబిడ్డలాగ ఎలుగెత్తి యేచ్చాడు.

రాముడు అతని కన్నీరొత్తాడు. "మా వంశానికి నీ కన్న ఉత్తమమిత్రుడు మరొకరు లేరు. నాయనగారికి దుఃఖం కలగనిరీతిగా నడచుకోవడం నీ కర్తవ్యం. ఇప్పుడు ఆయన మనస్సు విరిగిపోయి వుంది. ఆయన ఏంచెప్పినా అది ఉచితమా అనుచితమా? కైకేయికి తృప్తి కలిగించడానికే ఇలా అంటున్నారా? అని ఆలోచన పెట్టుకోక, ఆయన చెప్పినట్లుగా నడుచుకోవాలి. అడవిలో ఉండే మమ్మల్ని తలుచుకొని దుఃఖించవద్దు. మేం పదునాలు సంవత్సరాలూ ఇట్టే గడిపి తిరిగివస్తామని నా మాటగా చక్రవర్తితోనూ, అందరితోనూ చెప్పాలి. భరతుణ్ణి వెంటనే రప్పించి. అతడ్ని యువరాజుగా చేసి, అతడిపై మాకుగల ప్రేమను తెలిపి, పెత్తల్లి దిద్దర్ని, తనతల్లి కైకేయిలాగానే చూసుకోవాలని చెప్పాలి" అన్నాడు.

రాము డిలా చెప్పగానే సుమంత్రునికి దుఃఖం పొంగి పొరలింది. ''నేను ఎలా తిరిగిపోయేది రామా ! ఏమని చెప్పి ఎవరిని ఓరడించ గలను?'' అన్నాడు. రథాన్ని చూచి "మీరు లేని ఈ శూన్యరథాన్ని నే నెలా తోలడం ?'' అని విలపించాడు.

రాముడు సుమంత్రుని మళ్లీ ఓదార్చి ధైర్యం చెప్పాడు. కష్టాలను సహించి, ఓర్పుతో ఉండడమే నీ కర్తవ్యమని బోధించి పంపివేశాడు.

తర్వాత రాముడు గుహుణ్ణి చూచి "గుహా ! నీవు కోరినట్లు నేను నీ రాజ్యంలో పదునాల్గు సంవత్సరాలూ సుఖంగా గడపవచ్చు. కాని అది నేను సంకల్పించిన వనవాసం కాదుకదా ? నా తండ్రి మాటలను నిలపడంకోసం నేను అయోధ్య విడిచివచ్చాను. కనుక నేను తాపసవృత్తిని అవలంబించవలసి ఉంది. వండిన రుచ్య పదార్థాలను నేను తాకరాదు. పండ్లు, కాయలు, దుంపలు, శాస్త్రనిషిద్ధం కాని మాంసమూ మేమే సంపాదించి అగ్నిలో పేల్చి ఆరగించవలసి ఉంది'' అన్నాడు, రాముడు.

ఇలాగ గుహుని సమాధానపరచి అక్కడ మర్రిపాలు రాసు కొని కురులను జడలుగా కట్టుకొన్నారు.

ముందు సీతను పడవ ఎక్కించి, తర్వాత రాము లక్ష్మణులు పడవ ఎక్కారు. గుహుడు పడవ నడపమని తన పనివారికి ఆజ్ఞాపించాడు. వారు పడవను గంగలో వేగంగా నడిపారు. సీత పడవ నది మధ్యకు చేరగానే గంగాదేవిని ధ్యానించింది. "దేవీ ! మా వ్రతం పూర్తిచేసుకొని తిరిగి క్షేమముగా నిన్ను దాటి అయోధ్యకు చేరేటట్లు మమ్మల్ని అనుగ్రహించు తల్లీ !'' అని నమస్కరించింది.

తరువాత వారంతా ముచ్చటించుకుంటూ గంగను దాటి అవతలి ఒడ్డు చేరుకున్నారు. అక్కడ ఆ ముగ్గురూ తొలిసారిగా ఎవరి తోడూ లేకుండా నిలిచారు.

"లక్ష్మణా ! ఇక నీవే మాకు అంగరక్షకుడవు'' అని రాముడు అన్నాడు. "నువ్వు ముందు వెళ్లు. సీత నీ వెనక ఉంటుంది. మీ ఇద్ద

రికీ వెనుక నేనుంటాను : సీతకు వనవాసక్లేశం లేకుండా మనం చూడాలి. ఇక జనసమూహం లేదు. ఆటపాటలు లేవు."

అప్పుడు రాముడికి కౌసల్యాదేవి జ్ఞాపకం వచ్చి, ఎంతగానో విలపించాడు.

"లక్ష్మణా : నువ్వు తిరిగివెళ్ళి నన్ను కన్న కౌసల్యాదేవినీ, నిన్ను కన్న సుమిత్రాదేవినీ కనిపెట్టి ఉండడం మంచిదికాదా ? నేను ఎలాగైనా ఇక్కడ గడపగలను" అన్నాడు. ఇది విని లక్ష్మణుడు "అన్నా! మన్నించండి. నేను అయోధ్యకు తిరిగి వెళ్లలేను" అన్నాడు దీనముగా. ఈ జవాబు వస్తుందని రాము డెరుగును.

ఇలాగ మాటిమాటికీ మానవస్వభావం తల ఎత్తగా, రాముడు విలపిస్తూ ఉండడం మనము చూస్తాము. రామాయణంలోనే అందమే అది. సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడు ఈశ్వరుడుగానే అన్నీ చేస్తూ ఉంటే ఇక అవతారం ఎక్కడిది ? సామాన్యధర్మాలను భూమిమీద ప్రతిష్ఠించడం ఎక్కడిది? అంతకుముందు అవతారాలకూ ఈ అవతారానికీ గల భేదము ఇదే. రామావతారంలో మనకు మానవ స్వభావమూ, సామాన్యధర్మాల గొప్పతనమూ అడుగడుగునా గోచరిస్తాయి. యుద్ధం ముగిసి సీతాదేవి అగ్నిప్రవేశం చేసే సమయంలో రామచంద్రుడు ఈ విషయాన్నే ఇలా చెప్పాడు :

"ఆత్మానం మానుషం మన్యే
రామం దశరథాత్మజం"

"నన్ను నేను దశరథ కుమారుడైన రాముడు అనే మానవుడిగానే భావిస్తున్నాను. నిజానికి నేను ఎవణ్ణి ? ఎవరివాడను? ఎందుకు పుట్టాను ? ఈ విషయాలు నాకెలా తెలుస్తాయి ? తామే నాకు చెప్పాలి" అని అప్పుడు రాముడు బ్రహ్మదేవుణ్ణి అడిగినట్లు వాల్మీకి మహర్షి వర్ణించాడు.

గంగానది దక్షిణపు ఒడున రాముడు దుఃఖిస్తూ మాట్లాడినప్పుడు లక్ష్మణుడు ఆయనను ఓదార్చాడు.

నాటిరాత్రి మర్రిచెట్టుకింద గడిపి మర్నాటి ఉదయం బయలు దేరారు. సంజెవేళకు భరద్వాజ మహర్షి ఆశ్రమానికి చేరారు. అక్కడ భరద్వాజుని ఆతిథ్యం స్వీకరించి "మహర్షీ! మేము ఏకాంతంగా వనవాసం చేయడానికి అనువైన చోటేది?" అని అడిగారు. ఋషి చెప్పిన హితవునూ, ఇచ్చిన దీవెనలనూ పొంది వారు చిత్రకూటానికి బయలుదేరారు.

28. చిత్రకూటం

భరద్వాజుని ఆశ్రమంలో ఒకరాత్రి గడిపి, ఉదయానే లేచి, రామ లక్ష్మణులూ సీతాదేవీ మహర్షికి నమస్కరించి చిత్రకూట పర్వతానికి బయలు దేరారు. వేరు తోడులేకుండా అడవికి వెళుతున్న రాజకుమారులను తన కన్న బిడ్డల్లాగ ప్రీతితో చూచి మంత్రపూర్వకంగా ఆశీర్వదించి వీడ్కోలు ఇచ్చి సాగనంపాడు, భరద్వాజుడు. వెళ్లవలసినదారులను గురించి చక్కగా వివరించి చెప్పాడు. ఆయన చెప్పిన మార్గాన ముగ్గురూ బయలు దేరారు. ఉరుకుతూ పరుగులు పెడుతున్న కాళిందీనదిని దాటడానికి మహర్షి చెప్పినట్లుగా ఒక తెప్పను కట్టుకున్నారు. కట్టెలు, వెదుళ్ళ నరికి తెచ్చి అడవితీగెలతో చక్కగా తెప్పకట్టారు. దానిమీద సీత కూర్చోటానికి లక్ష్మణుడు చిగురుటాకులను, రెమ్మలను పరిచాడు. తెప్పమీద కూర్చోమని రాముడు చెప్పినప్పుడు సీత నునుసిగ్గుతో కూర్చుంది. తర్వాత సీతాదేవి బట్టలమూటనూ, దుంపలు తవ్వడానికి తెచ్చిన తవ్వుగోలా, గంపా మొదలైన పరికరాలూ తెప్పపైన పెట్టి, తానుకూడా ఎక్కాడు. ఆ తెప్ప నది మధ్యకు వెళ్లగానే సీతాదేవి కాళిందీనదికి నమస్కరించి "నాథుని ప్రతిజ్ఞ పూర్తి అయి, ముగ్గురం క్షేమంగా తిరిగి వచ్చేటట్లు అనుగ్రహించు మాతా!" అని ప్రార్థించింది. వారు క్షేమంగా కాళిందీనదిని దాటారు.

ఇలాగే మరికొన్ని నదులను దాటి వెళ్లింతర్వాత భరద్వాజ మహర్షి చెప్పిన గొప్ప మర్రి చెట్టు కానవచ్చింది. సీతాదేవి ఆ మర్రి

చెట్టుకు పూజచేసి "మహా వృక్షమా! నా భర్త వ్రతం పూర్తి అయ్యే ట్లు అనుగ్రహించు. కౌసల్యా సుమిత్రలను నేను తిరిగి చూడగలిగే ట్లు అనుగ్రహించు" అని ప్రార్థించింది.

"లక్ష్మణా! నువ్వు సీతతో ముందు వెళ్లు. నేను ఆయుధ పాణినై మీ వెనకనే వస్తాను. తోవలో ఆమె పువ్వులడిగినా పళ్లు అడిగినా కోసి ఇచ్చి, ఆమెను ఉత్సాహపరుస్తూ ఉండు. ముందునడు" అన్నాడు రాముడు.

అలాగే సీతాదేవి కూడా "అదేం చెట్టు? ఇదేం చెట్టు? అదిగో, ఆ తీగె చూడు: ఆ పువ్వులు చూడు, ఎంత అందంగా ఉన్నాయో!" అని రాముణ్ణీ లక్ష్మణుణ్ణీ అడుగుతూ, అంతకుముందు తాను చూడని పువ్వులనూ పళ్లనూ చూసి ఆనందిస్తూ నడవసాగింది.

అలావెళ్లి వారొక ఏటి ఒడ్డుకు చేరుకున్నారు. అడవిలో అనేక రకాల మృగాలనూ, పక్షులనూ సీతకు చూపి, సంతోషంగా తిరిగివచ్చి ఆ రాత్రి ఏటి ఒడ్డున గడిపారు.

ఇక్కడా, మరికొన్ని చోట్లా, రామలక్ష్మణులు పూజకూ భోజనానికీ తగిన మృగాలను వేటాడి భుజించారని వాల్మీకి మహర్షి స్పష్టంగా, సందేహానికి తావివ్వకుండా, రాశాడు. ఇది చూసి మనం కలత చెందవలసిన పనిలేదు. క్షత్రియ కులాచారాన్ని అనుసరించి మాంసభక్షణ చేయటం దోషంలేదు. కాలానికీ కులాచారానికీ తగినట్టు ఎలాంటి ఆహారాన్నయినాసరే, తగు పద్ధతిలో సంపాదించి పూజించి, మితి తప్పకుండా భుజిస్తే, అందులో ఎట్టి దోషమూ ఉండదనేది భారతదేశ సామాన్య ధర్మం.

* * *

మర్నాడుదయం రాముడు లక్ష్మణుణ్ణి లేపి "చెట్టుపై పిట్టల కలకలారావం విను. బయల్దేరడానికి వేళ అయినట్టుంది" అన్నాడు.

లక్ష్మణుడు వనవాసకాలంలో నిద్రాహారాలు మాని, వ్రతం పూనినట్టు వాల్మీకి రామాయణంలో ఎక్కడా లేదు. కనక లక్ష్మ

ణుణ్ణి వేకువజామున, ఇంకా కొంచెము నిద్రమైకంలో ఉండగానే రాముడు లేపాడని ఇక్కడ చెప్పడంలో దోషం లేదు.

వెంటనే లక్ష్మణుడు నిద్ర లేచాడు. అందరూ స్నానం, జపం ముగించుకుని బయలుదేరారు.

వారంతా భరద్వాజముని చెప్పిన దారివెంబడే వెళ్లారు. అది వసంతకాలం. చెట్లూ, తీగెలూ, రంగురంగుల పూలతో ప్రకాశిస్తున్నాయి. కొన్ని చెట్లు వాటి పళ్ల బరువుతో కొమ్మలు విరుగుతాయా అన్నట్లున్నాయి. "గొడ్డలి వేటు సోకని ఈ చెట్ల అందం చూడు! తేనె తెట్టెలు ఎలా వేలాడుతున్నాయో! నేలను పూలు రాలి పూలపెజ్జలాగే ఉంది. అదిగో, ఆ పిట్టల కలకలారావాలు విన్నావా? ఒక దానితో ఒకటి వంతులాడి, కొసరి కొసరి, ఎంత మనోహరంగా పాడుతున్నాయో! ఈ అందాలను అనుభవిస్తూ మనం వనవాసాన్ని ఎంత కాలమైనా హాయిగా గడపవచ్చు" అని రాముడు లక్ష్మణుడితోను, సీతతోను అప్పుడప్పుడు చెప్పుతూ, అడుగులు వేస్తున్నాడు.

అంతలో చిత్రకూట పర్వతం కనిపించింది. అది కనిపించగానే ఇంకా సంతోషంతో నడక సాగించారు.

"ఈ కొండచరియల అందం ఎంత చూసినా తనివితీరడం లేదు. ఇక్కడ కందమూలఫలాలు పుష్కలముగా ఉన్నట్లు కనిపిస్తూంది. ఇక్కడి నీరు ఎంత తేటగా ఎంత తియ్యగా ఉంది! మునులూ ఆశ్రమవాసులూ ఉండే ఈ అడవిలో మనం హాయిగా ఉండవచ్చు" అన్నాడు రాముడు.

* * *

తరువాత ఉండడానికి ఒక ఆశ్రమం నిర్మించుకోవాలని వారు నిశ్చయించుకున్నారు. లక్ష్మణుడు మంచి నేర్పరి. సకల సౌకర్యాలూ, వసతులూ గల పరశాల ఒకటి నిర్మించాడు. గాలి వానలకు లొంగకుండా దాన్ని కట్టుదిట్టం చేశాడు. కిటికీలకు తలుపులు అమర్చి, చాపలు వేలాడగట్టి అందంగా చేశాడు. ఇదంతా లక్ష్మణుడు ఒంటిచేతిమీదనే పూర్తిచేశాడు.

రమణీయమైన చిత్రకూట పర్వతం మొగిలో, మాల్యవతీ నదీ తీరాన, ఈ ఆశ్రమం నెలకొల్పుకుని వారు ముగ్గురూ అక్కడ నివసిం

చారు. ఏ చీకూ చింతా లేకుండా వనవాస ధర్మాన్ని అనుసరిస్తూ ఉన్నారు పుట్టి పెరిగిన నగరాన్ని విడిచి, నిర్వాసితులై ఉండికూడా దుఃఖమనేది లేక, ఇంద్రుడు దేవగణంతో స్వర్గంలో నివసించినట్లుగా వారు ఆశ్రమంలో ఆనందంగా పొద్దుపుచ్చుతున్నారు.

* * *

ఈ ఘట్టాన్ని కంబరుకవీ, వాల్మీకీ పోటీ పడినట్లుగా ఒకరిని మించి మరొకరు అతిరమణీయంగా వర్ణించారు.

పర్ణశాల నిర్మాణం పూర్తికాగానే "ఈ పర్ణశాల కట్టే పని ఎక్కడ నేర్చావు" అని రాముడు లక్ష్మణుని కౌగిలించుకొని, కంట తడి పెట్టాడని కంబరుకవి గానంచేశాడు. అలాగే జరిగి ఉంటుంది.

"పూలకన్నా కోమలాలైన పాదాలుగల ఈ మిథిలా రాజ కుమారి ఆ కారడవిని కాలినడకనే దాటింది. ఆమె పాదా లొనరించిన అద్భుతకృత్యంలాగే, తమ్ముడా! నీ చేతులు కూడా పర్ణశాలా నిర్మాణంలో అద్భుత కౌశలాన్ని చూపాయి. ఈ దురదృష్ట స్థితిలో మనకు లభించిన అదృష్టాన్ని నీ చేతి పనిలో చూశాను" అని ఆనంద బాష్పాలు రాలగా, రాము డన్నమాటలను కంబరుకవి అద్భుతంగా గానం చేశాడు. ఈ చిత్రకూటంలోని ఆనందస్థితి ముందు రాబోయే కష్టాలకు, దుఃఖాలకూ అడ్డుగా ఉన్న ఒక తెరలాగా కనిపిస్తూంది.

ఇక్కడ రామ లక్ష్మణులనూ, సీతనూ విడచి, కంబరుకవీ, వాల్మీకీ ఇరువురూకూడా అయోధ్యకు వెళ్లుతున్నారు. అయోధ్యకు ఏర్పడిన సంతాపస్థితిని, భరతుడి తలపై అన్యాయంగా పడిన అపకీర్తినీ, దుఃఖాన్నీ గమనించడానికి వారు వెళ్లుతున్నారు.

29. కన్నతల్లి దుఃఖం

ముగ్గురి రూపూ కంటికి కనిపిస్తూ ఉన్నంతవరకూ సుమంత్రుడూ, గుహుడూ వారిని అలా చూస్తూనే నిలబడ్డారు. వారు కను మరుగు కాగానే ఆ ఇద్దరూ దుఃఖంలో మునిగి గుహుని నగరానికి

వెళ్లారు. తర్వాత సుమంత్రుడు గుహుని అనుజ్ఞ తీసుకుని అయోధ్యకు మరలాడు.

నగరం దలిదాపులకు వచ్చేసరికి వాడుకగా కనిపించే ధ్వనులకూ దృశ్యాలకూ బదులు మబ్బులు కమ్మినట్టుగానూ, నిర్జీవంగానూ, నగరం పాడుపడినట్లు కనిపించింది. సుమంత్రుని రథం సింహద్వారం దాటి నగరంలో ప్రవేశించగానే "రాము డెక్కడ? రాము డెక్కడ?" అని పౌరులంతా రథాన్ని చుట్టుముట్టారు.

"బిడ్డలారా! రామలక్ష్మణులు గంగను దాటిపోయారు. నన్ను అయోధ్యకు మరలిపొమ్మని చెప్పి, వారు కాలినడకన అడవికి వెళ్లారు" అని సుమంత్రుడు వారితో చెప్పాడు.

ఇది విని ప్రజలు "అయ్యో! ఏం పాపం చేసుకుని, ఈ పాడు జన్మ ఎత్తామో!" అని గోలపెట్టారు. రథాన్ని చూసి "ఈ రథం మీదనేకదా, పున సీతా రామలక్ష్మణులు వెళ్లారు. ఇప్పుడిది ఎలా పాడు పడి పోయిందో!" అని రాజవీధులకు ఇరు పక్కలా ఆడవారు నిలబడి విలపిస్తూండగా, అది వింటూ సుమంత్రుడు తన ముఖాన్ని కొంగుతో కప్పుకుని, పోయిపోయి, రథాన్ని దశరథుడి నగరు వాకిట నిలిపి, దిగాడు.

నగరు వాకిట జనసమూహం నిండి ఉంది. "రాముణ్ణి అడవిలో విడిచి వచ్చిన వీరు కౌసల్యకు ఏమని చెప్పబోతున్నారు? ఆమె ప్రాణాలెలా నిలుస్తాయి?" అంటూ స్త్రీలు ఒకరితో ఒకరు చెప్పుకుంటున్నారు. ఈ మాటలు వినేసరికి సుమంత్రుడికి దుఃఖం పెల్లుబికింది. అతడు మెల్లగా అలాగే అంతఃపురానికి వెళ్లాడు. అక్కడ కొన ప్రాణంతో ఉన్న చక్రవర్తిని చూశాడు. పక్కన నిలిచి రాముడు చక్రవర్తికి చెప్పమన్న మాటలన్నీ మెల్లగా మనవిచేశాడు. దశరథుడు ఏమీ మాట్లాడలేదు.

అప్పుడు కౌసల్యాదేవి దుఃఖాన్ని ఆపుకోలేక దశరథుణ్ణి చూసి కటువుగా మాట్లాడింది:

"మహాభాగ్యశాలివైన చక్రవర్తీ ! లోకమంతా ఆశ్చర్యపడే మీ వరదానానికి కట్టుబడిన నా బిడ్డను, అడవిలో దిగబెట్టి వచ్చిన అమాత్యశేఖరు లిదిగో, నిలబడ్డిఉన్నారు. ఆయనతో ఏమీ మాట్లాడ రేం ? కైకేయికి వరం ఇచ్చినప్పుడు తమకు తేలికగానూ సంతోషం గానూ ఉండెనే ! ఇప్పుడెందుకు సిగ్గుపడుతున్నారు ? వరానికి ఫలితం ఇదేనని తమరెరుగరా ? మీరు మీ మాట నిలుపుకున్నారు. తమకు కొరవేమిటి ? కాని, నా దుఃఖాన్ని పంచుకోగలిగిన వారెవరు ? దాన్ని నేనే అనుభవించి తీరాలి. తమరు దుఃఖించడం చూస్తే నాకు తృప్తి కలుగుతుందా ? దుఃఖించవలసిన ధర్మం ఉందికదా అని తమరు దుఃఖించనక్కరలేదు. ఏం, మాట్లాడరేం ? ఇక్కడ కైకేయి లేదు. భయపడకండి. రాముణ్ని అడవిలో విడిచి వచ్చిన సుమంత్రుణ్ని ఆ వృత్తాంతం అడగండి. భయం ఎందుకు ? మీ స్వభావాన్ని ఎందుకు దాచుకుంటారు ? కైకేయి ఇక్కడ లేదుకదా ?"

దుఃఖాన్ని భరించలేక కౌసల్య ఇలా భర్తను దూషిస్తూ మాట్లాడింది.

కోపం, దుఃఖం, పతిభక్తి, అన్నీ ఒకటిగాచేరి ఆమె హృదయాన్ని కలచి వేశాయి. ఆ కలతను భరించలేక ఆమె మూర్ఛ పోయింది. అది చూసి ఆమె ప్రాణాలు విడిచిందేమోనని అంతఃపురంలోవారంతా భయపడ్డారు. అంతఃపురం అల్లకల్లోమై పోయింది.

పుత్రశోకంవల్ల కౌసల్యాదేవి భర్త శరీర స్థితినీ మానసిక సితినీ చక్కగా గమనించలేక పోయింది. ఆయన దుఃఖాన్ని తగ్గించడానికి మారుగా తన మాటలవల్ల ఇంకా ఎక్కువచేసింది. దశరథుడు మూర్ఛ తేరింతరువాత సుమంత్రుణ్ని అడిగాడు. సుమంత్రుడు రాముడి మాటలను చెప్పవలసిన వారందరికీ చెప్పి, తన కర్తవ్యాన్ని నెరవేర్చుకున్నాడు.

* * *

కౌసల్యాదేవిని సుమంత్రుడు అనేక విధాల ఓదార్చి జూచాడు. "నన్ను రాముడి వద్దకు చేర్చు. అయ్యో, సీతనూ అడవికి పంపించామే!

ఈ దుఃఖాన్ని నేను ఎలా భరించేది? నేనుకూడ సీతతో దండకార ణ్యంలో ఉంటాను" అని కౌసల్య బిట్టుగా విలపించింది.

"దేవీ! కలత మాని ధైర్యంగా ఉండండి. అయోధ్యకన్న అడవి లోనే రాముడు చాలా ఆనందంగా గడుపుతున్నాడు. ఆయనకు దుఃఖం లేదు. లక్ష్మణుడు ఆయనకు సేవచేస్తూ, తన ధర్మాన్ని నిర్వర్తించు కొంటున్నాడు. ఆయనకు ఏలోటూ లేదు. ఇక సీతాదేవి, అంతఃపురంలోలాగానే అరణ్యంలోకూడా తనప్రాణాన్ని రాముడికి అర్పించి చీకూచింతా, భయం భీతీ ఏదీలేకుండా సంతోషంతో ఉన్నారు. అడవి లోనేపుట్టి అడవిలోనే పెరిగిందా ఈమె అన్నట్లు, సహజంగా, సుఖంగా కాలం గడుపుతున్నారు. అయోధ్యలోని ఉద్యాన వనంలో రాముడితో వినోదంగా విహరించినట్లే అక్కడ అడవిలోనూ హాయిగాఉన్నా రామె. ఉదయ చంద్రుడివంటి ఆమె ముఖశోభ కొంచెంకూడా వన్నె తరగలేదు. భయమూ చింతాలేక, పసిబిడలాగా మాట్లాడుతున్నారు. రాముడి పక్కనే ఉన్నందున, ఆమెకు దుఃఖం ఏమీలేదు. దారిపొడ వున స్థలపురాణాలూ, ఏరులు, చెట్లు, తీగెలు, పువ్వులూ వీటి వివ రాలూ అడిగి తెలుసుకుంటూ, రామలక్ష్మణులతో ఆమె ఉల్లాసంగా నడిచి పోతున్నారు. వనవాసం ఆమెకు ఉద్యాన కేళిలాగా ఉంది. ఆమె అందం ఏమీ తగ్గలేదు. నడకవల్ల ఆమె పాదాలు పారాణి పూయకనే ఎర్రవారి తామర పూలవంటి కాంతితో విరాజిల్లుతున్నాయి. అర ణ్యంలో ఆనంద నర్తనం చేస్తున్న నదిలాగా ఆమె నడుస్తున్నారు. కాళ్లకు గజ్జెలు లేవన్న కొరత ఒక్కటే తప్ప. నేను చెప్పేదంతా సత్యం. మీరు అధైర్య పడవద్దు. వారు ముగ్గురూ లోకానికి గుణ పాఠం కాగల ధర్మాన్ని ఆచరిస్తూన్నారు. వారి తపస్సు లోకంలో శాశ్వతకీర్తి ని సంపాదిస్తుంది. మీరు దుఃఖించటం తగదు."

సుమంత్రుడు ఇలా కౌసల్యను పరిపరి విధాల ఓదార్చ జూచాడు. కౌసల్య కొంత సేపు ఊరడిల్లుతుంది. కాని అంతలోనే "అయ్యో, రామా! అయ్యో, బిడ్డా!" అని శోకిస్తుంది. అడవిలో రామున్ని విడిచి వచ్చిన సుమంత్రుణ్ని చూస్తూంటే ఆమెకు దుఃఖం ఆపుకోలేనంతగా పొర్లి రాసాగింది.

30. ముందు కథ

కౌసల్య దశరథుణ్ని నిందిస్తూనే ఉంది. అలా నిందించడంవల్ల తన పుత్రశోకం కొంతతగ్గి, మనస్సు ఊరటపొందినట్టు అనిపించింది.

దశరథుడి స్థితి చిక్కున పడింది. తప్పించుకుందా మంటే, మహా క్రౌర్యానికి దిగినవాడిలాగా ఉంది ఆయన స్థితి. తాను చేసిన తప్పి దంవల్ల ఏర్పడిన అక్రమాన్ని ఆత డెరక్కపోలేదు. అయినా ధర్మ సంకటంనుంచి తప్పించుకొనే తోవ అతనికి కనిపించలేదు. రాముడు తండ్రి ఆజ్ఞను ఉల్లంఘించి, రాజ్యంకోసం ఎదిరించి పోరి ఉంటే, దశరథుడికి ఆనందం కలిగి ఉండేది. తాను చిక్కుకున్న వలలోంచి దశరథుడు తప్పించుకోగలిగి ఉండేవాడు. కాని రాముడు చూడ బోతే "తండ్రి ఆనతి జవదాటను, అడవికి పోవడమే నా కర్తవ్యం" అని చెప్పి ధర్మదీక్షతో అడవికి పోయాడు. సీతా లక్ష్మణుడు కూడా రాముడివెంట వెళ్లడమే తమ ధర్మమని ఎంచుకొన్నారు. వారు అడవికి వెళ్లడం ఎవ్వరూ ఆపలేకపోయారు.

ఇలాంటి స్థితిలో చక్రవర్తికి ఏం చేయడానికీ పాలుపోక కౌస ప్రాణంలో ఉన్న సమయాన, కౌసల్య తనకు తోచిన న్యాయాన్ని ఏకరువుపెట్టి, దశరథుణ్ని కఠినముగా పొడిచి పొడిచి మాట్లాడింది.

"ఎవ రెలాపోతే మీకేంచింత? మీ సత్యం నిలుపుకోవడం, ఆ జవరాలితో సుఖంగా ఉండడమే, మీకు కావలసింది. మరి, నాకెవరు గతి? ఆడుదానికి నాధుడేకదా గతి. కాని నా నాధుడు ఇంకొక భార్యను చేరి నన్ను విడిచాడు. నా కొడుకు అడవులు పట్టాడు. పుట్టింటివారు దూరాభారాన ఉన్నారు. అయినా భర్త బతికి ఉండగా నే నెక్కడికి ఎలా వెళ్లగలను? బంధువుల నీడను ఎలా బతకగలను? ఈ విధంగా దిక్కులేనిదానినై పడి ఉన్నాను, ఎవ రెలాపోతే మీకేం చింత? కైకేయీ, భరతుడూ సుఖంగా ఉంటే చాలు మీకు. మీ రేమీ ఆలోచనలో పడవలసింది లేదు. రాముడు పధ్నాలుగేళ్లూ అరణ్య వాసం గడిపి వచ్చింతర్వాత, తిరిగివచ్చి మీ సుఖాన్ని చెరుస్తాడని భయపడకండి. రాముడు తిరిగి వచ్చినా, భరతుడి రాజ్యాన్ని ఆం

చడు. ఒక జంతువు చంపితిన్న మాంసశేషాన్ని అడవిలో పులి తాకనే తాకదు. చేప, తన బిడ్డలను తానే తిన్నట్లు, కన్నబిడ్డలను మీకు మీరే చంపుకొన్నారు.''

ఇలాగ పుండు పొడిచినట్లు కౌసల్య భర్తను ఆడిపోసుకుంటూనే ఉంది.

ఈ మాటలు విని విని వేదన భరించలేక చక్రవర్తి "అయ్యో! నాగతి ఎందుకిలా అయింది?'' అని అనుకునేసరికి చిన్ననాటి ఒక సంఘటన జ్ఞాపకం వచ్చింది. అది మననం చేసుకుంటూ, చింతలో మునిగాడు.

కొంతసేపు అయింతర్వాత నిట్టూర్పు విడిచి కళ్లుతెరిచి చూశాడు. పక్కన కౌసల్య కనిపించింది.

పూర్వవృత్తాంతం ఒకటి గుర్తుకు వచ్చి దశరథుడి దుఃఖం ఎక్కువయింది. ఆ స్థితిలో భార్యను చూసి చేతులు జోడించి "కౌసల్యా! నన్ను క్షమించు!" అంటూ వాపోయాడు.

"పరాయివాళ్లు చేసిన తప్పుల మన్నించే ఉదారమతివే! నామీద ఎందుకు నీ కీ కాఠిన్యం? భర్త చెడ్డవాడైనా భార్యకు అతడే దైవమని పెద్దల వాక్యంకదా. నీకు నావల్ల ఎంతో దుఃఖం కలిగినమాట నిజమే. అయినా ఇలా హింసించడం న్యాయం కాదు సుమా!" అన్నాడు.

అది విని కౌసల్య "పెద్దసైన్యంతో శత్రువులు ముట్టడించినప్పుడు కలిగే దుఃఖంకన్న కడుపు చిచ్చు చాలా ఎక్కువతాపం కలిగిస్తుంది. ఈ దుఃఖాన్ని నేను సైరించలేకున్నాను. మన్నించండి. రాముడు అడవికివెళ్లి ఆయిదురాత్రులైందని లెక్క చెప్పుతున్నారు. నాకుమాత్రం అయిదు సంవత్సరాలైనట్లు తోస్తూంది. రాముణ్ని తలచుకున్నకొద్దీ నా దుఃఖం నదీ ప్రవాహంలాగ పొంగి పొరలుతూంది. నేనేం చేసేది? ఈ దుఃఖ ప్రవాహంలో పడి నేను వశం తప్పిపోతున్నాను. నన్ను మన్నించండి'' అంది.

ఇలా కౌసల్య చెప్పిన ప్రియవచనాలు విని దశరథుడు కొంచెం ఊరడిల్లాడు. అప్పుడు సూర్యుడు అస్తమించాడు. చీకటి కమ్ముకొంది. దుఃఖంతో అలసిన చక్రవర్తిని మెల్లగా నిద్ర ఆవరించింది.

* * *

అర్ధరాత్రివేళ దశరథుడు మేల్కొని పక్కన కౌసల్య ఉండడం చూశాడు.

"రాణీ! పక్కనే ఉన్నావా? కర్మఫలాన్ని మార్చడానికి ఎవరి వల్లవుతుంది? నేను చేసిన పాపానికి ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నాను. మనుషులు అజ్ఞానవశాన అల్ప సంతోషంకోసం గొప్ప హానితెచ్చే పనులు చేస్తూ ఉంటారు. తర్వాత ఫలితాన్ని దుఃఖిస్తూ అనుభవిస్తారు. నా చిన్ననాడు శబ్దవేధి విద్యను నేర్చుకున్నాను. చీకటిలో శబ్దం వినిపిస్తేచాలు, లక్ష్యాన్ని కొట్టగల నేర్పరితనం నాకు అలవడింది. ఆ నేర్పరితనాన్ని ప్రదర్శించాలనే సంతోషంకొద్దీ ఒకప్పుడు నేను గొప్ప పాపం చేశాను. ఆ వృత్తాంతం చెబుతా, విను" అంటూ దశరథుడు ఇలా మొదలు పెట్టాడు:

"అప్పటికి నువ్వు నన్ను పెళ్లాడలేదు. ఒకరాత్రి రథమెక్కి సరయూనదీ తీరాన వేటకు వెళ్లాను. హోరుమని వర్షం. కొండల మీది ధాతువులు. కొత్తమట్టి కరిగి వాననీరు రంగురంగులతో నదిలో పారుతూంది. పక్షుల కలకలం అణగి అడవి నిద్రించినట్లుంది. రాత్రిపూట నీరు తాగడానికి పులి, ఎలుగు మొదలైన మృగాలు వస్తే ఆ ధ్వని విని గురిపెట్టి కొట్టగల నేర్పు నాకుంది. ఆ నేర్పును పరీక్షించి చూసుకుందామని సరదా పుట్టింది. అంతా కారుచీకటి. ఆ సమయాన ఒక ఏనుగు నీరు తాగుతున్నట్లు బొళబొళమని ధ్వని వినవచ్చింది. వెంటనే బాణాన్ని గురిపెట్టి ఆ ధ్వనివచ్చే దిక్కుగా విడిచాను. నా బాణం విషసర్పంలాగా దూసుకుపోయి లక్ష్యాన్ని కొట్టింది. 'అయ్యో, చచ్చా' అని ఒక మానవకంఠం వినిపించింది. దిగ్భ్రమ చెందాను.

'నాపై ఈ ద్వేషం ఎవరికి? నేను ఎవరికీ కీడు చేయలేదే? నీరు ముంచుకుని పోదామని వచ్చిన నన్ను ఎవడో చంపాడే! ఏ ఫలితాన్ని

కోరి నన్ను చంపాడు? నేను ఏ పాపమూ ఎరగనే! వ్రతనిష్ఠతో తాపసి జీవితాన్ని గడిపే నాపైన ఎవరి కీవిరోధం? కళ్లులేని నా ముసలి తలిదండ్రులు ఇంక ఏం చేయగలరు? నన్నేనమ్ముకు ఉన్నవారు ఇన ఎలా బతకగలరు? అయ్యో! అన్యాయంగా నన్ను చంపిన వారెవరు?' అని పరితాపంతో ఎవరో విలపించడం విన్నాను. దిగులుతో మనస్సు కుంగిపోయింది. విల్లమ్ములు వాటంతటవే చేతినుండి జారి పడి పోయాయి.

ఆ యేడ్పు వినిపించిన దిక్కుగా బయలుదేరాను. జుట్టు ముడి వీడి, చెదరి, శరీరమంతా రక్తంతో బురదతో నేలపై పొర్లుతున్న ఒక తాపసిని చూశాను. పక్కన నీటికుండ దొర్లిపడి ఉంది. నన్ను చూడంతోనే అతడి కన్నులనుంచి ప్రసరించిన కాంతి జ్వాలలాగా వెలిగిపోతూంది.

'పాపీ! నీవా, నన్ను చంపావు. నీళ్లు ముంచుకోవడానికి వచ్చిన నన్ను ఎందుకు బాణంతో కొట్టావు? నా తలిదండ్రులు వృద్ధులు. పైగా అంధులు. ఆశ్రమంలో దప్పికతో కాచుకొని ఉన్నారు. నేను నీళ్లు తెస్తానని ఎదురుచూస్తూ ఉంటారు. ఒరే! పాపీ! నన్నెందుకు చంపావు? అయ్యో, దైవమా! నా తపస్సు, వ్రతాలు, వేదాధ్యయనం అన్నీ వ్యర్థమై పోయాయే? నే నిలా దెబ్బతగిలి ఇక్కడ పడి ఉన్నానని నా ముసలి తలిదండ్రులకు తెలియదే. ఇదుగో వస్తాడు, అదుగో వస్తాడని ఎదురుచూస్తూ ఉంటారే. ఈ సంగతి తెలిసేకూడా నడువ కాళ్లులేనివారు. ఏం చేయగలరు? నువ్వెవడవు? కోసలదేశపు రాజువా? నన్ను రాజా చంపినవాడు? సరే! రాజా! నీవు వెళ్ళి నా తలిదండ్రుల కీసంగతి తెలిపి, వారి పాదాలపై పడి, శరణు వేడుకో! లేకపోతే వారి కోపాగ్ని నిన్ను దహించివేస్తుంది. వారి శాపం నిన్ను భస్మం చేస్తుంది. ఇక జాగుచేయక, తిన్నగా వారున్న ఆశ్రమానికి వెళ్లు. ఇక్కడ్నించి అక్కడికి కాలిబాట ఉంది. ఆ బాట వెంబడే త్వరగా పోయి నిన్ను నీవు కాపాడుకో! అయ్యో! ఈ బాణం నా ప్రాణాలు తోడుతూందే. దీన్ని తీసివేసి మరీ పోవయ్యా!' అన్నాడు ఆ తాపసి.

తపస్వి ఒంటిలో దూరిన బాణం తీస్తే ఆయనకు బాధ తగ్గుతుంది. కాని ఆ వెంటనే ప్రాణంకూడా పోతుంది. నా చేతులారా ఆయన ప్రాణం తీయడానికీ మనస్సు ఒప్పలేదు. ఆ ధర్మసంకటంలో ఏం చేయడానికీ తోచక, ఒక్కక్షణం అలాగే నించున్నాను.

అప్పు డామునికుమారుడు 'అయ్యా! ఇక ఆలోచించకు. బాణం తీసివేసి నా బాధ తీర్చు. స్థిరచిత్తంతో ఉన్నాను. నీ పాపాన్ని గురించి యోచించకు. ధైర్యంతో బాణాన్ని ఊడదీసి నా ప్రాణం పోయేలాగ చూడు' అన్నాడు.

మెల్లగా బాణం లాగివేశాను. నేలవై పొర్లుతూ బాధపడుతున్న ఆ తపోధనుడు వెంటనే నన్ను చూస్తూనే నిట్టూర్చి ప్రాణం విడిచాడు."

31. ప్రాణత్యాగం

"ఈ సందర్భంలో ఆ తర్వాత జరిగిన విషయంకూడా చెపుతున్నా, విను" అని దశరథుడు చెప్పసాగాడు.

"మహా పాపకార్యం చేశాను. మునికుమారుడు ప్రాణం విడవడం కళ్లారా చూచాను. ఇంకేం చేయాలా అని యోచనలో పడ్డాను. సరే, అతడు చెప్పినట్లు చేయడమే ఉచితం, కర్తవ్యం అని నిర్ణయించుకొన్నాను. ఆయన విడిచిన కుండను తీసుకొని మంచినీళ్లు ముంచి ఆయన చెప్పిన కాలిబాటవెంట ఆశ్రమానికి వెళ్లాను. అక్కడ వృద్ధులైన ఆ తలిదండ్రులు తమ కుమారుని రాకకోసం ఎదురుచూస్తూ ఉండడం చూశాను. రెక్కలులేని పక్షుల్లాగ ముడుచుకు పోయిన దేహాలతో, ఉన్నచోటనుంచి కదలలేక, వారు ఆశ్రమంలో కూర్చుని ఉన్నారు. దంపతులిద్దరికీ కనుచూపులేదు. 'నీరు తేవడానికి పోయిన వాడు ఇంతసేపైనా ఇంకా రాలేదేం?' అని తమ కుమారుని గురించి మాట్లాడుకుంటున్నారు. అయ్యో, వీరు ఎదురుచూస్తున్నవారిని నేను చంపివేసి, వీరిని అనాథలుగా చేశానే అని భయం, దుఃఖం, ముంచుకు

వచ్చింది. మెల్లగా అడుగులు వేసుకొంటూ వెళ్లాను. నా కాలి అడుగుల సడి విన్నంతనే తండ్రి, 'నాయనా, దాహం! దాహం! త్వరగా ఇయ్యి. ఎందుకింత ఆలస్యమైంది? నదిలో ఆట లాడుతూ ఉన్నావా? నీ తల్లి దాహంవేసి ఎంత తపిస్తూందో చూడు. నాయనా! మాట్లాడవేం? నేను కాని, నీ తల్లికాని ఏమైనా తప్పు చేశామా? నీకు మాపై కోపం ఎందుకు? నీవు ధర్మశీలుడవు. నువ్వే మాకు గతి. ఆ మాట నీకుమాత్రం తెలియదా? చూపులేని మాకు నువ్వే నేత్రానివి. నాయనా, మా యిరువురికీ పంచప్రాణాలూ నీవే! ఎందుకు మాట్లాడవు? నేను ఇలా అంటున్నానని కోపమా?' అంటూ ఆ ముసి వృద్ధుడు గద్గద స్వరంతో మాట్లాడాడు. నేను శాప భయంతో వణికి పోతున్నాను. మెల్లగా ధైర్యం తెచ్చుకొని ఇలా అన్నాను:

'స్వామీ! నన్ను దశరథుడంటారు. మీ యాజకు కట్టువడే క్షత్రియుడను. మీ కుమారుడను కాను. నా పూర్వజన్మ పాప ఫలితంగా, అంతా ఛీఛీ అనతగ్గ ఘోరపాపం చేసి, మీముందు నమస్కరిస్తూ నిలబడి ఉన్నాను. భగవాన్! ఏనుగునో పులినో ఏదో ఒక అడవిజంతువును వేటాడాలని రాత్రిపూట నది ఒడ్డుకు పోయాను. కుండతో నీళ్లు ముంచుతున్న శబ్దం విని, అడవిఏనుగు నీరు తాగుతూందనుకొని చీకటిలో బాణం వేశాను. అది పోయి మీ ప్రియకుమారుడికి తగిలింది. బాణం రొమ్మునదూరి, నెత్తుట దోగుతూ పడి ఉన్న మీ కుమారుని చూశాను. అయ్యో, నా అజ్ఞానంవల్ల ఎంత పని జరిగింది? అన్న దుఃఖంతో, దిగులుతో, ఏంచేయడానికో తోచక కొయ్యబారి పోయాను. మీ కుమారుడి కోరిక ప్రకారం, అతడి వేదన తీర్చడం కోసం, బాణాన్ని తీసివేశాను. తీసివేయడంతోనే మీ కుమారుడు ప్రాణాలు వదిలాడు. అజ్ఞానంవల్ల నేను చేసిన పాపాన్ని చెప్పివేశాను. ఇక, మీదయ ఎలాగైతే అలాగ, శాపానికి కాచుకొని ఉన్నాను. మీ దాసుడను' అన్నాను.

నేను చెప్పిన ఆ భయంకర వృత్తాంతం విని ముసలివారు సబులై పోయారు. కండ్లనీరు వరదలై పారింది. అప్పు డావృద్ధులు 'రాజా! నీవు చేసింది ఘోరపాపం. అయినా తెలియక చేశావు.

పెగా నీవే స్వయంగా వచ్చి తప్పు ఒప్పుకున్నావు. అందువల్ల బతికి పోయావు. మా ఇద్దరినీ అక్కడికి తీసుకుపోయి చేర్చు. ఒక్కసారి ముద్దుల కొడుకును మనసారా తడిమి, తరవాత ధర్మరాజుకు వశ పరుస్తాం' అని చెప్పారు.

అలాగే వారిద్దరినీ ఎత్తుకొని నది ఒడ్డున ముసికుమారుడు పడి ఉన్నచోటికి తీసుకు పోయాను. ప్రాణం పోయిన ఆ కళేబరాన్ని తడిమి, విలపించి, వారు తమ దుఃఖం తీర్చుకున్న తర్వాత, కుమారుని దీవించి అంత్యక్రియలు జరిపారు.

'రాజా! మాకు నీవు కలిగించిన దుఃఖాన్ని నీవూ అనుభవిస్తావు. పుత్రశోకంతో మరణిస్తావు' అని చెప్పి ఇరువురూ చితిపైకెక్కి తమ బడుగుదేహాలను అగ్నికి ఆహుతిచేసి, స్వర్గానికి వెళ్లారు. నేను ఆనాడు చేసిన పాపమే నేడు నన్ను పట్టి పీడిస్తూంది.

అపథ్యాహారంవల్ల రోగి వ్యాధి ముదిరి ప్రాణం తీసేటట్లు, ఈ పాపం ఇప్పుడు నన్ను చంపుతూంది. ఆ కళ్లులేని వృద్ధుడు తన దుఃఖాన్ని సైరించలేక చెప్పినమాట నిజమయింది. నా ప్రియ కుమారుణ్ని చేజేతులా అడవికి పంపాను. ఆ దుఃఖంతో నేడు యమమందిరానికి వెళ్లబోతున్నాను.

తలవని తలంపుగా, స్వభావ విరుద్ధంగా, జరిగే ఘటనలకు వేరే కారణం ఉండదు. నేనెందుకు ఇలా మోసపోవాలి? నేను రాముణ్ని అడవికి పొమ్మన్నాను. కాని అతడెందుకు నా మాటలు శిరసా వహించి, అడవికి వెళ్లాలి? కౌసల్యా! నాకు చూపు పోయింది. నీవు నాకు అగుపించడంలేదు. మృత్యువు ముంచుకువస్తూంది. దగిరసా రా. అంతా అయిపోయింది. యమదూతలు నన్ను బయలుదేరి మంటు న్నారు. రాముడు వస్తాడా? అతడ్ని చూసి ప్రాణం విడవగలనా? గుండె బరువుగా ఉంది. ఇక మిగిలిందేమీలేదు. దీపంలో నూనె ఇంకి పోయింది. కౌసల్యా! సుమిత్రా!" అని చెప్పి. మాటలు రాను రాను అణిగిపోగా, చక్రవర్తి ఆ రాత్రే ప్రాణం విడిచాడు.

* * *

వాల్మీకి రామాయణం మొదలుపెట్టినప్పుడు దశరథుణ్ని గురించి "వేదాలను, సకల శాస్త్రాలను చదివినవాడు, దీర్ఘదర్శి, తేజస్వంతుడు. అనేక యుద్ధాలలో విజయం గాంచిన వీరుడు, అనేక యాగాలు చేసిన వాడు, ధర్మంలో సాటిలేనివాడు, ఋషివంటివాడు, ముల్లోకాలలో కీర్తి బడసినవాడు, శత్రువులను నిశ్శేషంగా నిర్జించినవాడు, రాజ మండలి ప్రేమాదరాలను పొందినవాడు, ఇంద్రియ నిగ్రహం గల వాడు, సంపదలను కూడబెట్టడంలో ఇంద్రుడికీ కుబేరుడికీ సాటి రాగల వాడు, రాజ్యపాలనలో మనువువంటి వాడు" అని వర్ణించాడు. అలాంటి దశరథుడు కూడా కర్మానుసారం భరింపరాని పుత్రశోకంతో కుంది కుంది ప్రాణాలు విడిచాడు.

మాటిమాటికీ మూర్ఛలో మునుగుతూ తేరుకుంటూ ఉండిన దశరథుడు ప్రాణాలు విడిచిన సంగతి పక్కనున్న కౌసల్యకు, సుమిత్రకు కూడ తెలియలేదు. వారుకూడా శోకభారంవల్లా, నిద్రలేమి వల్లా బడలికతో అంతఃపురంలో ఒకమూల నిద్రలో మునిగి పడి ఉన్నారు. తెల్లవారే సమయాన వందిమాగధులు నగరు వాకిటనిలిచి వాడుక ప్రకారం సుప్రభాతం పాడారు. మంగళవాద్యాలు వాయించారు. చక్రవర్తి మేల్కొన్నట్లు కనిపించలేదు. చక్రవర్తి లేవగానే ఆయనకు పరిచర్య చేయవలసిన సేవకులు చాలాసేపు వేచిఉండి "నేడు చక్రవర్తి ఇంకా లేవలేదేం" అని సందేహంతో లోపల ప్రవేశించారు. చక్రవర్తి ప్రాణం లేకుండా కట్టెలాగ పడి ఉండడం చూశారు.

ఈ దుర్వార్త తెలిసి రాజ నగరమంతా దుఃఖసముద్రంలో మునిగిపోయింది. ముల్లోకాలలో కీర్తిగాంచిన దశరథ మహారాజు భార్యలు ఒకరి నొకరు పట్టుకొని దుఃఖం భరించలేక అనాథలలాగా విలపించారు.

32. భరతుడికి వర్తమానం

కౌసల్యాదేవి చనిపోయిన చక్రవర్తిపై పడి "నేనుకూడ చక్రవర్తితో చితి ఎక్కుతాను. పుత్రుడులేక, భర్తలేక అనాథగా బతకలేను".

అని విలపించింది. నగరులో సమావేశమైన పెద్దలూ ఉద్యోగులూ ఆమెను అతికష్టంమీద అక్కడినుంచి తీసుక పోగలిగారు.

తర్వాత ఉత్తర క్రియలు జరపడం ఎలాగా అని యోచించారు. చక్రవర్తి కుమారు లెవ్వరూ నగరాన లేరు. రామలక్ష్మణులా, వనవాసానికి వెళ్లారు. భరత, శత్రుఘ్నులు మేనమామ ఇంట చాలా దూరంలో ఉన్నారు. ఏంచేయడమా అని యోచించి, చివరకు భరతుడికి వర్తమానం పంపాలి అని నిశ్చయించారు. అతడు వచ్చేవరకు కళేబరం చెడకుండా ఉండేటందుకు ఏర్పాట్లు చేశారు.

లోకమంతా కీర్తి అల్లుకొనగా, అనేక సంవత్సరాలు రాజ్యం చేసిన మహారాజు శరీరం నూనెపెనంలో పడి ఉంది! అయోధ్యా నగరం కాంతి తరిగి చీకటిలో మునిగిఉంది. ఎక్కడచూసినా రోదన ధ్వనులే, కాలువలుగాపారే కన్నీళ్లే. ఆడవారూ మగవారూ చేరి కైకేయిని నిందిస్తున్నారు. నగరమంతా దుఃఖంలో మునిగిపోయింది. యువరాజు కావలసినవాడు అడవికివెళ్లాడు. భరతుడు నగరానలేడు. రాజ్యానికి గొప్ప ఆపద వచ్చిందని దిగులు పొందారు. రాజు లేక పోయినా ప్రజలు మనగలరన్న విషయం ఆ రోజులలో ఎవరికీ తెలియదు. అలాంటిది వారెక్కడా ఇంతకుముందు చూడలేదు.

ఎలాగో రాత్రి గడిచింది. మన్నాడు ఉదయం మంత్రులూ ఉద్యోగులూ పురపెద్దలూ సభా మంటపంలో చేరుకున్నారు. మార్కండేయుడు. మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, జాబాలి మొదలైన బ్రాహ్మలూ, సుమంత్రుడు మొదలైన మంత్రులూ, వసిష్ఠునికి నమస్కరించి ఇలా అన్నారు: "స్వామీ! ఒకరాత్రి ఒక నూరేళ్ళలాగా ఉంది. మహారాజు స్వర్గానికి వెళ్లిపోయారు. రామలక్ష్మణులు అడవికి వెళ్లారు. భరత శత్రుఘ్నులు కేకయ దేశంలో తాతగారింట ఎంతో దూరాన ఉన్నారు. దేశం అరాజక స్థితిలో ఉంది. వెంటనే ఎవరినైనా రాజ్యభారం వహించేట్లు చేయాలి. రాజులేని దేశం పాడేకదా?

రాజులేని దేశంలో న్యాయం ఉండదు. తండ్రిమాట కొడుకు వినడు. భర్తకు భార్య కట్టుబడి ఉండదు. వానలు కురవవు. దేశంలో

ఎక్కడచూసినా దొంగతనాలూ, దోపిడీలు చెలరేగుతాయి. ప్రజల్లో పరస్పర విశ్వాసమూ. సానుభూతి నశిస్తాయి. వ్యవసాయం, వ్యాపారం ఏదీ చక్కగా సాగదు. రాజుల రక్షణలేందే రాకపోకలు ఎలాగ? ఇందువల్ల సంపద క్షీణించిపోతుంది. దేవాలయాలలో మహోత్సవాలూ. పూజలూ సక్రమంగా జరగవు. దేశంలో ప్రజా జీవితం పాడైపోతుంది. ఇతిహాసాలూ పుణ్యకథలూ చెప్పేవారూ ఉండరు. విన్నేవారూ ఉండరు. తలుపులు తెరిచి నిద్రించడానికి వీలుపడదు. నాగరికత అన్నది తరిగి, నశించిపోతుంది. తపస్సులూ, వ్రతాలూ. ఆనందమూ, ఏదీ ఉండదు. శాస్త్రాలు చదివేవారు ఉండరు. రాజనేవాడు ఒకడుండి దేశంలో ప్రశాంత పరిసితిని కాపాడినప్పుడు కదా ఇదంతా జరుగుతుంది? రాజు లేకపోతే స్త్రీల స్వాభావిక సౌందర్యంకూడా మాసిపోతుంది. తనసొమ్ము తన దనే నమ్మకమే పోతుంది. చేపలలాగా ఒకగినొకరు మింగేసారు. దుర్మార్గం, దుఃఖం పెరిగిపోయి, దేశం పాడైపోతుంది. దేశంలో నిలకడగా నిలవదగిన సకల క్షేమాలకూ రాజు అనేవాడు ఒకడు ఉండాలి."

అని ఇలాగా ఆ సభలో చేరిన పెద్దలు, అరాజకంవల్ల కలిగే అపాయాలను గురించి మాట్లాడినట్లు వాల్మీకి చక్కగా వర్ణించాడు.

"దేశమంతా చీకటి కమ్ముకున్నట్టు అయింది. ధర్మం నశించిపోతూంది వెంటనే రాజును ఏర్పరచుకోవాలి!" అని వారు నొక్కి నొక్కి చెప్పారు.

వసిష్ఠుడు సమర్థులైన దూతలను రప్పించి "వెంటనే బయలుదేరండి. నేను చెప్పేది సావధానంగా వినండి. ఎక్కడా ఆగకుండా అతి వేగంగా పోయి కేకయదేశం చేరాలి. మీ ముఖంలో కాని, నడవడిలోకాని దుఃఖసూచనలు ఏమీ కానరాకూడదు. భరతుడు దుఃఖాన్ని భరించలేడు. చక్రవర్తి మరణవార్తను ఎంత మాత్రమూ మీరు బైట పెట్టకూడదు సుమండీ. 'కులగురువు, మంత్రులూ తమను వెంటనే అయోధ్యకు వేంచేయవలసిందిగా చెప్పడానికి మమ్మల్ని పంపారు' అనిమాత్రం భరతుడితో చెప్పండి. వెంటనే బయలుదేరమని చెప్పి తొందొర్కాని రండి. సీతారాములు అడవికి వెళ్ళిన విషయంగాని, ఆ దిగు

లుతో చక్రవర్తి మరణించిన సంగతికాని, అతడికేమీ చెప్పరాదు. దుఃఖ చిహ్నాలు కానరాకుండా ఉండేందుకు గాను వస్త్రాలూ, భూషణాలూ తీసుకుపోయి కేకయరాజుకు సమర్పించి మర్యాద చేయండి!" అని ఆజ్ఞాపించాడు.

ఏది సత్యంబన నెల్ల ప్రాణులకు
నేదొసఁ గెసఁగింప కింపగు వాక్కు॥

చెడుగులఁ దొలచి మేల్ చేకూర్చు పొల్లు
నుడుగైన నిక్కమని నుడువంగ వచ్చు॥

అని త్రివర్గకర్త చెప్పాడు. దాని అర్థం ఏమిటో దీనినుంచి గ్రహించ వచ్చు

దూతలు ప్రయాణానికి కావలసిన అన్న వస్త్రాదులను, కేకయ రాజుకు ఇవ్వవలసిన బహుమానాలను తీసుకొని వేగంగా వెళ్ళగల గుర్రాలనెక్కి వెంటనే బయలుదేరారు. అడ్డదారిని అడవులు, కొండలు, నదులూ దాటుతూ వెళ్ళారు.

కేకయదేశం అయోధ్యకు చాలాదూరాన ఉంది. అది నేటి పంజాబు దానికి పడమరగాను ఉన్న ప్రదేశంగా మనం ఎంచవచ్చు. కొండలూ, నదులూ దాటి గుర్రాలు అలసిపోయాయి. దూతలుకూడా అలసిపోయారు. ఆ అలసటతో వారు కేకయరాజు రాజధాని అయిన రాజగృహం చేరుకున్నారు. మర్నాడు ఉదయం భరతుణ్ణి చూడ్డానికి ఏర్పాటు చేసుకొన్నారు.

దూతలు చేరిననాటి రాత్రి భరతుడు భయంకరమైన పీడ కలలు కన్నాడు. ఉదయమే ముఖం వాడిపోగా, చింతాక్రాంతుడై లేచాడు. అతని స్నేహితులు ఇది చూసి వినోదం కల్పించడం కోసం నాట్యాలు చేశారు, హాస్యాలాడారు. అనేక విధాల అతని చింతను పోగొట్టాడానికీ, వాడిన అతని ముఖాన్ని వికసింప చేయడానికీ ప్రయత్నించారు. అయినా అతని చింత తొలగలేదు.

ప్రేమ ఎంత త్రీవమైందో దాని రహస్యాన్ని మనం ఇంకా చూడలేదు. దశరథుడి మనోవేదనా, మరణవేదనా, చాలా దూరాన ఉన్న భరతుడి హృదయాన్ని కలచి, పీడకలలు కలిగించాయని మనం భావించ వచ్చు.

"నా ప్రియసోదురుడైన రాముడో, లక్ష్మణుడో, లేక నేనో మరణించ మన్నట్లు తోస్తూంది. వేకువ జామున కన్న కల వ్యర్థం కాదని చెపుతారు పెదలు. భయంకరమైన ఈ దుస్వప్నం కన్నాను. వివరించి చెప్పలేని కలత మనస్సులో ఏర్పడింది. దిగులుగా ఉంది. ఏంచేసేది" అని చెపుతూ ఉండగానే దూతలు తమ రాకను తెలిపి, దర్శనానికి అనుజ్ఞ కోరారు.

కేకయరాజూ అతని కుమారుడు యుధాజిత్తు దూతలను మర్యాదతో రావించారు. దూతలు వందనములు చేసి భరతుడితో ఇలా చెప్పారు:

"పురోహితులూ మంత్రులూ తమకు మంగళాశీర్వాదాలు పలికారు. వెంటనే అయోధ్యానగరానికి తీసుకురమ్మని మమ్మల్ని పంపారు. అత్యవసరమైన పని ఉందన్నారు. ఈ వస్త్రాభరణాలను తాము తమ తాతగారికి, మామగారికి సమర్పించాలి" అని వారు తాము తీసుకువచ్చిన వస్త్రాభరణాలను భరతుడి ఎదుట ఉంచారు.

అతడు వాటిని తీసుకొని"తండ్రి దశరథ మహారాజు క్షేమమేనా? రామలక్ష్మణులు సుఖంగా ఉన్నారా? అందరూ వ్యాధులేమీ లేకుండా కుశలముగా ఉన్నారా?" అని అడిగాడు.

"అందరూ వ్యాధిలేకుండా ఉన్నారు. రాజకుమారా! అందరూ నీకు మంగళం కోరుతున్నారు. అందుకనే త్వరగా రమ్మని చెప్పారు" అని విన్నవించారు.

ఇలాగ వారు సత్యాన్ని దాచి మాట్లాడారు. ఎంతదాచినా, వారి మాటల్లో భరతుడికి పట్టాభిషేకం జరగాలన్న విషయం ధ్వనించింది.

దూతలకోరిక ప్రకారం అయోధ్యకు వెళ్లడానికి భరతుడు తన తాత, మేనమామ మొదలైనవారి అనుజ్ఞ కోరాడు. అయోధ్యా ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లను కేకయరాజూ, యుధాజిత్తూ చేయించారు.

అయోధ్యలో దశరథ మహారాజుకు, రాముడికి మిగతా వారికీ ఇవ్వడానికి కేకయరాజ్యంలో దొరికే, మిక్కిలి విలువైన కానుకలను తెచ్చి రథంపైన ఉంచి, భరత శత్రుఘ్నులను గొప్ప పరివారంతో పంపించారు. రథాలు కడు వేగంగా అయోధ్యకు బయలు దేరాయి.

33. పవిత్ర హృదయం

భరతుడూ, పరివారమూ ఎంతోవేగంగానే ప్రయాణం చేశారు. గుర్రాలకు అక్కడక్కడ ఒళ్లు తోమి, కడిగి, ఆహారం పెట్టి, రాత్రులు అక్కడక్కడ బసచేసి, ఏనిమిదవరోజు వేకువజామున అయోధ్యా నగరంలో ప్రవేశించారు.

"ఇదేమి సారథీ! నగరం నేను విడిచినప్పటిలాగా లేదేం? ఎల్లప్పుడూ కలకలాడుతూ ఉండేదే? ఇప్పుడలాలేదే! ఉదయంపూట నగరంలో వచ్చేపోయే జనం కనిపించడంలేదు. ఎప్పుడూ కనిపించే దృశ్యాలు ఇప్పుడు కనిపించవేమి?"

ఇలాగ భరతుడు సందేహంతో సారథిని అడుగుతూనే వచ్చాడు.

"ఊరివెలుపల తోటలలో సంతోషముఖాలతో ఉండవలసిన యువతీయువకులు ఈనాడెందుకు దుఃఖ చిహ్నాలతో కనిపిస్తున్నారు? అన్నీ ఏదో గొప్ప దుఃఖాన మునిగి ఉన్నట్లు కనిపిస్తున్నాయే? అన్నాడు.

"మంగళ వాద్యాల ధ్వని వినరావడంలేదు. పూలు ధరించి, గంధం పూసుకొని ఉల్లాసంగా ఉండే నగరవాసులెవరూ కానరావడంలేదు. వాడుకగా వినిపించే భేరీమృదంగ ధ్వనులు చెవిన పడడంలేదు. ఇదేమి

విదూరం : అన్నీ అపశకునాలే కానవస్తున్నాయే ! నా చింత ఆణిచ శక్యం కాకుండా ఉంది" అన్నాడు భరతుడు.

వైజయంతమనే కోటవాకిలిగుండా భరతుడి రథం నగరంలో ప్రవేశించింది. బజారు వీధులూ, భవనాలూ, దేవాలయాలూ, అలంకార హీనంగా ఉన్నాయి. అలికి ముగులుపెట్టిన ముంగిళ్ళే కాన రావడంలేదు. ప్రజలు ఆకలిముఖాలతో కనిపించారు. అన్నీ అపశకునాలే. ఇవన్నీ చూసి ఏదో గొప్ప విపత్తు కలిగిందని భరతుడు నిశ్చయించుకున్నాడు. అందుకనే ఇంత తొందరగా వెంటనే రావాలని కబురు పంపారు అనికూడా అనుకున్నాడు.

భరతుడు తిన్నగా దశరథుని నగరులో ప్రవేశించాడు. అక్కడ తండ్రి కనిపించలేదు. అతడి మనోవేదన ఇంకా ఎక్కువైంది. వెంటనే తల్లి కైకేయిని చూద్దామని ఆమె నగరుకు వెళ్ళాడు. తిరిగి వచ్చిన తన కుమారుని చూడగానే కైకేయి అతణ్ణి కౌగలించు కోడానికి తన బంగారు పీటమీదినుంచి కిందికి దుమికింది.

భరతుడు ఆమె పాదాలంటి నమస్కరించాడు. ఆమె కుమారుని చేరదీసి శిరస్సు మూర్కొని "వచ్చావా తండ్రీ! మహారాజు వవుతావులే. ప్రయాణం సుఖంగా సాగిందా? మేనమామ మొదలైన వారంతా క్షేమంగా ఉన్నారా? అక్కడి విశేషాలుచెప్పు, వింటాను" అని కొడుకును ఒళ్లో కూర్చుండబెట్టుకుని ఆదరంతో అడిగింది.

"అమ్మా! నేను రావడానికి ఏడు రోజులు పట్టింది. అక్కడ అంతా క్షేమంగానే ఉన్నారు. తాతగారు, మామయ్య యుధాజిత్తు అందరూ నిన్ను అడిగానని చెప్పమన్నారు. నీకు ఎన్నో కానుకలు పంపించారు. అన్నీ వెనక వస్తున్నాయి. నేను ముందుగా చప్పున రథంలో వచ్చేశాను. 'అతి ముఖ్యమైన పని ఉంది_వెంటనే రావాలి' అని ఇక్కడ్నించి వచ్చిన దూతలు నన్ను వేగంగా ముందు రమ్మన్నారు. ఏమిటమ్మా అంత తొందర? మహారాజుని చూసి నమస్కరిద్దామని ఆయన నగరుకు వెళ్లాను. కాని అక్కడ ఆయన లేరు. ఇక్కడ కూడా ఆయన ఆసనం శూన్యంగా ఉంది. ఆయన సామాన్యంగా పరుండేచోటు ఇదే కదా. వకవేళ పెత్తల్లిగారి నగరులో

ఉన్నారేమో : నేను వెంటనే ఆయన్ను దర్శించి నా నమస్కారాలు అందించాలి" అన్నాడు.

జరిగిందేదీ తెలియక ఇలా అడుగుతున్న కుమారుడికి రాజ్యాధికార వాంఛతో మతి పోయిన కైకేయి ఇలా బుద్ధులు చెప్పింది:

"బిడ్డా! మానవులు పొందవలసిన అన్ని సౌఖ్యాలూ నీ తండ్రి పొందారు. చక్రవర్తి భాగ్యాలి. గొప్ప కీర్తిని ఆర్జించారు. చేయవలసిన యజ్ఞాలన్నీ చేశారు. సన్మార్గంలో ఉన్నవారి కందరికీ శరణు ఇచ్చారు పొందవలసిన పరమపదం ఆయన పొందారు."

ఇది వినగానే భరతుడు హతోస్మి! "హతోస్మి!! "అని అరచి, అందమైనవి, పొడవైనవీ అయిన తన బాహువులను చాచుకొని కింద పడిపోయాడు.

తరువాత లేచి చక్రవర్తి పాన్పును చూసి "ఈ పాన్పు శూన్యమై పోయిందే!" అని ఉత్తరీయంతో ముఖం కప్పుకొని, రాజ కుమారుడు పేదలాగా అనాథుడిలాగా కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. గున్నఏనుగువంటి దేహం గలవాడు, చంద్రుడివంటి ముఖం గలవాడు, వీరుడు నేలపైపడి పొర్లి పొర్లి దుఃఖించాడు. అడవిలో గొడలి వేటుపడి కూలిన మహాఅశోక వృక్షంలాగ పడి ఉన్న కొడుకును చూసి కైకేయి "లేచి నిలబడు మహారాజా ! లేచి నిలబడు! ఎందుకు నేలపై పడి ఉన్నావు? ఇది రాజులకు తగదు. పెద్దవారి మెప్పునూ, కీర్తినీ వడసినవాడవు. సనాతనమైన వేదమార్గాన ధర్మాలనూ యజ్ఞాలనూ చేయగల పదవిని పొంది ఉన్నావు. జ్యోతిర్మయుడైన సూర్యుడిలాగా ప్రకాశిస్తూంది నీబుద్ధి. నీకేంకొరత ? మనస్సులో కలత తొలగించుకుని, ధైర్యం వహించి లేచి నిలబడు !" అంది.

హృదయంలో అణుమాత్రమూ కళంకం లేని మహాత్ముడు భరతుడు. చాలసేపు దొర్లి, పలవించి, విలపించిం తర్వాత లేచి తల్లిని చూసి "రాముడికి చక్రవర్తి యువరాజ్యాభిషేకం బాలా గొప్పగా చేస్తారుకదా, తిరిగి వచ్చి అదంతా చూడవచ్చునన్న ఆశతో కదా నేను మేనమామల ఇంటికి వెళ్లాను? ఇప్పుడంతా ఇలా అయిపోయిందే! అయ్యో ! ఎలా భరించేది. నాన్నగారి ముఖమే కనిపించలేదే. ఆయ

నకు ఏం జబ్బు చేసింది? ఎలా వచ్చింది? నేను పక్కన లేకపోయాను కదా. అమ్మా! రాముడూ, లక్ష్మణుడూ కదా పుణ్యం చేసుకున్నారు! నాయనగారికి ఉపచరింపగల వారు ఎంత భాగ్యశాలురు? నాకా భాగ్యం లేకపోయింది. నా వంటిని అంటిన ధూళిని ఆయన ప్రేమగా తన చేతులతో తను దులిపేవారు. ఆయన చేతులు నామేను సోకినపుడు నాకు పట్టరాని ఆనందం కలిగేది. ఆయనపట నేను ఎందుకూ కొరగాకుండా పోయానే అమ్మా! అన్న, రాముడెక్కడ? ఆయనే కదా నాకు తండ్రి. నా గురువు. ఇప్పుడే ఆయన్ను చూసి అయన పాదాలపై పడాలి. ఇక ఆయనే కదా నాకు గతి? అమ్మా! కడపటి మాటగా నాయనగారు నాకేం చెప్పి పోయారమ్మా? ఆయన కడపటి మాట ఏనిటో ఆయన చెప్పినట్లే సరిగ్గా చెప్పు, అమ్మా!" అని విలపిస్తూ భరతుడు కైకేయిని అడిగాడు.

కైకేయి వాస్తవానికి దూరం కానిరీతిగా చెపుతూనే, తన ఉద్దేశాన్ని కూడ నెరవేర్చుకోవాలనుకొంది. ఒక మూల ధర్మం కలిగించే ఆటంకం, మరొక మూల తీవ్రంగా ఉన్నకోరిక. ఈ రెండింటికీ మధ్య మాట్లాడింది కైకేయి. చక్రవర్తి అవసాన కాలంలో భరతుడికి ఏమీ చెప్పలేదు. ఆ అర్థం వచ్చేలాగ, చెప్పవలసిన ఉదంతాన్ని చెప్పడానికి అవకాశం కలిగించేలాగ ఆమె మాట్లాడింది.

"నీ తండ్రిగారు, 'హా రామా! హా లక్ష్మణా! హా జానకీ!' అని విలపిస్తూ ప్రాణాలు విడిచారు. మీ నాయనగారు అవసాన కాలంలో చెప్పింది ఇంతమాత్రమే. 'రాముడూ లక్ష్మణుడూ జానకీ తిరిగిరావడం చూడానికి నేను పెటిపుట్టలేదు. వారిని చూసిన వారే కదా అదృష్టవంతులు' అని చెప్పి చక్రవర్తి గతించారు", అంది.

అది వినగానే "అయ్యో! పక్కన రాములక్ష్మణులుకూడా లేరా?" అని భరతుడు దుఃఖం పొర్లివచ్చి బావురుమన్నాడు.

"వారెక్కడ? ఏపనిమీద వెళ్లారు? పక్కన ఎందుకు లేకుండా పోయారు?" అని భరతుడు కైకేయిని గుచ్చిగుచ్చి అడిగాడు.

దానిమీదట విషయమంతా చెప్పి అతడ్ని సమాధాన పరచాలనుకుంది కైకేయి. "నాయనా! నీ అన్న రాముడు లక్ష్మణుణ్ని

సీతనూ వెంటబెట్టుకొని తాపసివేషం ధరించి దండకారణ్యానికి వెళ్ళి పోయాడు'' అంది.

అది విని భరతుడు ఆశ్చర్య పడ్డాడు. "ఏమిటీ! ఇదేమిటీ? నాకేమీ అర్థం అవడంలేదు. రాముడు ఏం నేరంచేసి తపస్సు చేయడానికి వెళ్ళాడు? ఏ బ్రాహ్మడి సొత్తు అపహరించాడు? ఏ నిరపరాధిని హింసించాడు? ఏ పరనారిని కోరి, పొరపడాడు. రాముడు ఎందుకు దండకారణ్యానికి పోవలసి వచ్చింది? ఎవడి రీప్రాయశ్చిత్తాన్ని విధించారు?" అని ప్రశ్నలు గుప్పించాడు.

ఆ కాలంలో ఇలాంటి గొప్ప నేరాలు చేసినప్పుడు అడవికి పంపే శిక్షను విధించడం పరిపాటిగా వుండేది. అప్పుడు కైకేయి సంగతి సందర్భాన్నీ సవిస్తరంగా చెప్పడానికి ధైర్యం తెచ్చుకుంది.

"రాముడు ఎలాంటి నేరమూ చేయలేదు. ఎవరిసొత్తూ అపహరించలేదు. ఏ పరాయి స్త్రీని కన్నెత్తి ఐనా చూడలేదు. రాముడికి పట్టాభిషేకం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు నాకు తెలిసి, నీ తండ్రిగారిని అడిగి వరం పొందాను. నీకు రాజ్యాధికారం ఇచ్చి రాముడు నగరం విడిచి పోవాలని నీకోసం వరమడిగాను. సత్యానికి లోబడి, మునుపు ఆడినమాటను నెరవేర్చి తన ధర్మాన్ని కాపాడుకోవడంకోసం, మహారాజు నేను చెప్పిందానికి ఒప్పుకున్నారు. సీతనూ లక్ష్మణుణ్నీ వెంటబెట్టుకొని రాముడు వనవాసానికి వెళ్ళాడు. ఆ ఎడబాటును ఓర్చుకోలేక నీ తండ్రిగారు ప్రాణాలు విడిచారు. నీవిప్పుడు చేయాల్సిందేమిటో యోచించు. ధర్మం తెలిసినవాడవు. రాజ్యభారం వహిస్తానని అను. నీ కోసమే ఇదంతా చేశాను. దుఃఖించకు. మనస్సును కుదుట పరచుకో. ఈ నగరం, ఈ రాజ్యం, సుఖంగా నీ అధీనానికి వచ్చాయి. వసిష్ఠుడు మొదలైన బ్రాహ్మణోత్తములను తీసుకువెళ్ళి, వెంటనే తండ్రిగారికి విధి విహితంగా అంత్యక్రియలు జరిపించి, జాగుచేయక పట్టాభిషేకం చేసుకో: నీవు క్షత్రియ వీరుడవు. తండ్రివల్ల రాజ్యాధికారాన్ని బడసిన రాకుమారుడవు. కర్తవ్యాన్ని నిర్వహించు" అంది.

34. పాపం పండింది

ఇప్పుడు భరతుడికి సంగతి సందర్భాలన్నీ సవిస్తరంగా తెలిసిపచ్చాయి. ఎంత ఘోరమైన అన్యాయం జరిగిందో బోధపడింది. పట్టరాని కోపమూ దుఃఖమూ కూడా ఒకేసారి వచ్చాయి. అతడు తల్లిని చూస్తూ ఇలా అన్నాడు :

"నువ్వు చేసిన పనేమిటి? ఈ రాజ్యం ఏలమని నాతో చెప్పడానికి నీకు నోరెలా వచ్చింది? నాన్ననీ అన్నయ్యలనూ వదలనూ పోగొట్టుకున్న నాకు ఈ రాజ్యధికార మెందుకు వచ్చింది? నా తండ్రి ప్రాణాలు తీసి, నా రాముణ్ని అడవికి పంపి నన్ను రాజ్యం ఏల మంటావా? గాయంచేసి పైగా కారం జల్లుతున్నావే! దశరథ చక్రవర్తికి భార్యవే! ఆయనకు మతిచెడి నిన్ను కట్టుకున్నారు. ఒళ్లో నిప్పు పెట్టుకున్నారు. నా తండ్రిని చంపేశావు. కౌసల్యా సుమిత్రా నిన్ను గురించి ఇలాగే అనుకుంటున్నారు. నీకు నిజంగా అంత ప్రేమే ఉంటే, అయ్యో! రాముణ్ని అడవికి ఎలా పంపించావు? పెద్దతల్లి కౌసల్య నిన్ను తన తోబుట్టువులాగా చూసుకుంటుందే! ఆమె కడుపున పుట్టిన ముద్దుబిడ్డను అడవికి పంపించాలన్న తలంపు ఎలా కలిగింది నీకు? రాముడంటే నా కెంత భక్తో నీకేం తెలుసు? నీ దురాశ నీ బుద్ధిని చెరచింది. నా ప్రాణమే అయిన రాముణ్ని అడవికి పంపి, నన్ను సంతోషపెట్టాలని చూస్తున్నావు! నీ వెంత మూఢురాలవో చెపుతా, విను: మహా పరాక్రమశాలి అయిన నాయనగారు, చక్రవర్తి-రామలక్ష్మణులను తమ మూలబలంగా ఎంచుకున్నారు. అలాంటి వారిని అడవులకు తరిమి నన్ను రాజ్యం ఏలమంటున్నావా. అది నేను చేయగల పనేనా? నా మనస్సు వప్పుతుందా? నీ కోరిక ఏనాటికైనా తీరుతుందా? లేదు, లేదు. నీవు ఎన్నటికీ తీర్చుకోలేవు. ఎంతటి మహా పాపంచేసిన నువ్వా నా తల్లివి? ఇంతటితో నీకూ నాకూ చెల్లు. తరతరాలుగా వస్తున్న రాజవంశ మర్యాదను కాలదన్ని తమ్ముడికి పట్టం కట్టించాలన్న ఈ ఊహ నీ కెలా తోచిందో, నాకు అర్థం కావడం లేదు. లోకం అంతా మనలను ఆడిపోసుకుంటూందని నీకు తెలి

యదాఁ పెద్దవాడు రాజ్యానికి రావడమనేది రాజవంశాలకు ఒక సామాన్య ధర్మం. మన వంశాచారమూ అదే. కనుక, నీ కోరికను ఎన్నటికీ నే నంగీకరించను. ఇదుగో, అడవికి వెళ్లి అన్నయ్యని తోడ్కొని వస్తాను. ఆయనకే పట్టంకట్టి. తనివితీరా ఆయనకు సేవ చేసుకొంటూ ఉంటాను. అంతే. నీ కోరిక మాత్రం నెరవేరదు తెల్సుకో."

ఇలాగ భరతుడు తల్లిని చూసి కోపావేశంతో మాట్లాడాడు. రానురాను అతడి దుఃఖం ఎక్కువయింది. 'తల్లి ఇలా చేసిందే, తనకు మాయని మచ్చ తెచ్చిందే!' అన్న మహా ఆ వేదనతో అతడి మనస్సు తల్లడిల్లిపోయింది. ఆమె తల్లి, తాను కొడుకు అన్న భావాన్ని మనస్సు లోంచి తుడిచివేసుకున్నాడు. అందువలనే భరతుడికి దుఃఖమూ, కోపమూ ఎక్కువైనాయి. గుహలో సింహంలాగ గర్జించాడు. తల్లిని సూటి పోటి మాటలతో నిందించాడు. భరతుడి స్వభావం, రాముడిపై అతనికిగల గాఢానురాగం, తండ్రి పోయాడన్న దుఃఖం, తలవని తలంపుగా తన తలపై వచ్చిపడిన అపనింద, అందువల్ల కలిగిన ఆవేదన వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని చూస్తే భరతుడి భావావేశం, ఉద్రేకం ఏమిటో, ఎందుకో, మనకు బోధపడుతుంది. కేవలం శాస్త్రాలు చదివిన కటికగుండెల పండితుల్లాగా మనం భరతుడి మాటలను తూచి చూడకూడదు. ఇలాంటి ఘట్టాలలోనే కవి హృదయం జాజ్వల్యమానంగా శోభిస్తూ వుంటుంది. దీన్ని మనం వాల్మీకిలోనూ, కంబరు కవిలోనూ కూడా చూడవచ్చు.

* * *

భరతుడు మితిమీరిన కోపావేశంతో లేచి, తల్లిని చూసి, కఠిన స్వరంతో మాట్లాడాడు:

"నువ్వీరాజ్యంలో ఉండదగిందానవు కావు. నిన్ను వెళ్ల గొట్టాలి. క్రూరురాలవు. ధర్మాన్ని విడనాడి, దుర్మార్గాన్ని చేపట్టావు. నేను నీకింక చచ్చినవాళ్లలోనే లెక్క. రాజుని యమ మంది రానికీ, రాముణ్ణి అడవికీ పంపిన నిన్ను చూసి ఎవరు అసహ్యించుకోరు? ఘాతుకానికి ఒడిగట్టిన హంతకురాలా! మా కులానికే మచ్చ

తెచ్చావు. నీకు నరకమే గతి. మా నాయనగారు వెళ్లిన పుణ్య లోకాల దరిదాపులకైనా నువ్వు వెళ్లలేవు. ఘోర పాపం చేసిన నిన్ను చూస్తే, నీ కడుపునపుట్టిన నాకే వళ్లు కంపరమెత్తుతూందే. మాతృ రూపంలో ఉన్న మహామారీ! భర్తను బలిగొన్న హంతకురాలా! నీకూ నాకూ సంబంధమే లేదు. ధర్మాత్ముడైన తాత అశ్వపతి మహా రాజు కుమార్తెవుకావు నువ్వు. నువ్వొక రాక్షసివి. కులాన్ని చెరపడానికి ఆ మహానుభావుడి కడుపున పుట్టావు. సత్యమూ ధర్మమూ కలిసి మానవాకారందాల్చిన మా అన్నగారిని అడవికి పంపావు గదే! మా నాయనగారి ప్రాణాలు తీశావు కద, పాపిష్ఠి! రెండు విధాలా నాకు తీరని అనిష్టం కలిగించావే, రక్కసీ!

కౌసల్యాదేవికి గారాబుపట్టి అయిన రాముణ్ణి అడవికి పంపిన నువ్వు ఏ నరకాలకు పోతావో ఎవరు చెప్పగలరు? తల్లి మనస్సు ఎలాంటిదో నీకేం తెలుసు! పుత్రుడు తల్లి పేగుకదా? తల్లియొక్క ఒక్కొక్క అవయవంలోనించీ భాగం పంచుకుని పుట్టినవాడుకదే. మాతా పుత్రులకు గల ఈ ప్రాణ సంబంధం నీకు తెలియకపాయెనే? ప్రాణానికి ప్రాణమైన కుమారుణ్ణి అడవికి పంపి, ఆ తల్లి మనస్సుకు కలిగించిన క్షోభకు, నీకేం శిక్ష విధిస్తే సరిపోతుంది?

కామధేనువు కోట్లకొలది వత్సాలను కన్నది. అయినా ఏదో రెండెడ్లను అరక కట్టి మూర్ఖుడొకడు బాధించడం చూసి, "అయ్యో! నా బిడ్డలు ఎండకు తాళలేక మడిలో పడిపోయినా, ఈ మూర్ఖుడు హింసిస్తూనే ఉన్నాడే!"అని కామధేనువు కంట తడిపెట్టడం నీ వెరగవా? ఆ కన్నీటిచుక్క దేవరాజుపై పడ్డది. దాని పరిమాణాన్ని చూసి ఇది సురభి కన్నీరై ఉంటుందని తెలుసుకొని చింతించాడు కదా? కోట్లకొలది వత్సాలను కన్న సురభి రెండువత్సాల కష్టాన్నే చూసి ఓర్వలేకపోయిందే? కౌసల్యకు నీవెంత అపకారం చేశావో నువ్వు ఊహించగలవా? ఆమె కన్నది ఒకే ఒక కుమారుణ్ణి. ఆ కుమారుణ్ణి నువ్వు అడవిపాలు చేసివేశావు. అలాచేస్తే నేను సుఖిస్తానని అనుకున్నావు. రాక్షసీ! నువ్వు దుఃఖంతో కుమిలి కుమిలి చస్తావు. నిశ్చయం. చచ్చిం తర్వాతాకూడా నీకు దుఃఖం తప్పదు. నాయనగారికి ఉత్తర

క్రియలు జరిపి, నేను అడవికి పోతాను. మహావీరుడైన రాముడి కాళ్లమీద పడి, ఆయనకు ఈ రాజ్యం అప్పగించేస్తాను. నువ్వు నా తలకు చుట్టిన ఈ అపనిందను పోగొట్టుకోడానికి రాముడికి బదులు నేనే దండ కారణ్యంలో వనవాసం చేస్తాను. నువ్వు చేసిన ఈ పాపాల భారం నేను మోయలేకుండా ఉన్నాను నీవు పుట్టించిన ఈ కన్నీటి కాల్వ లను నేను భరించలేకుండా ఉన్నాను. నీవు ఏం ప్రాయశ్చిత్తం చేసుకు, తప్పించుకుందా మనుకుంటున్నావు ? ఉరిపోసుకు చస్తావా ? నిప్పులో దూకి మరణిస్తావా ? నువ్వే వనవాసం చేసి దండకారణ్యంలో బతుకు తెల్లార్చుకుంటావా ? ఏం చేస్తావో నీ ఇష్టం. రాముడి దగ్గరకువెళ్ళి ఈ భూమండలాధిపత్యాన్ని ఆయనకు అప్పగించి, నువ్వు నాకోసం సంపాదించిపెట్టిన ఆనందాన్ని అనుభవించబోతున్నాను."

భరతుడు ఇలాగ కోపంగా తల్లిని ములుకుల్లాంటి మాటలతో పొడిచి పొడిచి, అడవిలో అప్పుడే పట్టుబడ్డ మదపుటేనుగులాగ నిట్టూర్చాడు. అతడి కన్నులనుంచి రాలింది కన్నీరుకాదు, నెత్తురోడింది.

చ॥ అని వచియించి యా భరతు
డంతట నీ చెడు క్రూర కర్మముల్
పనివడి పూని కాఁజలుపు
పాపిని వద్ద వసింపఁజాల నా
కొనరిన దుఃఖముల్ దొలగ
నుత్తమశీలయుఁ గోసలేశ నం
దనయగు తల్లి పాద నలి
నంబుల వ్రాలెదనంచుఁ జయ్యనన్.

"ఈమెకడ నిలవజాలను. నా దుఃఖాన్ని వెళ్లబోసుకోడానికి తల్లి కౌసల్యాదేవి వద్దకు వెళతాను"అని భరతుడు పెత్తల్లి నగరుకు వెళ్లాడు.

కైకేయి కట్టుకున్న గాలిమేడలు కాస్తా కూలిపోయాయి. ఆమె ఆశ క్షణంలో నిరాశ అయింది. అది చూసి కైకేయి నేలపడి పరితపించింది.

* * *

రామాయణ పాత్రలలో భరతుడివంటి పరిశుద్ధమూర్తి మరొకడు కానరాడు. చిత్రకూటంలో రాముడూ, భరతుడూ కలుసుకున్న ఘట్టం ఒక్కటే ఉత్తర దేశస్థులను ఉర్రూత లూగిస్తుంది. రామాయణ కథలో ఇదొక ప్రధాన ఘట్టంగా వారు భావిస్తారు. ఆ ఘట్టాన్ని వారు మహోత్సాహంతో కొనియాడి, ఆనందిస్తారు. ఎవరెన్ని పాప కార్యాలు చేయ సాహసించినా ధర్మాన్ని రక్షించేవారు కొందరు ఉంటూనే ఉంటారు. పేరాసతో, కపటంతో నిండిన ఈ లోకంలో పరస్పర విశ్వాసం, ధైర్యం, ప్రేమా బోధించి ప్రజలను ధర్మమార్గాన నడిపించడానికి కొందరు మహాత్ములు ఉంటూనే ఉంటారు. ధర్మానికి అలసట అనేది లేదు.

35. భరతుని నిర్ణయం

భరతుడు వచ్చాడన్న వార్త అంతఃపురమంతటా తెలిసింది. తన దుఃఖాన్ని బాపుకొనడానికి దారి తెలియక పరితపిస్తున్న కౌసల్య ఈ వార్త వినగానే "భరతుడి వద్దకు పోదాం పద" అని సుమిత్రను వెంటపెట్టుకొని బయలుదేరింది. వారు రెండడుగులు వేయకముందే భరతుడు పిచ్చివాడిలాగా కౌసల్యను శరణు వేడుకొంటూ ఎదురు వచ్చాడు.

సులభంగా రాజ్యం చేజిక్కిందన్న సంతోషంతో పట్టాభిషేకం చేసుకోడానికి భరతుడు హుటాహుటిని కేకయదేశంనుంచి వచ్చాడని కౌసల్య అనుకొంది. అలా అనుకోవడం ఎంతపొరపాటు!

వసిష్ఠుని అధ్యక్షతను మంత్రులంతా సభచేసి భరతుడిచేత చక్రవర్తికి ఉత్తరక్రియలు చేయించాలనీ తర్వాత అతడికి పట్టాభిషేకం చేయాలనీ నిశ్చయించారు కదా! అందుకని వీరుడైన భర్తకూ, ప్రియకుమారుడికీ దూరమైన కౌసల్య భరతుణ్ణి చూస్తూనే, దీన స్వరంతో ఇలా అంది:

"భరతా! అడ్డంకులూ భయాలూ తొలగించి కైకేయి ఈ రాజ్యాన్ని నీకు సంపాదించి పెట్టింది. సుఖంగా ఏలుకో! తండ్రి

గారికి నీవు పేర్చిన చితిలోనేపడి, చక్రవర్తి వెళ్లిన లోకాలకే నేనూ వెళతాను.''

పాము కాటులాంటి ఈ మాటలు విన్న భరతుడు ఆమె పాదాలపై పడి, నోట మాటరాక, అలాగే ఉండిపోయాడు.

"వీరుడైన నా కుమారుడు ఎక్కడ తాపసజీవితం గడుపుతూ ఉన్నాడో అక్కడికి నీవే నన్ను తీసుకుపోయి విడిచిపెట్టు" అంది కౌసల్య.

తల్లి కౌసల్య ఆడిన సూటిపోటు మాటలు విని దుఃఖాన్ని భరించలేక భరతుడు మూర్ఛపోయాడు. కొంతసేపటికి తేరుకుని "ఏ పాపమన్నా ఎరుదుగునా ? నన్నెందుకిలా ఆడిపోసుకోవడం ? ఏ సంగతీ తెలియక నేను ఎంతో దూరాన ఉండిపోయానన్న సంగతి మీకు తెలియదా? ఇక్కడ జరిగిన కుట్రలూ గొడవలూ నాకేమీ తెలియవు కదా. నా అన్న రాముడి మీద నాకున్న అనురాగం మీకు తెలియదా ? నేనే ఆయన కీఅన్యాయం చేశానంటారా ? ఇదీ మీకు తెలియదా ? అలాగే చేసి ఉన్నట్లయితే నా తెలివితేటలూ, జ్ఞాన సంపదా, అంతా నశించిపోవాలి. ఈ దుష్కృత్యంలో నా కేమాత్రం పాలు ఉన్నా లోకంలో మహాపాపాలు చేసినవారి కర్మ ఫలాలన్నీ నన్ను చుట్టుకుంటాయి. నిజం చెపుతున్నాను తల్లీ ! నేనెన్నడూ ఈ కుట్రలో కూడలేదు. ఈ రాజ్యంకోసం ఆశపడలేదు."

తాను ఈ దురాలోచనకు సమ్మతించి ఉంటే, దుర్మార్గులు చేయగల సకల పాపాలూ తన తలకు చుట్టుకోవాలంటూ, ఆ పాపాలను ఏకరువెడుతూ, చేతులు పైకెత్తి, ఘోర శపథం చేశాడు భరతుడు.

కన్నతల్లి పన్నిన కుట్రకు ఫలితంగా గొప్పలాభం పొందిన ఒక కుమారుడు తనకు ఏమీ తెలియదని నిరూపించుకోడం ఆ కాలంలో కూడా కష్టంగానే ఉండేది. అందుకని అమాయకుడైన భరతుడు ఎన్నో ఒట్లు పెట్టుకొని, శపథాలు చేసి వెక్కి వెక్కి యేడ్చాడు. ఇన్నాళ్లూ ఎంతో ప్రేమగా చూసిన కౌసల్య తనపై మోపిన ఈ నింద నిష్కళంకుడైన భరతుడికి రాజ్య త్యాగంకన్నా, వనవాసంకన్నా కూడా

దుర్భరమై వేదన కలిగించింది. రాముడికి జరిగిన అన్యాయానికి రాము డేమీ దుఃఖించనే లేదు. కానీ, భరతుడికి జరిగిన అన్యాయం మాత్రం అంతులేనిది.

ఇప్పుడు కౌసల్యకు భరతుడి మనస్సు తెలిసివచ్చింది. తాను తలచింది తప్పు అని గ్రహించింది. అతడి తల ఎత్తి తన ఒడిలో పెట్టుకొని "నాయనా, మాయా మర్మంలేని నీ మనస్సులో కలిగిన దుఃఖం చూస్తే, నా శోకం ఇబ్బడి ముబ్బడి అవుతుంది. మనం చేసే దేముంది, నాయనా! అంతా విధివశం! పుణ్యాత్ములకు కలిగే పదవులన్నీ నీకు ఈ లోకంలోనూ పరలోకంలోనూ కలుగుగాక!" అని దీవించి మనస్సు కుదుట పరచుకొంది.

మొదట ఆమెకు అనుమానం కలిగినమాట వాస్తవం. ఈ కుట్రలో భరతుడు కూడా చేరి ఉంటాడని గాదు. కాని, అతడి మనస్సులో ఆశ ఉండకపోతుందా అనీ, అధికారం రావడంతో అతడికి తృప్తి కలుగుతుందనీ అనుకొంది. కాని భరతుని నిష్కల్మష హృదయం చూసి ఆమె అపోహలన్నీ పటాపంచలయ్యాయి. ఒక కొడుకు అడవికి వెళ్ళినా, అటువంటి మరొక కొడుకు దొరికాడుకదా అని ఆమె సంతోషించింది. ఇక్కడ కంబరుకవి ఎంత రమణీయంగా వర్ణించాడో చూడండి:

తె॥ పరమ పూత చేతస్కుడౌ భరతు చెయిది
పైక క్రౌర్యంబు కౌసల్య గనిని యంత
స్తనయుగంబున దుగ్ధంబు జాలువార
శోకమోర్వక మోమూద స్రుక్కియేడ్చె.

* * *

నగరం విడిచి అడవికి వెళ్ళిన రాముడే తిరిగి వచ్చినట్లుగా భావించి కౌసల్య భరతుణ్ణి ఆనంద బాష్పాలతో అక్కున చేర్చుకొంది.

మానవుల మనస్సులలో కలిగే రకరకాల భావాలనూ కవులు మాత్రమే చూడగలరు. ఆ భావాలను స్పష్టంగా చెప్పగల మాటలు కూడా వారికే కనిపిస్తాయి.

"నీ పూర్వీకు లనేకులు రాజ్యం ఏలి కీర్తి గడించారు. కాని రాజరికం వద్దని చెపుతున్న నీతో వారెవరూ సమానులు కారు. రాజంటే నీవే రాజువు. భరతా!" అని చెప్పి కౌసల్య వెక్కి-వెక్కి ఏడవసాగింది.

తే॥ తలప తలప మనసు క్రుంగి తలరి కరగి
పనవు నాయమ యుత్తమ పార్థివేంద్ర
మీ కులంబున నిను వంటి మేటిగుణులు
పుట్టలేదని దీవించి యట్టె తడవె.

* * *

కంబరుకవి దర్శనీయంగా సృష్టించిన ఈ కౌసల్యా భరతులు భారతీయుల హృదయాలలో చిరస్థాయిగా ఉందురుగాక! ఆ దృశ్యా లెన్నటికీ చెరగకుండును గాక!

చక్రవర్తికి చేయవలసిన ఉత్తర క్రియలన్నీ జరిగిపోయాయి. తీరని దుఃఖంలో మునిగిన భరత శత్రుఘ్నులను వసిష్ఠాది మహా ఋషులు ఓదార్చారు.

చక్రవర్తి మరణించిన పధ్నాలుగో రోజున మంత్రి సామంతాదులు సభ తీరి, భరతుడికి నమస్కరించి, ఇలా విన్నవించారు:

"పూజ్యులైన మన చక్రవర్తి స్వర్గవాసులైనారు. రామ లక్ష్మణులు రాజ్యం విడిచి వనవాసం చేస్తున్నారు. నాయకుడులేని ఈ రాజ్యాన్ని ఈ సంచర్భంలో తాము భరించడం తప్పుకాదు. కనుక తమరు దీని కంగీకరించి మాకు రాజులై కీరిగడించి, తేజరిల్లాలని ప్రార్థన. పట్టాభిషేకానికి కావలసిన సకల మంగళ సంభారాలూ సమకూర్చి ఉంచాం. అన్ని ఏర్పాట్లూ జరిగాయి. పుర ప్రముఖులూ. రాజకులీనులూ ఆ శుభముహూర్తం కోసం కాచుకొని ఉన్నారు. రాజ్యాన్ని స్వీకరించండి. ఇది తమ పూర్వీకుల రాజ్యం. పట్టం కట్టుకొని మమ్మల్ని రక్షించండి."

ఇది విని భరతుడు పట్టాభిషేకం కోసం తెచ్చిన సంభారాలకు ప్రదక్షిణం చేసి, చేతులు జోడించి నమస్కరించాడు. అక్కడ చేరిన మహాజనులను చూసి ఇలా అన్నాడు :

"జ్యేష్ఠ పుత్రుని హక్కు అయిన ఈ రాజ్యాన్ని స్వీకరించ వలసిందని వంశాచారానికి విరుద్ధంగా మీరు నన్ను కోరడం న్యాయం కాదు. మీకు సకల శుభాలూ కలుగుగాక ! రామచంద్రుడు నాకు జ్యేష్ఠుడు. ఆయన ఉండే అరణ్యానికి పోయి ఆయనకు అక్కడే పట్టాభిషేకం చేసి రామలక్ష్మణులను అయోధ్యకు తీసుకు రావాలని నేను నిశ్చయించు కున్నాను. అందుకవలసిన పరివారాన్ని సమకూర్చి తగిన ఏర్పాట్లు చేయించండి. ఇక్కణ్ణించి అడవికి పోయే దారులు బాగు చేయించడానికి పనివారిని నియమించండి. నేను పట్టాభిషేకం చేసుకోను. ఇదే నా వ్రతం."

రాజకుమారుడి మాటలు వినగానే సభలోని వారంతా ఆనందపరవశులై హర్ష ధ్వానాలు చేశారు.

భరతుడి ఆలోచనను అందరూ ఒప్పుకున్నారు. గొప్ప సైన్యంతో పరివారంతో అడవికి వెళ్ళి భరతుడు రాముణ్ణి కలుసు కోడానికి ఏర్పాట్లన్నీ చేశారు.

* * *

అడవిదారులు చక్కగా ఎరిగిన వారూ, బావులూ, కాల్వలూ తవ్వగల వారూ, సొరంగాలు చెయ్యగల వారూ, తెప్పలూ పడవలూ కట్టగల నేర్పరులు, రాతిపని వారూ, యంత్రాలు నిర్మించే వారూ. గొప్పగొప్ప చెట్లను అవలీలగా కూల్చగల వారూ, మిట్ట పల్లాలను చదునుచేయగల వారూ,తాపీపనివారూ. అడవిలో వెళ్ళడానికి అలవాటు పడినవారూ, ఇంకా ఇలాంటివారు అనేకులు ముందుగానే తీసుకు ముందుకుపోయి, కావలసిన ఏర్పాట్లన్నీ చక్కదిద్దుకో చేసివేశారు. రాముణ్ణి తోడ్కొని వస్తామన్న ఉత్సాహం వారికి ఎక్కడలేని బలాన్ని ఇచ్చింది. చురుకుగా వంతెనలను నిర్మించారు. చెట్లు నరికారు. సేనలతో సహా రాకుమారుడు ప్రయాణం చేయడానికి అనువుగా బాటలు వేశారు. మిట్ట పల్లాలను సరి చేశారు. చిత్తడి నేలలను అడ్డుకట్ట, పొడి

V.R. NARLA MEMORIAL LIBRARY Acc. No. Date

మన్నుతో తడి ఆర్చారు. అక్కడక్కడ సైన్యానికి కావలసిన విడుదులు నిర్మించారు. మంచినీటి వసతులు ఏర్పరచారు. ఈ విధంగా కావలసిన సౌకర్యాలన్నీ కల్పించారు.

* * *

భరతుడి ఆనతి ప్రకారం ఇలాగ అరణ్య ప్రయాణానికి సమ సమైన ఏర్పాట్లూ జరుగుతున్నాయి. వసిష్ఠుడూ మంత్రులూ మంత్రాలోచనకోసం సభ తీర్చారు. భరతుణ్ని రప్పించడానికి అతని నగరుకు దూతలను పంపారు. పిలవడానికి వచ్చినవారు హర్షధ్వానాలు చేయడం చూసి, భరతుడు చాలా పరితపించాడు. "ఆ ఘోష వద్దు, ఆగండి" అని చెప్పి వారిని పంపివేశాడు. తమ్ముడు శత్రుఘ్నుని చూసి "రాజ్యం వద్దన్నా కూడా వీరు నన్నిలా బాధ పెడుతూనే ఉన్నారు. అమ్మ చేసిన కుట్రకు ఫలితం చూశావా? ఈ నింద నేను మోయడం కోసమే నన్ను ఒంటరిగా విడిచి నాయనగారు స్వర్గానికి పోయారు. రాజు లేక ఈ రాజ్యం తపిస్తూంది. చుక్కానిలేని ఓడలాగా ఒడుదుడుకులు పడుతూంది" అని చెప్పి విలపించాడు.

అకలంకమూర్తి అయిన భరతుడు వస్తున్నాడని సభలో అందరూ కుతూహలంతో, ద్వారంవైపు చూస్తున్నారు. చంద్రోదయ మైందా అన్నట్లు, భరతుడు సభలో ప్రవేశించాడు. అక్కడ ఉన్న పెద్దలందరకూ నమస్కరించి, తన ఆసనం అలంకరించాడు.

"పూజ్యులూ మహారాజులూ అయిన తమ తండ్రిగారూ, సోదరుడైన రామచంద్రుడూ తమ కిచ్చిన రాజ్యాన్ని స్వీకరించి మమ్మ ఏలండి" అని వసిష్ఠుడు అనగానే భరతుడి మనస్సు రాముడి మీదికి పోయింది. అప్రయత్నంగా కన్నీరు కాల్వలు పారింది.

యువకుడైన భరతుడు నిండు సభలో ఎలుగెత్తి విలపించాడు. వసిష్ఠుని చూచి నిష్ఠూరంగా మాట్లాడాడు:

"నేను సరి అయిన పద్ధతిలోనే పెరిగాను. వంశ మర్యాదకు తగిన సదాచారాన్ని నెరపుతున్నాను నాకు అధికారం లేని వస్తువును నేను ఎలా అపహరించేది? కూడని పని చేయమంటున్నారే. నన్ను! చాలా ఆశ్చర్యంగా ఉంది. దశరథుడి కుమారుడైన వాడు అలాంటి

పని చేస్తాడా? ఈ రాజ్యం రాముడిది. ఆయన జ్యేష్ఠుడు ధర్మాత్ముడు. దిలీప, నహుష చక్రవర్తులతో సమానమైనవాడు. ఈ రాజ్యానికి తగిన రాజు ఆయనే కదా! కనుక ఆర్యుడైన వానికి తగని పని నాకు చెప్పడం పాతిగాదు. అడవిలో ఉన్న రాముడికి ఇక్కడ్నించే చేతులు జోడించి నమస్కరిస్తున్నాను. ఆయనే రాజు. ఆయనే రాజ్యానికి అరుడు. నేను కాను."

ఈ మాటలు విన్న సభవారు ఇతనిది ఎంత విశాలహృదయం అని, ఆనంద బాష్పాలు వర్షించారు.

"రాజైన రాముణ్ని ఒప్పించడం నాకు చేతకాకపోతే నేను అక్కడే అడవిలో తపస్సు చేసుకొంటాను. మీరంతా పెద్దలు, ఆయన్ను ఏ ఉపాయంచేతనైనా అయోధ్యకు తెచ్చి పట్టం కట్టాలి. ఇది మీ కర్తవ్యం."

భరతుడు ఇలా చెప్పి సుమంత్రుణ్ని చూసి అడవికి వెళ్లడం కోసం గబగబ ఏర్పాట్లన్నీ చేయించవలసిందని ఆజ్ఞాపించాడు. నగరమంతా మహా కోలాహలంతో ఆనందనృత్యం చేసింది. రాముడు వచ్చినట్లుగానే ప్రజలు సంతోషించారు. ఎలాగైనా సరే భరతుడు రాముణ్ని కొనివస్తాడని అందరూ నమ్మారు.

36. గుహుడి సందేహం

నిషాదరాజు గుహుడు గంగకు అవతలి ఒడ్డున ఎన్నడూలేని కోలాహలం చూశాడు. ఏదో పెద్దసేన వచ్చి విడిసినట్లు విన్నాడు. పక్కనున్న తనవారిని చూసి "వీరెవరు? ఇంత గొప్పసేనతో వచ్చి గంగను దాటాలనుకుంటున్నారు, కారణం ఏమిటి? జెండా చూస్తే, కైకేయి కుమారుడు భరతుడే ఈ సేనతో వచ్చినట్లు తోస్తూంది? అని సెచెట్టు చిత్రించిన ఆ జెండా చూడండి, రథంమీద రెపరెపలాడుతూంది. అది అయోధ్యా చక్రవర్తి ధ్వజం. ఇప్పుడు అయోధ్య నేలుతూంది రాముడి శత్రువు భరతుడు కదా! ఈ కైకేయీ పుత్రుడు అక్రమంగా రాజ్యం సంపాదించడమే కాకుండా ఇప్పుడు రాముణ్ని చంపడానికి

వస్తున్నట్టా? అలాగే తోస్తూంది. మన వీరులనూ గంగా తీరానగల మనవారందరినీ కూడగట్టి గంగా తీరాన్ని జాగ్రత్తగా కావలి కాయడానికి ఏర్పాటు చేయండి. పడవలు చేర్చి, ఆయుధాలతో సహా వీరులను సమావేశ పరచి, యుద్ధానికి సిద్ధంగా ఉండండి. చూద్దాం, రాముడిపట్ల మంచిమనస్సుతో ఉంటే వీరు గంగ దాటడానికి సహాయం చేద్దాం. అలాగాక, వీరు దుష్టతలంపుతోనే వస్తున్నట్టు తెలిస్తే, ఇక్కడే అడ్డగించివేద్దాం. దుర్మార్గుల్ని గంగ దాటనిస్తామా?" అన్నాడు.

అలాగే అన్నిఏర్పాట్లూ చేసింతర్వాత లాంఛనప్రాయంగా కొన్ని కానుకలు తీసుకుని గుహుడు ఒక పడవలో భరతుడి దర్శనానికి వెళ్లాడు.

* * *

ఆ సమయాన అవతలి ఒడ్డున సుమంత్రుడు "అదిగో! మన స్నేహితుడు గుహుడు. రాముడిపై చెప్పలేని అనురాగం ఆ నిషాదరాజుకి. మనకు స్వాగతం ఇవ్వడంకోసం తన పరిజనంతో వస్తున్నాడు. గుహుడు ఈ ప్రాంతానికి అధిపతి. ఇతనికీ ఇతని పరివారానికీ ఈ అడవంతా మూలమట్టంగా తెలుసు. రామచంద్రుడు ప్రస్తుతం ఎక్కడున్నదీ వీరు మనకు చెప్పగలుగుతారు. మనల్ని అక్కడికి క్షేమంగాను, శీఘ్రంగాను తీసుకుపోగలుగుతారు కూడా" అని భరతుడితో చెప్పుతున్నాడు.

ఇంతలో గుహుడు నది దాటివచ్చి భరతుడికి నమస్కరించాడు.

"ముందుగా మాకు తెలియపరచకుండానే దయచేశారే! పోనీండి, ఫరవాలేదు. ఇవన్నీ తమవే అని భావించి, తమకేం కావాలో సెలవిప్పించండి. తమకూ తమ సైన్యానికీ ఉపచారం చేయగలగడం మాకొక మహాభాగ్యం అనుకుంటున్నాను" అని అన్నాడు గుహుడు.

"మీ ఆదర వాక్యాలే మాకు గొప్ప విందుగా ఉన్నాయి" అని భరతుడు మర్యాద, మన్ననలు చేశాడు. తర్వాత "నేను రాముడు

ఉన్నచోటికి వెళ్లాలి. భరద్వాజాశ్రమం ఎక్కడ ఉంది ? దాని కేది తోవ ?'' అని అడిగాడు.

గౌరవ సూచకంగా గుహుడు వంగి, అంజలి ఘటించి "స్వామీ! నేనూ. నా సేవకులూ తమ వెంట వచ్చి తమను రామచంద్రు డున్న చోటికి కొనిపోవడానికి ఎట్టి అభ్యంతరమూ లేదు. తమ కెట్టి శ్రమ దమాదులూ లేకుండా తీసుకువెళ్లి అక్కడికి చేరుస్తాం. కాని. మన్నించండి... నా మనస్సున ఉన్న చిన్న సందేహం ఒక్కటి తీర్చాలి. రాజ కుమారులు ఇంత పెద్దసేనతో వచ్చి ఉన్నారే. ఇదంతా ఎందుకా అని నాకు కొంచెం సందేహంగా ఉంది! అంతే !" అన్నాడు.

ఈ మాటలు వినగానే భరతుడు "ఆహా ! ఇంతకు మించిన అవమానం నాకు వేరే ఏముంది ? రాముడి విషయంలో. ప్రజలు నన్ను చూసి భయపడే కాలం వచ్చింది కదా. గుహా : నీవు సందేహించకు. తండ్రిని పోగొట్టుకున్న నాకు రాముడే తండ్రి. ఆయన్ను ఎలాగైనా సరే. బత్రిమాలి అయోధ్యకు తీసుకుపోవాలని వచ్చాను. భగవంతుడి ఆనగా చెపుతున్నాను. నా మనస్సులో మరెట్టి దుష్ట తలంపూ లేదు" అన్నాడు.

జరిగిన సంఘటలను గురించి గొప్ప దుఃఖం, రాముడి మీద గాఢానురాగం, భరతుడి ముఖంలోనూ మాటలలోనూ గోచరించాయి. అది చూసి గుహుడికి అనుమానం పోయి, పరమానంద భరితుడైనాడు

"అయ్యా ! తమవంటి మహాత్ములు ఈ ప్రపంచంలో మరెక్కడన్నా ఉంటారా ? తనంత తానుగా వచ్చిన మహా సంపదను వద్దూ అని, త్యజింపగల సమర్థులు తమరుగాక మరెవరు ? తమ కీర్తి లోకంలో చిరస్థాయిగా ప్రకాశిస్తుంది'' అన్నాడు గుహుడు.

రాత్రి అయింది, భరతుడి సేనకు కావలసిన ఏర్పాట్లన్నీ చేయించాడు, గుహుడు. అందరూ పడుకున్నారు.

గుహుణ్ణి చూసిం తర్వాత భరతుడి దుఃఖం మరీ ఎక్కువయింది. భరతుడికి పరిశుద్ధ స్వభావం పుట్టుకతోనే వచ్చింది.

"అయ్యో ! ఇలా అయిందే !" అని అతడు రామున్నే తలంచుకొని నిట్టూర్పులు విడుస్తూ వాపోయాడు. ఒళ్లంతా చెమట పట్టింది. నిద్ర రాక అటూ ఇటూ దొర్లాడు. తనపై పడ్డ ఈ అపవాదు, తండ్రి మరణించినాడన్న దుఃఖం, రామున్నే ఎడబాసిన చింత అన్నీ కలిసి అగ్నిలాగా అతని హృదయాన్ని దహించాయి. గుహుడు అతనికి ఓదార్పు మాటలుచెప్పి దుఃఖాన్ని చల్లారుస్తున్నాడు. అలాగ గంగ ఒడ్డున కలుసుకున్న గుహుడూ, భరతుడూ ఒకరి దుఃఖాన్ని ఒకరు పంచుకున్న ఈ ఘట్టం ఆళ్వారులకూ, భక్తులకూ చాలా ప్రీతికరమైంది.

"ఇక్కడ ఉన్నప్పుడు రాముడు ఏం తిన్నాడు ? ఎక్కడ కూర్చున్నాడు ? ఎక్కడ పడుకున్నాడు ? ఏం చెప్పాడు ?" అంటూ భరతుడు ప్రశ్నించాడు. గుహు డాప్రశ్నలన్నింటికీ ప్రేమతో జవాబు చెప్పి, రాముడు నిద్రించిన చోటు, కూర్చున్నచోటు చూపించాడు 'లక్ష్మణు డెక్కడ పడుకున్నాడు ?' అని భరతుడు అడగ్గా గుహుడు ఇలా అన్నాడు :

"రాముడూ జానకీ ఈ కటికనేలపై పడుకోవడం చూసిన నాకింక నిద్ర ఎలా పడుతుంది ? అని కన్నీరు మున్నీరుగా యేడ్చి, రాత్రంతా విల్లమ్ములు చేబూని నిలిచి, నాలాగే కావలి కాచాడు."

అని గుహుడు చెప్పగా భరతుడు దుఃఖాన్ని భరించలేక బిగ్గరగా విలపించాడు.

సీతారాములు పడుకొన్న కటికనేల చూసి భరతుడు ఆ దృశ్యాన్ని తలచుకొని మూర్ఛపోయాడు. తేరుకున్న తర్వాత ఆ స్థలాన్ని తల్లులకు చూపి, "నా కోసం రాముడు కటికనేలను పడుకొన్నచోటు ఇదే ! అక్కడి గడ్డికూడా ఎంత అణిగి ఉందో చూడండి" అన్నాడు.

రాముడు ఏమి అరగించాడని అడిగిందానికి గుహుడు ఇలా చెప్పాడు . "స్వామీ ! రాముడు ఆ రాత్రి వ్రతనిష్ఠలో ఉన్నాడు. లక్ష్మణుడు తెచ్చిన జలాన్ని సేవించి మిగిలిందాన్ని అతనికిచ్చి వేశాడు. ఆ జలాన్ని లక్ష్మణుడు సేవించాడు. నేను తెచ్చిన భోజ

నాన్ని అలాగే తిప్పి పంపించి, ఆ రాత్రి ఉపవాసంతో నిద్రించారు. మర్నాడు ఉదయం కురులను జడలుగా కట్టుకొని కాలినడకను బయలుదేరి వెళ్లారు.''

రాముణ్ని ఎలాగైనా అయోధ్యకు కొనిపోయి పట్టాభిషేకం చేయాలని నిర్ణయించుకున్న తర్వాత. భరతుడి మనస్సు కొంచెం తేలిక పడింది. కాని ఇప్పు డీగంగాతీరంలో గుహుడి మాటలు విన్న మీదటా, ఆ దృశ్యాలు చూసిన మీదటా అతడి దుఃఖం కట్టలు తెంచు కొని పొర్లింది. "రామా ! నా కోసం నీవు గడ్డిపై పరున్నావా ? ఆ దృశ్యం చూసి కూడా నేనింకా ప్రాణాలతో ఉన్నాను. ఇంత జరిగిం తర్వాత కూడా, నేనింకా కిరీటం ధరించాలట !" అని విల పించాడు.

"ఎలాగైనా రాముణ్ని తోడ్కొని వచ్చి సింహాసనం మీద కూర్చుండబెడతాను. కావాలంటే, ఆయన ప్రతిజ్ఞను నేను పాలించి పధ్నాలుగేళ్లూ వనవాసం చేస్తాను. అందులో దోషంలేదు. సత్యానికి హాని రాదు. ఇందుకు రాముడు ఒప్పుకుంటాడు'' అని తనకు తానే చెప్పుకొని ఊరట చెందాడు.

మర్నాడు వేకువజామునే భరతుడు శత్రుఘ్నుని తట్టి లేపాడు. "ఏమిటి ఇంకా నిద్దరేనా ? తెల్లవారి పోయింది. మన పరివారం, సేనా గంగ దాటాలి కదా ? గుహుడితో చెప్పి వెంటనే ఏర్పాట్లు చేయించాలి" అన్నాడు.

"అన్నా నేను నిద్రపోవటం లేదు. నేనూ మీలాగే రాత్రంతా రాముణ్ని తలుచుకుంటూ గడిపాను'' అని శత్రుఘ్నుడు అన్నాడు.

వీరు ఇలా మాట్లాడుకుంటూ ఉండగా, గుహుడు అక్కడికి వచ్చాడు. "కుశలమా ? రాత్రి చక్కగా గడిచిందా ? మీ పరివార మంతా కుశలమా ?'' అని ఇలా కుశల ప్రశ్నలు వేసిం తరువాత, భరతుడి అనుజ్ఞ తీసుకొని వెళ్లాడు. నది దాటడానికి పడవలను సిద్ధం చేశాడు. ఏర్పాట్లన్నీ చాలా పెద్ద ఎత్తున జరిగాయి. సామానులను, సైనికులను, రథాలను, పడవలపైకి ఎక్కించారు. భరతుడి పరి

వారం ఎక్కిన పడవలు గంగానదిలో బయలుదేరాయి. అప్పటి కోలాహలం ఒక మహోత్సవంలా ఉంది. అయితే, భరతుడికి పట్టిన మనోవ్యధ జనసమూహానికి లేదు. భరతుడు బయలుదేరినప్పుడే "ఇంక రాముడు తిరిగి వస్తాడు. ఫరవాలేదు." అన్న నమ్మకం వారికి కలిగింది. రాముడు తిరిగి రాగానే పట్టాభిషేకం జరుగుతుందనీ, ఇంతవరకూ కలిగిన కష్టాలన్నీ ఒక కలలాగా కరిగి పోతాయనీ వారు భావించి, సంతోషంతో ప్రయాణం చేస్తున్నారు. ఆనాడు గంగ ఒడ్డున జరిగిన కోలాహలానికి వాల్మీకి వర్ణించిన తీరు చూస్తే, ఈనాడు తిరునాళప్పుడు రైలు స్టేషను వద్ద జరిగే కోలాహలం మనకు గుర్తుకు వస్తుంది. సైన్యమంతా నదిని దాటిందని తెలుసుకున్న తరువాత భరతుడుకూడా తన కోసం ప్రత్యేకం ఏర్పాటుచేసిన పడవలో బయలుదేరాడు. గంగను దాటిం తరువాత అందరూ భరద్వాజ మహర్షి ఆశ్రమానికి చేరుకున్నారు.

రామాయణం చదివి, మనం చిత సంసారం పొందడానికి ఈ భరతుడి కథ ఒక్కటే చాలు. రాముడూ భరతుడూ పరమాత్మని దివ్యావతారాలు అన్నా సరే, లేక వారు వాల్మీకి మహర్షి అమోఘ కల్పనగా భావించినా సరే. ఏమైనా, అలాంటి ఉదాత్త కల్పన చేసిన మహర్షికి గుళ్లుకట్టి తరతరాలా పూజించ వలసిందే. ఇలాంటి కల్పన చేయగలిగిన ఆ మహర్షి హృదయంలో ఎంతటి జ్ఞానం, ఎంతటి భక్తి ఉండి ఉండాలి ? అంతేకాదు, అది చదివిన మనం మహదానంద మందుతున్నాం. మన మనస్సులలో మరుగుపడివున్న తత్వజ్ఞానమూ, ఈశ్వరభక్తీ ఈ ఆనందానికి హేతువు. భక్తి జ్ఞానాలు మనకు తెలియకుండా, పుట్టుకతోనే వచ్చాయి. అవి మనలో ఉన్న మహానిధి. అవి లేనినాడు ఈ మొత్తం ప్రజానీకమే మృగ సముదాయంగా మారి, మనకన్న గొప్ప మృగాలకు ఆహారమై నశించిపోయి ఉండేది.

37. భరద్వాజాశ్రమం

భరతుడు పరివారంతో భరద్వాజాశ్రమానికి చేరుకున్నాడు. ప్రయాగ వనానికి చేరగానే అల్లంతదూరంలో రమ్యమైన ఒక వనం. దాని

మధ్య ఒక పర్ణశాల కనిపించాయి. అదే భరద్వాజ మహర్షి ఆశ్రమం అని తెలుసుకొని భరతుడు తన పరివారాన్ని అక్కడ నిలిపి వసిష్ఠుడు మొదలైన కొందరు పెద్దలతో ముందుకు వెళ్లాడు. తన పీతాంబరాలనూ, ధనుర్బాణాలనూ, ఖడ్గం వంటి క్షత్రియ చిహ్నాలనూ తీసివేసి, వసిష్ఠుని ముందు పెటుకొని, కాలి నడకను బయలు దేరాడు. తర్వాత మంత్రులను అందరినీ అక్కడే నిలిపి, వసిష్ఠుణ్ణి మాత్రం తోడు తీసుకొని వెళ్లాడు. వసిష్ఠుణ్ణి చూడగానే భరద్వాజుడు లేచి పాద్య జలాలు తీసుకు రమ్మని శిష్యులకు చెప్పి వసిష్ఠుడికి ఎదురు వెళ్లాడు.

భరద్వాజ మహర్షికి భరతుడు నమస్కరించాడు. 'ఇతడెవడు' అని వసిష్ఠుణ్ణి అడిగి, భరద్వాజుడు వివరాలు తెలుసుకున్నాడు. రాజకుమారుడికి చేయవలసిన ఉపచారాలను విధ్యుక్తంగా చేయించి కుశల ప్రశ్న లడిగాడు. దశరథుడి మరణవార్త ఆయనకు అంతకు ముందే తెలిసింది. అందుకని ఆ దుఃఖవార్తను గురించి ఏమీ ప్రస్తావించలేదు. * * *

ఈ రామాయణాన్ని నేను వాల్మీకి రామాయణాన్ని అనుసరించి వ్రాస్తున్నాను. భరతుడి పరివారాన్ని చూసి గుహుడు ఎలా సందేహించాడో భరద్వాజ మహర్షి కూడా అలాగే సందేహించి అడిగినట్టు, వాల్మీకి మహర్షి ఇక్కడ వర్ణించాడు. తులసీ రామాయణంలో ఇలా లేదు. తులసీ రామాయణం భక్తిప్రధానమైంది. ఋషులకు తెలియని విషయం ఉండదు కదా. కనుక తులసీ రామాయణంలో భరతుడిపై భరద్వాజుడికి సందేహం ఎలా కలుగుతుంది? కాగా కంబరుకవి మాత్రం వాల్మీకిని అనుసరించాడు. ఒక్క ఈ ఘట్టంలోనే కాదు, అనేక ఘట్టాలలో ఈ ధోరణి కానవస్తుంది. కంబరుకవి వాల్మీకి రామాయణాన్ని చాలా జాగర్తగా అనుసరిస్తూనే, తన ప్రత్యేక కల్పనా శక్తిని ఉపయోగించి తన రామాయణానికి అపార సౌందర్యం చేకూర్చాడు. అనేక ఘట్టాలలో ఎటువంటి మార్పూ చేయకుండానే చక్కగా చిక్కులు విడదీసి విపులీకరించాడు. ఆయన చేసిన మార్పులు కొద్దిమాత్రమే.

తులసీ రామాయణం అలాక్కాదు. తులసీదాసు ఎన్నో మార్పులు చేశాడు. ఆయన రామాయణాన్ని తన స్వకపోల కల్పితంగా గానం చేశాడు. ఆయన అపార భక్తి వల్ల ఆ హక్కు కలిగింది.

కంబరుకవి భరద్వాజ, భరత సంవాదాన్ని వాల్మీకి చెప్పినట్లే చెప్పాడు. ఋషి మాటలు విన్న భరతుడు చాలా కోపించి బదులు చెప్పినట్లు రమణీయంగా చిత్రించాడు.

ఏమైనా భరద్వాజ మహర్షి భరతుణ్ణి అనుమానించి అడిగిన విషయం మనకు ఏదోలా ఉంటుంది. గుహుడు అడిగిందానిలో ప్రత్యేక సౌందర్యం ఉంది. కాని భరద్వాజుడి అనుమానం న్యాయ మనిపించడం లేదు. అందుకు సమాధానముగా భరద్వాజుడు "నాయనా! నిన్ను నేను ఎరగని వాడనా? నీ గుణాలను లోకానికి వెల్లడి చేసి, నీకు కీర్తి ప్రతిష్ఠలు తేవడానికి పరీక్ష కోసం అడిగాను. నీ నిష్కళంక త్వాన్ని వెల్లడి చేయడం కోసమే అడిగాను" అని చెప్పినట్లు వాల్మీకి రామాయణంలో కానవస్తుంది.

మన కాలంలో ఋషులను గురించి మనకున్న అభిప్రాయం వేరు. వాల్మీకి కాలంలో వేరు. శ్రీరాముడు సాక్షాత్తుగా భగవంతుడి అవతారమైనా, వాల్మీకి రామాయణంలో ఆయన ఒక వీరపురుషుడిగా ఎలా చిత్రింపబడ్డాడో, అలాగే భరద్వాజ మహర్షి కూడా రాముడి మీద వాత్సల్యంచేత భరతుణ్ణి అనుమానించినట్లు వాల్మీకి చెపుతున్నాడు. "రాఘవ స్నేహబంధం" చేత మహర్షి ఇలా అడిగినట్లూ, తర్వాత భరతుడు దుఃఖించడం చూసి ఊరడించడంకోసం కొన్ని మాటలు చెప్పినట్లూ, వాల్మీకి వర్ణించాడు. వాల్మీకి రామాయణం లోని పాత్రలన్నీ కూడా అపూర్వ గుణాలుగల మానవులు. దైవ భావం బాలసూర్య కిరణాలలాగ కనిపిస్తుంది. అంతే. మానవ స్వభావం ఎక్కువగా గోచరిస్తుంది. తర్వాత వచ్చిన తులసీదాసు కాలంలో భక్తిభావం మధ్యందిన మార్తాండుని లాగ వెలుగుతుంది. ఆ వెలుగులో అన్నీ మరుగున పడిపోతాయి. కంబరు కవి కల్పనలో భక్తి ప్రధానముగా ఉన్నప్పటికీ వాల్మీకి కల్పనలోని మానవత్వాన్ని మరుగు పరచకుండానే, భక్తి వెనుకనుంచి కాంతి విరజిమ్మేట్టు

చేశాడు. దానివల్ల మానవత్వాన్ని ఇంకా శోభాయమానం చేయ గలిగాడు.

* * *

భరతుణ్ని చూడగానే భరద్వాజుడు కుశలప్రశ్నలు వేసి "భరతా! నీవు రాచ కార్యాలు విడిచి ఇలా వచ్చావేం? నీ బాధ్యత అయోధ్యలోకదా ఉంది? ఇక్కడ నాకు ఒక అనుమానము తోస్తూంది. దశరథుడు తన చిన్నభార్య మాటలు విని రాముణ్ని పధ్నాలుగేళ్లు వనవాసం చేయుమని ఆజ్ఞాపించడం వల్ల, అతడు తన తమ్ముణ్నీ భార్యనూ వెంటబెట్టుకొని అడవిలో ఉంటున్నాడు. నీ రాజ్య పరిపాలనకు ఇంకా ఏమైనా కొంచెం ఆటంకం ఉండిపోయిందా? దాన్ని తొలగించుకోడానికిగాను మరేదైనా యోచన చేస్తున్నావా?" అని అడిగాడు.

ఈ మాటలు మహర్షి నోట వినగానే భరతుడికి కన్నీరు కాల్వలై పారింది. కంఠం గద్గదికమై పోయింది.

"హా! హతోస్మి!" అన్నాడు. "మీరే నన్ను అనుమానిస్తున్నారా మహాత్మా!? భగవాన్! వద్దు. నేనెక్కడో ఉండగా నాకు తెలియకుండా, నా సమ్మతిలేకుండా, నన్ను కన్న తల్లి చేసిన దుష్టచేష్ట నాపై మోపడం తగదు. ఎలాగైనా రాముణ్ని సమాధానపరచి అయోధ్యకు కొనిపోయి, ఆయన్ను రాజుగాచేసి, నేను ఆయనకు జీవిత పర్యంతం దాసుడిగా వుండి సేవచేయాలనికదా వచ్చాను? నా రాముడు ఎక్కడున్నాడో కమర్ని అడిగి తెలుసుకుందామని ఇక్కడికి వచ్చాను. అటువంటప్పుడు నన్నీవిధంగా అనడం న్యాయమా?" అంటూ భరతుడు ఎంతగానో విలపించాడు.

దానిపై భరద్వాజుడు "భరతా! నీ మనస్సు నాకు తెలుసు. రఘువంశాన పుట్టిన నీవు వేరువిధంగా ఎలా ఉండగలవు? రాముడిపై నీకున్న భక్తి దృఢమై నీ కీర్తి వర్ధిల్లడం కోసమే నే నిలా అడిగాను. అందుకు బాధపడకు. రాముడు చిత్రకూట పర్వతం వద్ద ఉంటున్నాడు. ఈ రోజు ఇక్కడ ఉండి రేపు మంత్రులతో అక్కడికి

వెళ్లదువుగానిలే. నా ఆశ్రమంలో ఇవాళ ఉండి, నన్ను ఆనందింప చేయాలి. ఇదే నా అభిలాష" అన్నాడు.

"స్వామీ! తాము నాకు ఇచ్చిన అర్ఘ్యపాద్యాలు చాలవా? అతిథి పూజలన్నీ పొంది గొప్ప విందారగించినట్లు ఈ దాసుడు తృప్తి పొందుతున్నాడు" అని భరతుడు బదులు చెప్పాడు.

అడవిలో కాలక్షేపం చేసే బీదతాపసికి ఇబ్బంది కలిగించ కూడ దనుకొని, రాజకుమారు డిలా అంటున్నట్లు భరద్వాజుడు గ్రహిం చాడు. అప్పుడు చిరునవ్వుతో "అలాకాదు. నీ భక్తికీ పదవికీ తగి నట్లు ఉపచారం చేయడం నా ధర్మం" అని చెప్పి "నీ సైన్యం, పరి వారం, అంతా దూరంగానే నిలిచి పోయిందేం? వెంటబెట్టుకు రాలేదేం? అని అడిగాడు.

"సరేంలేదు, మహాత్మా!-ఋషి ఆశ్రమాల దరికి పరివారంతో పోరాదన్న నియమాన్నిబట్టి అలాచేశాను. నా వెంటనున్న పరివారం సామాన్యమైందికాదు. చాలా పెద్దది. ఇక్కడికి రప్పిస్తే మీకు ఇబ్బంది కలిగించినవాణ్ణవుతాను" అని భరతుడు సవినయంగా అన్నాడు.

"అలాకాదు భరతా! అందర్నీ రమ్మని ఆజ్ఞాపించండి" అన్నాడు భరద్వాజుడు.

ఆ ప్రకారమే భరతుడు తన పరివారానికి కబురు పంపించాడు.

భరద్వాజుడు తన అగ్నిహోత్ర గృహంలోకి వెళ్లి మూడుసార్లు మంత్ర సహితంగా జలాన్ని ఆచమించి, ముఖం తుడుచుకొని, "ఓ విశ్వకర్మా! ఓ మయా!" అని దేవాసుర శిల్పులను గట్టిగా పిలిచాడు. "భరతుడికీ అతడి పరివారానికీ నేను విందు చేయాలనుకుంటున్నాను. అందుకు తగిన ఏర్పాట్లు చేయించండి" అన్నాడు భరద్వాజుడు.

యముడు, వరుణుడు, కుబేరుడు, అగ్ని మొదలైన దేవతలను రావించి "మీ సహాయంతో నేను భరతుడికి ఆతిథ్యం ఇవ్వాలను కుంటున్నాను" అని భరద్వాజ మహర్షి చెప్పాడు.

అప్పుడు బలే చిత్రం ఒకటి జరిగింది. పూర్వం విశ్వామిత్రుడికి వసిష్ఠుడు చేసిన విందులాంటిది ఆనాడు భరద్వాజాశ్రమంలో జరిగింది. కాగా, ఆనాడు విశ్వామిత్రుడు ఆడినట్లు భరద్వాజాశ్రమంలో వాగ్వాదం జరగడం, ఇవి మట్టుకు జరగలేదు. అందరికీ తగిన విడుదులు ఏర్పడ్డాయి. స్నానాది సకల సౌకర్యాలూ సమకూర్చబడ్డాయి. చందనం, పువ్వులు, అన్నపానాదులు, భక్ష్యభోజ్యాలు. అప్సరసల నృత్యం, గంధర్వుల గానం, అన్నీ చిటికసేపటిలో అమరిపోయాయి. వాటి అందం, సొగసు మనం ఊహించలేం. వాటిని అనుభవించి అందరూ మైకంలో పడిపోయారన్నమాట. ఆ సంతోషంలో, మైకంలో, భరతుడి సైనికులు "ఇక మనం దండకారణ్యానికీ పోవద్దు, అయోధ్యకూ తిరిగి వెళ్లవద్దు. ఇక్కడే ఉండిపోదాం" అని కూడబలుక్కున్నారు. భరద్వాజుడి ఈ విందులు ప్రతిరోజూ ఇలాగే జరుగుతాయనుకున్నారు. కాని విధిభాగవతం అయిపోగానే అందుకోసం నిర్మించిన పందిరికూడా మాయమైపోయేట్లు, తెల్లవారేసరికి ఈ సరంజామా అంతా మాయమైపోతుందని పాపం వాళ్లకి తెలియదు.

గొప్ప సంపన్నుడైన మహారాజుకూ, ఆయన పరివారానికీ మరొక మహారాజు తన రాజధానిలో జరిపిన విందులాగ, భరద్వాజాశ్రమంలో విడుదులూ వాహనాలూ సేవకాబృందమూ ఒక్క తూటిలో సమకూరాయి. ఆ విందు భోగాలను అనుభవించి అంతా హాయిగా నిద్రించారు.

38. అదిగో! రాముడి ఆశ్రమం!

మర్నాడు ఉదయం భరద్వాజ మహర్షి భరతుణ్ని చూసి "ఇక్కడికి రెండామడల దూరంలో మందాకినీ నది పారుతూంది. దాని ఒడ్డున జన సంచారంలేని కారడవి ఉంది. దానికి దక్షిణాన చిత్రకూట పర్వతం ఉంది. ఆ కొండచరియ దగ్గర ఒక వనంలో పర్ణశాల నిర్మించుకుని సీతా రామలక్ష్మణులు నివసిస్తున్నారు" అని చెప్పి అక్కడికిపోయే దారికి వివరాలు చెప్పాడు.

తరువాత భరద్వాజమహర్షికి రాణులు ముగ్గురూ ప్రదక్షిణం చేసి నమస్కరించగా, వీరెవరెవరో తెలియపరచవలసిందని మహర్షి భరతుణ్ని ఆడిగారు.

భరతుడు అలాగే కౌసల్య, సుమిత్ర, కైకేయిలను ఒకరి తర్వాత ఒకరిని పేరు పేరునా చెప్పి, మహర్షి దీవెనలు పొందాడు.

"ఇదిగో దుఃఖంతో, ఉపవాస క్లేశంతో, మిక్కిలి చిక్కిపోయి వున్న ఈమె మహారాజు పట్టమహిషి కౌసల్యాదేవి. ఇంద్రుణ్ణికన్న అదితితో సమానురాలు. ఈమె శ్రీరాముడి కన్నతల్లి. కుడిప్రక్కన కౌసల్యను పట్టుకొని, వాడిపోయిన పూలతీగలాగ దుఃఖంతో ఉన్నామె చక్రవర్తి రెండవ పట్టమహిషి - రాముడి వెంట నీడలా అనుసరించిన భాగ్యశాలియగు నా అన్న లక్ష్మణుని కన్నతల్లి సుమిత్రాదేవి. ఇదిగో, ఈమె ఈ దుఃఖాలన్నింటికీ కారకురాలైన నా తల్లి - కైకేయి. ఆర్యరూపంలో ఉన్న అనార్య"అని భరతుడు తన తల్లిని చూపించాడు. ఆమెకూడా తక్కిన వారిలాగానే మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి సిగ్గుముఖంతో కుమారుడి పక్కకు వచ్చి నిలబడింది.

అప్పుడు భరద్వాజ మహర్షి భరతుణ్ని చూసి "నాయనా! తల్లిని ఎప్పుడూ అలా అనకూడదు. లోక క్షేమం కోసమే అన్నీ అలా జరిగాయి" అన్నాడు.

* * *

తల్లులను పరిచయం చేసే ఈ ఘట్టానికి కంబరుకవి స్థలం మార్చాడు. గుహుణ్ని పరిచయం చేసిన ఘట్టానికి దీన్ని చక్కగా తీసుకుపోయాడు. గుహుడు సవినయంగా తెలుసుకోగోరగా, భరతుడు తన తల్లులను ఒక్కొక్కరినీ పరియం చేసినట్లు కంబరుకవి వర్ణించాడు. భరద్వాజాశ్రమంలో జరిగినట్లు వాల్మీకి చిత్రించిన ఈ ఘట్టానికి సరియైన స్థలం ఏది అని కంబరుకవి తన కవితాదృష్టితో చూసి, తన అసాధారణ ప్రజ్ఞను కనపరిచాడు.

ఆ ఘటాన్ని ఇక్కడ ఉదాహరించడం అవసరమే:

సీ॥ బాంధవుల్ దేవతల్ ప్రణతులై సేవించు
కోసలేంద్రాత్మజన్ గుహుడు గాంచి
యీమె యెవ్వరి తల్లి యెరిగింపదగు నన
భరతు డిట్లను వేని వాకిలి కడ
రాజులు మనవికై రహిగాచి యుండు రా
ఘవశ్వరు జ్యేష్ఠ దార యీమె
కమలజు నాభిని గన్న మహాత్ముని
ఘనతను గడుపార కన్నతల్లి

తే॥ భువనతారకమగు రామ భూరి ఫలము
కడకు జగముల కొసగిన కల్పతరువు
అతని గనుటచే నొందు భాగ్యం బదెల్ల
నేను జనియించు కతమున నీగికొనియె.

"రాముడనే పెన్నిధిని బడసిన కౌసల్యాదేవి, భరతుడనే నేను కుమారుడుగా పుట్టినందువల్ల, ఆ పెన్నిధిని పోగొట్టుకుంది. ఆమే ఈమె" అని భరతుడు చెప్పాడు.

చ॥ అనుడు సుమిత్ర గాంచి గుహు
డల్లన నిట్లను బ్రేమపూర్ణ యీ
జననిని గూర్చి పల్కుమన
జక్కటి వీడని చక్రవర్తి కొ
ప్పిన కడగొట్టుభార్య రఘు
వీరుని సన్నిధి పాయకుండు నా
యనుజుని కన్నతల్లి సుగు
ణాలయ యంచు యతండు దెల్పగన్.

"నేను పొందలేని భాగ్యాన్ని లక్ష్మణుడు పొందాడు. అట్టి నా నిజసోదరుని తల్లి సుమిత్రాదేవి ఈమె" అన్నాడు.

ఉ॥ దొడ్డగు నెంజిలిన్ భువికి
దుందుడు కొప్పగ గూర్చి నిందయున్
బిడ్డను పెంచు తల్లి పృథి
వీస్థలి ప్రాణములేని పోల్కి బే
రెడ్డ దపించుచుండ లవ
మేని యలందరు చిన్నెలేని యీ
వెడ్డరి యెవ్వరో యెరుగ
వే ననుగన్న మహాత్మ్యరాలగున్.

వాల్మీకి రామాయణంలోలాగానే కంబ రామాయణంలో కూడా, భరతుడు కైకేయిని సూటిపోటి మాటలతోనే పరిచయం చేస్తున్నాడు.

* * *

భరతుడూ ఆయన పరివారమూ భరద్వాజుడు చెప్పిన దోవ పట్టుకు వెళ్ళారు. చిత్రకూట పర్వతం కూడా కనిపించింది. ఒకచోట కొద్దిగా పొగరావడం కూడా చూశారు. అదే రాముడి ఆశ్రమం అయి ఉంటుందని ఊహించారు. వెంటనే పరివారంలో మిన్నుముట్టే ఆనందఘోష బయలుదేరింది. అందరినీ అక్కడే నిలిపి, సుమంత్రుడు, వసిష్ఠుడు, భరతుడు ఈ ముగ్గురు మాత్రమే పొగ కనబడుతున్నవైపు బయలుదేరారు.

39. లక్ష్మణుడి కోపం

వచ్చిన అనర్థాలన్నింటినీ ఎలాగైనా సరే మంచి పర్యవసానానికి తీసుకు రావాలని భరతుడు అయోధ్య విడిచి అడవికి బయలుదేరిన రోజులలో ఇక్కడ చిత్రకూటంలో పర్ణశాలలో కాలం ఒక విధంగా సంతోషంతో గడుస్తూంది.

"లక్ష్మణుడూ, సీతా, నా వెంట నుండగా నాకేం కొరత" అనుకున్నాడు రాముడు.

ఆ కొండ గాంభీర్యం, అడవి అందచందాలు, పిట్టల తీయ తీయని పాటలు, ఆటలు, అతని మనస్సును దోచుకున్నాయి. నగరాన్ని బంధువులను ఎడబాసిన దుఃఖాన్ని మరిచిపోయాడు.

"సీతా! అదిగో ఆ పిటల ఆటలు చూడు! ఆ కొండమీద బండలు చూడు! ఆ బండలమీద ధాతురాగాలు నీలముగా, పచ్చగా, ఎర్రగా ఎలా మెరుస్తున్నాయో చూడు! అడవిలో ఈ చెట్లు, ఈ తీగెలు, ఈ పువ్వులు చూడు! మనం ఏమో అనుకున్నాం కాని, ఈ వనవాసం ఎంత హాయిగా ఉందీ! నా వంటి అదృష్టవంతు డెవడు? ఈ ఆనందం ఒక పక్క, తండ్రి ఆజ్ఞను నెరవేరుస్తున్నానన్న తృప్తి ఒక పక్క! తండ్రి ఆజ్ఞను తలదాల్చి. నా కర్తవ్యాన్ని నెరవేర్చడంతోపాటు, భరతుడికి రాజ్యం ఇచ్చానన్న ఆనందంకూడా పొందుతున్నాను."

ఇలా చెపుతూ రాముడు తన దుఃఖాన్ని మరిచి పోతున్నాడు. సీతను ఉత్సాహపరుస్తున్నాడు. తన వనవాసవ్రతాన్ని జరుపుకుంటున్నాడు.

ఒకప్పుడు ఆ కొండ చరియనుంచి సీతను తోడ్కొని మందాకినీ నదికి వెళతాడు. అక్కడ ఇరువురూ జలకాలాడుతారు. ఆ నది అందాన్ని చూసి ఆనందిస్తారు. "ఆ ఇసుక మేటలు చూడు! హంసలూ పిట్టలూ ఆ తామరతీగెల మధ్య ఎలా ఆడుకుంటున్నాయో చూడు! ఈ నది అందం నీ అందంలాగే ఉంది సుమా ప్రేయసీ!" అంటాడు రాముడు.

"ఈ నది ఎంత మనోహరంగా ఉందీ? మృగాలు దిగి నీరు తాగే రేవుల్లో నీరు ఎగిరి పడుతూంది చూడు. ఎంతచిత్రంగా ఉందో! కుబేరుడి సౌగంధిక సరస్సుకూడా ఇంత అందంగా ఉండదు. అదిగో, అటు చూడు. ఋషులు స్నానాలు చేస్తున్నారు. కొందరు నిలబడి సూర్యోపాసన చేస్తున్నారు. చెట్లకొమ్మల నుంచి పూలురాలి, నీటిలో పడుతున్నాయి. అదిగో అక్కడ మందాకిని ఎగిరి దుమికి ముత్యాలు విరజిమ్మినట్లు ఆటలాడుతూంది. ఆహా, ఎంత సుందరంగా ఉంది! పట్నవాసంకన్న ఈ వనవాసం ఎంతో హాయిగా ఉంది. ఇది మనభాగ్యం.

మహర్షులూ, సిద్ధులూ ఈ నదిలో ప్రతిదినమూ స్నానం చేస్తారు. ఇలాంటి దృశ్యాలు మనకు నగరంలో కనిపిస్తాయా? ఈ పర్వతమే మనకు అయోధ్య. గుంపులు గుంపులుగా ఎగిరే ఈ పిట్టలూ, వన్య మృగాలే మన ప్రజలు. ఈ మందాకినే మన సరయూనది. లక్ష్మణుడూ, నీవూ, నాతో ఉండగా ఇంకేం కావాలి నాకు? ఇక్కడ నదిలో నీరు తాగడానికి వచ్చిన మృగాలు ఒకదాన్ని చూసి ఒకటి భయపడడంలేదు. ఈ దృశ్యం ఎంత ఆనందంగా ఉంది! ఈ నదిలో జలకమాడి, కందమూల ఫలాలు భుజించి, నీతో కలిసి ఈ అడవీ, కొండల చుట్టూ తిరిగి ఆనందిస్తున్నప్పుడు నా కింక అయోధ్య ఎందుకు? రాజ పదవి ఎందుకు?''

ఇలాగ రాముడు జానకితోను, తమ్ముడు లక్ష్మణుడితోను నదీ తీరంలో కొండల్లో అడవుల్లో సంచరించి హాయిగా ఆనందంగా కాలం గడుపుతున్నాడు.

* * *

ఆనాడు వారు కొండ చరియను ఒకచోట కూర్చుని ఉన్నారు.

ఉన్నట్లుండి దూరాన ధూళిలేచి ఆకాశ మంతటా కమ్మింది. దాంతోపాటు జనసముద్రం చేసే గంభీర ఘోష కూడా వినవచ్చింది. భరతుడి సైన్యం అడవిలో ప్రవేశించినందువల్ల వన్యమృగాలన్నీ గుంపులు గుంపులుగా బెదిరి పరుగులు పెట్టటం రాముడు చూశాడు.

అప్పుడు లక్ష్మణుని చూసి ఇలా అన్నాడు :

''లక్ష్మణా, విను! ఏదో గొప్ప ఘోష వినవస్తూంది. ఏనుగులూ మనుబోతులూ బెదిరి ఇల్లా చెదరె పరుగెత్తుతున్నాయి. సంగతేంటో బాగా చూసి చెప్పు. ఎవరైనా రాజులు వేటకు వచ్చారా? పులో సింహమో మృగాలపైన పడ్డాయా? ఏమిటో చూసి చెప్పు.''

వెంటనే లక్ష్మణుడు ఎత్తుగా ఉన్న ఒక చెట్టు ఎక్కాడు. నలు పక్కలా పరికించి చూశాడు. ఉత్తర దిక్కున చతురంగ బలంతో

సహా గొప్పసైన్యం కానవచ్చింది. చెట్టుమీదనుంచే రాముడికి హెచ్చరిక చేశాడు లక్ష్మణుడు.

"అన్నా! జెండాలు ఎగుర వేసుకుంటూ రథ గజ తురగ పదాతి దళాలుగల గొప్ప సేన వస్తూంది. అపాయం! అపాయం!! వెంటనే నిప్పు చల్లార్చి, సీతను తీసుకుపోయి, కొండగుహలో భద్రంగా కాపాడండి. కవచాలు తొడిగి విల్లమ్ములు చేబట్టి యుద్ధానికి సిద్ధంగా ఉందాం" అన్నాడు.

"నాయనా! బాగా చూసి చెప్పు. ఈ సైన్యం ఏ రాజుదో. రథంమీద ఉన్న ధ్వజాన్ని పరకాయించి చూడు" అన్నాడు రాముడు.

లక్ష్మణుడు అలా చూడగానే ఒక్కసారి కోపావేశంతో ఊగిపోయాడు.

"అన్నా! రాజ్యం సంపాదించుకుని అంతటితో తృప్తిచెందక, భరతుడు మనల్ని ఎదిరించడానికే వస్తున్నాడు. అదిగో, రథం మీద కోవిదార ధ్వజం రెపరెపలాడుతూంది. నేడు కైకేయి కుమారుడు నా చేతిలో చిక్కాడు. అతడ్ని ఇక విడిచిపెట్టడం కల్ల. ధర్మచ్యుతుడైన ఇతడ్ని చంపినా పాపం లేదు. ఈ సైన్యాన్ని ఇక్కడ్నించే ఎదిరిద్దామా? కొండపైకెక్కి, అక్కడ్నించి ఎదిరిద్దామా? మనకు ఇతడు చేసిన అపకారానికి ఈవేళ కసి తీర్చుకుంటాను. మనల్ని చంపడానికి వచ్చిన శత్రువును చంపడం పాపమేమిటి? తొలుత ఇతడే కదా అధర్మానికి ఒడిగట్టాడు. అలాంటి వాడ్ని ఎదిరించి చంపడమే ధర్మం. ఇతడ్ని వధించి, ఇతడి తల్లి దురాశను నేటితో పూర్తిగా తుడిచి వేద్దాం. ఏనుగు విరిచిన మానులాగ ఈవేళ భరతుడు కూలిపోతాడు. ఈ సైన్యాన్ని నిర్మూలించి వేస్తాను. ఈ అడవిలో పీనుగులను తినే మృగాలకు విందు చేద్దాం."

ఇలాగ లక్ష్మణుడు ఆవేశంతో ఒళ్లు మరిచి మాట్లాడాడు.

40. రామ భరత సమాగమం

లక్ష్మణుడు చెప్పిందంతా విని రాముడు మెల్లగా ఇలా చెప్పాడు:

ఉ॥ తమ్ముడ నీ తలంపులకు
దగ్గ విధంబున సర్వలోకజా
లమ్ము గలంగజేయగ ద
లంచితి విప్పుడు దాని నాప శ
క్యమ్మొక్కొ ! దాని గూర్చి యిక
నాడుట కేమియు లేదు సావధా
నమ్మున విందుగాక యొక
జాన వికాస విధాన కార్యమున్.

ఇది కంబరుకవి పద్యం. వాల్మీకి కూడా ఇలాగే చెపుతున్నాడు.

"నీవు విజయం సాధించగల వీరుడవు. భరతుడి సేనను నాశనం చేయగల సమర్థుడవు. సందేహంలేదు. అయితే ఒక్క విషయం ఆలోచించాలి. ఏమిటంటావా ?" అని మొదలుపెట్టి, కోపావేశంలో లక్ష్మణుడు యథార్థాన్ని ఎలా గమనించలేకపోయాడో వివరించాడు.

"లక్ష్మణా! భరతుడే స్వయంగా వస్తున్నాడన్నావే. అలా అయితే మన ధనుర్బాణాలకూ కత్తికీ పనేముంటుంది ? తండ్రిమాటను జవదాటి, భరతుణ్ణి చంపి తద్వారా రాజ్యాన్ని అపకీర్తినీ సంపాదించి మనం ఏం ప్రయోజనం సాధిద్దామని ? బంధుమిత్రులను సంహరించి సంపాదించే సంపద, విషం కలిసిన అన్నం వంటిది. రాజ్యాన్ని ధనాన్ని ఎందుకు సంపాదించా లనుకుంటున్నాం ? వాటివల్ల ఎవరికి సుఖ సంతోషాలిచ్చి మనం సంతోషించా లనుకుంటున్నామో, వారు పోయింతర్వాత ఆ రాజ్యమూ ఆ సంపదా మన కుండి ప్రయోజన మేమిటి ? అధర్మంగా సంపాదించే రాజ్యం మనకు వద్దు. లక్ష్మణా ! నీవూ భరతుడూ శత్రుఘ్నుడూ నాతో ఉండి అనుభవింపజాలని సుఖం నాకు అక్కర్లేదు. ఇది నిశ్చయం.

నేను చెప్పేది శ్రద్ధగా విను. భరతుడు ఇప్పుడు ఇక్కడికి ఎందుకు వస్తున్నాడో నాకు తెలుసు. అతడెన్నడూ ధర్మంతప్పి ఎరగని వాడు. మనలో ఎవరికైనా అత డేనాడైనా చెరుపుచేసి ఎరుగునా? రాజ్యాన్ని నాకు అప్పగించడంకోసమే అతడిక్కడికి వస్తున్నాడు. కైకేయిపై కోపించి, తండ్రిగారిని ఎలాగో సమాధానపరచి నన్ను తిరిగి తీసుకుపోవడానికే వస్తున్నాడు. సందేహంలేదు. భరతుణ్ణి నేనెరుగుదును. నీవు అతడ్ని గురించి కోపావేశంతో మాట్లాడిందంతా అధర్మం. అలా మాట్లాడకూడదు. రాజ్యం కావాలని నువ్వు ఆశ పడుతున్నావా? అలా అయితే, చెప్పు. భరతుడు రాగానే అతడితో చెపుతాను. లక్ష్మణుడికి రాజ్యం కావాలట, అతడికి ఇచ్చివేయ మంటాను. ఇలా నేను అనడమే తరవాయి. 'తీసుకో' అని నీకు వెంటనే రాజ్యాన్ని అప్పగిస్తాడు. తప్పకుండా వప్పగిస్తాడు'' అంటూ నవ్వాడు.

సిగ్గుతో లక్ష్మణుడు కుంగిపోయాడు.

"ఒకవేళ. మన నాయనగారే మనలను చూడ్డానికి వస్తున్నారేమో'' అన్నాడు లక్ష్మణుడు.

ఆ సేనా, ఆ కోలాహలం చూసి, వారు యుద్ధానికే వస్తున్నారని మొదట లక్ష్మణుడు అనుకున్నాడు. రాముడు చెప్పిందంతా విన్నతర్వాత తన ఆలోచనకు అర్థం లేదనుకొన్నాడు. అయితే మరింతటి సేన ఇలా రావడానికి కారణం ఏమెఉంటుందా అని మళ్ళీ ఆలోచించి, ఒకవేళ దశరథుడే వస్తున్నాడేమో అనుకున్నాడు. దశరథుడు వస్తే అతడివెంట ఇంత సైన్యం ఉండడం సహజమే కదా అని మనస్సు సమాధాన పరుచుకున్నాడు.

లక్ష్మణుడు భరతుణ్ణి గురించి తానన్నమాటలు తగనివని ఎరిగి సిగ్గుపడి, ఇలా తికమక పడుతూ మాట్లాడి ఉంటాడని వ్యాఖ్యాతలు అభిప్రాయ పడుతున్నారు.

లక్ష్మణుడు సిగ్గుపడ్డాడని ఎరిగిన రాముడు "అలాగ కూడా కావచ్చు. వనవాసంలో మనం కష్టపడుతున్నామనుకుని చక్రవర్తి

మనలను, ముఖ్యంగా సీతను, నగరానికి కొనిపోయేందుకు వస్తూ ఉండవచ్చు. కాని చక్రవర్తి వెల్లగొడుగు కానరావడంలేదే ! నాయన గారు వచ్చి ఉంటే వెల్లగొడుగు ఉండేది. ఏమైనా సరే, నీవు శాంతంగా ఉండడం మంచిది" అన్నాడు.

లక్ష్మణుడు రాముడి వద్దకు వెళ్లి చేతులు కట్టుకుని నిలబడ్డాడు.

* * *

సైన్యాన్ని కొంతదూరంలో నిలిపి పొగ ఎక్కడ్నించి వస్తూందో చూసి రావడానికి భరతుడు కొంతమంది పరిజనాన్ని పంపించాడు. కొంచెం సేపు అయింతర్వాత వారు సమాచారం తెలుసుకు వచ్చారు. అదే భరద్వాజుడు అనవాళ్లు చెప్పినచోటు. అక్కడ కనబడుతున్నదే రాముడి పర్ణశాల అని నిశ్చయం కాగానే భరతుడు బయలుదేరాడు.

తనపై వచ్చిన అపవాదును తలచుకొని భయపడి ఇలా చేయాలి, ఇలా చెప్పాలి, అని మనస్సులో కూడబలుక్కుంటూ పోయినవాడు, అక్కడ కూర్చున్న రాముణ్ణి చూడగానే అన్నీ మరచిపోయాడు. పచ్చికమీద కూర్చుని ఉన్న రాముణ్ణి చూడగానే అన్నవద్దకు పరుగులు పెట్టాడు.

దుఃఖంతో కళ్లనీరు కమ్మగా, నోటమాట పెగలక "అన్నా !" అని మాత్రం అరుస్తూ, రాముడి పాదాలమీద పడ్డాడు. 'అన్నా' అన్నమాట తప్ప మరొకమాట రాక, వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఇంతలో సుమంత్రుడు, గుహుడు అక్కడికి చేరుకున్నారు. జడలుకట్టి నారబట్టలు ధరించి తన ముందు సాష్టాంగపడిన భరతుణ్ణి రాముడు చూశాడు. దుఃఖంవల్లా ఉపవాసాల వల్లా కృశించి, వన్నె తగ్గిన భరతుణ్ణి లేవనెత్తి, గుచ్చి కౌగలించుకున్నాడు. శిరస్సు మూర్కొన్నాడు. ఒడిలో కూర్చుండబెట్టుకుని "నాయనా ! తండ్రి గారిని ఒంటరిగా విడిచిపెట్టి ఇంతదూరం, ఈ అడవికి ఇలా రావడం తగునా ? ఎందుకిలా చిక్కిపోయావు ?" అని అడిగాడు.

భరతుడికి దగ్గుతికవడి మాటరాలేదు. అతడి ఆ స్థితిని చూసి రాముడు మెల్లగా రాజ్యంలోని యోగక్షేమాలను గురించి, సాధార

ణంగా రాజులు కలుసుకున్నప్పుడు మాట్లాడే పద్ధతితో మాట్లాడాడు. కొంతసేపు అయింతర్వాత భరతుడు తేరుకొని మాట్లాడాడు.

"అన్నా! రాజ ధర్మానికీ నాకూ సంబంధ మేముంది? సింహాసనమెక్కి రాజ్యపాలన చేయవలసిన వాడవు నీవుండగా, నే నెలా రాజు నవుతాను? రాజధర్మాన్ని ఎలా అనుసరిస్తాను? నీకు సేవ చేయడం ఒక్కటే నా ధర్మం. ఆ ప్రాప్తం నాకు లేకపోయింది. రాజ్య భారం వహించవలసిన వాడు జ్యేష్ఠుడు. ఇది రాజవంశాల సామాన్య ధర్మం. మన వంశపద్ధతీ అదే. నాతో అయోధ్యకు వచ్చి, పట్టం కట్టుకుని, మన వంశానికీ, ప్రజలకు శుభాలు చేకూర్చు. మహారాజు మన తండ్రిగారు చేయవలసిన యాగాలుచేసి కీర్తిగడించి మహావీరుడై ఇప్పుడు స్వర్గానికి వెళ్లిపోయారు. నేను కేకయ దేశంలో ఉండగానే మీరు అయోధ్య విడిచి అడవికి వెళ్లిపోయారు. నాయనగారు మీ వియోగ దుఃఖాన్ని భరించలేక ప్రాణాలు విడిచారు. ఇందుకు దుఃఖించవద్దు. లేచి, మన నాయనగారికి ఉత్తరక్రియలు చేయండి. నేనూ శత్రుఘ్నుడూ చేశాం. అన్నా! నాయనగారివద్ద అల్లారు ముద్దుగా పెరిగావు. నిన్ను తలుచుకుంటూనే ఆయన ప్రాణాలు విడిచారు. నీవు ఇచ్చే తిలోదకాలవల్లనే ఆయనకు శాంతి కలిగేది" అని భరతుడు గంభీరంగా చెప్పాడు.

కౌసల్యాదేవి, గుహుడు, భరద్వాజుల వద్ద భరతుడు చెప్పుకోవలసి వచ్చిన సమాధానం — అంటే జరిగిన అనర్థాలతో తనకెట్టి సంబంధమూ లేదన్న సమాధానం రాముడివద్ద చెప్పవలసిన అవసరం లేక పోయింది. దుఃఖంతో ఏడ్చేడ్చి, దేహం కృశించి, ముఖం వాడి, నిలిచి ఉన్న భరతుణ్ణి చూస్తేనే చాలు. వేరే సమాధానం అవసరం లేదు. రాముణ్ణి అయోధ్యకు కొనిపోవడం ఒక్కటే భరతుడు చేయవలసిన పని. అందుకని ఆ విషయాన్ని గురించి మాత్రమే అతడు మాట్లాడాడు కాని తన సంగతి ప్రస్తావించనే లేదు.

తండ్రి మరణించినాడన్న వార్త వినగానే రాముడు గొడ్డలి వేటు పడ్డ మానులాగా కూలిపోయాడు.

సీ॥ ఆరని భాను కులాలయ దీపమా !
నిరావ్యజ గురు ధర్మనిలయ! తండ్రి!
అరి మద గజ సింహమా! దయాలోల యిం
కెవ్వరు సత్యంబు నేలువారు ?
మాకు దిక్కెవ్వరు ? మరి తేర్చు వారెవరు?
మరణించితే యిట్లు మమ్మ పాసి
యెవ్వరినింక దండ్రీయని పిల్తుము
తగునె యిందర వీడి తరల నీకు
.....
.....

అని రాముడు శోకించాడు.

రాజకుమారులూ, సీతాదేవీ, సుమంత్రుడితో నదికి వెళ్ళారు. అక్కడ స్నానంచేసి, దోసిలితో నీళ్లు తీసుకుని తండ్రిని ధ్యానించి నదిలో విడిచారు. తరువాత యథావిధిగా కర్మకాండలు పూర్తి చేసి పర్ణశాలకు తిరిగి వచ్చారు. అక్కడ రాజకుమారులు ఒకరిచెయ్యి ఒకరు పట్టుకొని చాలాసేపు ఏడ్చి తమ దుఃఖాన్ని తీర్చుకున్నారు.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి: భరతుడు వచ్చి రాముణ్ణి చూసిన ఘట్టంలో రాముడు భరతుడికి రాజధర్మాలను ఉపదేశించినట్లు వాల్మీకి సుదీర్ఘమైన ఉపదేశాలను చిత్రించాడు. మన పురాణేతిహాసాలలో ఇలాగ రాజనీతులు, ధర్మోపదేశాలూ మాటి మాటికీ వస్తూ ఉంటాయి. ఈ నాటి గ్రంథాలలో రచయితలు ఘటనావేగం, నాటకీయత, ఆశ్చర్య విభ్రమాలు మొదలైన లక్షణాలు ప్రధానముగా చూస్తారు. మన పూర్వ గ్రంథాలలో రసవత్తర సన్నివేశాలూ, ఘట్టాలూ కోకొల్లలుగా కనబడతాయి. వాటితోపాటు మానవుల శీలాన్ని పెంచే ఉపదేశాలూ మధ్య మధ్య ధారాళంగా చేర్చడం గోచరిస్తుంది.

పైగా ఈ ఘట్టంలో, వాల్మీకి రామాయణంలోని అధ్యాయాలు క్రమం తప్పి, తారుమారయినవని ప్రాచీన వ్యాఖ్యాన

కవులు అభిప్రాయ పడ్డారు. కంబరు కవి ఇవన్నీ చక్కగా గమనించి సన్నివేశానికి అనువుగా వర్ణనచేశాడు. తులసీదాసు రామాయణంలో ఈ రామ భరత సమాగమం ఒక మహా భక్తి సాగరమై, అలలు లేచి, పున్నమినాటి సముద్రంలాగ పొంగులువారుతూంది. అందులో ఇక చిక్కులకు తావే ఉండదు.

41. భరతుడి తిరుగు ప్రయాణం

నలుగురు రాజకుమారులు, ముగురు పట్టమహిషులూ మళ్ళీ ఒకే చోట కూడారన్న సంగతి తెలియగానే అంతవరకూ మర్యాద కోసం దూరాన నిలిచిన సైనికులూ, జన సమూహమూ ఆ సంతోష దృశ్యాన్ని చూడానికి పరుగులు పెట్టుకుంటూ వచ్చారు. అప్పుడక్కడ ఒకటే ఆనంద కోలాహలం? ఇంక రాముడు అయోధ్యకు తిరిగి రావడం తథ్యం అనే భావంతో ఉన్నారు వారందరూ. ఆ సంతోషంతో ఒకరినొకరు కౌగలించుకొని అభినందనలు తెలుపుకున్నారు.

తండ్రిగారు దశరథుడు ఇహలోకం వీడినారే అని రామలక్ష్మణులూ. సీతాదేవి, దుఃఖసాగరంలో మునిగి ఉన్నారు. కాని జన సమూహానికి మాత్రం రామ దర్శనం వల్ల ఆనందం పొంగిపొర్లింది.

* * *

వసిష్ఠమహర్షి మహారాణులను పర్ణశాలకు కొనివెళ్ళారు. దారిలో వారు మందాకినీ నదిని చూశారు. "రాజకుమారులు ఈ రేవులోనే దిగి నీరు ముంచుకొని వెళతారు." అని ఒక స్థలాన్ని చూపగానే కౌసల్యా సుమిత్రలు "అయ్యో" అని బావురుమన్నారు.

"సుమిత్రా! నీ కొడుకు నా కుమారుడికోసం ప్రతిరోజూ ఇక్కడ దిగి మంచినీళ్లు ఆశ్రమానికి కొనిపోతున్నాడు చూశావా? అన్నకోసం ఏపని చేయడానికీ జంకడు, నీ కుమారుడు. కడవలో నీరు నింపి భుజాన మోయడం అతడికి కష్టం అనిపించదు" అంది కౌసల్య.

ఏటి ఒడ్డున రామలక్ష్మణులు తండ్రికి తర్పణాలు విడిచినచోటు చూశారు. దక్షిణ దిక్కుగా కొసలుంచి పరచిన దర్భలు చూశారు. అక్కడ పితృదేవతలకు వేసిన తిలపిండం కూడా చూశారు.

"ఆ మహారాజు ఆకలి తీరడానికి తలపిండం ఉంచారు. చూశావా ? ఆహా ! లోకాల నేలే మహారాజులక్కూడా చనిపోయిం తర్వాత భోజనం ఇదే. ఇది చూసికూడా ఇంకా నా గుండె పగిలి పోలేదేం ?" అని కౌసల్య సుమిత్రను పట్టుకొని విలపించింది.

వారంతా పర్ణశాలకు చేరుకున్నారు. అక్కడ ముఖాల్లో దివ్యకాంతులు విరజిమ్మే రాజకుమారులు ఆకుటింట్లో కూర్చుని ఉండడం చూశారు. ఆ దృశ్యాన్ని, చూసి నిలబడలేక కూలి పోయారు.

రాజకుమారు లిద్దరూ తల్లులను లేవనెత్తారు. కౌసల్య తమ్మి పూవుల్లాంటి తన చేతులతో రాముడి ఒళ్లు నిమిరి, దుఃఖమో ఆనందమో ఎరగనిస్థితిలో పడిపోయింది. తరువాత సీతను కౌగలించుకుని "బిడ్డా ! జనకుడి కూతురువై, అయోధ్యా చక్రవర్తి కోడలివై, నా యింట కాలుపెట్టిన నీవు, ఈ కారడవిలో ఈ ఆకుటింట ఉండాల్సివచ్చిందా ? వసివాడిన తామరపువ్వా ! దుమ్ముకమ్మిన పుత్తడిబొమ్మా ! నిన్ను చూస్తూ ఉంటే నా గుండె తరుక్కుపోతూందే. నిప్పులో కాలే కట్టె లాగ నా మనస్సు దహించుకొని పోతూంది. అమ్మా ! నా దుఃఖం ఏమని చెప్పేది ?" అని శోకించింది.

అక్కడ బృహస్పతిలాగ వెలిగిపోతూ నిలబడిన వసిష్ఠుని పాదాలంటి నమస్కరించాడు రాముడు. తర్వాత ఆయనపక్కనే కూర్చున్నాడు. వినయమే ఈ రూపు దాల్చిందా అన్నట్లున్న భరతుడు రామచంద్రుడికి ఎదురుగా కూర్చున్నాడు. పెదలు ఆచుట్టూ చేరి కూర్చున్నారు. రాముడి మనస్సు మారుతుందా ? భరతుడు ఏం మాట్లాడతాడు ? అని వారంతా ఆతురతతో ఎదురుచూస్తున్నారు.

"భరతా ? ఈ వేషంతో అడవికి వచ్చావేం ? చెప్పు ! రాజ కార్యాలను విడిచిపెట్టి జింకతోలు, జడలు ధరించి ఇక్కడికి రావడ మేమిటి ? తమ్ముడా ! ఇలా వచ్చిన కారణం ఏమిటో సవిస్తరంగా చెప్పు" అని రాముడు అడిగాడు.

"అన్నా !" అనగానే భరతుడికి గొంతు డగ్గుత్తిక పడింది. ఎంత ప్రయత్నించినా ఆ ఒక్కమాట తప్ప పైమాట పెగల్లేదు. ఎలా అయితేనేం

ధైర్యం తెచ్చుకుని, "అన్నా! నిన్ను అడవికి పంపి, ఎవరూ చేయ సాహసించని పని చేశానే అని దుఃఖంతో కుమిలి కుమిలి, నాయనగారు పరలోకానికి వెళ్లిపోయారు. నన్ను కన్న ఆమెకూడా కోరుకున్న సంతోషం పొందలేకపోవడం సరికదా, మహాపాపం చేసి, అనాథ అయి, శోకంలో మునిగి తేలుతూంది. లోకనిందకు పాల్పడి ఈ బొందితోనే నరకవేదన అనుభవిస్తూంది. మమ్మలి నువ్వే రక్షించాలి. ఇప్పుడే నువ్వు పట్టాభిషేకానికి అంగీకరించి, నీ రాజ్యాన్ని స్వీకరించాలి. ఈ ప్రజలూ, సైన్యమూ స్వర్గవాసి అయిన మహారాజుగారి పత్నులూ, అంతా ఇందుకోసమే ఇక్కడికివచ్చి కాచుకుని ఉన్నారు. నువ్వు ఈ వరం అనుగ్రహించాలి. కాదనవద్దు. అందరి దుఃఖాన్నీ పోగొట్టి, వంశ మర్యాదను కాపాడ్డానికి ఇదొక్కటే మార్గం. రాజు లేక రాజ్యం అనాథలాగా ఉంది. ఆ దుస్థితి లేకుండా నువ్వు వచ్చి రాజ్యాన్ని మంగళకరం చేయాలని కోరుతున్నాను. పూర్ణచంద్రుడి లాగా నువ్వు చీకట్లను చీకాకు పరిచి రాజ్యానికి వెలుగుతేవాలి. ఇరుగో మంత్రులు. వారూ నేనూ నీ పాదలంటి మొక్కి వేడుకుంటున్నాం. అన్నా! మా ప్రార్థనను తోసిపుచ్చకు" అని వేడుకున్నాడు.

ఇలాచెప్పి, భరతుడు రామచంద్రుడి కాళ్లు రెండూ పట్టుకున్నాడు. ధీరుడైన భరతుడి కళ్లలో నీరు కమ్మింది.

రాముడు భరతుణ్ణి లేవనెత్తి, ఒళ్లు నిమిరి, ఇలా అన్నాడు: "నాయనా మనం సత్కులీనులం. ఉత్తమ శిక్షణలో పెరిగినవారం. మనం ఎప్పుడూ తప్పుచేయం. నీలో నాకు కొంచెమైనా దోషం కనబడదు. ఎందుకు దుఃఖిస్తావు? కన్నతల్లిపట్ల దోషాబు ఎంచకు. అది మన సంస్కారానికి తగదు. ఎలాంటి ఆజ్ఞ ఇవ్వడానికైనా మన నాయనగారికి అధికారం ఉంది. ఆయన ఇష్టం. వనవాసానికి పంపడం, పట్టాభిషేకం చేయడం, అంతా ఆయన ఇష్టం. తలిదండ్రులను గౌరవించడం కూహూరులమైన మన కర్తవ్యం. వారు నన్నాజ్ఞాపిస్తే నేను కాదంటానా? అడవికి వెళ్ళమని నాయనగారు చెబితే, ఆ మాటను నేను నిరాకరించవచ్చా? నీకు ఆయన రాజ్యభారం అప్పగించారు. నాకు వనవాసం ఇచ్చారు. ఇలాగ, మన ఇరువురి జీవిత

విధానాలనూ నిర్ణయించి, ఆయన కన్నుమూశారు. ఆయన మాటను మనం జవదాటకూడదు. నీవు రాజ్య పరిపాలనచేసి ఆయన ఆజ్ఞను నెరవేర్చడంలో తప్పేముంది ? అది నీ కర్తవ్యం. నాయనగారి తుది కోర్కెను నెరవేరుస్తూ, నేను పద్నాలుగేళ్లు వనవాసం చేస్తాను. అదే నా ధర్మం. దేవరాజుతో సమానుడైన మన నాయనగారు చెప్పినట్లు విని, మనం భక్తితో ఆజ్ఞలు నెరవేర్చాలి. తండ్రి ఆజ్ఞను జవదాటిన తర్వాత నా కీ ప్రపంచాధిపత్యం లభించినా, నాకు సంతోషంలేదు.

ఇది విని కూడా భరతుడు రామున్ని మళ్లీ మళ్లీ ప్రార్థించాడు. ఈ అనర్థమంతా తన మూలముగా వచ్చిందనీ, అది తీర్చడమే తన పాపం తొలగదనీ భరతుడు భావిస్తున్నట్లు రాముడు గ్రహించాడు.

"నీవు నిన్ను నిందించు కోవద్దు. ఇదంతా నీ మూలముగా జరిగినట్లు కూడా భావించవద్దు. అన్నింటికీ కారణం ఆ విధి. అందుచేత దుఃఖించకు. అయోధ్యకు తిరిగి వెళ్లి రాజ్యపాలన సాగించు. మన నాయనగారు చెప్పినట్లు మన మిద్దరమూ నడుచుకోవాలి. ఆయన ఆజ్ఞలు మనం జవదాటకూడదు. నీకు అప్పజెప్పిన రాజ్యభారాన్ని నువ్వే వహించి తీరాలి" అన్నాడు రాముడు.

భరతుడితో వచ్చిన అయోధ్యావాసులకు రాముడి పట్టుదల చూసి ఒకపక్క ఆనందం, మరొకపక్క దుఃఖం ముంచుకుని వచ్చాయి. భరతుడి అనురాగాన్నీ, భక్తినీ, నిష్కళంక హృదయాన్ని చూసి ఇలాంటి రాజకుమార్ని బడసిన మనం ధన్యులం అని సంతోషించారు, అందరూ.

* * *

"తండ్రి మాటను నేను జవదాటలేను. నీవు వ్యర్థ ప్రయత్నం చేయకు. కడు సమర్థుడైన శత్రుఘ్నుడు నీకు తోడుంటాడు. లక్ష్మణుడు ఉండగా నా కేకొరతాలేదు. మనం నలుగురమూ తండ్రి ఆజ్ఞను చక్కగా నెరవేరుద్దాం" అని రాముడు భరతుడితో ఖండితంగా చెప్పాడు.

భరతుడి వెంట వచ్చిన పురోహితులలో ఒకరు మహావిద్వాంసుడు, జాబాలి, అప్పుడు కలగ జేసుకుని రామచంద్రుడికి లోకాయత సిద్ధాం

తాన్ని ఉపదేశించాడు. "తండ్రి ఆజ్ఞ, తండ్రి ఆజ్ఞ అని ఏదో చెపుతున్నావే ఆ తండ్రి ఎవరు? దశరథుడనేది ఒక శరీరం. అది పంచత్వం పొందింది. పంచమహాభూతాలలో లీనమై పోయింది. గతించిన ఆ రూపానికీ నీకూ ఇప్పుడేదో సంబంధం ఉన్నట్లు మాట్లాడుతున్నావు. అయోధ్యా నగరం ఇప్పుడు జుట్టు విరబోసుకుని శోకిస్తున్న స్త్రీలాగ ఉంది. నీ కోసం ఎదురు చూస్తూంది. పోయి పట్టాభిషేకం చేసుకుని సౌఖ్యాలూ భోగాలూ అనుభవించు. భరతుడు చెప్పిన మాట వినుము. తండ్రి ఆజ్ఞ అంటూ నీవు చేయవలసిన పని ఏమిటో మరిచి పోతున్నావు" అని ఆయన అన్నాడు.

జాబాలి మాటలు రాముడికి నచ్చలేదు. "మీ దృష్టిలో సత్యానికి విలువ ఉన్నట్లు కనిపించడం లేదని నా వుద్దేశం. మీరు చెప్పింది సముచితంగా లేదని నాకు తోస్తూంది. మీరు నాస్తికాన్ని ఉపదేశిస్తున్నారు. ఈ లోకంలో సత్యాన్ని మించిన ఉత్తమ పదార్థం మరొకటి లేదు" అని అన్నాడు రాముడు.

అప్పుడు వసిష్ఠుడు రామున్ని సమాధాన పరిచాడు. "రామా! జాబాలి నాస్తికుడు కారు సుమా. ఎలాగైనా నిన్ను అయోధ్యకు మరలించాలనీ, భరతుడి దుఃఖాన్ని పోగొట్టాలనీ ఆయన తలంపు. అంతే. నీ రాజ్యాన్ని నీవు స్వీకరించి ప్రజలను పరిపాలించాలనే గొప్ప ఆశయంతో ఆయన అలాగ మాట్లాడారు. కనక ఆయనపై కోపించవద్దు. రాజ్య భారాన్ని అంగీకరించడం నీ కుల ధర్మం. ఈ మాట నిజం. అది అలా ఉండగా మరొక వైపున తండ్రిగారి ఆజ్ఞ ఒకటుంది. అది జవదాటరానిదిగా నీవు భావించడం బాగానే వుంది. కాని దుఃఖ వివశుడైన తమ్ముడు, భరతుడు, నిందకు భయపడి నిన్ను శరణు వేడాడు. దాన్నిమట్టుకు ఎలా కాదన గలవు? అతడు నీ ప్రాణానికి ప్రాణం అని నువ్వు భావిస్తున్న సంగతి మాకందరికీ తెలుసు. ఆశ్రయించిన వారిని అనాదరం చేయడం నీ స్వభావం కాదు. శరణు పొందిన వారికి అభయ మీయడమే నీ వ్రతం కదా?" అన్నాడు.

ఇంత చెప్పినా రాముడు ఒప్పుకొనేటట్లు కానరాలేదు. అప్పుడు భరతుడు సుమంత్రున్ని చూసి "అన్న నన్ను కనికరించడం లేదు.

సుమంత్రా! దర్భలు తెచ్చి పరిపించు. నేనిక్కడ ఆమరణాంత నిరాహార వ్రతం వూనుతాను'' అన్నాడు.

సుమంత్రుడు కొంచెం జంకి, రామచంద్రుడి ముఖం చూశాడు. భరతుడు లేచి వెళ్లి, తానే దర్భలు తెచ్చి పరచుకుని వాటిపై కూర్చున్నాడు.

"నాయనా! ఇది తగదు. లే. అయోధ్యకు పోయి నీ కర్తవ్యాన్ని నీవు నిర్వహించు. క్షత్రియ ధర్మానికి విరుద్ధమైనపని చేయకు'' అని రాముడు అన్నాడు.

భరతుడు లేచి నిలబడి "అయోధ్యా పురవాసులారా! ఏమిటి. చూస్తూన్నారు? రామచంద్రుడు మీకు అక్కరలేదా? ఏం. మాట్లాడరేం?'' అని అడిగాడు.

అప్పుడు ప్రజలంతా ఏకకంఠంతో "రామచంద్రుడు సత్యం తప్పడు. పితృవాక్య పరిపాలనం చేయడానికి గట్టి పట్టుతో ఉన్నాడు. ఆయన స్వభావం మాకు తెలుసు. ఆయన అయోధ్యకు రాడు అటువంటప్పుడు ఆయనను నిర్బంధించి ఏంలాభం?'' అన్నారు.

"సోదరా! వీరి మాటలు విను. వీరు మన ఇరువురి హితమూ కోరేవారు. ధర్మబుద్ధిగల వారు" అన్నాడు రాముడు.

భరతుడు లేచి నిలబడి "నేను ఏ పాపమూ ఎరగను. మహారాజు ఆజ్ఞను నిర్వర్తించి తీరాలంటే రాముడికి బదులుగా నేను వనవాసం చేస్తాను. నాకు బదులు అన్నగారు అయోధ్యలో రాజ్యపాలన చేయాలి'' అన్నాడు.

రాముడు ఇది విని నవ్వాడు. "ఈ మార్పుల పద్ధతి ఇక్కడ పొసగుతుందా? ఇది వ్యాపారం కాదుగదా? ఆపత్కాలంలో ఒకడి కర్తవ్యాన్ని మరొకడు నిర్వహించడం కద్దు. చేయవలసిన వ్రతానికి తగిన దేహ దారుఢ్యం లేనప్పుడు అలా చేయవచ్చు. అన్న చేయవలసిన వ్రతాన్ని తమ్ముడు నిర్వర్తించ వచ్చు. కాని ఎలాంటి సందర్భంలో అలా జరపవలసింది? వ్రతం నిర్వహించేటందుకు అన్నకు శక్తిలేనప్పుడే. నా విషయంలో అది పొసగదు. వనవాసం చేయడానికి తగిన శక్తి

నాకు లేదనిగాని భరతుడికే ఉందనిగాని మీరెవరైనా చెప్పగలరా?" అని అడిగాడు.

అప్పుడు వసిష్ఠుడు భరతుణ్ణి చూసి "రాముడి అధికారముద్రతో ఆయనకు బదులు నీవు రాజ్యం చేయవచ్చు. అప్పుడు నింద ఉండదు; సత్యరక్షణకూ లోటురాదు" అన్నాడు.

రాముడు భరతుణ్ణి తన ఒళ్లో కూర్చుండబెట్టుకొని "తమ్ముడూ: ఇది నేనిచ్చిన రాజ్యంగానే భావించి, తండ్రిగారి మాట ప్రకారం నడచుకో" అని గాఢానురాగంతో ఓదార్చాడు.

ఆ సమయాన రామభరతుల నివ్యదేహాలు రెండూ సూర్య బింబాల్లాగా ప్రకాశించాయి.

"అన్నా! నువ్వే నాకు తండ్రివి. దైవానివి. నువ్వు చెప్పినట్లే చేస్తాను. నీ పాదుకలు నాకియ్యి. నీకు బదులుగా వాటిని పూజిస్తూ, ఈ పద్నాలుగు సంవత్సరాలూ నగరం వెలుపలనే ఉండి, రాజ్యపాలన చేస్తాను. పదిహేనో యేట నీవు నగరానికి తిరిగివచ్చి, రాజ్యాన్ని స్వీకరించాలి" అన్నాడు భరతుడు.

అలాగే కానీ, అన్నాడు రాముడు. తన పాదాలను పాదుకలపై ఉంచి వాటిని భరతుడికి ఇచ్చాడు. భరతుడాపాదుకలకు నమస్కరించి, తీసుకొని, శిరస్సున ధరించాడు.

భరతుడు సపరివారంగా అయోధ్యకు తిరుగు ప్రయాణమయ్యాడు. దారిలో భరద్వాజ మహర్షిని దర్శించి జరిగిన విషయాలన్నీ ఆయనకు ఎరుక పరిచాడు. ఆయన భరతుడి గుణగణాలను ప్రస్తుతించి "నీ శీలమూ గుణమూ శాశ్వతంగా ప్రకాశిస్తూ ఉంటాయి. దశరథుడి కుమారుడవు కదా నీవు; నీరు పల్లాన పారినట్లే, ధర్మం తప్పని నీ వంశ శీలం నిన్ను వరించింది. నిన్నొకన్న దశరథుడు భాగ్యశాలి. నిజానికి అతడు మరణించలేదు. నీ రూపంలో జీవించే వున్నాడు" అంటూ దీవించాడు.

అక్కడినుంచి వారు గుహుడున్నచోటికి వెళ్ళి, గంగ దాటి, అయోధ్య చేరుకున్నారు. భరతుడూ పరివారమూ నగరంలో ప్రవే

శించారు. తండ్రీ, అన్నా లేని నగరాన్ని చూడగానే "సారథీ: నగరం పాడుపడినట్లుందే!" అన్నాడు భరతుడు.

ఆతడి కళ్ళకు ఆ నగరం అమావాస్య చీకటి కమ్ముకొన్నట్లు, దుఃఖంలో మునిగి ఉన్నట్లు, కనిపించింది. అంతకు ముందు కేకయ 'దేశంనుంచి వచ్చినప్పుడు ఆ తొందరలో "ఏం జరిగిందో" అన్న దిగులుతో నగరంలో ప్రవేశించాడు. ఇప్పుడు పరిస్థితులన్నీ చక్కగా ఎరిగిన స్థితిలో ప్రవేశించాడు. అందుకని ఒక్కొక్కటీ తలచుకు దుఃఖించాడు.

"నా దుఃఖానికి అంతు కనబడకుండా వుంది. తాతగారి వూళ్ళో నందిగ్రామంలోనే ఉంటే సహించగలనేమో. రాముడి కిచ్చిన మాట ప్రకారం అక్కడ్నించి రాజకార్యాలు చూసుకుంటాను. అందుక్కావలసిన ఏర్పాట్లు చేయించండి" అన్నాడు.

ఆ ప్రకారమే ఏర్పాట్లన్నీ జరిగాయి. తరువాత భరతుడు సభ తీర్చి- "ఈ రాజ్యం రాముడిది. దాన్ని ఆయన తాత్కాలికంగా నాకు అప్పజెప్పాడు. అన్నగారికి మారుగా ఆయన పాదుకలను సింహాసనం మీద ఉంచాను. వాటికి నేను దాసుడుగా ఉంటూ, రాజ కార్యాలను నిర్వహిస్తాను" అని, భరతుడు ఆ సభలో ప్రతిజ్ఞ చేశాడు.

అలాగే నందిగ్రామంలో ఉండి మంత్రుల సహాయంతో రాజ్య భారం వహించాడు. వనవాసం ముగిసి, సీతారాములు తిరిగి వచ్చేవరకు అది తనకొక తపస్సుగా భావించాడు.

స్వార్థం అనేదిలేక, సర్వస్వమూ భగవంతుడి పాదపద్మాలకు సమర్పించి, లోకోపకారమే తన కర్తవ్యంగా ఎంచి, తన పనులను చక్కగా చేయడమే కదా తపస్సు? రాముడు వనవాసంలో పధ్నాలుగేళ్లు తపస్సు చేస్తూవుంటే, ఇక్కడ భరతుడు అయోధ్య దగ్గర నందిగ్రామవాసంలో తపస్సు చేస్తూ ఉన్నాడని పెద్దల వ్యాఖ్యానం.

* * *

చిత్రకూట ప్రాంతంలో క్రూర రాక్షసులున్నారు. రావణ సోదరుడైన ఖరుడు వారికి నాయకుడు. అతడికి రాముడంటే మహా చెడ ద్వేషం. అందుకని ఖరుడూ అతడి పరివారమూ మాటిమాటికీ చిత్రకూట వనంలో ప్రవేశించి, హింసిస్తూండడంవల్ల ఈ వనం విడిచి, మరొక చోటికి పోవాలని మునులు నిశ్చయించు కున్నారు. ఆ మాట రాముడికి తెలిపారు. రాముడు ఎంత ధైర్యం చెప్పినా వారికి భయం తగ్గలేదు. అందుచేత ఆ వనాన్ని విడిచి మరొక చోటికి వెళ్ళారు.

భరతుడు వెళ్ళిపోయిన నాటినుంచీ చిత్రకూటంలో రాముడికి మనస్సు మనస్సులో లేదు. తల్లులూ తమ్ముళ్ళూ వచ్చి మాట్లాడిన విషయాలు మరచి పోదామన్నా మరపు రావడంలేదు. వారి రాకను గుర్తుతెచ్చే ఆ ప్రదేశాన్ని చూసినప్పుడు బాధ ఇంకా ఎక్కువ అవుతూంది.

అందుకని ఆ చోటు విడిచి మరొక చోటికి పోవడం మంచిదని పించింది. ఋషులుకూడా వెళ్ళిపోయారు. కనుక, దండకారణ్యంలో మరొకచోటు చూసుకోవాలని సీతారామ లక్ష్మణులు నిశ్చయించు కున్నారు.

ఇలా నిశ్చయించుకొని, వారు అత్రిమహర్షి ఆశ్రమానికి వెళ్ళి, ఆయనకు నమస్కరించి ఆయన సలహాను అడిగారు. అత్రిమహర్షి భార్య మహా తపస్విని, అనసూయదేవి. సీత ఆమెకు నమస్కరించి, ఆమె దీవెనలు పొందింది. "భర్తవెంట వనవాసం చేస్తూ, కష్టాలు సహిస్తూ, నువ్వు ఆదర్శప్రాయమైన ఇల్లాలివైనావు" అని అనసూయ సీతను కొనియాడింది. తన ప్రేమచిహ్నంగా సీతకు, చీరలూ, మంగళాభరణాలు, పసుపు కుంకుమ, సుగంధ ద్రవ్యాలు ఇచ్చింది. అనసూయ మహా సౌభాగ్యవతి. ఆమె ఇచ్చిన వస్త్రాభరణాలు సీతకు అపూర్వ సౌందర్యాన్ని ఆత్మశక్తినీ ప్రసాదించాయి.

సీత వాటిని స్వీకరించి "నా నాథుడు నన్ను తల్లిదండ్రుల కంటె ఎక్కువగా చూస్తూన్నారు నా కేలోటూలేదు" అంది.

తర్వాత వారు, తాము వెళ్ళవలసిన దోవలడిగి తెలుసుకొని అక్కడ్నించి బయలుదేరారు.

42. విరాధుడి వధ

సీతారామ లక్ష్మణులు ముగ్గురూ దండకారణ్యంలో దుర్గమమైన భాగంలో ప్రవేశించి పోయి పోయి, ఒక మునిపల్లె చేరుకున్నారు. దారిలో వారికి యాగసంభారాలు, నారబట్టలు, జింకతోళ్ళు, మొదలైనవి అక్కడక్కడ కనిపించాయి. చూడ్డానికి ఎంతో రమణీయమైన ప్రదేశమది. అక్కడ పక్షులూ మృగాలు నిర్భయంగా సంచరిస్తున్నాయి. పళ్లబరువుతో కొమ్మలు వంగిన పలురకాల వృక్షాలను చూశారు. వేదాధ్యయనం చెవులకింపుగా వినిపిస్తూంది. దగ్గరకు వెళ్లగానే తేజస్సు వెదజల్లే మునిపుంగవుల ముఖాలు గోచరించాయి.

ఆ ముగురినీ చూసి ఋషులు చాలా ఆనందించారు. "రాజా! నీవు మాకు రక్షకుడవు. అడవిలో ఉన్నా నగరంలో ఉన్నా నీవు మాకు రాజువే" అని వారికి ఆదరమర్యాదలు చేసి బసకు విడిదికూడా చూపించారు.

మర్నాడు ఉదయం లేచి, ఋషుల అనుజ్ఞ తీసుకొని, వారు అడవిమార్గాన వెళ్లారు. అది చాలా చిక్కటి అడవి. పులులు, సింహాలు, తోడేళ్లు మొనలైన మృగాలు, పలువిధాలైన పక్షులు అడవినిండా ఉన్నాయి. ఆ అడవినంతా కలయదిరిగి చూస్తూ, వారు మెల్లగా సాగారు.

అలా వెళుతూ ఉండగా, ఉన్నట్లుండి నడగొండలాంటి ఒక రాక్షసుడు ఎదురుపడ్డాడు. నరమాంస భక్షకుడైన ఆ రాక్షసుడు ఉరుమురిమినట్లు గర్జించాడు. వాడి ఆకారం మహాభయంకరంగా ఉంది. మొలకు పులితోలు చుట్టుకున్నాడు. దాని కంఠాన నెత్తురింకా తడి ఆరలేదు. అక్కడక్కడ పచ్చిమాంసం ముద్దలు అంటుకునే వున్నాయి. చేతిలో ఒక పెద్దశూలం, అప్పుడు చంపిన మూడు సింహాలు, దానికి గుచ్చిన ఒక ఏనుగు తల ఉన్నాయి.

ఆ రాక్షసుడు భూమి దద్దరిల్లేలాగా అరుస్తూ, శూలాయుధాన్ని పైకెత్తి సీతనెత్తి ఒక చేతపట్టుకుని "ఎవర్రా మీరు! ఈ అడవికి ఎందుకు వచ్చారు? మిమ్మల్ని చూస్తే కుర్రవాళ్లలాగా ఉన్నారే!

జడలూ నారబట్టలూ కట్టి, మునుల వేషంలో నటిస్తున్నారా! చేతిలో విల్లమ్ములు, పక్కా నొక చక్కానిపిల్ల. ఇలాంటి మోసపువేషం వేసుకుని ఎందుకు తిరుగుతున్నట్టు? సిగ్గులేదూ? మీరు ఋషుల సంప్రదాయానికీ, మీరు ధరించిన వ్రతవేషానికీ అపకీర్తి తెస్తున్నారు. కళ్లుకప్పి తిరుగుదామనుకుంటున్నారా, దొంగల్లారా! నేనెవరినో ఎరుగుదురా? విరాధుడంటే నేనే. ఋషులను విరుచుకతింటున్నవాణ్ని నేనే! ఈ అందగత్తెను నా యింటిదానిగా చేసుకుంటా. మీ నెత్తురు తాగుతా. పాపాత్ములారా!" అంటూ ఆ రాక్షసుడు గర్జించాడు.

సీత బెదరిపోయి, వాడి చేతిలో గిజగిజలాడుతూంది. తన భార్యను రాక్షసుడలా చేత నెత్తుకోవడం చూసి రాముడికి ధైర్యం తగింది "అయ్యో, లక్ష్మణా చూశావా? దేనినైనా ఓర్చుకోనగల నేను ఇది చూసి ఓర్చుకోలేక పోతున్నానే. ఇలా జరుగుతుందని తెలిసే పాపాత్మురాలు కైక, మనలను అడవికి పంపించిందా?" అని విలపించాడు.

సీతను పొదవి పట్టుకున్న రక్కసుణ్ణి ఎలా ఎదిరించాలో తోచక, రాముడు ఈ సందర్భంలో ధైర్యాన్ని శాంతినీ జారవిడిచి మాట్లాడడం వినడంతోనే, లక్ష్మణుడు పాములాగా బుసకొట్టాడు. "రామా! ఇంద్రుడితో సమానమైన బలంగలవాడవు. నీ ప్రక్కన నేను ఉండగా, ఎందు కిలా మాట్లాడతావు. చూడు! ఇప్పుడు నా ధనుర్బాణాలు ఏం చేస్తాయో! వీడు చచ్చి, నేలపైన దొర్లుతాడు. వీడి నెత్తురు భూదేవి తాగుతుంది. అయోధ్యలో నా రోషాన్ని నువ్వు అణచివేశావు. ఇప్పు డారోషం వీడిమీద పడబోతూంది. ఇంద్రుడు పర్వతాల రెక్కలు నరికి కూల్చినట్లు, వీడ్నిప్పుడు నేలకూల్చుతున్నాను, చూడు!" అన్నాడు.

* * *

విరాధుడు అప్పుడు మళ్లీ గర్జించి "కుర్రకుంకల్లారా! ఎవళ్లురా మీరు! చెప్పండి! మాట్లాడరేం?" అన్నాడు.

రాముడు అంతలో తేరుకున్నాడు. కలవరం తీరి, అతడి ముఖంలో శౌర్యం ప్రజ్వలించింది.

"మేము ఇక్ష్వాకువంశ రాజకుమారులం. వనవాసం చేయడానికి వచ్చాం. నీవెవడవో చెప్పు?" అని ఆడిగాడు, రాముడు.

"అలాగా! దశరథుడి కుమారులా. నా తండ్రిపేరు జయుడు. తల్లి శతక్రోధ. నన్ను విరాధుడు అని రాక్షసులంతా పిలుస్తారు. ఒరే! ఆయుధాలు ధరించిన క్షత్రియాధములారా! మీ ఆయుధాలతో నన్నేమీ చెయ్యలేరురా. నాకు బ్రహ్మదేవుడి వరాలున్నాయి. ఈ పిల నిక్కడ విడిచిపెట్టి, పరుగెత్తిపోండి. ప్రాణాలు కాపాడుకోండి" అని అన్నా డారాక్షసుడు.

ఈ మాటకు రాముడి కన్నులు కోపంతో కెంపుల్లాగా అయ్యాయి. "నీవు యముడివద్దకు వెళ్లవలసిన సమయం వచ్చింది" అని విల్లువంచి ఒక్క వాడిబాణాన్ని రాక్షసుడి మీదికి వదిలాడు. ఆ బాణం వాడి శరీరాన్ని దూసుకుపోయి, నెత్తురుతో ఎర్రగా నిప్పులాగా ప్రకాశిస్తూ, నేలపైపడింది. కాని రాక్షసుడుమాత్రం అలాగే నిలబడి వున్నాడు. బాణం తగిలిన బాధతో వాడికి కోపం మిన్నుముట్టింది. సీతను కిందకు దింపి, శూలమెత్తి, నోరుతెరుచుకుని రామలక్ష్మణుల మీదికి ఉరికాడు. రాజకుమారులిద్దరూ వాడిబాణాలవరం కురిపించారు. బాణాలు వాడి ఒంటినిండా గుచ్చుకుని వాడొక పెద్ద ముండ్లపంది లాగా కానవచ్చాడు. రాక్షసుడు ఒక్కసారి నవ్వి శరీరాన్ని విదిలించగానే ఆ బాణాలన్నీ జలజల రాలిపోయాయి. వాడు శూలాయుధాన్ని పైకెత్తాడు. రామలక్ష్మణులు రెండు బాణాలువేసి ఆ శూలాన్ని తుత్తునియలు చేశారు. కత్తులు దూసి, వాడిమీదికి ఉరికారు వాడు ఆ యిరువురినీ రెండుచేతులాఎత్తి, బుజాన పెట్టుకొని అడవిలోకి దూరాడు. ఆ కీకారణ్యంలో రామలక్ష్మణులు అలా మాయమవడం అక్కడ నిలబడి చూస్తున్న సీతాదేవి చూసి, ఎంతగానో విలపించింది.

విరాధుడి బుజంమీదనున్న రామలక్ష్మణులు ఆయుధాలవల్ల వాడు చావడని తెలుసుకున్నారు. వాడి రెండుచేతులూ వడితిప్పి విరిచివేశారు. దానితో, వాడు అరుస్తూ, కిందపడిపోయాడు. తరువాత వారు వాడిని చేతులతో కాళ్లతో కుమ్మి, నుగ్గునుగ్గు చేశారు. బాధ భరించలేక వాడు ఘోరంగా అరిచాడు. బ్రహ్మను వరాలడిగినప్పుడు

ఆయుధాలవల్ల మరణం రాకూడదని కోరాడేకాని, బాధవల్ల మరణం కూడదని కోరుకోలేదు! అయినా, మృత్యువు వాడి బాధను తొలగించి శాంతి నివ్వలేదు. రామలక్ష్మణులు ఒక గొయ్యితవ్వి వాడిని అందులో వేసి పూడ్చి పెట్టాలని నిశ్చయించారు. వాడూ అలాగే చేయుమని వారిని ప్రార్థించాడు.

అప్పుడు రాముడు వాడి మెడమీద కాలుపెట్టి వాడు లేవ కుండా తొక్కిపెట్టాడు. రాముడి పాదం సోకగానే వాడికి పూర్వజన్మ స్మృతి వచ్చింది. అప్పుడు వాడు తన వృత్తాంతం ఇలా చెప్పాడు:

"భగవాన్! నీ పాదం నాకు సోకగానే నాకు జ్ఞానం కలిగింది. నా శాపం నీ వల్లనే తొలగిపోవాలి. దేవా! నేను పుట్టుకతో రాక్షసుడను కాను. నేనొక గంధర్వుడను. నేను పొందిన వరమే నా శాప విమోచనకు ఆటంకమయింది. నా ప్రాణాన్ని లాగివేస్తివా, నేను నా పూర్వస్వరూపం పొంది, పైలోకాలకు పోతాను" అన్నాడు.

అతడి కోరిక ప్రకారమే రామలక్ష్మణులు వాడ్ని చేతులతో, కాళ్లతో మర్దించి, ఒకగోతిలో పడవేసి, పూడ్చిపెట్టారు. రాక్షసుడు గంధర్వదేహంతో ఊర్ధ్వలోకాలకు పోయాడు.

తరువాత రాజకుమారులు ఒంటిపాటుగావున్న సీత దగ్గరకు వచ్చి రాక్షస సంహార వృత్తాంతం చెప్పారు. ముగ్గురూ శరభంగ మహర్షి ఆశ్రమానికి వెళ్లారు.

అక్కడ ఆ సమయంలో ఇంద్రుడు తన దేవగణాలతో వచ్చి మహర్షితో మాట్లాడుతూ ఉన్నాడు. రాముడు రావడం చూసి తన మాటలను త్వరగా ముగించుకొని మాయమయ్యాడు. తర్వాత సీతా రామ లక్ష్మణులు శరభంగ మహర్షిని దర్శించి నమస్కరించారు.

వృద్ధుడైన మహర్షి వారిని చూసి "మీ కోసమే వేచి ఉన్నాను. నేను ఈ దేహాన్ని విడిచి ఊర్ధ్వలోకాలకు వెళ్లవలసిన సమయం వచ్చింది. అయినా, రామా! నిన్ను చూడందే నేను వెళ్లదలుచుకోలేదు. అందుకనే వేచి ఉన్నాను. ఇప్పుడు నా కోరిక తీరింది. నా పుణ్య ఫలాన్ని నీ కిస్తున్నాను, గ్రహించు" అన్నాడు.

మహర్షి చెప్పిన మాటలు విని రాముడు "భగవాన్ ! నా పుణ్యాన్ని నేనే సంపాదించుకోవాలి కదా ? తాము సంపాదించిన పుణ్యాన్ని నే నెలా స్వీకరించడం ? నేను సర్వాన్ని పరిత్యజించి వన వాసానికి వచ్చాను. ఈ వనంలో నేను పర్ణశాల నిర్మించుకోడానికి అను వైన స్థలం ఏదో సెలవియ్యండి. నన్ను ఆశీర్వదించండి" అన్నాడు.

* * *

మహర్షికి రామావతార రహస్యం తెలుసు. "ఈ అడవిలో నీ వుండడానికి అనువైన స్థలం ఏదో సుతీక్ష్ణ మహర్షిని అడిగి తెలు సుకో" అని చెప్పాడు.

తరువాత శరభంగ మహర్షి అగ్నిని రగిల్చి అందులో ప్రవేశిం చాడు. ఆయన భౌతిక శరీరం అగ్నిలో దగ్ధమై, ఒక దివ్యకుమారుడి రూపంలో లేచి వైలోకాలకు పోయాడు.

విరాధుడి మరణవార్త అక్కడి తాపసలోకాని కంతటికీ తెలిసిపోయింది. వారందరూ రాముణ్ణి చూడవచ్చారు. రాక్షసుల వల్ల తామనుభవిస్తున్న బాధలను వారు రాముడికి చెప్పారు. "రాజా ! నీ విక్కడ బస ఏర్పరుచుకోవడం మా భాగ్యం. ఇంక మా తపస్సులూ, వ్రతాలూ, నిర్విఘ్నంగా సాగుతాయి. ఈ అడవిలో పడివున్న ఎము కలను చూడు. అవన్నీ రాక్షసుల బారిన పడిన తాపసుల అస్థికలు. పంపానదీ తీరంలోనూ, మందాకినీ తీరంలోనూ రాక్షస బాధవల్ల తాపసులు చాలా కష్టపడుతున్నారు. ప్రజలను రక్షించడం రాజుల కర్తవ్యం. ఆ కర్తవ్యాన్ని నెరవేర్చని రాజు అధర్మం ఆచరించినట్లు అవుతుంది. గృహస్థులు రాజుకు పన్ను చెల్లించేటట్లు, తాపసుల తపఃఫలంలో నాల్గవభాగం దానంతట అదే రాజుకు సంక్రమిస్తుంది. నీవు దేవరాజుతో సమానమైన తేజస్సుతో వెలుగొందుతున్నావు. మమ్మల్ని కాపాడు. మేము చెప్పనలవికాని కష్టాలు పడుతున్నాం. నీవే మాకు శరణ్యం" అని వారు రాముణ్ణి ప్రార్థించారు.

"మహాత్ములారా ! ఎందుకు విచారిస్తారు ? మీ ఆజ్ఞను శిరసా వహించవలసిన వాడను నేను. అయోధ్య విడిచి, పితృవాక్య పరిపాలన కోసం ఈ అడవికి వచ్చాను. తండ్రి ఆజ్ఞ నెరవేర్చి పితృఋణం తీర్చు

కొనే సమయంలో, నా వల్ల మీకు ఇలాంటి మేలు కలగడం, నా మహాభాగ్యం కదా! నే నీఅడవిలో రాక్షసులను సంహరించి మీ బాధలు తొలగిస్తాను. ధైర్యంగా ఉండండి" అని రాముడు కడు వినయంతో చెప్పగా విని, మునులు పరమానందభరితులైనారు. రామలక్ష్మణులు సీతతో సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమానికి బయలుదేరారు.

అక్కడికి దగ్గరనే ఒక పెద్ద పర్వతమూ, దట్టమైన అడవీ, కాన పచ్చాయి. అదే సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం అని తెలుసుకొని, అక్కడికి వెళ్ళారు. అక్కడ ఆరబెట్టిన నారబట్టలను చూశారు. తర్వాత కడు వృద్ధుడైన మహర్షిని సందర్శించారు. రాముడు ఆయనకు నమస్కరించి, తన పేరు చెప్పుకొని "నేను తమ దర్శనంకోసం వచ్చాను. దాసుణ్ణి ఆశీర్వదించండి!" అన్నాడు. మహర్షి లేచి వారిని చేరదీసుకున్నాడు.

"ధర్మరక్షకా! నీకు స్వాగతం! నీ రాకతో ఈ ఆశ్రమం ఉజ్వలమై ప్రకాశిస్తూంది. ఇప్పు డీఆశ్రమం నీది. నేను నీ రాక కోసమే వేచి ఉన్నాను. లేకపోతే, ఇంతకుమునుపే నే నీదేహాన్ని త్యజించి ఉండేవాడ్ని. నీవు రాజ్యం విడిచి చిత్రకూటానికి వచ్చి ఉన్న సంగతి నేను విన్నాను. నే నార్జించిన పుణ్యాన్నంతా నీకు ఇస్తున్నాను. నీవూ, నీభార్యా, లక్ష్మణుడూ ఆ పుణ్యాన్ని గ్రహించి అనుభవించండి" అని సుతీక్ష్ణ మహర్షి అన్నాడు.

ఇలాగ ఆశీర్వదించడం మహామునుల ఆచారం. ఆశీర్వాదం పొందినవారు చెప్పవలసిన సమాధానం కూడా రాముడు చెప్పిందాన్ని బట్టి మనం గ్రహించవచ్చు.

ఉగ్రతపస్సువల్ల తేజోవంతమైన ముఖంతో వెలిగిపోయే ఆ మునిపుంగవునికి నమస్కరించి, రాము డిలా చెప్పాడు:

"తాపసోత్తమా! మంచిపనులు చేసి నా పుణ్యాన్నినేనే ఆర్జించుకోవాలి. తమ ఆశీర్వాద బలంవల్ల అలా నేను చేయగలనే అనుకుంటున్నాను. ఈ అడవిలో వనవాసం చేయాలని నా సంకల్పం. మహాత్ముడైన శరభంగుని ఆనతి తీసుకొని, సర్వజ్ఞులైన తమ ఆశీర్వా

ధాలు పొందడానికి వచ్చాను. నేను నివసించడానికి అనువైన స్థలం ఏదో సెలవివ్వ వలసిందిగా వేడుకుంటున్నాను.''

మహర్షి ముఖం ఆనందంతో వికసించింది. ఆయన అర్థస్ఫూర్తిగా ఇలా చెప్పారు:

ఈ ఆశ్రమాన్నే నీవు తీసుకోవచ్చు. ఇక్కడికి దగ్గరే చాలా మంది మునులు నివసిస్తున్నారు. ఇక్కడ కందమూల ఫలాలు సమృద్ధిగా దొరుకుతాయి. కాని క్రూర మృగాలు అనేకం విచ్చలవిడిగా తిరుగుతూ. తాపసులకు బాధ కలిగిస్తున్నాయి. వాటి ఆగడాలను మునులు సహించలేక పోతున్నారు. అదొక్కటే వచ్చిన ఇబ్బంది. లేకపోతే ఇక్కడ ఎట్టి కొరతాలేదు.''

మహర్షి మాటలలో భావాన్ని రాముడు గ్రహించాడు. తన కోదండాన్ని వంచి, అల్లితాటి నెక్కించి. ఇలా అన్నాడు:

"భగవాన్-మహర్షీ! ఆ క్రూరమృగాలను పూర్తిగా నిర్మూలించడమే నా కర్తవ్యం. నా విల్లూ, వాడియైన ఈ బాణాలూ, వ్యర్థం కావు. అయితే, మేం ఈ ఆశ్రమంలోనే ఉండడం అంత ఉచితం కాదు. మా ఉనికి తమ తపస్సుకు భంగకరంగా ఉంటుంది. దగ్గరలోనే ఏదో ఒక స్థలం చూసుకుంటాం. అనుగ్రహించండి!''

ఆ ఆశ్రమంలోనే మహర్షికి అతిథులుగా వారు ఆ రాత్రి గడిపారు.

వేకువజామున ముగ్గురూ లేచి, నల్లకలువల సువాసనతో గుబాళించే చల్లని నీటిలో స్నానం చేసి, హోమం మాచరించి, మహర్షికి నమస్కరించారు.

"తమ అనుగ్రహంవల్ల రాత్రి సుఖంగా గడిచింది. ఇక్కడ ఉన్న మహాముని లందరినీ సందర్శించి వారి ఆశీర్వాదాలు పొందాలని నా కోరిక. ఎండ ముదరకముందే బయలుదేరడం మంచిది కనక అనుజ్ఞ ఇప్పించవలసిందని కోరుతున్నాను'' అని రాముడు చెప్పాడు. తర్వాత ముగ్గురూ మహర్షికి పాదాలంటి నమస్కరించారు.

మహర్షి రాజకుమారులను ప్రేమతో ఆలింగనం చేసుకొని "క్షేమంగా పోయి రండి. దండకారణ్యంలోని తాపసోత్తము లందరినీ దర్శించి, ఆశీర్వాదాలు పొందండి. వారందరూ తపస్సు చేసి సిద్ధి పొందినవారు. ఇది రమ్యమైన వనం. జింకలు, పక్షులు, తామర కొలనులు, కొండ చరియలలో నెమళ్లు, అంతా చాలా అందంగా ఉంటుంది. లక్ష్మణా! నీవు ఇక అన్నగారితోనూ, సీతాదేవితోను, వెళ్లు. మీ ఇష్టం వచ్చినప్పుడు ఆశ్రమానికి తిరిగిరావచ్చు" అని చెప్పాడు.

మహాముని కి ముగ్గురూ ప్రదక్షిణం చేసి బయలుదేరారు. ఇరువురకూ విల్లమ్ములూ ఖడ్గాలూ సీత అందివ్వగా, వాటిని ధరించి ఆయుధపాణులై ముందుకు సాగారు. మహర్షి ప్రభావంవల్ల రాజకుమారుల అందమూ, కాంతీ, మునుపటికన్న ఎక్కువగా ప్రకాశింపసాగాయి.

43. పదేళ్ల తరువాత...

ఇప్పుడిక ప్రారంభించేది యుద్ధ కాండం. సీతకు ముమ్మందు రానున్న విపత్తునకు కవి మనలను ఆయత్త పరుస్తున్నారు. దండకారణ్యంలో రాముడిమీద ఒక కొత్త బాధ్యత పడింది— ఋషులను బాధించే రాక్షసులను సంహరించడం. దానివల్ల రాబోయే కష్టాలకు సూచనగా, సీత మనస్సులో ఒక భయం కలిగింది.

"వనవాసంలో తపస్సు చేసుకుంటున్న మనం ఈ క్షత్రియ ధర్మాన్ని ఎందుకు చేపట్టడం? పితృవాక్య పరిపాలనకోసంకదా మనం ఇక్కడికి వచ్చాం. మునులను కాపాడే బాధ్యత రాజ్యం ఏలుతున్న రాజుది. ప్రజలను బాధించే రాక్షసులను దండించడం క్షత్రియ ధర్మమే అయినా అది సింహాసనం మీద ఉన్న రాజు వహించవలసిన కర్తవ్యం? మనమా, ఇక్కడికి వచ్చింది తపస్సు చేయడానికి. రాక్షసులను సంహరించి మునులను కాపాడడం మన కర్తవ్యం కాదు. మనలను ఎదిరించి పోరాటానికి రానివారిని సంహరించడం వనవాస వ్రతానికే విరుద్ధం. అయితే, ఇక్కడి మునులకు మీరు మాట

ఇచ్చారు. 'మునులను బాధించే రాక్షసులను నేను సంహరిస్తాను' అని ప్రతిజ్ఞ చేశారు. ఇది చివరకు మనల్ని ఎక్కడ తేలుస్తుందో, అగమ్యంగా వుంది."

ఇలాగ సీత, ప్రియ వాక్యాలతోనే రాముడితో వాదించింది. వారు సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమంనుంచి బయలుదేరి, దండకారణ్యంలో ఇతర ఋష్యాశ్రమాలకు వెళ్లేటప్పుడు ఈ విషయాన్ని గురించి మాట్లాడుతూనే వెళ్ళారు.

"నాథా! ఎదురుతిరిగి మాట్లాడుతున్నానని కోపించవద్దు. స్త్రీని అయినా, నాకు తోచినమాట చెపుతున్నాను. ఏది ధర్మమో, ఏది కర్తవ్యమో మీకు బాగా తెలుసు. అందుకని మీరు ఆలోచించిన మీదటనే నిశ్చయించండి. ఆశా ప్రేరితులై మానవులు చేసే పాపాలు మూడు రకాలుగా ఉంటాయని పెద్దలు చెపుతారు. అబద్ధమాడడం, పరస్త్రీలను కోరడం, మనకు హాని చేయనివారిని బాధించడం- ఈ మూడింటిలో అబద్ధం మిమ్మల్ని అంటదు. సత్యాన్ని రక్షించడం కోసం రాజ్యాధికారాన్ని, రాజ భోగాలను విడిచిపెట్టి, ఇక్కడ వనవాసం చేస్తున్నారు. ప్రాణనాథా! మీరు కలలోకూడా పరస్త్రీని చూడరని నాకు తెలుసు! ఇప్పుడిక మూడవ విషయాన్ని గురించే నా భయం-అంటే మనలను ఎదిరించి హానిచేయనివారిని మనం వధించవచ్చా అని అడుగుతున్నాను. రాక్షసులే కావచ్చు, మరొకరే కావచ్చు- మనమీదికి రానివారిని మనమెందుకు సంహరించడం? మీరు తొందర పడి ఇక్కడి మునులకు మాట ఇచ్చారని నాకు తోస్తూంది. దుష్ట సంహారం క్షత్రియ ధర్మమే. కాని ఆ క్షత్రియ ధర్మాన్ని ఈ వనవాసదశలో అనుసరించడం అంత మంచిది కాదేమో. రాజ్యాధికారంలో ఉన్నవారికికదా ఆ ధర్మం వర్తించేది? జడలూ, నారబట్టలూ ధరించి, తాపసి వేషంలో ఉన్న మీకు ఈ ధర్మం ఎలా వర్తిస్తుంది? ఈ కర్తవ్యం ఎలా ఏర్పడుతుంది? అందుకనే ఇది కూడని పని అని నేననడం. మీకు తెలియందేమీ లేదు. నా అభిప్రాయం చెప్పాను. బాగా యోచించి, మీకు ఉత్తమని తోచినట్టే చేయండి" అంది జానకి.

ఇలా సందేహం వెలిబుచ్చిన సీతమీద రాముడికి ప్రేమా, గౌరవమూ ఇంతకుముందుకన్నా ఎక్కువైనాయి.

"ప్రేయసీ! నీవు జనకుడి కుమా రెవుగదా! అందువల్లనే ఇంతటి ఉదాత్తమైన మాటలు మాట్లాడ గలిగావు. నువ్వే చెప్పావు గదా! క్షత్రియుడు ధరించే ఆయుధాలు ఇతరులను రక్షించడానికేనని. కష్టాలతో కన్నీరు మున్నీరయ్యే ప్రజలను చూస్తూ, ఊరికే ఉండగలడా క్షత్రియుడెనవాడు? ఇక్కడికి మనం రాగానే విన్నదేంటి? ఈ మహామునులు తమ కష్టాలు చెప్పుకుని 'స్వామీ! నీవూ నీ తమ్ముడూ మమ్మల్ని కాపాడాలి!' అని కదా మొరపెట్టుకున్నారు? ఈ అడవిలో తపస్సు చేసుకుంటున్న మునులను చంపి తింటున్నారు రాక్షసులు. వారి హింసలను ఓర్చుకోలేక మునులు మనవద్ద మొర పెట్టుకున్నారు. రాక్షసులు చంపిన మునుల కంకాళాలు కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. అవన్నీ మనకు చూపించారు కదా, వారు?

తే॥ ఇంద్రుడో దానవుల యాజ్ఞ యెడదయందు
శిరమునందును తాలిచి చెలగువాడు
కాన మా తండ్రి! మా కడగండ్ల దీర్చు
వారు లేరు మా భాగ్యాన వచ్చితీవు.

తే॥ రాజ రాజ సుతుడవు రాత్రివంటి
దుఃఖమున నేమి యెరుగక దొరలుచుండ
దివిరి రవివోలె నీ వరుదెంచితయ్య
అభయమంటిమి కరుణామయాత్మ! కావు.

"మనం ఆయుధపాణులమైన రాజకుమారులం. ఈ దీనాలాపాలను విని ఊరుకోగలమా? ఆపన్నులను ఆదుకొనడం ఒక్క రాజ ధర్మమేకాదు; క్షత్రియ ధర్మంకూడా. నా క్షేమంకోరే నీవు చెప్పావు. నీవు చెప్పింది సరైందే అనుకుందాం. అయినా, నేను మాట ఇచ్చాను. మునులు 'నీవే శరణు' అన్నారు. 'మిమ్మల్ని రక్షిస్తాను' అని నేను అభయ మిచ్చాను. ప్రతిజ్ఞ చేశాను. మాట ఇచ్చాను. నా మాటకు

తిరుగు లేదు. నేను అసత్యవాదినై తే నీవు చూసి సహించ గలవా? 'ఎన్నికష్టాలు వచ్చినా నేను మిమ్మల్ని కాపాడి తీరుతాను' అని చెప్ప వలసిన మాటకాస్తా చెప్పేశాను. ఆ మాటను నిలబెట్టుకోవడం నాధర్మం. నా సహధర్మచారిణివైన నీకూ అదే ధర్మం. నీవూ నేను వేరుకాదు కదా?'' అన్నాడు రాముడు.

ఇలా వారు మాట్లాడుకుంటూ ముందుకు సాగిపోయారు.

వర్షానికి ముందు వచ్చే గాలిలాగ రాబోయే అనర్థాలకు సూచనగా, కవి ఈ వాదాన్ని కల్పించాడే కాని, పుటలు నింపడం కోసం కాదు.

* * *

సీతారామ లక్ష్మణులు ఆ దండకారణ్యంలో మునుల మధ్య ఏ కష్టాలూ లేకుండా పది సంవత్సరాలు గడిపారు.

దండకారణ్యంలో అది చాలా దట్టమైన ప్రాంతం. అక్కడ రామలక్ష్మణుల అండ చూసుకుని మునులనేకమంది ఆశ్రమాలు నిర్మించుకుని, నిశ్చింతగా తమ తపోవృత్తిని సాగించుకుంటున్నారు. ఒక ఆశ్రమంలో ఒక నెల, మరొక ఆశ్రమంలో మూడు నెలలు, ఇలా సీతారామ లక్ష్మణులు నెలలు, సంవత్సరాలు తెలియకుండానే ఆనందంగా కాలం గడిపివేశారు. అడవి అందమా, చెప్ప నలవికాదు! జింకల గుంపులు, మనుబోతులు, పందులు, ఏనుగులు, పిట్టలు, అందమైన చెట్లు, తీగెలు, నల్లకలువలు, తామరలతోనిండి, నయనానందకరంగా ఉండే కొలనులు, నీటి పక్షులు, వీటన్నింటినీ కవి వర్ణించాడు. ఇలా ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించే వారిలో వాల్మీకిమహర్షి అగ్రగణ్యుడు. ప్రకృతి వర్ణన ఆయనకు చాలా ఇష్టం. ఆయన శ్లోకాల నాదం కూడా అరణ్యం లాగానే చాలా గంభీరంగా ఉంటుంది.

మునుల పరిచయం వల్ల కలిగే ఆనందాన్ని రాముడు పదేళ్లూ అనుభవించాడు. ఆయనకు తోడుగా లక్ష్మణుడూ, సీతాదేవీ ఉండడం వల్ల ఇంకా హాయిగా వుంది.

ఈ పది సంవత్సరాల కాలాన్ని ఒక్క అధ్యాయంలోనే ముగిస్తున్నా రేంటని విచారించకండి. సంతోషంతో సుఖంగా గడిచే కాలం కావ్యాలలో సంగ్రహంగానూ, సంక్షిప్తంగానూ ముగుస్తుంది.

* * *

ఇలా పదేళ్లు గడిచాయి. వనవాస వ్రతం చాలావరకు తీరి పోయిం దనుకుంటున్న సమయంలో అగస్త్య మహర్షిని దర్శించాలని రాముడికి కుతుహలం కలిగింది.

అగస్త్యుడు కూడా విశ్వామిత్రుడి లాగా ముల్లోకాలలో కీర్తి గడించిన మహర్షి. హిమాలయం మొదలు వింధ్య పర్వతం వరకుగల జ్ఞానాన్ని, తపోబలాన్ని త్రాసులో ఒకవైపున ఉంచి అగస్త్య మహర్షిని మరొకవైపున ఉంచితే అగస్త్యుడున్న దక్షిణపు కొమ్ము బాగా మొగ్గు చూపుతుందని అంటారు. పార్వతీ పరమేశ్వరుల వివాహ కథ అందరికీ తెలుసు. అప్పుడు లోకంలోని మహామునులంతా కైలాసానికి వెళ్లారు. వారి బరువుకు భూమి అటు కుంగకుండా అగస్త్యుడొక్కడూ దక్షిణాన ఉండి భూమి యొక్క సమతూకాన్ని కాపాడినట్టు చెప్పుకొంటారు. దీన్నిబట్టి అగస్త్య మహర్షి మహిమ వ్యక్తమవుతుంది.

ఒకప్పుడు వింధ్య పర్వతం విర్రవీగి ఆకాశమంత యెత్తు పెరిగింది. దాంతో సూర్యుని దక్షిణాయన, ఉత్తరాయణ గమనం ఆగిపోయింది. అప్పుడు దేవతలు భయపడి అగస్త్యుని శరణు వేడారు. అగస్త మహర్షి వింధ్యవద్దకు రాగానే ఆ పర్వతం ఆయనకు వంగి నమస్కరించింది. అప్పుడు మహర్షి "నువ్వు ఇలాగే ఉండిపో" అని ఆశీర్వదించాడనీ, అప్పటి నుంచీ వింధ్య పర్వతం కురచ అయిందనీ చెబుతారు.

వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు మునులను బాధిస్తూ ఉండేవారు. వాతాపికి ఒక వరం ఉంది. ఆ వరప్రభావం వల్ల వాడి శరీరం ఎన్ని ముక్కలు చేసినా, అవి తిరిగి అతుక్కుని ప్రాణం వస్తుంది. ఇల్వలుడు బ్రాహ్మణ వేషం ధరించి మున్యాశ్రమా

లకు వెళ్ళి "స్వామీ! ఇవాళ మాయింటికి శ్రాద్ధభోక్తగా వేంచేసి, మమ్మల్ని అనుగ్రహించాలి!" అని ప్రార్థించేవాడు. ఇలాంటి కోరికను ఎవరూ తోసిపుచ్చరాదని శాస్త్రనియమం. అందుచేత మునులు వెళ్ళి శ్రాద్ధభోజనం చేసేవారు. తర్వాత ఇల్వలుడు శాస్త్ర విధిప్రకారం "తమకు తృప్తి కలిగిందా?" అని అడిగేవాడు. వారు "ఆహా, తృప్తి అయింది" అనేవారు. అప్పుడు ఇల్వలుడు "వాతాపీ! బయటికిరా!" అనేవాడు. వాతాపి మేకరూపం ధరించగా, వాడిని తరిగి, వండి, ఈ మునులకు పెట్టేవాడు. వాతాపి మేకమాంసం రూపంలో మునుల కడుపులో ఉండేవాడు. ఇల్వలుడు రమ్మని పిలవగానే వాతాపి మునుల కడుపులు చించుకొని వచ్చేసేవాడు. ఇలా ఎంతోమంది మునులు మరణించారు. వాతాపి వరప్రభావం వల్ల ఇలా ఆయుధాలు అవసరం లేకుండా, ఎదుట పడవలసిన అవసరం లేకుండా, వీరు ఎంతోమంది ఋషులను చంపారు.

ఒక రోజున ఇల్వలుడు ఇలాగే వంచించి. అగస్త్య మహర్షిని శ్రాద్ధభోజనానికి పిలిచాడు. వాతాపి మేకమాంసం రూపంలో అగస్త్యుడి కడుపులో ప్రవేశించాడు. అగస్త్యుడికి ఈ వంచన తెలుసు. ఆయన గణపతి ఉపాసకుడు. ఆ ఉపాసనా ప్రభావం వల్ల వాతాపిని పూర్తిగా జీర్ణం చేసుకున్నాడు.

"తమకు తృప్తికలిగిందా?" అని ఇల్వలుడు అలవాటు ప్రకారం అడిగాడు. "తృప్తి కలిగింది" అని అగస్త్యుడు జవాబిచ్చాడు. "వాతాపీ! బయటికిరా!" అన్నాడు ఇల్వలుడు. అగస్త్యుడు నవ్వాడు. "ఇంకెక్కడి వాతాపి? వాతాపి జీర్ణమయేపోయాడే!" అన్నాడు.

అది వినగానే ఇల్వలుడికి కోపం వచ్చింది. నా సోదరుణ్ణి చంపే శావా! అని అగస్త్యుడిమీదికి ఉరికాడు. కాని, అగస్త్యుడు కోపంతో చూడగానే ఆ తీవ్రదృష్టికి ఇల్వలుడు కాలి, బూడి దైపోయాడు.

అగస్త్యుడున్న చాయలకే రారు, రాక్షసులు. ఆయన ఋషులందరికీ గొప్ప అండ.

* * *

రాముడు ముందు అగస్త్యుడి తమ్ముడి ఆశ్రమానికి వెళ్ళాడు. ఆయన దీవెనలు పొంది, తర్వాత అగస్త్యాశ్రమానికి బయలు దేరాడు. దక్షిణదిశగా పయనించి అగస్త్యాశ్రమానికి చేరాడు. అక్కడ మృగాలూ పక్షులూ భయం లేకుండా సంచరిస్తున్నాయి. బ్రాహ్మలు పూజకోసం పువ్వులు కోస్తున్నారు. ఆ దృశ్యాలూ, ఆశ్రమ సౌందర్యం చూసి రాముడు ఎంతగానో ఆనందించాడు.

"లక్ష్మణా ! నువ్వు వెళ్లి మహర్షికి మన రాక ఎరిగించి, ఆయన అనుజ్ఞ పొంది రా" అని పంపించాడు.

లక్ష్మణుడు వెళ్ళి, మహర్షి శిష్యుడితో "దశరథ కుమారుడైన రామచంద్రుడు తమ్ముడితోను, జానకితోను వచ్చి, మహర్షిని దర్శించి, వారి ఆశీర్వాదాన్ని పొందడానికివచ్చి, వేచి ఉన్నారు" అని చెప్పి పంపాడు.

మహర్షి అనుజ్ఞ ఇవ్వడమే కాదు,తను స్వయంగా రాముడికి ఎదురువెళ్లి స్వాగతం పలికి ఆలింగనం చేసుకున్నాడు. "మీరు చిత్రకూటానికి వచ్చినప్పుడే నాకు తెలిసింది. ఎప్పుడో ఒకనాడు మీరు ఇక్కడికి వస్తారుకదా అని మీకోసం ఎదురు చూస్తూ ఉన్నాను. మీ వనవాస వ్రతం ముగిసే సమయం సమీపించింది. ఇక్కడ మీరు సుఖంగా ఉండవచ్చు. ఇక్కడ రాక్షసబాధ లేదు" అని అగస్త్య మహర్షి అన్నాడు.

"మహర్షి ఆశీర్వాదం పొందే భాగ్యం నాకు లభించింది. నేను దండకారణ్యంలోని మునులకు మాట ఇచ్చి ఉన్నాను. తమ ఆశీస్సులందుకొని, నేను దండకారణ్యానికి తిరిగిపోవాలి" అన్నాడు రాముడు.

"చక్కటి మాట చెప్పావు రామా !"- అన్నాడు అగస్త్య మహర్షి.

మహావిష్ణువుకోసం విశ్వకర్మ నిర్మించిన ధనుస్సునూ, ఎన్నటికీ తరగని అమ్ములపొదినీ, ఒక కత్తినీ మహర్షి రామచంద్రుడికి బహూకరించాడు. "రామా ! రాక్షసులను నిర్మూలించు ! పూర్వం మహా విష్ణువు ధరించింది ఈ ఆయుధాలనే. నీవూ వాటిని ధరించి, రాక్షస నిర్మూలనం చెయ్యి" అని ఆశీర్వదించాడు.

తర్వాత రాముడు మహర్షితో ఆలోచించి, పంచవటిలో ఆశ్రమాన్ని నిర్మించుకొని వనపాస శేషాన్ని అక్కడ గడపాలని నిశ్చయించుకున్నాడు.

"రాజకుమారులారా! వెళ్లిరండి! సీతను జాగ్రత్తగా కనిపెట్టి ఉండండి. ఆమె అడవిలో ఉండతగని సుకుమారి. రామా, నీ మీద ఆమెకున్న గాఢానురాగంవల్లనే ఈ కష్టాలను లెక్కచేయక వనవాసం చేస్తూంది. సామాన్యంగా స్త్రీలు సుఖాన్నే కోరతారు. కష్టాలను సహింపలేరు. స్త్రీల మనస్సు మెరుపులాగా చంచల స్వభావం గలది; కతి లాగ పదునైంది; గరుడుడిలాగ, వాయువులాగ వేగం గలది, గొప్ప వేగం గలది. ఇవన్నీ స్త్రీ స్వభావంలోగల దోషాలు. ఇది ఈశ్వరసృష్టి, అయినా, సీతలో ఈ దోషాలు లేవు. ఆమె అరుంధతి వంటిది. రామచంద్రా! లక్ష్మణుడితోను సీతతోను నువ్వు ఎక్కడ ఉంటే అక్కడే సౌందర్యం విలుసిల్లుతుంది. పంచవటి చాలా అందమైన ప్రదేశం. ఆహారానికి కావలసిన కందమూల ఫలాలు అక్కడ పుష్కలముగా దొరుకుతాయి. గోదావరీ నదీతీరంలో ఆ సౌందర్యాన్ని సీత ఎంతో మెచ్చుకుంటుంది. అక్కడ్నుంచి నీవు సీతనూ మునులనూ జాగర్తగా కాపాడు. దశరథ చక్రవర్తి నీకు విధించిన వ్రతం పూర్తి కావస్తూంది. దశరథుడుకూడా యయాతి లాగానే జ్యేష్ఠ కుమారుడైన నీ వల్ల కృతకృత్యుడైనాడు."

ఇలా మహాజ్ఞాని అయిన అగస్త్యుడు రామలక్ష్మణులకు, సీతకు, ప్రేమతో ఉపదేశాలిచ్చి ఆశీర్వదించాడు.

44. జటాయువు

రాజకుమారులూ సీతాదేవీ అగస్త్యుడు చెప్పిన దోవనే పోయి పంచవటి చేరుకున్నారు.

తే॥ అనుడు నీలమేఘ శ్యాము డతని కెరగి
యాజ్ఞ గైకొని పికవాణియైన సీత
యనుజుడగు లక్ష్మణుండు వెన్నంటిరాగ
నమ్మునీంద్రు మనస్సుతో నచటి కరిగె.

వాళ్ల ముగ్గురి వెంటా అగస్త్య మహర్షి మనస్సుకూడా వెళ్ళిందని అంటాడు కంబరుకవి. అందులోనూ అది ముఖ్యంగా లక్ష్మణుడితో వెళ్ళిందని అంటాడు. భవిష్యత్తు ఎరిగినవాడు కదా మహర్షి? జ్ఞానుల మనస్సు ఎలా నడుస్తుందో చూసి చెప్పగలవాడు కవి.

దారిలో వారొక పెద్ద గద్దను చూశారు. దాని అద్భుతాకారాన్ని చూసి మొదట, అది రాక్షస మాయ కాబోలు ననుకున్నాడు రాముడు. అలా అనుకుని "నీ వెవడవు?" అని అడిగాడు.

ఆ గద్ద మిక్కిలి ప్రేమతో "బిడ్డా! నేను మీ తండ్రికి స్నేహితుడను" అన్నాడు.

తరువాత అది తన వంశాన్ని గురించిన వివరాలను చెప్పింది. గరుడ భగవానుడి తమ్ముడు అరుణుడు. అరుణుడి కుమారులు సంపాతి, జటాయువులు. అందులో ఇతడు జటాయువు అని వారు తెలుసుకున్నారు.

"మీరు ఈ వనవాసంలో ఉండగా సీతను ఒంటరిగా విడిచిపెట్టి వేటకు వెళ్ళే సమయాన నేను ఆమెకు తోడుగా ఉంటాను" అన్నాడు జటాయువు.

ఇలా తమ తండ్రికి ఆప్తమిత్రుడైన జటాయువు చెప్పిందానిని విని అతడ్ని రామలక్ష్మణులు ప్రేమతో ఆలింగనం చేసుకున్నారు.

"ఈ అడవిలో మాకొక గొప్ప తోడు దొరికింది" అని సంతోషించి అతడివద్ద సెలవు తీసుకున్నారు.

జటాయువును మొదటిసారి చూసిన ఈ ఘటనను వాల్మీకి సంగ్రహంగానే చెప్పాడు. తరువాత జటాయువు సీతకోసం రావణుడితో పోరడం, గాయాలు తగిలి పడిపోయి రామలక్ష్మణులు వచ్చే వరకూ ఎలాగో ప్రాణాలు నిలబెట్టుకుని ఉండడం, వారు రాగానే సీతాపహరణ వృత్తాంతాన్ని వారికి చెప్పి పరమపదించడం, రాముడు జటాయువు పరాక్రమాన్నీ, ప్రేమనూ తలచుకొని విలపించడం మొదలైన విషయాలన్నిటినీ వాల్మీకి ఆ తరువాత చెప్పుతున్నాడు. రాముడు జటాయువును మొదట కలుసుకున్న ఈ సంఘటన వాల్మీకి

రామాయణంలో ఇలా చాలా సంగ్రహంగా ఉండడం ఒక కొరతగా కంబరుకవి భావించినట్లు తోస్తూంది. కంబరుకవి ఆ కొరతను తన రామాయణంలో చక్కగా పూరించి ద్రావిడులకు అందించాడు. వాల్మీకి రామాయణంలో, అంటే ఆ కాలంలో లభించిన వాల్మీకి గ్రంథంలో, రాజకుమారులు జటాయువును చూసిన ఘట్టం లఘువుగా ఉందే అని ఆలోచించి తన రామకథలో ఆ ఉదంతాన్ని ఒక ప్రత్యేక అధ్యాయంగానే రచించాడు కంబరుకవి. తన కవితాశక్తి వల్ల జరిగిం దానిని దివ్యదృష్టితో చూడగలిగాడు. అరణ్య కాండలోని మొత్తం 1200 పద్యాలలో కంబరుకవి కవితాముద్ర గలవి 350 పద్యాలు మాత్రమేనని శ్రీ టి. కె. బి. ప్రకటించారు.

జటాయువును రాముడు కలుసుకున్న అధ్యాయంలో మొత్తం 47 పద్యాలున్నాయి. అందులో కంబరుకవి పద్యాలు 37 అని ఆయన అంటున్నారు. అందులో ప్రక్షిప్తాలని తోసివేసినవి చాలా తక్కువ.

జటాయువును చూడగానే అతడొక రాక్షసుడై ఉంటాడని సందేహించి, రామలక్ష్మణులు దగ్గరకు పోయి చూశారు. నారబట్టలు కట్టి విల్లమ్ములు చేబట్టిన ఈ వీరులను కూడా జాటాయువు గమనించాడు. వీ రెవరు? ఇద్దరు దేవతలా? అని, వారి అందాన్నీ, తేజస్సునూ చూసి ఆశ్చర్యపడ్డాడు. ఎందరో దేవతలను ప్రత్యక్షంగా చూసి, బాగా అలవాటుపడ్డ జటాయువే ఇలా సందేహంలో పడ్డాడు. చివరకు వీరు దేవతలు కాదు అని నిశ్చయించుకున్నాడు. తరువాత రాముణ్ని చూసి ఇతడు మన్మథు డేమో అనుకున్నాడు. ఇరువురి చాయలనూ, పోలికలనూ చక్కగా పరికించి, వీరిని చూస్తూ ఉంటే మిత్రుడైన దశరథుడి పోలికలు కనిపిస్తున్నాయి అనుకొని "మీ రెవరు?" అని రాజకుమారులను ప్రశ్నించాడు. అందుకు వారు "మేము దశరథ మహారాజు కుమారులం" అని చెప్పారు. అది విన్న వెంటనే జటాయువు చెట్టుమీదనుంచి కిందికి దిగి తన రెక్కలతో వారి ఒళ్ళు నిమిరి "రాజు కుశలమేనా?" అని అడిగాడు.

"ఈ లోక మెన్నటికీ మరచిపోలేని రీతిగా సత్యవాక్య పరిపాలన చేసిన నాయనగారు స్వర్గానికి వెళ్ళిపోయాను" అని రాముడు చెప్పాడు.

ఆ వా ర్త వినగానే జటాయువు దుఃఖించి మూర్ఛలో మునిగి పోయాడు. రామలక్ష్మణుల కన్నీటిబొట్లు ఆయనపై పడగానే తేరు కున్నాడు.

"దశరథుడు శరీరంగాను, నేను ప్రాణంగాను ఉండేవాళ్ళం. యముడు నా ప్రాణాలను వదిలి ఆ శరీరాన్ని ఎందుకు తీసుకు పోయాడు? అతడు తీసుకుపోవలసింది నన్నుగదా!" అని విలపించాడు. అంతవరకు రాజకుమారులలో అణగారి ఉన్న దుఃఖం దీంతో తిరిగి పెల్లుబికింది. జటాయువును చూసేసరికి, రామలక్ష్మణులకు తమ తండ్రి తిరిగి బతికివచ్చినట్లే అనిపించింది. వారు జటాయువు మేను నిమిరి ఊరట చెందారు. ఆనందించారు. "మా నాయనగారు సత్యవాక్య పరిపాలనకోసం పట్టుపట్టి, దుర్భరమైన దుఃఖాన్ని పొంది, ప్రాణం విడిచారు. మమ్మల్ని మా కన్నతల్లులను, నగరాన్ని విడిచి పెట్టారు. మే మీఅడవిలో ఉన్నాం. మిమ్మల్ని చూశాక మాకు ఊరట కలుగుతూంది" అని రామలక్ష్మణులు చెప్పారు.

"మీరు వనవాసం పూర్తిచేయండి. అంతవరకూ మీకు నేను తోడుగా వుంటాను. తర్వాత నేనుకూడా దశరథుడు వెళ్ళిన లోకాలకే పోతాను" అని జటాయువు అన్నాడు.

ఇంతలో జటాయువుకు ఏదో అనుమానం వచ్చింది. తండ్రి గతించిన తరువాత మీరు అయోధ్యలో ఉండి రాజ్యం చేయడానికి బదులు, ఇక్కడ ఈ అడవిలో తాపసవేషంలో ఉన్నా రెందుకు? ఇక్ష్వాకు వంశానికి ద్రోహం చేసిన ఆ శత్రు వెవరు? చెప్పండి. వాడిని నిర్మూలించివేస్తాను" అని అన్నాడు కోపంతో.

జరిగిన కథనంతా లక్ష్మణుడు జటాయువుకు విప్పి చెప్పాడు: "నా తండ్రీ! నీతో సమానుడు ఈ లోకంలో మరెవ్వరూ లేరుకదా!" అంటూ రాముణ్ని జటాయువు కౌగలించుకున్నాడు.

జటాయువు సీతను చూసి "ఈ దేవి ఎవరు?" అని అడిగి, తెలుసుకుని, సంతోషించాడు. తరువాత పైకెగిరి అగస్త్యమహర్షి సూచించిన స్థలాన్ని రాజకుమారులకు చూపించడానికి బయలుదేరాడు.

ఇది కంబరుకవి చిత్రణం. వాల్మీకి రామాయణంలో మనం చూసిన విషయాలను బట్టి ఇలాగే, అంటే కంబరుకవి వర్ణించిన రీతిగానే, జరిగి ఉంటుందని మనం భావించాలి. వాల్మీకి విడిచిపెట్టిన దానిని కంబరుకవి చెప్పాడని మనం అనుకోవచ్చు. కంబరుకవి వాల్మీకిని అతిసూక్ష్మంగా అనుసరిస్తూ అక్కడక్కడ కొరతలను అందంగా, సజీవంగా భక్తితో పూర్తిచేస్తూ వచ్చినట్లు, మనకు అనేక ఘట్టాలలో కానవస్తుంది. వాల్మీకి రామాయణం రచించి అయిదువేల సంవత్సరాలకు పైగా అయింది. తాళపత్రగ్రంథాలు ఎన్నో రకాలుగా దెబ్బతింటూ ఉంటాయి. అలా శిథిలమైన భాగాలను భక్తులూ మహాకవులు మాత్రమే గ్రహించగలరు. అలా శిథిలమైన భాగాలను అప్పుడప్పుడు సాధారణ పాండిత్యంగల కవులు కూడా ఊరుకోలేక పూరించడం కద్దు ఇలా జరగడాన్ని గురించి దుఃఖించి లాభంలేదు. ఉన్నదాన్నయినా అందరూ చదవడం మంచిది.

45. శూర్పణఖ

సీతారామ లక్ష్మణులు పంచవటి చేరుకున్నారు. రాముడు అక్కడి సుందర దృశ్యాన్ని చూసి "చూశావా లక్ష్మణా! అగస్త్యమహర్షి మనకు ఎంత చక్కటి చోటు చూపించారో!" అని మెచ్చుకున్నాడు.

"ఇక్కడ ఆశ్రమాన్ని నిర్మించుకుని నేనూ నీవూ సీతా ఎంత కాలమైనా హాయిగా ఆనందంగా ఉండవచ్చు. ఈ కొండలు చూడు— అంతదూరం కాదు, బొత్తిగా దగ్గరా కాదు. ఈ జింకల గుంపులు, ఈ చెట్లు, చెట్లమీద పిట్టల కలకలారావాలు, పువ్వులు, నీళ్ళు, నీటి పిట్టలు, ఇసుక తిన్నెలు, ఇవన్నీ ఎంత రమణీయంగా ఉన్నాయో! ఇక్కడ ఒక మంచి చోటు చూసి ఆశ్రమాన్ని నిర్మించు" అని లక్ష్మణుడితో చెప్పాడు.

అలాగే లక్ష్మణుడు ఒకచోటు ఎంచి, అక్కడ సామ్యంతో చక్కటి ఆశ్రమాన్ని నిర్మించాడు. ఇక్కడ వాల్మీకి మహర్షి లక్ష్మణుడి నేర్పరితనాన్నీ సామర్థ్యాన్నీ వర్ణిస్తున్నారు. ఆశ్రమనిర్మాణ కౌశలాన్ని

చక్కగా వివరిస్తున్నారు. మట్టిగోడల కట్టడాన్నీ, పైకప్పు అమరికనూ, సవిస్తరంగా చెబుతున్నారు. ఆశ్రమ నిర్మాణం పూర్తికాగానే, రాముడు తమ్ముణ్ణి కౌగలించుకొని ఆనందపరవశుడై "లక్ష్మణా! నీవే నాకు తండ్రి వైనావోయి!" అంటూ మనస్సు కరిగి ఆనంద బాష్పాలు నించాడు.

రాజమందిరంలో పెరిగిన రాకుమారుడు ఈ పర్ణశాల నిర్మాణాన్ని ఎక్కడ, ఎప్పుడు, ఎలాగ నేర్చుకున్నాడు? అని మనంకూడా ఆలోచించాలి. పర్ణశాలా నిర్మాణానికి కావలసిన సరంజామాను అడవిలో వెతికి కనుక్కోవడం, చక్కగా పర్ణకుటిని నిర్మించడం ఆ కాలంలో రాజకుమారులు నేర్చే విద్యలో ఒక భాగమై ఉండేదని దీన్నిబట్టి మనం గ్రహించవచ్చు.

* * *

ప్రేమపూర్ణుడైన లక్ష్మణుడి సేవలతో సీతారాములు పంచవటి ఆశ్రమంలో సుఖంగా కాలం గడిపారు.

హేమంత ఋతువు ప్రవేశించింది. ఒకనాటి వేకువజామున ముగ్గురూ వాడుక ప్రకారం గోదావరీ తీరానికి బయలు దేరారు. స్నాన సంధ్యాదులు నిర్వర్తించుకుని, పాత్రలు శుద్ధిచేసి, తమకు కావలసిన మంచినీళ్ళు పట్టుకురావడం వారి నిత్యకృత్యం. ఆనాడు. వారు హేమంత ఋతు విశేషాలను గురించి ముచ్చటించుకుంటూ వెళ్ళారు.

మాసాలలో కెల్లా విశేషమైంది మార్గశిర మాస మని మన పూర్వీకులు, పెద్దలూ అంటారు. లక్ష్మణుడికి ఉన్నపాటున భరతుడు తలపునకు వచ్చాడు.

"మన ప్రియసోదరుడైన భరతుడు ఇప్పుడు వ్రతాలు చేస్తూ ఉంటాడు. పాపం, ఎంత సుఖంగా ఉండవలసినవాడు! మనం వన వాసం చేస్తున్నామని, తానూ కఠిన వ్రతాలను చేపట్టాడు. అతడ్ని తలచుకుంటే నా మనస్సు తరుక్కుపోతూంది. అయ్యో! ఈ చలి కాలంలో ఒక్క పొద్దులు, భూశయనాలున్నూ. చలిలో, సరయూ

నదిలో స్నానానికి వెళతాడు. అన్నా ! మనకెంత మంచి సోదరుడన్నా, భరతుడు, అతడి మాటలు, మనస్సు, నడవడి, ఎంత నిర్మలమైనవి ! రాజభోగాలను విడిచిపెట్టి, మనకోసం తనుకూడా వ్రత జీవితాన్ని గడుపుతున్నాడే, తలచుకుంటే చాలు, దుఃఖం వస్తుంది. అతడు అన్నివిధాలా మన నాయనగారి పోలిక. కొడుక్కి తల్లిపోలిక వస్తుందని వాడుక. కాని భరతుడి విషయంలో అది వర్తించదు. అతడిదంతా నాన్నగారి పోలిక. అసలు కైకేయికి అంత క్రూర స్వభావం ఎలావచ్చింది ? ఆమె కడుపున ఇంతటి సుగుణవంతుడైన కొడుకు ఎలా పుట్టాడు ?'' అని లక్ష్మణుడు ఏవేవో జ్ఞాపకాలు పొంగిరాగా, వాటిని వెళ్ళబోసుకున్నాడు.

"తమ్ముడూ ! కైకను దూషించకుమా. భరతుణ్ణిగురించి ఎంతైనాచెప్పు. నాన్నగారిని గురించి చెప్పు. కాని మన పినతల్లి లోటుపాటులను గురించి మాత్రం మాట్లాడకు. నువ్వు భరతుణ్ణి గురించి చెప్పిందంతా అక్షరాలా నిజం. నేను అయోధ్య విడిచి ఎంత నిశ్చింతగా ఈ వనవాసం చేద్దామనుకున్నా, భరతుడు ఎప్పుడూ మనస్సులో మెదులుతూనే ఉంటాడు. అతణ్ణి ఇప్పుడే వెళ్ళి చూద్దామా అని బుద్ధి పుడుతూ ఉంటుంది. లక్ష్మణా : మనం ఎప్పుడతణ్ణిచూసి ఆవందిస్తామో! మనం నలుగురమూ మళ్ళీ ఎప్పుడు కలిసి ఒక్కచోట ఉండేది ? భరతుడు చెప్పిన అమృత వాక్కులు ఇంకా నా హృదయంలో గింగురుమంటూనే ఉన్నాయి'' అన్నాడు, రాముడు.

ఇలా వారు ఆ మార్గశిర మాసంలో అయోధ్యనూ, భరతుణ్ణి, తలచుకుంటూ వేకువజామున గోదావరిలో స్నానం చేశారు. ఈ ఘట్టాన్ని చదివేటప్పుడు మన హృదయాలు ద్రవించి పోతాయి.

రాముడు పితరులకు, దేవతలకు, తర్పణాలు విడిచి, సూర్య నమస్కారాలు చేశాడు. జడలు జీరాడగా, మహాదేవుని లాగా దివ్య కాంతితో వెలిగిపోతూ సీతా లక్ష్మణులతో ఆశ్రమానికి తిరిగి వచ్చాడు.

ప్రాంతఃకృత్యాలు ముగిసిం తరువాత విశ్రాంతిగా ఆశ్రమంలో కూర్చుని, పురాణేతిహాస కథలను చెప్పుకున్నారు. అ సమయాన రాముడి వదనం చైత్రమాస పూర్ణచంద్రుడివలె ప్రకాశిం

చింది. అలా వారు కథాశ్రవణంలో మునిగి ఉండగా, హఠాత్తుగా అక్కడికొక రాక్షసి వచ్చింది. ఆమెపేరే శూర్పణఖ- రావణాసురుడి తోబుట్టువు.

దివ్యసుందర విగ్రహుడైన రాముణ్ని చూసింది. వికార మంతా మూసపోసినట్టున్న ఆ అనాకారి, వదనసుందరుడైన రాముణ్ని చూడగానే కామ పరవశురాలై పోయింది. అసలే అనాకారి, అందులో కామవికారం. ఆ కామవికారాలతోనే మాటలు మొదలు పెట్టింది.

"తాపసిలాగా జడలు ధరించావు. భార్యను వెంటపెట్టుకొని వున్నావు. విల్లమ్ములు చేపట్టావు. ఇలా, రాక్షసావాసమైన ఈ అడవికి వచ్చావే! ఎవరవయ్యా నువ్వు? ఎందుకు వచ్చినట్టు?"

ఇలాంటి సందర్భాలలో తన పేరూ ఊరూ చరిత్ర అంతా సవిస్తరంగా చెప్పడం, అడిగినవారి కులగోత్రాలూ, వచ్చిన పనీ, అడిగితెలుసుకోడం, ఆ కాలపు ఆచారం. ఈ ఆచారం పాటించేవాడు రాముడు.

"దేవతలతో సమానమైన శౌర్యవంతుడు దశరథ మహారాజు. ఆ రాజుకి జ్యేష్ఠకుమారుడను నేను. నన్ను రాము డంటారు. ఇతడు నా తమ్ముడ లక్ష్మణుడు. ఈవిడ నా భార్య. పేరు సీత. మా పినతల్లి గారు. మహారాజైన తండ్రిగారు ఆజ్ఞాపించగా, ధర్మబద్ధుడనై ఇక్కడ వసవాసం చేయడానికి వచ్చాను. నువ్వెవరివి? ఏ కులం? నీ రూపు రేఖలుచూస్తే రాక్షస స్త్రీవని తోస్తూందే. ఏంపనిమీద ఇక్కడికి వచ్చావు? దయచేసి సవిస్తరంగా చెప్పు" అన్నాడు రాముడు.

"రావణుడిపేరు వినలేదా? విశ్రవసుని వీరకుమారుడు, రాక్షసులకు రాజు. ఆయన సోదరిని నేను. నా పేరు శూర్పణఖ. రావణుని సోదరులైన కుంభకర్ణుడూ, విభీషణుడూ గొప్ప బలశాలురు. వారుకాక, ఈ అడవిరాజ్యాన్ని ఏలే ఖరుడు, దూషణుడూ కూడా నా సహోదరులే. వారు మహా బలిష్ఠులు. గొప్ప అధికారం గలవారు. అయితే, నామీద మట్టుకు వారికి అధికారం లేదు. నా చిత్తం వచ్చి

నట్లు నేను ఉండగలను. ఈ అడవిలో నన్ను చూసి అంతా భయపడ తారు. నిన్ను చూసింది మొదలు నీపై పట్టరాని మనసు పుట్టింది. నీవే నా భర్తవి. పురుగులాంటి ఈ ఆడదాన్ని కట్టుకొని ఎందుకు తిరుగు తావు? ఈ అరణ్యంలో నీకు తగిన భార్యను నేనే! నాతో జతకట్టి, హాయిగా అడవి అంతా తిరుగుతూ, ఆనందంగా ఉండు. భయపడకు. ఈ స్త్రీనీ. నీ తమ్ముణ్ణి వెంటనే తినేస్తాను. రా! నాతో రా! జంకకు" అని శూర్పణఖ కామ పీడిత అయి, సహజ రాక్షస ధోరణిలో మాట్లాడింది.

ఈ రక్కసి కామ వికారమూ, మాటలూ, నడవడీ చూస్తే రాముడికి వినోదంగానే తోచింది. అందుకని నవ్వుతూ, మెల్లగా మాట్లాడ నారంభించాడు.

"సుందరీ! నాపై ఆశపెట్టుకుంటే నీకు అడియాస అవుతుంది. ఈమె నా భార్య. నాతోకూడా ఉంది. ఇద్దరి భార్యలతో సంసారం. చిక్కులకు కారణమవుతుందన్న సంగతి నీకు తెలుసు కదా? ఇదుగో, నా తమ్ముడున్నాడు. ఒంటరివాడు. అందంలో బలంలో నాతో సమానుడు. నీకు తగినవాడు. అతని నడిగిచూడు. నన్ను విడిచిపెట్టు" అన్నాడు రాముడు.

ఆపైన కాగల కార్యాన్ని లక్ష్మణుడు చూసుకుంటాడని రాము డలాగ చెప్పాడు.

ఆ రాక్షసి రాముణ్ణి విడిచిపెట్టి అతడి అందానికి ఏ మాత్రమూ తీసిపోని లక్ష్మణుడిపై మనస్సు నిలిపింది. "ఓయీ వీరుడా! నాతో రా! మన మిద్దరమూ ఈ దండకారణ్యంలో హాయిగా జట్టుగా తిరుగు దాం" అంది.

రాముడి పరిహాసానికి లక్ష్మణుడు కూడా శృతి కలిపాడు. "పిచ్చిదానా! భ్రమలో పడకు. నీవెక్కడ? నేనెక్కడ? నేను అన్నకు దాసుడుగా ఉన్నాను. నీవో రాజకుమార్తెవు. ఒక దాసుణ్ణి కట్టు కొని దాసుడికి దాసిగా నీవు బతక గలవా? అనవసర భ్రమలు పెట్టు కోవద్దు. నా అన్న రాముడికి నీవు రెండవ భార్యగా ఉండడమే ఉచితం. ఈ సీతను చూసి నీవు భయపడనక్కర లేదు. రాముడికి

నీ మీద తృటిలో ప్రేమ కలుగుతుంది. ఆయన సీతను లెక్కచేయడు. నీవు సుఖంగా ఉండవచ్చు" అన్నాడు.

ఒక స్త్రీని, అందులో వలచి వచ్చిన స్త్రీని, ఈ విధంగా బాధించవచ్చునా అని కొందరు మేధావులు ప్రశ్నించవచ్చు. ఒక ఘోరమైన మృగ స్వరూపం ఎదుట ప్రత్యక్షమైనప్పుడు కాస్త కల్పనా శక్తిని ఉపయోగించి చూస్తే ఇలాటి ప్రశ్న రాదు.

కామాతుర అయిన ఆ రక్కసి లక్ష్మణుడి మాటలను నిజమే అని నమ్మింది. అందుకని రాముడివద్దకు పోయి పక్కనున్న సీతను చూసింది.

"నాకూ నీకూ అడుగా ఉంది ఈ పురుగు. అసలు నడుమే లేని దీన్ని చూస్తే నీకింత మోహం ఎందుకు? ఇదిగో ఈమె పని ఈ క్షణమే అయిందనిపిస్తాను. నీ పొందు లేకపోతే నాకు ప్రాణాలు నిలవవు. ఈమె నిప్పుడే మన దారినుంచి తొలగిస్తాను. తర్వాత నీవు నాతో హాయిగా ఉండవచ్చు" అని చెప్పి ఆ రక్కసి సీతమీదికి ఉరికింది.

సమయానికి రాముడు అడు పడడంతో, సీత తప్పించుకో గలిగింది. వినోదం ముదిరి విపరీతమైందే అనుకొన్నాడు రాముడు. "లక్ష్మణా! ఈమె సంగతి నువ్వు చూసుకో. సీత ఎలాగో తప్పించుకుని బతికింది. ఈ రాక్షసికి గుణపాఠం నేర్పాలి" అన్నాడు.

లక్ష్మణుడు కత్తి చూసి సీతమీది కురికిన ఆ రాక్షసిని పట్టి, ముక్కూ, చెవులూ కోసి, "ఛీ-ఫో" అన్నాడు.

అవమానానికి తోడు నెత్తురోడుతున్న గాయాల బాధకు తట్టుకోలేక, ఎలుగెత్తి ఏడుస్తూ, ఆ రాక్షసి అడవిలోకి పారిపోయింది.

* * *

అలా నెత్తురోడుతూ, పరుగెత్తి పోయిన శూర్పణఖ ఖరుడి వద్దకు వెళ్ళి అతడి ఎదుట పిడుగు పడినట్లు "అయ్యో! అయ్యో!" అని శోకిస్తూ పడింది.

రాక్షస బృందంతో కొలువుతీర్చి కూర్చున్న ఖరుడు ఆమెను చూసి "ఏమిటి సంగతి?" అని అడిగాడు.

"ఇదుగో నన్ను చూడు! ఎంతటి అన్యాయం చేశారో ఆ రాముడూ లక్ష్మణుడున్ను ! ఈ అడవిలోనే ఉన్నారు వాళ్లు. నువ్వూ ఇక్కడే ఉన్నావుగా!" అంది శూర్పణఖ, గోలపెడుతూ.

ఖరుడు లేచి "అక్కా! ఏమిటిది? నా కేమీ బోధపడ్డం లేదు. కాస్త తెలివి తెచ్చుకుని అసలు సంగతేంటో చెప్పు! నిన్నిలా కురూపిగా చేయడానికి సాహసించిన వాళ్లెవరు? ఈ అడవిలో నా కోపాగ్నికి ఆహుతి కావలసిన, వాళ్లెవరు? ఎవరు నిన్నిలా అవమాన పరచి, కాకులకూ, గద్దలకూ ఆహారం కాబోతున్నారు? నల్లతాచును తొక్కిన ఆ అమాయకుడెవడు? ఎవడామూర్ఖుడు? ఎక్కడున్నాడు వాడు? అన్నీ చెప్పు. ఇదిగో; హుం?-వాడి పని సరి. వాడి నెత్తురు ఇప్పుడే ఈ నేల తాగుతుంది. చూసుకో!- లేచి నిలబడు, జరిగిందంతా దాచక చెప్పు" అంటూ తొందర పెట్టాడు.

"ఇద్దరు సుందరపురుషులు దశరథుడి కుమారులట. తాపస వేషాలు ధరించి, ఒక స్త్రీని వెంటబెట్టుకుని ఈ అడవికే వచ్చారు. నిజానికి ఆ స్త్రీమూలంగానే ఇంతపనీ జరిగింది. వారిద్దరు ఒకటై నన్ను కొట్టి అవమానించారు. ఆ దుష్టుల నెత్తురు తాగాలి నేను. మహా చెడ్డ దాహంగా ఉంది. పోయి వారినీ వధించు పో!-ముందు ఆ పనిచూడు. తర్వాతనే తక్కిన పనులు" అని వేగిర పెట్టింది శూర్పణఖ.

వెంటనే ఖరుడు తన సేనాపతులకు ఉత్తర్వు లిచ్చాడు. తక్షణమే వెళ్లి, ఆ దుష్టులిద్దరినీ చంపి, వాళ్ల కళేబరాలను ఇక్కడికి పట్టుకురండి. ఈమే చెపుతూందే, ఆ స్త్రీనీ కూడా ఈడ్చుకు రండి! "ఊఁ!- పొండి!- ఇంకా ఇక్కడే వున్నారేం?! నా యెదుట కన పడకండి-పొండి!"-అని గర్జించాడు.

ఖరుడి ఉత్తర్వులు శిరసావహించి పధ్నాలుగుమంది సేనాపతులు వెంటనే బయలుదేరారు.

* * *

కంబరుకవి రామాయణంలో రాముణ్ని వలచిన శూర్పణఖ ఒక సుందరమైన మానవ స్త్రీరూపం ధరించి పచ్చినట్లు చెప్పి, ఆపైన జరిగిన సంఘటనలు ఒక ప్రత్యేక శైలిలో చిత్రించారు. శూర్పణఖను గురించిన గాథలో కంబరుకవి వాల్మీకి పొంతను పోక, ఒక కొత్త పద్ధతిని అనుసరించాడు. కంబ రామాయణంలో అదొక పరమ సుందరమైన ప్రత్యేక ఘట్టం.

రామచంద్రుణ్ని గురించి, అతడు స్త్రీని చంపిన వీరుడని, కామాతుర అయి దరిచేరిన ఒక స్త్రీని అవమానించి హింసించాడనీ, మాటునుంచి వాలిని చంపాడనీ, ఎదిరించి నిలబడి అతడి చేతిలో ఓడిపోవటానికి సాహసించ లేదనీ, సీతను అక్రమంగా అడవికి పంపాడనీ, ఏ పాపమూ ఎరుగని సీతను అన్యాయంగా సందేహించాడనీ, ఆమె శీలాన్ని గురించి మాకుకూడా సందేహంగానే ఉందనీ, ఇలా పలు రకాలుగా అసూయాజనితమైన విమర్శలకు దిగి, కొందరు ఆనందించడం మనం చూస్తున్నాం.

విజ్ఞానానికీ విమర్శనా పటిమకూ మన దేశంలో కొరతలేదు. కాని అనురాగోత్సాహాలుగల శుద్ధ జ్ఞానం మాత్రం శూన్యమనే చెప్పాలి రాముడిలో దోషాలు వెతికే వారిని వెతకనియ్యండి. రాముడికన్నా చక్కని పద్ధతిలో ధర్మమార్గాన్ని అనుసరించి తాము ఏ కొరతలు రాముడిలో ఉన్నాయంటున్నారో, ఆ కొరతలు లేకుండా తమ జీవితాలను తీర్చి దిద్దుకొంటే, అటు రాముడి ఆత్మ, రామభక్తుల హృదయాలూ మహదానందాన్ని పొందుతాయి. రాముడి సద్గుణాలను విడిచిపెట్టక రాముడిలో ఉన్న లోటుపాట్లు తమలో లేకుండా చేసుకుంటామంటే ఎవరు కాదంటారు?

46. కంబరుకవి చిత్రించిన శూర్పణఖ

త్రోటలో దూరిన గాడిదను కర్రతో కొట్టి తోలినట్లు శూర్పణఖను తరిమివేశారు. వాల్మీకి ఈ సంఘటనను చాలా సంగ్రహంగా రెండు తిరుగుడులు ఏమీ లేకుండా రాశాడు. కానైతే, కంబరుకవి

దీన్ని అంత సంగ్రహంగా ముగించలేదు. శూర్పణఖ పడిన పాట్లను ఒక ప్రత్యేక నాటకంగా చేసి అందులో అన్ని రసాలనూ సృష్టించాడు. కంబరామాయణంలో శూర్పణఖ ఉదంతం సాటిలేని అధ్యాయం.

రాముడు ఏటి ఒడ్డున ఇసుక తిన్నెపై కూర్చున్నాడు. అక్కడ ఒక హంస మెల్లగా నడవడం చూసి ఇటు సీత వైపు తిరిగాడు. ఆమెకూడా నడుస్తూంది. రెండు నడకలూ ఒకే తీరుగా ఉండడం చూశాడు. ఒక్కసారి ఉత్సాహం కలిగింది. ఆ ఆనందం చిరునవ్వుగా విరిసింది. అక్కడికి కొద్ది దూరంలో ఒక ఏనుగు వచ్చి నీళ్లు తాగి తిరిగిపోతూ ఉండడం సీత చూసింది. తన భర్త వైపు చూసింది. ఆ అందానికి మురిసి పోయింది. ఇలాగ ఆ పంచవటిలో శ్రీకృష్ణ భగవానుడు చెప్పినట్లు ధర్మవిరుద్ధంకాని పద్ధతిలో వారు కామాన్ని అనుభవిస్తూ ఉండగా విధికి కన్నుకుట్టింది. అడవిలో తిరుగుతూన్న శూర్పణఖను రాముడి వద్దకు తోలింది.

తే॥ భావి కలుషంబులకు నొక పట్టుగొమ్మ
అడవి నెప్పు డొంటరిగ జిట్టాడు కొమ్మ
వడిగ లోకమెల్ల దిరిగివచ్చు బోటి
శూర్పణఖ యను బోటి యచ్చోటి కేగె.

రాక్షస సంహారంకోసం పాలకడలిని విడిచి దశరథుడి కొడుకుగా అవతరించిన భగవానుణ్ణి చూసి "ఈ సుందర విగ్రహుడు మన్మథుడా ? ఇంద్రుడా ? మహాదేవుడా ? మహావిష్ణువా ?" అనుకొంది శూర్పణఖ. మన్మథుడికి శరీరం లేదే ? ఇంద్రుడికి వేయికండ్లున్నాయి కదా ? మహాదేవుడికి నొసట ఒక కన్ను ఉందే. మరి ఇతడికి నాలుగు చేతులు లేవు. అందుకని ఇతడు ఇంద్రుడు కాడు. పరమశివుడు కాడు. విష్ణువుకాడు. పరమశివుడి కంటివల్ల భస్మమైపోయిన మన్మథుడు ఒకవేళ తపస్సుచేసి మరల శరీరాన్ని సంపాదించు కున్నాడేమో !" అని ఆలోచించింది.

కం॥ భవు కంటి మంటచే నివు
రవు మారుడు నాటగోలె నరుదగు తపమున్

దవిలి యొనరించి యిట్టి వ
పువు బొందం బోలుగాక పొలుపుగ నిలపై

"ఈ సుందర పురుషుడు అనవసరంగా తన శరీరాన్ని శోషింప చేసుకుని ఎందు కీవ్రతాలు సలుపుతున్నాడు ? కెందామరలవంటి కన్నులు గల ఇతడు ఎందు కీతపస్సుతో కాలం వ్యర్థపుచ్చుతున్నాడు ?" అని అనుకుంటూ రాముణ్ణి చూస్తూ నిలబడింది. శూర్పణఖ. ఆమె కళ్లు రాముణ్ణే చూస్తూన్నాయి. ఇప్పుడేంచేయాలి అని యోచించింది. "ఇతడు నా రూపుచూస్తే తప్పక తిరస్కరిస్తాడు. నేను మారువేషం ధరించి ఇతడి వదకు పోవాలి" అనుకుంది. మాయా బలంతో తన రాక్షసరూపాన్ని మరుగుచేసి సుందర రూపం ధరించింది. కోకిల గొంతు, నెమలి నడక అలవరచుకొని దొండపండువంటి పెదవి అల్లాడగా బయలుదేరింది.

"అబ్జు దెగదు మొగము తోడ నంగ కాంతి
దెసల బర్వు సుందరియయి తేజరిలె"

కల్పవృక్షాన్ని పెనవేసుకున్న బంగారు తీగెలాంటి శరీరమూ, మోహం కలిగించే ముద్దు పెదిమలూ. ముత్యాలవంటి పలువరసా, లేడి చూపులు_ ఇలాంటి అందాలతో నెమిలి నడకలతో వచ్చింది. కాలి అందెలు, మొలనూలు గంటలూ చేసిన సవ్వడి విని ఎవరో ఒక స్త్రీ వచ్చిందని రాముడు తెలుసుకున్నాడు.

అందాలకుప్ప ఒకతె వచ్చి రన ఎదుట నిలిచి ఉన్నట్లు రాముడు తెలుసుకున్నాడు, ఆమె రాముడి పాదాలంటి నమస్కరించింది. చిరునిగ్గు చిందులాడగా కొంత ఎడంగా నిలిచింది.

"మీకు స్వాగతం చాలా దూరంనుంచి వచ్చినట్లున్నారు. మీ ఊరేది ? పేరేమిటి ? మీ బంధువులెవరు ?" అని రాముడు ప్రశ్నించాడు.

"నేను బ్రహ్మదేవుడి మనుమడి కుమార్తెను. కుబేరుడి చెల్లెలిని. రజతాద్రిని ఎత్తిన రావణాసురుడి తోబుట్టువును. కామవల్లి అనే కన్యను" అని ఆమె చెప్పింది.

"ఇక్కడికి వచ్చిన పని ఏమిటి ?" అని రాముడు ప్రశ్నించాడు.

"స్త్రీలు తమ కష్టాలను చెప్పుకోడానికి వీల్లేదు. అయినా నేను చెప్పుకుంటున్నాను. కామదేవుడు నా హృదయాన్ని గాయపరుస్తున్నాడు. నీవు నన్ను రక్షించాలి" అంది ఆమె.

రాముడికి ఏమనడానికీ తోచలేదు. ఆమె ఇంకా చెప్పుతూనే ఉంది.

"నన్ను గాంధర్వ విధిని చేపట్టు. ప్రణయం పెనవేసుకున్న మానినీ మానవులకు వేదశాస్త్రాలు నిర్ణయించిన పద్ధతి ఇది. అలా జరిగిననాడు నాకు ఆనందం కలగడమే కాక నా అన్న రావణుడికీ నీకూ మంచి స్నేహంకూడా కుదురుతుంది. ఈ అడవిలో నీవు ఒంటరిగా ఉన్నావు. రాక్షసులు నిన్ను బాధిస్తారు. నీవు మునిగణంలో ఒకడుగా ఉన్నావు. అందుచేత కారణం లేకుండానే వారు నిన్ను బాధిస్తారు నీవు నన్ను వెంటనే పెండ్లాడినట్లయితే రాక్షస బాధ నీకు తొలగుతుంది. అంతేకాదు, ఈ చుటరిక్కంవల్ల మహాబలశాలురు నీకు బాసటగా ఉండి నీ కార్యాలను నెరవేరుస్తారు. అందుకని ఈ విషయాన్ని ఆలోచించుకో" అని నీతిశాస్త్రానుగుణంగా శూర్పణఖ చెప్పింది.

రాముడు ఫక్కున నవ్వాడు.

"రాక్షసుల కారుణ్యమూ, అందకత్తె అయిన కొత్త భార్యా నాకు లభిస్తారన్నమాట. ఎక్కడనైనా సరే నీతో సుఖంగా ఉల్లాసంగా తిరిగే సౌకర్యం కూడా నాకు దొరుకుతుందన్నమాట. మంచిది. అయోధ్యను విడిచి నేను చేసిన తపస్సు ఈనాడు సత్ఫలితాన్నిచ్చింది" అని రాముడు మళ్లె మొగలవంటి పలువరుస కనబడగా ఫక్కున నవ్వాడు.

జానకి ఆ సమయాన చెట్లనడుమనుంచి వస్తూంది.

లక్ష్మీదేవియే ఈ భూమిమీద అవతరించిందా అన్నట్లు, పూవు దీవె నడుస్తూందా అన్నట్లు రాముడి వద్దకు వస్తున్న సీతను శూర్పణఖ చూసింది. సీత సౌందర్యానికి ఆశ్చర్యపోయి అసూయపడ్డది.

కామపీడిత అయిన ఆ రక్కసికి అప్పుడొక ఆలోచన తట్టింది.

"ఇదిగో ఈ వస్తూందే ఈ స్త్రీ మాయావి అయిన ఒక రక్కసి. ఈమె నిన్ను వంచించగలదు జాగర్త! ఈమె అసలు రూపు ఇదికాదు. ఈమె పచ్చిమాంసం తినే రాక్షసి. ఈమెను ముందు దూరంగా తరిమివేయి!" అంది.

రాముడు నవ్వి, "నీవు ఎంత తెలివిగలదానివి? నీవు కాబట్టి ఈమెను చక్కగా కనిపెట్టగలిగావు!" అన్నాడు.

ఇంతలో సీతవచ్చి రాముడి పక్కన నిలిచింది. రాముడి పరిహాసం శూర్పణఖకు అర్థం కాలేదు. కామోద్రేకంవల్ల ఆమె బుద్ధి పూర్తిగా నశించి, సీతను చూసి కోపంతో బుసకొట్టింది.

"రాక్షసీ! ఎందుకే ఈ వీరుడి వద్దకు వస్తున్నావు? పో. దూరంగా పో!" అని బెదిరించింది.

సీతకు ఈ వైపరీత్యం ఏమిటో ఏమీ అర్థం కాలేదు. ఆమె వణికిపోయింది. మేఘాన్ని మెరుపుతీగె అల్లుకొన్నట్లు రాముడి బుజాలను అల్లుకొనిపోయింది.

రాముడు వేళాకోళం ఇక చాలును అనుకొన్నాడు. శూర్పణఖను చూసి "అమ్మా! ఇక చాలించు. నా తమ్ముడున్నాడు. నీ విషయం అతడికి తెలిస్తే అతడు చాలా కోపిస్తాడు. మనిషి మహా కోపిష్టి. ఏం జరుగుతుందో నాకు తెలియదు. త్వరగా నీవు వచ్చింతోవనే మళ్ళీ పోవడం మంచిది" అన్నాడు.

ఇలా చెప్పి సీతారాములు పర్ణశాలలోకి వెళ్ళిపోయారు.

రాక్షసికి కామవేదన మిక్కుటమై పోయింది. ఆ రాత్రి ఎక్కడో ఎలాగో గడపగలిగింది, తెలవారగానే ఏంచేయాలో పాలుపోలేదు.

"ఇతడి పొందు దొరక్కపోతే ప్రాణాలు నిలిచేటట్లు లేవు. ఈ ఆడుదొకతె అడ్డుగా ఉంది. అది ఉన్నంతవరకు అతడు నన్ను తాకేటట్లులేడు. ఆమె నెలాగయినా ఎత్తుకొనిపోయి దాచిపెట్టాలి. తర్వాత అతడి ప్రేమను పొందాలి" అని నిశ్చయించుకుని వేకువ

జామునే ఆశ్రమంలో ప్రవేశించింది. రాముడప్పుడు సంధ్యోపాసనలో ఉన్నాడు. సీత ఒంటిరిగా ఆశ్రమంలోనే ఉంది. ఆమెను ఎత్తుకొని పోవడానికి ఇదే అదననుకుంది. కాని దాపునే ఉన్న వనంలో లక్ష్మణుడున్న సంగతి ఆమె గమనించలేదు.

ఉ॥ అంగన రాము డొక్క ఘురమందుదయాదికకృత్యముల్ పొన
ర్పంగను పోయి యుండుటలు బాగగుజూచెను పర్ణశాల చెం
తం గనిపెట్టి లక్ష్మణు డతంద్రత జీకటియైన తోట నుం
టం గనలేక సీతను కడంక గ్రహింపగ బోయనెవ్వడిన్.

ఉ॥ ఒంటిరియై లతాంగి యిటనున్నది నా తలపుల్ ఫలించె నీ
దంటను పట్టి దాచెద నతండు నిజంబుగ నాకు లొంగు నా
కంటను పడ్డ యిక్కలువకంటియు జిక్కకపోనెయంచు వె
న్నంజెను లక్ష్మణుండు నసురాంగన వచ్చుటగాంచి యుగ్రుడై.

సీతపైకి ఎవతెయో ఉరికినట్లు లక్ష్మణుడికి తెలిసింది "ఆగు ఆగు" అని గర్జిస్తూ లంఘించాడు. ఆ రక్కసి కొప్పుపట్టి తన్ని కత్తి దూశాడు. రాక్షసి తన నిజరూపాన్ని ధరించి లక్ష్మణుణ్ణి కొట్టి ఆకాశానికి ఎగిరిపోవాలని చూసింది. కాని లక్ష్మణుడు ఆమెను మెలకువగా ఒడిసిపట్టి పడదోసి ముక్కూ, చెవులూ కోసివేశాడు. "దుర్మార్గురాలా! జాగర్త!" అని హెచ్చరించి పొమ్మని తరిమివేశాడు.

శూర్పణఖ అప్పుడు తన నిజరూపంతో నెత్తురోడే ముఖంతో పరుగెత్తుతూ తన చుట్టాలను పేరుపేరునా పిలుస్తూ భోరుమని ఏడ్చి గోలపెట్టింది.

చ॥ ఇది ఖరుడున్న కాన మరి యిచ్చట నిట్టి పరాభవంబు నా
కొదవగ మీకు గాదొ? బలమొగ్గగ నన్ను ధరాస్థలిన్ బడన్
చదువుచు ముక్కుగోసిన భుజంబుల నిక్కునజూచికొంచు దు
ర్మదుడయి మానవాధముడు రాజిల మీ భుజశక్తి గాల్పనే?

"ఓ తమ్ముడా ఖరుడా? ఓయన్నా రావణా! ఓ ఇంద్రజిత్తూ!"

చ॥ త్రిదశుల గెల్చి దేవవిభు శృంఖలలన్ దగిలించి నొంచి యొ
ప్పిదమగు సేవలం గొనిన విశ్రుతమల్లుడ యల్లు డావనిన్
.....
.....
ఉ॥ కొండలు పిండిసేయు రణకోవిదులార! ఖరా! త్రిశీర్ష! దో
ర్దండ పరాక్రమాఢ్యులయి రాజిలు సేనలగూడి కుంభక
ర్ణుండునుపోలె నిద్రగొనిబ్రుంగుచునుంటిరొ? నేను రోలుటల్
కొండక యేని మీ చెవులకున్ వినరాదొకొ యింత జాలమే?

అని రాక్షసి సహజమైన గోలతో ఎలుగెత్తి విలపించింది.

* * *

ఇది కంబరుకవి చిత్రణ. శూర్పణఖ రాక్షసిరూపాన్ని దాచుకుని ఒక సుందర స్త్రీ రూపం ధరించి రాముణ్ణి వలచిందన్న వర్ణనే కంబరుకవి నైపుణ్యం. ఆ నైపుణ్యానికితోడు కవితాశక్తి పని చేస్తుంది. వాల్మీకి రామాయణంలో కూడా శూర్పణఖ "కామరూపిణీ" అని ఉంది. కామరూపిణీ అంటే కోరిన రూపాన్ని ధరించగల శక్తి గలది అని అర్థం. రాముణ్ణి చూసి మోహించడం, అందుకు ఈ శక్తిని వినియోగించుకొనడం ప్రకృతి సహజమే కదా.

47. ఖరవినాశనం

ఖరుడి తాలూకు పధ్నాల్గురు సేనాపతులను పిల్చుకొని శూర్పణఖ జనస్థానం నుంచి రాముడి ఆశ్రమానికి వచ్చింది. రాజకుమారులను చంపి వాళ్ళ నెత్తురును అక్కడే కసితీరా తాగాలని ఆమె సంకల్పం.

"అరుగో! అక్కడ నిలబడి వున్నారే ఆ యిరువురు యువకులే నన్ను అవమానించి వికలాంగను చేశారు. వాళ్ళని వెంటనే చంపండి" అంది.

రాముడు విషయాన్ని వెంటనే గ్రహించాడు. లక్ష్మణుణ్ణి చూసి, "లక్ష్మణా! సీతను కాస్త చూస్తూ ఉండు. నేను వీళ్ళ సంగతి చూసివస్తాను" అని చెప్పి విల్లమ్ములు తీసుకుని లేచాడు.

యుద్ధ సంప్రదాయా న్ననుసరించి ఎదిరించటానికి వచ్చిన వాళ్లని చూసి తాను ఫలానా అని చెప్పాడు. "ఎందుకు మమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి వచ్చారు? ఋషుల ఆజ్ఞ మేరకు రాక్షస నిర్మూలం చేయడానికి మేము యీ అడవిలో కాపురమున్నాం. ప్రాణాలు దక్కించుకోవాలని కోరిక ఉంటే వెంటనే వచ్చిందారినే వెళ్ళిపొండి" అన్నాడు.

రాక్షసులు వాళ్ల గొప్పలు వాళ్లు చెప్పుకున్నారు. యుద్ధం మొదలయింది. రాముడి బాణాలు ఆ రాక్షసులను సంహరించడానికి ఎక్కువసేపు పట్టలేదు. అందరూ చచ్చారు.

శూర్పణఖ మళ్లా ఘోరంగా విలపిస్తూ ఖరుడి వద్దకు వెళ్ళి అతడి ముందు చావచుట్టగా పడింది. నేలమీదపడి పొర్లాడుతున్న సోదరిని ఖరుడు సమాధాన పరచాలని చూశాడు. అతడికి పరిస్థితి ఏమీ బోధపడలేదు.

"యముడివంటి వీరులను పంపాను. ఈపాటికి పని అయి ఉంటుంది. ఎందు కేడుస్తున్నావు. నే నుండగా నీ విలా ఏడవకూడదు" అన్నాడు.

ఆమె లేచి కళ్ళొత్తుకొని ఇలా చెప్పింది :

"నీవు పధ్నాలుగురు వీరులను పంపించావు. నిజమే. కాని వాళ్లు పదునాల్గు గొప్ప పీనుగులై పడివున్నారు. రాముడి శౌర్యం. అతడి అద్భుత యుద్ధ కౌశలం నీకు నేనేం చెప్పేది. నీ సేనాపతులంతా మరణించారు. నీకు అభిమానమే ఉంటే వెంటనే బయలు దేరు. రాముడితో యుద్ధంచేసి రాక్షస కులాన్ని కాపాడు. లేకపోతే మన వినాశనం నిశ్చయం. నీకు రోషముంటే బయలుదేరి రా. నీవు శూరుడవని చెప్పుకొన్నంత మాత్రాన లాభంలేదు. శూరుడవయితే రాముణ్ని ఎదిరించి యుద్ధం చేయి. నీ రాజ్యంలో ప్రవేశించిన ఈ యువకులు నీ కులాన్నే రూపుమాపాలని నిశ్చయించుకున్నారు. జాగర్త."

తన సభలో తన సోదరి తననే ఈ విధంగా అవమానపరచి మాటలాడుతూ వుంటే ఖరుడికి గుండెల్లో శూలం గుచ్చినట్లయింది.

"ఈ అల్పుణ్ణి చూసేనా నీవు ఇంతలా భయపడుతున్నావు? ఇంక ఒక్క-క్షణం ఆగు. వాడి నెత్తురు నీవు తాగుదువుగాని" అని ఖరుడు లేచాడు.

"నీవు ఒంటరిగా వెళ్ళకు. సైన్యాన్ని వెంట తీసుకుపో," అంది శూర్పణఖ.

ఆ విధంగానే ఖరుడు ఆజ్ఞాపించాడు.

నానావిధమైన ఆయుధాలతో గొప్పసేన ఒకటి దూషణుడి ఆధిపత్యాన ముందు నడచింది. వెనక ఖరుడు రథమెక్కి బయలు దేరాడు. దారిలో రాక్షసులకు అనేక అపశకునాలు కనిపించాయి. ఖరుడు నవ్వి "ఈ దుర్నిమిత్తాలను చెక్కపెట్టవద్దు. నే నింతవరకు ఏ యుద్ధంలోను ఓడిందిలేదు. దుష్టులయిన మానవాధములను పురుగు లను నలిపినట్లు నలిపివేసి శీఘ్రంగా తిరిగివద్దాం" అని సైన్యాన్ని హెచ్చరించాడు. దుర్నిమిత్తాలవల్ల కలతబారిన ఆ సైన్యం తిరిగి ఉత్సాహాన్ని పొంది బయల్దేరింది.

* * *

సైన్యం వస్తూన్న సవ్వడి విని రామలక్ష్మణులు యుద్ధానికి సిద్ధమైనారు.

"లక్ష్మణా ! ఈ శకునాలు చూశావా? యుద్ధం [illegible] తథ్యం. జనస్థానంలోని రాక్షసులు నశించడంకూడా తథ్యం. [illegible] కవచాన్ని ధరించి సీతను కొనిపోయి పర్వతగుహలో జాగ్రత్తగా కాపాడుతూ ఉండు. నే నిక్కడే ఉండి ఈ రాక్షససేన పని పట్టతాను. ఆలసించవద్దు. నాకు తోడు అక్కరలేదు" అని తమ్ముడికి చెప్పి రాముడు కవచాన్ని ధరించి విల్లమ్ములు చేతబట్టాడు. లక్ష్మణుడు రాముడు చెప్పిన చొప్పున సీతను కొండగుహకు తోడ్కొని పోయాడు.

V.R.NARLA M.E.MEMORIAL D.P.R.I. ACC. NO.

ఈ యుద్ధాన్ని చూడానికి ఆకాశంలో దేవతలు, గంధర్వులు సిద్ధులు, చారణులు మున్నగు దేవగణాలు రాముడి విజయం కోరుతూ స్వస్తివాచకం పలుకుతూ నిలిచారు.

రాముడు ఒంటరిగా ఈ మహాసైన్యాన్ని ఎలా నిర్జించి జయించ గలుగుతాడని ఋషులు చింతించారు. ఆ సమయాన విల్లు వంచి నిలిచిన రామచంద్రుడి ముఖంలో వెలిగిన తేజస్సు పినాకపాణి అయిన రుద్రుణ్ని గుర్తు తెచ్చింది.

రాక్షససైన్యం వడిగా వచ్చి చేరింది. సింహనాదాలతో, ధనుష్టంకారాలతో, భేరీనాదాలతో అడవంతా మారు మోగింది. వన్య మృగాలన్నీ భయపడి చెల్లాచెదరై పరుగులుపెట్టాయి. రాముడు ధనుస్సుకు అల్లితాడు నెక్కించి నిలబడ్డాడు. ఆకాశాన మేఘాలు ముసిరినట్లు రాక్షససేన రాముణ్ని చుట్టుముట్టింది.

యుద్ధం మహాఘోరంగా జరిగింది. రాముడి శరీరమంతా గాయాలయింది. అయినా ఆయన కదలలేదు. ఈ మహాసేన ధాటికి రాము డెలా తట్టుకోగలడని దేవతలు గూడ చింతించారు.

రాముడి బాణాలకు వేలాది రాక్షసవీరులు ఆహుతైనారు. దూషణుడే నేరుగా రాముణ్ని ఎదిరించి పోరాడు. రాముడు విల్లు వంచి మండలాకారంగా తన చుట్టూ బాణాలను విరజిమ్ముతున్నాడు. అమ్ము విల్లున తొడగటం కాని, అవి అల్లి తాడునుండి విడివడటం కాని కళ్లకు కనిపించడమే లేదు. సూర్యమండలంనుంచి కిరణాలు వెలువడి నట్లు రాముడు నిలిచినచోటు నుంచి బాణాలు అష్టదిక్కులకు వ్యాపించి వేలాది వీరులు, రథాలు, ఏనుగులు, గుర్రాలు, దెబ్బలుతిని పటపటమని కూలి మరణించడం మాత్రమే కానవస్తూంది. ఆకాశంలోకి ఆయన ప్రయోగించిన బాణాలు రాక్షసుల శరీరాలను దూసుకొని నెత్తురుతో వెలువడి మంటలుకక్కి నిప్పువలె కనిపించాయి.

రాక్షససేన నశించింది. రాముడు ప్రళయకాల రుద్రుడిలాగా నిలబడ్డాడు.

* * *

దూషణుడు మళ్ళీ గొప్పసేనను కూడదీసుకొని రాముడిపై బడ్డాడు అతడి అట్టహాసం కొంతసేపు సాగింది. రాముడి బాణాలకు అతడి రథం విరిగింది, గుఱ్ఱాలు కూలాయి. సారథి ఆహుతి ఐనాడు. దూషణుడు కిందికి దూకి దండాయుధంతో రాముడిపైకి ఉరకడానికి ప్రయత్నించాడు. వెంటనే పెద్ద ఏనుగులాగా నేలికూలి దూషణుడు మరణించాడు.

దూషణుడు మరణించడం చూసి తాటక సైనికులంతా ఒక్కసారిగా రాముడిమీద విరుచుకు పడ్డారు. తన వాళ్ళకూడా కోదండం నుండి వెలువడిన బాణాలకు బలి అయిపోయారు.

ఇలాగ ఖరుడి సైన్యం పూర్తిగా నశించింది. సముద్రంలా ఘోషించుతూ వచ్చిన సేనంతా శబ్దమణిగి పీనుగ పెంటలుగా అయిపోయింది.

* * *

ఖరుడికి. త్రిశిరుడికి క్రోధం మిన్నుముట్టింది. ఖరుడు పట్టరాని రోషంతో రాముడితో కలియబడడానికి ముందుకురికాడు కాని త్రిశిరుడు అతడ్ని వారించి, "నేను ముందు వెళ్ళి రాముణ్ని చంపుతాను. విజయంతో జనస్థానానికి తిరిగి వస్తాను. లేదా రాముడి చేతిలో నేను మరణించిన తరువాత నీవు యుద్ధానికి బయలుదేరుదువుగాని" అని చెప్పి ఆ మూడుతలల రాక్షసుడు రథమెక్కి రాముణ్ని ఎదుర్కొన్నాడు.

త్రిశిరుడు రాముడిమీద బాణాలు వేశాడు. రాముడు వాటిని ఓర్చుకొని కాలసర్పాలను ప్రయోగించాడు. త్రిశిరుడు నెత్తురు కక్కుతూ నేలకూలి మరణించాడు. అతడి వెంటవచ్చిన రాక్షసులు బింకలవలె పారిపోయారు.

భయపడి పారిపోతూన్న రాక్షసులను ఖరుడు నిలిపి తన రథాన్ని రాముడి మీదికి మరలించాడు. అతడి గర్వం అప్పటికే అణగారి పోయింది. అయినా ఘోరమయిన యుద్ధం చేశాడు. ఇరువురి

బాణాలు ఆకాశాన్ని కప్పివేశాయి. ఖరుడు యముడిలా రథం పై నిలిచి బాణాలు విడిచాడు. రామచంద్రుడు ధనుస్సుపై ఆని కొంత సేపు విశ్రాంతి తీసుకున్నాడు. అప్పుడు ఖరుడి బాణాలవల్ల అతడి కవచం తెగి కిందపడింది. అప్పుడు సూర్యుడివలే మిరుమిట్లు గొలిపే శరీరంతో రాముడు ప్రకాశించాడు.

రాముడు విష్ణు ధనుస్సు ఎత్తాడు. ఖరుడి రథాన్ని, విల్లును, ధ్వంసం చేశాడు. రథమూ, విల్లు, పోయిన ఖరుడు గదను తీసుకుని రాముడిపై కురికాడు. యుద్ధాన్ని చూస్తున్న దేవర్షి గణాలు ఆ సమయాన ఆందోళనతో చేతులు జోడించి నిలబడ్డారు.

"ఓయి ఖరుడా" అని రాముడు పిలిచాడు. "ప్రజలను హింసిస్తూ వచ్చావు. లోకులకు దుఃఖం కలిగించేవాడు ఎంతటి బలశాలి అయినా నశిస్తాడు. అడవిలో తపస్సు చేసుకుంటూన్న ఋషులను ఎందుకు బాధపెట్టి చంపుతున్నావు. ఆ పాపానికి ఇప్పుడు ఫలితం అనుభవించ బోతున్నావు. పాపకార్యాలు చేసి ప్రజల ఏవగింపునకు లోనైనవారు నశించడం తథ్యం. ఋషులను విరుచుకొని తిన్నావే! ఆ ఋషులు ఇప్పుడు విమానంలో కూర్చుని ఆకాశం నుంచి చూస్తున్నారు. క్రూర రాక్షస నిర్మూలనం కోసమే నేను యీ దండకారణ్యానికి వచ్చాను. నా బాణాలు నీలాటివాళ్ల శరీరాల్లో దూరి ప్రాణాలు తోడుతాయి. ఇక యుద్ధానికి రా! నీ తల తాటికాయవలె దొర్లబోతూంది."

"ఒరే మానవహీనమా!" అన్నాడు ఖరుడు. "దశరథపుత్రా! ఎందు కీనోటిదురుసు?— అమాయకులయిన రాక్షసులను చంపాను కదా అని గర్విస్తున్నావా! వీరుడు తన్ను తాను పొగడుకోడు. నీవి అల్పులాడవలసి మాటలు. కులభ్రష్టులయిన క్షత్రియులు మాత్రమే ఇలా గొప్పలు పలుకుతారు. అనవసరపు మాటలు కట్టిపెట్టి యుద్ధానికి దిగు. చావు మూడినప్పుడే ఇలాంటి ఆత్మస్తుతి పుడుతుంది. దీనివల్ల నీ అల్పగుణం వెల్లడి అయింది. గడ్డి మంటలాగ ఏవో పెద్ద కబుర్లు చెప్పుతున్నావు. అది నిలకడలేని నిప్పు. ఇదుగో గదను చేపట్టి నిలబడివున్నాను. నీ ప్రాణా

లను కొనిపోవు యముడనై నిలిచియున్నాను. సంధ్యాకాలం కాబో తూంది. యుద్ధం నిలుపవలసియుంది. కాబట్టి వెంటనే ప్రాణాలు విడవటానికి సిద్ధంగా వుండు. నీవు చంపిన ఇందరి కసిని తీర్చుకోడా నికే నేను వచ్చాను'' అని గదను తిప్పుతూ రాముడిపై కురికాడు.

రాముడి బాణాలకు ఆ గద ముక్కచెక్కలై నేలను పడింది.

"రాక్షసుడా ! నీ దంభాలు పూర్తి అయినాయా ? నేడు నీకు మూడింది. ఈ అడవి ఇక మీదట సుఖంగా ఉంటుంది. మునులను హింసించిన నీ రక్తాన్ని భూమి తాగబోతూంది'' అన్నాడు రాముడు.

ఇలా రాముడు చెబుతూండగానే ఖరుడు ఒక పెద్దచెట్టును పెరికి ఔడుకరిచి, "ఈ దెబ్బతో చచ్చావు'' అని చెప్పి రాముడిపైన విసిరాడు.

రాముడు దాన్నికూడ తన దివ్యహస్తాలతో ఖండించాడు. ఇక ఆలస్యం చేయకూడదనుకొని అనేక బాణాలను ప్రయోగించి, అతడి శరీరాన్ని రక్తంలో మునిగేలాగ చేశాడు.

దెబ్బలు తిన్న ఆవేశంతో ఖరుడు రాముడిపైకి లంఘించాడు. ధనుస్సు వంచి బాణం విడచుటకు కూడ సందులేకుండా ఖరుడు మీది మీదికి రావడం చూసి రాముడు లాఘవంగా వెనకకు తప్పుకొని ఇంద్రాస్త్రాన్ని ప్రయోగించి వాడి రొమ్మును చీల్చాడు. దాంతో ఖరుడు మరణించాడు.

తే॥ ఖరుడు వడుటను గని సురవరులు గూడి
యాడి పాడి యానందించి యడరి పొగడి
పారిజాత సుమంబులా పంకజాక్షు
మీద నొత్తుగ గురియించి మిడిసినారు.

దేవతలు పుష్పవర్షం కురిపించారు. "పాపకర్మలు చేసిన రాక్ష సుణ్ణి చంపాడు. దండకారణ్యంలో జనులు ఇక సుఖంగా ఉండ వచ్చు. ఖర దూషణులను, త్రిశిరుని, వారి సైన్యాన్ని రామచంద్రుడు

మూడు గడియల్లో నిర్మూలనం చేశాడు. ఈయనకదా మహావీరుడు'' అని చెప్పుకుంటూ దేవతలు తమ నివాసాలకు మరలిపోయారు.

సీతాదేవి, లక్ష్మణుడూ కొండగుహానుంచి తిరిగి వచ్చారు. ఋషులకు అభయహస్తం ఇచ్చి ఆ ప్రతిజ్ఞను నిలుపుకున్న అసహాయ శూరుడైన రాముణ్ని కౌగలించుకున్నాడు లక్ష్మణుడు. ఆ కౌగలింతలో అతడు పొందిన ఆనందం మాటలతో చెప్పలేం.

రాక్షసుల శరీరాలనుంచి చిందిన నెత్తురును, పాదాల కంటిన ధూళినీ సీతాదేవి, లక్ష్మణుడూ కార్చిన కన్నీరు కడిగివేసిం దంటున్నాడు కంబరుకవి.

ఉ॥ మింటికి నేగి డాగు మిడిమేలపు సోకుల మేని నేత్రు దు
మ్మంటిన యంఘ్రియుగ్మము ముదగ్రుల ధావన చేసె దమ్ముడా
యెంటికి నంటు ధూళియు వ్రణోత్థిత వేదన వోవ నిమ్మళం
బొంట గవుంగలించె ననువొందగ జక్కవచంటి సీతయున్.

ఒక్కడు ఒంటరిగా ఇంతటి ఘనకార్యాన్ని ఎలా చేయగలిగాడు ? ఒక ఆవు తన లేగను కాపాడుకోవడంకోసం జనుల గుంపుమీద పడి వారందరినీ చెల్లాచెదరుచేసి పరుగులు పెట్టించడం చూస్తే వాస్తవమైన భావావేశం పొందిన ఒక ప్రాణిలో ఎంత ప్రచండత, ఎంత శౌర్యం, ఎంత బలం వచ్చి చేరుతుందో ఒకవిధంగా చూడవచ్చు. భగవంతుడే మనుష్యరూపంలో వచ్చి అనాథలకు అభయమిచ్చి ఆడిన మాటను నిలుపుకోడానికి పట్టుపట్టినట్టయితే ఆ మానవుడు ఏం చేయగలడో మన ఆలోచనాశక్తితో చూడవచ్చు. వాల్మీకీ, కంబరుకవీ కూడా రాముణ్ని అవతార పురుషుడిగానే భావించి వేర్వేరు సంఘటనలద్వారా ఆ విషయాన్ని చిత్రించారు. కొన్నిచోట్ల ఆయనను దైవానుగ్రహం బడసిన వీరుడిగా, మరికొన్నిచోట్ల దైవంగానే చిత్రించారు. అయితే రాముడు మాత్రం తన్ను తాను దేవుడిగా ఎన్నడూ భావించలేదు. మానవుడిగా, క్షత్రియ వీరుడుగా, సత్యసంధుడుగా. ధర్మమార్గావలంబిగా, వేదాంత జ్ఞానం బడయగల ఆత్మగా తనను భావించుకొన్నాడు.

రాక్షససేన వచ్చి రామున్ని ముట్టడించింది. శూర్పణఖ తటాలున వచ్చి "అడుగో అతడే" అని వారికి చూపించింది. ఆ సమయంలో రాము డేంచేస్తున్నాడో కంబరుకవి ఇలా వర్ణించాడు :

తే॥ విమల శశ్వత్సహస్ర నామములు గలిగి
క్షీరసాగర శాయియౌ శ్రీముకుందు
పాదపద్మముల్ స్మరియించు పద్మనేత్రు
జూప జేసన్న వారికి జుప్పనాక.

నారాయణుడైతే తానే రాముడని ఎరుగును. కాని రాముడు తానే నారాయణుడనని అనుకోలేదు. నారాయణున్ని ధ్యానించి ఆత్మబలాన్ని మనోబలాన్ని పొందుతున్నాడు.

48. మతిపోయిన మహీపతి

పంచవటి యుద్ధంలో బతికి బైటపడ్డ రాక్షసులలో అకంపనుడొకడు. అతడు పోయి రావణుడి దగ్గర నిలిచి "జనస్థానంలో మనవారంతా మరణించారు. జనస్థానమే నశించింది. నేను మాత్రం ఎలాగో తప్పించుకు రాగలిగాను" అన్నాడు.

ఆ మాట వినగానే రావణుడికి క్రోధం రగులుకుంది. "ఎవడురా అందమైన నా జనస్థానాన్ని నాశనం చేసినవాడు? వాడు యముడా ? అగ్నా ? విష్ణువా ? యముడ్ని కూడా చంపుతా. అగ్నినీ సూర్యుణ్ని కాల్చివేస్తా. వాయువును కదలకుండా బంధిస్తా. నేనుండగా నా జనస్థానాన్ని ధ్వంసంచేసి నావారిని చంపినవాడెవడు ? వెంటనే చెప్పు" అని పటరాని కోపంతో గరిసూ రావణుడు లేచాడు.

రాక్షసేంద్రుడి కోపం చూసి భయపడిన అకంపనుడు "అభయమిస్తే చెపుతాను వినండి" అన్నాడు.

అకంపనుడు జరిగిందంతా వివరంగా చెప్పాడు. దశరథ మహారాజు కుమారుడయిన రాముడనే వీరుడు, సింహంలాంటి యువకుడు. గొప్ప కీర్తిగడించిన వాడు. అతడితో సమానమైన బల పరా

క్రమాలు గలవారు మానవులలో లేరు. అతడే పంచవటిలో ఖర దూషణులను యుద్ధంలో హతమార్చాడు'' అన్నాడు.

రాక్షసపతి విష భుజంగంలాగా బుసకొట్టాడు. "ఏమిటినీవు చెప్పేది? ఇద్రుండూ, దేవ గణాలూ నీవు చెప్పిన రాముడికి యుద్ధంలో తోడ్పడ్డారా ?'' అని అడిగాడు.

"మహారాజా అలాంటిదేమీ జరగలేదు. రాముడొక్కడే మన సేననూ. సేనాధిపతులనూ, ఖరదూషణులనూ వధించాడు. అతడు ప్రయోగించిన బాణాలు అయిదు తలల మిణ్ణాగుల్లాగా రాక్షసులను తరిమితరిమి వెంబడించి చంపాయి'' అని అకంపనుడు రాముడి బాణవేగాన్ని, అతని అపారశక్తినీ వర్ణించి చెప్పాడు.

దశరథ కుమారుడైన రాముడు, తమ్ముడు లక్ష్మణుడితో కూడా పంచవటిలో ఉన్నాడనీ, ఎవరి సహాయమూ లేకుండానే అత డీపనిచేశాడనీ, వారికి తోడ్పాటుగా ఏ దేవతలూ రాలేదనీ అకంపనుడు చెప్పగా విని "సరే ! ఇప్పుడే నేను బయలుదేరుతాను. ఆ మానవ కీటకాలను నలిపివేస్తాను''అని రావణుడు లేచాడు.

"వద్దు ! ఆగండి !'' అని అకంపనుడు రావణుణ్ణి నిలిపాడు. రాముడి బల పరాక్రమాలను చక్కగా వివరించి చెప్పాడు. "నా మాట వినండి. యుద్ధంచేసి రాముణ్ణి జయించడం సాధ్యం కాని పని. అది ఎవరివల్లా కాదు, మీవల్లా కాదు. అభయమిచ్చారు కనుక ఇలా యథార్థాన్ని ధైర్యంగా రాజసన్నిధిలో చెప్పడానికి సాహసిస్తున్నాను. అతడ్ని చంపడానికి ఒక్కటే మార్గముంది. అతనివెంట అతని భార్య ఉంది. లోకంలో ఆమెతో సమానమైన అందకత్తెలు మరిలేరు. ఆమెను ఎలాగైనా మీరు అపహరించుకు రాగలిగితే ఇక-ఆమెను ఎడ బాసి రాముడు బతకలేడు. ప్రాణాలు విడుస్తాడు. ఆమెపై అత డికి అంత ప్రేమ. ఆమె ఎడబాటుతో ప్రాణాలు విడుస్తాడు. అందులో సందేహంలేదు. ఆ పని సాధించడానికి దారి వెతకండి. యుద్ధం మాత్రం వద్దు" అన్నాడు.

సీత అందచందాలను వినగానే రాక్షసరాజులో ఆశ అంకు రించింది. ఆకంపనుడి ఉపాయానికి మెచ్చుకున్నాడు. "రేపు ఉద

యమే రథమెక్కి బయలుదేరుతున్నాను. నీ యోచన చాలా చక్కగా ఉంది'' అన్నాడు.

* * *

రావణుడు కంచర గాడిదలను పూన్చిన బంగారు రథ మెక్కి ఆకాశ మార్గాన బయలు దేరాడు. మబ్బుల మధ్య ఆ బంగారు రథం చంద్రుడిలా ప్రకాశించింది. రావణుడు ఆ రథంమీద తిన్నగా మారీచాశ్రమానికి వెళ్లాడు.

మారీచుడు ఆ రాక్షసరాజుకు స్వాగతోపచారాలన్నీ చేసి "ఇంత త్వరితంగా వచ్చారే! ఏమిటీ విశేషం?'' అని అడిగాడు.

"ప్రియమైన మారీచా! నన్ను నీవే ఆదుకోవాలి. జనస్థానం నశించి పోయింది. మన సేన సర్వ నాశనమై పోయింది. ఇదంతా దశ రథ కుమారుడు రాముడు అనేవాడు చేసిన పని. చూడు ఎంత ఆశ్చర్యంగా ఉందో ! కసి తీర్చుకోవడం కోసం అతడి భార్యను నేను అపహరించాలని సంకల్పించాను. అందుకు నీ సలహా, నీ సహాయమూ కావాలి'' అని రావణు డన్నాడు.

"రావణా ! ఎవరో కిట్టనివాళ్ళు నీకు స్నేహితులుగా నటించి ఇలాంటి సలహా నీకు ఇచ్చి ఉంటారు. మోసపోయి వినాశనం కొని తెచ్చుకోకు. సీతను అపహరించాలన్న ఈ ఆలోచన చెప్పినవారెవరు? రాక్షస వినాశనాన్నికోరి ఈ దురాలోచన చేసినవారెవరు ? ఇది పామునోట్లో చెయ్యిపెట్టి కోరలు లాగటం లాంటిది. ఇలాంటి పిచ్చి ఆలోచనలు మాని తిరిగి పోయి నీ భార్యలతో సుఖంగా ఉండు. పిచ్చివాడివలె రాముడి భార్యకోసం ఆశించకు. అనవసరంగా నాశన మవుతావు. రాముడికి కోపం కలిగించి కుల వినాశనాన్ని కోరి తెచ్చు కోవద్దు'' అని విజ్ఞుడూ, అనుభవశాలీ అయిన మారీచుడు రావణుడికి హితవు చెప్పాడు.

మారీచుడి హితవు విని రావణుడు లంకకు తిరిగి పోయాడు. మారీచుడి హితవు రావణుడి మనస్సుకు చక్కగా ఎక్కింది. ఆ సమయంలో రావణుడికి తాను పొందిన వరాలలో విడిచిపెట్టిన అంశం

గుర్తుకువచ్చి ఉంటుంది. మానవుడిచేత చావులేకుండా అతడు వరం పొందలేదు. రాముడి బాణాలకు జనస్థానంలోని రాక్షస సేనా, ఖరుడూ, త్రిశిరుడూ, దూషణుడూ, మొదలైన మేటి వీరులంతా ఆహుతి అయిన సంగతి అతడికి గుర్తుకు వచ్చింది. అందుకని మారీచుడి సలహా విన్నాడన్నమాట.

ఆ ఆగడం అంతటితో ఆగలేదు. రావణుడు కొలువుకూటంలో సింహాసనంమీద కూర్చొని ఉన్నాడు. అగ్నిలో నెయ్యిపోసినట్టు అతడు తేజరిల్లుతున్నాడు. అతడు అజేయుడైన వీరుడు. దేవాసుర యుద్ధాలలోనూ, ఇతర సంగ్రామాలలోనూ చక్రాయుధంవల్లా, ఏనుగు దంతాల పోటులవల్లా కలిగిన గాయాల మచ్చలు అతడి గంభీర రూపాన్ని మరింత భీకరంగా ప్రకాశింపచేస్తున్నవి. రావణుడి బల పరాక్రమాలకు అదుపులేదు. దేవతలను హింసించడంలో, యజ్ఞ యాగాదులను పాడుచేయడంలో. పరస్త్రీలను బలవంతంగా చెరచటంలో ఆ కోపావేశంతో చేసే అనేక అక్రమాలలో అతనికి అతనే సాటి. అంతటి దుష్టుడు మరొకడులేడు. అతడ్ని చూస్తే చాలు దేవాసుర గణాలు గజగజలాడుతారు.

సకల ప్రాణులను హింసించి కుయ్యోమొర్రో అనిపించే స్వభావం అతడిది. సకల సిరి సంపదలు, భోగభాగ్యాలు అనుభవిస్తూ అసహాయ శూరుడై మరణభీతి అనేది లేకుండా లంకను ఏలుతున్నాడు. పది తలలు, విశాలమైన కన్నులు, వాటికి తగిన అంగసౌష్ఠవంతో సకల రాజ లక్షణాలతో భయంకర స్వరూపంతో తేజరిల్లుతున్నాడు. ఆనాడు దివ్యాభరణాలు ధరించి మంత్రి, సామంతాదులతో కొలువు దీరి ఉండగా హఠాత్తుగా సభ దద్దరిల్లేలా అతడి తోబుట్టువు శూర్పణక ముక్కూ చెవులు లేని వికార స్వరూపంతో ప్రవేశించింది.

"మూర్ఖుడా : ధన మదంలో తుచ్ఛభోగాలలో మునిగి తేలుతున్నావా ? రాబోయే కష్ట నష్టాలను ముందుగానే తెలుసుకోవలసిన స్థానంలోవున్న నీవు చేటుకలిగిన తరవాత కూడా తెలుసుకోలేకుండా ఉన్నావు. అల్ప సుఖాలలో మునిగి తేలే రాజును ప్రజలు లెక్కచేయరు. మరణభయం లేకపోయినంత మాత్రంతో సరి

పోయిందా? చేయవలసిన పనులేమిటో రాజు సకాలంలో గమనించక పోతే ఆ రాజ్యం పాడై పోతుంది. రాజ్యంలో జరిగే విశేషాలను చారుల ద్వారా తెలుసుకోలేని రాజు నశిస్తాడు. నీ రాజ్యంలో జరిగిందేమిటి? జనస్థానంలో నీ బంధువుల గతి ఏమైంది? నీ సైన్యానికి ఏంగతి పట్టింది? ఈ విషయాలు నీకు తెలియవు. సింహాసనంమీద మాత్రం కుదురుగా కూర్చున్నావు. నీ శత్రువులు నిన్ను హతమార్చడానికి అదనుకోసం వేచి ఉన్నారు. ఇది నీకు తెలుసు. అయినా నీ గూఢచారులను విచారించి జరిగిందేమిటో నీవు తెలిసికోలేదు. నీ మంత్రులు మతిలేని పామరులులా ఉన్నారు. జనస్థానంలో నీవారు-మన శత్రువులను గజగజ లాడించి నీ ఆజ్ఞ మేరకు ఇంతకాలం రాజ్యం చేసినవారు-ఇప్పుడు చచ్చి పడి ఉన్నారు ఈ విషయం నీవు ఎరుగుదువా? జనస్థాన సైన్యం నాశనమై పోయింది. రాముడనే ఒక మానవ కీటకం నేలపై నిలిచి రధంకానీ ఏనుగుకానీ ఏదీ లేకుండానే అంతమందినీ హతమార్చాడు.

నీ కిది అవమానముగా తోచలేదా? నీ చెల్లెలి సంగతి ఏమైందో చూశావా? కనీసం విచారించనైనా విచారించావా? ఇంతవరకు నీకూ నీ సేవకులకూ భయపడి గజగజ లాడుతూ బతికే ఋషులకు శ్రీరాముడు ఇప్పుడు అభయమిచ్చాడు. నీ జనస్థానం పాడై పోయింది. దండకారణ్యంలో నీవు పుట్టించిన భయం ఇప్పుడు నీదై పోయింది. ఆత్మస్తుతితో తృప్తిపడే నీకు ఆపద సమీపించింది. నిన్ను ఇక మీదట నీ ప్రజలు లెక్కచెయ్యరు. నిన్ను రాజ్యంనుంచి తరిమి వేస్తారు. అది నిశ్చయం. ప్రజలు ఇక నిన్ను చినిగిపోయిన పాత బట్టలా చూస్తారు.

గూఢచారుల ద్వారా రాజ్యంలో జరిగే విశేషాలు తెలుసుకుని కావలసిన కార్యాలు చేసేవాడే రాజు. నీ రాజ్యంలో నీ జనులకు కలిగిన కష్టాలూ, అవమానాలూ, నీకు తెలియవు. నిన్ను రాజు అని ఎలా అనుకుంటారు? నీకు రోషం లేదు. రోషం లేని రాజు ఎందుకు పనికి వస్తాడు?

ఖరుణ్ని, త్రిశిరుణ్ని, దూషణుణ్ని, ఖరుడి సమస్త సేనా వాహినిని చంపి నిర్మూలించిన రాముడికి సీత అనే ఒక భార్య ఉంది. అడవిలో అతడివెంట ఒంటరిగా ఉంది. ఆమె అందం ఏమని చెప్పేది! దేవ, గంధర్వ, యక్ష, కిన్నర, మనుష్య జాతులలో అలాంటి అందాన్ని నే నింతవరకూ చూడలేదు. ఆమె నీకు తగిన భార్య. చూచిన వెంటనే ఆమె నీ సొమ్ము అని నేను నిశ్చయించాను. ముద్ది పుట్టిన వెంటనే దానిని నెరవేర్చడమే కదా మన కుల స్వభావం. నీ కోసం నే నామెను అపహరించి తెద్దామని ప్రయత్నించాను. రాముడి తమ్ముడు లక్ష్మణుడు అడ్డుతగిలి మీదికురికి ఇలా నన్ను వికలాంగను చేసి అవమానపరచాడు. నీకు మేలుచేయబోతే నా కీదుస్థితి వచ్చింది. ఈ కసి తీర్చుకొని నీ కులగౌరవాన్ని కాపాడుకోవాలని వుంటే లే- వెంటనే బయలుదేరు.

నా కసిమాట ఎలా ఉన్నా నీకు తగిన సుందరిని సంపాదించుకో. సీత వంటి అందకత్తెను నీవు తప్ప మరి ఒకడు అనుభవించడం తగునా? ఆమెను నీవు చేబట్టి రాముణ్ని అవమాన పరిచావంటే అన్యాయంగా మరణించిన మన వీరుల ఆత్మలు తృప్తిచెందుతాయి. వాళ్లు నాకు చేసిన అవమానానికి కసి తీరుతుంది. నీ శక్తే నీ వెరుగవు. సీతను సులభంగా చేబట్టి అనుభవించు. నీ కులాని కేర్పడిన అవమానాన్ని గమనించక పోవడం తగదు. రాముణ్ని ఎదిరించిన ఖర దూషణులు చచ్చి పోయారు. ఆ విషయం జ్ఞాపకముంచుకొని బాగా యోచించి, చేయవలసిం దేమిటో నిర్ణయించుకో. నీ సోదరికి వచ్చిన అవమానం నీకు వచ్చిన అవమానమే అనుకో. మన కులంలో నీ కున్న గౌరవాన్ని కాపాడుకో," అని శూర్పణఖ చెప్పింది.

* * *

తోబుట్టువు ఇలా హఠాత్తుగా వచ్చి ఆడిన మాటలు రావణుడికి ములుకుల్లాగ గుచ్చుకున్నాయి. సీతను గురించి చెప్పిన మాటల వల్ల ఆశ పుట్టింది. సభ చాలించి ఒంటరిగా ఆలోచించడానికి వెళ్లాడు, రావణుడు. మారీచుడు చెప్పిన మాటలు మనస్సులో మెదులుతూనే వున్నాయి. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. గుర్రాల

శాలకు వెళ్ళి సారథితో "రథాన్ని సిద్ధపరచు. ఎవరికీ తెలియకూడదు సుమా" అని చెప్పాడు.

పిశాచ ముఖాలు గల బలిసిన కంచర గాడిదలను పూన్చి అతడి బంగారు తేరు సిద్ధమయింది అందులో ఎక్కి ఆకాశ మార్గాన సముద్రాలూ, అడవులూ, కొండలూ, పట్నాలు దాటి వాయు వేగంతో వెళ్ళాడు. కోరిన చోటికి నిరాఘాటంగా వెళ్ళగల మాయారథం అది. దానిమీదనుంచి కిందికి చూస్తే వసంత శోభ అతడి కామాన్ని ఉద్దీపింపజేసింది.

తిన్నగా వెళ్ళి మారీచుడి ఆశ్రమం చేరుకున్నాడు. జడలూ, నార బట్టలూ ధరించి, వ్రతనిష్ఠలో జీవితం గడుపుతున్న మారీచుణ్ణి చూశాడు.

రాక్షస రాజూ, బంధువూ అయిన రావణుణ్ణి చూడగానే మారీచుడు లేచి ఎదురు వెళ్ళి యథోచిత మర్యాదలు చేశాడు. "చెప్పకుండానే ఇంతదూరం మళ్లా వచ్చారు. ఏమిటీ విశేషం?" అని ప్రశ్నించాడు.

మాటల మెలకువ తెలిసిన రావణుడు తను వచ్చిన పని చెప్పనారంభించాడు.

"నేనొక గొప్ప దుఃఖంలో చిక్కుకుని బాధ పడుతున్నాను. నిన్ను శరణు వేడుతున్నాను నా తోబుట్టువులు జనస్థానంలో నా యాజ్ఞలకు తల ఒగ్గి నా పనులను నెరవేరుస్తూ ఉండేవారన్న సంగతి నీకు తెలుసుకదా? వారూ, వారికి సహాయులుగా ఉన్న వీరులూ ఇంతవరకూ అక్కడ నిరాఘాటంగా రాజ్యం ఏలుతుండేవారు. ఇప్పుడు రాముడనే ఒకడు ఆ వీరులనూ, వారి సేనలనూ అవలీలగా హతమార్చాడు. రథం కాని, వాహనం కాని ఏదీ లేకుండానే నేలపై నిలిచి ఆ మానవుడు అందరినీ తన బాణాలతో కూల్చి వేశాడు. దండ కారణ్యంలో ఇప్పుడు రాక్షస బాధ అనేది లేకుండా ఋషుల కేళీవనంగా తయారయింది. తండ్రి అరణ్యానికి తరిమివేస్తే పారివచ్చిన చేతకాని నీచుడు ఈ రాముడు. భార్యను కూడా వెంటబెట్టుకొని ఈ అడవిలో దిమ్మరి

లాగా తిరుగుతున్నాడు. ఈ దుష్టుడు తాపసి వేషం ధరించి ఇంద్రియ భోగ లాలసుడై ధర్మాన్ని త్యజించాడు అల్పుడు. క్రూరుడు. పశు బలాహంకారంతో నిష్కారణంగా నా తోబుట్టువు ముక్కూ చెవులూ కోసి మన కులానికే తీరని అవమానం చేశాడు. అవమాన భారంతో ఘోరంగా విలపిస్తూ నా తోబుట్టువు ఆ అత్యాచారాన్ని గురించి నాతో మొర పెట్టుకుంది. ఇదంతా చూస్తూ ఊరుకుంటే నా రాజరికం ఎందుకు ? ఆ కసి తీర్చుడంకోసం రాముడి భార్యను దండ కారణ్యం నుంచి అపహరించి కొనిపోవాలని నిశ్చయించాను. ఈ రాముణ్ని దండించి అవమానపరచడం నా కుల ధర్మం. దీనికి నీ సహాయం కావాలి. నీవూ నా సహోదరులూ ఉండగా నాకు భయ మేమిటి ? నీ సహాయాన్ని ఇప్పుడు అర్థిస్తున్నాను. శౌర్యంలో, బలంలో, యుక్తిలో, మాయలలో నీకు ఈ లోకంలో సాటి ఎవడు ? అందుకనే నేను నీ వద్దకు వచ్చాను. నీవు కాదనకు. నా మాట విను. నీవొక మాయలేడి రూపు ధరించాలి. బంగారు చాయ వెండి చుక్కలతో చూడ ముచ్చటయిన జింకగా మారాలి. రాముడి ఆశ్రమంలో సీత ఎదుట నీవు సంచరించాలి. సీత స్త్రీ స్వభావము వల్ల ఈ జింకను పట్టి తేవాలని రామలక్ష్మణులను తప్పక నిర్బంధిస్తుంది. వాళ్ళు నీ వెంట పడతారు. ఆమె ఒంటరిగా ఉన్న సమయాన నేను సులభంగా ఆమెను అపహరించి కొని పోతాను.

సీత అతిలోక సుందరి. భార్యను ఎడబాసిన రాముడి గుండె పగిలి బలహీన మవుతుంది. ఆ స్థితిలో అతడిపై దెబ్బతీసి మనసారా కసి తీర్చుకుంటాను.''

ఈ మాటలు వినగానే మారీచుడి ముఖం ముడుచుకు పోయింది. నోరెండిపోయింది. రెప్పలు వేయకుండా రావణుణ్ని చూస్తూ అలాగే ఉండిపోయాడు. రాముడి పరాక్రమాన్ని ఎరిగి ఉన్న మారీచుడు రావణుడి నిశ్చయాన్ని విని భయపడిపోయాడు మారీచుడు అనుభవశాలి. విజ్ఞుడు. తపమాచరించి కొంత జ్ఞానమూ, ఈశ్వర భక్తి సంపాదించాడ. అతడు రావణుడి భావాన్ని వెంటనే గ్రహించాడు. ''కర్మ ఇతని మెడకు ఉచ్చువేసి ఈడుస్తుంది. దాన్ని

తప్పించడం సాధ్యం కాదు'' అని తెలుసుకున్నాడు. రావణుడు కుల గౌరవాన్ని, రాజనీతినీ శూర్పణఖ అవమానాన్ని కారణాలుగా చూసి మాట్లాడాడే కాని సీతాపహరణం అనే దురుద్దేశం నిజాని కతడి మనస్సును విరిచింది. మారీచుడు ఆ విషయాన్ని బాగా తెలుసు కున్నాడు.

శూర్పణఖ ఉద్దేశాన్ని కూడా మనం కొంత తెలుసుకోవాలి. కామోద్రేకంవల్ల ఆమె కీకీడు కలిగింది. ఆమె ముక్కు చెవులు కోసి బాధించినవాడు లక్ష్మణుడు. అయినా స్త్రీ స్వభావం— అతడిపై ఆమెకు అంత కోపంలేదు. తన కోరిక ఈడేరక పోవడానికి కారణం మధ్యనున్న సీత. తనకు కీడు తెచ్చినవి అమె గుణరూపాలేనని శూర్ప ణఖ భావం. అందుకని ఆమెపై ఎక్కువకోపం ఉంది. ఆమెను అవమానపరిచి కసి తీర్చుకోవాలని శూర్పణఖ కోరిక. రావణుణ్ని ఈ పనికి ఉపయోగించుకోవడంకోసం కామాతురుడైన అతడి ముందు సీత సౌందర్యాన్ని వర్ణించింది. అతడి బుద్ధిని పెడతోవకు తిప్పింది. మధ్య మధ్య వెలితి పూడ్చడం కోసం మాట్లాడినవే మిగతా విష యాలు. కులగౌరవం, బంధు దుర్మరణం ఇవన్నీ కారణాలుగా చెప్పి రావణుడుకి తోవ చూపింది. రావణుడికి మరులుకొల్పి, కామోద్రేకిని చేసి, సీతవదకు పంపడమే ఆమె ముఖ్యోద్దేశం. అతడు ఈ దురా లోచనలో తగులుకున్నాడు.

49. బంగారులేడి

మారీచుడు రావణుడితో ఇలా అన్నాడు: "ప్రభూ : నీవు చెప్పిం దంతా విన్నాను. నీ మాటలు వింటూ ఉంటే నా కెంతో దుఃఖం కలుగుతూంది. ఆలోచన చెప్పవలసి వచ్చినప్పుడు వినసొంపైన మాటలు చెప్పడం చాలాసులభం. కాని అప్రియమైన హితవును నిర్మొహమాటంగా చెప్పడానికి ఎవరూ ముందుకురారు. చెప్పినా ఎవరూ వినరు. ఏ మైనా మీ మేలు కోరి చెపుతున్నాను. తీయగా మాట్లాడి మిమ్మల్ని తృప్తిపరచి అపాయంలో తోసి చేటు తేవడం నా కిష్టంలేదు.

రాముణ్ణి గురించి మీకు చెప్పినవాళ్లు యథార్థాన్ని మాత్రం చెప్పలేదు. అజ్ఞానుల మాట విని మోసపోవద్దు. రాముడు గొప్ప వీరుడు. ఉత్తమ గుణసంపన్నుడు. ఆయనకు కోపం తెప్పించి కుల క్షయానికీ, లంకా వినాశనానికీ దారి తీయవద్దు. సీత మీ నాశనానికే అవతరించిందేమో ! మిమ్మల్ని రాజుగా ఎన్నుకున్న రాక్షస కులమూ, లంకానగరమూ త్వరలోనే రాముడి చేతుల్లో సర్వనాశన మవుతుంది. రాక్షస కులక్షయానికి దారి తీస్తున్నారు. ఈ అభిప్రాయాన్ని మీకు కలిగించిన వారెవరు ? మీకూ, మీ రాజ్యానికీ, మీ జాతీవారికీ పెద్ద ఆపద కొనితెచ్చేందుకే ఎవరో ఈ చెడు ఉపదేశం చేశారు.

రాముడిలో ఏదో దోషముందని తండ్రి అడవికి తరిమి వేయ లేదు. ఆయనను గురించి మీరు చెప్పిందంతా పొరపాటు. దశరథుడు తన భార్య కైకకు మాట ఇచ్చాడు. ఆ మాటను నిలపడం కోసమే రాముడు స్వయంగా అడవికి వచ్చాడు. తండ్రి చేసిన బాసను నిలప డంకోసం రాజ్యాన్నీ, భోగాలనూ అన్నింటినీ త్యజించి దండకారణ్యా నికి వెళ్లాడు. ఆయన కాముకుడనీ, వంచకుడనీ మీ కెవరు చెప్పారు ? అదంతా శుద్ధ అబద్ధం. ధర్మమే రూపుదాల్చిన మహాపురుషుడు, రాముడు. ధర్మమార్గాన మాత్రమే పరాక్రమాన్ని ప్రదర్శిస్తాడు. దేవలోకంలో ఇంద్రుడివలె ఈ లోకవాసులలో అగ్రగణ్యుడైన వీరుడు రాముడు. ఆయన భార్యను మీరు ఆశించవచ్చా ? అది తగిన పనేనా ? ఆమె మీకు వశమవుతుందా ? సూర్యుణ్ణి మోసగించి సూర్యకాంతిని దొంగిలించడానికి వీలవుతుందా ? జనక పుత్రి అయిన సీతాదేవి తేజస్సును మీ రంటగలరా ? ఆమె తేజస్సుకు మాడి బూడిద అయిపోగలరు. రాముడి బాణాలకు ఆహుతి కావద్దు. ఆయనను మీ పాలిటి యముణ్ణి చేసుకోకండి. ఆయన రక్షణలో ఉన్న నిప్పును తాకడానికి వెళ్లవద్దు. మీ సర్వనాశనానికి దోవ కల్పించుకోవద్దు.

చక్కగా ఆలోచించినమేదట కాని ఏ పనిలోనూ ప్రవేశించ రాదు. రాముడితో పోరి మీరు విజయం పొందలేరు. రాక్షసరాజా ! నా మాటలు తిరస్కరించవద్దు. నా బాహుబల గర్వంతో పూర్వం నేను ఋషులను చంపాను. వాళ్ల యజ్ఞ యాగాలను చెరిచాను. ఆ

రోజుల్లో విశ్వామిత్ర మహర్షి చేసిన యజ్ఞాన్ని చెరచడానికి వెళ్లాను. ఆనాడు పసివాడుగా ఉన్న ఈ రాముణ్ణి తన యాగ రక్షణకోసం దశరథుణ్ణి అడిగి విశ్వామిత్రుడు తోడ్కొని వచ్చాడు. ఈతని శౌర్యం ఆ మహర్షికి ఆనాడే తెలుసు. నేను హోమకుండాన్ని ధ్వంసం చేయడానికి వెళ్లాను. ఈ బాలుడు తన విల్లువంచి విడిచిన బాణం నన్ను అమాంతంగా తీసుకుపోయి సముద్రతీరాన పారవేసింది. చాలాకాలం వరకూ స్పృహ లేకుండా అలాగే పడి ఉన్నాను.

ఆయన కోపాన్ని కొనితెచ్చుకోవద్దు. సకల సంపదలతో ఇష్ట భోగాలతో సుఖంగా ఉన్న మీ రాక్షస కులానికి వినాశనం కొనితేవద్దు. సీతను పట్టబోయి అందచందాల కాణాచి అయిన నీ నగరాన్ని అనవసరంగా నాశనం చేసుకుని మరణించవద్దు. మీకు రాబోయే వినాశనం ఇప్పుడే నా మనోనేత్రాలకు కనిపిస్తూంది. తగలబడుతున్న లంకా నగరం నా కగుపిస్తూంది. మహాపాపపంకిలంలోకి దిగాలని చూస్తున్నారు. వద్దు. నామాట వినండి. మీకు అంత దుస్సహమైన కోపమే ఉంటే రాముడితోనే నేరుగా యుద్ధం చేయండి. అక్రమ వంచనలకు దిగి ఆత్మచ్యుతికి పాల్పడవద్దు. మీ భార్యలతో సుఖంగా ఉండండి. మీకు వందలకొలది పడుచులున్నారు. అది చాలదా? మీ బంధుమిత్రు లందరికీ వినాశనం కొనితెచ్చి మీరుకూడా నశించే మార్గాన్ని వెతకకండి. కోరి కోరి యముణ్ణి పిలవకండి."

ఇలాగ మారీచుడు రావణుడి క్షేమం గోరి చాలా సేపు మాట్లాడాడు. కాని అది రావణుడికి ఏమీ రుచించలేదు. కామాతురుడికి ఎంత మంచి యోచన చెబితేమాత్రం ఏం లాభం? రోగి మందును తిరస్కరించినట్లు రావణుడు "నీవు చెప్పింది సరికాదు. నేను ఒప్పుకోను" అని మారీచుడి హితవాక్యాలను పెడచెవిని పెట్టాడు.

"రాజు ఒకరి వద్దకు వెళ్లి ఈ పని చేయవచ్చునా చేయరాదా అని సలహా అడిగినప్పుడు వారు దాని బాగోగులను విమర్శించి చెప్పవచ్చు. కాని నేను నీవద్దకు ఆలోచనకోసం రాలేదు. ఫలానా పని చేయాలని నిశ్చయించి అందుకు నీ సహాయం కావాలి అని రాజు అడిగినప్పుడు రాజువద్ద చూపవలసిన మర్యాదా మన్ననలను

మరిచి 'నీవు చేయబోయేది పొరపాటు' అని చెపుతున్నావు. నేను ఈ విషయంలో పూర్తిగా ఆలోచించిన మీదటనే ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ నీచమానవుడితో నేను యుద్ధం చేయరాదు. దేశ బహిష్కృతుడు, అధముడు, ఒక స్త్రీ దురాలోచనకు మోసపోయి రాజ్య భ్రష్టుడైన మూఢుడు- అలాంటివాడిని నేను సాటివాడిగా ఎంచి పోరుసల్పుతానా? అది అసంభవం. అతడి భార్యను అపహరించి అవమాన పరచడమే అలాంటివ్యక్తికి తగిన శిక్ష. నేను నిర్ణయించుకున్న విషయం ఇదే. దాన్ని గురించి నిన్ను సలహా అడగటంలేదు. నేను చెప్పిన పనిని నీవు చేయాలి. అంతే. నీవొక విచిత్రమైన మాయలేడి రూపు ధరించి సీతకంటపడి ఆమెను ఆకర్షించాలి. నేను కోరుతూందిదే. లేడిని పట్టితెమ్మని సీత రాముణ్ని పంపుతుంది. నీవు రాముణ్ని దూరంగా తీసుకుపోయి "హా సీతా! హా లక్ష్మణా! అని రాముడి గొంతుతో అరవాలి. అది విని రాముడికి ఏదో ఆపద వచ్చిందనుకొని సీత లక్ష్మణుణ్ని సహాయంగా పంపుతుంది. నేను సమయం చూసుకుని సీతను అపహరించి లంకకు తీసుకుపోతాను. ఈ పనికి నీవు తోడ్పడిం తర్వాత నీ యిష్టం వచ్చినట్లు పోవచ్చు. కాదంటావా ఇక్కడే నా చేతుల్లోనే మరణిస్తావు" అని రావణుడు అన్నాడు.

ఎంత చెప్పినా రావణుడు పెడచెవిని పెట్టడం చూసి 'ఇతడు యమాలయ ప్రయాణానికి త్వరపడుతున్నాడు. కామప్రేరేపితుడై చావడం ఇతడి నుదుట వ్రాసి ఉంది. ఇతడి చేతుల్లో చావడంకన్న రాముడి చేతుల్లో చావడమే మేలు. శత్రువు చేతుల్లో చావడంవల్ల దోషం లేదు' అని మారీచుడు మనస్సులో అనుకుని రావణుడు చెప్పినట్లు చొప్పున చేయడానికి ఒప్పుకున్నాడు.

"రావణా! నేను నీకు హితవు చెప్పి చూశాను. నీవు వినలేదు. నీవు చెప్పినట్లు చేస్తే నా ప్రాణం పోవడం నిశ్చయం. దాని తరవాత త్వరలోనే నీ ప్రాణంకూడా పోవడం తథ్యం. లంక నాశన మవడం ఖాయం. నీ పచ్చకిట్టని శత్రువెవడో నిన్ను ఈ పనికి పురికొల్పాడు. నీ మీద ఎవరికో అసూయ ఉంది. అతడే ఈ దురాలోచన చెప్పాడు. నీవు మొండిపట్టు పట్టుతున్నావు. నీ చేతుల్లో చావడంకన్న పగవాడికి

ప్రాణాలివ్వడం మేలు. దండకారణ్యానికి పోతానులే" అన్నాడు మారీచుడు.

రావణుడు ఆనందించి మారీచుణ్ణి కౌగలించుకున్నాడు. 'మళ్ళీ పూర్వపు మారీచుణ్ణి చూడగలిగా'నని ప్రశంసించాడు.

* * *

ఇరువురూ రథ మెక్కి దండకారణ్యానికి బయలుదేరారు. నదీనదాలూ, అడవులూ అనేక రాజ్యాలు చూసుకుంటూ ఆకాశ మార్గాన వెళ్ళారు. కొంతసేపటికి దండకారణ్యం మధ్యన ఒక అరటి తోటలో రాముడి ఆశ్రమాన్ని చూశారు.

రావణుడు రథం దిగి మారీచుడి చెయ్యి పట్టుకొని "అదిగో! అదే- రాముడి ఆశ్రమం కనిపిస్తూంది కదా. మన ఆలోచన ప్రకారం అంతా చేస్తావుకదా?" అన్నాడు.

వెంటనే మారీచుడు లేడిరూపు ధరించాడు.

ఆ లేడి అందమే అందం! దాని ప్రతి అంగమూ విచిత్ర సౌందర్యంతో వెలుగొందుతూంది. వాన వెలిసింతరువాత ఆకాశంలో కనిపించే హరివిల్లులో ఎన్ని రంగులుంటాయో అన్ని రంగులతోనూ ఆ లేడి నయనానందకరంగా తయారయింది. వెండి, బంగారం, వజ్ర వైఢూర్యాది రత్నాలు పూవుల్లాగా దాని శరీరం రంగులు మారుతూ కనిపిస్తూంది. మణులు పొదిగిన బంగారు ప్రతిమకు ప్రాణం వచ్చినట్లు పరుగులు పెట్టింది. లోకంలో కని విని ఎరుగని అందంతో ఆ మాయలేడి ఆశ్రమ ప్రాంతంలో అటు ఇటు తిరగసాగింది. పడి, లేచి, ఎగిరి గంతులు వేసింది. కొంతసేపు లేగరిక కొరుకుతుంది. ఒకప్పుడు తల పైకెత్తి చిగురు జొంపాలను అందుకుంటుంది. మరొకప్పుడు ఆశ్రమం దగ్గరకు పోయి వయ్యారంగా నడుస్తుంది. హఠాత్తుగా ఒక్క గెంతు గెంతి దూరంగా పారిపోతుంది. ఒకప్పుడు లేళ్ల గుంపులతో చేరి నడుస్తుంది. మరొకప్పుడు ఒంటిరిగా తిరుగుతుంది. మిగతా లేళ్లు దాన్ని మూచూసి సందేహించి దూరంగా పోతాయి.

సీత ఆ సమయానికే అడవిలో పూవులు కోస్తూంది. ఈ లేడిని చూసి 'ఆహా! ఏమి అందం!' అని రెప్పవాల్చక అలాగే చూస్తూ నిలబడింది. లేడి కూడా ఆమెను చూసి ఆమె ముందు అటూ ఇటూ పరుగులు పెట్టింది. దాంతో ఆ వనానికే కొత్త అందం వచ్చినట్లు అయింది.

* * *

"త్వరగా రావాలి! త్వరగా రావాలి!" అని సీత, రామ లక్ష్మణులను పిలిచింది. తాను చూసిన జింకను వారికి చూపాలని ఆమె కోరిక.

"త్వరగా రండి! రండి" అని తిరిగి పిలిచింది.

వారుకూడా వచ్చి ఆ వింతలేడిని చూసి ఆశ్చర్యపోయారు.

లక్ష్మణుడికి సందేహం కలిగింది. ఇది జింక కాదు, మారీచుడు అని వెంటనే అతడికి తోచింది. అంతకు ముందు మారీచుడు లేడిరూపు ధరించి అడవిలో వేటకు వచ్చిన ఎందరినో మోసగించి తింటూ ఉండే వాడన్న సంగతి రామలక్ష్మణు లెరుగుదురు.

"ఇలాంటి లేడి సృష్టిలో లేదు. ఇది రాక్షస మాయ" అన్నాడు లక్ష్మణుడు.

"ఈ జింకను పట్టుకురండి. దీన్ని ఆశ్రమంలో కట్టి పెంచు దాం. నేను అడవిలో చూసిన జింకలలోకల్లా ఇది చాలా అందంగా ఉంది. అబ్బ! దాన్ని చూడండి. ఏమి రంగు! ఏమి ఆటలు! దీనికి సాటి ఏదీ లేదు!" అని సీత ఆ లేడిని చూసి అమిత ప్రలోభానికి లోబడి దాన్నిగురించే మాట్లాడ్డం మొదలుపెట్టింది. దాన్ని ఎలాగైనా పట్టి తెమ్మని బతిమలాడింది.

"మనం అయోధ్యకు తిరిగి పోవలసిన రోజులు దగ్గరకు వస్తున్నాయి. దీన్ని మనతో తీసుకుపోదాం. అడవిలోంచి ఏదో ఒక విచిత్రవస్తువును మన అంతఃపురానికి తీసుకుపోవాలికదా? ఈ లేడిని చూస్తే భరతుడు చాలా సరదా పడతాడు. దీన్ని అతడికే ఇద్దాం.

ఎలా అయినాసరే దీన్ని పట్టుకురండి !" అని రాముణ్ణి పరిపరివిధాల ప్రాధేయపడింది.

లక్ష్మణుడు ఇది పట్టించుకున్నట్లు కనిపించలేదు. అందుకని సీత రాముణ్ణి ఇంకా ఎక్కువగా నిర్బంధించసాగింది. మనస్సులో గట్టి ఆశ పుట్టింతర్వాత దాన్ని కాదనేవారు ఎంత బంధుమిత్రులయినా, ఎంతటి ప్రేమపాత్రులయినా వాళ్ళ మీద కోపం వస్తుంది. ఈ విషయాన్ని కృష్ణభగవానుడు గీతలో చాలా చక్కగా చెప్పాడు. అది సీతలో స్పష్టంగా కనిపిస్తూంది.

* * *

"అదిగో ! ఆ లేడి ఒళ్ళంతా బంగారమే. వెండే. చూడండి. దాన్ని పట్టుకోడానికి వీలుకాకపోతే బాణంతో కొట్టి చర్మాన్ని అయినా అయోధ్యకు తీసుకుపోదాం. ఇలాంటి విచిత్రమైన చర్మం మళ్ళీ మనకు దొరుకుతుందా ? పరుచుకుని కూర్చోడానికి ఎంత బాగుంటుంది ? వెళ్ళిపోతుందేమో ! త్వరగా పోయి పట్టుకురండి. లేడి దొరకకపోతే కనీసం దాని చర్మాన్నయినా నాకు తప్పకుండా తెచ్చి పెట్టాలి" అంది సీత.

"అబ్బ ! దాని కొమ్ములు చూడండి ! ఇలా అడుగుతున్నానని కోపం వద్దు. నాకు దానిమీద అంత మక్కువ పుట్టింది. ఇంతకీ దాన్ని తెచ్చి ఇస్తారా ? లేదా ?" అని ఊపిరిసలపకుండా రాముణ్ణి వేధించింది.

"దాని మచ్చలు చూడండీ ! చుక్కల్లా ఎలా మెరుస్తున్నాయో !" అంది.

ఇలా సీత ప్రాధేయపడడం చూసి రాము డొక నిశ్చయానికి వచ్చాడు. 'లక్ష్మణుడు చెప్పిందానిలో వాస్తవం ఉండవచ్చు. ఇది రాక్షస మాయే కావచ్చు. అయితేనేం ? రాక్షసుణ్ణి చంపడం మంచిదే కదా ? భయ మెందుకు ? పట్టడానికి వీలుకాని పక్షంలో బాణంవేసి జింకను చంపి చర్మం ఒలిచి సీతకు ఇవ్వవచ్చుగా ? ఆవిడ ఇంతలా మోజుపడి అడిగే వస్తువును తెచ్చి ఇవ్వకపోతే ఎలా ?' అని రాముడు అనుకున్నాడు. లక్ష్మణుడికి సమాధానం చెప్పి విల్లమ్ములు తెమ్మన్నాడు.

లక్ష్మణుడికి ఇది సుతరామూ ఇష్టంలేదు. అయినా రాముడు విల్లమ్ములు తీసుకుని జింకను వెంబడించి వెళ్లాడు.

"లక్ష్మణా! జాగర్త ! సీతను కనిపెట్టి ఉండు. జింకను చంపి త్వరలోనే వస్తాను. అనవసరంగా చింతించకు. అది రాక్షసమాయ అయితేనేం ? వాతాపికి పటిన గతే ఈ రాక్షసుడికి కూడా పడుతుంది. రాక్షసుడు మోసం చేయడానికే వస్తే నేనుకూడా అగస్త్య మహర్షి లాగ ఆ మోసగాణ్ని ఆ మోసానికే బలిచేస్తాను. ఈ జింక నన్నేం చేస్తుంది ? జింక అయినా సరే, రాక్షసుడైనా సరే" అని చెప్పి రాముడు బయలుదేరాడు.

"జాగర్త సీతను కనిపెట్టి ఉండు. ఏ సమయాన ఏం జరుగుతుందో ! చాలా జాగర్తగా ఉండు. అలక్ష్యంగా మాత్రం ఉండకు !" అని రాముడు బయలుదేరేముందు మరీ మరీ చెప్పాడు.

విధి అన్ని విధాలా విపత్తుకు దారిచేసి ఉంచింది. లక్ష్మణుడు సాధారణంగా తొందరపాటు మనిషి. అయినా ఈ సమయంలో అతడికి సందేహం కలిగి హెచ్చరిక చేశాడు. ఎప్పుడూ అతిజాగర్తగా ఉండే రామచంద్రుడు, ఇప్పుడు సీత కోరిన చిన్న కోరికను కూడా ఎందుకు తీర్చకూడదని లక్ష్మణుడి మాట లక్ష్యపెట్టక జింకను వెంబడించాడు.

* * *

మారీచుడు రావణుడికి కావలసినంత అవకాశమూ, వ్యవధీ కల్పించడంకోసం రాముడికి చేజిక్కినట్లే కనిపిస్తూ విధి మానవుణ్ని ఈడ్చుకు పోయినట్లు చాలాదూరం తీసుకుపోయాడు.

మాయలేడి మెల మెలగా కాళ్లెత్తి వేసుంది. పరుగు ఆపి అక్కడక్కడ గరిక మేస్తుంది. చెవులు నిక్కించి నాల్గుగిట్టలనూ రొమ్ముకు చేర్చి చెంగున గెంతుతుంది. ఒక్కదాటుగా వాయువేగాన పరుగెత్తి అడవిలో దాక్కుంటుంది.

ఉ॥ నేలను నిల్చి జింక మెడ నిక్కి జివుక్కున దాటు నింగికిన్
లీలను నేల ద్రవ్వు ఖురళించిన తీరున దూకు డాయు బెన్

గాలి మనంబు వేగిరముగా జను రీతికి గ్రొత్త మార్గ మ
వ్వేళను నేర్ప బాదములు పేరురమున్ దగులంగ బర్విడున్.

దాక్కున్నట్లే కొంత సేపుండి తటాలున ఒక ఎత్తయిన చోట నిలిచి తన అందాన్ని చూడమంటుంది. ఆకాశంలోని మబ్బులతో కలిసి దర్శనమిస్తుంది. చేజిక్కినంత దగ్గరగా నిలుస్తుంది. దగ్గరకు చేరగానే చెంగున గెంతి దూరంగా పారిపోతుంది. నిలబడినట్లుంటుంది. అంతలో మాయమై పోతుంది.

తే॥ కొండ లెక్క మేఘుంబుల గ్రుంకు వెంట
జేర దూర మేగును తామసింప డాయు
నిలిచి యున్నట్టి కనబడి తొలగిపోవు
పైడియాస వేశ్యల మది పారునట్లు.

మారీచుడికూడా మరణం సమీపించినట్లు తోచింది. అప్పుడే రాముడు ఇక వెంబడించడం చాలును అని విల్లు వంచి బాణం విడిచాడు. మారీచుడు "హా సీతా ! హా లక్ష్మణా!" అని రాముడి గొంతుతో గట్టిగా అరచి మరణించాడు. మరణ సమయంలో అతడికి నిజరూపం వచ్చేసింది. కొండలాంటి మారీచుడు నెత్తురులో మునిగి నేలను దొర్లి దొర్లి ప్రాణాలు విడిచాడు.

లక్ష్మణుడే మాటే నిజమయింది అనుకున్నాడు, రాముడు. రాక్షసుడి మోసాన్ని కళ్ళారా చూశాడు.

ఈ కేకలను విని సీత ఏమైమో అనుకుని భయపడుతుందేమో అనుకున్నాడు.

"అయినా ఫరవాలేదు. లక్ష్మణుడు తోడున్నాడు కదా !" అని మళ్లీ సమాధాన పరచుకున్నాడు.

తే॥ నిక్కువపు రూపమున సోకు నీల్గి గాంచి
తమ్ము దలచి యాతడు జాణతారకముగ
వెంటవచ్చు నతడు ప్రోడ వేయునేల
ప్రాణసముడు నేర్పరి యని హర్షమందె.

"నా తమ్ముడు ఎలాంటి వాడు? ఈ అడవిలో నా కెంత చక్కని తోడు!" అని రాముడు తన తమ్ముణ్ణి తలచుకొని మనస్సులోనే పొగడుకొన్నాడు. మరుక్షణంలో తమ్ముడికి ఏం జరుగమందో, అతడి చెవులు ములుకుల్లాంటి ఏ మాటలు వినవలసి ఉందో రాముడికి తెలియదు. విధి విలాసం అంటే ఇదే!

50. జటాయువు పరాక్రమం

"హా సీతా ! హా లక్ష్మణా !"అని మారీచుడు విలపించడం విన్న సీత అది రాముడి కేకేనని అనుకుంది. సుడిగాలిలో చిక్కుకొన్న చెట్టులాగ ఆమె అల్లలాడి పోయింది. "లక్ష్మణా! అదిగో! అన్న గొంతు తెలియడం లేదూ? వెళ్ళు, పరుగెత్తుకు వెళ్ళు. లే పరుగెత్తు!" అంది.

సీతకు దిగులెక్కువైంది. లక్ష్మణుణ్ణి చూసి "ఆత్రంగా నాథుడి కంఠం విన వస్తూందే ! అయ్యో నా ప్రాణాలు నిలవవు. నే నింక బతకను. పో! పో! ఇంకా చూస్తావేం !" అని దుర్భర దుఃఖంతో భయంతో కేకలు పెట్టింది, సీత.

"రాముడు అడవిలో ఏదో అపాయంలో చిక్కుకున్నాడు. విన బడలేదా ? ఇంకా ఇక్కడే నిలబడి చూస్తున్నావా ?" అని లక్ష్మణుణ్ణి అదలించింది.

లక్ష్మణుడికి రాక్షసుల మాయ తెలుసు. అన్నగారి ఆజ్ఞ గుర్తుంది. అందుకని కదలకుండా అలాగే నిలబడ్డాడు.

అప్పుడు జానకికి పట్టలేని కోపం వచ్చింది. రెండు చేతులతోనూ రొమ్ము బాదుకుంటూ "సుమిత్ర పుత్రా ! ఇప్పటికి శత్రువు వైనావా? ఇన్ని రోజులనుంచీ వేషం వేశావా ? రాముడు ఎన్నడు మరణిస్తాడా అని ఇన్నాళ్ళనుంచీ కాచుకుని కూర్చున్నావా ? అతడు మరణించిం తర్వాత నన్ను చేపట్టాలన్న దురుద్దేశంతో ఇన్నాళ్ళ నుంచీ మమ్మల్ని వంచించావా? దుష్టుడా! దుర్మార్గుడా ! రాముడు పెట్టిన కేకను విని కూడా కదలకుండా ఇక్కడే నిలబడ్డావా? అన్న

మీద నీవు చూపే అనురాగం అంతా పచ్చి మోసమేనా? దుర్మార్గుడా!" అని నిందించింది.

లక్ష్మణుడు చెవులు మూసుకున్నాడు.

దుఃఖంతో కొట్టు మిట్టాడుతూ కన్నీటి జడితో వళ్లంతా తడవగా మతిపోయిన సీత ఇలా మాట్లాడడం విని లక్ష్మణుడామెకు మెల్లగా నచ్చజెప్పజూశాడు.

"వదినా! నీ భర్త దేవాసుర మానవులలో ఎవరెదిరించినా వారిని మట్టుపెట్టి తిరిగి రాగలడు. అందులో సందేహం లేదు భయపడకు తల్లీ! బుద్ధిని స్వాధీనానికి తెచ్చుకో! అనవసరంగా భయపడకు. మన రాముణ్ని రాక్షసులు కాని, మృగాలు కాని, పక్షులు కాని, పిశాచాలు కాని గంధర్వులు కాని, దేవతలు కాని, రాజులు కాని తాకలేరు. నీవు ఇలా మాట్లాడటం తగదు. తల్లీ! రాముడి బలం నాకు తెలుసు. ముల్లోకాల్లో ఏవరు వచ్చి ఎదిరించినా రాముడిదే విజయం. నీవు చింతింపవద్దు. నీ నాథుడు ఆ జింకను చంపి కొద్ది సేపటిలోనే తీసుకు వస్తాడు. నీవే చూస్తావుగా. ఇది ఆయన గొంతు కాదు. ఇది రాక్షస మాయ. భ్రమకు చిక్కి నీవు దుఃఖించవద్దు. నిన్ను అన్న నాకు అప్పజెప్పి వెళ్ళాడు. నిన్ను ఒంటరిగా విడిచిపెట్టి, నన్ను పొమ్మనడం మంచిది కాదు. అన్న ఆజ్ఞను నేను మీరరాదు ఇది రాముడు వేసిన కేక కాదు. నీకు భయ మేమాత్రమూ అవసరంలేదు" అన్నాడు.

ఇలా లక్ష్మణుడు చెప్పగానే సీత కన్నులు కోపంతో ఎరుపెక్కాయి. ఆమె అనరాని మాటలతో లక్ష్మణుణ్ని ఆడిపోసింది.

"అన్న ఆజ్ఞ అంటూ సాకు చెప్పి అన్న ఆపదలో చిక్కుకుని అరచినా వెళ్ళకుండా ఆయన చావాలని చూస్తున్నావా? ఆహా! రాముడూ నేనూ నిన్ను నమ్మి ఎంత మోసపోయాం! నీచుడా! దుష్టుడా! రాముడికి కీడెంచుతున్న వంచకుడా! రాముడికి ఆపద వచ్చిందని ఆనందిస్తున్నావా? మోసగించాలని చూస్తున్నావా? నీవు రాముడితో అడవికి ఎందుకువచ్చావో ఇప్పుడు తెలిసిందిలే. ఓరీ పాపీ! ఇది భరతుడి ప్రోత్సాహమా? అందరూ నా నాథుడికి శత్రువులై పోయారా? రాముడితో కాపురం చేసిన నేను మిమ్ము కన్నెత్తి

అయినా చూడగలనా? రాముడు మరణించిం తర్వాత ఒక్క నిమిషం కూడా ప్రాణాలతో ఉండను. బాగా గుర్తుంచుకో!'' అంది.

ములుకుల్లాంటి ఈ మాటలు విన్న లక్ష్మణుడు రెండు చేతులూ జోడించాడు. తల్లీ, జనకపుత్రీ! నీవు నా దైవానివి. ఇలాంటి మాటలు నీ నోట రావచ్చునా? ఈ మాటలు కరిగించిన ఇనుములాగా నా చెవులకు సోకుతున్నాయి. నీవు తలంచే పద్ధతి నీతికాదు. న్యాయం కాదు. దేవతల సాక్షిగా, వనదేవతల సాక్షిగా చెపుతున్నాను. నన్నే సందేహించావే. ఆహా! ఆడవారిలోని గుణహీనత అంతా నేడు నీలో చూస్తున్నాను. నాకు పాపపు తలంపు అంటగట్టావు. అరెరే! నీ కేదో చెడుకాలం వచ్చిందని తలుస్తున్నాను. నీ కేదో పెద్ద కీడు మూడనుంది. అందులో సందేహం లేదు'' అన్నాడు, అమాయక లక్ష్మణుడు. భయంతో అతడి శరీరం కంపింది.

"ఇవిగో ఎండు కట్టెలు. తిచి రగిల్చి అందులో దూకుతాను. గోదావరిలో పడి ప్రాణాలు విడుస్తాను. కొండల మీది నుంచి కిందికి దూకి మరణిస్తాను. విషం తాగి చస్తాను. ఏమనుకుంటున్నావో: రాముడు కేకలు వేసిన చోటికి వెంటనే పోతావా పోవా?" అని సీత అడిగింది.

ఇలా చెప్పి చేతులతో రొమ్ము మోదుకొంటూ శోకాలు తీసింది. అది లక్ష్మణుడు చూడలేక పోయాడు. చేతులు జోడించి నమస్కరించాడు. "వదినా సరే. నీవు చెప్పినట్లే చేస్తాను. అన్న ఆజ్ఞను మీరి నిన్నొంటరిగా విడిచిపెట్టి వెళుతున్నాను. నీకు మంగళ మగుగాక: దేవతలు నిన్ను కాపాడుదురు గాక! నీవు చెప్పినట్లే వెళుతున్నాను. అయ్యో! దుర్నిమిత్తాలు కానవస్తున్నాయి. భయం భయంగా ఉంది. నేను వచ్చి మళ్ళా నిన్ను రాముడితో చూడగలనా? ఏమో సందేహంగానే ఉంది. అయినా ఇదుగో వెళుతున్నాను'' అని లక్ష్మణుడు బయలుదేరాడు.

వెనకకు తిరిగి తిరిగి చూస్తూ వెళ్ళడానికి మనస్సు ఒప్పక ఎలాగో వెళ్ళాడు.

కోపముతో దుఃఖంతో లక్ష్మణుడి మనస్సు క్షోభించింది. సీత ఆడిన దారుణమైన మాటలు అత డెలా సహించ గలడు? అన్నింటినీ త్యాగం చేసి అన్నతో అడవికి వచ్చిన రాజకుమారుడి మనస్సును ఆ మాటలు గాయం చేశాయి.

రాముడు వెళ్ళిందారినే లక్ష్మణుడు కూడా వెళ్లాడు. అదనుకోసమే కాచుకుని ఉన్న రావణుడు కాషాయ వస్త్రాలు ధరించి ఉనికీ మనికీ లేక దేశాటనం చేసే సన్యాసి వేషం వేసుకుని మనస్సులో కుతంత్రాలు, నోటితో వేదమంత్రాలు వల్లె వేస్తూ రాముడి ఆశ్రమానికి వెళ్లాడు.

పర్ణశాల వాకిట మైదేహి ఒంటరిగా నిలబడి ఉంది. రాముడి రాకకోసం అడవివైపు చూస్తూ ఉంది. రావణుడు సీతను చూశాడు.

శూర్పణఖ అతడి మనస్సులో కల్పించిన ఆశ ఆ చూపుతో పెంపొంది పూర్తిరూపం ధరించింది. ఎలాగైనాసరే, ఆమెను చెట్టపట్టాలని ఆ నీచుడు నిశ్చయించు కున్నాడు.

* * *

కాషాయాంబరాలు ధరించి దండ కమండలాలు చేతపట్టి ఒక సన్యాసి ఆశ్రమం ముంగిట నిలవడం చూసి సీత అతడికి విధివిహితంగా స్వాగత మిచ్చింది. చాప వేసి, కందమూల ఫలాలను ఎదుట పెట్టింది. ఆ కాలంలో మీరరాని ఆచారం ఇది.

సన్యాసి కూచుని సీతను చూశాడు. అతడి ఆశ ఆకులు తొడిగి అల్లి బిల్లిగా అల్లుకుంది.

రావణుడు సీతపై ఆశ పడాడు అంటే అది కేవలం పశువాంఛ తీర్చుకోడానికి మాత్రమే కాదు. అతడు పాపి కావచ్చు, పచ్చిమాంసం తినే రాక్షసకులజుడు కావచ్చు. కాని, సీత ప్రేమను సంపాదించి ఆమెను తన భార్యగా చేసుకుని ఉత్తమ సుఖం అనుభవించడమే అతని ఉద్దేశం. ఆమె అంగీకారం పొందాలని అతడి ఆశ. వనవాస క్లేశం అనుభవిస్తున్న పేద రాముణ్ని విడిచిపెట్టి అపార శక్తి సంపదలు బడసిన తనవద్దకు సంతోషంగా వస్తుందని అతడి నమ్మకం. అలాచేస్తే అదే రాముడికి

తగిన శిక్ష అని అతడనుకున్నాడు. సీతకూడా తాను చూసిన ఇతర స్త్రీల వంటిదేనని అతడు భావించాడు.

* * *

వి స్తరి ముందు కూర్చుని ఆ సన్యాసి జంకూ గొంకూ లేకుండా సీత సౌందర్యాన్ని పొగిడాడు.

"ఎవతెవు నీవు ? క్రూర మృగాలూ, రాక్షసులూ నిండిన ఈ భయంకరాటవిలో ఒంటరిగా ఉన్నావు? అని ప్రశ్నించాడు.

సీత ఆచారానుసారం ఆ సన్యాసికి ఉపచారాలు చేస్తూనే అడిగిన ప్రశ్నలకు జవాబు చెబుతూంది. రాజకుమారులు ఇంకా రావడం లేదేమా అని ఒక కంట ద్వారం వంక చూస్తూనే వుంది.

రావణుడు తా నెవరైందీ మెల్ల మెల్లగా చెప్పదొడగాడు. తన కులం ఘనతను చెప్పాడు. తన శక్తినీ తన ఐశ్వర్యాన్నీ వర్ణించాడు. తన ప్రతాపాన్ని పొగడి రామున్నో కొంచపరుస్తూ మాట్లాడాడు.

"నన్ను పతిగా చేపట్టు. లంకలో సుఖంగా ఉందాం. రా పోదాం" అని తన ప్రసంగాన్ని ముగించాడు.

తలవని తలంపుగా తారసిల్లిన ఈ సంకట స్థితిని చూసి సీత తన పాతివ్రత్య శక్తితో ధైర్యం పొందింది. ఆ రాక్షసుణ్ణి లక్ష్యపెట్టక "నీచుడా ! దుష్టుడా ! నీకు వినాశకాలం దాపురించింది. నీ తల పగులుతుంది. తొలగిపో! ప్రాణాలు దక్కించుకుని ఆశ్రమం విడిచిపో" అని కసిరికొట్టింది.

రావణుడికి చాలా కోపం వచ్చింది. మారువేషాన్ని తీసివేసి నిజ రూపాన్ని ధరించాడు. ఒకచేత ఆమె కొప్పు ఒడిసిపట్టుకొని మరొక చేతితో ఎత్తుకుని అడవిలోకి పరుగెత్తాడు. అక్కడ సిద్ధంగా ఉన్న రథం ఎక్కి ఆకాశ మార్గాన బయలు దేరాడు.

"హా నాథా! రామా ! ఎక్కడికి పోయావు ? లక్ష్మణా ! మొండిపట్టు పట్టి నిన్ను తరిమి వేశానే !" అని ఎలుగెత్తి శోకించింది, సీత. రావణు డామెను కదలకుండా పొదివి పట్టుకొని రథాన్ని వేగంగా

నడిపాడు. కిందనున్న చెట్టుచామలను చూసి "రాముడితో చెప్పండి" అని పిలిచి పిలిచి చెప్పింది, సీత.

అప్పుడొక చెట్టుమీద మాగన్నుగా కూర్చున్న జటాయువు వేగంగా పోతున్న ఆ రథాన్ని చూశాడు. సీత గొంతు విని ఎవరో తెలుసుకున్నాడు. సీతాదేవి కూడా జటాయువును చూసింది.

"నీవేం చేయగలవు పక్షిరాజా! ఈ క్రూర రాక్షసుడు సకలాయుధాలతో ఉన్నాడు. నీ వెదిరిస్తే నిన్ను చంపివేస్తాడు. నన్ను నీవు విడిపించలేవు. కనీసం ఈ విషయాన్ని రాముడికి చెప్పు. చాలు" అని విలపించింది, సీత.

* * *

జటాయువు రథంమీద ఉన్న రావణుణ్ణి చూశాడు. "లంకేశ్వరా! నేను జటాయువును. గద్దలకు రాజును. నీ వలె నేను కూడా చాలాకాలం రాజుగా బతికిన వాడనే. తమ్ముడూ! తగని పని చేయకు, ఆగు. రాజువని చెప్పుకునే నీవు ఇలాటి పని చేయవచ్చా? స్త్రీలను రక్షించడం కదా రాజుల కర్తవ్యం. అందులోను రాచపడుచుని ఇలా చేయవచ్చా? నశించి పోతావు. జాగర్త. వెంటనే ఈమెను విడిచి తిరిగిపో! ఆమె కోపదృష్టికి నీవు మాడి మరణిస్తావు. ఆమె ఎవరనుకున్నావు? విష భుజంగాన్ని ఒడిలో పెట్టుకోకు. కాలపాశం నీ మెడకు తగిలి ఈడ్చుకొని పోవడానికి సిద్ధంగా ఉన్న సంగతి నీవు గుర్తించడం లేదు. దుర్మార్గాన్ని చేపట్టకు. భరింపరాని భారాన్ని మోసుకొని పోవాలని చూడకు. విషం తాగి బతకాలని భావించకు. నేను ముసలివాడను. నీవు యువకుడవు. కవచం ధరించావు. నీకు రథ ముంది. విలుంది. అయినా నేను చూస్తూ ఉండగా వై దేహిని ఎత్తుకు పోనివ్వను. రాముడు లేని సమయం చూసి సీతను ఎత్తుకుని పోతున్నావా? రాముడిపై నీకు కోపం ఉంటే ఎదుటపడి యుద్ధం చెయ్యి. నీ కాపాటి ధైర్యం లేదని నాకు తెలుసు. బెదురుపోతా! ఇదిగో నేనున్నాను. దిగి, నాతో రా. నా కంఠంలో ప్రాణం వుండగా నీవు రాముడి భార్యను ఎత్తుకు పోవడానికి వీల్లేదు. రథంమీద ఉన్నానుకదా తప్పించుకుందా మనుకొంటున్నావేమో!

చూడు, నీ తలలు తాటికాయల్లా నేలమీద దొర్లుతాయి. పారిపోకు. ఆగు !'' అన్నాడు.

* * *

ఆ మాటలు వినగానే రావణుడికి కోపం వచ్చింది. జటాయువుపై దెబ్బవేశాడు.

పెనుగాలికీ మబ్బు తెరలకూ జరిగిన యుద్ధంవలె ఆ వనంలో వారిద్దరికీ పోరు జరిగింది. జటాయువు రెక్కలుగల పర్వతంలాగ కడు రోషంతో పోరు సలిపాడు. రావణుడు వాడిబాణాలు వేశాడు. జటాయువు ఆ బాణాలను రెక్క లదలించి దులిపి వేశాడు. రావణుడు మహా కోపంతో సర్పాలవంటి వాడిబాణాలను పక్షీంద్రుడిపై ప్రయోగించాడు.

జటాయువు ఆ బాణాల తాకిడికి చాల బాధ పడ్డాడు. రథం మీద ఉన్న సీతను చూశాడు. నీరు నిండిన ఆమె కళ్ళు చూశాడు. ఆ దృశ్యాన్ని ఇంక చూడలేక పోయాడు. ఒక్క ఉదుటున ఎగిరి రావణుణ్ణి చరచాడు. తనకు తగిలిన పెనుగాయాలను కాని, రావణుడి బాణాలను కాని లెక్కచేయకుండా ఎదురుదాడి చేశాడు. రెక్కలతో రావణుడి కిరీటాన్ని పడగొట్టాడు. అతడి చేతి విల్లును విరిచాడు.

రావణుడు ఈ అవమానాన్ని సహించలేకపోయాడు. అతడి కోపం మిన్నుముట్టింది. వెంటనే ఇంకొక విల్లందుకుని శరవర్షం కురిపించాడు. పక్షీరాజు తన రెక్కలతో ఆ బాణాలను విదిలించి రావణుడి రెండవ విల్లును కూడా విరిచి వేశాడు.

రథంమీద పడి పిశాచ ముఖాలుగల కంచర గాడిదలను, సారథిని చంపాడు. రథాన్ని తుత్తునియలు చేశాడు. రావణుడు సీతను పొదివి పట్టుకొని నేలపై పడ్డాడు. రథం విరిగి, సారథి చచ్చి రావణుడు నేలపడగానే పంచభూతాలూ "భళి భళి'' అని పక్షిరాజును మెచ్చుకున్నాయి.

అసలే ముసలితనం అందులో ఘోరయుద్ధం. ఒంటినిండా గాయాలు. దీనివల్ల జటాయువు నీరసించిపోయాడు. ఒక్కనిముషం

అలసట తీర్చుకోడానికి నిలబడ్డాడు. రావణుడు ఇదే అదననుకొని సీతను ఎత్తుకొని ఆకాశాన ఎగిరి పోవాలని చూశాడు. కాని వెంటనే పక్షి రాజు రావణుణ్ణి చరచి "రాక్షసుడా! దొంగలాగా పారిపోవాలనుకుంటున్నావా? నీచా ! నీ నాశనం నిశ్చయం. నిలబడి యుద్ధం చేయి. యుద్ధంలో నీ తమ్ముడు ఖరుడికి పట్టిన గతే ఇప్పుడు నీకు కూడా పడుతుంది. పిరికి పందలాగా దొంగలాగా తప్పించుకుని పారిపోవాలని చూడకు" అని రావణుడి వీపుమీదికి ఉరికాడు. కాలిగోళ్ళతోనూ, వాడి అయిన ముక్కుతోనూ, పొడిచి, చీల్చి రావణుడి శరీరమంతా గాయాలు చేశాడు.

రావణు డాబాధ భరించ లేకపోయాడు. ఒక చేత సీతను గట్టిగా పొదివి పట్టుకొని మీపున నున్న జటాయువును చేతులతో కొట్టి తరిమివేయాలని చూశాడు. సీతను పొదివిపట్టిన చేతులను పక్షిరాజు ముక్కుతో ఊడ పొడిచాడు. కాని వెనువెంటనే పుట్టలోని పాము వలె కొ త్తచేతులు పట్టుకొని వచ్చాయి. ఆఖరికి రావణుడు తట్టుకోలేక పోయాడు. సీతను విడిచిపెట్టి తన అన్నిచేతులతోనూ జటాయువును కొట్టాడు. కాళ్ళతో బలంగా తన్నాడు.

ఇలాగ యుద్ధం చాలాసేపు జరిగింది. వీరుడైన జటాయువు చాలా అలసిపోయాడు. రావణుడు తన చంద్రహాసాన్ని దూసి జటాయువు రెక్కలను కాళ్ళను నిర్దాక్షిణ్యంగా తరిగివేశాడు. జటాయువు ఇంక చేసేది లేక కొనప్రాణాలతో నేల కూలాడు.

జానకి పరుగునపోయి నేలనుకూలిన జటాయువును పట్టుకొని బిట్టుగా శోకించింది. "నా కోసం ప్రాణాలు వదిలావా నా తండ్రీ ! నా నాథుడికి రెండవ తండ్రిగా కనిపించావు. ఇప్పుడు మరణించావా తండ్రీ" అని విలపించింది.

అతి పరాక్రమంతో యుద్ధంచేసి ఆరిన కారుచిచ్చు వలె నేలను పడి ఉన్న పక్షిరాజును చూసి రావణుడు సంతృప్తి పడ్డాడు. సీత జటాయువును పట్టుకుని "చనిపోయిన నా మామ దశరథుడు తిరిగి లేచి వచ్చిన్నట్లుగానే యుద్ధం చేశావు తండ్రీ !" అని శోకించింది.

రాక్షసరాజు సీతను పట్టుకోడానికి వెళ్లాడు. ఆమె అయ్యో అని శోకిస్తూ ఇటూఅటూ దిక్కులేనిదానివలె పరుగులు పెట్టింది. అక్కడి చెట్టుచేమలను పట్టుకొని "నాథా! ఎక్కడున్నారు? లక్ష్మణా! ఎక్కడున్నావు? పరుగున రండి!" అని విలపించింది. రాక్షసరాజు ఆమెను బలాత్కారంగా పట్టుకొని మళ్ళీ ఆకాశమార్గాన బయలు దేరాడు.

రాక్షసరాజు ఆమెను పొదివి పట్టుకొని ఎగిరి పోతూ ఉంటే సీత కారుమబ్బులో మెరుపు తీగెలాగ ప్రకాశించింది. కారుచిచ్చు రగిలిన పర్వతం వలె కనిపించాడు, రావణుడు. కుబేరుడి తమ్ముడైన రావణుడు ఆకాశంలో వేగంగా ఎగురుతున్నప్పుడు సీత దేహకాంతి వల్ల ఒక తోక చుక్కలాగ కనిపించాడు.

* * *

ఇలాగ ఆ రాక్షసుడు జానకిని అపహరించాడు. అప్పుడు సూర్యుడు తన కాంతిని విసర్జించాడు. అంతా కారుచీకటి కమ్మకుంది. పంచభూతాలూ విలపించాయి.

"ధర్మం నశించింది. సత్యం మరుగైంది. నీతి, దయ, కరుణ, అన్నీ నశించాయి" అని సకల భూతాలూ రోదించాయి.

నేలపై నుండి చూస్తున్న మూగ జీవాలు కూడా గుడ్లనీరు కుక్కుకున్నాయి.

కటికగుండెల రావణుడు సీతాదేవిని పట్టుకుని ఆకాశ మార్గాన తన సర్వనాశనం దిక్కుగా వెళ్ళాడు. సీత తురుముకున్న పూలరేకులు చెదిరి పడ్డాయి. రావణుడి సంపదలన్నీ ఇలాగే చెల్లా చెదరవుతాయన్నట్లుంది అది.

51. చెర

కోపంతో, దుఃఖంతో సీతాదేవి కళ్ళు ఎర్రబడ్డాయి. క్రోధ దృష్టులతో ఆ రాక్షసుణ్ని చూసి ధైర్యంగా మాట్లాడింది.

"నీచుడా! నీ పేరుప్రతిష్ఠలూ, కులగోత్రాలూ, ప్రతాప పరాక్రమాలూ, గొప్పగా పొగుడుకుంటూ మహా శూరుడులాగ వేషం వేసుకున్నావా? సిగ్గులేదా నీకు? పక్కన తోడెవరూ లేని సమయం చూసి ఒక అబలను అపహరించి పరుగెత్తిన శూరుడవు! చాలా గొప్ప వీరుడవులే! రాముడు లేని సమయం చూసి సిగ్గులేకుండా ఘనకార్యం చేశాననుకుంటున్నావు కాబోలు!

నన్ను కాపాడజూసిన ముసలిపక్షిని చంపిన వీరుడవు! ఆశ్రమంలో నీవు పలికిన బీరాలేంటి? యుద్ధం చేయడానికి గుండెలు చాలక దొంగపని చేసిన నీ కీర్తిని లోకం ఎల్లప్పుడూ పొగడుతూనే ఉంటుంది! నీచుడా! నీవు గొప్పలు చెప్పుకున్న నీ బలానికి మాయని మచ్చ తెచ్చావు!

నీ వేం బావుకోబోతున్నావు? నన్నిలా అపహరించి పారిపోయి ఎన్నాళ్ళు బతికి పట్టం కట్టదలుచుకున్నావు? నా నాథుడి వింట వెడలిన బాణాలు నీ శరీరంలోబడి దూరి నీ ప్రాణాలను అతిత్వరలో అపహరించనున్నాయి. నీవు నా నాథుడి కంటబడితే చాలు, నీకు చావు మూడినట్లే. బతికి బైటపడ్డా ననుకుంటున్నావేమో? నీ చావు నిశ్చయం. నీ ఈ దుష్ప్రయత్నంవల్ల నీ కొరిగే మేలేంటి? నన్ను నీ వెన్నటికీ పొందలేవు. నేను ప్రాణాలనైనా విడుస్తాను కాని నీకు మాత్రం లొంగను. నా నాథుడు నిన్ను విడిచిపెట్టడు. ఆయన కోపాన్ని కొనితెచ్చుకున్న నీవు బతకడం కల. నీకు చావు తప్పదు. త్వరలోనే వైతరణీనదిని దాటి నరకానికి వెళ్ళబోతున్నావు. ఎర్రగా కాచిన ఉక్కు ప్రతిమ నీ కోసం సిద్ధంగా ఉంది. దాన్ని నీవు కౌగలింప బోతున్నావు. ఇనపముళ్ళ చెట్లు నీ కోసం నరకంలో ఉన్నాయి. జనస్థానంలో నీ పధ్నాలుగువేల సైన్యాన్ని రథం లేకుండా నిస్సహాయుడుగా క్షణకాలంలో వధించిన నా రాముడు నిన్ను విడిచిపెడతాడా? నిన్ను త్వరలోనే యమాలయానికి పంపుతాడు."

ఇలా సీత కోపతాపాలతో రావణుణ్ణి నిందించింది; హెచ్చరించింది. అయినా అవేవీ రావణుడి చెవి కెక్కలేదు. విల్లు నుంచి

డూసుకుపోయే బాణంలాగ రావణుడు ఆమెను పట్టుకొని ఆకాశ మార్గాన లంకకు ఎగిరిపోయాడు.

అలా అనేక కొండలూ, అడవులూ దాటి వెళుతున్నప్పుడు దారిలో ఒక కొండమీద కొందరు వానరులు నిలిచి ఉండడం సీత చూసింది. అప్పు డామె తన పైటచెంగులో తన నగలను మూటకట్టి కింద పడవేసింది. రాముడు తనకోసం వెతుకుతాడనీ తన జాడ ఆయనకు తెలియాలనీ అలా చేసింది. ఏడుస్తూ పోతున్న ఆమెను కింద కొండపై నున్న వానరులు చూశారు.

పంపానదినీ, సముద్రాన్నీ దాటి రావణుడు లంకలో ప్రవేశించాడు. శోకతప్త అయిన సీతతో తన అంతఃపురం ప్రవేసించాడు. స్త్రీ రూపంలో తన ప్రాణాలను అహరించడానికి వచ్చిన హంతకిని తోడ్కొని అంతఃపురంలో కాలుపెట్టాడు. సీతను చేపట్టగలిగానని ఆ మూర్ఖుడు అనుకున్నాడు.

పిశాచాలవంటి కొందరు రాక్షస స్త్రీలను పిలిచి "ఈమెకు కావలి ఉండి కడుమెలకువతో కనిపెట్టి ఉండాలి" అని ఆజ్ఞాపించాడు.

"నా అనుమతిలేందీ స్త్రీనికాని, పురుషుని కాని ఎవ్వరినీ ఈమె దరికి చేరనీయకండి" అని కఠినముగా కట్టడి చేశాడు.

"చీరెలు, నగలు, రత్న మాణిక్యాలు ఈమె ఏది కోరితే అది ఇచ్చి సంతోష పెట్టండి. నాకు చేసే మర్యాదలన్నీ ఈమెకూ జరగాలి" అని ఆజ్ఞాపించాడు.

ఈమె మనస్సు నొప్పిస్తూ ఎవరైనా మాట్లాడితే వారిని చంపేస్తాను. తెలిసి అయినా సరే తెలియక అయినా సరే ఆమెకు కష్టం కలిగించరాదు; కోపం తెప్పించరాదు. జాగర్త!" అని హెచ్చరించాడు.

సీతను అంతఃపురంలో ఒకచోట దింపి ఇంక ఏం చేయాలా అని ఆలోచించాడు. సమర్థులైన వేగులవాళ్ళని రప్పించి ఇలా ఆజ్ఞాపించాడు: "మీరు వెంటనే జనస్థానానికి వెళ్ళండి. భయపడకుండా అక్కడ రాముడు ఏం చేస్తున్నాడో కనిపెట్టండి. రాముడుఉన్నంత

వరకు నాకు నిద్రపట్టదు. అతడు నాకు పెద్ద శత్రువు. ఏలాగైనా సరే అతడు మరణించాలి. మీరు వెళ్ళి ధైర్యంతో కార్యం చేసుకు రావాలి."

సముద్రం మధ్యనున్న ఒక కోటలో చెరలో ఉంది సీత. తా నెంత దూరంలో ఉందీ ఆమెకు తెలియలేదు. నాథుడు వచ్చి రావ ణుణ్ని చంపి తన చెర విడిపిస్తాడనే ఎదురు చూస్తూంది. అందుకని ఎంత దుఃఖంగా ఉన్నా మనస్సు గట్టిపరచుకోగలిగింది. తన నాథుడి శౌర్య సాహసాలమీద నమ్మకంతో ధైర్యం కల్పించుకుంది. రాక్ష సుడు తనపట్ల పశువులాగ ప్రవర్తించడం లేదు. ఆదికూడా ఆమెకు ఒక విధంగా ఊరట కలిగించింది.

చారులను జనస్థానానికి పంపి రావణుడు సీత ఉన్న నగరుకు వచ్చాడు. అక్కడ మూర్తీభవించిన శోకంలాగ కన్నీరు మున్నీరవు తున్న సీతను చూశాడు. రాక్షస స్త్రీలు జాగరగా కావలికాస్తూ ఉండడం కూడా చూశాడు. ఇక సీత తన సంపదను హరించు చూడవలసి ఉందనుకున్నాడు. అది చూస్తే ఆమె నిశ్చయంగా తనకు లొంగిపోతుందనుకున్నాడు. అందుకు వలసిన ఏర్పాట్లు చేశాడు.

రాక్షస స్త్రీలు సీతను రాచనగరుకు తీసుకుపోయి రావణుడి గొప్పతనాన్ని సంపదను చూపించారు. అంతసంపదా విలాస వస్తు వులూ లోకంలో ఏ రాజుకూలేవు. సీతకు వాటి నన్నింటిని చూపిం చారు. అవి చూస్తే సీత తనను మోహిస్తుందని రాక్షసరాజు అను కున్నాడు.

ఎక్కడ చూచినా బంగారం, నవరత్నాలు, చీని చీనాంబ రాలు, చిత్రవిచిత్రాల మండపాలు, విమానాలు, అరుగులు, వేలాది పరిచారికలు, సంపదవల్లా రాజ్యాధికారంవల్లా కలగగల సకల భోగాలూ లంకాపురి రాక్షసేశ్వరుడి నగరులో ఉన్నాయి. కాని సీతాదేవి మనస్సుమాత్రం మరెక్కడో ఉంది. రావణుడు ఆమెకు తన ఐశ్వర్యాన్ని చూపించి దాని గొప్పతనాన్ని గురించి చెప్పాడు. తన సేన ఎంత గొప్పదో ఎంత పెద్దదో చెప్పాడు.

రావణుడి శౌర్య పరాక్రమాల విషయంలో తన కెలాంటి అభిప్రాయముందో సీత ముందుగానే చెప్పింది. అయినా రావణుడు సిగ్గు లేకుండా తన సేన బలపరాక్రమాలను వివరించి చెప్పాడు.

"ఇదంతా నీ ఐశ్వర్యంగా, ఇది నీ రాజ్యంగా భావించి అనుభవించవచ్చు. నీవు నాకు నా ప్రాణంకన్నా ఎక్కువ. నాకు పలువురు భార్యలున్నారు. అయినా నీవు వాళ్ళందరికీ యజమానురాలివై నా ప్రేమనంతా నీ గుత్తగొని వెలుగొందుతావు. నా మాట వినుము. అన్యథా ఆలోచించకు. నా కోరిక తీర్చు. ఈ లంకాపురి ఎటు చూచినా నూరామడల సముద్రంతో చుట్టబడి ఉంది. వేలాది మహా వీరులు దీన్ని రక్షిస్తున్నారు. ఇక్కడికి ఎవరూ రాలేరు

దేవాసురులలో నాకు సాటి రాగల బలవంతు లెవరూ లేరు. ఈ విషయం దేవాసురు లందరికీ తెలుసు. రాజ్యభ్రష్టుడైన ఒక అల్ప మానవుణ్ణి, అడవిలో తపస్సు చేసుకొన నిశ్చయించిన ఒక దిక్కులేని వాడ్ని కట్టుకొని నీ వేం సుఖిస్తావు? నీ అందానికి తగిన ఐశ్వర్యంగల మగవాణ్ణి నేను. సుఖాలు అనుభవించవలసిన ఈ పడుచుతనాన్ని పాడుచేసుకోకు. రాముణ్ణింక నీవు చూడడం కల్ల. ఆ విషయంలో సందేహంలేదు. రాముడిక్కడికి ఎన్నటికీ రాలేడు. నా రాజ్యం అంతా నీది. దాన్ని, నన్నూ ఏలుకో! నేనూ, నాకు లోబడి ఉన్న దేవతలూ నీకు సేవకుల మవుతాం. నిన్ను నా పట్టమహిషిగా అభిషేకం చేయిస్తాను. నీకు ఏలోటూ ఉండదు. ఇంతవరకు పూర్వకర్మ విశేషంవల్ల కష్టాలు అనుభవించావు. ఇకపైన నీ పుణ్యకర్మల ఫలితాన్ని నాతో అనుభవిస్తావు. లంకను ఏలబోతున్నావు. కుబేరుణ్ణి జయించిన లంకేశుడికి రాణివి కాబోతున్నావు. పుష్పకవిమానం ఎక్కి మనం ఇష్టానుసారం సంచరించవచ్చు. నీ సుందర ముఖంలో విషాదం కనిపించరాదు. సంతోషంగా ఉండు" అన్నాడు రావణుడు.

రావణుడు ఇలా మాట్లాడుతూ ఉన్నంతసేపూ సీత సంతత ధారగా కన్నీరు కార్చింది. చీర చెరగుతో ముఖం కప్పుకుంది. తనకు కలిగిన భయాన్ని రక్కసులు చూడకుండా ఉండేందుకు ఈ పని చేసింది.

"నీవు సంకోచించకు. నన్ను పతిగా అంగీకరించడంలో పాపం లేదు. సిగు పడవద్దు. దైవికమైన ఏస్థితినైనా అంగీకరించ వచ్చునని శాస్త్రాలలో ఉంది. సుందరీ! నీ పాదాలకడ నా శిరస్సునుంచి ప్రార్థేయపడుతున్నాను. నా మీద దయచూపించు. నేను నీకు బానిసను. నా పదవిని కూడా మరచి నేను నిన్ను బతిమిలాడుతున్నాను. నా జీవితంలో ఇలా ఎవరినీ ఎప్పుడూ బతిమిలాడ లేదు."

ఇలా రావణుడు సీతను బతిమలాడాడు. ఆమె ఒప్పుకుంటుందనీ ఆమెను చేబట్టవచ్చుననీ ఆ రాక్షసుడు అనుకున్నాడు.

మనస్సు నిశ్చలముగా ఉంటే ఎలాంటి సంకట స్థితిలో అయినా ధైర్యం కలుగుతుంది. శోకాకుల అయిన సీత ఆ రాక్షసుణ్ణి చూసి భయపడలేదు. అతడితో ధైర్యంగానే మాట్లాడింది. ఒక గడ్డి పరకను ఎత్తి తనకూ రావణుడికీ మధ్య నిడి దానితో చెప్పుతున్నట్లు మాట్లాడింది.

పంచవటిలో సన్యాసివేషం ధరించి వచ్చిన రావణుడు తాను పెట్టిన పళ్లూ, ఫలాలు ఆరగిస్తూ తన కులగౌరవాన్ని గురించీ, శౌర్యాన్ని గురించీ మాట్లాడాడు కదా? ఇప్పుడు చెరలో ఉన్న సీత ఆ మాటలకు ప్రతిధ్వని అన్నట్లుగా పలికింది.

"నే నెవరినో తెలిసికో! ముల్లోకాల్లో కీర్తి గడించిన చక్రవర్తి దశరథుడు. ధర్మసేతువై పలుసంవత్సరాలు రాజ్యపాలన చేసిన నిరత సత్యవ్రతు డాయన. ఆయనకు కుమారుడూ దేవతుల్యుడూ అయిన రాముడు నాభర్త. ఆయన సింహబలుడు. మహావీరుడు. అయనా ఆయన తమ్ముడు- లక్ష్మణుడూ నీ ప్రాణాలు తీయడానికి సిద్ధంగా ఉన్నారు. ఖరుణ్ణీ, అతడి సైన్యాన్నీ జనస్థానంలో నా నాథుడు నిర్మూలించిన సంగతి నీ వెరుగుదువు. గరుత్మంతుడు విష భుజంగాలను ఎత్తుకొని పోయినంత సునాయాసంగా జనస్థానంలోని నీ మహాసేనను రాముడు ఒక్కక్షణంలో నాశనం చేశాడు. అలాంటి రాముడితో వైరాన్నికొనితెచ్చుకున్నావు గదా? నీవు దేవాసురులవల్ల మాత్రమే మరణంలేకుండా వరం పొందావు. కనుక నీవు రాముడి చేతిలో మరణించడం తథ్యం. నీవు చావు తప్పించుకోలేవు. నీ వరాలు నిన్ను

రక్షించ లేవు. నీవు యజ్ఞంలో యూప స్తంభానికి కట్టిన మేకలా ఉన్నావన్న సంగతి గుర్తుంచుకో, రాముడి కోపదృష్టి నీపైన పడ డమే తరవాయి, సముద్రాన్ని ఎండగొట్టి అయినా సరే చంద్రుణ్ణి ఆకాశంనుంచి దింపి అయినా సరే నా నాథుడు నిన్ను వధిస్తాడు. నీవు చేసిన దుష్కృత్యాలు నిన్నూ, నీ లంకనూ సర్వనాశనం చేస్తాయి.

వీరుడైన నా భర్త దండకారణ్యంలో రాక్షసులమధ్య ఒంటరిగా ధైర్యంగా నివసించాడు. ఎదిరించిన రాక్షసులను వీరుడివలె యుద్ధం చేసి వధించాడు. ఆయన లేని సమయం చూసి నీవు దొంగవలె నన్ను అపహరించి తెచ్చావు. ఈ దుష్కృత్యానికి తగు ఫలితాన్ని అనుభ విస్తావు. నీవు తప్పించుకొని పోలేవు. నీకూ, నీ కులానికీ వినాశ కాలం వచ్చింది కనుకనే విధి నిన్నీ దుష్కృత్యానికి ప్రేరేపించింది. వినాశకాలానికే ఇలాంటి విపరీత బుద్ధులు పుడతాయి.

నిన్ను ప్రేమించుమని నన్ను కోరుతున్నావు. ఇది కూడని పని అని నీకు తెలియదా? హంస కాకిని వరిస్తుందా? యజ్ఞవేదిక వద్దకు కర్మభ్రష్టుడైన చండాలుడు పోగలడా? నా తను ప్రాణాలను కాపాడు కోవాలనే ఆశ నాకు లేదు.

లోకనిందకు పాల్పడి బతికి ఉండడం నా కిష్టంలేదు. నేను ప్రాణభయంతో నీకు లొంగిపోతానని అనుకోవద్దు."

ఇలా చెప్పి సీత మౌనం వహించింది.

"అలాగా" అన్నాడు రావణుడు.

"సరే. నీకు పన్నెండు నెలల గడువిస్తున్నాను. నీవు నన్ను పెండాడుతావా సరేసరి, లేదా గడువు ముగిసిన వెంటనే నా వంట వారు నీ శరీరాన్ని నా ఉదయం భోజనానికి వినియోగిస్తారు." రావ ణుడు ఇలా సీతను హెచ్చరించి కావలి రాక్షసులకు ప్రత్యేక ఆజ్ఞ లిచ్చాడు :

"మీ రెలాగైనాసరే ఈమె పట్టుదలనూ. గర్వాన్నీ పోగొ ట్టాలి. అశోకవనంలో ఈమెను ఒంటరిగా ఉంచి నయానో భయానో మీ నేర్పునంతా వినియోగించి ఈమెను ఒకదారికి తేవాలి. అడవి

లోని ఆడ ఏనుగును లొంగదీసినట్లు ఈమెను మీరు త్వరలో లొంగదీయాలి'' అని ఆజ్ఞాపించి అతికోపంతో తన నగరుకు వెళ్లాడు.

రాక్షస స్త్రీలు సీతను అశోకవనానికి తీసుకువెళ్లారు. అదికడు రమ్యమైన అంతఃపురోద్యాన వనం. ఫల పుష్పవృక్షాలతో పక్షుల కలకలారావాలతో అలరారే తోట అది. అక్కడ సీత ఘోర రాక్షసుల కావలిలో చెర పడి దుఃఖసాగరాన మునిగి ఉంది. రామ లక్ష్మణులకు ఎలాగైనా తన జాడ తెలుస్తుంది. వారు తనను విడిపిస్తారు. అందుకని రాక్షసుల బెదిరింపులకు భయపడక ప్రాణాలను నిలుపుకొని ఉండాలి. వీరుడైన తన నాథుడు రాక్షసులను వధిస్తాడు. తిరిగి రాముడితో కలిసి జీవించేరోజు త్వరలోనే వస్తుందన్న నమ్మకంతో సీత రాక్షసుల బెదిరింపులకు భయపడలేదు; వారి మంచిమాటలకు మోసపోనూ లేదు.

సీత ఇలా అశోక వనంలో దుఃఖించింది ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు, అనేక మాసాలు అలాగే ఉంది.

మహావీరుడైన హనుమంతుడు సముద్రం దాటి వచ్చి సీత దుఃఖాన్ని చూసి ఆ దుఃఖాగ్నితో లంకాపురిని దహించి "రాముడు వస్తాడు భయపడకు!" అని సీతకు చెప్పేరోజు రావచ్చు.

మన దేశంలో దుఃఖించే స్త్రీలంతా సీత అంశగలవాళ్లు. మగవాళ్లుగా పుట్టినవారంతా హనుమంతుడిలాగ స్త్రీలను రక్షించే పరిశుద్ధ మనస్సు లగుదురు గాక!

మనం రామలక్ష్మణులను విడిచిపెట్టిన చోటికి తిరిగి వెళదాం, రండి.

52. ఏడ్పులు - పెడబొబ్బలు

కామరూపి అయిన మారీచుడు బంగారు లేడి రూపు ధరించి. వంచన చేసి సీతకు ఆశ రేకెత్తించి, రాముణ్ని చాలా దూరం కొని పోయాడు. అక్కడ అతడి బాణాలకు బలి అయి ప్రాణాలు విడిచే

టప్పుడు నిజరూపాన్ని బయలుపెట్టి "హా సీతా! హా లక్ష్మణా!" అని కృత్రిమ కంఠంతో అరిచాడు. ఈ విషయాలన్నింటినీ తలుచుకొని రాముడు ఆలోచనలో పడ్డాడు.

"ఓహో! ఇది గొప్ప మోసమే! ఒకవేళ లక్ష్మణుడు మోస పోయి, సీతను అడవిలో ఒంటరిగా విడిచి నన్ను వెతుక్కుంటూ వస్తాడేమో! అయితే అది పెద్ద ప్రమాదమే! సీతను అపహరించ డానికో, చంపి తినడానికో, ఇది రాక్షసులు పన్నిన పన్నాగంలా తోస్తూంది. హా, సీతా! అన్నది నా గొంతుకే ననుకుంటే సీత భయ పడుతుంది. వెంటనే లక్ష్మణుణ్ణి నాకు సహాయంగా పంపుతుంది. నక్కలు ఈలలు వెడుతున్నాయి. పక్షులనూ మృగాలనూ చూస్తే అన్నీ దుర్నిమిత్తాలుగా కనిపిస్తున్నాయి. ఏదో పెద్ద పీడకల గన్నట్లుంది."

రాముడు ఇలా ఆలోచిస్తూ గబగబ ఆశ్రమంవైపు నడిచాడు. ఎదురుగా లక్ష్మణుడు రావడం చూశాడు. అతణ్ణి చూడగానే "అయ్యో! సరిగ్గా నేను అనుకున్నట్టే అయిందే!" అని ఎలుగెత్తి అరిచాడు.

"సీతను అడవిలో ఒంటరిగా విడిచి వచ్చేశావా లక్ష్మణా? రాక్షసు లామెను చంపి తినేస్తారే! మింగేస్తారే! ఎంత పొరపాటు చేశావు! జానకి తప్పించుకోగలదా?" అంటూ లక్ష్మణుడి చేతులు పట్టుకొని, ముంచుకు వచ్చే దుఃఖంతో పలికాడు రాముడు.

"ఆశ్రమంలో ఆమె కనిపించకపోతే లక్ష్మణా, నే నింక బతకను. నిశ్చయం. నువ్వే తిరిగి అయోధ్యకు వెళ్లి ఈ మరణవార్తను చెప్పాలి. అయ్యో! ఈ దుఃఖాన్ని నా తల్లి కౌసల్య ఎలా సహిస్తుంది. లక్ష్మణా! కైక కోరికను నువ్వు పూర్తి చేశావా లక్ష్మణా! రాక్షసులకు మనపైన గల పగను అమాయకురాలైన సీతపై చూపి, ఆమెను విరుచుకు తింటారు. ఆమెను ఒంటరిగా విడిచి ఎలా రాగలిగావు లక్ష్మణా? మారీచుడి అరుపు విని మోసపోయావే? నే నిప్పుడు ఏం చేసేది? సీతను మళ్లీ నేను చూడగలనా? రాక్షస మాయ గెలిచింది. నా చావు నిశ్చయం. నిన్ను నమ్మికదా సీతను కనిపెట్టి ఉండమని

ఆమెను నీకు అప్పగించివచ్చాను. నీకు అప్పగించిన ఆమెను విడిచిపెట్టి ఇలా వచ్చేస్తావా? ఇలా చేయవచ్చా?'' అని, ఆకలిదప్పులతో, అలసటతో, దుఃఖంతో, కోపంతో కిందుమీదైన రాముడు వెక్కి-వెక్కి విలపించాడు. కోపావిష్టుడైన అన్నను చూసి లక్ష్మణుడు కన్నీ రొలు కుతూ మాటాడాడు:

"అన్నా! నేనేం చేసేది? 'హా సీతా! హా లక్ష్మణా!' అన్న కేకలు వినగానే సీతకు ఎక్కడలేని భయమూ పట్టుకొంది. ఆ భయంతో ఆమె వణికిపోతూ 'పో పో! పరుగెత్తు పరుగెత్తు! ఇంకా నిలబడ్డావేం?' అని నన్ను ఊపిరాడకుండా వేధించింది. నే నేంచెప్పినా వినకుండా నన్ను తరిమింది. 'సీతా! భయపడవద్దు. ఈ లోకంలో రాముణ్ని ఎదిరించి గెలవగల రాక్షసులు కాని, శత్రువులు కాని ఎవరూ లేరు. ఇది రాముడి గొంతు కాదు. రాక్షస మాయ. రాముణ్ని చంపగతిగినవారు ముల్లోకాలలోనూ లేరు. యుద్ధంలో ఇలా అత డెన్నడూ కూడా మానం విడిచి దీనముగా కేకలు పెట్టడు. కనక దీన్ని ఏ మాత్రమూ నమ్మవద్దు' అని నే నెంత చెప్పినా వినకుండా 'ఓ శత్రువా! దొంగవేషం వేసి మాతోవచ్చి మోసం చేసున్నావా? రాముడు చావగానే నన్ను చేబట్టవచ్చు కదా అనే వుద్దేశంతో అడవికి మా వెంట వచ్చావా? నీ వెన్నటికీ నన్ను చేపట్టలేవు. వంచకుడా! మహాపాపీ! భరతుడూ నీవూ కలిసి చేసిన కుట్రా ఇది?' అంటూ చేయరాని దోషారోపణ లెన్నో నామీద చేసి, 'నువ్వు పోతావా సరేసరి! లేకపోతే ఇదిగో నే నిప్పుడే ప్రాణాలు విడుస్తాను' అని కేకలు పెట్టింది. ఉన్మత్తురాలై, ములుకుల్లాంటి మాటలతో నన్ను బాధించి తరమడంచేత గత్యంతరంలేక ఇలా వచ్చేశాను. ఇంత కంటె నాకు వేరే దారేముంది అన్నా, నువ్వే చెప్పు'' అన్నాడు.

"నువ్వు చెప్పేసమాధానం సరికాదు" అని రాము డన్నాడు. "ఆమె ఏమన్నా అది అజ్ఞానంవల్ల చెప్పినమాట అనుకొని, నువ్వు ఓర్పుతో ఉండవచ్చుకదా? ఏది ఏమైనా ఆమెను ఒంటరిగా విడిచి రావచ్చా? ఆడుది కనుక ఆమె భయంతో ఏమేమో అంటుంది. అది పెక్కుపెట్టవచ్చా! నువ్వు పెద్ద పొరపాటు చేశావు లక్ష్మణా. సీత

ఇంక నా కంట పడదు" అని లక్ష్మణుడిపై కోపించి, దుఃఖంలో మునిగాడు.

ఇరువురూ అతివేగంగా ఆశ్రమానికి వెళ్లారు.

దారిపొడుగునా దుశ్శకునాలు కనిపించాయి. అవి ఒకదాని వెంట ఒకటి కనిపించినప్పుడల్లా, రాముడు "సీత క్షేమంగా వుంటుం దని తోచదు" అని లక్ష్మణుడితో అంటూ వచ్చాడు.

తీరా ఆశ్రమానికి వెళ్లేసరికి, ఆశ్రమం సీతలేక శూన్యంగా కని పించింది. రాముడికి గుండె పగిలింది.

కృష్ణాజినం, దర్భాసనం, అన్నీ చెదిరి ఉన్నాయి. పర్ణశాల పాడువడి ఉంది. అది చూసి రాముడు వెక్కి-వెక్కి ఏడ్చాడు. పర్ణ శాలకు అటూ ఇటూ వనంలో తిరిగి తిరిగి చూశాడు. చెట్లు ఆకులూ, పువ్వులూ వాడిపోయి ఉన్నాయి. ఎక్కడా సీత కనిపించలేదు.

"అయ్యో, చంపి తినివేశారా. ఎక్కడికైనా ఎత్తుకు పోయారా! ఏమో! నా సీత ఎంత భయపడిపోయిందో! అబ్బా!- దుఃఖం దుర్భరంగా ఉంది. లేదా, ఆమె ఏటికిపోయి ఉంటుందా? నీళ్లు తేవడానికని వెళ్లిందా? చూద్దాం" అని పిచ్చెత్తినవాడిలాగ, కళ్లెర్రబారి, ఇటూ అటూ తిరిగాడు. వేళాకోళానికి దాగుడుమూత లాడుతూందేమో అని చెట్టు చెట్టుకూ వెతికి చూశాడు.

రాముడి దుఃఖం రానురాను సముద్రంలాగా పొంగి పోయింది. ఆయనకు పిచ్చెత్తిపోయినట్టయింది. ఒక్కొక్క చెట్టు దగ్గిరకే వెళ్లి బిగ్గరగా విలపించసాగాడు.

"ఓ అశోక వృక్షమా! నీకు బాగా తెలుసు. సీత ఎక్కడ ఉందో చెప్పు! ఓ అశోకమా, నా శోకాన్ని తీర్చవా?

ఓ తాళ వృక్షమా, నా సీత ఎక్కడ ఉందో చెప్పు! నీకు తప్పక తెలిసే ఉంటుంది."

ఇలా ఆ అడవిలోని చెట్టు చేమలనూ, తీగెలనూ పేరు పేరునా పిలిచి అడుగుతూ వెర్రెత్తినట్లు అడవంతా తిరిగాడు.

అలాగే అడవిలో కనివించిన మృగాలనూ అడిగాడు :

"ఓ వ్యాఘ్రమా ! ఆ ఏనుగూ జింకా నాకు నిజం చెప్పడానికి భయపడుతున్నాయి. నువ్వు భయం ఎరగనిదానవు కదా ? నువ్వైనా చెప్పు. నీకు తెలిసే వుంటుంది."

ఇలా అన్నిటినీ అడిగి అడిగి విలపించాడు.

"సీతా ! దాగున్నావా ? అదుగో దొంగా !— చూశానులే ! ఇంక ఆటలు చాలించు. నేను సహించలేను" అంటూ విలపించాడు.

ఇలా విలపిస్తూ ప్రలాపిస్తూ ఆ పరిసరారణ్యమంతా వెతికాడు; సీతను ఎక్కడా కానక దుఃఖం ముంచెత్తుకురాగా "హా లక్ష్మణా ! హా సీతా !" అని మిక్కిలి శోకిస్తూ నేలపై పడిపోయాడు.

"లక్ష్మణా ! ఎక్కడా కనిపించడం లేదు సీత. ఆమెను రాక్షసులు పట్టుకొని, విరుచుకు తినివేశారేమో ! నే నింకేం చేసేది ? నాకు ప్రాణాలు దక్కవు. నా తండ్రి దశరథ మహారాజును చేరుకుంటాను. అయ్యో, అక్కడ కూడా 'కుమారా, నా ఆజ్ఞ ప్రకారం వనవాస వ్రతం పూర్తి కాకుండా, ముందే ఎందుకు వచ్చేశావు ?' అని నాయన గారు కోపిస్తారు. నేను అన్నివిధాలా భ్రష్టుడ నయ్యాను" అని, ఊబిలో చిక్కుకున్న ఏనుగులాగా విలవిల్లాడాడు.

ఇలా రాముడు దుఃఖంతో మతి చెడి, పిచ్చెత్తినట్లు కావడం చూసి, లక్ష్మణుడు సహించలేకపోయాడు.

"అన్నా ! ఇలా శోకించడం తగదు. ఇద్దరమూ కలిసి అడవి అంతా వెతికి చూద్దాం. గుహల్లోను, అడవుల్లోను తిరగడం సీతకు చాలా ఇష్టమని నీకు తెలుసుకదా ? నదిలో స్నానం చేయడమన్నా, ఆటలాడడమన్నా, పువ్వులు కోయడమన్నా ఆమెకు చాలా ప్రీతి. అందుకని ఎక్కడో ఆడుతూ ఉంటుంది. చూద్దాం, పద. మనల్ని పరీక్షించడం కోసమే ఆమె ఇలా ఆడుతూ ఉంది. రా! వెళ్లి చూద్దాం, దుఃఖిస్తే యేం ప్రయోజనం ?" అన్నాడు.

ఇద్దరూ నది, కొండ, కొలకులూ — ఒకటేమిటి— అక్కడా ఇక్కడా అనక, అంతటా వెతికారు.

"ఎక్కడా కనిపించలేదు, సీత. లక్ష్మణా : నేనేం చేసేది ?" అని అన్నాడు రాముడు.

"విలపించకు అన్నా ! మహావిష్ణువు బలి చక్రవర్తిని అణచి, మూడులోకాలనూ పొందినట్లు, నువ్వూ సీతను పొందుతావు, నిశ్చయం. ధైర్యం వదలకు" అని అన్నాడు లక్ష్మణుడు.

"లేదు తమ్ముడూ : వెతికీచూడ్డం అయింది. సీత ఎక్కడా కానరావడం లేదు. ఆమెను పోగొట్టుకున్నాను. ఇక ఈ ప్రాణాలతో నా కేంపని" అన్నాడు రాముడు.

రాముడు ఒక ముహూర్తకాలం స్పృహతప్పి పడిపోయాడు కూడా. అంతలో తేరుకొని, 'అయ్యో !' అని దుఃఖాన్ని భరించలేక, ఎంతగానో విలపించాడు. లక్ష్మణు డెంత ఊరడించినా రాముడి దుఃఖం తగ్గలేదు.

"లక్ష్మణా ! ఇక నేను అయోధ్యకు పోయేదేంటి ? సీతనుకూడా అడవికి తెచ్చాను. ఆమెను రక్షించలేక పోయాను. ఆమెను రాక్షసుల నోటి కందించి, ఒంటరిగా తిరిగి వచ్చాడని లోకం నన్ను నిందిస్తుంది కదా. జనకుడికి ఏమని సమాధానం చెప్పగలను ? నువ్వు వెళ్ళి, మన తల్లులను కనిపెట్టుకొని ఉండు. భరతుణ్ణి ఆలింగనం చేసుకుని 'నీవే రాజువు. దేశాన్ని నీవే ఏలవలసిందని రాముడు ఆజ్ఞాపించాడ'ని, నా మాటగా అతడితో చెప్పు" అన్నాడు.

లక్ష్మణుడు ఎంత ఊరడించాలని ప్రయత్నించినా లాభం లేకపోయింది. సీతను రాక్షసులు ఎత్తుకుపోయి, విరుచుకు తినేసి వుంటారనే రాముడు నిశ్చయించుకున్నాడు. నరమాంసం తినే రాక్షసుల వల్ల ఆమె పడిన హింసను ఊహించుకొని దాన్ని వర్ణించి చెప్పి చెప్పి విలపించాడు.

"నేను ఎన్నో ఘోరపాపాలు చేసి ఉండాలి. లేకపోతే నా కింత కష్టం ఎందుకు వస్తుంది ? నాతో వచ్చిన సీత రాక్షసులకు కబళమై పోతే, నేను సహించి ఊరుకోవలసి వచ్చింది. నావంటి పాపి ఈ లోకంలో మరెవడైనా ఉంటాడా" అన్నాడు.

"అన్నా! ఇలా నువ్వు ధైర్యం కోల్పోతే ఎలా? ధైర్యం విడిచిన వారు ఏ ప్రయత్నమూ చేయలేరు. దుఃఖం అణుచుకొని మనస్సు స్థిమిత పరచుకోవాలి. పురుష ప్రయత్నంతో విధిని జయించాలి. అలా విజయం పొందాలంటే అధైర్యాన్ని మనస్సునుంచి పారదోలి ధైర్యాన్ని తెచ్చుకోవాలి. ధైర్యశాలురు ఇలాగే లోకంలో కార్య సిద్ధి పొందారు. అదవంత వెతికి చూద్దాం. శోకించకు. ధైర్యశాలుర మార్గాన్ని మనం అనుసరిద్దాం" అని లక్ష్మణుడు పరిపరి విధాల చెప్పి చూశాడు. కాని అంతులేని ఆ దుఃఖంముందు అదంతా వ్యర్థమై పోయింది.

రాముడు తనను మానవమాత్రుడిగానే భావించుకున్నాడు. తాను మహావిష్ణువైన సంగతి అతడెరుగడు అన్నదానికి ఈ ఘట్టమే ప్రబల తార్కాణం. కొన్ని కొన్ని సంఘటనలూ, మాటలూ వేరొక అభిప్రాయానికి తావిచ్చినా, ఈ ఘట్టంలో మాత్రం వాల్మీకి మహరి రాముణ్ని కేవలం మానవ మాత్రుడిగానే వర్ణించాడు. ప్రాణాధికమైన భార్య రాక్షసులకు ఆటపట్టయిన ఆ అడవిలో కనబడక పోయే సరికి, ఉత్తమ గుణసంపన్నుడైన ఒక పురుషుడు ఎలా ప్రవర్తిస్తాడో రాముడి మనోభావాలూ, నడవడీకూడా, అలాగే ఉన్నట్లు మనం చూస్తూన్నాం. తమ్ము డెంత ఓదార్చినా ఫలితంలేని స్థితిలో రాముడు ఉండడం గమనిస్తున్నాం.

రామావతారంలో సామాన్య ధర్మం విపులముగా కనిపిస్తుంది. ధర్మంతో వర్ధిల్లిన ప్రేమ ఎలా ఉండాలో మనం చూస్తున్నాం. భార్య ప్రేమకన్న భర్త ప్రేమ తక్కువగా ఉండకూడదన్న విషయాన్ని ఈ ఘట్టంలో చక్కగా చూడవచ్చు.

ఈ సంఘటనకు ఆధ్యాత్మికంగా అర్థం చెప్పుకోవడం కొంత ఉపయోగిస్తుంది. ఒక ఆత్మ దారి తప్పిపోతే భగవంతుడి హృదయం ఎంతెలా క్షోభించేదీ సీతా వియోగంలో చిత్రితమై ఉందని మనం గ్రహించవచ్చు.

భగవంతుడికి నష్టమెక్కడ? దుఃఖమెక్కడ? అని అడగవచ్చు. సర్వం భగవల్లీల అనీ, అంతా ఆయన లీలా విశేషమనీ తెలుసు

కుంటే, ఆపైన ఎట్టి విమర్శనకూ తావుండదు. పాపం, పుణ్యం, భక్తి ఇవన్నీ ఆ లీలలో భాగాలు. భగవంతుడికి మనం ప్రతి ఒకళ్లమూ ప్రియమైన భార్యవంటి వాళ్లం. ఏ కారణంవల్లనైనా మనం దారి తప్పితే ఈశ్వరుడికి ప్రియభార్యను ఎడబాసినంత దుఃఖం కలుగుతుంది. అటువంటి దుఃఖం ఆయన లీలలలో ఒకటి!

53. తండ్రివంటివాడు

సోదరులిద్దరూ కొండలలోనూ, కనుమలలోనూ ఏటి ఒడ్డునా, వెతికి వెతికి "సీతా, సీతా !" అని కేకలిడినా ఫలితం కలగలేదు. వారికి దారీ తెన్నూ కనిపించలేదు. దిక్కుతోచలేదు. శోకావేశంతో రాముడు గోదావరినీ, దేవతలనూ, పంచభూతాలనూ ఎలుగెత్తి ప్రార్థించాడు. నదులకూ, దేవతలకూ, పంచభూతాలకూ రాక్షసేంద్రుడంటే భయం. అందుకని కొండగాని, నదిగాని, చివరకు వాయువు గాని, బదులుపలుక లేదంటున్నాడు మహాకవి వాల్మీకి.

ఒక లేళ్ళగుంపు మాత్రం 'దక్షిణ దిక్కుగా వెతకండి' అన్నట్లు చెంగున దూకింది. రామలక్ష్మణులు దక్షిణ దిక్కుగా బయలుదేరారు. అక్కడ దారిలో ఒకచోట పువ్వులు చెదిరి పడి ఉండడం కనిపించింది.

వాటిని చూడగానే "ఇదిగో, నేనిచ్చిన పువ్వే. సీత కొప్పునుంచి జారిపడింది కాబోలు !" అని రాముడు గుర్తుపట్టి, ఉత్సాహంతో పాటు దుఃఖాన్నికూడా పొందాడు. సీత కేంకీడు జరిగిందో అన్న భయం ముసుపటికన్నా మిక్కుటమై, భోరున విలపించాడు.

పువ్వులు రాలిన చుట్టుపక్కల అడవి అంతా గాలించి చూశారు. నేలపైన రాక్షసేంద్రుడి పెద్ద అడుగుజాడలూ, సీత చిన్న అడుగుజాడలూ గుర్తించారు. సీత నగలనుంచి చెదిరిపడిన బంగారాన్నీ, మణులను కూడా చూశారు, వాటిని చూసి రాముడు "చూశావా, లక్ష్మణా ! ఆమెను పట్టి తినడానికి రాక్షసుడు తరిమి తరిమి హింసించాడు" అని చెప్పి విలపించాడు.

* * *

విరిగిపడిన రథభాగాలు కనిపించాయి. నెత్తురు చింది ఉండడం కూడా చూశారు, వారు. రాక్షసుడి కిరీటం, ఆభరణాలూ నేలపై చెల్లాచెదురుగా కనిపించాయి.

"ఇదేంటి?" అని ఆశ్చర్యంతో ఆలోచించసాగారు. విరిగిపడిన పెద్ద విల్లు, చినిగిపోయిన రథధ్వజం. కవచమూ చూశారు. తర్వాత చచ్చిపడివున్న సారథిని, పిశాచముఖాలు గల గాడిదలను చూశారు. ఆ గుర్తులు చూసి అక్కడ ఒక ఘోరమైన పోరు జరిగివుంటుందని ఊహించారు.

"సీతను తినడం కోసం ఇద్దరు రాక్షసులు తమలో తాము కలహించుకొని, ఘోరమైన పోరు సలిపి పుంటారు" అని అన్నాడు రాముడు.

ఇలా అనేక విధాలా ఊహిస్తూ, "ధర్మం సీతను కాపాడలేదే! ఏ దైవమూ ఆమెకు తోడు రాలేదే! ఈ లోకాన్ని నాశనం చేయడమే మంచిది. నేను నేర్చిన అస్త్రాలు ఫలించక పోతాయా? చూస్తాను" అని అన్నాడు. అతడికి చిత్తస్థైర్యం బొత్తిగా పోయింది.

రాముడి హృదయంలో కలతనూ, అశాంతినీ చూసి. లక్ష్మణుడు ధైర్యం చెపుతూనేఉన్నాడు. "ఎక్కువ దుఃఖం కలిగినప్పుడు ఎవరికైనా మనస్సు స్వాధీనం తప్పుతుంది. నీ సహజగుణాలను ఎందుకు విడిచి పెడతావు? లోకంమీద కోపించడానికి కాని, దాన్ని తిరస్కరించడానికి కాని, కారణం కనిపించదు. ఒకడు చేసిన దుష్కార్యానికి లోకాన్నంతనీ నిందింప వచ్చా? అన్నా! ఇంతవరకు నువ్వు నన్ను శాంతపరచి, సన్మార్గానికి తిప్పి కాపాడుతూ ఉండేవాడివి కదా? చెప్పలేని శోకంతో నీ మనస్సు కలతబారి ఉండడంవల్ల ఇప్పుడు చిన్నవాడనైన నేను నీకు ధైర్యం చెప్పవలసి వచ్చిందే. నీ సహజ గుణమైన ధైర్యాన్ని నేను మేల్కొలుపుతున్నాను. లోకాన్ని నిందించడం న్యాయం కాదు. ముందు మన పగవాడెవడో కనిపెట్టి, తర్వాత చేయవలసిన పని చేద్దాం."

ఇలా లక్ష్మణుడు రాముడికి ఊరట కలిగించడం కోసం, ప్రియమైనమాటలు చెపుతూనే వెళ్లాడు. కొంతదూరం వెళ్ళేసరికి కొన ప్రాణంతో నేలను పడివున్న జటాయువును చూశారు. రెక్కలు తెగి. కొనప్రాణంతో నేలను పడివున్న పక్షిరాజును దూరం నుంచి చూసి, ముందు రాముడు గుర్తుపట్టలేక పోయాడు. ఎవడో రాక్షసుడు మాయవేషం వేసుకుని, తమను వంచించడానికి అలా పడి ఉన్నాడని అనుకున్నాడు. ఇంతకు ముందు అనుభవించిన మారీచుడి మోసం రాముడి మనస్సులో ఇలాంటి భావాన్నే కలిగించింది. రాముడు మహా కోపావేశంతో "అడుగో, పక్షిరూపంలో రాక్షసుడు! సీతను భక్షించి వేసి పడుకొని ఉన్నాడు." అంటూ ధనుర్బాణాలతో సహా పక్షి రాజు పడిఉన్న చోటికి పరుగెత్తాడు.

అప్పుడు జటాయువు హీన స్వరంతో, "నాయనా! రామా! నన్ను చంపవద్దు. ఇంకొక్క క్షణకాలం మాత్రమే నా ప్రాణం ఉంటుంది. నువ్వీ అడవిలో వెతికి వేసారుతున్న నీ దేవిని రావణుడు ఎత్తుకొని పోయాడు. దాంతో పాటు నా ప్రాణాలను కూడా హరించివేశాడు. సీతాదేవిని అపహరించి, తన మాయా రథంలో కొనిపోవడం చూసి, నేను అడ్డగించి అతడితో పోరాడాను. అతడి వింటినీ, రథాన్నీ విరిచి తునాతునకలుగా చేసివేశాను. అతడి సారథిని వధించాను. నేలపై చిందర వందరగా పడి ఉన్న ఆ యుద్ధ చిహ్నాలను చూడు. చివరకు రాక్షసుడు, నేను ఆయాసం తీర్చుకుంటున్న సమయం చూసి, నా రెక్కలను కత్తితో నరికి. నన్ను నేల కూల్చి వేశాడు. సీతను ఎత్తుకొని ఆకాశ మార్గాన వెళ్ళిపోయాడు. రెక్కలు తెగి నేలను పడివున్న నేను, ఏం చెయ్యడానికీ వీలులేకపోయింది. ఇంతవరకూ ఎలాగో ప్రాణాలు నిలుపుకొని, నీ కీవిషయం చెప్పేవరకు బతికి వున్నాను" అన్నాడు.

* * *

జటాయువు మాటలు వినగానే రాముడి కళ్లు సెలయేళ్లయినాయి. చేతనున్న విల్లు విసరి పారవేసి, పక్షిరాజును అమాంతం కౌగలించుకున్నాడు. రాకుమారుల దుఃఖం కట్లు తెగి పొంగింది. వారు భోరున విలపిస్తూ, నేలను పడి, దొర్లారు.

"లక్ష్మణా! నావంటి దౌర్భాగ్యుడు ఎక్కడా ఉండడు. రాజ్యాన్ని పోగొట్టుకుని అడవికి వచ్చాను. ఇక్కడ సీతను పోగొట్టుకున్నాను. దశరథుడికి బదులు మనకు తండ్రిగా లభించిన ఈ జటాయువును కూడా నేను చంపుకొన్నాను. నా కోసం ఈయన తన ప్రాణాలను విడిచాడు. సీతలేని దుఃఖంకన్న ఈ దుఃఖం నాకు ఎక్కువగా ఉంది. నిప్పులో దూకుదామనుకున్నా దౌర్భాగ్యంవల్ల ఆ నిప్పు కూడా చల్లారిపోతుంది. సముద్రంలో పడితే, నా దౌర్భాగ్యంవల్ల సముద్రపు నీరుకూడా ఇంకిపోవచ్చు. లక్ష్మణా! నేను మహాపాపిని. ఈ సీతలో ఎప్పుడో ఒకనాడు నిన్నుకూడా నేను పోగొట్టుకొంటానేమో! చెప్పలేను" అని, రాముడు నేలపై పొర్లుతూ, విలపించాడు.

జటాయువును కౌగలించుకొని "నా తండ్రీ! నా సీతను వీవు చూశావా?" అని అడిగాడు. మాట పడిపోయి, స్పృహ కూడా తప్పి పడి ఉన్నాడు, జటాయువు.

మరణావస్థలో ఉన్న గద్దరాజు చక్కగా మాట్లాడానికి శక్తి లేక హీనస్వరంతో "భయపడకు, రామా! సీతను మళ్లీ నువ్వు తప్పకుండా పొందుతావు. ఆమెకు ఎట్టి కీడూ కలగదు. కొల్లపోయిన సంపదను మళ్లీ పొంది, గొప్ప ఆనందం పొందుతావు" అని చెప్పి, నోట నెత్తురు కక్కుకొని, ప్రాణాలు విడిచాడు.

మోహంవల్లా, తామసంవల్లా చేయవలసింది సకాలంలో చేయక చేయరానిదాన్ని చేసి, సీతను పోగొట్టుకున్నారు రామలక్ష్మణులు.

అయోధ్యలో తండ్రి మరణించాడు. ఆయనకు భరత శత్రుఘ్నులు ఉత్తరక్రియలు చేశారు. రామలక్ష్మణులకు ఆమాత్రమైనా, ఊరటచెందే అవకాశం లేకుండా, అడవిలో ఉండిపోయారు. తమ అజాగ్రత్తవల్ల సీత అపాయస్థితిలో పడింది. ఆమెను రక్షించడం కోసం. ఆయుధపాణి అయిన రాక్షసుడితో-రెక్కలూ ముక్కూ గోళ్లూ తప్ప మరెట్టి ఆయుధమూలేని జటాయువు, ఘోర యుద్ధం చేసి, తన ప్రాణాలను ధారపోయడం చూశారు. రాకుమారు లిద్దరూ ఆ జటాయువును తమ తండ్రితో సమానుడుగా భావించారు. తమ తండ్రికి

జరిపినట్లే, ఆ పక్షిరాజుకూ ఉత్తరక్రియలు జరిపి, మనస్సులో తృప్తి పొందారు. మరణించిన వీరుడికి వారు ఇంకేం చేయగలరు?

భాగవతులు జటాయువును పరమ భాగవతోత్తముడిగా ఎంచి పూజిస్తారు. ఆ బక్కపక్షి, రాక్షసేంద్రుడితో పోరుసల్పి, ఆయాస పడుతున్నప్పుడు చూస్తున్న సీత మనస్సులో ఎలాంటి ప్రేమ, కృతజ్ఞత, దుఃఖమూ, పొంగిపొరలి ఉంటుందో మనం ఊహా కివల తెలుసుకోవచ్చు. అలా తెలిసికొన్ననాడు, దేవి కృపవల్ల పవిత్రతనూ భక్తినీ పొందగలుగుతాం. భక్తులు జటాయువును ఒక ఆళ్వారు (భక్తుడు)గా భావించి పూజించడంలో వింత ఏముంది? ఇకమీదట రాముడు లంకలో యుద్ధం చేసి, విజయ మందబోతున్నాడు. అయితే ఆ యుద్ధాన్ని సీత ప్రత్యక్షంగా చూడలేదు. ఆమె అశోకవనంలో చెరలో ఉంది. యుద్ధభూమిలో విశేషాలనూ, మగని కీర్తినీ ఇతరులు చెప్పగా విని తృప్తి పడబోతూంది. కాని జటాయువనే భక్తుడి శౌర్య పరాక్రమాలను దండకారణ్యంలో సీతాదేవి కళ్ళారా చూసింది. విల్లమ్ములూ, కత్తి చేబూనిన రక్కసుణ్ణి నిరాయుధంగా ఎదిరించి, అపరి గర్వమణచి, చివరకు తన ప్రాణాలనే ధారపోసిన వీరుడు జటాయువు. లంకలో జరిగిన యుద్ధంకన్నా రావణ జటాయు యుద్ధమే గొప్పదని చెప్పవచ్చు. అందువల్లనే భక్తులు భరతుణ్ణి కొల్చినట్లే జటాయువుకు కూడా ఆళ్వారనే పేరుపెట్టి, కొనియాడుతున్నారు.

* * *

"లక్ష్మణా! ఎండుకట్టెలు ఏరి తెచ్చి, చితిపేర్చు. నేను అగ్నిని మధిస్తాను. నాయనకు అంత్యక్రియలు చేయడానికి ప్రాప్తం లేకనే పోయింది. మనకోసం ప్రాణాలు విడిచిన ఈ గద్దరాజుకు చేద్దాం" అన్నాడు, రాముడు.

"యజ్ఞ యాగాదులు చేసినవారికి ఏ పదవి లభిస్తుందో, తపస్సు చేసే వానప్రస్థులకు ఏ సద్గతి లభిస్తుందో, భూదానం చేసిన పుణ్యాత్మలకు ఏ పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయో, యుద్ధంలో వెనుకాడని వీరుడికి ఏలోకం లభిస్తుందో, ఓ గద్దరాజా! అవన్నీ నీకు లభించునుగాక"!

అని చెప్పి రాజకుమారులు తర్పణాలు కూడా విడిచిపెట్టారు. దాంతో రాముడికి మనోదౌర్బల్యం తొలగి ధైర్యం కలిగింది.

* * *

భారతదేశంలో కోటాది స్త్రీపురుషులకు రామాయణం ఉత కథ మాత్రమే కాదు. అది జీవిత సంఘటనలను కన్నులకు కట్టేటట్టుచేసే వాస్తవికగాథ. సూర్యరశ్మికి చెట్లూ తీగెలూ ఎలా పెరుగుతున్నాయో అలాగే ఈ రామచరితామృతాన్ని గ్రోలి, కోట్లాది భారతీయులు వర్ధిల్లి, తమ జీవితాలను చక్కదిద్దుకొనే శక్తి సంపాదించుకుంటున్నారు. ఏ అబిల అయినా అపాయంలో గాని, కష్టంలో గాని చిక్కుకుని దుఃఖించడం చూస్తే, జటాయువును తలచుకొని మనం మనోబలాన్ని పొంది, వారికి తోడ్పడుదుము గాక!

* * *

అవతార పురుషుడైన రాముడు దుఃఖం వచ్చినపుడు ధైర్యం చెదిరిపోయి ఏడ్వటాన్ని గురించి మరొక మతంవారు ఇలా అంటున్నారు: హూజ్యాడూ, అవతార పురుషుడూ అయిన ఏసుక్రీస్తు గురించి చెబుతున్న బైబిలు చెప్పిందాంతో పోల్చి చూడవలసివుంది. సిలువ వేసి సీలు గొట్టింతర్వాత ఆయన చాలాసేపు ఆ స్థితిలో పరితపించి, చివరకు ప్రాణం పోయే సమయంలో "ఏలోఈ ఏలోఈ లామా సబక్తాని!" అని ఎలుగెత్తి విలపిస్తూ ప్రాణం విడిచినట్లు వ్రాసి ఉంది. (ఇది హిబ్రూ వాక్యం. దీని అర్థం "నా దేవుడా, నా దేవుడా, నన్నేల విడిచిపెట్టావు!" అని. ఆ అవతారంలో అనివార్యమైన ఒక సామాన్య లక్షణాన్ని జ్ఞాపకం ఉంచుకోవాలి. తాను దైవమే అయినప్పటికీ, అవతార శరీర ధర్మాన్ని అనుసరించి దుఃఖించటం మొదలైన లక్షణాలు ఉంటాయి.

54. ఎడమ కన్ను అదిరింది

ఆనుకోని ఆపదలూ, కష్టాలూ ఒకదాని వెంట ఒకటి పైబడ్డం చూసి విధిని దాటడం ఎవరికీ సాధ్యం కాదన్న నిర్ణయానికి వచ్చారు.

రామలక్ష్మణులు. వారు తమ సహజ ధైర్యాన్ని అప్పుడప్పుడు కోల్పోయినా, ఒకరి నొకరు ఓదార్చుకుంటూ వచ్చారు.

అలా అడవిలో పోతూ ఉండగా, తలవని తలంపుగా వారిద్దరూ ఒక ఘోరాకారుడైన రాక్షసుడి చేతిలో చిక్కిపోయారు. ఆ రాక్షసుడికి తల లేదు. కాళ్ళు లేవు. పెద కడుపు, పొడవైన రెండు చేతులు. ఇదే అతడి శరీరం అంతా. వాడు అడవిలో ఒకచోట కదలకుండా పడి ఉండి, రెండు చేతులూ చాచి, చేతికి అందిన పులులు ఎలుగులు మొదలైన వాటిని పొట్టలో వేసుకుంటూ ఉండేవాడు. కడుపులోనే వాడికి ఒక పెద్ద నోరుంది. రొమ్మున ఒక కన్ను మహా భయంకర రూపి అయిన ఆ రాక్షసుడి చేతుల్లో చిక్కి రాజకుమారు లిద్దరూ నిశ్చేష్టు లయ్యారు. ఏం చేయాలో వారికి తెలియలేదు. కొంతసేపటికి రాముడు లక్ష్మణుణ్ణి చూసి "నువ్వు ఒక చేతిని నరుకు, నేనొక చేతిని నరుకుతాను" అన్నాడు.

అలాగే వారు రాక్షసుడి రెండు చేతులూ నరికివేశారు. అ రక్కసి పేరు కబంధుడు. చేతులు తెగిపోగానే వాడింక ఏమీ చేయ లేకపోయాడు. "నేను చేసిన అక్రమాలవల్ల శాపం పొంది. ఈ రూపుతో బతుకుతున్నాను. మీరు రామలక్ష్మణు లనుకుంటాను. మీరు వచ్చి నా చేతులను నరికి నన్ను దహనం చేస్తే నాకు శాపం పోయి నిజరూపం వస్తుంది. నా శాపవిమోచనానికి ఇంద్రుడు చెప్పిన విరుగుడు ఇదే" అని అన్నాడు.

వాడి కోరికప్రకారం రాజకుమారులు కబంధుణ్ణి దహనం చేసి వేశారు. వెంటనే అతడు దివ్య రూపంతో అగ్నినుండి వెలువడి స్వర్గానికి వెళ్ళటం కోసం విమానం ఎక్కాడు. "సీతను తప్పకుండా మీరు చూడగలరు. ఎంతో రమ్యమైన పంపాతీరానికి వెళ్ళండి. అక్కడ సుగ్రీవుడనే వానర రాజు సహాయాన్ని పొందండి. అతడి అన్న వాలి, అతడ్ని రాజ్యంనుంచి వెళ్ళగొట్టాడు. మీరు అతడి స్నేహాన్ని సంపాదిస్తే మీ కార్యం ఇట్టే నెరవేరుతుంది" అని చెప్పి అదృశ్యుడైనాడు.

* * *

రామలక్ష్మణులు పంపాతీరానికి బయలుదేరారు. ఆ రమణీయ ప్రదేశంలో మతంగ మహాముని శిష్యురాలు శబరిని చూసి ఆమె ఆదర సత్కారాలను పొందారు. శబరి మహాజ్ఞాని. రాముడు ఈశ్వరావతారమన్న రహస్యం ఆమెకు తెలుసు. రాముడు వస్తాడనీ, అతడి పాదాలంటి పరమపదం పొందుదామనీ కాచుకుని ఉందామె. రాముడి కోసం తాను ఏరి ఉంచిన తీయని పండ్లను అతడికీ, లక్ష్మణుడికీ ఇచ్చి ఆతిథ్యం నెరపింది.

తర్వాత శబరి అక్కడి మాహాత్మ్యాలను రాముడికి వివరించి చెప్పింది. అటుపైన చితి రగిల్చి శరీరాన్ని ఆహుతి చేసి ఊర్ధ్వలోకాలకు వెళ్ళింది.

శబరిని చూసి, పంపాసరోవరంలో స్నానం చేసిం తర్వాత వారికి ధైర్యం కలిగింది. ఇకముందు చేయవలసిన పని గురించి ఆలోచించారు. "లక్ష్మణా! విజయం పొందుతామని నా మనస్సు చెపుతూంది. సుగ్రీవుణ్ణి కలుసుకొనే మార్గం వెతుకుదాం" అన్నాడు రాముడు.

వారక్కడ నుంచి పంపానదికి బయలు దేరారు. అక్కడి అడవులూ, కొలకులూ వసంత శోభతో తొణికిసలాడుతున్నాయి. ఆ వసంత శోభలో పశుపక్షులూ తరులతాదులూ రాముడి దుఃఖాన్ని ఎక్కువ చేశాయి. దేన్ని చూసినా "సీత ఈ అందాన్ని చూసి ఎంత ఆనందిస్తుంది?" అన్న తలంపే అతడ్ని బాధించింది. అవతార స్వభావాన్ని అనుసరించి అనుభవించవలసి ఉన్న మానుష దుఃఖం ఎంత అణచుకుందామన్నా వీలు కాకపోయింది. ఎప్పుడూ ధైర్య స్థైర్యాలకు నిలయమైన రాముడి మనస్సు చెదిరి బాధపడడం చూసి, లక్ష్మణుడు ఊరడింపు మాటలు చెపుతూనే వచ్చాడు. "సీతను దేవమాత అయిన అదితి గర్భంలో దాచినా కనిపెట్టగలం. రావణుడు తప్పించుకొని పోలేడు. అతడ్ని చంపి, సీతను తప్పకుండా విడిపిస్తాం. ఈ మనోదౌర్బల్యం నీకు తగదు. నువ్వు ఇలా దుఃఖాన్నీ అధైర్యాన్నీ పొందవచ్చా? వాటిని నీ మనస్సునుంచి తొలగించి వెయ్యి. పోగొట్టుకొన్నదాన్ని పొందడం కోసం మానవుడు ఎడతెగని ప్రయత్నం చెయ్యాలి. మన ప్రేమే మనకు విరోధి అవుతుంది. ప్రేమవల్ల మనస్సు

శోకాకులమై, నీరసించి, పురుషకారానికి అడ్డు తగులుతుంది. నీకు నేను చెప్పతగిన వాడనా? ఉత్సాహమే మానవుడికి ముఖ్య సాధనం. శోకాన్నీ, దానికి కారణమైన ప్రేమనూ మరచి, ఉత్సాహంతో ప్రయత్నం చేద్దాం. ధైర్యం వహించి శోకాన్ని పారదోలాలి, అన్నా!" ఇలా తమ్ముడు అన్నకు హితవు చెప్పాడు. ఆదిశేషుడు మహావిష్ణువుకు రక్షకుడు. అట్టి ఆదిశేషుడి లాగానే లక్ష్మణుడు శ్రీరాముడికి ఉత్సాహం కలిగించి, మనో దౌర్బల్యాన్ని పోగొట్టాడని వాఖ్యానించవచ్చు.

రాముడు ధనుర్బాణాలు ధరించి, ఋష్యమూకవనంలో ఇటూ అటూ తిరగడం చూసి, సుగ్రీవుడికీ, అతడి పరివారానికీ భయం పట్టుకుంది. వాలి తరిమి వేయగా, సుగ్రీవుడు వాలి అడుగిడజాలని ఆ పర్వత ప్రదేశంలో తన నివాస మేర్పరచుకున్నాడు. వాలి మారువేషంలో ఇక్కడికూడా వచ్చి తనను చంప జూస్తున్నాడేమో నని సుగ్రీవుడు భయపడ్డాడు. వాలి మిత్రులైన క్షత్రియ వీరులెవరో అతడి పక్షాన తనను చంప జూస్తున్నారని కూడా అనుకున్నాడు. అడవిలోని వానర సమూహమంతా భయంతో ఇటూ అటూ పరుగులు పెట్టారు.

సుగ్రీవుడి ప్రధానమంత్రి హనుమంతుడు. అతడు సుగ్రీవుడికి ధైర్యం చెపుతూ "ఇది వాలి వేషం కాదు. వారు వాలి స్నేహితుల లాగా కూడా కనిపించడం లేదు. అందుకని భయపడవలసిన పనిలేదు. నేను పోయి వారితో మాట్లాడి, విషయం తెలుసుకు వస్తాను" అన్నాడు. ఆ మాట విని సుగ్రీవుడు సంతోషించి "అలాగే కానీ, జాగర్తగా వెళ్ళి విషయం తెలుసుకురా! గొప్పసామర్థ్యంతో యథార్థ విషయం తెలుసుకోవాలి సుమా. నా కేమో చాలా అనుమానముగా ఉంది. వారు ఇటూ అటూ తిరిగి వెతకడం చూస్తే నన్ను వెతికి చంపడానికే వచ్చినట్లు తోస్తూంది" అన్నాడు.

హనుమంతుడు ఒక బ్రాహ్మణరూపం ధరించి రామలక్ష్మణుల వద్దకు వెళ్ళాడు. వారి ఎదుటికి వెళ్ళగానే హనుమంతుడి మనస్సులో ఒక కొత్త భావం తళుక్కొత్తింది. అతడు ఉన్నది ఉన్నట్టు చెప్పాడు. హనుమంతుడు తా నెవరో తెలియనీయకుండా విషయం తెలుసుకొని

రావడానికే బయలు దేరినట్టు వాల్మీకి మహర్షి ఈ ఘటనను చిత్రించడం మొదలుపెట్టాడు. అయితే, హనుమంతుడు పోను పోను ఏ విషయాన్నీ దాచకుండా తనను గురించీ వానర రాజును గురించీ సవిస్తరంగా అంతా చెప్పివేశాడు. రామలక్ష్మణులను చూడగానే నాథుడ్ని కన్న భక్తుడిలాగ పరవశంచెంది స్తుతించాడు. తా నొక వానరుడ ననీ, తన రాజు ఆనతి ననుసరించి మారువేషం వేసుకు వచ్చాననీ చెప్పాడు.

"మనోహర రూపం గల రాజర్షులారా! మీరు దేవతల్లాగా ప్రకాశిస్తున్నారు. వ్రతనిష్ఠలో ఉన్నట్టున్నారు. తపస్సు చేయడానికి వచ్చి రనుకుంటాను. ఈ ఘోరారణ్యానికి మీరెందుకు వచ్చారు? మీరెవరో ఎరిగించండి. ఈ నదీ, ఈ అడవీ మీ రాకతో అపూర్వ శోభాయమానమై ప్రకాశిస్తున్నాయి. మీ ముఖవర్చస్సు, మీ శరీర సౌందర్యమూ ఆశ్చర్యకరంగా వెలిగిపోతున్నాయి. మీ అపూర్వ లక్షణాలను చూసి ఈ అడవిలోని జీవరాసులన్నీ భయపడుతున్నాయి. మీ పరాక్రమం చెప్పకుండానే తెలుస్తూంది. మీ రెవరు? ఏ దేశం నుంచి వచ్చారు? మీరు మహారాజ్యాన్ని ఏలడానికి పుట్టిన వారని స్పష్టంగా తెలుస్తూంది. అయినా తాపసవేషం ధరించారే! జడలూ, నారబట్టలూ కట్టి, విల్లమ్ములు చేపట్టి వచ్చారే?

నేనింత చెప్పినా మీ రెందుకు మాట్లాడరు? ఇక్కడ సుగ్రీవుడనే వానరరాజును, ఆయన అన్న అయిన వాలి, రాజ్యంనుంచి తరిమి వేయగా, అక్కడా ఇక్కడా తలదాచుకుని కాలం గడుపుతున్నాడు. నేను అతడి మంత్రిని. నాపేరు హనుమంతుడు. వాయుదేవుని కుమారుడను. రాజాజ్ఞ ప్రకారం బ్రహ్మణరూపం ధరించి మీవద్దకు వచ్చాను."

ఇలా హనుమంతుడు వినయంతో చెప్పగా విని, రాముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు:

"సోదరా! ఈ హనుమంతుడి మాటలు వింటే ఇతడిమీద నాకు ఎంపూర్ణ విశ్వాసం కలుగుతూంది. ఇతడి మాటలసొంపు చూశావా? సంత వ్యాకరణ యుక్తంగా, ఎంత సుస్వరంగా, ఎంత చక్కగా

మాట్లాడుతున్నాడో విన్నావా? వేదాలను పూర్తిగా అధ్యయనం చేసి, వ్యాకరణాన్ని పూర్తిగా నేర్చినవాడిలాగా మాట్లాడుతున్నాడు. దూత అంటే ఇలా ఉండాలి. ఇలాంటి దూతగల రాజుకు ఏ లోటూ ఉండదు. మనం ఎవరికోసం వెతుకుతున్నామో, అతడే మన మను వెతుక్కుంటూ వచ్చాడు. సుగ్రీవుణ్ణి చూడ్డానికన్నా మనం వచ్చింది. అతడే ఈ దూతను మనవద్దకు పంపాడు. ఇతడికి స్వాగతం పలికి, మన అభిప్రాయాన్ని తెలియపరుచు!"

* * *

రామలక్ష్మణులూ, హనుమంతుడూ పరస్పరం తమ తమ వృత్తాంతాలనూ, కష్టసుఖాలనూ చెప్పుకున్నారు. ఈ మాటవల్ల లక్ష్మణుడికి హనుమంతుడంటే మంచి అభిమానము కలిగింది. ఆ విషయాన్ని రాముడితో చెప్పాడు.

"సకలైశ్వర్య సంపన్నుడూ, దశరథ చక్రవర్తి జ్యేష్ఠ కుమారుడూ, అయిన మా అన్న రాజ్యాన్ని విడిచి వనవాసం చేస్తున్నాడు. మీ రాజు అయిన సుగ్రీవుడి సహాయాన్ని కోరుతున్నాడు. శాపవశాత్తు రాక్షసరూపం పొందిన కబంధుడనేవాడు మాకు, "సుగ్రీవుడనే వానర రాజు సహాయం పొందినట్లయితే రావణుడు ఎత్తుకుపోయిన సీతను తిరిగి పొందగలుగుతారు" అని చెప్పాడు. అతడి మాటప్రకారం ఇక్కడికి వచ్చాం. మీ రాజుతో సఖ్యం కోరుతున్నాం" అని లక్ష్మణుడు హనుమంతుడితో చెప్పాడు.

"సుగ్రీవుడు వాలి పీడకు గురి అయి, రాజ్యాన్నీ, భార్యనూ పోగొట్టుకున్నాడు. వాటిని తిరిగి పొందగలడన్న విషయం ఇప్పుడు ధ్రువ పడింది. మీ సఖ్యంవల్ల మా రాజు సత్ఫలితాన్ని పొందుతాడు. అతడి సహాయం వల్ల మీ కార్యమూ నెరవేరుతుంది" అని వాయునందనుడైన హనుమంతుడు చెప్పాడు. తరువాత ఆ ముగ్గురూ సంతోషంతో వానర రాజైన సుగ్రీవుడి వద్దకు బయలుదేరారు. ఆ దారి వెంట వానరులు మాత్రమే ప్రయాణం చేయగలుగుతారు. అందుకని హనుమంతుడు నిజరూపం ధరించి రామలక్ష్మణులను తన బుజాలపై ఎక్కించుకొని వెళ్ళాడు.

సత్పురుషుల హృదయాలు అతి త్వరలో అతి సులభంగా కలిసి పోతాయి. వారికి చిరకాలం సహవాసం చేయవలసిన అవసరంలేదు. సాహచర్యం నెరపవలసిన పని అంతకన్నాలేదు. ఇరువురి హృదయాల్లోనూ సహజంగా ఉదయించే భావమే తృటిలో స్నేహాన్ని కలిగిస్తుంది.

"కలియుట యలవాటు కావు హేతువులు
చెలిమికి ముఖ్యంబు చిత్తవృత్తి యగు"

వీరి ఈ చెలిమి భగవత్ప్రేరితమే. హనుమంతుడి భక్తినీ, సేవనూ రామచంద్రుడు పొందవలసి ఉంది. అందుకని ఒకరినొకరు చూడగానే పరస్పరం పూర్ణ విశ్వాసం కలిగింది. హనుమంతుడి మనస్సులో పొడమిన అన్యోన్య భావం వల్లనే వారిద్దరినీ బుజాన ఎక్కించుకుని వెళ్ళాడు. స్నేహితులూ ప్రేమికులూ, కౌగలించుకున్నట్లు, దాసూడూ భక్తుడూ అయిన హనుమంతుడు ఆనందపరవశుడై, తన స్వామిని బుజాలపై మోసుకుని వెళ్ళాడు.

ఋష్యమూకంనుండి మలయపర్వతానికి వెళ్ళగానే హనుమంతుడు సుగ్రీవుడివద్దకు పోయి, రామలక్ష్మణులు వచ్చి అతడ్ని చూడడానికి వేచి ఉన్నట్లు తెలిపాడు.

"ఈ రాముడు జ్ఞానాది సకల సద్గుణాలూగల రాజకుమారుడు. ఇక్ష్వాకు వంశజుడూ, అపార కీర్తిమంతుడూ అయిన దశరథ మహారాజుకు ఈయన జ్యేష్ఠ పుత్రుడు. పితృవాక్య పరిపాలనకోసం తమ్ముడినీ, భార్యనూ వెంటబెట్టుకొని అయోధ్య విడిచి వనవాసం చేయవచ్చాడు. దశరథ మహారాజు తన చిన్నభార్య ప్రేరేపణవల్ల రాముడికి అరణ్యవాసం విధించాడు. ఆ విధి ననుసరించే వీరు అడవిలో ఉండగా, రాకుమారులిద్దరూ లేని సమయం చూసి రాముడి భార్యను రావణుడు అపహరించుకు పోయాడు. ఆమెను వెతకడం కోసం మీ సహాయాన్ని అర్థిస్తూ వీరు ఇక్కడికి వచ్చారు. ఈ రాజకుమారులు మీ స్నేహం పొందడానికి అర్హులు. వీరి స్నేహంవల్ల మీరు సత్ఫలితాన్ని పొందగలరు" అన్నాడు హనుమంతుడు.

సుగ్రీవుడు సుందర మానవరూపం ధరించి రాజకుమారులను కలుసుకున్నాడు. రాముణ్ణి చూసి తన చేతిని చాచి "రాజకుమారా! వానరుడనైన నా స్నేహం నీకు కావలసి ఉంటే ఇదుగో, చెయ్యి చాస్తున్నాను. అందుకో! నీ గుణగణాలను, మహిమను వాయు పుత్రుడు చెప్పగా విని తెలుసుకున్నాను" అన్నాడు.

రాముడు ఆ చేతిని అందుకుని సుగ్రీవుణ్ణి కౌగలించుకున్నాడు.

హనుమంతుడు ఎండుపుల్లలు ఏరుకు వచ్చి అగ్ని చేశాడు. రాముడూ, సుగ్రీవుడూ అగ్నినే పూజించి ప్రదక్షిణం చేసి స్నేహ ప్రతిజ్ఞ చేశారు. ఇరువురం మన సుఖదుఃఖాల్లో పరస్పరం భాగ స్వాములమవుదాం. మన స్నేహం శాశ్వతంగా ఉండు గాక!" అని ప్రమాణం చేసుకొన్నారు.

రెండు పెద్ద చెట్టుకొమ్మలు ఆసనముగా, రామసుగ్రీవు లొక చోట, హనుమంతుడూ లక్ష్మణుడూ ఒకచోట ఆనందంగా మాట లాడుకుంటూ కూర్చున్నారు. సుగ్రీవుడు తన కష్టాలు చెప్పుకున్నాడు. "వాలి భయంవల్ల అడవిలో ఇటూ అటూ పరుగులు పెడుతూ, ఈ కొండమీద దాక్కొని కాలం గడుపుతున్నాను. నీవు వాలిని చంపి, నా దుఃఖాన్ని తీర్చి, నా రాజ్యాన్ని, భార్యనూ తిరిగి నేను అనుభవించేటట్లు చేయగలవా?" అని అడిగాడు.

"తప్పకుండా! ఇదిగో ఈ బాణానికి వాలి బలి అవుతాడు. సందేహించవద్దు" అన్నాడు రాముడు.

ఇలా సుగ్రీవుడూ, రాముడూ, ఇక్కడ మాట్లాడుకొంటూ ఉండగా అక్కడ అశోక వనంలో సీతకు ఎడమకన్ను అదిరింది. రాక్షస రాజైన రావణుడికి కూడా ఎడమకన్ను అదిరింది.

55. నగల మూట

సీతా వియోగంవల్ల రాముడు పడుతున్న దుఃఖాన్ని చూసి సుగ్రీవుడు ఎన్నోవిధాలా ధైర్యం చెప్పాడు.

"లక్ష్మణుడు చెప్పగా, అంతా నేను విన్నాను. నువ్వు విచారించవద్దు. ఎలా అయినా సరే, సీత ఎక్కడుందో వెతికి కనిపెడతాం. ఆమెను ఇక్కడ దాచిపెట్టినా కనిపెట్టి తెచ్చి, నీకు సమర్పిస్తాం. నీవు సందేహించకు. ఇంక ఎక్కువరోజులు వేచి ఉండనక్కర లేదు కూడా. త్వరలోనే ఈ కార్యాన్ని నెరవేరుస్తాం. ఒక రాక్షసుడు ఒక స్త్రీని ఎత్తుకొని ఆకాశమార్గాన పోతుండగా నేను చూశాను. నాతో ఉన్న ఈ వానరులూ చూశారు. ఆమె గజగజ వణికిపోయి విలపిస్తూ 'రామా! లక్ష్మణా!' అని కేకలు పెడుతూ పోవడం కళ్లారా చూశాం. ఆమెకూడా మమ్మల్ని చూసింది. చూసి, తన నగలు వొలిచి పైటచెంగులో మూటకట్టి, కింద పారవేసింది. ఆ మూటను మేం భద్రపరిచాం. ఒకవేళ అవి నీ భార్య సీత యొక్క ఆభరణాలే యేమో చూడవచ్చు" అన్నాడు.

ఈ మాట వినగానే రాముడు అపరిమితమైన ఆత్రంతో "ఏది, ఏది?- ఆ మూట ఏది? తే! తే! చూస్తాను" అన్నాడు.

వెంటనే వానరులు గుహలో దాచిపెట్టిన నగల మూటను పట్టుకువచ్చారు. మూటకట్టిన చీరచెంగు చూస్తూనే, రాముడికి దుఃఖం పొంగి పొర్లింది. చిన్నమూటగా కట్టిన ఆ చీర చెంగు చూడగానే, రాక్షసుడిచేత చిక్కి పరితపించిన సీత దుస్థితి రాముడి కళ్లకు కట్టినట్టయింది.

"లక్ష్మణా! ఈ మూట విప్పి చూడు, నా కళ్ళతో నేను చూడలేను" అని, కళ్లు రెండూ మూసుకున్నాడు.

లక్ష్మణుడు ఆ మూట విప్పి, నగలను చూసి అందులో కాలి నూపురాలను గుర్తుపట్టి "ఇవిగో, ఇవిగో, ఇవి మా సీతమ్మ నూపురాలే!- సందేహమేమీ లేదు!" అన్నాడు.

కాలి అందెలను మాత్రమే లక్ష్మణుడు గుర్తు పట్టడాన్ని గురించి భక్తులు ఎంతో కొనియాడుతారు. దానిమీద విపులముగా వ్యాఖ్యానం చేయడం ఒక సంప్రదాయమయింది.

తర్వాత రాముడు అన్ని ఆభరణాలనూ బాగా గుర్తుపట్టాడు. వాటిని కళ్ళకు అద్దుకొని "గడ్డిమీద పడ్డంవల్ల, ఒక్కటీ పోకుండా, అన్నీ సరిగ్గా వున్నాయి. చూశావా లక్ష్మణా!" అన్నాడు.

రాముడికి దుఃఖానికితోడు ఇప్పుడు రావణుడిపై తీవ్రకోపం కూడా వచ్చింది. "సీతను ఎత్తుకొనిపోయిన ఈ రాక్షసుడి కోసం యమ మందిరద్వారం తెరచి ఉంది. వాడినీ, వాడి కులాన్నీ ఇప్పుడే నాశనం చేస్తా. ఇదే నా నిశ్చయం!" అని శపథం పట్టాడు.

* * *

ఇలా రాముడికి భార్యావియోగ దుఃఖమూ, రక్కసునిపైన కోపమూ అధికాధిక మవడం చూసి, సుగ్రీవుడు చింతించాడు. పరస్పర స్నేహ సహకారాలను గురించి అగ్నిసాక్షిగా ప్రమాణాలు చేసినప్పటికీ ఏ కార్యం ముందు జరగాలి? ఏది తర్వాత జరగాలి– అన్న ప్రశ్న సుగ్రీవుడి మనస్సును వేధిస్తూనే ఉంది. రాముడి కోపావేశాన్నీ దుఃఖాన్నీ సుగ్రీవుడు బాగా తెలుసుకున్నాడు. అందుకని అతడితో మరి వాదించి లాభం లేదనుకున్నాడు. అలా చేస్తే రాముడికి తనమీద సందేహం కూడా కలగవచ్చు. కొత్తగా ఏర్పడిన ఈ సఖ్యం కూడా చెడిపోవచ్చు అనుకున్నాడు. వెంటనే సీతాన్వేషణకు బయలుదేరినా, రావణుడితో యుద్ధానికి తలపడినా, వాలి ఏం చేస్తాడో, మరి! వాలి వానరరాజ్య పదవిలో ఉన్నంతకాలం, సుగ్రీవుడి బలం ఎంతవరకు చెల్లుతుంది? అప్పుడు రాముడి కార్యం సిద్ధించడం కూడా అనుమానాస్పదమే కావచ్చు, అని తలపోశాడు, సుగ్రీవుడు. కనుక వానరరాజ్యాన్ని తిరిగి తాను సంపాదించడం మొదటి పని. ఇరువురి కార్యసిద్ధికీ కూడా ఇది అవసరం అన్న నిర్ణయానికి వచ్చాడు. నీతిశాస్త్రాన్నీ, రాముడి మనస్థితినీ ఎరిగి ఉన్నాడు కాబట్టి ఇక్కడ చాకచక్యంగా నడుచుకోవాలని నిర్ణయించుకున్నాడు.

"మహాపాపి అయిన ఈ రాక్షసుడి బలపరాక్రమాలూ, నివాసస్థానమూ నాకు తెలుసు. కాని అతడు సీతను ఎక్కడ దాచాడో మాత్రం తెలియదు. ఎక్కడ దాచినా, వెతికి, వాడిని వధించడానికి మార్గం అన్వేషించే తీరుతాం. నువ్వేమీ సందేహ పడకు. దుఃఖించకు.

ధైర్యం అవలంబించు. ఇది ముఖ్యం. ఆ రాక్షసుడు డెక్కడున్నాడో వెతికిపట్టి, అతడినీ, అతడి కులాన్నీ కూకటివేళ్ళతో నాశనం చేస్తాం. నీ శౌర్యం వ్యర్థం కారాదు. నీ పౌరుషాన్ని చూపి, రాక్షసుల్నీ సంహరించి, కీర్తి గడించు. మనస్సులో ఎంతమాత్రమూ బెంబేలు పడకు.

నన్ను చూడు! నేనూ నీ లాగానే భార్యను పోగొట్టుకున్నాను. రాజ్య భ్రష్టుడనయ్యాను. అవమానాలకు పాల్పడుతున్నాను. అయినా, దుఃఖాన్నీ, ఉద్రేకాన్నీ అణచుకుని ధైర్యంగా ఉన్నాను. చూడగా నే నొక వానరమాత్రుడను. నాకే ఇంత ధైర్యంగా ఉండడానికి వీలయినప్పుడు, నీకు అదొక కష్టమైన పనికాదే! కంట నీరు పెట్టకు. పొంగుతున్న దుఃఖాన్ని ఆపుకో! నీ వంటి జితేంద్రియులు భయ దుఃఖాలవల్ల మనస్సు చెదరకుండా ఉంచుకోగలరు. లేనినాడు, శోకంలో చిక్కుకుని సముద్ర మధ్యాన పెనుతుపానుకు చిక్కిన ఓడ లాగ మునిగిపోతాం. శోకానికి ఆహుతి అయిననాడు ఏ కార్యాన్నీ సాధించలేం కదా! కనుక మిత్రమా! దుఃఖాన్ని అణచుకో! నిన్ను బతిమాలుకుంటున్నాను. దుఃఖం మహా చెడ్డది. మనల్ని తీసుకు పోయి అపజయమనే కూపంలో కూలదోస్తుంది. ధైర్యాన్ని చిక్కబట్టుకో. నేను నీకు ఉపదేశం చేసేపాటివాడను కాను సుమా. మిత్రబాంధవ్యంతో, నాకు ఉచితమని తోచిన మాట చెపుతున్నాను. నీకు తెలిసిన విషయాన్నే గుర్తు తెస్తున్నాను. అంతే!''

ఇలా సుగ్రీవుడు చెప్పిన ప్రియవచనాలు రాముడి మనస్సు కెక్కాయి. రాముడు కంటి నీరొత్తుకున్నాడు. సీత చీర చెరగునూ, ఆభరణాలనూ చూడ్డంవల్ల కలిగిన మనోవైకల్యాన్ని తొలగించుకుని, ధైర్యాన్ని చిక్కబట్టుకున్నాడు.

"నీ మహా మైత్రిని పొందాను. సుగ్రీవా! నీ ఆలోచన ప్రకారమే నడుచుకుంటాను. సీతాన్వేషణను గురించి చక్కగా ఆలోచించు. నీ కార్యాన్ని నా కార్యంగా భావించి తోడ్పడతాను. ఇది నా దృఢ నిశ్చయం. నమ్ము. ఇంతవరకు నే నెన్నడూ అబద్ధమాడలేదు. ఇకముందు ఆడను. మన స్నేహం ఎన్నటికీ వృథా కాబోదు. ప్రమాణం

చేసి చెపుతున్నాను. నీ కష్టం తీరేమార్గం ఏమిటో సంకోచం లేకుండా చెప్పు. దాన్ని నేను అక్షరాలా నిర్వహిస్తాను" అని రాముడన్నాడు.

రాముడి మాటలు విన్న సుగ్రీవుడూ అతడి మంత్రులూ అమితానందం పొందారు. తమ కష్టాలు గట్టెక్కి సుగ్రీవుడు తిరిగి వానర రాజ్య పట్టభద్రుడవుతాడని వారు నిశ్చయించుకున్నారు.

56. సుగ్రీవుడి కథ

సుగ్రీవుడు తనకూ తన సోదరుడైన వాలికీ వచ్చిన విరోధ వృత్తాంతాన్ని రాముడికి సవిస్తరంగా చెప్పాడు.

"నా అన్న వాలి. వానరరాజ్య పట్టాభిషిక్తుడై, కిష్కింధలో రాజ్యమేలుతూ ఉండేవాడు. అతడు మహా పరాక్రమశాలి. అతడి పట్ల భక్తి అనురాగాలతో నేను యువరాజుగా ఉండేవాడిని. వాలికీ, మాయావి అనే ఒక రాక్షసుడికీ పాత విరోధముంది. ఒక రాత్రి ఆ రాక్షసుడు కిష్కింధకు వచ్చి వాలిని పోరుకు పిలిచాడు.

రాత్రిపూట ఆ రాక్షసుడు పెట్టే బొబ్బలు విని, నిద్రపోతున్న వాలి కోపంతో లేచాడు. వెంటనే వాడితో పోరాడానికి వెళ్లాడు. నేను అతడికి తోడుగా వెళ్లాను. మేమిద్దరం రావడం చెన్నెలవెలుగులో చూసి, మాయావి పరుగెత్తుకుపోయి, ఒక గుహలో దాక్కున్నాడు. వాలి కూడా వాణ్ని తరుముతూ ఆ గుహలో ప్రవేశించాడు. వాళ్ళతో నేనూ గుహలో ప్రవేశిద్దామనుకున్నాను. కాని వాలి నాకు అడ్డుతగిలాడు. ఒంటరిగానే తను ఆ దుష్టుడ్ని చంపాలని చెప్పి నన్ను ఆ గుహ వాకిటనే కావలి ఉంచాడు. అలా చెప్పి, ఆయన గుహలో ప్రవేశించాడు.

లోపలికి వెళ్లినవాడు ఎన్నిరోజులు గడచినా తిరిగి రాలేదు. అన్నకు ఏం అయిందా అని నేను చింతిస్తూ ఉండగా, గుహలోనుంచి రాక్షసుల బొబ్బరింతలు వినవచ్చాయి. దాంతోపాటు గుహలో

నుంచి నెత్తురుకూడా ధారకట్టి ప్రవహింప సాగింది. అది చూసి, వాలిని మాయావీ, మరికొందరు రాక్షసులూ కలిసి. చుట్టుముట్టి, చంపి వేశారనుకున్నాను. రక్కసులు వచ్చి నన్ను కూడా చుట్టుముట్టి బోతారని తలచి, పెద్ద రాతిబండతో గుహద్వారాన్ని మూసివేశాను.

దుఃఖంతో కిష్కింధకు తిరిగి వచ్చాను. వాలి మరణ వార్తను ఎవరికీ చెప్పకుండానే రాజకార్యాలను చూసుకుంటూ వచ్చాను. రాజు లేకపోతే రాజ్యం పాడై పోతుందనీ, ఎన్ని రోజులైనా వాలి తిరిగి రాలేదు కనుక నీవే పట్టం కట్టుకుని రాజ్యం ఏలవలసిందనీ, నన్ను వానర ప్రజలు బలవంతపెట్టారు. నేనూ అందుకు ఒప్పుకున్నాను.

కొంతకాలమెంతరువాత మాయావినీ, వాడికి తోడుగా వచ్చిన రాక్షసులనూ చంపివేసి, వాలి తిరిగి వచ్చాడు. గుహకు అడ్డుగా రాతిబండ ఉండడం చూసి "సుగ్రీవా, సుగ్రీవా!" అని లోపలినుంచి ఎలుగెత్తి పిలిచాడు. నేను అక్కడ లేకపోవడం చేత అదేమీ నాకు తెలియలేదు. వాలికి నామీద చాలా కోపం వచ్చింది. ఆ కోపంతో రాతిబండను ఒక తన్నుతన్ని, కిష్కింధకు వచ్చేశాడు.

నేను పట్టాభిషేకం చేసుకుని, రాజ్యమేలడం చూడగానే, ఆయన కోపం మిన్ను ముట్టింది. నన్ను నానా దుర్భాషలూ ఆడిపోశాడు. జరిగిందంతా చెప్పాను. "రాక్షసుడు నిన్ను చంపేసి ఉంటాడనుకొని, ఇలా చేశాను. ప్రజలు ఒత్తిడి చేయడంవల్ల పట్టాభిషేకం చేసుకున్నాను. ఈ రాజ్యం నీది నీదినువ్వే తీసుకో! నేను మునుపటి లాగానే నీకు దాసుడుగా ఉంటాను" అని చెప్పి ఆయన కాళ్ళమీద పడాను. నా మాటలు ఆయన నమ్మలేదు. నేను దురాశతో గుహ వాకిలి మూసివేసి అక్రమంగా పట్టాభిషేకం చేసుకున్నట్లు ఒక వుద్దేశం ఆయన మనస్సులో అచ్చు పడిపోయింది. నన్ను తన్ని, నగరంనుంచి తరిమి వేశాడు. "తిరిగి ఈ చాయలకు వస్తే నిన్ను చంపేస్తా" అని హెచ్చరించాడు. అప్పుడు నేను కట్టుబట్టలతోనే పారిపోయాను. అది మొదలు అడవులలో, కొండలలో, తలదాచుకుంటూ తిరుగుతున్నాను. అన్నీ పోగొట్టుకుని ఇప్పుడు ఈ స్థితిలో ఉన్నాను. ఈ నలుగురు వానరులే నాకు తోడునీడగా ఉంటున్నారు. కోపంవల్ల

యథార్థాన్ని గుర్తించక, నా అన్న నన్నిలాగా అన్యాయం చేశాడు. అతి పరాక్రమశాలి అయిన ఆ వాలిని సంహరించి, నన్ను కాపాడాలి!" అని అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడి స్థితిచూసి, రాముడి మనస్సు కరిగింది. "నీకు నేను మాట ఇచ్చాను. ఆ మాటకు తిరుగులేదు. భయపడకు. నా బాణం వెళ్ళి వాలి శరీరాన్ని చీలుస్తుంది పగవాడైన నీ సోదరుణ్ణి చంపి, నీ చింత బాపుతాను" అని శపథం చేశాడు.

* * *

పురాణాలు చేసే ఉపదేశాలకు ఈ వాలి సుగ్రీవుల ఉదంతం చక్కటి ఉదాహరణ.

వాలి నడవడిలో పెద్ద తప్పులేదు. సుగ్రీవుడిలోనూ తప్పు పట్టడానికి వీలులేదు. కోపంవల్ల బుద్ధి మందగిస్తుంది. కోపానికి వశులమై పోతే, యథార్థాన్ని చూడగల శక్తిని కోల్పోతాం. దానివల్ల వినాశం పొందుతామని శాస్త్రాలు చెబుతున్నాయి. వాలి కోపతాపాలూ, అందును ఫలితమైన మరణమూ- ఇవే ఇందుకు ప్రబల తార్కాణాలు. సుగ్రీవుడు తను చేసిన పనిని ఉన్నదున్నట్లు వినయంతో చెప్పిచూశాడు. అది వాలి బుద్ధికి ఎక్కలేదు. వాలి పెనుకోపమే అందుకు కారణం.

సుగ్రీవుడున్నూ తొందరపడి, తన అన్న మరణించాడనే నిర్ణయానికి వచ్చాడు. రక్కసులు వచ్చి తనను కూడా చంపివేస్తారేమోనన్న భయంతో గుహ వాకిలి మూసివేసి, కిష్కింధకు మరలిపోయాడు. అతడికి మొదట యేమో రాజ్యమేలాలని లేదుకాని ప్రజలు నిర్బంధించిన మీదట అందుకు ఒప్పుకున్నాడు. ఆశలో పడిపోయాడు. దీర్ఘాలోచన చేయకుండా నడుచుకున్నాడు. దీర్ఘాలోచన లేకుండా చేసే పనులు అనర్థాలకు దారితీస్తాయని సుగ్రీవుడి కథవల్ల మనకు బోధపడుతుంది.

ఇతరుల స్థాయికు ఆశపడరాదు. ఆశను అణచుకొనడం చాలా కష్టం. అందులో విజయం పొందాలంటే అతి మెలకువ కలిగి ఉండాలి. భరతుణ్ణి కూడా పట్టం పట్టుకొమ్మని ఇలాగే అయోధ్యలో ప్రజలూ

మంత్రులూ నిర్భంధించారు. అయినా అతడు ఒప్పుకోలేదు. ఇదే భరతుడిలో వుండే గొప్పతనం. అయితే సుగ్రీవుడు ఒప్పేసుకున్నాడు. అందువల దుఃఖానికి పాల్పడ్డాడు. భరతుడు రాజ్యాన్ని ఒల్లకపోవడం వల్లనే గొప్ప కీర్తి పొందాడు.

రామాయణం, ఒక్కొక్క ఘట్టంలో సాధారణంగా మనం మన జీవితాల్లో అనుసరించ దగిన ధర్మ వివరణలుంటాయి. ఈ వివరణలు కొన్నిచోట ప్రత్యక్షంగాను, మరికొన్ని చోట్ల పరోక్షంగాను ఉంటాయి. భక్తితో ఆలోచిస్తే అవన్నీ సమగ్రంగా గోచరిస్తాయి.

57. సుగ్రీవుడి సందేహం

భార్యనూ, రాజ్యాన్ని తిరిగి పొందాలన్న ఆశ ఇంకా సుగ్రీవుడికి పోలేదు. అయితే అందు కతడు మార మేదీ వెతకలేదు. వాలి పరాక్రమం దాటరాని ఒక కొండలాగా అడ్డు నిలిచింది.

రాముడి సహాయంతో కార్యాన్ని సాధించవచ్చునని ఒకవంక మంత్రి హనుమంతుడు ధైర్యం చెపుతున్నా, సుగ్రీవుడి మనస్సులో సందేహం పోలేదు. ఈ రాముడి పరాక్రమంతో వాలిని జయించడం సాధ్యమా? ఇది కానిపనిలాగా కనిపిస్తూందే అని సుగ్రీవుడు సందేహిస్తూనే ఉన్నాడు. వాలి దేహం ఇనుములాంటిది. అతడ్ని రాముడెలా చంపగలడు?అనేది సుగ్రీవుడికి పట్టుకున్న సందేహం.

అయినా, ఇది తప్ప వేరుమార్గం లేదు. నిరాశ చెందడానికా మనస్సు అంగీకరించడం లేదు. అందుకని ముందు రాముడి బలాన్ని పరీక్షించి చూడాలని సుగ్రీవుడు నిశ్చయించుకున్నాడు.

అయితే మిత్రుడి బలాన్ని పరీక్షించడం ఎలాగ? తను కార్యం సాధించిపెడతానని రాముడు ప్రతిజ్ఞ చేశాడు. సరే. అయినా అతడి పరాక్రమాన్ని శోధించడానికి వీలు ఎలా కల్పించుకోవడం? అని ఇలా సుగ్రీవుడు పరిపరివిధాల యోచించసాగాడు. సుగ్రీవుడు మంచి మాటనేర్పరి. అందుకని మెల్లగా ఈ ప్రస్తావన తెచ్చాడు:

"రామచంద్రప్రభో! నీ మాటలవల్ల నా మనస్సు ఊరడిల్లింది. నీ పరాక్రమాన్ని నే నెరుగుదును. నీ బాణాలు ముల్లోకాలనూ నాశనం చేయగలవు. అలాంటి బాణాలకు వాలి శరీరం ఒక లెక్కా? అయినా ఈ వాలి పరాక్రమాలను గురించి నీకు తెలియపరచడం నా కర్తవ్య మనుకుంటున్నాను. వాలి వేకువజామునే లేచి, నాలుగు సముద్రాలకూ వెళ్లి, సంధ్యావందనం చేస్తాడు. పెద్ద పెద్ద బండలను చెండులలాగా ఎగరవేసి ఆడుకుంటాడు. అడవిలో పెను మాకులను గడ్డిపోచల్లాగా పెకలించి వేస్తాడు.

దుందుభి అనే రాక్షసుడు వరప్రసాదంవల్ల వెయ్యి ఏనుగుల బలం సంపాదించాడు. ఆ బలాన్ని ప్రదర్శించడానికి దారి తోచక, సముద్రరాజును కయ్యానికి పిలిచాడు. సముద్రరాజు వాడ్ని చూసి 'నీతో సమానులతోకదా కయ్యం చేయడం ఉత్తరాన హిమవంతుడున్నాడు. పోయి అతడితో పోరాడు. నేను నీకు సమానుడను కాను' అన్నాడు. దుందుభి వెళ్ళి హిమవంతుణ్ణి పోరుకు పిలిచాడు. 'నువ్వు అతి బలవంతుడనని తలుస్తున్నావట? నీ బలాన్ని పరీక్షించడానికి వచ్చాను. రా, నాతో కయ్యానికి!' అని పిలిచాడు. కారెనుము రూపు ధరించిన ఆ రాక్షసుడు తన కొమ్ములతో హిమవన్నగాన్ని కుమ్మి బండలను దొర్లిస్తూ అట్టహాసం చేశాడు. హిమవంతుడు కోపాన్ని అణచుకొని 'నాయనా! నీవు నా మీది కెందు కురుకుతున్నావు? నాకు యుద్ధంలో నేర్పులేదు. నేను సాధువులైన మునులకు చోటిచ్చి, వారితో కాలం గడుపుతున్నాను' అన్నాడు. "అలాగైతే నాకు సమఉజ్జీ అయిన బలవంతు డెవడో చెప్పు! అతడితోనే యుద్ధం చేస్తాను ఇవ్వాళ" అని ఆ రాక్షసుడు మొండిపట్టు పట్టాడు.

ఈ మాట విన్న హిమవంతుడు "దక్షిణాన నీతో సమానుడైన బలవంతు డొకడున్నాడు. వాలి అనే వానరరాజు ఇంద్రుడివంటి పరాక్రమశాలి. నీవు యుద్ధానికి పిలవదగిన వీరుడు అతడే. నీ కిష్టం ఉంటే, వెంటనే అతడివద్దకు పోయి కయ్యానికి పిలు" అన్నాడు.

దుందుభి వెంటనే వాలి నగరానికి బయలు దేరాడు. కిష్కింధ కోట సింహద్వారం దగ్గర నిలిచి అట్టహాసం చేశాడు. చెట్లు పెరికి

కోట వాకిలిని కొమ్ములతో కుమ్ముతూ గర్జించాడు. వాలిని పిలిచి 'రా ! బయటకు రా ! నీకు నిజంగానే బలం ఉంటే నాతో పోరు సలుపు' అని బొబ్బలు పెట్టాడు.

అంతఃపురంలో సుఖంగా పడుకున్న వాలి ఈ బొబ్బరింతలు విన్నాడు. వెంటనే లేచి బైటికి వచ్చాడు. అంతఃపురాంగనలు కూడా ఆయనతో బైటికి వచ్చారు. వాలి 'దుందుభీ! ఎందు కిలా నా నగరు వాకిట ఘోషిస్తున్నావు ? ప్రాణాలమీద తీపి ఉంటే వెంటనే ఇక్కడ్నించి కదిలి పో !' అన్నాడు.

ఇలా నిర్లక్ష్యంగా మాట్లాడడం చూసి దుందుభి కోపంతో 'నీ భార్యలముందు డంబాలు పలక్కు ! తో పోరాడాలని వచ్చాను. నీకు పరాక్రమం ఉంటే నాతో యుద్ధానికి రా. వ్యర్థ ప్రలాపాలు వద్దు. ఇప్పుడు నీవు శయ్యనించి లేచి నిద్రమైకంలో వచ్చావు. నేను ఉదయంవరకూ కనిపెట్టుకొని ఉండడానికి ఒప్పుకుంటాను. మద్యం తాగి బలం పోగొట్టుకున్న వాడిపైన కయ్యానికి తలపడడం పాపం కదా ! కనుక నువ్వు ఈ రాత్రి సమస్తమైన సుఖాలూ అనుభవించి, అందరి అనుజ్ఞలూ తీసుకుని, సవ్యమైన స్థితిలో రా ! అప్పుడు నిన్ను వధిస్తాను' అన్నాడు.

దుందుభి మాటలు చూస్తే, వాలికి నవ్వొచ్చింది. ఆడవాళ్లను లోపలికి పొమ్మన్నాడు. 'ఓ రాక్షసా ! నేను మైకంలో లేను. యుద్ధానికి ముందు ఉత్సాహం కోసం తాగి వచ్చాననుకోవద్దు. నీకు యుద్ధమే కావలిస్తే ఇప్పుడే నేను సిద్ధంగా ఉన్నాను. కాచుకో' అని చెప్పి, ఆ కారెనుము రక్కసుడ్ని తోకపట్టి, గిరగిర తిప్పి, విసిరివేశాడు. దాంతో దుందుభి నెత్తురు గక్కుకుంటూ కింద పడ్డాడు.

కొంత సేపటికి అసురుడు తేరుకుని లేచాడు. ఇదరికీ గొప్ప దెబ్బలాట జరిగింది. ఇంద్రపుత్రుడైన వాలి ఆ మహిషాసురుణ్ణి పిడికిటి పోటుతో చంపాడు. చచ్చిపడిన ఆ అసురుణ్ణి వాలి పైకెత్తి విసిరి వేసేసరికి వాడి కళేబరం ఆమడ దూరాన పడింది.

రాక్షసుడి కాయాన్ని అలా విసిరివేయగా, నెత్తురు చుక్కలు గాలి కెగిరి, మతంగ మహాముని ఆశ్రమంలో పడ్డాయి. ఈ పని చేసింది

ఎవరని మహర్షి కోపంగా చూశాడు. జరిగిన సంగతి తన దివ్య దృష్టితో కనిపెట్టాడు.

గర్వంతో ఇలా శవాన్ని విసరి, రక్త బిందువులతో ఆశ్రమాన్ని కలుషితం చేసిన వాలి ఆయన కోపాగ్నికి గురి అయ్యాడు. 'ఈ పని చేసిన దుర్మార్గుడు ఈ ఆశ్రమ భూమిలో ప్రవేశించగానే ప్రాణం విడుచుగాక' అని శపించాడు. రామా! అందువలనే, నేనూ, నా మంత్రులూ ఇక్కడ క్షేమంగా ఉన్నాం. వాలి ఇక్కడికి రాలేడు. నేను ఎక్కడికి వెళ్లినా అతడి బాధ తప్పదు.

ఋషి శాపంవల్ల అతడిక్కడ అడుగుపెట్టడానికి భయపడుతున్నాడు. చూడు, ఈ సాల వృక్షాలు. వాలి ఈ వృక్షాలలో ఒక దాన్ని పెరికి ఒక్క ఊపు ఊపితే చాలు, చెట్టునివున్న ఆకులన్నీ రాలిపోతాయి. అతడి పరాక్రమం అలాంటిది. అలాంటి వాడితో వైరం తెచ్చుకున్న నేను ధైర్యంగా ఎలా ఉండగలను?" అని అన్నాడు. సుగ్రీవుడు.

సుగ్రీవు డిలా వాలి బల పరాక్రమాలను గురించి మాట్లాడ్డంలో అతడి ఉద్దేశాన్ని, అతడి భయాన్ని లక్ష్మణుడు గ్రహించాడు.

"సుగ్రీవా: నీ సందేహం తీరడంకోసం రాముడి బలంకూడా నీవు చూడవచ్చు" అన్నాడు.

"నాకు సందేహమేమీ లేదు. నివురు కప్పిన నిప్పులా కనబడే రాముడి బలం నాకు తెలుసు. నేను రాముడి శరణు పొందాను. అయినా వాలి బలపరాక్రమాలు ప్రత్యక్షంగా తెలిసిన నాకు అతడ్ని తలుచుకున్నప్పుడల్లా భయం వస్తుంది" అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడి భక్తి, శరణాగత స్థితి, వాలిపట్ల అతడి భయమూ, చూసిన రాముడు అతడి సందేహాన్ని తీర్చడమే మంచిదని తలిచాడు. అక్కడ కొండలాగా పడివున్న దుందుభి కంకాళాన్ని కాలిబొటన వేలితో మీటేసరికి అదిపోయి పది ఆమడల దూరంలో పడింది.

అది చూసి సుగ్రీవుడు ఎంతగానో సంతృప్తి పడ్డాడు. కాని దుందుభి కాయాన్ని వాలి విసిరినప్పుడు, రక్త మాంసాలవల్ల అది బిరువుగా ఉంది. ఇప్పుడది కేవలం ఎముకల పోగు మాత్రమే!

అందువల్ల ఈ పరీక్ష ఏమంత గొప్పది కాదనుకున్నాడు రాముడు. తన విల్లెత్తి, చెవివరకు నారి సారించి, సాల వృక్షాల మీదికి ఒక్కబాణం వదిలాడు. సుగ్రీవుడు చూపిన సాలవృక్షాన్నీ, దానివెనుక వరసగా ఉన్న మరి ఆరు సాల వృక్షాలనూ, బంగారు కట్టుగల ఆ అమ్మ దూసుకుపోయి, నేల లోపలికి దూరిపోయింది. అక్కడినుంచి తిరిగివచ్చి అది రామచంద్రుడి అమ్ముల పొదిలో దూరింది.

ఇది చూసిన సుగ్రీవుడు పరవశుడైపోయాడు. వాలి వజ్ర దేహాన్ని రాముడి శరం భేదించేతీరుతుందని నిశ్చయించాడు. రామ చంద్రుడికి సాష్టాంగ దండప్రణామాలు చేశాడు.

"నీ పరాక్రమాన్ని కళ్లారా చూశాను. దేవతలంతా ఇంద్రుణ్ణి ముందు పెట్టుకొని ఎదిరించినా, నీ విజయం నిశ్చయం. అటువంటిది, నీకు వాలి ఒక లెక్కా? నీ సఖ్యాన్ని పొందిననాడే నా దుఃఖం తీరి పోయింది. వాలిని వెంటనే సంహరించి నన్ను కాపాడు. నేను ఈ రోజే కిష్కింధకు వెళతాను" అన్నాడు.

లక్ష్మణు డందుకు సమ్మతించాడు.

అలాగే కానిమ్మన్నాడు రాముడు. వారంతా కిష్కింధకు బయలుదేరారు. ముందు సుగ్రీవుడు, వెళ్ళాడు. వెనుక రాముడు వెళ్లి దట్టమైన అడవిలో ఒక చెట్టుమాటున నిరీక్షిస్తూ నిలబడ్డాడు.

* * *

సుగ్రీవుడు కిష్కింధకు వెళ్లి యుద్ధనినాదం చేశాడు. అది విని వాలి అతికోపంతో కోట కొమ్మునుంచి దిగి, ఉదయ సూర్యుడిలాగా ప్రకాశిస్తూ, వెలుపలికి వచ్చాడు. ఇరువురూ కాసెకోకలు బిగించి చేతులు కలిపారు. ఉభయులకూ మధ్యని ఉగ్రమైన ముష్టియుద్ధం జరిగింది. ఇలా ఘోరయుద్ధం జరుగుతూ ఉండగా, విల్లువంచి పట్టుకున్న రామచంద్రుడు తొట్రుపాటులో పడ్డాడు. ఆ యిద్దరిలో వాలి యెవరో, సుగ్రీవుడెవరో రాముడికి తెలియలేదు. ఇద్దరి రూపురేఖలూ ఒకటే. ధరించిన ఆభరణాలూ ఒకేమోస్తరువి. ఒకే విధమైన పరా

క్రమంతో వారు మల్లయుద్ధం చేస్తున్నారు. కనుక అందులో వాలి యెవరో, రాముడు తెలుసుకోలేక పోయాడు. కనుక, బాణం ఎలా ప్రయోగిస్తాడు?

ఇంతలో సుగ్రీవుడు బాగా దెబ్బతిన్నాడు. రాముడు ఏమీ చేయలేదే అనుకున్నాడు. ఇక తన ప్రాణం దక్కదన్న భయంతో ఒక్కదాటున ఋష్యమూక వనానికి పరుగు తీశాడు.

"ఇప్పటికి బతికిపోయావు పో!" అంటూ వాలి, తమ్ముడు సుగ్రీవుడితో అని తన కోటకు తిరిగిపోయాడు.

దెబ్బలు తగిలి దుఃఖిస్తూ నిలబడిన సుగ్రీవుడివద్దకు రామలక్ష్మణులు వెళ్లారు. వానరరాజు రాముడి ముఖం చూడలేకపోయాడు. రాముడు ఆడినమాట తప్పాడని సుగ్రీవుడి కోపం. అందుకని చూపులు కిందికి వాల్చి ఇలా అన్నాడు:

"వాలిని చంపడం ఇష్టంలేదని ముందుగానే చెపితే బాగుండేది కదా? వాలిని పోరుకు పిలవమని నాతో ఎందుకు చెప్పావు?"

"సుగ్రీవా! కోపించకు. నేను చెప్పేది సావధానముగా విను!" అని రాముడన్నాడు. "నే నెందుకు బాణం విడవలేదో కారణం చెపుతాను. నీవూ వాలీకూడా వేషభూషణలలో, ఒడ్డూ, పొడవుల్లో, నడక తీరులో, అచ్చం ఒక్కలాగే ఉన్నారు. యుద్ధం ప్రారంభించిన తరువాత మీలో వాలి యెవరో, సుగ్రీవు డెవరో తెలుసుకోవడానికి వీలులేక, విభ్రాంతితో నిలిచిపోయాను. నేను బాణం విడిచి వాలికి బదులుగా నిన్నే చంపి ఉంటే, ఏమయి ఉండేది? సోదరులైన మీరు చేసిన సింహనాదాలు, మీ ముఖకాంతి, మీరు యుద్ధంచేసిన పద్ధతి అంతా ఒక్కలాగే ఉన్నాయి. మీలో కొంచెమైనా వ్యత్యాసం కనిపించనేలేదు. ఈ స్థితిలో నేను ఏమీ చేయలేక నిలబడవలసి వచ్చింది. వాలి అనుకుని నిన్ను చంపి ఉంటే, తర్వాత నా గతి ఏం కాను? బతికించడానికని వచ్చి చంపివేసిన మూఢుడ నవుతానే. పాపిని అవుతానే. సుగ్రీవా! అందుకని కోపించకు. మళ్లీ వాలిని కయ్యానికి పిలు. వాలిని తప్పక చంపుతాను. లక్ష్మణా! ఇదిగో! అందంగా పూచిన ఆ తీగెను

తీసుకురా. దాన్ని మాలగాకట్టి సుగ్రీవుడి మెడలో వెయ్యి దాన్ని బట్టి యుద్ధంలో వాలి ఎవడో, మన మిత్రుడెవడో, సులభంగా గుర్తు పట్టవచ్చు. మనం సంకల్పించిన కార్యాన్ని నెరవేర్చాలి. వాలి నేల పైన పడి పొర్లడం నేడే చూస్తావుగా, సుగ్రీవా!" అన్నాడు, రాముడు.

సుగ్రీవుడు ఊరడిల్లి, ఉత్సాహం పొందాడు. లక్ష్మణుడు పూలతీగెను మాలగా కట్టాడు. ఆ మాలను ధరించి సుగ్రీవుడు మున పటికన్న అందంగా ప్రకాశించాడు. వెంటనే కిష్కింధా నగరుకు వెళ్లి, వాకిట నిలబడ్డాడు. ఆయన వెంట రామలక్ష్మణులూ వెళ్లారు.

58. వాలివధ

సూర్యాస్తమయం కావస్తూంది. మళ్లీ సుగ్రీవుడు సింహనాదం చేస్తూ, వాలిని యుద్ధానికి పిలిచాడు.

హాయిగా పడుకొని వున్న వాలి ఇది విని కలవర పడాడు. ఇదేంటో అతనికి బోధపడలేదు. అతడికి భయం కలిగిందని చెప్పడానికి వీల్లేదు కాని, ముఖం కొంచెం వెలవెలపోయింది. వెంటనే రోషం వచ్చింది.

దెబ్బతిని ఓడి, భయపడి పారిపోయిన తమ్ముడు మళ్లీ ఇలా వచ్చి గర్జిస్తాడా అని వాలికి పట్టరాని కోపం వచ్చింది. లేచి, వెంటనే అతడ్ని హతమార్చాలని నిశ్చయించి బయలుదేరాడు. అతడు నేలను కాలితో తట్టేసరికి భూమి చీలిపోతుందా అన్నట్లు కనిపించింది.

"వద్దు! ఈ వేళ వెళ్ళకండి. రేపు చూసుకుందాం" అని 'తార' అతడ్ని ప్రేమకొద్దీ అడ్డగించింది.

తార వాలి పట్టపురాణి. మంచి బుద్ధిశాలిని. ఆమె భర్తను కౌగలించుకుని "వద్దు. ఇప్పుడు యుద్ధానికి వెళ్ళవద్దు రేపు ఉదయం వెళ్ళి శత్రువును సంహరించవచ్చు. ఆలోచన లేకుండా ఇప్పుడు బయటకు వెళ్ళి తమ్ముడితో యుద్ధం చేయడం యుక్తంకాదు. చూడగా, నా కేదో భయంగా ఉంది. దెబ్బలు తిని, అవమానం పొంది, ప్రాణాలు దక్కి

చాలునని పారిపోయిన తమ్ముడు, తిరిగి ఏ ధైర్యంతో వచ్చి ఇంత అట్టహాసం చేస్తున్నాడు ? ఈ సంగతి బాగా యోచించుకోవాలి. ప్రియనాథా ! ఇప్పుడు వెళ్ళవద్దు. ఇందులో ఏదో మోసం, అపాయం ఉన్నట్లు నా మనస్సుకు తట్టుతూంది. నా మాట కాదనకండి. అతడి మాటా, గర్జనా వింటే, వెనక ఏదో పెద్ద సహాయం కూర్చుకుని వచ్చినట్లు నిశ్చయమవుతూంది. లేకపోతే, ఇంత గర్వమూ పటుదలా ఎప్పుడైనా వుండెనా ? అతడు బలమైన సహాయం సంపాదించుకున్నాడనేది నిశ్చయం ఆ సహాయ బలం ఎటువంటిదో పరిక్షించుకున్న మీదటనే, ధైర్యంచేసి వచ్చాడు. మీ తమ్ముడు ఇందులో ఏమీ సందేహంలేదు మన ప్రియపుత్రుడు అంగదుడి క్షేమం కాస్త యోచించండి నా మాటలు తోసివేయకండి. ఏదో వదరుతున్నా ననుకోవద్దు. చారులవల్ల అంగదుడు తెలుసుకున్న విషయాన్ని చెపుతున్నాను. అయోధ్యనుంచి మహావీరుడైన రాజకుమారుడు మన ప్రదేశానికి వచ్చాడట. అతడ్ని అందరూ ఉత్తముడనీ, ధర్మాత్ముడనీ, వీరుడనీ, గౌరవిస్తున్నారట. మీ తమ్ముడు అతడి స్నేహాన్ని సంపాదించాడట. అందువల్ల అతడి బలమూ, ధైర్యమూ ఇప్పుడు పెరిగాయి. ఇంతకూ మీ తమ్ముడు మంచివాడే. వీరుడే. అతడితో మీకు విరోధమెందుకు చెప్పండి ? అతడికన్నా మనకు కావలసిన బంధువు లెవరున్నారు? అతడు మీకెంతో భక్తితో సేవచేస్తాడు. మంచి పరాక్రమశాలి తోడు మీకు లభిస్తుంది. సుగ్రీవుణ్ణి మనం మళ్ళీ పిలిపించి, విరోధాన్ని మరిచి ఒకటిగా ఉండడం మంచిది. ప్రియనాథా! నా మాట కాదనవద్దు!" అంది.

ఈ మాటలు వాలికి చెవికెక్కలేదు. ఆయనకు కోపం ఉప్పెన లాగా ఉప్పొంగింది. ఆ పొంగులో తన భార్య మాటల్లోని న్యాయాన్ని చూడలేకపోయాడు. కాలపాశం మెడను పడి, ఈడుస్తూ ఉంటే ఎలా చూడగలడు ? పేరుకు తగిన అందకత్తె తార! అలాంటి భార్య చెప్పిన హితవు వాలి చెవి కెక్కలేదు.

"నీవు చెపుతున్న దేంటి ? శత్రువైన తమ్ముడు చేస్తున్న గర్జనలను నే నెలా సహిస్తాను ! సుందరీ ! శత్రువు యుద్ధానికి పిలుస్తూ ఉంటే, వీరుడైనవాడు వెళ్ళకుండా ఉండగలడా? అంతకన్న

ప్రాణాలు విడవడం మంచిదికాదా ? ఈ అల్పుడి గర్జనలు వింటూ ఊరుకోవడం నాకు సాధ్యం కాదు. నీవు రాముణ్ని గురించి చింతపడ వద్దు ఆయన ధర్మ మెరిగిన వాడు. పాపభీతి గలవాడు. ఆయన అన్యాయానికి ఒడిగట్టడు. నన్ను అడుపెట్టవు. లోపలికి పో. సుగ్రీవుణ్ని నేను చంపను కాని, వాడి గర్వం అణుస్తాను, అంతే. ఆ దురాత్ముడి అట్టహాసం సహించడానికింక వీల్లేదు. నా మీద ప్రేమకొద్దీ చెప్పవలసినమాట చెప్పావు. తమ్ముడి పొగరణచి, తరిమివేసి, విజయంతో తిగిగివస్తాను. భయపడకు. మంగళ వచనాలు పలికి, నన్ను సాగనంపు. ఆటంకపరచకు" అన్నాడు వాలి.

వాల్మీకి మహాకవి వాలిని ఎంత ఉదాత్తంగా చిత్రించాడు!

తార కన్నీరు నింపుతూ, వాలికి ప్రదక్షిణం చేసి, మంగళ వచనాలు పలికింది. ఈ యుద్ధం సుఖాంతం కావాలని ప్రార్థిస్తూ, అంతఃపురానికి తిరిగివెళ్లింది. తారనూ, ఆమె చెలికత్తెలనూ పంపివేసి, వాలి పుట్టలోంచి బుసకొడుతూ వచ్చే పాములాగ సుగ్రీవుడి మీదికి వెళ్లాడు.

అలా మిక్కిలి రోషంతో వెళ్లిన వాలి, తమ్ముడు ధైర్యంగా తేజస్సుతో ప్రకాశిస్తూ నిలచి ఉండడం చూశాడు. చూడగానే కాసె బిగించి, అతడిమీదికి లంఘించాడు. సుగ్రీవుడు అతివేగంగా వాలిని ఢీకొన్నాడు.

"ప్రాణాలమీద ఆశ ఉంటే పారిపో! ఈ పిడికిటికి నీ ప్రాణాలు అర్పించకు" అని వాలి గర్జించాడు.

సుగ్రీవుడుకూడా కోపంతో బదులు పలికాడు. ఇద్దరికీ యుద్ధం మొదలింది. ఒకరినొకరు కొట్టుకోగా, రక్తం వరదలు కట్టింది. దెబ్బ లెక్కువతిన్న సుగ్రీవుడు ఒక సాలవృక్షాన్ని పెకలించి, దాంతో వాలిని బలంగా మోదాడు. ఆ దెబ్బకు వాలి చలించి పోయాడు. కోపంతో తానుకూడా మరొక వృక్షాన్ని వేళ్ళతో సహా పెకలించి, సుగ్రీవుణ్ని మోదాడు. ఇరువురూ సమబలులు. ఇలా చాలాసేపు ఘోరయుద్ధం జరిగింది. సుగ్రీవుడి బలం తగ్గనారంభించింది.

ఇది చూస్తున్న రాముడు ఇక సుగ్రీవుడు ఓర్చుకొన లేడనీ, కొంచెంలో ప్రాణాలు విడుస్తాడనీ అనుకున్నాడు. విల్లు వంచి ఒక్క

సంహారక బాణాన్ని విడిచాడు. అది తిన్నగావెళ్ళి సాల వృక్షాన్ని రంధ్రం చేసినట్లు, వజ్రతుల్యమైన వాలి వక్షస్థలాన్ని ఛేదించింది. దాంతో వాలి అవతారం ముగిసి పోయింది. ఒక మహోత్సవం కోసం అలంకరించిన ధ్వజ స్తంభం ఆ ఉత్సవానంతరం నేలపైన పడినట్లు, వాలి శరీరం నెత్తుట దోగుతూ నేలపై పడింది.

ఇలా రాముడి బాణంవల్ల చావుదెబ్బ తిన్న మహాశూరుడు వాలి, గొడ్డలితో నరికిన మహావృక్షంలాగా కాళ్లు చాచుకొని నేలను పడి ఉన్నాడు.

కింద పడినప్పటికీ, వాలి అందం చెదరలేదు. కాంతి తరగలేదు. ఆభరణాలతో నిండివున్న అతడి దేహం అస్తారుణ కిరణాలు సోకిన మేఘంలాగ ఎర్రగా ప్రకాశించింది. అడడికి ఇంద్రు డిచ్చివున్న దివ్య మాల అతడి ప్రాణానికీ, విభవానికీ ఆటపట్టు అయి, అతడి రొమ్ము మిరుమిట్లు కొల్పుతూ వుంది. ఆ దివ్యమాల కాంతీ, ఆ వీరుని రొమ్మున నాటుకున్న రామబాణమూ, గాయాలనుంచి స్రవిస్తున్న నెత్తురూ– అన్నీ కలిసి ఆ మహావీరుని దేహాన్ని మూడురెట్లుగా కాంతిమంతం చేశాయి. నేలకూలిన ఆ మహావీరుని గంభీర రూపాన్ని వాల్మీకిమహర్షి చాలా చక్కగా వర్ణించాడు. ప్రాణాలు పోయేముందు శూరుల దేహకాంతి మహోజ్వలంగా ప్రకాశించడం సహజం.

తలవని తలంపుగా, ఇలా నేలకూలిన వాలి, దృష్టి సారించి నలువైపులా పరికించాడు. తన ప్రాణాన్ని లాగిన ఈ బాణం ఎక్కడి నుంచి వచ్చిందా అని, చుట్టు పక్కల పరకాయించి చూశాడు. ఆ సమయానికి రామలక్ష్మణులు అక్కడికి వచ్చారు. విల్లమ్ములు చేపట్టి వచ్చిన వారిని చూడగానే వాలి కన్నులనుంచి శూరులకు మోసరుగా కళ్ళనీళ్లు నిండాయి. ధర్మ సమ్మతం, ఉదాత్తం, క్రమశిక్షణతో కూడినటువంటిదీ అయిన ధోరణిలో మృదువాక్యాలతో అతడు రాముడి దోషాన్ని చూపి అతడి చర్యను ఖండిస్తూ మాట్లాడాడు.

"రామా! దశరథ చక్రవర్తి కుమారుడవు! ఉత్తమ కులంలో పుట్టి, గొప్ప కీర్తిని ఆర్జించిన నీవు ఎందుకిలా చేశావు? నీ సద్గుణాలు నీ సత్ప్రవర్తన లోకానికి తెలుసు. నేను మరొకడితో యుద్ధం చేస్తూ

అందులో మనస్సు లగ్నంచేసి ఉన్న సమయాన కంటికి కనిపించకుండా మాటున దాగి నాపై బాణంవేసి చంపావు. జనులు నిన్ను గురించి చెప్పే ప్రశంసా వాక్కులకు ఇదంతా విరుద్ధంగా ఉందే! భూతదయ గలవాడవనీ, పాపచింత లేనివాడవనీ, జితేంద్రియుడవనీ, ధర్మవర్తనుడవనీ, క్షమ, దమం, శాంతి, ధర్మం, సత్యం, పరాక్రమం మొదలైన సకల సద్గుణాలు కలవాడవనీ కీర్తి గడించావే! ఇప్పుడవన్నీ ఏమైనాయి? నన్ను చంపడంవల్ల నీవేం లాభం పొందుతావు? అనాలోచితంగా ఈ అధర్మకార్యాన్ని చేశావు. నిన్ను గురించి నా భార్య ముందుగానే నన్ను హెచ్చరించింది సుమా! ఆమె మాటలను పెడచెవిని పెట్టి వచ్చాను. నువ్వు వేషధారివనీ, దుర్మార్గుడవనీ, గడ్డికప్పిన కూపంవంటి పాపివనీ తెలియక, భార్య మాటలను పెడచెవిని పెట్టి, నేను నా తమ్ముడితో యుద్ధానికి ఢీకొన్నాను. నీకు నేనేం కీడు చేశాను? నేను వచ్చింది నీతో యుద్ధం చేయటానిక్కాదే? మాటున ఉండి, నన్ను అధర్మంగా చంపేశావు. గొప్పకులంలో పుట్టి గొప్ప పాపం చేశావు. నిరపరాధిని చంపావు. నువ్వు రాజపదవికి తగినవాడవు కావు. మోసగాడవైన నిన్ను భూదేవి వల్లభునిగా ఒల్లదు. నీవు దశరథుడి వంటి మహానుభావుడి కడుపున ఎలా పుట్టావయ్యా? ధర్మ భ్రష్టుడైన నీచుడి చేతిలో మరణం వచ్చిందే నాకు? నా ఎదుట నిలిచి, నువ్వు యుద్ధంచేసి ఉంటే, ఇవ్వాళే చచ్చిఉందువు. నువ్వు నన్నే అడిగివుంటే ఒక్క రోజులో సీతను తెచ్చి నీకు అప్పగించి ఉందునే! సుగ్రీవుడికోసమని నన్ను అకారణంగా చంపుతావా? నన్ను కోరినంతమాత్రాన రావణుణ్ణి చంపి, వాడి మెడకు తాడుకట్టి, నీ వద్దకు ఈడ్చుకు వచ్చి ఉండెడివాడినే! మైథిలిని ఎక్కడ దాచిఉన్నా, వెతికితెచ్చి నీకు అప్పగించి ఉండేవాడినే! పుట్టినవారు గిట్టటం ఎలానూ తప్పదు. అయినా, నీవు అక్రమ మార్గాన నన్ను చంపావు. నువ్వుచేసింది గొప్ప అపరాధం.''

ఇలా ఇంద్రపుత్రుడైన వాలి, మరణవేదన పడుతూ, రాముడి అకృత్యాన్ని ఖండించాడు.

వాలి చేసిన ఈ దోషారోపణకు రాముడు ఏం సమాధానం చెప్పగలడు? రాముడేదో చెప్పినట్టు, దాన్ని విని వాలి సమాధాన పడి

వట్లు, వాల్మీకి రామాయణంలో ఉంది. కాని అందులో సారం లేదని విడిచిపెట్టాను పెద్దలు మన్నించాలి. రామావతారంలో భగవానుడూ, దేవీ అనుభవించవలసి ఉన్న దుఃఖంలో, ఈ పొరపాటూ, నిందా భాగాలు.

సుగ్రీవుడి దెబ్బలవల్ల వాలి ఒళ్ళంతా గాయాలై ఉంది. దానికి తోడు రామబాణంవల్ల కలుగుతున్న మరణవేదన. వీటి నన్నిటినీ ఓర్చుకొని వాలి కడపటి మాటగా రాముడితో ఇలా అన్నాడు:

"అయిందేదో అయిపోయింది నేనింక ఆ దోషాన్ని ఎంచడమే లేదు. నా కుండిపోయిన ఈ తుదికోరికను మన్నించి, నెరవేర్చు. అలా అయినా కొంత ఊరట కల్గుతుంది నాకు. ఏమిటంటావా- నా ప్రియ పుత్రుడైన అంగదుడి దుఃఖం ఎవ్వరూ ఆపలేరు. సుగ్రీవుడూ, నీవూ అతడిని చూసుకోవాలి. వాడిని నీకు అప్పజెప్పుతున్నాను. వాడిని కాపాడ్డం నీ కర్తవ్యంగా ఎంచుకోవాలి. నీరెండిన కొలనులో తామర తీగలాగ, అంగదుడు దుఃఖంతో వసివాడకుండా వుండేలాగా చూడండి. నేను సుగ్రీవుడికి చెరుపుచేయడానికి కారణం తార అని అతడు భావించ కుండా ఉండేలాగ చూడండి. అంగదుణ్ణి అతడు ప్రేమాదరాలతో చూసేలాగ చేయాలి నువ్వు. ఈ పని చేస్తేచాలు. నా కింక మరేకోరికా లేదు. వీరులకు నియమితమైన లోకాలు నా కోసం ఎదురు చూస్తున్నాయి" అని చెబుతూ, వాలి స్పృహతప్పిపోయాడు.

* * *

ఒక్కటిమాత్రం నిశ్చయం- వాలికి ఎదుట పడి ఉంటే రాముడు అతడిని జయించి ఉండేవాడే కాడు. రావణుణ్ణి ఎదిరించి దేవతలు జయించ లేనట్లే వాలికిగల వర ప్రభావంవల్ల అతడిని ఎదటపడీ జయించడం కల్ల. అందుచేత, మాటున ఉండే రాముడు వాలిని చంపగలిగాడు. ఏమయినా, వాలిని ఎందుకు చంపాలి? అన్న ప్రశ్న ఎప్పటికీ మిగిలే వుంటుంది.

కబంధుడి శాప విమోచన కాలంలో అతడు "నీవు సుగ్రీవుడి సఖ్యం సంపాదిస్తేనే సీతను పొందుతావు" అని చెప్పాడు. కనుక

రాముడు సుగ్రీవుణ్ని అన్వేషిస్తూ వెళ్లాడు. అతడ్ని కలుసుకొని అగ్ని సాక్షిగా స్నేహ ప్రమాణం చేశాడు.

సుగ్రీవుడు వాలిపట్ల క్షమింపరాని అపరాధం ఏదీ చేయలేదు. అదలా ఉండగా, వాలి తన బలదర్పంవల్ల తమ్ముడ్ని నానా తిప్పలూ పెట్టి బాధించాడు. ఈ సంగతి చెప్పి మొర పెట్టుకున్న సుగ్రీవుడికి "నీ శత్రువును వధించి భార్యనూ, రాజ్యాన్నీ నీవు తిరిగి పొందేటట్లు చేస్తాను. ఇది ముమ్మాటికీ సత్యం" అని దృఢ ప్రతిజ్ఞ చేశాడు, రాముడు. అందువల్ల మాట తప్పకుండా వుండాలంటే, వేరుమార్గం లేదు. మాటున ఉండి వాలిని వధించడం రాముడికి తప్పనిసరి అయింది. ప్రియ భార్య కోరిక తీర్చడంకోసం మాయలేడిని వెంబడించిన ఫలితంగా, ఒక దాని వెంట ఒకటి, చిక్కులూ ధర్మ సంకటాలూ రాముణ్ని వెంటాడుతూనే వున్నాయి. నా అల్పబుద్ధికి తోచిన ఊహ ఇంతే.

* * *

59. తారావిలాపం

ధనుర్ధారి అయిన ఒకడివల్ల వాలి నేల కూలాడని తెలియగానే కిష్కింధలోని వానరులు భయకంపితులై అటూ ఇటూ పరుగులు పెట్టడం తార చూసింది.

"యుద్ధం అంటే చాలు, మీ రాజైన వాలికన్నా మీరు ముందే బయలుదేరుతూ ఉండేవారు. అలాంటి వారిప్పుడెందుకు భయపడి పరుగులు పెడుతున్నారు? మీ కేం ఆపదా రాదు. సుగ్రీవుణ్ని రాజును చేయడం కోసమే రాముడు వాలిని చంపాడు. అంతే మీరు అనవసరంగా భయపడి పారిపోకండి. మీ కేం ఆపదారాదు" అని తార తన దుఃఖాన్ని దిగమింగి, మహారాణికి తగిన పద్ధతిలో వానరులకు ధైర్యం చెప్పింది.

* * *

తరువాత ఆమె తన భర్త పడి ఉన్న చోటికి బయలు దేరింది. వానరులు ఆమెను వారించారు.

అంగదుడికి పట్టాభిషేకం చేస్తాం. కోటను కట్టుదిట్టం చేస్తాం. మన శత్రువైన సుగ్రీవుడూ అతడి తోడివారూ రాకుండా నగరాన్ని కాపాడుతాం" అని వానరులు ఆమెను పోనివ్వకుండా అడ్డగింప జూశారు.

ఆమె "వీరుడైన నా భర్తే మరణించి తరువాత వీటితో నాకేం నిమిత్తం?" అని చెప్పి, తిన్నగా రామలక్ష్మణులున్న చోటికి నిర్భయంగా వెళ్ళింది.

* * *

నేలను కూలి ఉన్న భర్తను చూసేసరికి ఆమెకు దుఃఖం ఆగలేదు. గొంతెత్తి విలపించింది.

"హా వీరాధి వీరా! ఎందరు శూరులను కూలనేశావు? ఇప్పుడు నీవే కూలిపోయావే? నన్ను విడిచి పోయావా?" అని క్షతగాత్రుడైన వాలిని కౌగలించుకొని మిక్కిలి దుఃఖించింది.

వాలి కుమారుడు అంగదుడు కూడా అక్కడికి వచ్చాడు. ఈ దృశ్యాన్ని చూసిన సుగ్రీవుడు తన మూలముగా ఇంతమందికి దుఃఖం కలిగిందికదా అని అతడూ శోకించాడు.

అయితే సుగ్రీవుడి శోకం బూటకంమట్టుకు కాదు. ప్రపంచంలో ద్వేషాలూ, కావేషాలూ, కార్పణ్యాలూ, ఆశలూ ఇలాగే చివరకు సత్ఫలితాన్నీ సంతోషాన్నీ లేకుండా, దుఃఖంతో ముగిసేటట్టు చేస్తాయని వాలి కథ మనకు పాఠం చెబుతూంది. ద్వేషం ఎంత నీచమైన గుణమో ప్రత్యక్షంగా చూసి అనుభవించిన తరువాతనే బోధపడుతుంది. అంతా అయిపోయిం తరువాతనే మనకు వివేకం కలుగుతుంది. అంత వరకూ మోహంలో మునిగి యథార్థాన్ని గుర్తించలేక పోతున్నాం.

* * *

"ప్రేమ పాత్రుడైన అంగదుణ్ణి దిక్కులేనివాడ్ని చేసి, నన్ను అనాథనుచేసి, తిరిగిరాని మహాప్రయాణం చేస్తున్నావా, మహావీరా!" అని తార నేలనుపడి దొర్లుతూ, విలపిస్తూ, తను కూడా అక్కడే ప్రాణాలు విడుస్తానంది.

హనుమంతుడు ఆమెను ఓదార్చి జూశాడు. "మరణించినవారు సముచితమైన ఊర్ధ్వలోకాలను పొందుతారు. వాలిని గురించి దుఃఖించవద్దు తల్లీ! ఇప్పుడు అంగదుడికి పట్టాభిషేకం జరుగుతుంది. అది చూసి సంతోషిద్దాం. ఇప్పుడు వాలికి చేయవలసిన ఉత్తర క్రియలను గురించి ముందు ఆలోచించాలి. అంగదుణ్ణి కనిపెట్టి ఉండడం మనం చరిక్తవ్యం" అని ఇలా చెప్పిచూశాడు.

"నాకు దాంతో నిమిత్తంలేదు. ఉత్తరక్రియలు జరిపించడం, అంగదుడి రక్షణా అంతా సుగ్రీవుడే చూసుకొంటాడు. నే నేం చెయ్యగలను? వెయ్యిమంది అంగదులున్నా నా భర్తతో సమాన మవుతుందా? నా వీరునితో నేనుకూడా యమాలయానికి వెళతాను. అదే నాకు ఆనందం" అంది తార.

స్పృహతప్పి మరణావస్థలో ఉన్న వాలి ఆ సమయాన కన్ను తెరిచి, సుగ్రీవుణ్ణి చూసి, మెల్లగా కొన్నిమాటలు చెప్పాడు:

"తమ్ముడూ! మన మిద్దరం ఐకమత్యంగా ఉండి రాజ్యమేలి అనుభవించవలసి ఉండేది. కాని నేను అందుకు పెటిపుటలేదు. ఇందులో నా దోషమే ఎక్కువ. దాన్ని గురించి ఇప్పుడు ఆనుకొని లాభంలేదు. ఈ రాజ్యాన్ని ఇంక నీవే ఏలుకో. నాకూ తారకూ ప్రాణంకన్నా ప్రియమైన అంగదుణ్ణి నీకు అప్పజెప్పుతున్నాను. అతడూ నీలాంటి వీరుడే. నా బదులు నీవే ఇక అతడికి తండ్రివై, ప్రేమతో చూస్తూ ఉండాలి. నేను నిన్ను కోరేది ఇంతే.

నా భార్య తార చాలా తెలివైంది. సూక్ష్మమైన విషయాలను తెలుసుకునేశక్తి ఆమెకుంది. ఇలా జరుగుతుంది అని ఆమె అన్నదంటే అక్షరాలా అలాగే జరిగితీరుతుంది. సందేహంలేదు. ఏ విషయంలోనూ ఆమె ఆలోచనను తిరస్కరించకు.

ఇదిగో ఇంద్రుడు నా కిచ్చిన దివ్యమాల. దీన్ని తీసుకొని, దీని శక్తిని నీవు పొంది కీర్తి తెచ్చుకో. నా జీవితం ముగిసింది. నీమీద నా కిప్పుడు కోపం ఏమీలేదు. చల్లారిపోయింది. నీకు మంగళం కలుగును గాక!" అని సుగ్రీవుణ్ణి ఎంతో ఆదరంతో, ఆప్యాయంగా ఆశీర్వదించాడు.

"నాయనా అంగదా ! అప్పుడు రాజైన సుగ్రీవుడివద్ద చక్కగా నడుచుకో ! ఓర్పు గలిగి ఉండు. ప్రేమతో మెలగు !" అని కుమారుడికి హితబోధ చేశాడు.

అడవిలో మహావృక్షం కింద కూలినప్పుడు దానిపైకెక్కి ఉన్న తీగెకూడా దాంతోనే పడిపోయినట్లు తార వాలిని కౌగలించుకొని పడిఉంది.

వాలి రొమ్మున నాటుకున్న బాణాన్ని నీలుడు మెల్లగా లాగివేశాడు. వెంటనే గాయంనుంచి సెలయేరులాగా నెత్తురు పొంగి ప్రవహించింది. వాలి ప్రాణాలు తనువును విడిచిపోయాయి. "అయ్యో! అయ్యో !!" అని తార విలపించింది.

"అంగదా ! నీ తండ్రికి కడసారి నమస్కారం చెయ్యి" అంది.

"మీ ప్రియపుత్రుడు చేతులు మోడ్చి నిలబడి ఉన్నాడు. అతడికేమీ చెప్పరా ? నేను అనాథనైనాను. కొడుకు దిక్కులేని వాడైనాడు" అని గుండె పగిలిన తార ఎలుగెత్తి రోదించింది.

* * *

ఇదంతా చూసి సుగ్రీవుడి హృదయం క్షోభించింది. తన దోషం తన కిప్పుడు స్పష్టంగా తెలిసి వచ్చింది. "నాలో దాగి లోలోపలనే పని చేస్తూ వచ్చిన ఆశ, నా బుద్ధిని చెరచడం వల్లనే కదా, నేను ఆలోచన లేకుండా వాలి ప్రవేశించిన గుహ వాకిలినే మూసి వేశాను ! అన్న సంపదను అపహరించి, అనుభవించాను !" అనుకుని లోకోపలే చింతించ సాగాడు.

మనస్సులో ఉంటున్న ఆశ మనకు తెలయకుండానే వివేకాన్ని నాశనం చేస్తుంది. దాంతో మనం తప్పుడు నిర్ణయాలకు వస్తున్నాం. పాపపంకిలంలో చిక్కుకుంటున్నాం. లోలోపల దాగివున్న తన ఆశే తన వివేకాన్ని చెరిచినట్లు సుగ్రీవు డిప్పుడు తెలుసుకున్నాడు.

సంస్కృతంలో 'కామం' అనే సామాన్య వాచకపదం అన్ని రకాల ఆశలకూ అర్థమిస్తుంది. కామమే మానవుడికి అంతశ్శత్రువు. ఆ శత్రువును జయించాలి. గీతలో మూడవ అధ్యాయంలో కడపటి

ఏడు శ్లోకాలలోనూ ఉండే ఉపదేశం ఇదే "జహి శత్రుం కామరూపం దురాసదం" అని ఆ ఉపదేశాన్ని పూర్తి చేస్తున్నాడు శ్రీకృష్ణ పరమాత్మ.

సుగ్రీవుణ్ని చెరచింది, 'ఆశ'. వాలి వివేకాన్ని చెరచింది'కోపం'. సుగ్రీవుడు గుహ వాకిలిని మూసివేయడం చూడగానే, సుగ్రీవుడు తనతోకూడా వచ్చి రాజ్యం అపహరించడానికే ఇలా చేశాడని వాలి తలపోశాడు రాక్షసుడికి తనను బలియిచ్చి, తన పదవిని అపహరింప చూశాడే అని, సుగ్రీవుణ్ని గురించి అనుకొని, తన మనస్సున పొంగిన కోపానికి ఆహుతి అయిపోయాడు. తోడబుట్టిన తమ్ముణ్ని అవమాన పరచి ఊరినుంచి వెళ్ళగొట్టి, ఇంకా ఆ కోపం పెంచుకుంటూనే వచ్చాడు. కోప మూలానికి సంస్కృతంలో "మన్యు" అని పేరు. ఇది వాలిని మథ్యపరచి, పాపకూపంలో తోసివేసింది.

అన్ని దోషాలకూ చాలావరకు 'కామం', 'మన్యు', ఇవి రెండే కారణాలు. వీటిని హృదయ మనే కోటలోనికి చొరనీయక మనస్సును కాపాడుకొన్నప్పుడే మనం వాటినుండి తప్పించుకో గలుగుతాం.

* * *

సుగ్రీవుడు విలపించసాగాడు. "నే నెంత గొప్ప తప్పుచేసినా నన్ను చంపక, 'పారిపో ! ప్రాణాలు దక్కించుకో !' అని చెప్పి అన్న నన్ను తరిమి వేశాడు. అంతే. నేనో ? అతడ్ని చంపడానికే కుట్ర చేసి ప్రాణాలు తీసివేశాను. నావంటి పాపి మరి లోకంలో ఉంటాడా ? మరణ సమయాన నా అన్న 'ఈ రాజ్యాన్ని నీవే ఏలుకో !' అని చెప్పి రాజ్యాన్ని, ఇంద్రుడిచ్చిన శక్తిమాలనూ తన చేతులతో తమ వాకిచ్చాడే ! మహాత్ముడు కదా అతడు ! నీచుడనైన నే నింకా బతికి ఉండీ ఏం ప్రయోజనం ? లోకైక వీరుడైన నా అన్నను చేతులారా చంపేసుకున్నానే !" అంటూ, తన దోషాన్ని తెలుసుకొని విలపించాడు.

* * *

ఏడాది కొకమారైనా "కామోకార్షీత్, మన్యు రకార్షీత్" అని పరితాపంతో అణకువతో పలుమార్లు జపించి హృదయాన్ని శుద్ధి పరుచుకోవడం వైదికుల జపవిధానం. దీని సంధి విడదీస్తే 'కామ

అకార్షీత్, మన్యుః అకార్షీత్' అంటే-'ఆశ నన్ను ప్రలోభపరచి పాపానికి పాల్పడజేసింది. కోపం నన్ను ప్రలోభపరచి పాపానిగి పాల్పడజేసింది' అని అర్థం. ఈ జప పద్ధతిని అందరూ అనుసరించాలి. జపం చేసి హృదయాన్ని ఈశ్వరుడికి అర్పణం చేయాలి. 'కామోకార్షీత్, మన్యురకార్షీత్-నారాయణాయనమః'.

* * *

విలపిస్తున్న తారవద్దకు రాముడు భయపడుతూ భయపడుతూ, మెల్లగా వెళ్ళాడు.

తార తన ముఖంలో కోపచిహ్నలేవీ చూపలేదు. "వీరుడా! నా భర్తను ఏ బాణంతో చంపావో, ఆ బాణంతోనే నన్నుకూడా చంపి, నేను నా భర్తను పొందేటట్లు చెయ్యి. నన్ను విడిచి ఆయన స్వర్గాన సంతోషంతో ఉండలేడు. స్త్రీ హత్యా దోషం నీకు కలుగుతుందని భయపడకు! భార్యాభర్తలను ఒకటిగా చేసిన పుణ్యం నీకు దక్కుతుంది. నా భర్తను అధర్మమార్గాన చంపినందుకు ఇదే నీకు ప్రాయశ్చిత్తం. వాలి మరణించిన తరువాత నే నెలా బతికి ఉండేది!" అని ఆ మహావీరుని పట్టమహిషి, సముచితంగా పలికి విలపించింది.

ఇక్కడ తారకు అవతార తత్వం తెలుసుననీ ఆయనను మహావిష్ణువుగానే చూసిందనీ వాల్మీకి రామాయణంలో ఉంది.

లక్ష్మణుడి తల్లి సుమిత్రలాగానే వాలి భార్య తారకూడా చాల బుద్ధిమంతురాలు, జ్ఞాని, అని పరంపరగా వస్తున్న అభిప్రాయం. కనుక తన భర్తను అధర్మంగా చంపినవాడిమీద తొలుత కోపం, ఏవగింపూ చూపినా రాముణ్ని ప్రత్యక్షంగా దర్శించిన తర్వాత, ఆయన యథార్థ రూపాన్ని చూడగలిగిందని పెద్దలు చెబుతారు.

కేవలం కథగా మాత్రమే చదివితే దీని స్వారస్యం బోధపడదు. భక్తి ప్రపత్తులు గలవారికి ఇది అసంభవ విషయంగా కనిపించదు. తులసీదాసు రామాయణంలో ఈ సందర్భంలో పరమశివుడు పార్వతితో ఇలా చెప్పినట్లు ఉంది:

"పార్వతీ! చూశావా? స్వామి అయిన రాముడు అందరినీ ఎలా బొమ్మల్లాగ ఆడిస్తున్నాడో!"

భక్తి దృష్టితో జూస్తేనే, పాత పురాణాల సారం చక్కగా బోధపడుతుంది.

సామాన్య విమర్శనా దృష్టితో చూసినప్పటికీ, తార కడు బుద్ధిశాలిని. రాజనీతిలో ఆరితేరింది. ముందు జరుగబోయే విషయాలు ఊహించగల శక్తి ఆమె కున్నట్లు వాలి తనే చెప్పాడుకదా? జరిగిందేదో జరిగిపోయింది. సుగ్రీవుడు తన సామార్థ్యంవల్లా, దైవేచ్ఛవల్లా, రాముడి సహాయం సంపాదించుకున్నాడు. వాలి చనిపోయాడు. ఇక చూసుకోవలసింది అంగదుడి క్షేమం. అంతేకదా? అంగదుడు సుగ్రీవుడితో విరోధించి పోరాడగలడా? సుగ్రీవుడికా ధనుర్ధారులైన రామలక్ష్మణులు తోడున్నారు. కనుక నీతి శాస్త్రాన్ని అనుసరించి ఈ సమయంలో సామోపాయమే గొప్పదని తార నిశ్చయించింది. కాబట్టి రాముడిపైన తనకున్న కోపాన్ని అణచుకొని, ఓర్పుతో నడచుకోవడమే కర్తవ్యంగా పెట్టుకుంది. అంగదుడి జీవితం పాడైపోకుండా ఎలా రక్షించుకోవడం?- అనే సమస్యకు మార్గం వెతికింది.

వాలి ఉత్తర క్రియలు యథావిధిగా జరిగిపోయాయి. సుగ్రీవుడికీ అంగదుడికీ మంగళస్నానాలు చేయించి, క్రమంగా పట్టాభిషేకమూ యువరాజ్యాభిషేకమూ చేశారు.

* * *

ఇంతలో వర్షాకాలం వచ్చింది. సుగ్రీవుడు మొదలైనవారు కిష్కింధలో సుఖంగా కాలం గడుపుతున్నారు. రామలక్ష్మణులు దగ్గరనే ఉన్న ఒక కొండగుహలో కాలం గడుపుతున్నారు. వర్షపునీరు వెల్లువలెతి. అడవి మార్గాలన్నీ కాలవలుగా మారిపోయి, రాకపోకలకు అవరోధం ఏర్పడింది. అందువల్ల సీతాన్వేషణ కార్యం ఆగిపోయింది. సీత దుస్థితిని తలుచుకు తలుచుకు, రాముడు దుఃఖింపసాగాడు. వానాకాలం ముగిసేవరకూ ఓరిమితో ఉండవలసిందని లక్ష్మణుడు రాముణ్ణి సమాధాన పరిచాడు. రాముడూ అలాగే ఊరడిల్లాడు.

ఎంత గొప్ప దుఃఖమైనా కాలక్రమాన, మరపు అనే మహా శక్తివల్ల మనస్సులో అణగిపోయి, మనకు శాంతి లభిస్తుంది. ఈశ్వరుడు ప్రసాదించిన ఈ మరపు అనే శక్తి మనపాలిట పెన్నిధి. అదే లేక పోతే, ఈ లోకంలో దుఃఖానికి దుఃఖం తోడై నరకప్రాయమై పోతుంది. ఈ నియతిని అనుసరించి సుగ్రీవుడూ ఆతడి బంధువులూ వాలిని పోగొట్టుకున్న దుఃఖాన్ని మరచిపోయారు. కొసకు తారకూడా దుఃఖాన్ని మరచింది. అందరూ కలిసి సకల సంపన్నమైన కిష్కింధలో ఆనందంగా ఉంటున్నారు.

హనుమంతుడు మాత్రం చింతాక్రాంతు డైనాడు. రామ కార్యాన్ని అతడు మరచిపోలేదు. ప్రతిజ్ఞను గురించి రాజుతో మెల్లగా మాట్లాడానికి తగిన సమయం కోసం చూస్తున్నాడు.

అనుకున్నట్టుగా, వానాకాలం ముగిసింది. మేఘాలూ, మెరుపులూ లేక ఆకాశం నిర్మలముగా ఉంది. పక్షులు ఎగిరి, ఆటలు మొదలు పెట్టాయి. అతి బుద్ధిశాలీ, ధర్మం తప్పని మనస్సుగల వాడూ, అయిన హనుమంతుడు రాజువద్దకు వెళ్ళాడు.

రాజకార్యాలను మంత్రుల కప్పగించి అంతఃపుర భోగాలలో మునిగి తేలుతున్న సుగ్రీవుడి వద్దకు వెళ్ళి వినయంగా మాట్లాడాడు, హనుమంతుడు. ఎంత మంచివారైనా ఎంత బుద్ధిమంతులైనా భోగాలలో మునిగిపోతే, కర్తవ్యాన్ని విస్మరించడం సహజమని హనుమంతు డెరుగును.

60. కోపం చల్లారింది

"నీ పూర్వీకులు అనుభవించిన రాజ్యాన్ని పొందారు. కీర్తిని బడ
ారు. మీ అధికారం సిరంగా పాదుకొంది. కాగా, మిత్ర కార్యం నెరవేర్చి, వారి స్నేహాన్ని బలపరచుకోవడం ఒక్కటే తర వాయి. ఆ పని చేస్తే మీ కీర్తి అపారమవుతుంది. రాజ్యం బలపడు తుంది. తన పనులనూ సుఖాలనూ వెనక్కునెట్టి అయినా సరే, ఇచ్చిన మాట ప్రకారం మిత్రకార్యం నిర్వహించాలి. అలా చేసిననాడు

రాజు బలమూ. కీర్తి, పెరుగుతాయి. చేసిన వాగ్దానాన్ని చెప్పిన కాలంకన్నా ముందుగానే చెల్లించడం మరీ విశేషం. కాలహరణం పనికిరాదు. చేయవలసిన పని ఆలస్యంగా చేసినప్పటికీ. ఫలితం ఉండదు. మిత్రకార్యాన్ని వారు జ్ఞాపకం చేయడానికి ముందే నెర వేర్చడం, బుద్ధిమంతుల లక్షణం. ఆలసించడం గుణహీనత. ఇది మీకు తెలిసిన విషయమే. రాముడు మనకు చేసిన సహాయాన్ని గుర్తుంచు కొని ఆయనకు మనం చేయవలసిన సాయాన్ని గురించి గుర్తుకు తేవడానికి ముందే మనం మొదలు పెట్టాలి.

ఇప్పుడా వానాకాలం ముగిసింది. ఇక తామసించడానికి కారణంలేదు. సీతాన్వేషణ మనే ఈ మహాకార్యాన్ని వాయిదా వేయ టానికి వీల్లేదు. రాము డెంత ఓర్పుతో ఉన్నాడో చూశారుకదా. అయినా మనం ఇక ఎంతమాత్రమూ ఆలసించకూడదు. మీ శత్రువును రాముడు వధించిన విషయాన్ని యోచించి చూడండి. దానివల్ల కలిగే అపాయాన్ని గాని, నిందను గాని లెక్కచేయకుండా, ఆశిన మాట ప్రకారం, ఆయన ఎంత త్వరలో ఆ పని చేసివేశాడో! మనమూ అలాగే శీఘ్రంగా మన వాగ్దానాన్ని నెరవేర్చడం న్యాయం. కాలహరణం తగని పని.''

* * *

ఈ విధంగా మారుతి వినయంతో నీతిమార్గానుసారం, సుగ్రీవుడికి ఆలోచన చెప్పాడు. ఆ సలహాను సుగ్రీవుడు పాటించాడు. అదునుచూసి సలహా ఇచ్చినందుకు హనుమంతుడికి కృతజ్ఞత కూడా తెలిపాడు. వానరసేనను కూర్చవలసిందని నీలుడికి ఉత్తర్వు చేశాడు.

"భూమి అంతా చుటి చూసి, సీతను వెతకాలి. సమర్థులైన వానరులంతా వచ్చి, తప్పనిసరిగా సేనలో చేరేటట్లు ఆజ్ఞాపించు. అలా చేరనివారికి విచారణ అనేది లేకుండానే శిక్ష విధించు" అని చెప్పి, సుగ్రీవుడు తన అంతఃపురంలోకి వెళ్ళిపోయాడు.

రామలక్ష్మణులు తమ గుహలో కాలం గడుపుతున్నారు. వానాకాలం ముగిసి, వానరరాజు ఎప్పుడు తమ కార్యం నెరవేరు స్తాడా అని ఎదురు చూస్తున్నారు.

వానలు వెనకపట్టాయి. అడవీ, అడవిలోని ప్రాణులూ ఎంతో అందంతో ప్రకాశిస్తున్నాయి. రాముడిది చూసి రాక్షసుడి చేజిక్కిన సీతను తలుచుకొని తలుచుకొని మళ్ళీ దుఃఖంలో మునిగాడు.

"లోకమంతా అందంగా, ఆనందంగా ఉంది. సీత మటుకు ఎక్కడో పరితపిస్తూంది. నేను ఇక్కడ, చేసిన మేలును మరచిన వానర రాజు దయకోసం ఎదురుచూస్తూ, ఇలా పడివున్నాను. ఆహా! సీత దండకారణ్యాన్ని ఒక ఉద్యానవనంగా ఎంచి, ముళ్లమీదా, రాళ్ళమీదా ఎగిరి దూకుతూ, సంతోషంగా నా వెంట నడిచి వచ్చింది ఈ సమయంలో ఆమె ఏం కష్టపడుతూందో, ఏమో! ఈ వానరరాజు మధుపానంలో, స్త్రీలతో, భోగాలతో మునిగితేలుతూ నా కిచ్చిన మాటను పూర్తిగా మరిచిపోయాడు. ఈ వానరరాజు దుర్మార్గుడుగా కనిపిస్తున్నాడే. లక్ష్మణా! నువ్వు వెంటనే కిష్కింధకు వెళ్ళి, వానర రాజుతో ఇలా చెప్పు, "నీ అన్నను పంపిన యమాలయద్వారం నీ కోసంకూడా తెరుచుకొని ఉంది. తెలుసుకో! వాలి పోయిన తోవనే నువ్వు కూడా పోవాలనుకుంటున్నావా?" ఇలా నే నన్నట్లు అతడితో స్పష్టంగా చెప్పు. బుద్ధి వచ్చేట్టు.

"చేసిన మేలు మరచిన వాడు నశిస్తాడు. మిత్రుణ్ణి వంచించ జూసే వాడికి అధోగతే! రాముడి ధనుర్బాణాలు సిద్ధంగా ఉన్నాయి" అని కూడా అతడితోచెప్పు.

"వర్షాకాలం నాలుగుమాసాలూ గడిచిపోయాయి. ఈ నాలుగు మాసాలూ రాముడికి నాలుగు యుగాలై గడిచింది. నీవూ, నీ వారూ అయితే సంతోషంగా భోగాలు అనుభవిస్తున్నారు. రాముడి కోపాన్ని పెంచుతున్నారు. వినాశమార్గాన్ని వెతుక్కొంటున్నారు' అని నా మాటగా చెప్పు."

ఇలా రాముడు తన కోపాన్నీ, ఆతురతనూ సుగ్రీవుడికి తెలియపరచమని లక్ష్మణుడితో చెప్పి పంపాడు.

లక్ష్మణుడు బయలుదేరాడు. అన్న దుఃఖాన్నీ, నిప్పులాంటి కోపాన్నీ, తన వెంట కొనిపోయాడు.

వెంటనే రాముడు యోచించాడు. లక్ష్మణుడి స్వభావం అతడికి బాగా తెలుసు. అందుకని ఇది అపాయానికి దారితీస్తుందేమో నని తలచి, తమ్ముణ్ణి వెనక్కుపిలిచి, ఇలా చెప్పాడు:

"నా కోపాన్ని సుగ్రీవుడికి తెలియచేసేటప్పుడు కఠిన పదాలను ఉపయోగించకు సుమా? ఎలాగైనా అతడ్ని మనం స్నేహితుడిగా చేసుకున్నాం. అతడి పొరపాటును మాత్రమే ఎత్తిచూపు" అని హెచ్చరించి పంపాడు.

అలాగే అని లక్ష్మణుడు బయలుదేరాడు. అయినా, అతి కోపంతోనే కిష్కింధ కోటవాకిలి సమీపించాడు.

విల్లమ్ములు పట్టి కోపంగా వస్తున్న లక్ష్మణుణ్ణిచూసి, ఏదో విపరీతం జరగనుందని కావలి కాసే వానరభటులు అనుకొన్నారు. అందుకని కోటను జాగ్రత్తగా రక్షించడానికి సన్నాహాలు చేసుకున్నారు.

వారి ఈ ప్రవర్తన చూసిన లక్ష్మణుడికి కోపం ఇంకా ఎక్కువయింది.

కొందరు వానరులు ఒక్క అంగలో పరుగెత్తుకెళ్లి, అంతఃపురంలో ఉన్న సుగ్రీవుడికి ఈ విషయాన్ని తెలిపారు. "లక్ష్మణుడు అతికోపంతో ధనుర్బాణాలు ధరించి వచ్చాడు. అడ్డగించినా ఆగడం లేదు" అని విన్నవించారు.

వానరరాజు మధు, వధువుల మైకంలో అంతఃపురంలో పడి వున్నాడు. వానరులు చెప్పినమాట అతడి చెవి కెక్కనేలేదు. రాజ సేవకుల ఆజ్ఞానుసారం కోట వాకిట సైనికులు చుట్టూ పహారావుండి ఎవరినీ లోపలికి జొరనీయకుండా కావలి నిలిచారు. ఇది చూసేసరికి లక్ష్మణుడి కోపం మరీ ఎక్కువయింది.

లక్ష్మణుడు అవరోధాలు దాటుకొని లోపల ప్రవేశించాడు. మొదట అంగదుణ్ణి చూశాడు. వాలి కుమారుడైన అంగదుణ్ణి చూడగానే లక్ష్మణుడికి కోపం కొంత చల్లారింది.

"నాయనా! నువ్వుపోయి వానరరాజుకు నా రాక ఎరిగించు. రామచంద్రుడి దుఃఖాన్ని చూచి తమ్ముడు లక్ష్మణుడు కడు విచారంతో మిమ్మల్ని చూడ్డానికి నగరు వాకిట వేచివున్నా డని చెప్పు!" అన్నాడు.

అంగదుడు అంతఃపురానికి వెళ్ళి, విషయాన్ని సుగ్రీవుడికి వినయంతో విన్నవించాడు.

భోగలాలసు డైన సుగ్రీవుడికి ఇంకా మైకం తగ్గలేదు. అది చూసి అంగదుడు చాలా విచారించాడు. ఏం చేయడమా అని ఆంతరంగిక మిత్రులతో యోచించాడు.

హనుమంతుడితో మరి కొందరు మంత్రులు లోపలికి వెళ్ళి, సుగ్రీవుడి కీవిషయాన్ని చక్కగా వినరించి చెప్పారు.ఎలా అయితేమేం, అతడి మతి తేరుకునేట్లు చేశారు.

"నేను తప్పేమీ చేయలేదే? నా మిత్రులు రామలక్ష్మణులకు నా మీద ఎందుకు కోపం? ఎవరో విరోధులు చాడీలు చెప్పి, వారి మనస్సు విరిచి ఉండాలి" అన్నాడు సుగ్రీవుడు.

అప్పుడు హనుమంతుడు "రాజా! చెప్పవలసిన బాధ్యత నాకుంది కనక చెపుతున్నాను. కోపించకండి. రాముడికి మన మిచ్చిన మాట విలాపుకోవడంలో ఆలస్యం చేశాం. రామచంద్రుడి దుఃఖాన్ని మనం మరచి పోయాం. అది మనకు అపాయంగా పరిణమిస్తుంది. కాబట్టి మనం చేయవలసిన పని వెంటనే చేయాలి. మన ఆలస్యానికి మన్నించవలసిందిగా లక్ష్మణుణ్ణి కోరి, ఇక తామసించక రామ కార్యాన్ని వెరవేర్చుదాం!" అన్నాడు.

అప్పుడు సుగ్రీవుడు లక్ష్మణుణ్ణి తీసుకు రమ్మని చెప్పాడు.

లక్ష్మణుడు లోపలికి వెళ్లాడు. కిష్కింధానగరపు అందచందాలూ, ఆ అత్యంతమైన నాగరికతా చూసి అతడు ఆశ్చర్యం పొందాడు. అందమైన వీధులను దాటి సుగ్రీవుడి నగరు వాకిట నిలిచాడు. లోపల నుంచి కలకలస్వనాలూ, ఆటపాటలూ వినవచ్చాయి. వీరు తమ కర్తవ్యాన్ని బొత్తిగా మరచి భోగాలలో మునిగి తేలు

తున్నారే అని లక్ష్మణుడు కోపం పట్టలేక పోయాడు. అయినా, స్త్రీలతో నిండి ఉన్న అక్కడికి వెళ్లడానికి సిగ్గుపడ్డాడు. దూరంగా ఒక మూల నిలిచి ధనుష్టంకారం చేశాడు.

ఆ శబ్దం కిష్కింధా నగరాన్ని కంపింప చేసింది. ఆ ధ్వని వినగానే సుగ్రీవుడు భయపడి గభీమని లేచాడు. చిన్న రాజకుమాడికి నిజంగానే కోపం వచ్చిందని తెలుసుకున్నాడు. ఇప్పుడు నిజంగా అపాయమే వచ్చిం దనుకొని, తారను బతిమిలాడాడు. ఆమెను, "ముందుగా వెళ్లి లక్ష్మణుణ్ని సమాధాన పరుచు వదినా!" అని వేడుకొన్నాడు.

* * *

తార లక్ష్మణుడి కడకు వెళ్ళింది. సౌందర్యంలో, లోక జ్ఞానంలో, మాట నేర్పులో ఆమెకు సాటి ఎవరూ లేరు. ఆమె లక్ష్మణుడితో ఇలా చెప్పింది:

"చిరకాలం దారిద్ర్యాన్ని, శత్రుబాధనూ ఓర్చుకొని, కష్టపడ్డ సుగ్రీవుడు మీరు సంపాదించి ఇచ్చిన రాజ్యభోగాలను అనుభవిస్తున్నాడు. భోగలాలసతవల్ల అతడి బుద్ధికి మైకం సోకింది. అతడి దోషం నాకు కొత్తకాదు. మీరు అతడిమీద కోపగించకండి. అన్నీ తెలిసిన మీరు ఓర్పు విడువరు కదా. మధుపానంతో, భోగలాలసతో, మైకంలో ఉన్న సుగ్రీవుణ్ని, సంపూర్ణ జ్ఞానులైన మీరు మన్నించాలి. అతడు మీకు చేయవలసిన ప్రతిక్రియను మరచిపోలేదు. పలుతావులలో ఉన్న వీరు లందరికీ ఇక్కడికి వచ్చిచేరవలసిందిగా ఆజ్ఞలు చేశాడు. వారంతా నేడో రేపో వస్తారు. తరువాత సీతాన్వేషణమూ, రావణ సంహారమూ జరుగుతాయి. మీ రేమీ సందేహించవద్దు. రాజును చూద్దురుగాని. లోపలికి దయచేయండి" అని ఆమె అతడ్ని లోనికి తీసుకువెళ్ళింది.

లక్ష్మణుడి కోపం చల్లారింది; ఆమె వెంట లోపలికి వెళ్లాడు.

కోపం చల్లారిన లక్ష్మణుణ్ని చూసి సుగ్రీవుడు సంతోషంతో గద్దె దిగి, నమస్కరించాడు.

"నేను ఏం తప్పు చేసి ఉన్నప్పటికీ, రాఘవుడి స్నేహ శౌర్యాల వల్లనేకదా రాజ్య పదవిని పొందగలిగాను. రాముడు చేసిన ఉపకారాన్ని నేను మరవగలనా? రాముడి పరాక్రమాన్ని ఎరిగినవాడను కదా? నా సహాయం అవసరం లేకుండానే శత్రు నాశనం చేయదగ్గ బలం ఆయన కుందని నాకు తెలుసు. నేను, నా సేనతో ఆయన వెంట వస్తాను. అంతే. రావణుడు తప్పక నశిస్తాడు. సీతాన్వేషణకు వెంటనే ఏర్పాట్లు జరుగుతాయి. నేను చేసిన ఆలస్యానికి మన్నించండి" అని సుగ్రీవుడు లక్ష్మణుడితో అన్నాడు.

అది విని లక్ష్మణుడు ఆనందించాడు. "నీవంటి ధీరుడు రాముడే తప్ప మరొకడు లేడు. ఋష్యమూకానికి వచ్చి, రాముణ్ని చూసి, అడడి దుఃఖాన్ని చల్లార్చగల మాటలు చెప్పు!" అన్నాడు.

* * *

సుగ్రీవుడూ, లక్ష్మణుడూ ఒకే పల్లకి ఎక్కి వెళ్లారు. అంతకు పూర్వమే చేసిన ఏర్పాట్లన్నింటినీ రాముడికి చెప్పి, అతడ్ని తృప్తి పరిచాడు. రాముడు సంతోషంతో మాటాడాడు.

"నీవంటి మిత్రుడు లోకంలో మాకు మరెవ్వరూ లేరు. మేఘాలు వర్షించినట్లు, సూర్యుడు చీకట్లను పారదోలినట్లు, చంద్రుడు మానవ హృదయాలను చల్లబరచినట్లు, ఒకరి ప్రేరేపణ లేకుండానే సహాయం చేయడం నిజమైన మిత్రుడికి స్వభావం. నీ మైత్రిని నేను సంపాదించ గలగడం నా భాగ్యం. ఇక రావణుడు తన కులంతో సహా నిర్మూలం కావడంలో సందేహ మేముంది?"

ఇలా రాముడు తన కృతజ్ఞతనూ, ఆనందాన్నీ సుగ్రీవుడికి తెల్పుతున్న సమయంలో సుగ్రీవుడి ఆజ్ఞ ననుసరించి వానర వీరులు అడవుల నుంచి, కొండల నుంచి, సముద్ర తీరాలనుంచి, గుంపులు గుంపులుగా తమ తమ సేనలతో వచ్చి చేరారు. వారి కాలి ధూళి ఆకాశాన్ని కప్పి, కారుచీకటి అలముకొంది. వివిధ రూపాలు, వివిధ వర్ణాలుగల వానరులు, ఎలుగులు కోట్ల సంఖ్యలో వచ్చి చేరారు. ఆ మహా సేనకు తగు ఆజ్ఞ లిచ్చి సుగ్రీవుడు వారికి తాత్కాలికపు విడుదులు ఏర్పాటు చేశాడు.

బాగా ఆలోచించాక, సేనాధిపతులు వారి వానర సేనా సమూహంతో ఆష్టదిక్కులకూ వెళ్లి, సీతను వెతకాలని ఆజ్ఞాపించాడు.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి : కంబ రామాయణకర్త వాలి మరణానంతరం తార గుణ శీలాలకు కళంకం లేకుండా, ఆమె నిష్ఠ పూని పతివ్రతగా ఉన్నట్లు చిత్రించాడు. వాల్మీకి రామాయణంలో అలా లేదు. వాలి మరణానంతరం సుగ్రీవుడికి రాజ్యంతోపాటు తారకూడా సంక్రమించినట్లు వాల్మీకి రామాయణంలో ఉంది. సుగ్రీవుడు రాజ్యభోగాలలో, మధుపానాలలో, మునిగి తేలుతూ, రామ కార్యాన్ని మరచినప్పుడు తారాదేవి కూడా అందులో భాగస్వామిని అయివున్నట్లు వాల్మీకి వ్రాశాడు.

పూర్వం రాజ కులాలలోను, ఇతర కులాలలోను. అన్న మరణానంతరం అతడిభార్య కులానికి యజమాని అయిన తమ్ముడికి సంక్రమించడం వాడుకగా ఉండేది. అది ఆ కాలపు ఆచారం. ఒక కాలంలో ఉండే ఆచారాన్ని, మంచి చెడ్డలనూ ఇంకొక యుగంలో విమర్శించడం తేలికైన పనికాదు. అందుకు విశాల దృష్టి, కల్పనా శక్తి, కావాలి. ఈ కాలపు పరిస్థితినిబట్టి విమర్శించినప్పటికీ, ఒక్క విషయంమాత్రం స్పష్టం. పురుషుడు లేని స్త్రీ ఒక యజమానివద్దకు వెళ్ళి వ్యవహరించవలసి వచ్చినప్పుడు, ఆ స్త్రీని గురించి ప్రజల నోళ్లు మూయడం కష్టం. వివాహం చేసేసుకొంటే ఇలాంటి వాదులు తప్పుతాయి.

అలా కాక వాల్మీకి మహర్షి చిత్రణ ప్రకారంచూసినా, మనం తార దోషాన్ని ఎంచడానికి వీలవుతుందా? ఆమె కడు సమర్థురాలు. రాజనీతినీ, లోక ధర్మాన్ని, చక్కగా ఎరిగిన నేర్పరి. రాబోయే మంచి చెడుగులను ముందుగానే ఊహించగల నిపుణురాలు. వాలి మరణానంతరం అంగదుడి విషయంలో ఆమెను పెద్ద చింత పట్టుకుంది. ఆ కారణం వల్లనే ఆమె సుగ్రీవుడికి లొంగి పోయిం దని మనం ఎంచవలసి ఉంటుంది.

మనం ఈ కాలపువారి నడవడిని చూడాం. భార్యను ఎడబాసి ఏడ్చి పొర్లాడి, పరిశుద్ధాంతరంగంతో దుఃఖించిన పురుషు లెందరో

తిరిగి వివాహం చేసుకోవడం ప్రత్యక్షంగా చూస్తున్నాం కదా? తొలుత ప్రేమించిన భార్య స్మృతిని ఎంతగానో గౌరవిస్తూనే, ఇలా చేయడం చూస్తున్నాం. అది యోగ్యమైన పనే అని ఎంచుతున్నాం. అందులో మనకు దోష మేమీ కనిపించడం లేదు. పురుషుల నడవడికి ఒక ధర్మం, స్త్రీలకు మరొక ధర్మమూనా? తార చేసిన పని తప్పు అని ఎందు కనాలి? పాతివ్రత్య మనేది స్త్రీ పురుషు లిరువురికీ సమానమే కదా?

వాలి మరణానంతరం తార అంతఃపురానికి యజమానురాలై, తల్లి అయి, తన సూక్ష్మబుద్ధితో, జ్ఞానంతో, అంగదుణ్ణి సుగ్రీవుణ్ణి కాపాడుతూ ఉంది. ఇది వాల్మీకి రామాయణంలో కనిపించే తార. కంబరుకవి తార వ్రతనిష్ఠలో ఉన్న నిష్కళంక వితంతువుగా, రాజమాతగా, వెలుగొందుతూంది. ఇది మన మనస్సుకు బాగా పట్టిన పవిత్ర చిత్రం. అయితే, రెండవ చిత్రంకూడా లోకానుభవానికి తగినట్లుగానే ఉంది.

వాల్మీకి రామాయణంలో కూడా కంబరుకవి చిత్రణకు తా విచ్చే రీతిగా ఒక ఘట్టం ఉంది (సుందరకాండం). హనుమంతుడు లంకలో సీతకోసం వెతికి వెతికి, ఎక్కడా సీత కానరాలేదనే దుఃఖంతో ఇక ఏం చేయాలి, ప్రయత్నమంతా వ్యర్థమయిందే అని కిష్కింధకు తిరిగి వెళ్లి ఈమాట చెపితే అక్కడ ఏం కానున్నదో, అని ఆలోచిస్తున్నాడు. ఆ సందర్భంలో వాల్మీకి రామాయణంలో ఇలా ఉంది: "సీతను చూడకుండా తిరిగి వెళితే, సుగ్రీవుడు మరణిస్తాడు. భర్త మరణించిన తరువాత పతివ్రత ప్రాణాలతో ఉండదు. వాలి మరణించి నప్పటినుంచీ దుఃఖంలో మునిగి చిక్కి శల్యమై ప్రాణాలు వదలాలని ఉన్న వానరరాణి తారకూడా మరణిస్తుంది." వాల్మీకి రామాయణంలో ఉన్న ఈ అంశం కంబరుకవి చిత్రణకు సమానముగా ఉంది. దీన్ని చూస్తే కంబరుకవి తన అసమాన కల్పనా శక్తితో సంపూర్ణ చిత్రాన్ని ఊహించి, దానికి తగినట్లు మార్పులూ చేర్పులూ చేసి చక్కదిద్ది తన రామాయణాన్ని రచించినట్లు తలుస్తాను.

61. సీతాన్వేషణ

"రామా ! ఇదిగో చూడు, కోట్ల సంఖ్యలో ఉన్న ఈ వానరబలగమంతా నీ సేన. అపూర్వ బలసంపన్నులైన ఈ వానరు లందరూ నీ సేవకులు. ఏ కొరతా రానీయకుండా నీ కార్యాన్ని నిర్వహించాలన్న కోరికా, దానికి తగిన బలమూ వీరికి ఉంది. నీ ఆజ్ఞలను వీరు తలదాలుస్తారు. ఈ సేనను నీ సేనగా భావించి, వారు ఏంచేయాలో ఆజ్ఞాపించు" అన్నాడు సుగ్రీవుడు.

అది విని రాముడు ఆనందపరవశుడై సుగ్రీవుణ్ణి కౌగలించుకున్నాడు.

"మొదట తెలుసుకోవలసిన విషయం సీత ప్రాణాలతో ఉందా ? అని, ఉంటే ఎక్కడ ఉంది ? రావణుడు ఎక్కడ ఉన్నాడు ? అనేది తెలుసుకోవాలి. తరువాత చేయవలసిన పని ఆలోచిదాం. ఈ సేనకు ఆజ్ఞ లివ్వవలసిన వాడవు నీవే కాని, నేను కాని లక్ష్మణుడు కాని కాదు. నీవు రాజువు. కనుక నీవే అన్నీ తెలుసుకొని, ఎప్పుడేది చేయాలో నిర్ణయించగలవు. నీవంటి మిత్రుడు, తమ్ముడు లక్ష్మణుడితో నాకు దొరకడం నా మహాభాగ్యం" అన్నాడు రాముడు.

సుగ్రీవుడు తన సేననూ, సేనానాయకులనూ పిలిచి సీతాన్వేషణకు నలుదిక్కులా పంపించాడు. తరువాత హనుమంతుణ్ణి పిలిచి, అతడితో ప్రత్యేకంగా ఇలా చెప్పాడు :

"వాయుకుమారా ! ఈ కార్యాన్ని నిర్వహించగల సమర్థుడవు నీవే. నీ తండ్రి జవము, తేజస్సు నీలో మూర్తీభవించాయి. నీకు సమానులు ఈ లోకంలో మరి లేరు. బలం, బుద్ధి, పరాక్రమం, ఉపాయం, జ్ఞానం, ఇవన్నీ నీవద్ద ఉన్నాయి. ఈ మహాకార్యంలో నేను నిన్నే నమ్మి వున్నాను. ఇక నీదే బాధ్యత "

హనుమంతుడిపల్లనే ఈ కార్యం సిద్ధిస్తుందని రామచంద్రుడు కూడా తెలుసుకున్నాడు. ఎలాంటి విఘ్నం వచ్చినా, ఇతడు దానికి తగిన పరిహారం కనిపెట్టి, పని పూర్తిచేసుకు రాగలడని కూడా తెలుసు

కున్నాడు. అందుకని తన వేలి ఉంగరం అతడికిచ్చి "దీన్ని నీ వద్ద ఉంచుకో ! సీతను నీవు చూస్తావు. దీన్ని ఆనవాలుగా ఆమెకు చూపు. నీవు నా దూత వని ఆమెకు నమ్మకం కలుగుతుంది. నాకు సీతా సమాగమం కలిగించు" అని ప్రేమతోను, పూర్ణ విశ్వాసంతోను రాముడు హనుమంతుడితో చెప్పాడు. సీతకోసం విచారించి, దుఃఖించి, అల్లాడి పోయిన రాముడు ఆంజనేయుడికి ఉంగర మిచ్చిన దృశ్యాన్ని వర్ణించడం ఎవరితరం? రాముడు పూర్ణవిశ్వాసంతో ఉంగర మిచ్చాడు. వాయుపుత్రుడు నిండుభక్తితో దాన్ని అందుకొని, రామచంద్రుడికి నమస్కరించి, అనుజ్ఞ తీసుకొని బయలుదేరాడు.

సుగ్రీవుడు తన వానరసేనకు కఠినమైన ఆజ్ఞలు చేశాడు. "ఎలా అయినా సరే, సీతను వెతికి కనిపెట్టాలి. ఆమెను దుర్మార్గులు ఎక్కడ దాచినా మీరు కనిపెట్టగలరు. మీరంతా ఒక నెలలోపలే తిరిగి వచ్చి, ఏ సంగతీ నాకు తెలియజేయాలి !" అని కట్టడిచేసి పంపాడు. వారు పుట్టనుంచి ఈగలు రేగినట్లు, నలుదిక్కులకు బయలుదేరి వెళ్ళారు.

శతబలి అనే వానరవీరుడు తన సేనతో ఉత్తరంగా వెళ్లాడు. వినతుడు తూర్పుదిక్కుగా వెళ్లాడు. సుషేణుడు పడమటి దిక్కుగా బయలుదేరాడు. ఆంజనేయుడు. అంగదుడు, తారకుడు దక్షిణ దిక్కుగా పయనమైనారు.

అంతా గొప్ప ఉత్సాహంతో బయలుదేరారు. ఆ దొంగ, రావణుడు ఎక్కడ ఉన్నా, వాడ్ని చంపి, సీతను విడిపించుకు వస్తామని ఒకరితో ఒకరు ఉత్సాహంగా చెప్పుకుంటూ వెళ్ళారు.

* * *

"ఈ భూమినంతా ప్రత్యక్షంగా చూసిన వాడిలాగ, నీవు, నీ సేనాధిపతులకు చెప్పావే ! అవన్నీ నువ్వెలా చూశావు ? ఎప్పుడు చూశావు ?" అని రాముడు వానర రాజయిన సుగ్రీవుణ్ని అడిగాడు.

"అయ్యా ! నేను, వాలి తరుమగా పరుగులు పెట్టాను కదా ? నే నెక్కడికి వెళ్లినా, అతడు నన్ను తరుముకుంటూనే వచ్చేవాడు. అలా నేను అల్లాడుతూ, ఈ లోకమంతా తిరిగాను. అందువల్ల ఈ

భూమండలంలో ప్రతిచోటూ ప్రత్యక్షంగా చూసే అవకాశం నాకు లభించింది. తరువాత ఈ మతంగ మహర్షి ఆశ్రమభూమిని గురించి తెలిసింది. ఇక్కడికి వాలి వస్తే ఋషి శాపంవల్ల అతడి తల ముక్కలవుతుంది. అందువల్ల అత డిక్కడికి రాడు. వచ్చినా, నాకు అపాయంలేదు అని తెలియగానే, ఇక్కడికి వచ్చి తల దాచుకున్నాను" అని సుగ్రీవుడు చెప్పాడు.

* * *

వానరసేనలో తూర్పు, పడమర, ఉత్తర దిక్కులకు వెళ్లిన వారు ఒక నెలరోజులపాటు వెతికి, సీతను కానక తిరిగివచ్చి, వానరరాజుకు ఆ విషయాన్ని విన్నవించి నమస్కరించారు.

"అడవులు, కొండలు, నదీనదాలు, అన్నీ జాగర్తగా వెతికి చూశాం. ఎక్కడా సీత కనరాలేదు. జానకి ఉన్నచోటు వెతికి కనిపెట్టే భాగ్యం మాకు లేకపోయింది. దక్షిణ దిక్కుగా వెళ్లిన హనుమంతుడికే ఆ అదృష్టం పట్టేటట్లు కనిపిస్తూంది. ఆ రాక్షసుడు సీత నెత్తుకొని వెళ్ళిందికూడా దక్షిణ దిక్కుగానే కదా? ఇంతకూ హనుమంతు డింకా తిరిగి రాలేదు" అని వారన్నారు.

అది విన్న రాముడు వానరులు చేసిన ప్రయత్నాలను గురించి తృప్తిచెందాడు.

* * *

హనుమంతుడూ, అంగదుడూ దక్షిణ దిక్కుగా వెతుక్కుంటూ వెళ్లారు. వింధ్యపర్వత గుహల్లోను, అడవుల్లోను ప్రవేశించి, అన్నిచోట్లా వెతికి చూశారు. ఒక గొప్ప మరుభూమి కనపడింది. అక్కడ ఒక ఋషి తపస్సు చేసుకుంటున్నాడు. ఆయన శాపంవల్ల ఆ ప్రాంతంలో చెట్టుచేమలు కాని, పశుపక్షులు కాని లేకుండా శూన్యంగా ఉంది. అక్కడ కూడా వెతికిచూసి మరొక ప్రదేశానికి వెళ్లారు. అక్కడ వారికి పెద్ద రాక్షసు డొకడు కనిపించాడు. వానరులంతా గుంపుగా రావడం చూసి తనకు మంచిభోజనం దొరికిందన్న సంతోషంతో వారిని పట్టుకున్నాడు.

తమను ఇలా పట్టుకున్న రాక్షసుడు రావణుడే అయి ఉంటాడని అనుకున్నారు, వానరులు. అంగదుడు అతడిపైకి లంఘించి, ఒక చెంపపెట్టు పెట్టాడు. ఆ దెబ్బకు తాళలేక రాక్షసుడు నెత్తురు కక్కుతూ, ఒక పెద్ద కొండలాగా నేలను కూలాడు. రావణుడే మరణించా డనుకుని వానరులు సంతోషించారు. సీతకోసం అడవి అంతా గాలించారు. సీతగాని, సీత జాడలుకాని వారికి కనిపించలేదు. తరువాత సీతను వెతుకుతూ వారు ముందుకు సాగిపోయారు.

ఎంత వెతికినా ఫలితం లేకపోయెనే అని అప్పుడప్పుడు ఉత్సాహాన్ని కోల్పోయి, దుఃఖిస్తూ కూర్చునేవారు. తర్వాత అంగదుడూ, గంధమాదనుడూ మొదలైనవారు ధైర్యం చెప్పగా, మళ్ళీ వెతకడానికి బయలుదేరారు. ఇలా ఎన్నో రోజులు గడచి పోయాయి. 'సీత కనిపించలేదే. సుగ్రీవుడు కఠినశిక్ష విధిస్తాడే. ఏం చేయాలి?' అనుకుంటూ దక్షిణ దిక్కుకు బయలుదేరిన వానరులు అలా వెతుకుతూ చాలా దూరం పోయారు.

ఆకలిదప్పులకు బాధపడుతున్న ఆ వానరులు అలా వెతుకుతూ పోయిపోయి, ఒక పెద్ద గుహ చూశారు. ఆ గుహలో నుంచి అనేక రకాల పక్షులు ఆనందంగా ఎగురుతూ బెటికి వస్తున్నాయి. శరీర మంతా తమ్మి పుప్పొడి అంటిన నీటి పక్షులను చూసి, సుగంధంతో గాలి వీచడం చూసి, "ఈ గుహలో నీరుంటుంది. లోపలికి పోదాం" అని దప్పితో బాధపడుతున్న వానరులు కూడబలుక్కుని ఆ గుహలో ప్రవేశించారు.

గుహంతా చిమ్మచీకటిగా ఉంది. వానరులు ఒకరిచేతిని ఒకరు పట్టుకొని మెల్లగా చాలా దూరం వెళ్ళారు. అందులో కొందరు దప్పికి తాళలేక "అయ్యో దప్పి, దప్పి!" అని కేకలు కూడా పెట్టారు. అలా చీకటిలో చాలాదూరం వెళ్ళేసరికి హఠాత్తుగా వెలుతురు కనిపించింది. ఎదుట ఒక రమణీయమైన తోట కూడా కనిపించింది. ఆ తోటలో ముందుకు పోగా సుందర భవనాలతో సకల సంపదలతో అలరారే నగరాన్ని చూశారు. పసిడి మలామా చేసిన అందాల వీధులూ, భవనాలూ, చెప్పలేని సౌందర్యంతో ప్రకాశిస్తున్నాయి.

అక్కడ ఒకచోట నారచీరలు ధరించి, కృష్ణాజినంపై కూర్చున్న ఒక వృద్ధాతాపసి కనిపించింది. ఆ ముఖంలోని దివ్యవర్చస్సు చూసి వానరులు బెదిరిపోయారు

హనుమంతుడు ధైర్యం తెచ్చుకుని తాపసికి నమస్కరించి ఇలా అన్నాడు: తల్లీ! ఎవరు మీరు? విచిత్రమైన ఈ గుహను గురించీ, తమను గురించీ, మాకు వివరించి చెప్పండి. మేం చాలా ఆకలి దప్పులతో ఉన్నాం. అతిశ్రమతో ఈచీకటి గుహలో ప్రవేశించాం. నీరు దొరుకుతుందన్న ఆశతో ఈలోపలికి వచ్చాం. ఇక్కడ స్వర్ణమయమైన విచిత్ర భవనాలనూ వృక్షాలనూ తటాకాలనూ చూడగా, మాకు భయం వేస్తూంది. ఈ సంగతి ఏంటో చెప్పి మా భయాన్ని పోగొట్టి గోరుతున్నాం" అన్నాడు.

"వానరులారా! చీకటి కమ్మిన ఈ గుహ వాకిలి మీ రెలా కనుక్కున్నారు? లోపలికి ఎలా ప్రవేశించారు? ఇక్కడ మీకు కావలసిన నీరూ, ఆహారమూ ఉంది. ఆకలిదప్పులు తీర్చుకొండి. ఈ సుందర నగరాన్ని దానవ శిల్పి అయిన మయుడు నిర్మించాడు. అతడు శుక్రాచార్యుడివద్ద శిల్పశాస్త్రాన్ని అభ్యసించినవాడు. అతడు చాలాకాలం ఇక్కడే ఉన్నాడు. తరువాత ఇంద్రుడాతడిపైన పగబట్టి వధించాడు. ఈ స్వర్ణ నగరాన్ని నా చెలికత్తె అయిన 'హేమ' అనే అప్సరసకు ఇచ్చాడు. ఈ భవనాలూ, ఉద్యానవనాలూ, ఆమెవే. ఆమె ఇప్పుడు దేవలోకానికి వెళ్ళింది. మీరు వచ్చిన పని ఏమి? ఎందు కిలా అడవుల్లో తిరుగుతూ శ్రమపడుతున్నారు? ముందు ఆకలిదప్పులూ, అలసటా తీర్చుకోండి. ఆ తరువాత మాటాడుకోవచ్చు" అని ఆమె వారికి కావలసిన ఆహారాన్ని సమకూర్చి ఇచ్చింది.

అందరూ హాయిగా భోజనాలు చేసుకుని ఆనందించారు. తరువాత హనుమంతుడు వినయంతో తాపసికి తమ రాకను గురించి సవిస్తరంగా చెప్పాడు.

"దశరథుడి కుమారుడైన రాముడు భూమండలానికి అధిపతి కాదగినవాడు. కారణాంతరాలవల్ల అతడు రాజ్యాన్ని వదిలి, తమ్ముడితోను భార్యతోను వనవాసంచేస్తూ ఉండేవాడు. అలా ఉం

డగా రాక్షసు డొకడు రాముడి భార్య అయిన సీతను అపహరించుకు పోయాడు. ఆమెను వెతుక్కుంటూ రామలక్ష్మణులు ఈ ప్రాంతానికి వచ్చారు. వానర రాజైన సుగ్రీవుడు వారికి మిత్రు డైనాడు. రాముడికోసం సీతను వెతికిపెట్టమని వానరరాజు మాకు ఆజ్ఞ లిచ్చి పంపాడు. ఈ గుహలో మేం దారి తెలియక అలాడుతూ వుండగానే అతడు మా కిచ్చినగడువు కాస్తా గడిచిపోయింది. ఇప్పుడు మా కేం తోచడంలేదు. మా రాజు సుగ్రీవుడు చాలా నిక్కచ్చి అయినవాడు. అతడు చెప్పిన పనిని గడువులోపల చెయ్యకపోతే మా ప్రాణాలు నిలవవు."

ఆ తపస్వినిపేరు స్వయంప్రభ. ఆమె "మీరు ఇప్పుడు బైటికి పోవడానికి వీలు కాదే! ఈ గుహయొక్క శక్తి మీకు తెలియదు. ఇందులో ప్రవేశించిన వారు తిరిగి ప్రాణాలతో బైటికి వెళ్లలేరు. వారిక్కడే మరణిస్తారు. మీరు తలపెట్టింది చాలా గొప్పకార్యం. కాబట్టి కళ్ళు మూసుకోండి. నేను నా తపోబలంచేత మిమ్మల్ని వెలుపలికి దాటిస్తాను" అంది.

వారు అలాగే కళ్లు మూసుకున్నారు. వెంటనే ఆమె తన తపోబలంవల్ల వా రందరినీ సముద్ర తీరానికి చేర్చింది.

62. సంపాతి

సముద్రతీరాన్ని చేరగానే వానరులు చుట్టూ కలయజూశారు. వసంత కాలం ప్రారంభమయింది. అది చూసి అంగదు డిలా అన్నాడు:

"అయ్యో! గడువు దాటిపోయిందే! సీతను కాని ఆమె జాడ కాని కనుగొనకుండా కిష్కింధకు తిరిగివెళితే మనకు మరణదండనమే ప్రాప్తి. సందేహం లేదు. పైగా, నా మీద సుగ్రీవుడికి ప్రేమ లేదు. రాముడికి భయపడి నాకు యువరాజ్య పట్టాభిషేకం చేశాడే కాని, నిజానికి నా మీద నా పినతండ్రికి అభిమానం అనేది లేదు. అక్కడికి వెళ్ళి ప్రాణాలు విడవడంకన్న ఇక్కడే ప్రాయోపవేశం చేసి మరణిస్తాను."

అంగదుడు చెప్పింది యుక్తంగానే ఉందన్నారు వానరులలో కొంతమంది.

ఈ సలహా సరిగా లేదన్నాడు తారకుడు. "అసలు మన మెందుకు ప్రాణాలు వదలాలి? మనం తపస్వినీ స్వయంప్రభ గుహకు తిరిగివెళ్లి అక్కడే సుఖంగా ఉందాం. అక్కడ మనకు కావలసినవన్నీ ఉన్నాయి. సుగ్రీవుడు కాని మరొకరు కాని ఆ గుహలోకి రాలేరు. మనం జీవితమంతా అక్కడే సంతోషంగా గడపవచ్చు" అన్నాడు.

హనుమంతుడికి ఈ యోచన సమంజసంగా కనిపించలేదు.

"ఇదేంటి? ఇలా అనుచితమైన మాటలు మాట్లాడుతున్నారు? మన కుటుంబాలను కిష్కింధలో విడిచి, గుహలోపల తిని తాగి నిద్రిస్తూ బతికి ఉండడంలో సంతోషముంటుందా? మీ రనుకుంటున్నారు గాని, సుగ్రీవుడికి అంగదుడిమీద ద్వేషం ఎంతమాత్రమూ లేదు. సుగ్రీవుడు చాలా మంచివాడు. మనం అతడ్ని చూసి భయపడవలసిన పనిలేదు. నిజంగా సుగ్రీవుడికి మనమీద కోపం వచ్చి మనలను దండించాలనే అనుకుంటే, ఈ గుహలో మాత్రం మనం క్షేమంగా ఉండగలమా? లక్ష్మణుడి కోపానికి ఆ గుహ ఆగుతుందా? దాన్నతడు పిండిపిండి చేసి నిర్మూలించి వెయ్యడా? కనుక ఈ ఆలోచనలో ఔచిత్యం నాకు కనిపించడంలేదు. మనం తిరిగిపోయి, సుగ్రీవుడితో నిజం చెప్పి, అతడి దయ కోరి, క్షేమంగా ఉందాం, పదండి" అని హనుమంతుడన్నాడు.

హనుమంతుడు చెప్పింది సరి కాదని అంగదుడన్నాడు. "నువ్వు భ్రమపడుతున్నావు. సుగ్రీవుడికి నా పైన కొంచెంకూడా కనికరం లేదు. నన్నతడు చంపడం నిశ్చయం. అతడు మహాక్రూరుడు. వాలిని ఎలా చంపివేశాడో ఆలోచించండి. నేను ప్రాణాలతో ఉండడం అతడికి ఇష్టంలేదు. ఏదో ఒక సాకుతో, ఎలా అయినా నన్ను వదుల్చుకోవాలని అతడు ఆలోచిస్తున్నాడు. అతడూ, అతని వారూ వానర రాజ్యాన్ని నిరాటంకంగా ఏలడానికి నేను అడ్డంకిగాఉన్నా నని అతడి వూహ. దీనికితోడు, చేసిన ప్రమాణాన్ని మరవడం అతడి స్వభావం. సీతను వెతికిపెడతానని రాముడికి మాట ఇచ్చి, ఆ మాటను మరిచిపోలేదా? లక్ష్మణుడి ధనుష్టంకారం విని భయపడికదా, మనలను

పంపాడు ? నా తల్లి భర్తను పోగొట్టుకొని దుఃఖిస్తూ, సుగ్రీవుణ్ణి చూసి భయపడి అతడికి లొంగిపోయి, అణగి మణగి ఉంది. ఆమె పంచప్రాణాలూ నా మీదే పెట్టుకొని ఉంది. నేను మరణించానని ఆమెకు తెలియగానే ఆమె కూడా మరణిస్తుంది. నా కోసమే ఆమె ప్రాణాలు నిలుపుకొని ఉంది. అయ్యో ! నేనేం చేసేది ?

కిష్కింధకు తిరిగి వెళితే, నా మరణం నిశ్చయం. కనక ఇక్కడే ప్రాణాలు విడవడం మేలు. ప్రాయోపవేశం చేసి ప్రాణాలు విడవడమే మంచిది" అని అంగదుడు నేలపైన విధియుక్తంగా దర్భలు పరిచి దేవతలకూ పెద్దలకూ నమస్కరించి, ప్రాణ త్యాగానికి సంకల్పం చేసి, తూర్పు దిక్కుగా తిరిగి కూర్చున్నాడు.

యువరాజు అంగదుడు ఇలా ప్రాయోపవేశ వ్రతం పూనడం చూసి వానరు లంతా బోరుమని ఏడ్చారు. తాముకూడా అలాగే ప్రాణ త్యాగం చేయాలని నిశ్చయించి, ఉపవాస సంకల్పం చేసి, తూర్పు దిక్కుగా ముఖాలుపెట్టి కూర్చున్నారు.

* * *

చివరకు మన కీగతి వచ్చిందే అని, కూర్చున్న వానరులను గదరాజైన సంపాతి ఒక కొండమీద నుంచి చూస్తున్నాడు. రెక్కలు లేక ఎగరలేక, చిరకాలం ఆకలిదప్పులతో అలమటిస్తున్న సంపాతి "ఇందరు వానరులు ఒకచోట చేరి చావబోతున్నారు కనుక, నాకు సులభంగానే ఆహారం లభిస్తుంది" అని తలచి, సంతోషించాడు.

ఆ సమయాన వానరులు మృత్యువుకోసం ఎదురు చూస్తూ దుఃఖంతో ఒకరికొకరు తమ దుర్గతికి కారణాన్ని చెప్పుకొంటున్నారు.

"కైకేయి మూలముగా కదా, దశరథ మహారాజు మరణించాడు ? దశరథుడు మరణించడంవల్ల కదా, రాముడు అడవిలో ఉండవలసి వచ్చింది ? రాముడు అడవిలో ఉండడంవల్ల కదా, సీతను రావణుడు ఎత్తుకొని పోయాడు ? సీతకోసమే కదా, వీరుడైన జటాయువు ప్రాణాలు విడిచాడు ? జటాయువుకు శక్తి ఉండి మరికొంత సేపు యుద్ధంచేస్తే, రామలక్ష్మణులు అక్కడికి చేరి ఉండేవారు.

కాని దుర్విధి ఇలా చేసింది. చివరకు మనంకూడా మరణించవలసిన స్థితి యేర్పడింది." ఇలా వారు ఒకరి కొకరు చెప్పుకొంటూ విలపించారు.

ఆది విని సంపాతి "ఏమిటీ? నా తమ్ముడు జటాయువు మరణించాడా?" అనుకొన్నాడు. ఈ విషయం సవిస్తరంగా తెలుసుకోవాలని ఆత్రం కల్గింది అతడికి.

సంపాతి కడువృద్ధుడు. గరుడుడూ అరుణుడూ అన్నదమ్ములు. అరుణుడికి సంపాతీ, జటాయువూ, ఇద్దరూ కుమారులు. సంపాతీ, జటాయువూ చిన్నతనంలో తమ అపార శక్తికి మురిసి, పోటాపోటీలతో ఆకాశానికి ఎగిరారు. సూర్యమండలం దరి చేరేసరికి వేడి ఎక్కువై జటాయువు మాడిపోయేట్లు కనిపించాడు. అప్పుడు సంపాతి వాత్సల్యంతో తన రెక్కలు చాచి జటాయువుకు నీడ పట్టాడు. సూర్యుని చండతాపం యొక్క తాకిడికి జటాయువు బతికాడు కాని, సంపాతికి మట్టుకు రెక్కలు కాలిపోయాయి. సంపాతి ఎగరలేక క్రిందఒక కొండమీద కూలిపోయాడు. అది మొదలు అతడు కదలలేక అక్కడే ఆకలిదప్పులకు అలమటిస్తున్నాడు. అయినా, ప్రాణంపోక, బాధ పడుతున్నాడు.

"ప్రియతము డైన నా తమ్ముడు జటాయువు విషాద సమాచారాన్ని గురించి ఇక్కడ మాట్లాడుతున్న వా రెవరు? వానరులారా! జటాయువు మరణించాడా? దశరథ చక్రవర్తి కుమారుడు రాముడు అడవి కెందుకు వచ్చినట్లు? భార్యను ఎలా పోగొట్టుకున్నాడు? జటాయువును రావణుడు చంపివేశాడా? నాకు వివరంగా చెప్పండి" అని దుఃఖస్వరంతో సంపాతి ఎలుగెత్తి అడిగాడు.

వానరులు ప్రాయోపవేశం చేయడం చూసి, మరణించిన తరువాత అనాయాసంగా ఆహారం దొరుకుతుంది కదా అని రెక్కలు లేని ఆ ముసలిగద్దరాజు ఆశించగా, అది చివరకు ఆయనకే ఎదురెత్తుగా పరిణమించింది.

వానరులు లేచి, సంపాతి వద్దకు వెళ్లారు. ఆ ముసలి పక్షిని కిందికి దింపి, మెల్లగా నడిపించుకుంటూ వచ్చారు. సమస్త విషయాలూ ఒకరి కొకరు చెప్పుకున్నారు.

సంపాతి తన కథ చెప్పాడు. అంగదు డేమో కిష్కింధ విశేషాలన్నీ చెప్పాడు. రాముడికి సహాయం చేసే మార్గం ఏమిటి? అని అడిగాడు. సంపాతిది చాలా నిశితమైన దృష్టి. ఎంత దూరమైనా చూడగలడు. ఆ శక్తి ఇప్పటికీ తగ్గలేదు. ఇక్కడనుంచే తను లంకలో సీత చెరలో ఉన్న సంగతి చూడగలిగాడు. తాను చూసిం దంతా వానరులకు ఉన్నది ఉన్నట్టు చెప్పాడు.

లంకను గురించీ, రావణుడి ఐశ్వర్యాన్ని గురించీ, రాక్షస స్త్రీల కావలిలో జానకి చెరలో ఉండడం గురించీ చెప్పాడు.

దీంతో వానరులకు ఉత్సాహం కలిగింది. "రామ కార్యంలో నువ్వు తోడ్పడే సమయం వస్తుంది. ఇలా తోడ్పడినప్పుడు తిరిగి నీకు నీ రెక్కలు మొలుస్తాయి" అని, సంపాతికి వరముంది. ఆ వరం ఇప్పుడు ఫలించింది. సంపాతి సీతను గురించి ఇలా చెపుతూండగానే, అతడికి లేతలేత రెక్కలు మొలవ నారంభించాయి. ఆ రెక్కలతో సంపాతి అందమున్నూ ఎక్కువయింది.

రెక్కలు పొందిన సంపాతి, సముద్ర జలాలతో జటాయువుకు తర్పణాలు విడిచి తృప్తి పడ్డాడు.

63. వాయు పుత్రుడు

సీత చెరలో ఉన్న ప్రదేశం, రాక్షసుడి దేశం–వీటిని గురించి సంపాతి చెప్పగా, వానరులు తెలుసుకున్నారు. అయినా సుగ్రీవుడి వద్దకు పోయి చెప్పడానికి అంతమాత్రం చాలదు. తాము ప్రత్యక్షంగా చూడకుండా, ఇతరులు చెప్పిందాన్ని విని, సీతాన్వేషణ కార్యాన్ని విరమించడం ఉచితం కాదు. ప్రత్యక్షంగా చూసి, సంపాతి చెప్పింది ఎంతవరకు నిజమో పోల్చి చూసుకోవాలి. ఆ తరువాత కదా, రామ కార్యం నిర్వహించడానికి వీలయ్యేది? సముద్రాన్ని దాటినప్పుడు

కదా ప్రత్యక్షంగా ఆ ప్రదేశాలు చూడగలగడం? అందుకు ఏం చెయ్యాలో తెలియక, అంగదుడు తత్తరపడ్డాడు.

సముద్రతీరానికి వెళ్లిన వానరులు "ఈ సముద్రాన్ని దాటడ మెలా? లంకలో ప్రవేశించి, సీతను చూడడ మెలా? తిరిగి రావడ మెలా?" అని మళ్లీ విచారంలోనూ, భయంలోనూ మునిగారు.

అప్పు డంగదుడు వారిని చూసి, ఇలా అన్నాడు: "ఏ పనిని సాధించాలన్నా ధైర్యాన్ని విడవరాదు. ధైర్యమే ఏ ప్రయత్నాని కైనా మూలం. అధైర్యం అన్ని ప్రయత్నాలకూ అవరోధం."

తదుపరి అంగదుడు తన సేనలోని వీరు లందరినీ పిలిచి. తమ తమ లంఘనశక్తి ని గురించి ఉన్నదున్నట్లు చెప్పమని కోరాడు.

"వానర వీరులారా! మీ సామర్థ్యాన్ని గురించి సుగ్రీవుడు చెప్పగా విన్నాను. మీలో ప్రతివారూ వీర్యవంతులూ, తేజోవం తులునూ. సందేహం లేదు. ఈ కార్యాన్ని మీరే నిర్వహించాలి. సీతను చూడకుండా మనం కిష్కింధకు తిరిగి వెళ్లడానికి వీల్లేదు. రాజు చేతులో అవమానకరంగా మరణించడంకన్న, ఇక్కడే మనం ప్రాణాలు విడవడం మంచిది. కనుక మీలో ఎవ రెవరు ఎంతెంత దూరం దాటగల మనుకుంటున్నారో సరిగా చెప్పండి" అన్నాడు.

* * *

గజుడు, తను పది యోజనాల దూరం దాటగల నని సవిన యంగా చెప్పాడు. గవాక్షుడు, తను ఇరువై యోజనాలు దాటగల నన్నాడు.

"నేను ముప్పయి యోజనాలు దాటుతాను" అని మరొక వానర నాయకు డన్నాడు.

ఇలాగే, పలువురు వానరులు ముందుకు వచ్చారు. ఒకరికన్న ఒకరు తమ తమ లంఘన శక్తి ని గురించిన గొప్పతనాన్ని చెప్పు కున్నారు. తుదకు అందరికన్నా ఎక్కువ అనుభవజ్ఞు డైన వీరుడు జాంబవంతుడు లేచి ఇలా అన్నాడు:

"నేను ముసలివాడినై పోయాను. ఒకప్పుడు నాకూ కొంత బలం ఉండేది. ఇప్పుడు నా శక్తి ఉడిగింది. అయినా, ఇది రాజాజ్ఞ. రామకార్యం అందుకని ఈ ముసలితనంలోనే నా కొంతపని చేద్దామని ఆశపడుతున్నాను. నేను తొంభై యోజనాలు దాటగలను. అంతకుపైన నావల కాదు. లంకకు చేరడానికి ఈ శక్తి చాలనట్టు కనిపిస్తూంది. నా బాల్య దశను తలుచుకుంటే, ఇప్పుడు ఇలా ముసలివాడనై పోయానే అన్న దుఃఖం కలుగుతూంది" అన్నాడు.

అది విన్న యువరాజు "నేను నూరు యోజనాలు దాటి లంకను చేరగలను. సందేహం లేదు. కాగా అక్కడినుంచి తిరిగి రావడానికి అంత దూరమూ మళ్ళీ దాటగలనో లేనో మాత్రం చెప్పలేను" అన్నాడు.

అప్పుడు జాంబవంతు డన్నాడు: "రాజకుమారా! దాన్ని గురించి నీవు సందేహించ నక్కరలేదు. వాలిలాగా నీకుకూడా అపారమైన శక్తి ఉంది. అయినా ఈ కార్యాన్ని రాజువైన నీవు నిర్వహించడం ఉచితంకాదు. రాజు ఇతరులచేత పని చేయించాలిగాని తనే స్వయంగా పనులు చేయబోవడం రాజనీతి కాదు. దానివల్ల అపాయాలు కలుగుతాయి. ప్రజలను రక్షించి ఏలవలసిన వా రెప్పుడూ వెనక నిలబడి ఉండాలి. అంతే. అపాయ కార్యాలలో స్వయంగా తాను ప్రవేశించరాదు. అందుకని నేను చెప్పే ఆలోచన ఏమంటే అదిగో, దూరాన మౌనముగా కూర్చుని ఉన్నాడే, వాయు కుమారుడు! ఈ కార్యాన్ని నిర్వహించగల శక్తి సామర్థ్యాలు అతడికే ఉన్నాయి" అని చెప్పి జాంబవంతుడు హనుమంతుడి వద్దకు వెళ్ళి, అతడ్ని తోడ్కొని తెచ్చాడు.

* * *

చింతాక్రాంతులై నిలబడివున్న లక్షలాది వానర వీరుల ఎదుట జాంబవంతుడు హనుమంతుణ్ణి చూసి ఇలా చెప్పాడు:

"వీరుడవు: సకల శాస్త్రాలూ ఎరిగిన ప్రవీణుడవు. ఎందుకు మాట్లాడకుండా ఒక్కడవూ కూర్చున్నావు? నువ్వు, రాజైన సుగ్రీవుడితో సమానుడవు కదా? తేజస్సులో, బలంలో నువ్వు మా అంద

రినీ మించిన వాడివే? రామలక్ష్మణులకు కూడా సమానుడవే! పక్షి జాతికి శ్రేష్ఠుడైన గరుత్మంతుడు ఎగిరి సముద్రాన్ని దాటడం నేను చూశాను. వినతా పుత్రుడైన గరుత్మంతుడి రెక్కలకున్న బలం నీ బుజాలకూ ఉంది. పరాక్రమంలో, జవంలో నువ్వు గరుత్మంతుడికి ఏ మాత్రమూ తీసిపోవు. నీ బలం ఎంతో, నీ బుద్ధి ఎట్టిదో! నీకు తెలియదు, లోకంలో నీతో సమానుడు మరొకడు లేడు. నీ తల్లి అంజనాదేవి ఒక అప్సరస. ఋషి శాపంవల్ల వానరిగా పుట్టింది. ఆమె ఒకనాడు కొండ చరియల్లో ఉల్లాసంగా తిరుగుతున్నప్పుడు, వాయు దేవుడు ఆమె అందాన్ని చూసి మోహించి, మేను మరచి ఆమెను కౌగలించుకున్నాడు. ధర్మానికి వెరచి ఆమె 'పతివ్రత నైన నన్ను అవమాన పరచినవా డెవడవు? దుష్టుడా!' అని కోపించి అడుగగా, వాయుదేవుడు ఆమెను బతిమిలాడి కోపించవద్దని చెప్పాడు. 'నీదేహం అపవిత్రం కాలేదు. కామప్రేరితుడనై నేనీ పని చేశాను' అని చెప్పాడు. 'నేను దూరంగానే నిలబడ్డాను. నిన్ను మనస్సుతో మాత్రమే కౌగలించుకున్నాను. నీ శరీరాన్ని నేను తాకలేదు. అయినా, నా మానస స్పర్శవల్ల నీకు కలిగే కుమారుడు నాతో సమానమైన బలవీర్యాలు కలవాడవుతాడు' సాటిలేని పరాక్రమశాలి, బుద్ధిశాలి, అయిన వానరుడవుతాడు. అని వాయు భగవానుడు వినయంగా చెప్పి అంజనాదేవిని సమాధాన పరచాడు.

ఆంజనేయా! నువ్వు పసిపాపగా ఉన్నప్పుడే ఆకాశనికి ఎగిరి తూర్పున ఉదయించే సూర్యుణ్ణి చూపి పండు అనుకుని, పట్టుకుందామని వెళ్లావు. నువ్వు నిరాఘాటంగా, నిర్భయంగా, అలా ఎగరడం చూసి, దేవరాజుకు భయం వేసింది. ఇత డెవడు, సూర్యుణ్ణి పట్టడానికి వెళుతున్నాడే, అని నీ మీద వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. నీ వాపిడుగుపాటుకు పర్వతంమీద పడగా, నీ కుడిచెంపకు దెబ్బ తగిలింది. నీకు కలిగిన ఆపద చూసి నీ తండ్రి వాయుదేయుడు కోపంతో తన చలనాన్ని నిలిపివేశాడు. దాంతో జీవరాసులన్నీ ఊపిరాకడ అల్లాడిపోయాయి. దేవతలు వాయుదేవుణ్ణి కోపం మానవలసిందని ప్రార్థించి, ప్రాధేయపడ్డారు.

బ్రహ్మదేవుడూ, ఇంద్రుడూ అప్పుడు నీకు వరా లిచ్చారు. ఆ వర ప్రభావంవల్ల ఏ ఆయుధమూ ని న్నేమీ చేయజాలదు. నీవు ఇష్ట పడినప్పుడు మాత్రమే నీకు మరణం కలుగుతుంది. అంతవరకు నీకు మరణమే లేదని వరాలు పొంది, చిరంజీవి యైనావు. అంజనాదేవి గర్భాన వాయుమానస పుత్రుడవై నీవు పుట్టావు. వాయువుతో సమానమైన తేజస్సు, బుద్ధి, బలం, పరాక్రమం నీ కున్నాయి. ఈ బలాన్ని నువ్వు దుష్టులలాగా దుర్వినియోగం చెయ్యవు. ఏమంటే అన్ని గుణాలకూ మించిన వినయం నీలోవుంది. కనుక, రామ కార్యాన్ని నెరవేర్చగలవాడవు నీ వొక్కడవే. సముద్రాన్ని దాట డం నీకొక లెక్కకాదు. దుఃఖ సముద్రంలో కొట్టుమిట్టాడుతున్న ఈ వానర సేనను నీవే దరి చేర్చాలి. సముద్రాన్ని దాటగల శక్తి ఉండి కూడా, నీవు మిన్నకుండడం తగునా? నీ ఆకారం కోరిన మేరకు పెరుగుతుంది. గరుత్మంతుడితో సమాన మైనవాడవు నీవు: నాకూ ఒకప్పుడు బలం ఉండేది. నేను ఈ భూమండలాన్ని ఇరవై ఒక్కసార్లు చుట్టివచ్చాను. పాలకడలి చిలికినప్పుడు దేవతలు పంపగా, నేను నేల నలుమూలలనుంచీ ఓషధులు తీసుకు వచ్చి సముద్రంలో వేశాను. కాని ఇప్పుడు ముసలివాడ నై పోయాను. ఈ వానరు లంద రికీ ఇప్పుడు నీవే గతి. నిన్ను శరణుపొందాం. దివ్యశక్తి నీకు వార సత్వంగా వచ్చింది. ఇక ఆలసించకు. నీ నిజబలాన్ని గుర్తించి, బయలుదేరు. త్రివిక్రముడిలాగా విజృంభించి, ఒక్క అంగలో ఈ సముద్రాన్ని దాటు. మా దుఃఖాన్ని బాపు."

వృద్ధుడైన జాంబవంతుడు హనుమంతుణ్ణి పొగిడి, అతడి బల పరాక్రమాలను అతడికి చూపి, నిద్రాణమై ఉన్న అతని శక్తిని మేల్కొలిపాడు.

హనుమంతుడి శరీరం పర్వదినాలలో సముద్రంలాగా పొంగి, పెంపొందింది. వానరు లంతా చూస్తూ ఉండగానే వాయుపుత్రుడు అలా పెరిగి పెరిగి, ఇనుమడించిన బలంతో, తేజస్సుతో, త్రివిక్రముడి లాగా నిలిచాడు. అతని శరీరం నుంచి వెలువడిన కాంతిపుంజాన్ని చూసి అంగదుడు, ఇతర వానరులు, ఆశ్చర్యచకితులై ఆనందపర వశులయ్యారు.

ఇక్కణ్ణుంచి రామాయణంలో హనుమంతుడే కథానాయకుడు. విష్ణుభక్తులతడ్ని శ్రీహరికి "చిన్నదాసు" అని ముద్దుపేరు పెట్టి పిలుస్తారు. "పెద్దదాసు" గరుత్మంతుడు. అతడు సదా భగవత్సన్నిధానంలోనే ఉంటాడు కనుక ఆ పేరు వచ్చింది. చిన్నదాసు సీతాదేవి దుఃఖాన్ని బాపి, రావణ నగరాన్ని దగ్ధంచేసి, తన స్వామి వద్దకు వెళ్ళి "కంటిని సీతను" అని తెలిపిన వృత్తాంతం అంతా ఇక మీద తెలుసుకుందాం.

64. సముద్రలంఘనం

వినయం వెనుక మరుగుపడిన తన శక్తిని జాంబవంతుడు చెప్పగా గుర్తించాడు హనుమంతుడు. రామకార్యాన్ని నిర్వహించడానికి సంకల్పించాడు. వెంటనే ఆవేశం తెచ్చుకుని తన దృఢ నిశ్చయాన్నీ, నమ్మకాన్నీ వెల్లడించాడు. "మీరు చెప్పినట్లే చేస్తాను. నేను ఎగిరి ఆకాశమార్గాన వెళతాను. లంకలో దిగి జానకిని చూస్తాను. మీరు సందేహించకండి. నేను తిరిగి వచ్చేవరకు ఇక్కడే ఉండండి. సముద్రాన్ని దాటాలంటే నేలను కుప్పించి ఎగరవలసి ఉంటుంది. ఆ ఒత్తిడిన ఈ కొండ తట్టుకో గలుగుతుంది" అని చెప్పి, హనుమంతుడు మహేంద్ర పర్వతం ఎక్కాడు.

అక్కడ తన బలాన్నంతా కూడదీసుకుని, నేలను కాలుతో తట్టుతూ, నడిచాడు. ఆ పర్వతం మీద వుండే సకల ప్రాణులూ ఆ తాకిడికి తల్లడిల్లి, కొండను విడిచి పారిపోయాయి. పర్వతం మీదనుంచి హనుమంతుడు సముద్రాన్ని చూశాడు. మనస్సును ఏకాగ్రం చేసి, లంకలో నిలిపాడు.

"రావణుడు అపహరించిన సీతాదేవిని వెతికి కనిపెడతాను. ఆకాశమార్గాన ఈ సముద్రాన్ని దాటుతాను" అని మనస్సులో సంకల్పించుకొని సూర్యుని, ఇంద్రుని, వాయువును, బ్రహ్మను, భూతగణాలను ధ్యానించి నమస్కరించాడు. తరువాత తూర్పుదిక్కుగా నిలిచి, తన తండ్రి అయిన వాయువును ధ్యానించి, అంజలి ఘటించి తన శరీరాన్ని ఇంకా పెంచుకొని, దక్షిణ దిశగా చూశాడు.

పర్వతంమీద పదఘట్టనచేసి చేతులతో తట్టాడు. ఆ అదుటుకు కొండమీది చెట్లనుంచి పూవులు జలజలరాలి, పర్వతమంతా పుష్ప మయమై పోయింది. అత డా కొండపైన నడవగా. ఆ ఒత్తిడికి పర్వ తం కుంగి, ఏనుగు గండస్థలంనుంచి మదజలం స్రవించినట్లు కొండ నుంచి సెలయేళ్లు పెల్లుబికాయి. రంగురంగుల ధాతువు పర్వతంనుంచి ఎగిరి పడింది. గుహల్లోనించి మృగాలు అరుస్తూ పరుగులు పెట్టాయి. పాములు పడగలు విప్పి బుసలుకొడుతూ, రాళ్లనే కాటువేశాయి. వాటినుంచి నిప్పుకణాలు తూలిపడాయి. హనుమంతుడు రోమాలు విదిలించి గంభీరంగా సింహనాదం చేశాడు. తోక పైకెత్తి, నేలను కొట్టి, శరీరం పూర్వభాగాన్ని కుంచించి. ఊపిరి బిగబట్టి, పాదాలు ఆన్చి, చెవులు ముడుచుకొని, తన బలాన్ని పెంచుకొని, విజయ గర్జన చేసి, కుప్పించి ఎగసి, గరుత్మంతుడిలాగా ఆకాశమార్గాన రామబాణం లాంటి జవంతో వెళ్లాడు.

ఆ వేగానికి అనేక వృక్షాలు వేళ్ళతో పెకలివచ్చి అతడ్ని అనుస రించాయి. పువ్వులు రాలుస్తూ ఆకాశాన ఆ చెట్లుకూడా కొంత దూరం ఎగిరాయి.

ఆదికాలాన ఇంద్రుడు రెక్కలు నరికినప్పుడు కూలిపోయిన పర్వతాలలాగ వానర వీరుని వేగానికి ఎగిరిన ఆ చెట్లు ఒకటొకటిగా సముద్రంలో కూలాయి. చెల్లా చెదరుగా పడిన రంగురంగుల పువ్వు లతో ఆ సముద్రం, నక్షత్రాలతో నిండిన ఆకాశంలాగ శోభాయ మానంగా ప్రకాశించింది.

ఆకాశంలో వేగంగా వెళుతున్న హనుమంతుడి చేతులు అయిదు తలల నాగులలాగా ప్రకాశించాయి. హనుమంతుడు ఆకాశాన్ని మింగుతున్నట్లు దూసుకుపోయాడు. అతడి కన్నులు కారుచిచ్చులాగా జ్వలించాయి. ఎర్రని ముక్కు సంధ్యాసమయ సూర్యుడిలాగా ప్రకా శించింది. హనుమంతుడి ఆకారం ఆకాశంలో ధూమకేతువు లాగా తోచింది.

ఆ వేగానికి గాలిలో గర్జారవం బయ ల్వెడలింది. హనుమంతుడి నీడ సముద్రంమీద ఒక ఓడలాగా అతడ్ని అనుసరించింది. చూసిన

వారికి ఆకాశంలో రెక్కలు గల గొప్ప పర్వతం ఎగురుతూందా అనిపించింది. హనుమంతుడు అలా ఎగురుతూవుంటే మేఘాలమధ్యదోబూచులాడే చంద్రుడిలాగా వెలుగొందాడు. గంధర్వులు పుష్పవర్షం కురిపించారు. దేవతలు ఆశీర్వదించారు. వాల్మీకి మహర్షి చిత్రించిని ఈ సముద్రోల్లంఘన దృశ్యాన్ని నేటి పద్ధతిలో వర్ణించాలంటే ఆకాశంమీద, మేఘాలపైనుంచి రొదచేసూ వెళ్ళే పెద్ద విమానంలాగ, ఆంజనేయుడు ఎగిరాడని చెప్పవలసి ఉంటుంది.

సందర్భోచితమైన ధైర్యం, సమయస్ఫూర్తి, ఆలోచనాబలం, ఉహాశక్తి, సాటిలేని సామర్థ్యం, కార్యశూరత, ఇన్ని లక్షణాలుగల హనుమంతుడికి దారిలో కొన్ని పరీక్షలు ఎదురైనాయి. అత డాపరీక్షలను ఎంతో చాకచక్యంతో నెగ్గి, తన కార్యం నెరవేర్చుకుంటూ వెళ్ళాడు.

అత డలా ఆకాశంలో వెళుతూ ఉండగా అంతవరకు సముద్రంలో మునిగివున్న మైనాక మనే పర్వతం హఠాత్తుగా పైకి లేచింది. ఇదేంటి, దారి అడగిస్తూందే అని అనుకొని, హనుమంతుడు దాన్ని తన రొమ్ముతో కొట్టగా, గాలి తాకిడికి మేఘం చెదిరినట్లు ఆ మైనాక పర్వతం తూలి పడింది

"నాయనా! నేను మైనాక పర్వతాన్ని. సగర వంశంలో జన్మించిన రామచంద్రుడికి తోడ్పడవలసిందని సముద్రరాజు నన్ను ఆదేశించాడు. సగరవంశజుల చేతనే కదా, సముద్రం వర్ధిలింది? ఈ బాంధవ్యాన్ని గౌరవించి నీవు నా పైన కొంతసేపు నిల్చి, విశ్రమించి వెళ్ళు. విశ్రాంతి తీసుకువెళితే రామకార్యాన్ని చక్కగా నిర్వహించ గలుగుతావు. ఇంద్రుడు పర్వతాల రెక్కలను వజ్రాయుధంతో నరికినప్పుడు, నేను ఎగిరి సముద్రంలో దాక్కొని, ఇంకా ప్రాణాలతోఉన్నాను. నాకు శరణమిచ్చిన ఆ సముద్రుడు, నీకు తోడ్పడుమని ఆదేశించినందువల్ల ఇలా వచ్చాను. సముద్రానికీ సగరులకు సంబంధముందికదా! ఇంద్రుడి వజ్రాయుధాన్ని తప్పించుకొని ఇలా సముద్రంలో దాక్కోగలగడానికి నాకు నీ తండ్రి వాయుదేవుడు సహాయం చేశాడు. నువ్వు

నా మీద కొంచెము సేపు అతిథిగా విశ్రమిస్తే నాకూ, సముద్రుడికీకూడా సంతోషం కలుగుతుంది'' అని మైనాకుడు ప్రార్థించి పడ్డాడు.

అందుకు హనుమంతుడు"తండ్రీ! నేను నిలవడానికి వీలుకాదు. రామకార్యమూ, నా సంకల్పమూ ఇందుకు అవకాశం ఇవ్వవు. నీ ఆదరవాక్కులే చాలు. నేను ఆనందించాను'' అని వినయంగా చెప్పి, ఆ పర్వతాన్ని మృదువుగా నిమిరి, అనుజ్ఞ తీసుకొని ముందుకు సాగి పోయాడు.

కొంతదూరం సాగేసరికి, ఒక రాక్షసి పెద్ద గుహలాగా నోరు తెరచి,"నీవు నా నోటిలో ప్రవేశించు. చాలా కాలంనుంచీ ఆహారం లేక, నీ కోసమే కాచుకొని ఉన్నాను'' అంది.

"నేను రామకార్యంమీద పోతున్నాను. నన్ను అడ్డగించకు" అని హనుమంతు డన్నాడు.

"వీలులేదు. నా నోట ప్రవేశించి తీరాలి'' అంది రాక్షసి.

అప్పుడు హనుమంతుడు తన దేహాన్ని అపారంగా పెంచాడు. కాని, ఆ రాక్షసికూడా దానికి తగినట్టి తన నోరు చాస్తూ వచ్చింది. ఆ రాక్షసి నాగమాత. ఆమె పేరు సురస. సురస ఇలా నోరు పెద్దది చేయగానే, హనుమంతుడు అణువంత చిన్నరూపం ధరించి ఆమె నోటిలో దూరి శరీరంనుంచి ఈవలికి వచ్చి తిరిగి తన దేహాన్ని పెంచాడు.

"నీ ఫంతం నెగ్గింది కదా, తల్లీ! నీ నోటిలో ప్రవేశించాను. ఇక నీకు కావలసింది ఏం లేదుకదా!" అని హనుమంతుడు నవ్వుతూ అన్నాడు.

అది విని ఆ నాగమాతకూడా"నీ కార్యం విజయవంతంగా పూర్తి అవుతుంది. దేవతలు నిన్ను పరీక్షించడంకోసమే ఇలా చేయు మని నాతో చెప్పగా, ఈ రూపం తాల్చాను. నీవు రామకార్యంలో తప్పక విజయం పొందుతావు.వెళ్లు" అని ఆశీర్వదించి పంపింది.

ఈ పరీక్షలతో హనుమంతుడి కష్టాలు గట్టెక్కలేదు. ఆకాశాన వేగంగా వెళుతూ ఉన్నప్పుడు, కారణం లేకుండానే తన వేగానికి అవరోధం కలిగింది. ఎదురు గాలిని పట్టిన నావలాగ ముందుకు సాగ

డం కష్టమనిపించింది. ఏదో గొప్పశక్తి తనను పట్టి వెనక్కు ఈడుస్తున్నట్లు అనిపించింది.

నలువైపులకూ, పైకీ కిందికీ చూశాడు. అప్పుడు తెలిసింది కారణం. సముద్రంలో పెద్ద భూతం ఒకటి కానవచ్చింది. అది హనుమంతుడి నీడను పట్టుకుంది. దానివలనే అతడి వేగం మందగించింది.

"నీ కోసమే చూస్తున్నాను!రా! నాకు చాలా ఆకలిగా ఉంది" అని తన నీడను పట్టిన పెనుభూతం పెద్ద గుహలాగా నోరు తెరిచింది.

హనుమంతుడు వెంటనే ఆ రాక్షసి నోట దూరి తన గోళ్లతో దాని గుండె చీల్చి బైటికి వచ్చాడు. ఆ భూతం ప్రాణాలు వీడి, సముద్రంలో మునిగిపోయింది. హనుమంతుడు గ్రహణం విడిచిన చంద్రుడిలాగా ప్రకాశిస్తూ మళ్లీ ఆకాశాన ఎగురుతూ వెళ్లాడు.

పలురకాల పరీక్షలను గడిచి, తన సూక్ష్మబుద్ధి, ధైర్యం, బలం, సామర్థ్యాల సహాయంతో విజయం గాంచి ఎగురుతూ, హనుమంతుడు సముద్రాన్ని దాటాడు. అరటి, కొబ్బరి, తోపులతో వెలుగొందుతున్న లంకాతీరాన్ని చేరాడు. లంకాతీరంలో నిలిచి, నదుల సాగర సంగమ స్థలాన్నీ, అడవులనూ, చూశాడు.

రావణుని దేశసంపదనూ, అమరావతితో సమానమైన ఆ సౌందర్యాన్నీ చూశాడు.

"వెళ్లవలసిన చోటికి చేరాను. ఇక రాక్షసులకు నీ నివాసానికీ ఎటువంటి వాడినో తెలియనీయకుండా సీత ఉన్న స్థలాన్ని వెతకాలి" అని యోచించి విశ్వరూపాన్ని చాలించి, హనుమంతుడు సామాన్య రూపంతో ఒక పర్వతంమీద దిగాడు.

ANNAMALAI LIBRARY V.R.NARLA D.P.R.I. Acc. No.

65. అన్వేషణలో

హనుమంతుడు లంకలో కాలుపెట్టాడు. మంచి ఉత్సాహంగాను. సంతోషంగాను ఉన్నాడు. దిగిన తరువాత నిదానముగా ఆలోచించాడు.

"సముద్రం దాటాను. నిజమే. అయితే అంతమాత్రాన పని ముగిసిందా? రావణుడి నగరు త్రికూట పర్వతంమీద ఉంది. ఆకాశంలో వేలాడుతున్నట్లు కనిపిస్తూంది ఆ నగరు. ఆహా! ఎంత అందం! ఏంసంపద! ఎటువంటి కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాటు! అమరావతీ భోగవతీ నగరాలతో సమానమైందిగా ఉందే! సుందరమైన ఆ ఉద్యానాలు, అందమైన భవనాలు, ఎత్తైన ప్రాకారాలు, రక్షణ యంత్రాలు, అగడ్తలు ఇవన్నీ చూస్తూవుంటే ఈ రావణుణ్ణి ఎలా జయించగలమా అని బెంగపట్టుకుంది. నేను దాటిన సముద్రాన్ని మన సేన లెలా దాటగలుగుతాయి? దాటివచ్చినా, ఈ కోటను ఎలా ముట్టడించి గెలిచేది? ఆయుధపాణులైన రాక్షసులు రక్షిస్తున్న ఈ నగరం సామదాన భేద దండోపాయాలచేత ధ్వంసం చేయడానికి వీలు కానట్లుందే. ఇంతకీ, సీత ప్రాణాలతో ఉందా లేదా? ఆ విషయం ముందు నిర్ధారణ చేసుకోవాలి. తరువాత తక్కిన ఆలోచన. రావణుడి రక్షణలోఉన్న ఈ నగరాన్ని ఎప్పుడు ఎలాగ ఎక్కడనుంచి నేను ప్రవేశించడం ఉచితమో? అంతా కలయ వెతికినప్పుడు కదా సీతను దాచినచోటు కనబడుతుంది? అనాలోచితంగా నే నిప్పుడు తప్పుడుపని చేస్తే మొదటి తప్పు అసలు రామకార్యానికే ముప్పు తెస్తుందే?

పగటిపూట లోపలికి ప్రవేశిస్తే,రాక్షసులు సులువుగా నన్ను కనిపెట్టగలరు. కనుక, రాత్రిపూటే నేను నగరంలో ప్రవేశించాలి. అయితే, నేను ఏ రూపంతో ప్రవేశించడం ఉచితం? రాక్షసులు చూసినా, సందేహించడానికి వీలులేని చిన్న రూపుతో వెళ్లాలి."

హనుమంతుడు పిల్లి అంత చిన్న వానరంగా తయారయ్యాడు. నగరంలో భవనాలు, ఉపవనాలు అన్నిటా ప్రవేశించి, వెతకడానికి అదే వీలుగా ఉంటుందని నిశ్చయించుకున్నాడు. అలా నిశ్చయించుకున్న వెంటనే వాయుపుత్రుడు, తన సహజరూపాన్ని కుదించుకున్నాడు. బృహదాకారంతో సముద్రాన్ని దాటిన హనుమంతుడు ఒకచిన్న కోతి పిల్లగా మారిపోయినప్పుడు, ఎవరు చూసినా ఆశ్చర్యపడిఉండేవారు.

* * *

ఆంజనేయుడు చిన్న వానరరూపం ధరించిన సమయానికి సూర్యుడు అస్తమించాడు. హనుమంతుడు కోటవాకిలివైపు వెళ్ళాడు. అప్పటికి చంద్రుడు ఉదయించగా పిండి ఆరబోసినట్లు వెన్నెల నిండింది. అది చూడగానే హనుమంతుడికి ఉత్సాహం కలిగింది.

దృఢమైన ప్రాకారాల రక్షణలో ఉన్న రావణుడి పుర సౌందర్యాన్ని, సంపదనూ, ఐశ్వర్యాన్ని, దూరంనుంచి చూసినప్పుడే హనుమంతుడు చాలా ఆశ్చర్య పడ్డాడు. వీధులు, భవనాలు, తోరణాలు, ధ్వజాలు, ఇతర అలంకారాలు, అన్నీ బంగారు, వెండి, రత్నాలతో ధగధగ మెరుస్తున్నాయి సముద్రపుగాలి హాయిగా వీస్తూంది. ఇంద్రుడి అమరావతీ, కుబేరుడి అలకానగరాల వలెనే రావణుడి లంకాపురి కూడా సకలైశ్వర్యాలకు నిలయమై వుంది. అది చూసి హనుమంతుడికి ఒకవంక ఆశ్చర్యం కలిగింది. మరొకవంక 'ఇంత దృఢరక్షణతో ఇంత ఐశ్వర్యంతో నిండిన ఈ కోటను, ఈ నగరాన్ని, దీన్ని పాలిస్తున్న రాక్షసుణ్ణి, ఎలా జయించడమా' అన్న సందేహమూ కలిగింది.

ఆశ్చర్య విచారాలతో చూస్తూ వెళ్ళగా, ఆ నగరాన్ని, రక్షిస్తున్న అధిదేవత భయంకర రూపంతో హనుమంతుడి ఎదుట నిలిచి "ఎవరు నువ్వు, కోతీ! ఇక్కడికెలా వచ్చావు? నిజం చెప్పు!" అని బెదిరిస్తూ అడిగింది.

"నేను వానరాన్నే! అందమైన ఈ నగరాన్ని చూసి పోదామని వచ్చాను. అంతా కలియ దిరిగి, నా ఆశ తీర్చుకుని వెళ్ళిపోతాను" అని హనుమంతు డన్నాడు.

లంకాధిదేవత అయిన లంకిణికి కోపం వచ్చి, 'పో, కోతీ!' అని హనుమంతుడి చెంపపై ఒకటి వేసింది.

హనుమంతుడు తన ఎడమ పిడికిలితో లంకిణి పొట్టలో ఒక్క పోటు పొడిచాడు. ఆ పోటుకు ఆ ఘోర రూపిణి తాళలేక, ముడుచుకు పడిపోయింది.

పడిపోయిన లంకిణి లేచి, "ఒక వానరం చేతిలో ఏనాడు ఓడిపోతావో, నీ నగరానికి ఆనాడే అవసానం దాపురిస్తుంది అన్నమాట

విజమని తోస్తూంది. రావణుడి పాపాలు పండిపోయాయి. ఇంక లంకకు వినాశకాలం వచ్చిం దన్నమాట. దేవవాక్కు నెరవేరే కాలం దగ్గిరపడింది'' అని చెప్పి, తప్పుకుని, హనుమంతుడికి తోవ ఇచ్చింది.

ఈ లంకాదేవత రావణుడికి లోబడిన సేవకురాలు కాదు. ఆ నగరానికి అదృష్టదేవతే ఈమె.

హనుమంతుడు ప్రాకారం ఎక్కి చూకి, లోన ప్రవేశించాడు. శత్రువుల కోటలోపలి ద్వారం గుండా వెళ్ళకూడదనీ, దారిలేని చోటు నుంచి దారి చేసుకుని వెళ్లాలనీ, పూర్వకాలపు యుద్ధశాస్త్ర మర్యాద. రాక్షసులు నశించా లని సంకల్పించి హనుమంతుడు లంకానగరంలో ముందు ఎడమ పాదం మోపాడు.

* * *

నేలంతా పువ్వులు చల్లిన అందాల రాజవీధిలోంచి వెళ్లాడు, హనుమంతుడు. మేఘాల మధ్య మెరుపు తీగెల్లాగ ప్రకాశిస్తున్నాయి భవనాలు. హనుమంతుడు ఆ భవనాల మీదనుంచి దాటుకుంటూ, వాటి అందాన్ని మెచ్చుకుంటూ, వెళ్లాడు.

ఆ రాక్షసుల భవనాలూ, వాటి అలంకారాలూ, వీధుల అందచందాలూ వర్ణించలేం కొన్ని భవనాలనుంచి శాస్త్రయుక్తమైన సంగీతం వినిపించింది మరి కొన్ని భవనాలనుంచి అందకత్తెల కేకలు అండెలు రవళించాయి. అంతటా కుతూహలమే! ఎక్కడ చూసినా కోలాహలాలే. కొన్ని ఇళ్ల లోపలినుంచి మంత్రజపాలు వినిపించాయి. మరికొన్ని భవనాలలో రాక్షసులు వేదాధ్యయనం చేయడం వినిపించింది. కొన్ని ఇళ్లనుండి రావణ స్తోత్రాలు వినిపించాయి వీరులూ చారులూ నిండిన వీధులు చూశాడు, హనుమంతుడు. వైదికాచార సంపన్నులైన వాళ్లని చూశాడు. ఘోరాకారులను, వికృతరూపులను చూశాడు. విల్లమ్ములు, కత్తులు, ముసలాలు, ఒడిసెలలు, శూలాయుధాలు, బల్లాలు, ఈటెలు మేలైన ఆయుధాలు ధరించి కవచధారులై నిలిచిన వీరభటులను చూశాడు.

కొందరు ఎంతో సుందరంగా ఉన్నారు. మరికొందరు మహా ఘోరంగా ఉన్నారు కొందరు. తెలుపు మరికొందరు కారునలుపు. కొందరు ఎరుపు. కొందరిది సామాన్యపు ఆకారం. కొందరు మరు గుజ్జులు, కొందరు ఆజానుబాహులు, కొందరు మరీ దీర్ఘకాయులు. ఇలా నానావిధ రూపాలు గలవారినీ చూశాడు, హనుమంతుడు.

ఒక్కొక్క భవనమే పరిశీలిస్తూ వెళ్లాడు. అతిలోక సుందరులై న పలుపురు స్త్రీలను చూశాడు. నాధులతో సంతోషంగాఉన్నవారిని చూశాడు. మేలిమి బంగారు చాయగల యువతులను చూశాడు. కొందరు మేడల మీద కూర్చున్నారు. కొందరు నిద్రపోతున్నారు. కొంద రాడుతున్నారు. కొందరు పాడుతున్నారు. ఇలా హనుమంతు డెందరో స్త్రీలను చూశాడు. కాని, దుఃఖంతో చిక్కి, రామున్నో ధ్యానిస్తున్న సీతను మాత్రం చూడలేదు. అందకతె లందరి పనిపట్టి చూశాడు. సీత కనబడక హనుమంతుడి హృదయంలో దుఃఖంమాత్రమే మిగిలింది.

వరసగా రాక్షసవీరుల భవనా లన్నీ కలయ దిరిగాడు. మదపు టేనుగులు, జాతిగుర్రాలు, రథాలు, ఆయుధశాలలు, సర్వత్రా కని పించాయి. అంతటా వీరులు ఆయుధపాణులై నిలిచి వున్నారు. స్త్రీల ఆటపాటలతో, సంగీత వాద్య ఘోషలతో, ఆనందమయంగా ఉన్న భవనపం క్తినీ, ఉద్యాన వనాలనూ, చూసిన తరువాత కొండమీద ఎత్తుగా ఉన్న గొప్ప నగరు చూశాడు. ఆ నగరువాకిట, పక్కన నిలిచిన ఏనుగులు, గుర్రాలు, పదాతిసేన, దానిచుట్టూ ఉన్న ప్రాకారం, ఆ భవన సౌందర్యం, బంగారు తోరణాలు చూసి, అదే రావణుడి నగరు అయివుంటుందని ఊహించాడు. సుసంపన్నమైన లంకా నగరానికి మకుటాయనమానమై వెలుగును వెలారుస్తున్న ఆ నగరులో ప్రవే శించాడు.

ఆ భవనం భూలోక స్వర్గంలాగా ఉంది. రావణుడి అనన్య సామాన్య బలపరాక్రమాలకు తగినట్లుగానే ఉంది ఆ భవనం. తోట, తోటలో కలరవాలు చేస్తున్న పిట్టలు, అక్కడక్కడ మనోహర

. .

చిత్రాలుగల కేళీకూటాలు చూసి, హనుమంతుడు ఆశ్చర్యంలో మునిగి పోయాడు.

ఆహా! ఏం సంపద! ఏంఅద్భుతం! ఏం భోగం! అని ఆశ్చర్యం చెందాడు. ఆశ్చర్యాన్ని అంతలోనే పారదోలి, జానకి కనపడలేదే? వచ్చిన పని కాలేదే! అద్భుతాలను చూసి ఆశ్చర్యపడితే ఏం లాభం? అని రామకార్య చింతనలో మునిగిపోయాడు.

ఆ భవనాలమధ్యని, రావణుడుండే నగరుకు వెళ్ళి. అన్ని భాగాలను కలయజూశాడు. ఇది స్వర్గమా, దేవలోకమా, అని ఆశ్చర్య పడేటట్లున్నాయి, అక్కడి అలంకారాలు. ఎక్కడ చూసినా వెండి బంగారాలు, రత్నాలు ముత్యాలు, దంతపు నగిషీపనులు, పనివాడితనం గల రత్నకంబళాలు, వినోద శిల్పాలు కానవచ్చాయి. మధ్యని పుష్పక విమానం ఉంది. అది బ్రహ్మవద్ద కుబేరుడు పొందిన అద్భుత విమానం. రావణుడు కుబేరుణ్ని జయించి దాన్ని లంకకు తెచ్చాడు. వసిష్ఠుని నందినీధేనువు లాగా ఏది కోరితే దాన్ని సమకూరుస్తుంది ఆ అద్భుత విమానం.

హనుమంతుడు రావణుడి అంతఃపురం ప్రవేశించాడు. అదొక మహా భోగసముద్రంలాగా ఉంది. ఎందరో సుందర స్త్రీలు నిద్రిస్తున్న ఆ విశాలకూటం, రంగురంగుల పూలమొక్కలతో నిండిన ఉద్యానవనంలాగా ప్రకాశించింది. హనుమంతుడు తను వచ్చినపనిని బట్టి నిద్రిస్తున్నవారి నందరినీ పరిశీలనగా చూశాడు. ఒకరిని మించిన అందకత్తె మరొకతె. ఒకరిని మించిన కామమోహ పరవశ మరొకతె. అంతా సంతోషంగా, సంతృప్తిగా, నిద్రపోతున్నారు. రావణుడి కామరూపమూ, పౌరుషమూ ఆ సుందర స్త్రీలను పూర్తిగా తనిపినట్లు హనుమంతుడు గ్రహించాడు.

"ఈ స్త్రీలలో సీత లేదన్నమాట నిశ్చయం. ఆమె రాక్షసుడికి ఎన్నడూ వశపడదే? ఆమెకోసం నేను ఇక్కడ ఎందుకు వెతుకుతున్నాను? ఎంత పిచ్చివాడ్ని? సీత వీరిలో ఉండదు" అనుకొన్నాడు హనుమంతుడు.

• •

అలాగే చూస్తూ వెళ్ళగా ఒక గదిలో అనేక శయ్యలు కనిపించాయి. దంతపు కోళ్ళకు బంగారు నగిషీ చేసి, వైఢూర్యాలు తాపిన అందమైన మంచాల మధ్య ఒక పెద్ద మంచముంది. దానిమీద మేరు పర్వతంలాగ రావణుడు నిద్రిస్తున్నాడు. ఆ రాక్షసుడి ఆకారం, గంభీర సౌందర్యం, తేజస్సు చూసి, హనుమంతుడు ఒక్క క్షణకాలం వణికి పోయాడు. దూరంగా నిలిచి, పరికాయించి చూశాడు. ఏనుగు తొండాలవంటి చేతులు. రొమ్మున ఐరావతం దంతాలతో కుమ్మగా ఏర్పడిన గాయంమచ్చలు, మేన ఇంద్రుడి వజ్రాయుధం వల్లా విష్ణు చక్రంవల్లా కలిగిన గాయాల గుర్తులు. అవన్నీ చూస్తూ ఉంటే ఆ రాక్షసుడి గంభీర సౌందర్యం హనుమంతుడి మనస్సును ఆకర్షించింది.

ఆ పరిసరాల్లో నిద్రిస్తున్న పలువురు స్త్రీలను చూశాడు. పాటలు పాడుతూ జంత్రవాద్యాలను పట్టుకొని కొందరు అలాగే నిద్రపోయారు.

ఎంతో అందమైన ఒక స్త్రీ మంచంమీద పడుకొని వుండడం చూశాడు. ఆమె ఆ అంతఃపురాని కంతకూ నాయికగా కనిపించింది, ఆమె అవయవ సౌష్టవం, సౌందర్యం, ముఖలక్షణం చూసి ఆమే సీత కాబోలు నని ఒక్క క్షణంసేపు అనుకున్నాడు హనుమంతుడు. ముఖంలో ఉత్తమ లక్షణాలు కనిపించాయి. "సీతను కనిపెట్టేశాను" అని ఒక్క సారి ఎగిరి గంతేశాడు. కాని మరుక్షణంలోనే 'ఛీ ఛీ' ఇదేమి అజ్ఞానం! సీత ఇంత సుఖంగా నిద్రిస్తుందా? ఇలా నగలు పెట్టుకొని ఒక పడుచు వాడి గదిలో పడుకుంటుందా? అనుకొన్నాడు. తను అలా తల పోయడం పెద్ద పొరపాటు అనుకొని ఆ పొరపాటు చేసినందుకు దుఃఖించాడుకూడా.

"సీత తనకు లొంగనందువల్ల, ఈ రాక్షసుడు ఆమెను చంపి వేసి ఉంటాడు. ఇంక నేను వెతకడంవల్ల ఫలిత మేంటి?" అని మళ్ళీ అనుకున్నాడు.

* * *

హనుమంతుడు రావణుడి అంతఃపురమంతా కలయదిరిగి, పరిశీలించాడు. శయనాగారం, భోజనశాల, పానశాల, గానమందిరం

మొదలైన అన్ని ప్రదేశాలూ పెతికి చూశాడు. ఎక్కడా సీత కానరాలేదు.

"సీతను వెతకడం కోసం అడుగు పెట్టరాని చోట్లలా తొక్కి చూశాను. స్త్రీల శయనాగారాల్లో ప్రవేశించి కొంత ధర్మహానికూడా చేశాను. కార్యసిద్ధిమాత్రం కలగలేదు" అని దుఃఖించి పానశాలను విడిచి, తోటలోకి వెళ్ళి పొదరిండ్లు, కేళీకూటాలు, అన్నీ వెతికి చూశాడు. ఎక్కడా సీత కనిపించలేదు.

"లంకా నగరమంతా చూశాను. రావణుడి నగరు అంతా వెతికాను. ఇక వెతక వలసిం దేముంది? సీతను చూడకుండా తిరిగి పోవడమా? వీల్లేదు. ఇంక నా కొక్కటే మార్గము. ఇక్కడే ప్రాణాలు విడుస్తాను. అదే నేను చేయగల్గింది" అని దుఃఖంలో మునిగి పోయాడు.

* * *

"ఛీ ఛీ! ఇలా మనస్సు కలవర పెట్టుకోవడం పనికిరాదు. ఇది ధీర లక్షణం కాదు" అనుకొని మళ్ళీ బయలుదేరి, అంగుళం అంగుళమూ ప్రతి చోటూ గాలించి చూశాడు. మూసిన తలుపులూ కిటికీలూ తెరిచి చూశాడు. వికారాకారంగల రాక్షస స్త్రీలనూ, అతి సౌందర్యవతులైన ఎంతోమంది మానవాంగనలనూ, నాగ కన్యలనూ, రాక్షసు డపహరించి తెచ్చిన ఎందరో సౌందర్యవతులనూ చూశాడు. ఎందరైనా కనబడుతున్నారుగాని, సీత మాత్రం కనిపించనేలేదు.

ఏం చెయ్యడానికీ తోచక హనుమంతుడి మనస్సు క్షోభించి పోయింది. "కార్యం సిద్ధించలేదని కిష్కింధకు చేరితే, వారి ప్రశ్నకు నే నేం బదులు చెప్పేది? సీత ఆశ ఇంక లేదంటే, రాముడి గతేం కావాలె? ఆయన ప్రాణం విడువక తప్పదే? ఆతరువాత మిగిలిన వారి గతేంటి? నా ప్రయత్నం వ్యర్థమైందని సుగ్రీవుడితో చెప్పడం కన్న, ఇక్కడే ఏ అడవిలోనో సముద్రతీరాన్నో జీవితం గడపడం మంచిది. అదెందుకు? ఆత్మహత్య చేసుకోవడమే సరి. సీత లంకలో ఉందన్నాడే సంపాతి, ఆ మాట అబద్ధమా? లేక ఆమెను ఈ దుష్ట రాక్షసుడు చంపివేశాడా? ఆమెను రాక్షస స్త్రీలే తినివేశారా?

ఏం తోచడంలేదే, ఏం చేసేది?'' అని హనుమంతుడు పలువిధాల చింతించి చింతించి, ఈ దుఃఖసముద్రం గడచి గట్టెక్కే మార్గం కానక, తల్లడిల్లాడు. ఆ సమయాన ఎత్తయిన ప్రాకారాలుగల ఒక ఉద్యానవనం కంటబడింది.

"ఆహా! ఇంతవరకూ ఇక్కడ నేను వెతక్కపోతినే. సీత ఇక్కడే ఉండి ఉంటుంది" అని వాయుపుత్రుడు రామలక్ష్మణులను, సీతను, సుగ్రీవుని ఒక్కసారి ధ్యానించుకున్నాడు. రుద్ర, ఇంద్ర యమ, వాయు, చంద్ర, సూర్య, మరుద్గణాలకు మనస్సులో మొక్కి ప్రార్థించాడు.

"ఇదొక ప్రత్యేకమైన ఉద్యానవనంగా కనిపిస్తూంది. దీనికిగల రక్షణ బలే కట్టుదిట్టంగా ఉంది. సీతను ఇక్కడే ఉంచి ఉంటారు. నిశ్చయం.'' అని హనుమంతుడి మనస్సులో ఒక నమ్మకం తోచింది.

దేవత లందరికీ మళ్లీ నమస్కరించి, అశోకవనం గోడయెక్కి. నిలబడాడు. లోపలంతా బహు రమణీయమైన ఉద్యానవనం కను పండువుగా కనిపించింది.

66. అశోకవనంలో సీత

అశోకవనం ప్రాకారంమీద నిలబడగానే హనుమంతుడి మనస్సులోను, మేనిలోను ఒక ఆనందమయమైన శక్తి పారాడింది. సీత ఉన్నచోటు చేరినందుకు, మెమరచే ఆనందం కలిగింది.

వసంతకాలపు పువ్వులన్నీ పూచి చెట్లు, తీగెలు కడు రమణీయంగా కనిపించాయి. చెట్లు గుబురుగాఉన్న ఒక చోటు చూసి, హనుమంతుడు అక్కడి కెగిరి వెళ్లాడు. ఆ వేగానికి కోకిలలూ, నెమళ్లూ లేచి మధురంగా కూశాయి. జింకలూ లేళ్లూ అటూ ఇటూ తిరుగాడుతున్నాయి. చెట్లనుంచి పువ్వులు రాలి హనుమంతుడి శరీరాన్ని కప్పివేసేసరికి అత డొక పువ్వుల బొమ్మలాగా కనిపించాడు. అశోకవనంలోని ప్రాణులన్నీ ఆ చిన్నారిపువ్వుల కోతిని చూసి వేకువ

జామున వసంతదేవత ఈ ఉద్యానవనాన్ని సందర్శించడానికి వచ్చింది కాబోలని అనుకున్నాయి.

ఆ ఉద్యాన రామణీయకత సర్వజన మనోహరంగా ఉంది. అందమైన బావులు, వెండి, బంగారు, దంతం, ముత్యం పవడాలతో కట్టిన చప్పరాలు, మెట్లు, కృత్రిమ పర్వతాలు, నదులు, పొదరింట్లు, జలపాతాలు, ఆటలాడే అందమైన పక్షులు- ఈ దృశ్యాలు చూడగానే హనుమంతుడి హృదయంలో ఆనందం తాండవించింది. కొన్ని పళ్ళచెట్ల చుట్టూ బంగారు అరుగులూ, వెండి అరుగులూ ఉన్నాయి. చెట్లకు కట్టిన చిరుగంటలు, గాలి వీచినప్పుడల్లా కదలి, గలగల మోగుతున్నాయి. బంగారు అరుగు కట్టి, ఎత్తుగా గుబురుగా పెరిగిన ఒక చెట్టెక్కి ఆకులమాటున కూర్చున్నాడు, హనుమంతుడు.

"సీత బతికి ఉంటే తప్పకుండా ఆందమైన ఈ ఉద్యానవనానికి వస్తుంది. ఒంటిరిగా రాముణ్ని ధ్యానించడంకోసం రమణీయమైన ఈ స్థలాన్నే ఆమె ఎంచుకుంటుంది. అందమైనచెట్లు, తీగెలుగల వనంలో సంచరించడం జానకికి చాలా ఇష్టమనికదా చెప్పారు? ప్రాతఃకాలాన దేవీ ఉపాసన చేయడానికీ, ప్రార్థన సలపడానికీ, ఆమె తప్పకుండా ఇక్కడికే వస్తుంది."

హనుమంతుడు చుట్టుపక్కల పరికిస్తూ, ఆకులమాటున ఆలోచిస్తూ కూర్చున్నాడు. కొంతసేపటికి కిందికి చూశాడు. కళ్ళు మిరుమిట్లుగొలిపే అందంతో ఆ చెట్టు మొదట ఒక మానావాంగన కూర్చుని ఉండడం చూశాడు.

నలిగి, మాసిన ఒక పచ్చని చీర కట్టుకుంది. ఆమె. ఆమె ముఖ సౌందర్యం దుఃఖంవల్ల నలిగి, పొగ కమ్మిన జ్వాలలాగా కనిపించింది. మాటమాటికీ ఆమె నిట్టూరుస్తూంది. ఉపవాసక్లేశంతో చిక్కిపోయి, పాడ్యమినాటి బాలచంద్రరేఖలాగా ఉంది, ఆమె చుట్టూ కొందరు రాక్షస స్త్రీలు కూర్చుని ఉన్నారు.

శోకతప్త అయిన ఆమెను చూడగానే ఈమే సీత అని హనుమంతుడు నిశ్చయించాడు.

• •

దివ్యకాంతి విరజిమ్ముతున్న ఆమె ముఖంలో తీరని దుఃఖాన్ని చూశాడు, హనుమంతుడు. క్రూర రాక్షస స్త్రీల కావలిలో ఉన్న ఆమె, వేటగాడు వెంట తరిమీనప్పుడు గుంపునుంచి చెదిరిపోయి, బెదురుచూపులు చూసే లేడిలాగ ఉంది. ఆమె నెరికురులు జడ అల్లక పోవడంచేత జీరాడుతున్నాయి. దుఃఖ మంటే ఏంటో తెలియని ఆ సుకుమారి గొప్ప దుఃఖంలో చిక్కుకొని, ఏంచేయడానికీ తోచక అల్లాడుతున్నదానిలాగా కనిపించింది. శోకంతో అన్నపానాలు లేక, చిక్కి, మాసిన చీరకట్టి, ఆ రాక్షసుల మధ్య, కూర్చున్న ఆ సుందరి సీతే నని హనుమంతుడు గట్టిగా నిశ్చయించుకున్నాడు.

"నగలు ధరించవలసిన ఈ అందమైన మేన నగలు లేవు. మబ్బు చాటున చంద్రుడిలా ఉంది, ఈమె మోము. నిరాభరణ అయి, దుఃఖంతో, భయంతో ఆ పసిడి ఆరుగు మీద కూర్చున్న ఆమె తీరూ, ఆమె మేని తీరూ చూస్తే, ఆమె సీత తప్ప మరొకరు కాదని నిర్ధారణ చేసుకున్నాడు, హనుమంతుడు.

రామకార్యార్థులై సీతకోసం వానరులు భూమండల మంతా గాలించారు. అలాంటి సీతను చూడగలిగినందుకు, హనుమంతుడికి కలిగిన సంతోషం ఎటువంటిదో చెప్పడానికి మాటలు చాలవు. కాని ఆమె సితి చూసే, దుఃఖం సముద్రంలాగా పొంగి ఆ ఆనందాన్ని కాస్తా మాయం చేస్తూంది.

చూస్తున్నకొద్దీ ఆమె దివ్య సౌందర్యమూ, తేజస్సూ. వర్ధిల్లు తున్నట్లు హనుమంతుడి కళ్ళకు కనిపించింది. "ఇప్పుడు తెలిసింది, రాముడి మహాదుఃఖానికి కారణం, ఈమెను పొగొట్టుకున్న ఎవడు దుఃఖించకుండా ఉండగలడు ? నిజానికి రాము డింకా ప్రాణాలతో ఉండగలగడమే ఆశ్చర్యం. ఎటువంటి దేవి! ఎలాంటి భర్త!" అని తల పోసిన హనుమంతుడి హృదయం ఆ సమయాన సముద్రానికి ఉత్తరాన గల రాముడి వద్దకు పోయి వాలింది.

అప్పుడు నిర్మలమైన సరస్సులో అందమైన హంస మెల్లగా సాగినట్లు, నీలాకాశంలో చంద్రుడు వాయుపుత్రుడికి తోడ్పడ్డానికా అన్నట్లు మెల్లగా పైకిలేచి, ప్రకాశించాడు.

• •

హనుమంతుడు ఆకులమాటున దాక్కొని, ఏంచెయ్యడమా అని యోచించాడు. సముద్ర మధ్యాన బరువుతో నిండిన ఓడ తుపానుకు చిక్కి అల్లాడినట్లు, శోకసాగరంలో పరితపిస్తున్న సీత ముఖాన్ని తేరిపార చూశాడు. చుట్టూఉన్న రాక్షస స్త్రీలను చూశాడు. వారి ఆకారాలు అతి వికృతంగా ఉన్నాయి. ఒకతెకు ఒకచే కన్ను. ఒకామెకు ఒక్కటే చెవి. కొందరికి చెవులే లేవు. కొందరికి ముక్కులులేవు. కొందరికి ముక్కులు తలవైపు వంగి ఉన్నాయి. కొందరికి తలవెండ్రుకలే లేవు, కొందరికి తలకు మించిన తలకట్టు. కొందరికి వేలాడే బానకడుపులు, కొందరివి ఒంటెపెదవులు, కొందరికి గూని. కొందరు మరుగుజ్జులు. కొందరు తాడి ప్రమాణంగలవారు. కొందరివి పంది ముఖం. కొందరిది పులి ముఖం. కొందరిది బల్లెముఖం, కొందరిది నక్కముఖం, కొందరిది మేక ముఖం, ఇలా పలులకొల, భయంకరాకారాలతో శూలాలు మొదలైన ఆయుధాలతో, రాక్షస స్త్రీలు కావలి ఉండగా, వారి మధ్య తనశీల మొక్కటే రక్షగా, అనాదృతంగా నేల పాకిన పూలతీగలాగ, వాడిన ముఖంతో వణుకుతూ కూర్చుంది జానకి.

జానకిని చూసి "కనిపించింది. సీతాదేవిని కనిపెట్టేశాను" అని హనుమంతుడు ఆనందించాడు. వెంటనే ఆమె స్థితికి దుఃఖించాడు. రామలక్ష్మణులను తలచుకున్నాడు. వారికి మనస్సులోనే నమస్కరించాడు.

అప్పటి కింకా చీకటిపోయి భళ్లున తెల్లవారలేదు, వేద ఘోషలతో మధుర సుప్రభాత గీతాలతో, రావణుడు శయ్యనించి లేచాడు. లేచిన వెంటనే సీతను తలచుకున్నాడు. తలచుకొని, ఆమె ఉన్న అశోక వనానికే బయలుదేరాడు.

రావణుడు సపరివారంగా అంతఃపురోద్యానానికి వచ్చాడు. సుగంధాన్ని విరజిమ్మే దివిటీలు, ఛత్రచామరాలు, పట్టిన స్త్రీ సమూహం, చుట్టూచేరి నడుస్తూవుంటే, ఆభరణాలు ధరించి తెల్లని ఉత్తరీయం వేసుకుని, రెండో మన్మథుడిలాగా, నయనానందకరంగా, రావణుడు చక్కావచ్చాడు. వాకిటి ముందుకు వచ్చిన ఆ పరివారం కలస్వనమూ, అందెల రవళీ, మూరుతి చెవిన పడింది.

• •

అంతలో రాక్షసరాజు రాకను చూశాడు. వెంటనే హనుమంతుడు గుబురుటాకుల మధ్య, ఇంతకుముందుకన్నా ఇంకా జాగ్రత్తగా దాక్కున్నాడు. రావణుడు సీత ఉన్న చోటుకు వచ్చాడు. రావణుడి బలం, పరాక్రమం, వీర్యం. తేజస్సు చూడగా మహాద్భుతంగా ఉన్నాయి. అతడు రావడం చూడగానే. సీత మేను ముడుచుకుపోయింది. పెనుగాలికి లేత అరటి అల్లాడినట్లు అల్లాడిపోయింది.

67. రావణుడి ప్రార్థన-సీతాదేవి సమాధానం

శోక సాగరంలో కొట్టుమిట్టాడుతున్న సీతకు, ముందు ధర్మం, తరువాత భర్త తలంపు. ఈ రెండే శరణ్యం. వాటి ఆసరాతోనే ప్రాణాలు నిలబెట్టుకోగలుగుతున్న సీతను చూసి, రావణుడిలా అన్నాడు :

"సుందరీ ! సిగ్గుపడి దేహాన్ని ఎందుకు దాచుకుంటున్నావు ? నీ మీద నా కెంత ప్రేమ ఉందో ఎరగవా ? నేను నీ ప్రేమభిక్ష కోరుతున్నాను. నీకు భయమెందుకు ? నా మీద నీకు మనస్ఫూర్తిగా ప్రేమ కుదిరేవరకూ నిన్ను నేను తాకనే తాకను. భయపడకు. నా ప్రేమతో సమంగా నీకూ నా మీద ప్రేమ కలగాలని నా ఆశ. నిజమైన ప్రేమతో నువ్వు నన్ను ఆదరించాలి. ఉత్త పుణ్యానికి దుఃఖంతో నీ శరీరాన్ని ఎందుకిలా బలివెడతావు ? మోహినీ ! అందంలో నీకు సమానులు ఈ లోకంలోనే లేరు. నువ్వు నగలు ధరించక, మంచి చీరలు కట్టక, తల దువ్వక. కటికనేటను పడుకుని ఎన్నాళ్లు ఉపవాసం చేస్తావు? మానివెయ్యి. నా రత్నమా ! నీ అందాన్ని యౌవనాన్ని వ్యర్థం చేసుకోకు. నన్ను చేపట్టు. ఇంక నువ్వు కష్టపడవు. సకల భోగాలూ అనుభవిస్తావు. నిండు జాబిల్లిలాంటి నీ ముఖం చూసిన నా కన్నులు మరిదేనినీ చూడలేకుండా వున్నాయి. నీ శరీర సౌందర్యాన్ని చూసిన నా చూపు, అక్కడనుంచి కదలడమేలేదు. ఇంత అందంగల నువ్వు దుఃఖించడం ఎందుకు ? నన్ను భర్తగా వరించు, సకల భోగాలూ అనుభవించు.

భయపడకు. ఇంకా ఆలోచిస్తావేం ? నువ్వే నా పట్టపురాణివి. నా అంతఃపురాన్ని నువ్వే ఏలేది. నా సంపదనూ, రాజ్యాన్నీ, అంతా నువ్వే అనుభవిద్దువుగాని, ఈ లంక నీ సొత్తు. నేను నీ వాడిని. ఈ భూమండల మంతా నీదే. బలం. వీర్యం, ధైర్యం, ఎలాంటివో తెలిసిన వా రొక్క దేవాసురులే. అటువంటి వా రంతా నాకు ఓడి తలలు వంచి, నిలబడి ఉన్నారు, తెలుసా ?

"అంతఃపుర స్త్రీలు నిన్ను నీ అందానికి తగిన నగలతో, చీరలతో అలంకరిస్తారు. అలంకరించుకున్న నిన్ను చూసి నేను ఆనందిస్తాను, నీ ఇష్టప్రకారం నువ్వు దానధర్మాలు చేయవచ్చు. అందరిమీదా ఆధికారం నీదే. నా ప్రజలు, బంధువులు అంతా నిన్ను కొలిచి, సంతోషిస్తారు. అడవిలో తిరుగుతూ, అల్లాడుతున్న రాముణ్ని ఎందుకు తలుచుకుంటావు. పిచ్చిదానా? ఊరు విడిచి నారబట్టలు కట్టి అల్లాడే ఆ అక్క-పక్షినా నీ వంటి సుందరి వరించడం? అతడినా నువ్వు నమ్మడం? అత్తకి ఏం చాతనవును ? రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, అతడ్ని విడిచి పెట్టాయన్న సంగతి నీకు తెలుసునా? అత డింకా ఇప్పుడు బతికి ఉన్నాడా లేదా అన్నమాట సందేహమే. రాము డింక నిన్ను కంటితో కూడా చూడలేడు. నీ దగ్గర చేరలేడు. గరుత్మంతుడు పామును ఒడిసి పట్టినట్టు, నువ్వు నా హృదయాన్ని అపహరించి వేశావు. తప్పించుకోలేక నేను అల్లాడుతున్నాను. ఆభరణాలులేక, మాసిన చీరతో ఉన్న ఈ స్థితిలో కూడా, నిన్ను చూస్తే, సుందరీ ! నా భార్యలతో ఉండడానికే నాకు మనస్కరించడం లేదు. నే నేం చేసేది? అంతఃపురంలో లెక్కలేనంతమంది సుందరులున్నారు. నిన్ను చూశాక వారు నా మనస్సుకెక్కడమే లేదు. వారికందరికీ నువ్వు రాణివై, వా రందరి సేవలను పొందుతూ, సుఖంగా ఉందువుగాని. ఇంతకూ రాముడు నాకు ఎందులో సమానుడు నువ్వే చెప్పు? తపస్సులో, బలంలో, కీర్తిలో సంపదలో, అన్నింటిలో నేను అతడికన్న ఘనుడ ననసంగతి నీకు తెలియదా ? ఇప్పు డైనా భయం వదిలెయ్యి. ఇద్దరం, సుఖంగా లోకమంతా చుట్టి తిరుగుదాం. నాతో సక లైశ్వర్యాలనూ అనుభవిద్దువుగాని. ఆనందంగా గడుపుదువుగాని. కుసుమకోమలీ! నామీద దయ

చూపు: సముద్రతీరాన ఉపవనంలో, ఆనందంగా కేళీ సలుపుదాం. 'ఉ' అను; పద!"

ఇలా రావణుడు తన కామాతురతను వెల్లడించి, సీతను ప్రార్థించ పడ్డాడు.

రావణుడు మాట్లాడం కాగానే, సీత ఒక గడిపోచను విరిచి తనకూ అతడికీ మధ్యనుంచి, నిష్కళంకంగా నవ్వి, మెల్లగా మాట్లాడ సాగింది:

"ఇప్పుడే, నువ్వు నన్ను గురించిన తలంపును విడిచిపెట్టు. నన్ను కోరడం నీకు తగని పని. నీ భార్యలను ప్రేమించు, వారిపై మనస్సు నిలుపు, నువ్వు చెప్పినట్లు నే నెన్నటికీ చేయను. నేను పుట్టిన వంశం, మెట్టిన వంశం ఏవో తెలుసుకో; ఇలాంటి చెల్లని మాటలు నా వద్ద ఎందుకు చెబుతావు. తగని తలపులు పెట్టుకొని, అనవసరంగా దుఃఖించకు, పో."

సీత ఇలా అతడ్ని చూసి, చెప్పి, పెడముఖం పెట్టి ఇంకా ఇలా అంది:

"ఇంకొకరి భార్యనైన నేను, నీకు భార్యగా ఎలా అవుతా ననుకొన్నావు? ధర్మాన్ని తిరస్కరించకు. అయోగ్య మార్గాన్ని అనుసరించకు. మంచివారు నడిచే మార్గాన నడు. నా మాట వినుము. నీ భార్యలను నీవు ఎలా రక్షిస్తున్నావో, యోచించి చూడు. అందరూ అలాగే తమ భార్యలను రక్షించుకోవాలని చూడరూ? అందరూ నీలాగే అంటారని గుర్తుంచుకో; పరాయి స్త్రీలను కోరకు. నీ భార్యలతో సుఖించి, తృప్తిపడు. అదే నీకు క్షేమం. నీకు అధీనులైన స్త్రీలతో తృప్తి పడక, ఇతరులపైన మోజుపడితే, అవమానం, దుఃఖం ఇవే నీకు లభించేవి. ఇది నిశ్చయం.

నీకు మంచిబుద్ధి చెప్పేవారు ఎవరూ లేకపోయారా? ఎందుకిలా పాడుపనులు చేసి, చెడిపోతావు? నీ రాజ్యంలో ప్రజకు సర్వనాశనం తెస్తున్నావే? రాజు తన మనస్సు నిగ్రహించుకోలేకపోతే, అతడి దేశమూ, నగరమూ, సంపదా అన్నీ నశించిపోవూ? నీ దోషం

వల్ల ఈ లంకానగరమూ, ఈ అపారసంపదా, అన్నీ నాశనమయి పోతాయే. ఆ సంగతి బాగా తెలుసుకో. నీ భాధ్యత గుర్తెరిగి పాడు తలపులు కట్టిపెట్టి, నీ రాజ్యాన్నీ, ప్రజలనూ, రాజధానినీ రక్షించుకో, లేకపోతే సర్వనాశనం నిజం. అప్పుడు నీ బాధలకు లోనయినవారు "దుర్మార్గుడు పోయాడులే" అని సంతోషిస్తారు. నువ్వు చెప్పే ఐశ్వర్యాలూ భోగాలూ ఏవీ నా కక్కరలేదు. నాకు నువ్వు వాటి ఆశ చూపవద్దు. భ్రమపెట్టవద్దు. అలా చేసినందుపల్ల ఫలితమేమీ లేదు. రాముణ్ణి పెండ్లాడిన నేను, అతడ్ని విడిచి, వేరు కాలేను. ఆతని చెట్టపట్టిన నేను వే రొకడి చేతిని తాకను. నేను దశరథనందనుడి సొత్తును. వేదాధ్యయనం చేసి వ్రతనిష్ఠలో ఉన్న బ్రహ్మచారికి వేదం ఎంతటి స్వత్వమో, అలాగే నేనుకూడా రాముడి సొత్తును. నన్ను వే రొకడు కన్నెత్తి చూడడానికే హక్కులేదు.

నీకు నేను మంచి ఉపదేశంచేస్తున్నా, విను. రాముణ్ణి మన్నించమని వేడుకో. అతడి కోపంనుంచి తప్పించుకో. కోరి వినాశనం తెచ్చుకోకు. రాముడు నిన్ను తప్పక మన్నిస్తాడు. శరణు అన్నవారిని కాదనడు. కనుక, ఆయన అనుగ్రహాన్ని సంపాదించుకో; దానికి తగిన మార్గాన్ని వెతుక్కో. అదుగో, చూశావా, రాముడి ధనుష్టంకారం వినిపిస్తూంది. దాని బారినుంచి నువ్వు తప్పించుకోలేవు సుమా. యముడు నీ పక్కన నిలబడి వున్నాడు. నిన్నీడ్చుకు పోవడానికి సిద్ధంగావున్నాడని తెలుసుకో!

రామలక్ష్మణుల పేర్లతోవున్న ఆ బాణాలు త్వరలోనే వచ్చి ఈ లంకను దగ్ధం చేయబోతున్నాయి, జనస్థానంలో మచ్చుకు ఒక్క రాక్షసుణ్ణయినా మిగల్చకుండా, వీరు డైన నా రాముడు నిర్మూలించడంచూసి, భయపడి, నువ్వు దొంగలా రామలక్ష్మణులు ఆశ్రమంలో లేని సమయంలో వచ్చి, నన్నపహరించావు కదా? వారి ఎదట క్షణకాలమైనా నిలవగలవా? సింహం ఉన్న చోటికి చిరుతకుక్క పోగలదా? ఆ వాసన తగిలేసరికి అది భయపడి పారిపోతుంది. సూర్యుడు తేమను పీల్చివేసినట్లు, రామలక్ష్మణులు నీ ప్రాణాలను పీల్చివేస్తారు, జాగ్రత్త. అటువంటప్పుడు పారిపోయి, కొండలో దాక్కుం

టావా? లేక సముద్రంలో దాక్కుని తప్పించుకుంటావా? ఏదీ చెయ్యలేవు. వినాశకాలం ప్రాప్తిస్తే, పిడుగుపాటువల్ల మహావృక్షం కూలినట్లు, నువ్వు నావారి చేతుల్లో పడిపోతావు. తప్పించుకుపోలేవు సుమా" అని, ఈ విధంగా సీత కఠినోక్తు లాడింది.

తన కోపాన్ని అణుచుకున్నాడు రావణుడు. "సీతా! తాపస వేషం ధరించిన ఒక వంచకుణ్ణి కట్టుకుని, నీ వేమో మాట్లాడుతున్నావే. నీ పైన నా కున్న ప్రేమను నేను వదలలేకుండా ఉన్నాను. అందుకని నీ మాటలు నాకు కోపం తెప్పించినా, అణుచుకుంటున్నాను, నీ మీద నా కున్న ప్రేమ నిన్ను రక్షిస్తూంది. లేకపోతే ఈపాటికి నువ్వు ఏ లోకంలో ఉండేదానివో! నేను నీ కిచ్చిన గడువులో ఇంక రెండు నెలలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఆలోగా నువ్వు మనస్సు సరిదిదుకో. నాకు భార్యవై నా శయ్యను అలంకరించు. అలా నీ కిష్టం లేకపోతే, నా వంటశాలకు చేరుతావు. అక్కడ నా సేవకులు నీ శరీరాన్ని కోసి, నాకు ఫలహారంగా వండుతారని తెలుసుకో!" అన్నాడు.

రాక్షసులు నరమాంస భక్షకు లన్న సంగతి లోక విదితమేకదా కనుక, రావణుడు ఇది కేవలం బెదిరించడానికి అన్నమాట కాదనీ నిజంగానే జరగగలదాన్ని గురించి హెచ్చరించా డనీ, మనం తెలుసుకోవాలి.

అయినా, సీత చాలా ధైర్యంతోనే అతడితో ఇలా చెప్పింది:

"అయ్యో! నీకు మంచిమాట చెప్పేవా ళ్లెవరూ లేకపోయారే? ఈ పాపంనుంచి తప్పించి నిన్ను సన్మార్గానికి తిప్పగల మిత్రులే కరువయ్యారే? నీవు రాముడి శిక్షనుండి తప్పించుకోలేవు. ఏ మనుకుని, ఈ పాపంలో ప్రవేశిస్తున్నావు? అడవి ఏనుగువంటి రాముడితో కుందేలువంటి నువ్వు విరోధం తెచ్చుకున్నావు. అతడు లేని సమయం చూసి నన్ను దొంగిలించుకు వచ్చిన నీచుడవు. సిగ్గులేదా? నీ వినాశనం నిశ్చయం. విధే నీ చేత ఈ విధంగా చేయిస్తూంది. కుబేరుడికి తమ్ముడవైన నువ్వు, శూరుడ వని పేరుతెచ్చుకున్న నువ్వు, ఈ నీచకార్యాన్ని ఎలా చేశావు? ఈ నీచ మార్గాన్ని ఎలా అవలంబించావు?"

• •

ఇలా సీత చెప్పగా విని, రావణుడు గుడ్లురిమి చూసి, పాము లాగా బుసకొట్టాడు.

రావణుడి కోపం రానురాను ఎక్కువకావడం చూసి, అక్కడ ఉన్న అతడి చిన్నభార్య, ధాన్యమాలి, రావణుణ్ణి పట్టుకొని "రాజా! మిమ్మల్ని ప్రేమించని ఈ అల్పురా లైన మానవస్త్రీని గురించి ఎందుకు కష్టపడతారు? మిమల్ని పొందే భాగ్యం ఈమెకు లేదు. అంతే. ఇంతాచేసి, ఈమెకున్న మహాగొప్ప అందం ఏమిటి? ఈ అనాకారి పురుగును చూసి, ఎందుకు మోహించి తిరుగుతారు? పోదాం, పదండి!" అని, ప్రేమతో అతడ్ని తీసుకుపోయింది. రావణుడు నవ్వుతూ ఆమెవెంట వెళ్లాడు.

* * *

కావలి కాస్తున్న రాక్షసస్త్రీలతో "ఈమెను ఎలా గైనా దారికి తేవాలి" అని ఆజ్ఞాపించి, రావణుడు భూమి దద్దరిల్లేటట్టు తన పరివారంతో అశోకవనాన్ని విడిచివెళ్లాడు. అతడు వెళ్లగానే రాక్షసస్త్రీలు సీతను చుట్టుముట్టారు. రావణుడి ఎదట నిర్భయంగా ఉన్న జానకి, భయంకరాకారలైన రాక్షసస్త్రీలు తన్ను చుట్టుముట్టడం చూసి కంపించిపోయింది.

"ఉత్తమ కులంలో పుట్టినవాడు. లోకుల పొగడ్తలుగన్న వీరుడు. అలాంటి రావణుడు నిన్నింతగా ప్రేమించి, ప్రాధేయపడుతూ ఉంటే, నువ్వు తిరస్కరిస్తావా? మూఢురాలా! రావణు డంటే ఎవరనుకుంటున్నావు నీ మనస్సుకి? సాక్షాత్తు బ్రహ్మవంశంలో పుటినవాడు. బ్రహ్మ పుత్రుడైన పులస్త్య ప్రజాపతికి పౌత్రుడే, రావణేశ్వరుడు. ఎన్నో యుద్ధాలలో శత్రువులను జయించి కీర్తిగన్న వీరుడు. అలాంటివాడిని, బుద్ధిలేకుండా నువ్వు అలక్ష్యం చేస్తావా?" అని అంది ఒక రక్కసి.

"గర్వించి చెడిపోకు! విశ్రవసు ఋషి కుమారుడు రావణుడు సామాన్యుడు కాడు. అతడ్ని నువ్వు ప్రేమించి, సుఖపడు. అంతటివాడు బతిమాలుతూ ఉంటే, కాదంటావా?" అంది మరొక రక్కసి.

"యుద్ధంచేసి, దేవతల నందరినీ తరిమికొట్టి, విజయంపొందిన మా రాక్షసేంద్రుడు నిన్ను 'రా'! అని పిలుస్తున్నాడు. అతడికి నువ్వు

దేవేరివి కావాలి. వెర్రిదానా ! కాదంటే బతకనే బతకవు. ఆలో చించుకో !'' అంది ఇంకొక రక్కసి.

"తక్కిన భార్య లందరినీ కాదన్నాడు. నీ తరువాతనే వారంతా అని చెప్పి రావణుడు నిన్ను ప్రేమిస్తున్నాడు. ఉత్తమ స్త్రీ లందరినీ విడిచిపెట్టి, నువ్వు సుందరి వని నిన్ను మా రాజు ప్రార్థిస్తున్నాడు. నువ్వే పట్టమహిషివి అవుతా వని కూడా చెప్పాడే ! ఇంతచెప్పినా. ఏమిటీ మొండిపట్టు ? '' అంది వేరొక రక్కసి.

"రావణేశ్వరుడికి సాటివాడు ఈ లోకంలో మరెక్కడున్నాడు ? ఈపాటి తెలియదా ? సిరి వస్తుంటే, మోకాలు అడ్డు పెడుతున్నావు. ఛ!-మూర్ఖురాలా. ఏ మనేది నిన్ను'' అంది ఇంకొకతె.

"ఎవరిని చూసి దేవతలు, సూర్యుడు, వాయువుకూడా భయపడతారో, ఆ రాక్షసేంద్రుడే వచ్చి నిన్ను వరిస్తున్నాడు. అతడి ముద్దుల భార్య వయ్యే అదృష్టం నీకు పట్టింది. గర్వించి, ఆ అదృష్టాన్ని కాలతన్నకు. వచ్చిన భాగ్యాన్ని వద్దని తోసివేయకు'' అంది మరొక రక్కసి.

"మేం చెప్పవలసిందంతా చెప్పాం. ఇంక నీ యిష్టం. ఒప్పుకొన్నావా, సరేసరి. లేకపోతే నీ బతుకు ఆఖరు'' అంది ఇంకొక రక్కసి.

68. బుద్ధిమతాం వరిష్ఠమ్

ఒంటరిగా చెరలో ఉన్న స్త్రీ ఎంత బుద్ధిశాలి అయినా, ఎంత ధైర్యశాలి అయినా, చిరకాలం చెరలో ఉండి, వాడి, వసివాడిపోతే, మనోదౌర్బల్యం పొందడంలో ఆశ్చర్యం ఏముంది ?

తన్ను రక్షింపవలసిన వారు వస్తారు వస్తారు అని పదిమాసాలు పాటు ఎదురు చూసింది, సీత. రాముడు రాలేదు. లక్ష్మణుడూ రాలేదు. ఊరడించి ధైర్యం చెప్పడాని కైనా ఎవరూ రాలేదు. ఇంత

వరకు ఆమె అలమటించి అలమటించి, ఎలాగో ప్రాణాలు నిలువుకొని ఉంది.

స్థితి ఇలా ఉండగా, రాక్షసస్త్రీలు ఆమెను వేధింపడం ఒక మూల !

"మేం చెప్పినమాట వినవా? నీది మానవజాతి. నీకు బుద్ధి లేదు. ఒక అల్ప మానవుణ్ణి కట్టుకొని ఏడుస్తున్నావు, నీకు తగిన స్థానం రావణేశ్వరుడి అంతఃపురం. అన్ని సుఖాలూ పొందగల చోటు అదే. దాన్ని వద్దని కాలదన్ని, ఎందుకూ పనికిరాని భర్తనే చ్యానిస్తా వెందుకు? దేశభ్రష్టుడు, దురదృష్టవంతుడు!— ఆ మానవుడి పైన ఇంత ప్రేమ ఏమిటి నీకు? అతడ్ని నువ్వు ఇంక చూడలేవు. రావణుడు చెప్పిన మాట విని, సుఖపడు.

ఇది విని సీత చాలా విలపించింది.

"పాపపు మాటలు చెపుతున్నారు. మీరు చెప్పినట్లు నే నెన్న టికీ చేయను. రాముడు పేదవాడనీ, దేశంనుంచి వెళ్ళగొట్టబడ్డాడనీ అంటున్నారు కదూ, అదంతా నాకు తెలుసు. ఇంతమాత్రానికే భార్య భర్తను వదులుకుంటుందా? అది మానవధర్మం కాదు. రాక్షసేశ్వరు డేంటి, ఒక మానవాంగనను కోరడ మేంటి? మాన వాంగన రాక్షసుడికి భార్య ఎలా అవుతుంది? సూర్యుణ్ణి వెలుగు అంటి ఉన్నట్టుగా. నేను, పెండ్లాడిన రాముణ్ణి అనుసరించి ఉన్నాను, శచీదేవి ఇంద్రునీ, అరుంధతి వసిష్ఠునీ వెన్నంటి ఉన్నట్లు, నేను రాఘవుని ఆశ్రయించి ఉన్నాను" అంది సీత.

అది విన్న రాక్షస స్త్రీలు ఇక ఈమె నయాన లొంగదను కున్నారు. ఈమెను విరుచుకు తినివెయ్యడమే సరైన పని అన్నారు.

ఒకతె "నాకు వేవిళ్లు; ఈమె రొమ్ము చీల్చి గుండెకాయ తీసి ఇవా లని కోరికగా ఉంది" అంది.

మరొకతె "ఈమె మెడ నులిమి, చంపివేసి, దుఃఖంవల్ల చచ్చిందని మన రావణుడితో చెపుదాం. ఈమెను కోరి రాజు వ్యర్థంగా దుఃఖిస్తున్నాడు. ఈమె చచ్చిపోయిందని తెలిస్తే, మన రాజు హాయిగా నిద్దరన్నా పోతాడు" అంది.

• •

"ఈమె కార్యం చాలా రుచిగా ఉంటుంది" అంది ఇంకొకతె. మరొకతె "ఈమెను చంపి, అందరం సమంగా, సంతోషంగా, పంచుకు తిందాం. సంభారాలు తీసుకురండి. కల్లు తెండి. ఈమెను తిని, కల్లుతాగి, నికుంభిలాదేవి గుడిలో నృత్యం చేద్దాం" అంది.

ఇలా ఆ క్రూర రక్కసుల చెడ్డమాటలు విని, భయంకర రూపాలు చూసి, సీత ఎలుగెత్తి 'కో' అని ఏడ్చింది. ఎంత ధైర్యంగా ఉన్నా, ప్రకృతివేగాన్ని అడ్డగించడం కష్టం. కనుక, సీత పసిబిడ్డలా ఏడ్చేసింది. ఎంత ఏడ్చినా, చిత్తం కలతచెందక, రాముణ్ని ధ్యానిస్తూనే ఉంది.

"జనస్థానంలో పధ్నాలుగు వేలమంది రాక్షసులను నిర్మూలించిన రాముడు న న్నిచెరనుంచి విడిపించడానికి ఇంకా రాడేం? దండకారణ్యంలో విరాధుణ్ని వధించిన వీరులు ఇంకా నన్ను ఎందుకు ఉపేక్షిస్తున్నారు? నే నిక్కడున్న సంగతి వారికి తెలియనే లేదా? లేదు. తెలిసి ఉంటే, ఊరుకుంటారా?

గద్దరాజైన జటాయువు రాక్షసుడి చేతిలో మరణించాడు. అతడు ప్రాణాలతో ఉండి ఉంటే, ఈ విషయం రామలక్ష్మణులకు చెప్పి ఉండేవాడు. కాని, నన్ను రాక్షసు డెత్తుకొనిపోతూ ఉంటే చూసి సహించలేక ఘోరయుద్ధం చేసి ప్రాణాలు విడిచాడు. నేనున్న ఈ చోటు ఇంకా రాముడికి తెలియలేదనే తలుస్తాను.

చివరి కెలా అయినా, నా ఉనికి వారికి తెలియకనూ పోదు. ఈ లంకా ఈ రాక్షసులూ నాశనం కాకనూ పోదు. ఈ నగరంలో ఉండే ప్రతి ఇంటిలోనూ రాక్షస స్త్రీలు విధవలై, ఏడ్చి పొర్లాడడం తప్పదు. ఈ నగరమూ, రావణుడూ, రాక్షసులూ నాశనం కావడం తప్పదు."

సీత ఇలా తనలో అనుకొని, ధైర్యం పొందింది. కాని అంతలోనే మరొక యోచన మనస్సుకి తగిలి దుఃఖించింది.

"న న్నెడబాసిన దుఃఖంతో ఒకవేళ రాముడే ప్రాణాలు విడిచాడేమో! అలాగే జరిగి ఉండాలి. లేకపోతే న న్నిలా వదిలేసి ఇన్ని

రోజులు ఉండడం ఆయనకు సాధ్యంకాదే! ఆహా! ఆతడుకదా అదృష్టవంతుడు! దేవతలతో చేరిపోయాడు. నేనే పాపిష్టిదాన్ని. ఇంకా ఈ సితిలో బతికివున్నాను. నా హృదయం బండరాయి అయి ఉంటుంది. లేకపోతే, ఇంత జరిగినా, ఇంకా నేను ప్రాణాలతో ఉండడమేంటి?"

అంతలోనే ఆమెకు ఏదో భయం తోచింది. "ఒకవేళ ఆయన తపస్సుచేస్తూ జీవితశేషం గడపాలని నిశ్చయించుకున్నారేమో: నన్ను గురించిన ఆలోచనే మానివేశారేమో! కాదు కాదు, అలా ఎన్నటికీ జరగదు. వీరుడు తన కర్తవ్యాన్ని విస్మరించి సన్యాసజీవితాన్ని స్వీకరిస్తాడా? అలా అనుకోవడం నా అజ్ఞానం, దీ నంతకూ నా ఉనికి వారికి తెలియక పోవడమే కారణం.

ఒకవేళ రాముడికి నాపైన ప్రేమ తగ్గిపోయిందేమో! రూపు కనుమరుగైతే, ప్రేమకూడా మరుగే అవుతుందని ఆంటారు. అలాగే అయిందేమో! మరుగుపడితే, మరచిపోతా రంటారు గదా?

ఛీ ఛీ! ఇది పాపపు తలంపు. నా రాముడు నన్ను మరవడమా? ఎన్నటికీ మరువడు. ఇంతకీ నేను చేసిన తప్పేంటి! అదికాదు కారణం. రావణుడే, ఏదో మాయోపాయంతో, కొంపతీసి రాజకుమారులను చంపివేశాడేమో!"

* * *

సీత ఇలా పరిపరి విధాల యోచన చేస్తూ, దుఃఖసముద్రంలో మునిగింది. చివరకు ప్రాణాలు విడవడమే మేలు అనే నిశ్చయానికి వచ్చింది. శింశుప వృక్షం కొమ్మకు తలవెంట్రుకలు కట్టి, ఉరి పోసుకు, దుఃఖంనుంచి విడుదల పొందా లని అనుకుంది.

సీతను ఇంక లొంగదీయడం సాధ్యం కాదనుకున్నారు, రాక్షస స్త్రీలు. ఏంచేయాలో వారికి తోచలేదు. వారిలో కొందరు కార్యం అనుకూలపడలేదని రావణుడితో చెప్పడానికి వెళ్లారు. కొంద రక్కడే ఉండి, ఇంకా సీతను భయపెడుతూనే ఉన్నారు.

వారిలో త్రిజట అనే రాక్షసి వాళ్లను కసిరింది. "మూర్ఖుల్లారా! ఏం టలా వాగుతున్నారు? నా కొక కల వచ్చింది. వినండి.

ఈ లంకకు వినాశకాలం వచ్చింది'' అని చెప్పి, తను కన్న దుస్వప్నాన్ని విపి చెప్పింది.

"రాముడు సూర్యుడిలాగా దివ్య తేజస్సుతో వెలుగుతూ, సీతను తోడ్కొని వెళ్లడానికి లంకకు వచ్చినట్లు కలగన్నాను. రావణుడు మరణించి, యమాలయానికి వెళినట్లు కూడా కలలో చూశాను.

సీతను ఏనుగమీద ఎక్కించుకొని రాముడు తోడ్కొని పోయాడు. రావణుడూ, రాక్షసమూకా, చింపిపాతలు కట్టుకుని, అనకారులుగా ఉన్నారు. వారిని రాముడు ఈడ్చుకుపోయాడు."

త్రిజట, తాను కన్న దుస్వప్నాన్ని రాక్షస స్త్రీలకు చెప్పింది. కనుక, "ఈ సాధ్వని హింసించకండి. నాశమైపోతారు. ఈమె దయను సంపాదించండి" అని వారికి హితబోధ చేసింది.

త్రిజట చెపుతూవుండగా, ప్రాణత్యాగం చేయబోయిన సీతకు శుభ శకునాలు కనిపించాయి. కళ్లు, చేతులు. కాళ్లు మంగళకరంగా అదిరాయి. అంతవరకు లేని ఒక ధైర్యం మనస్సులో కలిగింది. దాంతో, ప్రాణ త్యాగం చేయాలనే యోచనే పోయింది.

ఇదంతా చెట్టు మీదనుంచి దాగి చూస్తున్న హనుమంతుడు ఇంకేం చేయాలా అని యోచించాడు.

లంకకు వచ్చి అక్కడ సీతను చూశాక చేయవలసిన పని మరేం ఉంటుందని పాఠకులు అనుకోవచ్చు. అయితే కార్యం సాధించటం అనుకున్నంత సులభమయింది కాదు. మరి, హనుమంతుడి యోచన ఏమిటి అంటారేమో.

"ఇతరులకు అలవికాని పని నేను చేశాను. సముద్రాన్ని దాటి, సీత ఉనికి కనిపెట్టాను. రాక్షస నగరం ఆనుపానులన్నీ చూసి తెలుసుకున్నాను. పగవాడికి తెలియకుండా. దూతగా చేయవలసిన పని అంతా పూర్తి అయింది. కాని పరిస్థితి చూడబోతే ప్రమాదకరంగా ఉంది. చూసిన సంగతులు రాముడికీ రాజుకూ చెప్పడానికి నేను

ఇవ్వుడు తిరిగిపోతే, ఇక్కడ ఏం జరగబోతుంది? రామలక్ష్మణులూ వానరసేనా ఇక్కడికి వచ్చేలోగా సీత, దుఃఖాన్ని భరించలేక ప్రాణాలు విడుస్తుంది. అప్పుడు పని అంతా భగ్నమేకదా. సీతను చూసినంత మాత్రాన పని తీరలేదు. ఆమెను ఓదార్చి, రాముడి సందేశాన్ని తెలిపి, ధైర్యం గొలిపి, వెళ్లాలి. సీతతో మాట్లాడకుండా తిరిగిపోతే, రాముడికి ఏం తృప్తి కలుగుతుంది? కాబట్టి ఎలాగైనా సీతతో మాటాడి తీరాలి. అందుకు అనువైన మార్గం ఏమిటి అనేది ఇప్పుడు పట్టిన సమస్య."

ఆంజనేయ స్తోత్రంలో "బుద్ధిమతాం వరిష్ఠమ్" అని ఒక ప్రశంస ఉంది. అంటే, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు అని దాని అర్థం. అది అక్షరాలా నిజమే కదా?

"సీతతో ఏ భాషలో మాట్లాడటం మంచిది? ఈ అశోక వనానికి హఠాత్తుగా ఒక కోతి వచ్చి మాట్లాడం మొదలుపెడితే సీత, అది మోసం అనీ, రావణుడి మాయయే ననీ తలచి, భయపడుతుంది. ఆ భయంతో కేకలు కూడా పెడుతుంది. ఆమె ఇప్పుడున్న స్థితిలో జరగబోయేది అంతే. ఇప్పుడు నిద్రలో ఉన్న కావలి రాక్షసులు లేచి, నన్ను కనిపెడతారు. ఇతడు పగవాడి దూత అనీ, దొంగవేషం వేసుకు వచ్చాడనీ తలచి, తోడి రాక్షస బృందాన్ని పిలుచుకువస్తారు. అప్పుడు ఘోర యుద్ధం జరుగుతుంది. నేను ఊరకుండడానికా పిల్లేదు. ఎదిరిస్తాను. వారిని వధిస్తాను. ఇందుకు సందేహమేం లేదు. అయితే, సీతను విడిపించే కార్యం కాస్తా చెడిపోయి వూరుకుంటుందే! నన్ను పట్టి వాళ్లు చెరలో పెడతారు. తరువాత రాముడి కీవిషయం చెప్పేవారే ఉండరు. అలా కాక, నేను పటుపడకుండా విజయవంతంగా యుద్ధం చేసినప్పటికీ, కటకటపడి, గాయాలు తిని, సముద్రాన్ని దాటే శక్తిని పోగొట్టుకుంటాను. నేను వచ్చి సీతను చూసిన పని వ్యర్థమైపోతుంది. కనుక తొందరపాటువల్ల, వచ్చిన కార్యం చెడిపోతుంది. రాజూ రాముడూ నన్ను నమ్మకుని కదా కూర్చున్నారు? నా చిన్న పొరపాటు పెద్ద నష్టానికి దారి తీస్తుంది. ఎలా అయినా, సీతతో మాట్లాడిన తరువాతనే తిరిగి పోవాలి. అలా మాట్లాడంలో ఆమెకు భయం

కలగని పద్ధతిలో, ముందు ఆమె మనస్సులో నమ్మకాన్నీ ధైర్యాన్నీ కలిగించాలి. ఆమె నన్ను మాయ రావణు డని కాని, అతడి సేవకు డని కాని సందేహించకుండా నే నెలా నడుచుకోవడం ?

సరి. రాముడి గుణగణాలను, ఆయన చరిత్రను, మధుర ధ్వనితిలో, ఆమెకు మాత్రమే వినిపించేలాగ, గానం చేస్తాను. అప్పుడు సీత మనస్సులో సంతోషమూ నమ్మకమూ కలుగుతుంది. ఆమెకు భయం తీరుతుంది. ఆ తరువాత కార్యం సులువుగా నెరవేరుతుంది."

ఇలా యోచించి, చెట్టుపై దాగివున్న హనుమంతుడు మృదుకంఠంతో రామనామ జపం ప్రారంభించాడు.

69. జానకి ఊరడిల్లింది

హనుమంతుడు చెట్టు గుబురులో దాక్కొని, మృదుకంఠంతో, సీతకు మాత్రమే వినపడేలాగ రామగాథను గానం చేశాడు.

* * *

"దశరథ మహారాజు కోసలదేశాన్ని పాలించాడు. రథాలూ, గుర్రాలూ, ఏనుగులతో కూడిన గొప్ప సేన ఆయనది. ఆయన పుణ్యశీలుడు. ఘనకార్యాలు సాధించినవాడు. సత్యసంధుడు. కీర్తి గడించిన రాజులలో అగ్రగణ్యుడు. ఋషులతో సమానమైన గుణశీలుడూ, దేవేంద్రుడివంటి సమర్థుడు. ఎవరికీ ఎన్నడూ చెడుపు చేయనివాడూ, ఎవరినీ తిరస్కరించనివాడు. ఎవరినీ బాధించని వాడు ఆయన ప్రయత్నాలేవీ విఫలంకాలేదు. కనుక అతడికి సత్యపరాక్రముడు అనికూడా ఇక్ష్వాకువంశజు డయిన భాగ్యశాలి ఆయన. రాజశ్రేష్ఠుడు. భూమండలాధిపతి. ఒకరికీ సుఖమే ఇచ్చేవాడు; తాను సుఖంగా ఉండేవాడూ. అతడి నలుగురు కుమార్తలలో జ్యేష్ఠుడు రామచంద్రుడు. నిండు జాబిలివంటి ముఖం కలవాడు. జ్ఞానవంతుడు. సత్ప్రవర్తనుడూ, ధనుర్వేదాన్ని చక్కగా నేర్చి, అందరి ప్రేమకూ పాత్రు డైనవాడు. తన ప్రజలను ఎంతగానో ప్రేమించేవాడు. ధర్మాన్ని జవదాటని

వాడు. అభిమానధనుడు. పట్టాభిషేకానికి తగినవాడు ఇంతటి భాగ్యశాలి అయినప్పటికీ. ముసలితండ్రి కీర్తికీ, ప్రతిష్టకూ, సత్యానికీ కళంకం రాకుండా ఉండేందుకు రాజ్యమే విడిచిపెట్టి, తన భార్య సీతతోను తమ్ముడు లక్ష్మణుడితోను, వనవాసం చేస్తూ ఉండేవాడు. ఆ వనవాస కాలంలో ఎందరో రాక్షసులను సంహరించి ఋషులను కాపాడాడు. ఖర దూషణు లనే రాక్షస నాయకులనూ. వారి సైన్యబలగాన్నీ నిర్మూలించాడు. అది తెలిసిన రావణుడు కసి తీర్చుకోవడం కోసం ఒక రాక్షసుణ్ణి పురికొల్పి మాయలేడిగా పంపి, రాముడు ఏమరి ఉన్నప్పుడు అదును చూసి సీతను బలాత్కారంగా ఎత్తుకుపోయాడు. రాముడు దుఃఖిస్తూ భార్యను వెతుక్కుంటూ బయలుదేరాడు. సుగ్రీవుడనే వానరుణ్ణి చూసి అతడితో సఖ్యం చేసుకున్నాడు. వాలి అనే వానరరాజును చంపి, అతడి తమ్ముడైన సుగ్రీవుడికి వానర రాజ్య పట్టం కట్టాడు. సుగ్రీవుడు సీతను వెతకడంకోసం తన వానరవీరులను భూమండల మంతా గాలించి రమ్మని పంపాడు. కామరూపులైన వానరవీరులు సీతకోసం అన్ని దిక్కులా గాలించారు. వారిలో నేనొకడిని. సంపాతి చేసిన సూచన గ్రహించి, నూరు యోజనాల విస్తీర్ణం గల సముద్రాన్ని దాటి, ఇక్కడికి వచ్చాను. రాఘవుడు తన దేవి గుణ రూపాలను వర్ణించి చెప్పాడు. ఆ వర్ణనకు సరిపోయిన రూపాన్ని ఇక్కడ చూస్తున్నాను.''

ఇలా మృదువుగా పలికి, హనుమంతుడు ఊరకున్నాడు.

ఈ మధుర వాక్కులు విని, ఇవి ఎక్కడినుంచి వచ్చినవా అని సీత ఆశ్చర్యపడింది. ఆనందించింది. నలువైపులా చూసింది. ఇలా వ్యాకరణయుక్తమైన, స్వచ్ఛమైన భాషలో, ప్రియమైన విషయాలను మధుర కంఠంతో పలికిన వా రెవరై ఉంటారా అని నలు దిక్కులకూ, పైకీ, కిందికీ, చూసింది. మాటకు తగిన మాన వాకారం ఎక్కడా కానరాలేదు. కాని, పైన చెట్టుమీద ఒక అందమైన వానరం మట్టుకు కనిపించింది.

అసాధారణ బుద్ధిశాలీ, వానరరాజుకు ప్రధానమంత్రీ అయిన వాయుపుత్రుడు బాలసూర్యుడిలాగా ప్రకాశిస్తూ చిన్న వానర

రూపంతో ఉండడం చూసింది సీత. చూడండి ! జానకి చూపు రామ దూతపై పడినప్పుడు అతడికి ఎంతటి ఆనందం కలిగిందో మీరు మీ కల్పనాశక్తితో ఊహించగలరా? అలా ఊహించగలిగితే మీ హృదయాలు నిర్మలమైన దేవాలయాలే నన్నమాట ! మీ దుఃఖాలన్నీ తీరిపోతాయి. మీ హృదయాల్లో తావు చేసుకోడానికి ఎదురుచూస్తున్న నారాయణుడు, పాలకడలి వీడి వచ్చి మీలో ప్రవేశిస్తాడు. మన మనస్సులే ఆయనకు పాలకడలీ, పాప పాన్పూ అవుతాయి.

* * *

హనుమంతుణ్ని చూడగానే జానకి "ఇదేంటి, నేను విన్న మాటలూ, కన్నరూపూ అంతా కలగా ఉందే !" అనుకొంది.

"నిరంతరం ధ్యానిస్తున్న విషయాలే కలలో కనిపిస్తాయంటారు. నేను ధ్యానిస్తున్న నా ప్రాణనాథుడి కథను ఎవరో నా చెవుల్లో చెపుతున్నట్లు స్పష్టంగా వినబడుతూంది. ఉహూఁ ! ఇది నిజంకాదు. కల. అయ్యో! కలలో వానరం కనిపిస్తే బంధువులకు చేటు కలుగుతుందంటారే ! నా రాముడికి మంగళ మగునుగాక ! లక్ష్మణుడికి మంగళమగును గాక! మిథిలలో అంతా క్షేమంగా ఉందురుగాక ! కాదు కాదు. ఇది కల కాదు. ఇంకా, అదే రూపు నిశ్చలంగా కనిపిస్తూంది. ఇది కల అని ఎలా అనుకోవడం ? అదీగాక, నా కెక్కడ నిద్ర పట్టింది ? నిద్రపోతేకదా కలలు రావడం? ఇది కల కాదు. నిజమే ! ఓ దేవతలారా! ఈ వానరము నిజంగా నా ప్రాణనాథుని వద్దనుంచి వచ్చిన దూతయేనా ? అలాగే అగునుగాక ! వాక్కునకు అధిపతివైన వాచస్పతీ! నీకు నమస్కరిస్తున్నాను. అగ్ని భగవానుడా! నీకు నమస్కరిస్తున్నాను. దేవతలారా! నన్ను కాపాడండి. ఇతడు రామదూతే అగునుగాక!" అని, దేవత లందరినీ ఆమె ప్రార్థించింది.

జానకిని చూసిన ఆనందంతో హనుమంతుడు దివ్య మంగళ మూర్తిగా ప్రాకాశించాడు. చెట్టు దిగి, చేతులు జోడించి, సీత ఎదుట నిలబడ్డాడు.

• •

"తల్లీ! తామర రేకులవంటి నీ కన్నులనుంచి నీరు స్రవిస్తూంది. మీ రెవరు? కంట నీరు నింపి, కలకబారిన ముఖంతో, చెట్టుకు చేర్లబడి ఉన్న మీరు దేవకన్యలా? నాగకన్యలా? మీ మేని కాంతిచూసి యిలా అడుగుతున్నాను, చంద్రుణ్ని ఎడబాసిన రోహిణీదేవిలా ఉన్నారు మీరు. వసిష్ఠ భగవానుడితో మాట పట్టింపువచ్చి, దిగివచ్చిన అరుంధతీదేవి లాగా ఉన్నారు. పరికించి చూస్తే మానవాంగనగానే కనిపిస్తున్నారు. అందులోనూ, రాజకుమారిలాగా కానవస్తున్నారు. దయచేసి, మీ రెవరో చెప్పండి. మీకు మంగళమగును గాక! మంగళమగును గాక! జనస్థానంనుంచి రావణుడు అపహరించి తెచ్చిన సీతాదేవి మీరేనా? రామచంద్రుడి దేవేరి మీరేనా? ఆ మహాసాధ్వి సీతాదేవిని దర్శించే భాగ్యం నాకు అబ్బిందా?" అని హనుమంతుడు మధుర స్వరంతో సవినయంగా అడిగాడు.

సీత పరవశత చెందింది. "నాయనా! నేనే సీతను. విదేహరాజు కుమార్తెను. రామచంద్రుడి భార్యను. అతడితో పన్నెండు సంవత్సరాలు అయోధ్యలో సకల సుఖాలూ అనుభవించాను. పదమూడో సంవత్సరంలో చక్రవర్తి, తన జ్యేష్ఠకుమారుడికి పట్టాభిషేకం చేయడానికి సకల సన్నాహాలూ చేశారు. అప్పుడు మహారాజు చిన్నభార్య కైక, తన కుమారుడు భరతుడికే పట్టం కట్టాలనీ, రాముణ్ని వనవాసానికి పంపాలనీ, పట్టుపట్టింది. లేకపోతే, అన్నపానాలు విసర్జించి, ప్రాణాలు విడుస్తానంది. పూర్వం ఒకప్పుడు కైకకు ఇచ్చిన వరం ప్రకారం ఆమె పంతాన్ని రాజు చెల్లించవలసే వచ్చింది. రాజ్యాన్ని భరతుడికి ఇమ్మని, మహారాజు రాముణ్ని కోరాడు. రాముడు క్షణంకూడా తామసించలేదు. 'తండ్రి మాటను చెల్లించడమే నా భాగ్యం. రాజ్య భోగాలకన్నా తండ్రిని సత్యసంధుణ్ని చేయడమే నాకు సంతోషం' అని చెప్పి, రాజ్యాన్ని త్యజించి, అడవికి వెళ్ళిపోయాడు. భర్త వనవాసానికి వెళుతూ ఉంటే, ఆయన్ని వదలి నేను వెనక్కు ఉండిపోగలనా? 'నేనూ మీతోనే వస్తా'నని పట్టుబట్టాను. రాముడి తమ్ముడు లక్ష్మణుడు నా కంటె ముందుగానే నారబట్టలు కట్టి అన్నతో వనవాసం చేయడానికి బయలుదేరాడు. ముగ్గురమూ అడవికి వెళ్ళాం. దండకారణ్యంలో నివ

• •

సించాం. ఒక రోజున దురాత్ముడైన రావణుడు వచ్చి నన్ను బలాత్కారంగా తెచ్చి, ఈ అశోకవనంలో చెరపెట్టాడు. నేను పెట్టుకున్న గడువు ఇంకా రెండు నెలలుంది. అది ముగియగానే, నా ప్రాణాలు విడుస్తాను" అని శోకం పొరలివస్తూ పలికింది, సీతాదేవి.

* * *

ఇలా హనుమంతుడు చెప్పిందీ, సీత చెప్పిందీ రామకథను వాల్మీకి రెండు చిన్న అధ్యాయాలలో రచించాడు. పెద్ద కథను ఇలా సంగ్రహంగా ఆంజనేయుడి నోటా, జానకి నోటా పలికించాడు వాల్మీకి మహర్షి. జగత్తును పాదాలతో కొలిచిన త్రివిక్రముడు వామనరూపంతో బలివద్దకు వెళ్ళినట్లు, ఈ రామాయణ గాథను సంగ్రహంగా, సుందరంగా చెప్పాడు. ఆంజనేయుడూ, సీతాదేవీ మనకు రామాయణం వినిపిస్తున్నా రన్నమాట. అంతకన్న మహాభాగ్యం మనకు మరేం కావాలి? హనుమంతుడు చెప్పిన రామకథనూ, జానకి చెప్పిన రామకథనూ, భక్తితో చదివి, వామనుడు బలిచక్రవర్తిని లోగొని, అతడి అహంకారం పోగొట్టినట్లు, మనమూ మన అహంకారాన్ని పోగొట్టుకుందాం.

* * *

"పన్నెండు నెలల గడువులోనూ ఇక రెండు నెలలు మాత్రమే మిగిలి ఉంది. అది ముగియగానే నా ప్రాణంకూడా ముగుస్తుంది" అని సీత తన కథను చెప్పి విలపించింది.

దుఃఖంలో మునిగి, ఇలా మాట్లాడిన సీతకు ఊరట గొలిపే విధంగా హనుమంతుడు మాట్లాడాడు :

"ఉత్తములలో ఉత్తముడు, వీరులలో వీరుడు, అయిన రాముడు నీకు క్షేమ సమాచారం పంపాడు తల్లీ : అతడి ప్రేమపాత్రుడైన తమ్ముడూ, నీ స్థితిని తలుచుకు ఎడతెగని దుఃఖంలో మునిగినవాడూ, అయిన లక్ష్మణుడుకూడా నీకు నమస్కారం చెప్పమని నన్ను పంపాడు" అన్నాడు మారుతి.

• •

రామలక్ష్మణుల పేర్లు, వాళ్లు చెప్పి పంపిన క్షేమ సమాచారాలూ వినగానే సీత హృదయం ఆనందంతో ఉప్పొంగింది.

"ఆహా ! ఎంత సంతోషవార్త. 'బతికి ఉంటేనే సుఖపడవచ్చు ననీ, చస్తే ఏంలే'దనీ పామరజనులనే మాటలో యథార్థం ఇప్పుడు తెలుసుకున్నాను" అంది సీత.

పూర్వ పరిచయమేలేని ఆ యిద్దరికీ ఆకస్మికంగా పరస్పర విశ్వాసమూ, అభిమానమూ కలిగాయి. హనుమంతుడు ఆనందాతిశయంతో, సీత దుఃఖాన్ని ఎలాగైనా పోగొట్టి, ఆమెకు ధైర్యం కలిగించా లనే ఉద్దేశంతో, పక్కకువెళ్లి నిలబడ్డాడు.

అంతలో సీత భయపడిపోయింది. హనుమంతుడి మాటల చాతుర్యంవల్ల కలిగిన నమ్మకం కాస్తాపోయి, మళ్లీ అనుమానంలో పడింది. చెట్టుకు చేరగిలబడిన ఆమె, దూరంగా జరిగి, కళ్ళు మూసేసుకుంది. అది చూసి హనుమంతుడు వినయంతో చేతులు జోడించి నిలబడ్డాడు.

"అయ్యో !- భ్రమలో పడ్డాను నేను. నువ్వు రావణాసురుడివే ! ఇంతకుముందు సన్యాసివేషంలో వచ్చావు. ఇప్పుడు ఈ వేషం వేసుకు వచ్చి, ఏదేదో మాట్లాడుతున్నావు. ఇది నీకు మంచిదికాదు సుమా. ఇలా నన్నెందుకు వేధిస్తావు? రావణా! లోకంలో మునిగి, అన్నపానాలు విసర్జించిన నన్ను, మాయలుచేసి బాధించకు. నీ కిది న్యాయంకాదు. పో. వెళ్లిపో!" అంది జానకి.

తర్వాత మళ్లీ ఆలోచించసాగింది. కాదు కాదు. ఇతణ్ని చూస్తే, ఏమోగాని మనస్సులో పట్టరాని అభిమానం కలుగుతూంది. ఇతడు శత్రువు అవడానికా వీలు కనబడలేదు. ఇతడ్ని నేను సందేహించడం తగదనిపిస్తూందే.

వానరుడా! నిజంగా నువ్వు రాముడివద్దనుంచి వచ్చిన దూతవేనా? నీకు మంగళమగునుగాక! రాముణ్ని గురించి మళ్ళీ చెప్పు. హృదయం చల్లబడేలాగ వింటాను" అంది.

ఇలా అంటూనే, మళ్ళీ సందేహంలో మునిగిపోయింది.

"ఇలా క్షేమసమాచారం వచ్చినట్టు భ్రమతో తలుస్తున్నానా? ఇది కలా? ఆనందాన్నిచ్చే కల కంటున్నానా? ఈ కల కరిగిపోతుందా? నాకు ఆశచూపి దుఃఖం కలిగించడం కోసమే ఈ కల వచ్చిందా? చిత్తభ్రమవల్లనే ఇదంతా ఇలా కనబడుతూందా? లేదు, లేదు. అన్నీ ఒప్పుగానే ఉన్నాయి. బాగా యోచించి, స్పృహతోనే మాట్లాడుతున్నాను కాని, భ్రమలో లేను. నాకు జ్ఞాపకశక్తి బాగానే ఉంది. అయితే నూరుయోజనాల సముద్రం దాటి, ఇక్కడికి వచ్చి నని ఇతడు చెపుతున్నాడే. ఆ మాట మట్టుకు నిజమై ఉండను. కనుక, ఇతడు నిస్సంశయంగా ఆ రావణుడే" అని మనస్సులో నిశ్చయించుకుని, హనుమంతుడ్ని కన్నెత్తి అయినా చూడకుండా, మౌనంగా కూర్చుంది.

సీతలో కనిపించే భయ సందేహాలను హనుమంతుడు తెలుసుకున్నాడు. రాక్షస మాయలను చూసిన ఆమె, అలా భయ సందేహాలలో పడడం సహజమే ననుకొన్నాడు. ఏం చేయాలో వెంటనే ఇలా నిశ్చయించుకొన్నాడు: "ఈమెకు సంతోషమూ, నమ్మకమూ కలిగించాలి రాముడి సద్గుణాలను ఈమె వినేలాగ నుతిస్తాను. ఆ మధుర వాక్కులే ఈమె భయ సందేహాలను పోగొడతాయి" అని తలపోశాడు.

"సూర్యుడివంటి తేజస్సు గలవాడు, చంద్రుడిలాగా నయనానందకరంగా ప్రజలకు దర్శన మిచ్చేవాడు, కుబేరుడిలా రాజు లందరి మన్ననలూ బడసినవాడు, బుద్ధిలో బృహస్పతి, అందానికి మన్మథుడు, ఎల్లప్పుడూ సత్యవాక్కులూ, మధురవాక్కులూ పలికేవాడు, న్యాయాన్నీ, కాలాన్నీ పాటించిగాని కోపించనివాడు, మహావీరుడు, అయిన రాముడు పంపిన దూతను నేను. ఒక రాక్షసుణ్ణో మాయలేడిగా మార్చి, వంచించి, మిమ్మల్ని ఒంటిపాటుగా చేసి, ఆ సమయంలో రావణుడు బలాత్కారంగా మిమ్మల్ని ఎత్తుకొని వచ్చాడు. ఈ అక్రమానికి తగిన ఫలితాన్ని రావణుడు త్వరలోనే పొందుతాడు. రామలక్ష్మణుల బాణాలు వచ్చి, త్వరలోనే ఈ లంకను దహించనున్నాయి. వారు రాక్షస సమూహాన్నీ, రావణుణ్నీ సంహరించి

నిర్మూలించడం మీ కళ్లతో మీరే చూస్తారు. రాముడు పంపగా నేను మీ వద్దకు వచ్చాను. మీ క్షేమసమాచారాలు తెలుసుకుని పోవాలని వచ్చాను. రామచంద్రుడికోసం మిమ్మల్ని వినయంగా వేడుకొంటున్నాను. లక్ష్మణుడి వందనాలు మీకు అర్పిస్తున్నాను. వానరరాజు సుగ్రీవుడి వందనాలు మీకు అర్పిస్తున్నాను. రామ, లక్ష్మణ, సుగ్రీవులు ఎల్లప్పుడూ మిమ్మల్నే తలచుకుంటున్నారు. మీరు ప్రాణాలతో వుండగా చూడగలగడం మా భాగ్యం. ఇక ఆలస్యం కాదు. రామలక్ష్మణులూ, సుగ్రీవుడూ, వానరసేనా, శీఘ్రంగానే లంకకు వస్తారు. నేను సుగ్రీవుడి మంత్రిని. నా పేరు హనుమంతుడు. సముద్రాన్ని దాటి, లంకాపురికి చేరాను. దురాత్ముడైన రావణుడి తల మీద నా కాలు మోపా నని గ్రహించండి. నా పరాక్రమంవల్ల సముద్రాన్ని దాటుకొని, మిమ్మల్ని చూడవచ్చిన రామదూతను నేను. నన్ను అనుమానించవద్దు. దేవీ! నా మాటలు నమ్మండి!" అని హనుమంతుడు కండ్లనీరు కమ్ముతూండగా చెప్పాడు.

హనుమంతుడి ఈ మధురవాక్కులు సీత భయాన్ని తొలగించాయి. ఆమెకు తిరిగి ధైర్యం వచ్చింది; నమ్మకమూ కలిగింది.

"వానరశ్రేష్ఠా! నేను సందేహించానని నువ్వు బాధపడకు. పరమ వంచకులైన రాక్షసులచేత మోసపోయిన నేను, ఇలా చీటికీ మాటికీ భయపడిపోతున్నాను. రాముడివద్దనుంచి వచ్చిన ఓ ఆప్తుడా! నువ్వు రాముణ్ని ఏ విధంగా కలుసుకున్నావు? రాజకుమారుడైన రాముడు వానరాలతో స్నేహం చెయ్యడం ఎలా తటస్థించింది? ఆ కథను సవిస్తరంగా చెప్పు!" అంది.

ఆమె నమ్మకాన్ని పెంచడంకోసం హనుమంతుడు రామలక్ష్మణుల గుణగణాలను, శీలాన్నీ, రూపలక్షణ సంపదను తిరిగి వర్ణించాడు.

"తన ప్రేమబంధంతో లోకాలనే వశం చేసుకోగల రాముడు నన్నూ, నా రాజునూ, వానరబలగాన్నీ వశం చేసుకోవడంలో ఆశ్చర్యం ఏముంది?" అన్నాడు.

• •

తర్వాత జరిగిన కథ అంతా ఆమెకు సవిస్తరంగా తెలియ జేశాడు. వాలి సుగ్రీవుల కుండిన విరోధాన్ని వివరించాడు. రామ లక్ష్మణులు మొదట సుగ్రీవుణ్ని ఎలా కలుసుకుందీ, ఎలా సఖ్యం ఏర్ప రచుకుందీ, చెప్పాడు. వాలిని వధించి వానరరాజ్యం సంపాదించి ఇస్తానని రాముడు సుగ్రీవుడికి చేసిన వాగ్దానం; ఋష్యమూక పర్వతం మీద సీత పడవేసిన ఆభరణాల మూటను వానరులు భద్రపరచి, దాన్ని రాముడికి చూపటం వెల్లడించాడు. ఆ మూట చూడగానే రాముడి దుఃఖం ఇనుమడించిన విషయం కూడా వర్ణించాడు. సుగ్రీవ పట్టాభిషేక కథ, వానాకాలం ముగియగానే సీతాన్వేషణకు వానర సేన బయలుదేరి భూమండలం గాలించడం, దక్షిణానికి వెళ్ళిన అంగ దుడూ మొదలైనవారు సీతను కానక ప్రాయోపవేశం చేయడానికి నిశ్చయించడం, సంపాతిని చూసి, అతడి సలహాను పొందడం, తరు వాత తను సముద్రాన్ని దాటి వచ్చి, రావణుడి అంతఃపురమంతా వెతకడం సవిస్తరంగా వివరించాడు. అన్నీ చెప్పి, తరువాత తాను ఆనవాలుగా తెచ్చిన రాముడి ఉంగరం ఆమె చేతి కిచ్చాడు.

ఆ ఉంగరాన్ని సీత అందుకుంది. కళ్ళకు అద్దుకొంది, ఆనంద పరవశురాలైంది. ఇది రావణుడివంచన ఏమో, రాక్షస మాయ ఏమో, అన్న భీతి ఇప్పుడు పూర్తిగా పోయింది. హనుమంతుడి మీద పరిపూర్ణ విశ్వాసమూ, చెప్పలేని వాత్సల్యమూ ఏర్పడింది.

"నాయనా: నే నెంత పొరపాటు చేశానోయి, నా తండ్రీ:" అని తన్ను తాను నిందించుకుంది.

వాయుపుత్రుడైన హనుమంతుడు తన పుట్టుపూర్వోత్తరా లను సవిస్తరంగా చెప్పాడు. తన బల పరాక్రమాలను వివరించాడు. "వాయుభగవానుడి అనుగ్రహం పొందిన నేను, నా గొప్ప చెప్పుకో కూడదు. అయినా, మీ దుఃఖం పోగొట్టడం అవసరం కనుక, చెప్పాను. వానరవీరుల సేన త్వరలోనే వచ్చి, ఈ రాక్షసుణ్ణీ, అతడి రాజ్యాన్నీ నిర్మూలం చేయబోతూంది. నేను తిరిగి పోయి, ఈ సమాచారం చెప్పడమే తరువాయి" అంటూ, సీతావియోగం

వల్ల రాముడు పడుతున్న దుఃఖాన్నీ, అతడి వ్రతనిష్ఠనూ, జానకి మనస్సు కరిగేలాగ వివరించాడు.

సీత తన దుఃఖం మరచిపోయి, ఇప్పుడు రాముడి దుఃఖాన్ని గురించి చింతించసాగింది.

70. జగన్మాతా - మారుతి

"ప్రీతి పాత్రుడ వైన ఓ వానరేంద్రా! నువ్వు తెచ్చిన వార్త విని నేను ఆనందించాలో దుఃఖించాలో తెలియడంలేదు. నీ మాటలు అమృతం కలిపిన విషంలాగ నా మనస్సులో చొరబారుతున్నాయి. నా రాముడు నన్ను మరచిపోలే దనీ, నా కోసమే వెతుకుతున్నా డనీ వినడం ఆనందం గానే ఉంది. నన్నే ఎప్పుడూ తలుచుకుంటూ, దుఃఖిస్తున్నాడని వింటే మట్టుకు నా వేదన చెప్పతరంకాకుండా వుంది."

ఇలా జానకి, తన మనస్సు విప్పిచెప్పి, కొంత ఊరట చెందింది.

మానవ జీవితాలలో సుఖదుఃఖాలూ, సంతోష విషాదాలూ, ఒకదానితో ఒకటి పెనవేసుకొని మానవులను నడిపిస్తూ ఉంటాయి. రాముడు తనను మరిచిపోలేదనీ, తననే తలచుకొని దుఃఖిస్తున్నాడనీ, తన కోసం వెతికీ వెతికి, తిరిగి దుఃఖపడుతున్నాడనీ విని, సీత మనస్సు ఊరట చెందింది. ఆమె సంతోషించింది. కాని ఆ వెంటనే ఆమెకు దుఃఖంకూడా వచ్చింది.

"మానవ జీవితం సంతోష విషాదాలు అనే జమిలితాడుతో కట్టి, ఈడవబడుతూంది. దీ న్నెవరూ తప్పించుకోలేరు. ప్రకృతి నియమానికి రాముడు, లక్ష్మణుడు, నేనూకూడా లోబడే ఉన్నాం. నా ప్రాణనాథుడు సముద్రమధ్యాన పెనుగాలికి చిక్కిన ఓడలాగ, దుఃఖంతో అల్లాడుతున్నాడు. ఆయన ఎప్పుడు వస్తాడు? ప్రీతిపాత్రుడ వైన ఓ వానర ప్రముఖుడా! ఆయన ఎప్పుడు వచ్చి, ఈ లంకలో రావణుణ్ణీ, అతని అనుచరులనూ తుదముట్టిస్తాడు? ఈ రాక్షసులు నాకు పెట్టిన గడువులోగానే ఈపని జరగాలే! ఈమాట నా నాథునితో

• •

చెప్పు. రెండు నెలలు గడువు మాత్రమే ఉంది. రావణుణ్ని సన్మార్గంలో పెట్టడానికి అతడి తమ్ముడు విభీషణుడు ఎంతో ప్రయత్నించాడు. 'సీతను తీసుకుపోయి రాముడికి అప్పజెప్పు. లంక నీకు దక్కుతుంది. రాక్షసకులం బతుకుతుంది' అని విభీషణుడు ఎంతో చెప్పి చూశాడు. కాని, ఆ మాట లేవీ ప్రయోజనం లేకపోయాయి. నా అంతరాత్మ ధైర్యంతో ఉంది. రావణుడికి వినాశకాలం సమీపిస్తూంది. అతడే స్వయంగా యముణ్ని వెతుక్కుంటూ వెళుతున్నాడు. కనుక, నశించడం నిశ్చయం. నానాథుడువచ్చి త్వరలోనే నన్ను విజయంతో చేపట్టనున్నాడు. ఈవిషయంలో నాకు సందేహమేలేదు. పాప మెరుగని నా మనస్సుకి తోచేది, ఎన్నటికీ అబద్ధంకాదు"

ఇలా కంటితడితో చెప్పింది సీత. ఆమె దుఃఖాన్ని చూసి హనుమంతుడు భరించలేకపోయాడు.

"జానకీ! తల్లీ! వెంటనే పోయి చెప్పి, రాఘవుణ్ని తోడ్కొని వస్తాను. ఆయన అసాధ్యసేనతో వచ్చి లంకను ముట్టడిస్తాడు. చింతించకు. మీ కిష్టమైతే చెప్పండి, ఇప్పుడే, నా వీపున కూర్చుంటే మిమ్మల్ని తీసుకుపోయి, సముద్రం దాటించి రాముడి సన్నిధిలో వదులుతాను. ఆ పని చేయటానికి కావలసిన బలం నాకుంది. సందేహం లేదు. అగ్ని దేవుడు హవిస్సును తీసుకుపోయి ఇంద్రుడి కిచ్చినట్లు, నేను మిమ్మల్ని తీసుకుపోయి రామచంద్రుడికి అర్పిస్తాను. సాధ్వీ, అనుజ్ఞ ఇవ్వండి. వేడే మీరు రామచంద్రుణ్ని చూడవచ్చు. తమ్ముడితో కూర్చుని ఉన్న రామచంద్రుడి సన్నిధికి మిరు నేడే చెరగలరు. సందేహపడకండి. కావాలంటే ఈ లంకను, రావణుడితో సహా కొనిపోయి రామచంద్రుడి పాదాల ముందు పడవేస్తాను. ఆ పనికూడా నాకు చేతనవును. నన్ను ఎవరూ అడ్డగించలేరు. నా వీపున కూర్చుంటే నేను చెప్పినమాట మీడే చూడగలరు. రోహిణీ నక్షత్రం చంద్రుణ్ని చేరేటట్లు, మీరు సంతోషంగా రామచంద్రుణ్ని చేరగలరు. ఇక్కడికి ఎలా వచ్చారో, అలాగే ఇక్కడనుంచి తిరిగి రామచంద్రుణ్ని చేరగలరు. ఇంతెందుకు, చెప్పండి మీరే చూస్తారు."

ఇలా ఆదరోత్సాహాలు పొంగుకుని రాగా హనుమంతుడు చెపుతూ పోతున్నాడు. సీత ఆశ్చర్యపడింది. ఈ చిన్న వానరం తనని వీపున పెట్టుకొని సముద్రాన్ని, ఎలా దాటగలదా అని సందేహం కలిగింది. ఈ వంగతి గ్రహించిన హనుమంతుడు తన శక్తిని జానకికి చూపడంకోసం అరుగుమీదనుంచి కిందికి దూకి, తన శరీరాన్ని పెంచాడు. అలా పెంచి పెంచి పర్వతమంత ఆకారం తాల్చాడు. ఇది చూసి సీత చాలా ఆనందించింది.

"వాయుపుత్రా! నీ శక్తిని నేను గ్రహించాను. అయినా, నువ్వు నన్ను తీసుకుపోవడం ఉచితంకాదు. దారిలో రాక్షసులు నిన్ను అడ్డగించి యుద్ధానికి వస్తారు. నీ మీద పడతారు. నీ మీద ఆయుధాలు విసురుతారు. నువ్వు నన్ను రక్షింపవలసి వస్తుంది. ఎంతసేపూ నీకు ఆ యోచనే తప్ప యుద్ధంమీద బుద్ధిపెట్టడానికే వీలుండదు. ఎంత బలవంతుడైనప్పటికీ, యుద్ధంలో తప్పకుండా విజయం పొందుతాడని నిశ్చయంగా చెప్పలేం. నీకు అపాయం కలిగితే నా గతేం కాను? రాక్షసులు నీ మీద పడి అయుధాలు ప్రయోగిస్తూ ఉంటే, నేను ధైర్యంగా నీ వీపున కూర్చోగలనా? జారి సముద్రంలో పడిపోతాను. ఇదంతా యోచించి చూస్తే నువ్వు నన్ను తీసుకొని సముద్రం దాటడం ఉచితం కాదని వ్యక్తమవుతూంది. అదీగాక హనుమంతా! నువ్వు వచ్చి రాక్షసులకు తెలియకుండా నన్ను తీసుకుపోతే, అది నా నాథుని శౌర్యానికి కళంక మవుతుందే? రావణుణ్ణి ఎదిరించి పోరు సలిపి, నన్ను విడిపించుకున్నప్పుడు కదా క్షత్రియ కులానికి గౌరవం? రావణుడు నన్ను దొంగచాటుగా ఎత్తుకు వచ్చాడు. రాముడు కూడా అలా యుద్ధం చేయకుండానే, నన్ను తీసుకుపోవడం ఉచిత మనిపించుకుంటుందా? నాయనా. నువ్వు తిరిగివెళ్లు. వెళ్లి, రామలక్ష్మణులనూ, వానరసేననూ వెంటతీసుకురా. రాముడి బాణాలవల్ల ఈ లంక నశించాలి. రావణుడు యమాలయానికి వెళ్ళాలి. విజయం మనదే! సందేహంలేదు. నా నాథుడి బాణాలు ప్రళయకాల చండసూర్యుడిలాగా రావణుణ్నీ, అతడి రాణువనూ దహించివేస్తాయి." అంది సీత.

• •

"నేను తిరిగివెళ్లి రాముడికి ఏం చెప్పా లని మీ వుద్దేశం? మిమ్మల్ని చూసి మాట్లాడినట్లు ఆనవాలు కావాలికదా?" అని హనుమంతుడు అడిగాడు.

ఈ మాట వినగానే, సీతకు పాత జ్ఞాపకాలు కొన్ని స్ఫురణకు వచ్చి, ఆమె కళ్ళనీళ్ళ నించింది.

"తనకూ రాముడికీ మధ్యని గల పరమ రహస్యాలను హనుమంతుడు తన నాథుడికి చెపితే, హనుమంతుడు తనను చూసినట్టు వెంటనే గుర్తు తెలుస్తుంది. అది తన అశాంత పరిస్థితిని కూడా సూచిస్తుంది" అని యోచించి, ఆమె కొన్ని సంగతులు వెల్లడించింది.

"ఒకప్పుడు దండకారణ్యంలో, అసురులను నిర్మూలించిన వీరుడు నా రాముడు. ఇంకా ఈ లంకను ఎందుకు నాశనం చేయడంలేదు? ఆయనకు అలవికాని పని ఏముంది? ఒకనాడు నేనూ, రాముడూ చిత్రకూటంలో, ఏటిగట్టున విలాసంగా తిరుగుతూ పోయి, ఒకచోట కూర్చున్నాం. ఆయన నా ఒడిలో తలపెట్టి నిద్రించారు. అప్పు డొక కాకి వచ్చి నా రొమ్ము పొడిచి, బాధించింది. నేను రాయి విసిరి, దాన్ని అదిలించాను. అయినా, అది కదలనే లేదు. ఎంత అదిలించినా పోలేదు. రాముడు లేచి, నా కంట తడి చూసి, మొదట నవ్వాడు. తర్వాత నా రొమ్మున కాకి పొడవడంవల్ల గాయమై ఉండడం చూశాడు. ఆ కాకి మామూలు కాకి కాదనీ, రాక్షసుడనీ, ఆ క్షణమందే తెలుసుకున్నాడు. దానిమీద ఒక అస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్రం కాకిని తరిమింది. రాక్షసుడు దాన్నుంచి తప్పించుకోలేక, చివరకు నా నాథుని పాదాలపై పడి, శరణువేడి, ప్రాణాలు దక్కించుకున్నాడు. ఈ 'కాకాసుర' వృత్తాంతాన్ని ఆయనకు చెప్పు. నే నింక ఎక్కువకాలం కాచుకొని ఉండలేను. వచ్చి శీఘ్రంగా నా ప్రాణాలు కాపాడవలసిందని కోరినట్లు చెప్పు. అంతే."

సీత ఇలా చెప్పి, విలపించింది. "మరొకనాడు మే మిద్దరమూ అడవిలో నడిచి వెళుతున్నాం. నడిచి నడిచి, నాకు ఆయాసం వచ్చింది. చెమటవల్ల నొసటనున్న తిలకం కరిగిపోయింది. అప్పుడు నా నాథుడు

ఒక కొండరాతినున్న ఎర్రటి ధాతువు తీసి, వేడుకగా నా నుదుట తిలకం దిద్దాడు. ఈ సంగతి ఆయనకు జ్ఞాపకం ఉందా అని అడిగిచూడు'' అంది.

ఇలా పూర్వ వృత్తాంతాలను చెప్పి చెప్పి, ప్రస్తుత స్థితిని తలచుకొని శోకసాగరంలో మునిగింది, సీత.

"రాముడికి నేను చెప్పవలసిం దేముంది? ఆయనకు తెలియం దేముంది? ఆయన ధర్మ మేంటో నేను చెప్పాలా? ఆయనకు నేను నమస్కరించానని మాత్రం చెప్పు. చాలు. లక్ష్మణు డాయనకు తోడున్నాడు. అలాంటి తమ్ముడు మరెక్కడా లేడుకదా? అస లతడు పుట్టడమే రాముడికి తోడుగా ఉండడంకోసం! లక్ష్మణుడు సాటిలేని సమర్థుడు. అతడ్ని చూసి నా నాథుడు తండ్రిని పోగొట్టుకున్న దుఃఖాన్ని మరిచాడు. కళంక మెరుగడు. పరిశుద్ధ హృదయం. భయమేమిటో తెలియని మహావీరుడు. అడవిలో తన తల్లిని మరచిపోయి, నన్నే తల్లిగా భావిస్తూ ఉండేవాడు. నా దుఃఖాన్ని బాపవలసిందని అతడితో చెప్పు'' అంది జానకి.

జానకి కన్నుల నీరు నిండినది. మాటలు తడబడ్డాయి. రాముడు లేడిని వెంబడించి, చాలా దూరంపోయిన సమయాన, లక్ష్మణుణ్ణి తను కోపించి, అన్యాయంగా నిందలు మోపిందే? ఆ విషయం సీత మనస్సుకు బాధగానే ఉండి వుంటుంది.

ప్రాణం వదిలెయ్యడమా అన్న సమయంలోవచ్చి, తనకు ఊరట కలిగించిన హనుమంతుణ్ణి విడవడానికి, ఆమెకు మనస్సు రాలేదు. అతడు క్షేమంగా, శీఘ్రంగా, రాముడివద్దకు చేరి తన సంగతి చెప్పాలి. అదే సీత ఇలా మాట్లాడానికి కారణ మయింది.

"నాయనా! ఇదిగో, నా వివాహ సమయంలో మా అమ్మ ఇవ్వగా, దశరథమహారాజు స్వయంగా నా తలలో అలంకరించిన చూడామణి. దీనిని నా నాథుడికి ఆనవాలుగా చూపించు!" అంటూ తన చీర చెరగున ముడివేసి ఉంచిన ఆ దివ్యాభరణాన్ని విప్పి మారుతికి ఇచ్చింది.

వివాహకాలంలో తన తల్లి ఇవ్వగా మామగారైన దశరథ మహారాజు అందుకున్న ఆ ఆభరణాన్ని, సీత ఎంత విలువగా ఎంచి

వుంటుంది : అందుకని మారుతి, దాన్ని ఎంతో వినయంతో అందుకున్నాడు.

అది తీసుకొని, "కంటిని సీతను !"అని చెప్పి. 'దీన్ని నా రాముడికి అందిస్తాను' అని తలచి ఆనందించాడు. ఈ ఘనకార్యంవల్ల కలగబోయే ఆనందాన్ని తలుచుకు తలుచుకు ఉప్పొంగిపోయాడు, హనుమంతుడు. అతడి హృదయం రాముడివద్దకు పోయి వాలింది. శరీరం మాత్రమే లంకలో మిగిలిఉంది.

"నాయనా, హనుమా ! నా దుఃఖాన్ని తీర్చడానికి తగిన ఆలోచన లన్నీ నువ్వే రాముడికి చెప్పు. సుగ్రీవుడికీ, వానర ముఖ్యులకూ నా ఆదరాభిమానాలను అందజెయ్యి. నేను దుఃఖసాగరాన్ని దాటడానికి వారు సకల సహాయాలూ రాముడికి చేయవలసిందని నా కోరికగా చెప్పు. రాముడికి ఉత్సాహం తగ్గిపోకుండా ఉండేలాగ, కావలసిన ఆలోచనలన్నీ నువ్వే చెప్పాలి సుమా !" అంది సీత.

"అమ్మా!_దుఃఖం మానండి. రామలక్ష్మణులు వానరసేనతో లంకాద్వీపానికి రావడం నిశ్చయం. రాక్షసులను సంహరించి, మిమ్మల్ని విజయంతో తీసుకువెళ్ళడమూ నిశ్చయమే. ఏమీ సందేహ పడకండి" అని అన్నాడు మారుతి.

"ఇక్కడెక్కడైనా ఒకరోజు విశ్రమించి, శ్రమ తీర్చుకొని మరీ బయలుదేరడం మంచిది కదా ?" అంది సీత. "నిన్ను చూడగానే నాకు ఊరట కలిగింది. నా దుఃఖాన్నే మరిచాను. నీవు కనిపించకుండా పోయేపరికి నేను మళ్ళీ దుఃఖంలో మునిగిపోతాను. నీ వెతే ఈ సముద్రాన్ని దాటి రాగలిగావు గాని, రాముడూ వానరసేనా ఎలా దాటగలరు ? ఈ సమస్యను గురించి నీ ఆలోచన ఏమిటి ?" అని సీత మళ్ళీ సందేహంలో పడింది.

"దేవీ ! మీకు ఎలాంటి సందేహమూ వద్దు. సముద్రాన్ని దాటగలడాడను నే నొక్కడను మాత్రమే అనుకుంటున్నారా ? అక్కడున్న వానరులంతా నాకన్నా ఎక్కువ సమర్థులు. సుగ్రీవు డొక్కడేకాదు. అతడి సేనలో చాలామంది ఎగిరి భూమండలాన్ని చుట్టి తిరిగి రాగల శక్తిమంతులున్నారు. వారికి ఈ సముద్రం ఒక లెక్కకాదు. నాకన్న

బలశాలురు, సమర్థులు, ఆకాశమార్గాన వెళ్ళగలవారు, వేలాదిగా మాలో ఉన్నారు. మీ కెట్టి సందేహమూ వద్దు. నిజానికి వా రంతా నన్నే ఓడించ గలరన్నమాట. అందరికన్నా బలశాలిని మొట్టమొదట దూతగా పంపుతాడా, ఏ రాజయినా? కనుక అందరిలోకీ తక్కువ వాడినే వెతికి మొదట పంపారు. అక్కడున్న వానరులలో నన్ను మించిన వా రెందరో ఉన్నారు. దేవీ! దుఃఖం మాని సంతోషంగా ఉండండి. ఇద్దరు రాజసింహాలను నా మూపున ఎక్కించుకు రాబో తున్నాను. వారు వచ్చి ఈ నగరాన్ని వారి బాణాలతో నాశనం చేస్తారు. మీకు మంగళ మగునుగాక! మాకోసం ఎదురు చూస్తూ ఉండండి. దుఃఖసాగరాన్ని దాటి ఆవలిగట్టు ఎక్కుతారు. దుఃఖ మంతా ఒక కలలాగ కరిగిపోయే కాలం దగ్గరకు వచ్చింది. ఆట్టే దూరంలేదు. ఇరువురు రాజకుమారులు విల్లమ్ములు పట్టి లంక వాకిట నిలవడం మీరే చూస్తారు. ఈ రాకాసిమూక నశించడమూ చూస్తారు. వానరసేన వచ్చి ఎగురుతూ దూకుతూ లంకను పాడుచేయడం చూస్తారు. ఇక్కడి వైనం తెలిశాక రామలక్ష్మణులు ఒక్క క్షణం కూడా ఊరికే ఉండరు. నేను పోయి, చెప్పడమే తరువాయి. వెంటనే బయలుదేరి వచ్చేస్తారు. అందుచేత మీరుమట్టుకు ధైర్యంగా ఉండండి" అని ఇలా చెప్పి, హనుమంతుడు తల వంచి, దేవికి నమస్కరించి బయలుదేరాడు.

"నేను ప్రాణాలతో నిలిచిఉన్నా నని, రామలక్ష్మణులతో చెప్పు. త్వరగా కార్యం నెరవేరేలా చూడు. నీకు మంగళ మగునుగాక!" అంది సీత.

అంజనాదేవి నందనుడూ, వీరుడూ, జానకి శోకాన్ని తగ్గించిన మహాత్ముడూ అయిన హనుమంతుడికి అంజలి ఘటించుదాం.

71. కర్తవ్యానికి కాలు దువ్వుతున్నాడు

సీతవద్ద అనుజ్ఞ తీసుకున్న హనుమంతుడు ఉత్తరదిక్కుగా వెళ్ళి ప్రాకారం మీది కెక్కి కూర్చుని ఆలోచించాడు.

"సీతకు ధైర్యం కలిగించడానికీ, రావణుడికీ అతడి పరివారానికీ భయం పుట్టించి, సీతను వాళ్లు బాధించకుండా చేయడానికీ నేనేం చేయాలి? నేనూరికే తిరిగిపోతే, రావణుడికి నేను వచ్చిన సంగతే తెలియదే. అతడు ఎప్పటిలాగే గర్వంతో విర్రవీగుతూ ఉంటాడు. నేను రాముడితో చెప్పి, వానరసేనతో లంకకు తిరిగి వచ్చేవరకూ సీత క్షేమంగా ఉండాలికదా? సీతను రావణుడు బాధ పెట్టకుండా ఉండాలంటే అతడి మనస్సులో భయాన్ని పుట్టించాలి. ఆ పని చేసిం తరువాతనే నేను తిరిగి వెళ్ళడం బాగుంటుంది. సామ, దాన భేదములవల్ల రాక్షసులను సన్మార్గానికి తిప్పడం సాధ్యంకాదు. చూడబోతే ఈ మూర్ఖుడివద్ద మితిలేని సంపద ఉంది. వీరిలో వీరికి తంపులుపెట్టి భేదం కలిగించుదామా అంటే, అదీ కాని పని. వీళ్ళపట్ల సామ దాన భేదాలున్నూ పనికిరావు. ముందు, నేను వీరి హృదయాల్లో తగినంత బెదురు పుట్టించి మరీ వెళ్ళాలి. అలా చేస్తేనే, సీతకు క్షేమం. అందుకని ఈ పనికాస్తా ముగించేసి, చప్పున తిరిగి వెళతాను" అని నిశ్చయించుకున్నాడు.

వెంటనే శరీరాన్ని పెంచి, అందమైన అంతఃపురోద్యానాన్ని నాశనం చేయటం ప్రారంభించాడు. పటపటమని చెట్లు విరిచి పడదోశాడు. పూదీగె లన్నీ నాశనం చేశాడు. కొలకులను కృత్రిమ శైలాలను, అలంకారాలను, అన్నింటినీ ధ్వంసం చేశాడు. దాంతో, అందంగా శోభించే అశోకవనం అంద మంతా పోయింది. అక్కడి జింకలూ, పక్షులూ భయపడి అరుస్తూ పరుగులు పెట్టాయి. నిద్రపోతున్న రాక్షస స్త్రీలు ఉలిక్కిపడి లేచి, కారణం తెలియక తల్లడిల్లి పోయారు.

హనుమంతుడు ఆ ఉద్యానవనాన్ని నాశనంచేసి, ప్రాకారం మీది కెక్కి కూర్చున్నాడు. రాక్షసస్త్రీలు ఆ వానరాన్ని చూశారు. హనుమంతుడు తన శరీరాన్ని బాగా పెంచి, భయంకర రాకారం ధరించే సరికి, వారి హృదయాలు కంపించిపోయాయి. ఈ విషయం రావణుడికి చెప్పడంకోసం వారు పరుగులెత్తారు. కొంతమంది సీత వద్దకువెళ్ళి "ఈ పెద్దకోతి ఎలా వచ్చిందే? నీకు తెలిసే ఉంటుంది. మాయలాడీ! నీతో ఇది ఏమైనా మాట్లాడిందా? ఉన్న దున్నట్లు

• •

కొబుతావా, లేదా ?'' అంటూ, "భయపడకు, చెప్పు !'' అని బుజ్జగించారు.

"ఈ రాక్షస నగరంలో ఏం జరుగుతుందో నాకేం తెలుసు. ఈ వానరంకూడా మీలో ఒకడేనేమో ! రాక్షస మాయలు నాకేం తెలుస్తాయి? ఆ వానరం సంగతి నా కెలా తెలుస్తుం దనుకుంటున్నారు'' అంది సీత.

* * *

"అయ్యో, సీత అబద్ధమాడిందే. దీనికి సమాధానం ఏమిటి ?'' అని కొందరు పండితులు ఈ కాలంలో తర్కిస్తున్న సంగతి ఈ సందర్భంలో పాఠకులకు జ్ఞాపకం రావచ్చు.

ఇంతకన్న వ్యర్థమైన వివాదాన్ని నే నెక్కడా చూడలేదు. "రామకార్యం వెంటనే చెడిపోవాలని మీ కోరికా ? రామాయణ మంతా తారుమారు చేసి, వేరు విధంగా తిప్పా లనుకుంటున్నారా ? చాలు చాలు, ఇటువంటి ప్రశ్న లన్నీ ఈపాటికి కట్టిపెట్టండి!'' అని ఈ పండిత శిఖామణులకు చెబుతాను.

"సీతలా చెరలోపడి, దోవ కనబడక పరితపిస్తూఉంటే, మిమ్మల్ని రాక్షసులు ఏమైనా అడిగితే మీరుకూడా యిలాంటి అబద్ధమే ఆడవచ్చు. దానివల్ల మీ సత్యదీక్షకు భంగంరాదు'' అని చెబుతాను.

* * *

అశోకవనం నుంచి భయపడి పరుగెత్తిన రాక్షసస్త్రీలు రావణుడి దగ్గరకు వెళ్ళి జరిగిందంతా చెప్పారు.

"మహారాజా ! భయంకర రాకారం గల ఒక కోతి అశోక వనానికి వచ్చి, వన మంతా పాడుచేస్తూంది. ఆ కోతిని చూస్తే మాకే భయం వేస్తూంది. అది సీతతో ఏదో రహస్యంగా మాట్లాడింది కూడాను.''

ఇలా ఆ రాక్షసస్త్రీలు రావణుడికి చెప్పారు. కాగా, తాము విన్నదపోయిన సంగతిని మాత్రం వారు చెప్పక, మరుగుపరిచారు.

"మేం సీతను ఎంతగానో అడిగి చూశాం. 'ఈ వానరు డెవడు? ఇక్కడికి ఎందుకు వచ్చాడు ? నీతో ఏం మాట్లాడాడు ?' అని పరిపరి విధాల అడిగి చూశాం. ఆమె ఏమీ చెప్ప నంటూంది. ఈ కోతిని మీరు

పట్టి చంపడానికి తగిన వారినే పంపండి. అది సామాన్యమైంది కాదు, భయంకరమైన కోతి. దాన్ని పట్టగల వీరులనే పంపండి. అందమైన తోట నంతా ఈ దిక్కుమాలిన కోతి పాడుచేసింది. కాని సీత కూర్చుండే శింశుప వృక్షాన్ని మాత్రం అది తాకలేదు సుమండీ! కొమ్మలూ, రెమ్మలూ సాగి బాగా వ్యాపించి ఉన్న ఆ వృక్షం. ఏమీ చెక్కుచెదరలేదు. ఇందు కేదో కారణం ఉండి తీరాలి. తక్కిన చెట్లను, తీగెలను, కొలకులను, పందిళ్ళను పాడుచేసిన ఆ వానరం సీత ఉన్నచోటును ఎందుకు విడిచిపెట్టేసింది? ఇందులో వుంది ఏదోమోసం. చూడగా, ఇది సాధారణ వన్యమృగం కాదు. మీ పగవాడైన దేవేంద్రుడో, కుబేరుడో, పంపిన వానర మైఉండాలి. లేదా, అది రాముడి పనైనా అయి ఉండాలి. లేకపోతే, ఈ వానరానికి సీతతో మాట్లాడే పాటి ధైర్యం ఎలా కలిగింది? ఇతడు రామదూతే అయి ఉంటాడు. వెంటనే వీరులను పంపి, ఆ భయంకర వానరాన్ని పట్టమని చెప్పండి" అంటూ రాక్షసస్త్రీలు గోలపెట్టారు.

తన రాణులకోసం ప్రత్యేకంగా వేయించిన ఆ అందాల పూదోట పాడైపోయిందన్న సంగతి వినగానే, రావణుడికి, పట్టరాని కోపం వచ్చింది. కళ్ళెర్రబడ్డాయి. రెండుకళ్ళూ రెండు దివిటీలలాగా మండిపోయాయి. వాటినుంచి వేడివేడి నూనెచుక్కలు రాలినట్లు, నీరు స్రవించింది. తన పక్కన, సదా అజ్ఞకోసం వేచిఉండే వీరులను వెంటనే పంపించాడు. గదలు, ముసలాలూ, కత్తులు, శూలాలు పట్టుకొని వారు బయలుదేరారు.

72. శ్రీ రా మ దూ త

ఆలా వెళ్ళిన రాక్షసవీరులు ఉద్యానవన తోరణంమీద కూర్చున్న హనుమంతుణ్ణి చూశారు. వారిని చూడగానే హనుమంతుడి తేజస్సు, బలం, స్వరూపం అతిశయించాయి. "వచ్చారు. వచ్చారు! అదుగో" అని, కిందికి దూకి, తోకతో నేలను కొట్టి దిక్కులు పిక్కటిల్లేలాగా

హనుమంతుడు ఒక్కసారి గర్జించాడు. ద్వారానికున్న పెద్ద ఇనుప గుదియ పెకలించి, దాంతో ఆ రాక్షసులను ఎదిరించాడు.

పైకెగిరి, ఇనుప గుదియను గిరగిర తిప్పుతూ, ఒక్కొక్క రాక్షసుణ్ణే చావమోదాడు. తరువాత రాతి స్తంభాలున్న అశోకవనం ద్వారం మీద కూర్చుని, సింహనాదం చేశాడు.

"శ్రీరామచంద్రుడికీ జై ! లక్ష్మణుడికీ జై ! సుగ్రీవ మహా రాజుకూ జై ! రాక్షసులారా ! మీకు వినాశకాలం దాపురించింది. వీరులైన రామలక్ష్మణులు, రాజైన సుగ్రీవుడు, నన్ను పంపారు. పగవాళ్లను నాశనం చేయడానికే నేను వచ్చాను. రాక్షసులారా! రండి! రండి, వెయ్యిమంది రావణులు వచ్చినాసరే, హతమార్చడానికి సిద్ధంగా ఉన్నాను. సీతకు శిరసా వందనం చేసి, ఆమె దీవనలు పొందినవాడిని. ఇప్పుడు మీ నగరాన్నే నాశనం చేస్తాను" అని గర్జించే సరికి యావత్తు లంకా గజగజలాడిపోయిం దన్నమాట.

హనుమంతుణ్ణి ముట్టడించిన రావణ కింకరు లంతా మరణించారు. రావణుడి కీకబు రందగానే అతడి కళ్లు భయంకరంగా విప్పారాయి.

"ఏమన్నారు ? ఏమి టంటున్నారు ?" అని లేచి, వెంటనే సాటి లేని మేటి వీరుడైన ప్రహస్త కుమారుణ్ణి పిలిచి, "పోయి, ఈ కోతి పొగరు అణచి రా !" అని ఆజ్ఞాపించాడు.

ప్రహస్తుడి కుమారుడైన జంబుమాలి కవచం ధరించి, ఆయుధాలు చేబూని, అలంకారం చేసుకొని రావడానికి, కొంత సేపు పట్టింది. అంతవరకూ హనుమంతుడు ఊరికే కూర్చోలేదు. పక్కనే ఒక పెద్ద మండపం ఉంటే, దానిమీది కెక్కి నిలబడ్డాడు. పైన ఆకాశంలో రెండవ సూర్యుడిలాగా ప్రకాశించాడు. తన శరీరాన్ని ఇంకా పెంచాడు. ఆకాశంలో ఒక బంగారు కొండలపంక్తి నిలిచినట్టు వెలిగిపోయాడు. అతడి గర్జనలు లంకలో అష్టదిక్కులా మార్మ్రోగి, నగరాన్ని దద్దరిల్లజేశాయి. రాక్షసుల మనస్సులు తల్లడిల్లాయి.

• •

అత డెక్కిన ఆ మండపానికి కావలి ఉన్నవారు "ఇదేంటి? పెద్ద కోతివచ్చి మన తోటను చెరుస్తూందే !" అని బయలుదేరి, హనుమంతుణ్ని ఎదిరించాలిని చూశారు.

"రాముడికీ జై ! లక్ష్మణుడికీ జై ! సుగ్రీవ మహారాజుకూ జై ! కోసలేంద్రుడి దూతను నేను. లంకను నాశనం చేయడానికి వచ్చాను. హనుమంతు డనే వాయు పుత్రుడను. పగవాళ్ళను నిర్మూలించడానికి వచ్చినవాడను. జానకికి వందనంచేసి, ఆమె ఆశీస్సు పొందాను. లంకలో మిమ్మల్ని అందరినీ ఏడిపించడానికే వచ్చాను. వేయిమంది రావణులైనా రానీ, అందరినీ జయించగలను. అంతటి శక్తివుంది నాకు. బండలు, వృక్షాలు విసిరి రాక్షస సమూహాన్ని నాశనం చేయడానికే వచ్చాను."

ఇలా హనుమంతుడు లంకలో, రాక్షస స్త్రీల కడుపుల్లో పిండాలు అదిరి పోయేటట్లు గర్జించాడు.

ఆ మండపం రక్షకులు పలు విధాలైన ఆయుధాలతో హనుమంతుణ్ని బలంగా కొట్టారు. హనుమంతుడు కిందికి చూశాడు. ఆ మండప స్తంభాలలో పెద్దది పెకలించి పట్టి, దండధారి అయిన యముడిలాగ నిలిచాడు. బంగారు కళ్లుగల ఆ స్తంభాన్ని గిరగిర తిప్పి ఆ రాక్షసులను మోది, సంహరించాడు. ఆ రాతి స్తంభాన్ని ఊడదీయగానే మండపం కాస్తా కూలిపోయింది. హనుమంతుడు స్తంభాన్ని గిరగిర తిప్పి కొడుతూ ఉంటే, ఆ రాపిడికి నిప్పురవ్వలు లేచాయి.

"నాకన్నా ఇంకా బలంగల వారు సుగ్రీవుడి నాయకత్వాన ఇక్కడికి రాబోతున్నారు. మిమ్మల్నీ, మీ రాజునూ, మీ నగరాన్నీ నిమిషంలో నిర్మూలించడానికి వస్తున్నారు. వస్తున్నారు! మీ రాజు ఇక్ష్వాకురాజుతో వైరం తెచ్చుకున్నాడు కదూ! ఆవైరంతోటే నశించింది లంక ! నశించారు మీరున్నూ ! రాక్షసులారా ! నశించి పొయ్యాడు రావణుడూ!" అని హనుమంతుడు గర్జించాడు.

ప్రహస్త కుమారుడైన జంబుమాలి వచ్చాడు. విప్పారిన పెద్దకళ్లు, భయంకరమైన పళ్లు, నెత్తురు రంగుగల ఎర్రటి దుస్తులు,

చెవులకు కుండలాలు, చేత విలు, మెడలో మాల, నడుమున కత్తి, ఇలాంటి ఆకార, వికారాలతో పిడుగు పడినట్లు ధ్వనిచేస్తున్న రథంమీద వచ్చాడు.

పెద్ద కంచరగాడిదలను పూన్చిన ఆ రథాన్ని హనుమంతుడు చూశాడు. అతడూ యుద్ధానికి సిద్ధపడ్డాడు.

జంబుమాలి రథం మీదనుంచి విల్లువంచి, మారుతిపై బాణాలు వేశాడు. ఆ బాణాలు హనుమంతుడి ముఖాన నాటి, నెత్తురు చిమ్మింది. ఆ నెత్తురువల్ల హనుమంతుడి ముఖం రెట్టింపు అందంతో వెలుగొందింది. హఠాత్తుగా ఆకాశంలో ఒక ఎర్రతామర విప్పారినట్లు అయింది. దెబ్బ తగిలిన మారుతికి కోపం వచ్చింది. పక్కనున్న ఒక పెద్ద రాతిబండ ఎత్తి, రథంమీద విసిరాడు. ఒక శింశుప వృక్షాన్ని పెకలించి, గిరగిర తిప్పి, జంబుమాలిపై విసిరాడు. మండపంనుంచి ఒక్క ఇనుపగుదియను లాగి, గిరగిర తిప్పుతూ, రథం మీదికి విసిరాడు దెబ్బతో ఆనవాలయినా లేకుండా రథం నుగ్గునుగ్గయి పోయింది. జంబుమాలి మహాకాయం నలిగి కాళ్లూ, చేతులూ, తలా, ఏదీ గుర్తు తెలియకుండా నుగ్గునుగ్గయి పోయింది.

ఈ యుద్ధ ఫలితాన్ని రావణుడికి తెలియపరచారు. అతడు ఆశ్చర్యపోయాడు. "ఇదేంటి? వింతగా ఉందే! ఇది మృగం కాదు. వానరం కాదు. నా పగవారైన దేవతల పనే ఇది. వారు ఒక కొత్త ప్రాణిని పుట్టించి నా మీదికి పంపారు. సరే. దాన్ని పట్టుకుని, నా ఎదట పెట్టండి" అని అయిదుగురు గొప్పగొప్ప వీరులనూ, వారికి తోడుగా గొప్ప సేననూ పంపించాడు.

రాక్షసవీరులు రథాలతోనూ, సైన్యంతోనూ, వెళ్లారు. ప్రాకారం ద్వారంపైన నిలిచి అట్టహాసం చేస్తున్న హనుమంతుణ్ణి బలంగా కొట్టారు. వజ్రకాయుడైన వాయు పుత్రుడికి ఇదొక లెక్కా? శరీరానికి గాయాలు తగిలి నెత్తురోడిన కొద్దీ, అతడి కోపమూ రెచ్చింది. దాంతోపాటు శరీరమూ పెరిగింది. హనుమంతుడు ఎగిరి, గుట్టలూ చెట్లూ పెకలించి, వారి మీద విసిరాడు.

• •

రథాల మీదికి లంఘించి వాటిని తుత్తునియలు చేశాడు. యుద్ధానికి వచ్చిన వీరులందరినీ వధించాడు. సైనికులు భయపడి పారిపోయారు. వచ్చినవాళ్ళ నందరినీ అలా సంహరించి, తరిమికొట్టి, లంకానగరంలో రాక్షసు లంతా గజగజలాడేట్లు సింహనాదం చేసి, ప్రాకారద్వారం తోరణం మీద కూర్చున్నాడు.

* * *

గొప్పసేన ఇలా ఓడిపోవడం, ఎంచి పంపిన అయిదుగురు సేనాధిపతులూ మరణించడం చూసి, రావణుడికి నిజంగా భయమే వేసింది.

"ఒంటరి అయిన ఈ వానరం ఇంతటి బలపరాక్రమాలతో నా వీరులను సంహరించడం, సామాన్య విషయం కాదు. ఇదేదో దేవతల కుట్రలాగా కనిపిస్తూంది" అని మనస్సులో చింతించాడు రావణుడు. అయినా, ఆ చింతను బైటికి తెలియనివ్వక, నవ్వుతూనే పరిహాసాలాడుతూ వచ్చాడు.

సభలో ఉన్న వారి నందరినీ రావణుడు కలయ జూశాడు. తన కుమారుడైన అక్షయుడు ఉత్సాహంతో ముందుకు వచ్చాడు. యుద్ధం చేయాలన్న కుతూహలంతో లేచిన తన వీరకుమారుణ్ణి చూసి, వెంటనే అతడ్ని హనుమంతుడి మీదికి పంపాడు.

బాలసూర్యుడిలాగ మెరుస్తున్న బంగారు రథం ఎక్కి, సకలాయుధ సముపేతుడై, అక్షయ కుమారుడు బయలుదేరాడు.

73. బంధితుడు

దేవతలతో సమానుడు, బాలవీరుడు, అయిన అక్షయ కుమారుడు ఎనిమిది గుర్రాలను పూన్చిన రథం ఎక్కి వెళ్లడాన్ని, వాల్మీకి కడు రమణీయంగా చిత్రించాడు. రామాయణంలో అడవుల అందాన్ని, వీరుల అద్భుత యుద్ధాన్ని, యుద్ధవేగాన్ని గురించి వాల్మీకి మహర్షి చేసిన వర్ణనను అనువదించి చూపడం సాధ్యంకాదు. అడవి కడు

రమణీయంగా ఉందనీ, యుద్ధం మహాఘోరంగా జరిగిందనీ మాత్రమే చెప్పడానికి నాకు వీలవుతుంది. మహర్షి చిత్రణలో వస్తుసౌందర్యానికి తగిన మధుర శబ్దాలూ, యుద్ధాన్ని ధ్వనించి, చూపగల గంభీర నాదంగల శబ్దాలూ, అడవిలాగ, గుట్టలలాగ, శబ్దాలు ఒక దానిపైన ఒకటి గుంపుగా పడి, మనోహరమైన శైలిలో ఉంటుంది. యుద్ధంలో ఇరువాగులవారి ఓడుపులనూ అద్భుత గంభీర శైలిలో వర్ణించడం వాల్మీకి మహర్షి ప్రత్యేకత. రావణుడి ప్రియపుత్రుడైన అక్షయ కుమారుడికీ హనుమంతుడికీ జరిగిన యుద్ధాన్ని వివరించే విపుల వర్ణనను నేను అనువదించి చెప్పడం సాధ్యంకాని పని.

తపస్సుచేసి సంపాదించిన బంగారురథ మెక్కి రావణ కుమారుడు బయలుదేరాడు. రాతి తోరణంమీద నిర్భయంగా గంభీరంగా కూర్చున్న హనుమంతుణ్ణి చూశాడు. కాలాగ్నిలాగా జ్వలిస్తూ నిలబడిన అతడ్ని చూసి "ఈ పగవాడు నాకు సరైన ఉజ్జీ" అని అక్షయ కుమారుడు మనస్సులో అనుకున్నాడు. అలా అనుకుని తన శౌర్యాన్ని పెంచుకున్నాడు

ఆ బాలవీరుడు వాడి అయిన మూడు అమ్ములు విడిచాడు. అవి హనుమంతుడికి తగలగా, నెత్తురోడింది. నెత్తురోడిన కొద్దీ హనుమంతుడి శౌర్యం ఎక్కువవుతూ వచ్చింది. ముఖకాంతి ప్రజ్వలించింది. అక్షయ కుమారుడి శౌర్యం హనుమంతుడికీ అద్భుత మనిపించింది.

ఇరువురికీ ఘోరయుద్ధం జరిగింది. బాణాలు మేఘాలు కమ్మినట్లు ఆకాశానికి లేచి మారుతిని కప్పాయి. పర్వతంమీద వర్షం కురిసినట్లు, గండశిలవంటి హనుమంతుడి దేహం మీద బాణాలవర్షం కురిసింది. హనుమంతుడు ఆకాశానికి పోయి, ఆ బాణాల మధ్య నుంచి చిత్రంగా తప్పించుకుంటూ, అక్షయ కుమారుడ్ని కొట్టాడు. మేఘసమూహాన్ని పెనుగాలి చెదరగొట్టినట్లు, మారుతి ఆ బాణాలను చిత్రగతుల తప్పించుకుంటూ, చెదరగొట్టి వేశాడు. అక్షయ కుమారుడి శౌర్యసామర్థ్యాలనూ, సహన సావధానతలనూ చూసి, "అయ్యో, ఇటువంటి పసివాడిని చంపవలసి వచ్చిందే!" అని హనుమంతుడు విచారించాడు. చాలాసేపు యుద్ధాన్ని వినోదంగానే, సాగించాడు.

• •

రాక్షసుడి బలం పోను పోను, పెరగసాగింది. హనుమంతుడు మనస్సు గట్టి చేసుకున్నాడు. రాక్షసుడ్ని సంహరించక తప్పదని నిశ్చయించు కున్నాడు.

మొదట అక్షయుడి రథాన్ని విరిచెయ్యాలని అనుకుని దానిమీదికి ఎంతో లాఘవంతో లంఘించాడు. రథం నుగ్గునూచం అయిపోయింది. ఇరుసు విరిగింది. గూడు తిరగబడింది. గుర్రాలు చచ్చాయి. రాజకుమారుడు నేలను నిలిచాడు.

రాక్షస కుమారుడు అప్పటికీ జంకలేదు. విల్లమ్ములూ, కత్తీ, పట్టి ఆకాశానికి వెళ్లాడు. అలా ఎగసి, హనుమంతుణ్ణి కొట్టాడు. ఆకాశంలో ఇరువురికీ పోరు ఘోరంగా సాగింది. చివరకు అక్షయ కుమారుడి ఎముకలన్నీ విరిగి ముక్కలై వాడు, కూలిపోయాడు.

* * *

అక్షయకుమారుడు వానరుడి చేతిలో మరణించాడని వినగానే, రావణుడి హృదయం కంపించిపోయింది. ఆ రోషాన్ని అణచుకుని, మనస్సు నిలకడ చేసుకున్నాడు. ఇంద్రుడితో సమానుడైన తన కుమారుడు ఇంద్రజిత్తును పిలిచాడు.

"శస్త్రాస్త్ర ప్రయోగాలన్నీ చక్కగా నేర్చినవాడవు. దేవాసురులను యుద్ధాన జయించావు పితామహుని పూజించి, ఆయనవల్ల బ్రహ్మాస్త్రాన్ని పొందావు. లోకంలో నిన్నెదిరించి నిలువగల వా రెవ్వరూ లేరు. నువ్వు అలసట అన్నదే ఎరగవు. జ్ఞానంలోనా, శ్రేష్ఠుడవు. తపస్సు చేసి అమోఘ శక్తులు పొందిన వాడవు. నీకు అలవికానిది ఏదీ లేదుకదా. ఏ కార్యాన్ని అయినా చక్కగా యోచించి చేయడంలో నీకు సాటి ఎవరూ లేరు. నేను పంపిన కింకరులు, ప్రహస్త కుమారుడు జంబుమాలి, అయిదుగురు సేనాధిపతులు, నీ తమ్ముడు అక్షయుడు-ఇంతమందీ ఆ హనుమంతుడనే వానరుడితో పోరి, మరణించారు. ఇక ఈ శత్రువును జయించి బంధించగల శక్తి సామర్థ్యాలు గలవాడవు నీవొక్కడివే. సేనాబలంతో ఇతడ్ని జయించడం సాధ్యంకాదు; బాహాబాహీ యుద్ధమూ పనికిరాదు. ఏం చేయాలో బాగా ఆలోచించి, నువ్వు ఇతడ్ని ఎదిరించి, విజయంతో తిరిగి రా! తపస్సుచేసి నువ్వు

సాధించిన అస్త్రమే ఈ సమయంలో ఉపయోగపడుతుంది. నీ బుద్ధి చెదరనీయకుండా నిలిపి, యుద్ధం చెయ్యి. విజయంతో తిరిగి వస్తావు" అన్నాడు.

* * *

తండ్రి మాటలకు తల ఊపి, దివ్య ప్రభావాలుగల ఇంద్రజిత్తు తండ్రికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, ఆయన ఆశీస్సులనంది, ధైర్యోత్సాహాలతో అశోకవనానికి బయలు దేరాడు.

ధగధగ మెరిసే కోరలుగల నాలుగు సింహాలను పూన్చిన రథమెక్కి, ధనుష్టంకారం చేస్తూ, హనుమంతుడున్న చోటికి వెళ్లాడు. అతడి రథం పెనుగాలి లాగా రొద పెట్టింది. తామర రేకులవంటి వెడల్పాటి అతడి కన్నులలో విజయకాంక్షలు తొణికిసలాడాయి.

రాక్షసేంద్ర కుమారుడి రథం తనవైపు వడివడిగా రావడంచూసి, హనుమంతుడు చాలా ఆనందించాడు యుద్ధంలో ఆరితేరిన ఇంద్రజిత్తు విల్లు వంచి, వాడిగల బాణాలతో సిద్ధంగా ఉన్నాడు.

వా రిరువురికీ గొప్ప యుద్ధం జరుగుతుందని తెలిసి, నాగులు, యక్షులు, సిద్ధులు ఆకాశంలో సమావేశమయ్యారు.

ఇంద్రజిత్తును చూడగానే హనుమంతుడు సింహనాదం చేస్తూ, తన శరీరాన్ని బాగా పెంచాడు. రాక్షసవీరుడు మాట్లాడకుండానే బాణాలను ప్రయోగించాడు. దేవాసుర యుద్ధ సమయంలో లాగా బాణవర్షం కురిపించాడు.

హనుమంతుడు ఆకాశానికిపోయి, అద్భుత వేగంతో చిత్ర విచిత్ర గతులతో తిరుగాడుతూ, మెరపుల్లాగా వస్తున్న ఆ బాణాలనుంచి తప్పించుకున్నాడు. రాక్షస పక్షాన వెలువడిన భేరీ ధ్వంకారానికీ, ధనుష్టంకారానికీ సమానంగా హనుమంతుడు, సింహనాదాలతో దిక్కులు పెక్కటిల్ల జేశాడు. ఇలా ఆ ఇరువురు వీరుల మధ్యా యుద్ధం చూపరులకు ఆశ్చర్యం కలిగించింది. ఆ ఇద్దరి శక్తి సామర్థ్యాలూ సమానంగానే కనబడుతున్నాయి.

• •

ఎన్ని బాణాలు తగిలినా, హనుమంతుడి శక్తి కుంటుపడలేదు. అది చూసి ఇంద్రజిత్తు "ఈ వానరం నా బాణాలకు లొంగనే లేదు. నా బాణాలు ఇతడ్ని గాయపరచినట్లే లేదే. నా తండ్రి చెప్పిన మాట నిజం. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి దాంతోనే ఇతడ్ని కట్టివేయాలి"అని నిర్ణయించుకున్నాడు.

అనుకున్నట్టుగానే, రాక్షస కుమారుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది వానర వీరుడికి సోకగానే అతడు కట్టుపడి, నిశ్చేష్టుడై పోయాడు

"ఓహో! పితామహుడి అస్త్రమా? దానికి నేను కట్టుపడ్డానా?" అని మారుతి వెంటనే గ్రహించాడు.

మారుతి కూడా బ్రహ్మ వరాన్ని పొందినవాడే. ఈ సమయంలో ఆ సంగతి గుర్తు తెచ్చుకున్నాడు. "ఒక్క ముహూర్త కాలమే ఇది నన్ను బంధిస్తుంది. అంతకుమించి, దీనివల్ల నాకు మరే ఆపదా రాదు. ఇలా నేను కట్టుబడిన కాలంలో, రాక్షసులు నన్నేం చేయబోతారో చూస్తాను. దూతలాగా వచ్చిన నా కార్యం ఒకవేళ దీనివల్ల పూర్తి కావచ్చు" అని ఆలోచించాడు. పితామహుడు తనకు 'చిరంజీవి కమ్మ'ని వర మిచ్చినప్పుడు ఆయన ఆజ్ఞాపించినట్లు, బ్రహ్మాస్త్రానికి లొంగి, నిశ్చేష్టుడై ధైర్యంగా నేలపై పడి ఉన్నాడు.

హనుమంతుడు నిశ్చేష్టుడై కింద పడడం చూసి, అంతవరకు భయంతో దూరంగా నిలిచిన రాక్షసులంతా వచ్చి అతడి చుట్టూ మూగేశారు. మారుతిని నోటికి వచ్చినట్లల్లా తిట్టి, కేకలువేస్తూ, తమ రాజకుమారుడ్ని పొగడుతూ నృత్యం చేశారు.

"ముక్కలు ముక్కలుగా కోయండి. తినివేయండి. రావణుడి వద్దకు ఈడ్చుకు పదండి" అంటూ వారు ఎన్నో విధాల అరిచారు.

తర్వాత కొందరు "ఇతడు తంత్రం చేస్తున్నాడు హఠాత్తుగా లేచి, మన మీదపడి కొడతాడు సుమా" అని భయపడి, జనపతాళ్లు, కొబ్బరితాళ్లు తెచ్చి, హనుమంతుణ్ణి చాపచుట్టగా కట్టివేశారు. "ఇంక భయం లేదు. కట్టివేశాం, రావణుడివద్దకు ఈడ్చుకు పోదాం రండి!" అని వాడు ఆనందంతో కేకలు పెట్టారు.

రాక్షసులు ఇలా చేస్తూ ఉంటే – వారిని అడ్డుపెడదామంటే అవకాశంలేవి ఇంద్రజిత్తు. చాలా చింతించాడు.

"అయ్యో! నేను చేసిం దంతా వ్యర్థమైపోయిందే. ఈ మూర్ఖులకు మంత్ర రహస్యం తెలియకపాయె. ఇలా తాళ్ళతో, మోకులతో, కట్టి వేయగానే బ్రహ్మాస్త్రం శక్తి పోనే పోతుంది. స్థూల వస్తువులతో కట్టినవెంటనే, మంత్రం కటు విడిపోతుంది. హనుమంతుడు ఈ తాళ్ళను ఒక్క క్షణంలో తెంపివేస్తాడు. తిరిగి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడానికా, వీల్లేదు" అని ఇంద్రజిత్తు కలవరంలో పడ్డాడు.

మారుతి తన పరిస్థితి అంతా తెలుసుకున్నాడు. బ్రహ్మాస్త్ర బంధం తొలగిపోయిందనీ. ఇక రజ్జు బంధనం మాత్రమే మిగిలిఉందనీ, ఆ బంధనాన్ని తన బలంతో ఒక్కక్షణంలో తెంపివెయ్య వచ్చుననీ, తెలుసుకున్నాడు. అయినా, తనను రాక్షసులు కట్టి ఈడ్చుకు వెళ్ళడమే మంచిదనుకున్నాడు. అలా అయితే, రావణుణ్ణి చూసి మాట్లాడడానికి అవకాశం దొరుకుతుంది. కనుక, వారు పెట్టే బాధ లన్నింటినీ సహిస్తూ, కావాలనే నిశ్చేష్టుడిలాగా పడి ఉన్నాడు. రాక్షసులు హనుమంతుణ్ణి కొట్టారు. తిట్టారు. రాక్షస స్త్రీలు, పామరులు, గేలి చేస్తూ ఉండగా వీధుల్లోంచి హనుమంతుణ్ణి ఈడ్చుకుంటూ తీసుకు పోయారు.

74. లంకా దహనం

బ్రహ్మాస్త్రంతో కట్టుబడిన హనుమంతుడు తన వర ప్రభావం తెలిసినవాడు గనుక, ఆ కట్టు విడివడేవరకూ మిన్నకుండాలని నిర్ణయించుకున్నాడు. రాక్షసులు తిట్టినా, కొట్టినా, అవమాన పరచినా, ఓర్పుతో ఊరుకున్నాడు.

రాక్షసులతణ్ణి తీసుకుపోయి, కొలువు కూటంలో రావణుడి ఎదట విలబెట్టారు. రావణుణ్ణి చూడగానే హనుమంతుడు తన బాధా, అవమానం, మరచాడు. సీతపట్ల అతడు చేసిన అక్రమాలు తలపునకు రాగానే, హనుమంతుడికి కోపం వచ్చేసింది. రావణుడు పట్టుపీతాం

బరం కట్టి, దివ్యాభరణాలు పెట్టి, కిరీటం ధరించి, కళ్లకు మిరుమిట్లు కొల్పుతున్నాడు. పసిడికాంతి, పట్టుబట్టల సొరు, వజ్ర వైఢూర్యాల శోభ, వీటితో కొలువుకూటం అంతా ధగధగ లాడుతూంది. సకల రాజలక్షణాలూ గల అతడి నల్లని మేను కాంతిపుంజాలు విరజిమ్మే ఒక పర్వతంలాగా ఉంది.

"ఆహా! ఈ మహాత్ముడే ధర్మం తప్పక సన్మార్గంలో ఉండి ఉంటే, ఇతడి విభవం ఎంతెలా ఉండేదో కదా! ఇంద్రుడు మొదలైన వారు కూడా ఇతడికి సాటి రాలేరు. ఏం రూపు! ఏం అందం! ఏం బలం! ఇంతటి వీరబలంతో దుష్కార్యాలకు దిగడంవల్ల కదా, ఇతడు తన భాగ్యాన్నీ, గొప్పతనాన్నీ పోగొట్టుకున్నాడు?" అని ఈ విధంగా హనుమంతుడిలో కోపం, ఆశ్చర్యం, జాలి, కలిసి ఆలోచన కల్పించిన సమయంలో, రావణుడు తన మంత్రులను చూసి ఇలా ఆజ్ఞాపించాడు:

"ఈ దుష్టు డెవడు? ఎక్కడనుంచి వచ్చాడు? ఇతడ్ని పంపిన వా రెవరు? ఈ లంకలో ఎందుకు ప్రవేశించాడు? నిజం చెప్ప మనండి."

రాజాజ్ఞ ప్రకారం మంత్రి ప్రహస్తుడు లేచి, హనుమంతుణ్ణి చూసి, "వానరా! భయపడకు! నిజం చెబితే బతికిపోతావు! నిన్ను ఇంద్రుడు పంపాడా? లేదా, నీవు కుబేరుడి మనిషివా? కాకపోతే మరెవరు పంపించినట్టు నిన్ను? నిజం చెబితే ని న్నేమీ చెయ్యం. నీవు ఎందుకు ఈ వేషం వేసి, ఇక్కడికి వచ్చావు? దాచకుండా చెప్పు" అన్నాడు.

ప్రహస్తుడు ఇలా మంచిమాటలతో అడిగేసరికి, హనుమంతుడు రావణుణ్ణి చూసి, బదులు చెప్పాడు:

"నన్ను ఇంద్రుడూ పంపలేదు, కుబేరుడూ పంపలేదు. రాక్షస రాజును చూడా లనిపించి వచ్చాను. చూడడానికి అవకాశం దొరకడం కోసమే ఉద్యానవనాన్ని నాశనం చేశాను. నన్ను చంపడానికి ఇతరులు మీదికి వచ్చారు. కనుక, వారిని వధించాను. వానర రాజైన సుగ్రీవుడి దూతగా ఇక్కడికి వచ్చాను. రాక్షసరాజా! నా రాజు తమను సహోదరుడుగా భావించి కుశల మడుగుతున్నారు. అయోధ్యాపతి

దశరథుడి కుమారుడు, యశోవంతుడు, అయిన రామచంద్రుడూ, వానరరాజూ సఖ్యం చేసుకొన్నారు. సుగ్రీవుడి శత్రువైన వాలిని రామచంద్రుడు సంహరించాడు. అయోధ్యాపతి కావలసిన రామచంద్రుడు పితృవాక్య పరిపాలనకోసం. దండకారణ్యంలో వనవాసం చేస్తున్న సమయంలో, ఒంటరిగా ఉన్న దేవి కానరాక పోయేసరికి ఆమెను వెతుకుతూ రామలక్ష్మణులు వచ్చారు. సుగ్రీవుడితో సఖ్యం చేసుకుని, ఆయన సహాయాన్ని కోరారు. భూలోకమంతా గాలించడానికి వానరరాజు తన అనుచరులను పంపాడు. లంకలో వెదకడానికని నేను వచ్చాను. సాధ్వి అయిన జానకిని నే నిక్కడ చూశాను. రాక్షసేశ్వరు లైన తమకు సోదరరాజు పంపిన దూతగా, నేను సవినయంగా మనవి చేస్తున్నాను. శ్రీరామచంద్రుడి మాటగా కూడా విన్నవిస్తున్నాను.

సీతాదేవిని అపహరించుకొని రావడం ధర్మవిరుద్ధ మని తమకే తెలుసు. ఇది తమ కులనాశనానికి కూడా కారణమవుతుంది. రఘువీరుడితోను, వానరులతోను, పగపెంచుకొని పాడై పోవద్దు. మర్యాదగా సీతను రఘువీరుడికి అప్పగించి, ఆయన శరణు పొందండి. సీత మీ వినాశనానికి వచ్చిన యముడని గుర్తించండి. విషాన్ని మధురాహారం అని భావించకండి. బుద్ధిమంతు లైనవారు ధర్మ విరుద్ధమైన కార్యాలలో చిక్కుకుని అపాయానికి పాల్పడరు. పరాయిస్త్రీని కోరడం అనే మహాపాపం దుంపనాశనం చేస్తుందని తమ పెరుగరా : తాము చేసిన తప స్సంతా ఈ పాపకార్యంవల్ల నశించిపోతూందే. తప్పుచేసి. గొప్పభాగ్యాన్ని చెరుచుకొన్నారు. ఇప్పుడు రాముణ్ణి శరణు పొందడం ఒక్కటే మీకు మిగిలివున్న మార్గం. రాముడితో విరోధించి తమ వంశనాశనాన్ని తెచ్చుకోవద్దు. తాము సంపాదించుకున్న వరాలలో ఒక్కటీ రఘువీరుడి దగ్గర పనికిరావు. ఎందుకు చెప్పానో, ఆలోచించండి. రానున్న విపత్తు తెలుసుకోండి. వానరరాజు దూతనైన నేను చెప్పినమాట ఆలకించి, సన్మార్గాన నడిచి, బతకండి. మీ సోదరు డైన సుగ్రీవుడి దూతగా, మీ మేలుకోరే ఈ మాటలు చెబుతున్నాను.''

• •

ధైర్యమే రూపొందిందా అన్నట్లున్న హనుమంతుడు రాక్షసుడికి విషతుల్యమైన ఈ ఉపదేశాన్ని స్పష్టమైన మాటల్లో చేశాడు. ఇది వినగానే రాక్షసుడికి కోపం తారాస్థాయికి అంటింది. కళ్లు జేవురించాయి.

రోషావేశంతో "ముందు ఇతడ్ని చంపి, ఆ తర్వాత మరొక పని చూడండి!" అని సేనలకు ఆజ్ఞాపించాడు.

సభలోవున్న విభీషణుడు లేచి, దూతను చంపడం ఉచితం కాదని విన్నవించాడు. "దూతను చంపరాదని రాజనీతిజ్ఞులంటారు. అందువల్ల ఈ పని చేయవద్దు. కాగా, దూతను వికలాంగుని చేయవచ్చు. కొరడాలతో కొట్టవచ్చు. వాతలు వేయవచ్చు. మరణదండన మాత్రం విధించడం తగదు" అని విభీషణుడు ఆలోచన చెప్పాడు.

"పాపకార్యం చేసినవాడ్ని చంపడంలో తప్పేముంది?" అని ప్రశ్నించాడు రావణుడు.

"అలాకాదు. ఇతడు ఏలాంటి తప్పిదంచేసినా అది ఇతరుల ప్రేరేపణ వల్లనే జరిగిందన్నమాట, అసలు వారిని విడిచిపెట్టి, కేవలం సాధనమాత్రుడుగా వచ్చిన దూతను, చారునిపట్టి చంపడంవల్ల ఫలిత మేమీలేదు. ఇతడ్ని ఎవరు పంపారో, వారిని శిక్షించడానికి మార్గం వెతకండి. వారిని దండించాలంటే వా రిక్కడికి వస్తారు. అప్పుడు గట్టిగా తగిన దండన చేయవచ్చు. ఇతడ్ని చంపివేస్తే, శత్రువులు ఇక్కడికి వచ్చేందుకు అవకాశమే ఉండదు. ఇతడు ప్రాణాలతో తిరిగిపోయి చెబితేనే, వారు వచ్చి, మనల్ని ముట్టడిస్తారు. అప్పుడు మన బలంవల్ల, వారు తగిన శిక్షను పొందుతారు. అలాంటి ఒక దూతను చంపడంలో కీర్తి ఏముంది? ప్రయోజన మేముంది? ఇందువల్ల రాజ ధర్మానికి హానిచేయడం ఒక్కటే మిగిలేది. అంతే" అని విభీషణుడు వినయంగా మనవిచేశాడు.

ఈ ఆలోచనను రావణుడు అంగీకరించాడు. "సరే! వానరానికి మిక్కిలి ఇష్టమైంది దాని తోక కదా. ఆ తోక కాల్చి దాన్ని కొట్టితరిమివేయండి" అని ఆజ్ఞాపించాడు.

రావణేశ్వరు డలా అన్నాడో, లేదో, సేవకులు హనుమంతుణ్ని బైటికి తీసుకుపోయారు. పాతబట్టలు తెచ్చి, తోకకు బాగా చుట్టారు. బట్టలు చుట్టినకొద్దీ తోక పెరుగుతూ వచ్చింది. తోక పెరిగినకొద్దీ దొరికిన పాతబట్టలెల్లా తెచ్చి, వాళ్ళు చుడుతూనే వచ్చారు; చివరకు ఆ బట్టలు నూనెతో తడిపి, నిప్పంటించారు. తోకంతా భగభగ మండింది. అలా తోక మండుతూ ఉండగా, తాళ్ళతో కట్టిన హనుమంతుణ్ని లంకాపుర వీధుల్లో ఊరేగించారు.

"ఇడుగో! మన నగరానికి వచ్చిన దొంగ!" అని స్త్రీలూ పిల్లలూ అంతా వచ్చి, చూసి గేలి చేసి, సంతోషించేలాగ, రాక్షసులు తప్పెటలు తాళాలతో హనుమంతుణ్ని వీధివీధికీ తిప్పారు.

అశోక వనంలో రాక్షసస్త్రీలు సీతతో ఇలా చెప్పారు: "నీతో మాట్లాడిందే, ఆ దొంగకోతి! దాని గతి ఏమయిందో తెలుసా? తోకకు నూనెగుడ్డలు చుట్టి, నిప్పు అంటించారు. తోక కాలుతోం దిప్పుడు. దాన్ని ఈడ్చుకుపోయి, నగరమంతా ఊరేగిస్తున్నారు" అని సీతను పరిహసించారు.

అప్పుడు సీత అగ్ని రగిల్చింది. "ఓ అగ్నిదేవా! నేను చేసిన పుణ్యం ఏ మాత్రమైనా ఉంటే, నేను పతివ్రతనే అయితే, హనుమంతుడి పాలిట నీవు చల్లబడిపో!" అని ప్రార్థించింది.

హనుమంతుడు భిట్లు, తన్నులు, అవమానాలు అక్రమాలు అన్నీ ఓర్చుకుని, వీధివీధి చూసుకుంటూ వెళ్ళాడు. వీధుల్లో, సందుల్లో స్త్రీలూ, పిల్లలూ ఈ వేడుక చూడాలనీ, రాక్షసులు అన్ని మూలల్లా మారుతిని తిప్పారు. అతడు మారుమాటాడకుండా, వారి వెంటపోయి, నగరం ఆనుపానులను, కోట అట్టుముట్టు ఆనవాళ్లను చక్కగా గ్రహించాడు. తన యజమానికి ఈ రహస్యమంతా ఉపయోగపడుతుందికదా అని తలచి, ఓరిమితో అన్నీ చూస్తూ వెళ్ళాడు.

"ఇదేంటి ఈ ఆశ్చర్యం! నూనెగుడ్డలుమాత్రం మండుతున్నాయే కాని, నా తోకకు నిప్పు వేడి తగలడమేలేదే. మంటలు చల్లగా ఉన్నాయేం చెప్మా? రామకార్యానికి పంచభూతాలూ తోడ్పడుతున్నా

యనడానికి ఇది గురుతా? సముద్ర మధ్యాన పర్వతం పైకి లేచి, నాకు ఆదరసత్కారాలు చేయలేదా? అలాగే, అగ్నిదేవుడు కూడా ఇప్పుడు నాకు బాధ కలక్కుండా చల్లబడి పోయినట్లు తోస్తూంది. లేక, నా తండ్రి అయిన వాయుదేవుడి స్నేహాన్ని బట్టి నన్ను కాల్చకుండా చల్లబడి ఉన్నాడేమో! ఏమయినా, ఈ అదను జారవిడవరాదు. ఈ దుష్టులకు తగినంత భయం కలిగించి మరీ వెళ్ళాలి. ఇందుకు కావలసిన అవకాశం దానంతట అదే వచ్చింది" అని హనుమంతుడు ఆలోచించసాగాడు.

వెంటనే శరీరం ముడుచుకుని కట్లన్నీ ఒక్కసారి విదిలించివేశాడు. తిరిగి విశ్వరూపం ధరించి, మండుతున్న తోకతో, పైకి ఎగసి వెళ్ళి ఒక పెద్ద భవనంమీద నిలిచాడు. ఒక స్తంభాన్ని పెకలించి, అందరూ గజగజలాడేటట్లు దాన్ని గిరగిరా తిప్పాడు.

ఒక యింటిమీదినుంచి మరొక యింటిమీదికి దూకుతూ, ఒక్కొక యింటికే నిప్పు పెడుతూ వచ్చాడు. గాలికూడా హనుమంతుడికి అనుకూలంగా వీచి, కొద్దిసేపట్లోనే నగరమంతా జ్వాలాతోరణ మయింది. ఆకాశం యెత్తు మంటలు పైకి లేచాయి. స్త్రీలూ శిశువులూ, కుయ్యో మొర్రో అంటూ గోలగోల పెట్టారు.

ఈ కోతియము డని కొందరు, కాదు-అగ్నిదేవు డని మరికొందరు ఇలా నలుగురూ నాలుగువిధాల రోదనంచేస్తూ, ఆ రాక్షసులు, కాలుతున్న ఇళ్ళలోంచి తప్పించుకుని, పరుగులు పెట్టారు.

తను పడిన హింసలు తలపునకు వచ్చి, కాలుతున్న ఆ లంకను చూసి హనుమంతుడు ఆనందించాడు. త్రికూట పర్వతంమీద బాగా ఎత్తయిన చోట నిలిచి అగ్నికి ఆహుతి అవుతున్న లంకను చూసి సంతృప్తి చెందాడు. తరువాత తోక సముద్రంలో ముంచి, మంటలు చల్లార్చుకున్నాడు.

* * *

"అయ్యో! నేను చేసిన పనేంటి! కోపంలో మతి పోగొట్టుకున్నానే. నాకు ఎంత బలం ఉండి ఏం లాభం? ఎంత సామర్థ్య

మున్నా, ఎంత ఐశ్వర్యమున్నా, కోపాన్ని అణచుకోవడం ఎలాగో తెలిసినప్పుడు కదా సార్థకం? ఈ పెనుమంటలలో పడి, సీత కూడా మరణించిందేమో! అంతా సర్వనాశనం అయింది. నేను కోపం ఆగక చేసిన పని కొంపతీసింది. అయ్యో ! నా వంటి మూఢుడు మరెక్కడన్నా ఉంటాడా? నా వంటి పాపి ఉండబోడు. రాక్షసుల మీది కోపంతో సీతనే చంపుకున్నానే? ఇక నా కొక్కటే మార్గం. ఇక్కడే ప్రాణం విడిచి ఈ జీవితాన్నీ, ఈ సిగ్గునూ, అంతం చేసుకోవాలి'' అని హనుమంతుడు భరించలేని సందిగ్ధంలో మునిగాడు.

అప్పుడు ఆకాశాన ఎవరో మాట్లాడడం వినిపించింది. లంకా నగరం తగలబడడం చూసిన సిద్ధ చారణ యక్ష దేవగణాలు ఆకాశంలో "ఆహా ! ఏం అద్భుతకార్యం ! హనుమంతుడి పరాక్రమం వర్ణిల్లగాక ! సీత ఉన్నచోట తప్ప, మిగతా లంకానగరమంతా, నిప్పటుకుని కాలుతూంది !" అని ప్రశంసిస్తూ ఆనందంతో మాట్లాడుకున్నారు.

"సీత ఉన్నచోట తప్ప..." అన్నమాట హనుమంతుడి చెవిని పడే సరికల్లా "ఓ! బతికిపోయాను! నా ప్రాణాన్ని కాపాడింది, సీతే కదా? ఆమె పుణ్యం వల్లనేకదా. నిప్పు నా తోకను కాల్చకుండా చల్లబడింది? పతివ్రతలను అగ్ని ఎలా అంటగలడు? అగ్నిని అగ్ని ఏం చెయ్యగలదు? నేను పెట్టిన అగ్ని సీత దరిదాపులకే వెళ్ళలేదు. అగ్నిదేవుడు మాకు తోడ్పడాడు. ఇది రామకార్యం కదా? సముద్రరాజు, మైనాక పర్వతం తోడ్పడలేదా?" అని తలచి హనుమంతుడు వెంటనే అశోకవనానికి బయలుదేరాడు.

శింశుప వృక్షంకింద సురక్షితంగా కూర్చున్న సీతనుచూసి ఆనందంతో నమస్కరించాడు. "తల్లీ ! తమరు క్షేమంగా ఉండడం చూశాను. ఇదంతా తమ బలమూ, నా భాగ్యం. ఇక నేను పోయి వస్తాను" అన్నాడు హనుమంతుడు. అందుకు జానకి "నీవోయి నిజమైన వీరుడవు! నీకు అలవికాని పని యేముంది ? నా నాథుడు శీఘ్రంగా వచ్చి రాక్షసులను కూల్చి నన్ను చేపట్టేటట్లు చెయ్యి. నువ్వొక్కడివే ఈ పని చేయగలవు'' అంది.

• •

"సుగ్రీవుడు కోటాది వానరసేనతోను, వీరులైన రామలక్ష్మణులతోను, ఇక్కడికి వస్తాడు. రావణుడు, అతడి పరివారమూ నశిస్తారు. రఘునందనుడు మీతో అయోధ్యకు తిరిగి వెళతాడు. దుఃఖించకండి. మీకు మంగళమగునుగాక! శీఘ్రంగా వారు రాగలరనే నిశ్చయంతో ఉందురుగాక!"

అని ఆమెను ఊరడించి, అనుజ్ఞ పొంది, హనుమంతుడు బయలుదేరాడు. సముద్రతీరాన అరిష్టమనే సుందరమైన పర్వతాన్ని ఎక్కి కుప్పించి ఆకాశానికి ఎగిరాడు.

దారిలో మైనాకపర్వతం హనుమంతుడి రాకకు ఎదురుచూస్తూ నిలిచి వుంది. దాన్ని మృదువుగా నిమిరి పిల్లనుంచి చూసుకున్న బాణంలాగ కడువేగంతో ముందుకు సాగాడు. మహేంద్ర పర్వత శిఖరం కనిపించగానే అపతల ఒడ్డుకు చేరినటు తెలుసుకొని, సింహనాదం చేశాడు. ఆకాశంలో గరుడుడిలాగా ఎగురుతూవస్తున్న హనుమంతుణ్ని చూసి వానరులు "వచ్చేశాడు, వచ్చేశాడు" అని కోలాహలం చేశారు. అంతవరకు విచారంతో కంట తడిపెట్టి ఉన్న వానరులంతా, పట్టరాని ఆనందంతో లేచి, గంతులు వేశారు.

జాంబవంతుడు హనుమంతుణ్ని చూసి, "విజయంతోనే తిరిగి వస్తున్నాడు. లేకపోతే ఇలా గర్జించడు" అన్నాడు. అందరూ గుట్టలూ చెట్లూ ఎక్కి ఆకాశంలో హనుమంతుడి రాకను ఆనందంతో చూస్తూ నిలబడ్డారు.

కొండలూ చెట్లూ వానరులతో నిండి, కిటకిట లాడుతున్న ఆ దృశ్యాన్ని హనుమంతుడు ఆకాశంనుంచి చూశాడు. ఆ వానరుల కోలాహలం మధ్య మారుతి మహేంద్ర పర్వతంమీద దిగాడు.

75. వానరుల కోలాహలం

హనుమంతుణ్ని చూసి వానరులంతా ఆనందంతో మహేంద్ర పర్వతం మీదికి చేరారు. వృద్ధ జాంబవంతుడు వాయుపుత్రుడికి ప్రేమతో స్వాగతం పలికాడు. "సంగతి అంతా మాకు విశదంగా చెప్పు. అంతా విని

ఆనందిస్తాం. దేవిని ఎలా చూశావు? అప్పుడు ఏం జరిగింది? ఆమె ఎలా ఉంది? ఆమె శరీర స్థితిని గురించీ, మానసిక స్థితిని గురించీ, చెప్పు. రావణుడి ప్రవర్తన ఎలా ఉంది? ప్రియ ఆంజనేయా! అన్ని విషయాలనూ ఉన్నదున్నట్లు మాకు చెప్పు. ఆ పైన మనం ఏం చేయాలో ఆలోచించుదాం" అన్నాడు.

హనుమంతుడు మనస్సులో సీతను ధ్యానించి, నమస్కరించి, సంగతి సందర్భాలన్నీ వానరులకు వివరించ నారంభించాడు.

"మహేంద్ర పర్వతం నుంచి నేను ఆకాశానికి ఎగిరిన సంగతి మీకు తెలుసుకదా? అలా ఎగిరి సముద్రాన్ని దాటడానికి ఆకాశంలో వెళుతూ ఉండగా, ఉన్నట్టుండి సముద్ర మధ్యాన ఒక పర్వతం పైకి లేచింది. ఓహో! ఇదేదో లేచి, నా దారి అడ్డగిస్తూందే అనుకున్నాను. దాన్ని పగులగొట్టి పారవేయాలని నిశ్చయించుకున్నాను. స్వర్ణమయమైన ఆ పర్వతాన్ని నా తోకతో కొట్టాను. ఆ దెబ్బను పర్వతం వినయంగా స్వీకరించింది. అతి మధురమైన స్వరంతో 'కుమారా! నేను నీకు శత్రువునుకాను. నీ తండ్రివల్ల మేలు పొందిన కృతజ్ఞుడను. నన్ను చంపడానికి వచ్చిన ఇంద్రుడి వజ్రాయుధం బారినుండి నీ తండ్రి వాయుదేవుడి సహాయంవల్ల తప్పించుకుని ఎగిరి ఈ సముద్రంలో తల దాచుకుంటున్నాను. పూర్వం పర్వతాలకు రెక్కలుండేవి. అవి ఆకాశంలో సంచరిస్తూ లోకాన్ని గజగజలాడిస్తూ ఉండేవి. అప్పుడు ఇంద్రుడు లోకభయాన్ని పోగొట్టడం కోసం పర్వతాలను తరిమి తరిమి వాటి రెక్కలను తెగనరికాడు. అప్పుడు వాయుదేవుడు నాకు చేసిన సాయంవల్ల కదా నేను రెక్కలతో ఎగిరి ఈ సముద్రంలో దాక్కోగలిగాను? ఆ సహాయాన్ని నేను మరచి పోలేదు. నీవు ఆకాశంలో ఎగిరి ఎవరికీ వీలుకాని పనిని సాధిస్తున్నావు. నీవు శ్రమ తీసుకోడానికి వీలుగా వచ్చి నిలబడి ఉన్నాను. నా మీద కొంతసేపు విశ్రమించి, నేద దీర్చుకొని ఆ తర్వాత రామకార్య నిర్వాహణకు బయలుదేరు' అన్నాడు. ఆ ఉపకారాన్ని పొందడానికి అవకాశం లేదని చెప్పి, ఆ పర్వతంవద్ద ఆజ్ఞ తీసుకొని ఆగకుండా బయలుదేరాను."

• •

అని ఇలా సముద్రాన్ని దాటేటప్పుడు జరిగిన సంగతులన్నీ పూస గుచ్చినట్లు చెప్పాడు. లంకానగరంలో అడుగు పెట్టినప్పుడు జరిగిన ఘటనలూ, నగరంలోను, రావణుడి నగరులోను వెతకగా సీత కనబడిన సంగతీ, తర్వాత అశోక వనానికి వెళ్ళి సీతను చూసిన విషయమూ, రావణుడు వచ్చి సీతను ప్రార్థేయ పడడమూ, సీత అతడ్ని తుచ్ఛంగా చూసి మాట్లాడడమూ, రాక్షసులు సీతను బెదిరించడమూ, సీత ప్రాణాలు వదలటానికి నిశ్చయించడమూ, తర్వాత సీతతో తాను మాట్లాడడమూ, రాముడి సంగతి చెప్పడమూ మొదలైన అన్ని విషయాలనూ హనుమంతుడు వివరంగా వానరులకు చెప్పాడు.

* * *

ఇలాంటి ఘట్టాలు వచ్చినప్పుడు వాల్మీకి రామాయణంలో మన కొక విశేషం కనిపిస్తుంది. పూర్వ సంఘటనలను తిరిగి ఏదైనా ఒక పాత్రద్వారా చెప్పవలసి వచ్చినప్పుడు వాల్మీకి జంకూ గొంకూ లేకుండా అన్ని సంఘటనలనూ ఎంతో రమణీయంగా వర్ణిస్తాడు. పారాయణం చేసే వారికి ఇది ఎంతో ఆనందం కలిగిస్తుంది. విస్తారమైన ఈ కావ్యంలో ఇటొక ప్రత్యేకమైన సొంపు. అలాగే నే నిక్కడ హనుమంతుడు చెప్పిందంతా తెలుగులో చెప్పడం బాగుండదు. అదంతా చాటభారత మవుతుంది. పాఠకులు చదివిందే చదవవలసి వస్తుంది. అది ఈ కాలంవారికి రుచించదు.

ఏదైనా అపాయం తొలగాలన్నా, అనుకున్న పని విజయవంతంగా ముగియాలన్నా సుందరకాండ పారాయణం చేయడం మనకు అలవాటు. సముద్రాన్ని దాటివచ్చిం తర్వాత హనుమంతుడు వివరించి చెప్పే ఈ అధ్యాయాన్ని పారాయణ చేస్తే సుందరకాండ అంతా పారాయణ చేసినంత ఫలితం వస్తుంది.

* * *

జరిగిన సంఘటన లన్నీ పూసగుచ్చినట్టు వివరంగా చెప్పిన తర్వాత హనుమంతుడు ఇలా అన్నాడు :

"మన ప్రయత్నం ఇలా శుభదాయకంగా ముగిసింది. అయితే సీత శీలమూ, శక్తీ దీనికంతా ముఖ్యమైన బలం అని తెలుసుకోవాలి. ఆ పతివ్రత పాదాలకు నే నింకా మనస్సులో నమస్కరిస్తూనే ఉన్నాను. సీతను తలచుకున్నప్పుడల్లా ఆమెను ఈ రాక్షసుడు ఎలా అపహరించుకొని పోగలిగాడు? అత డాతక్షణమే భస్మమైపోయి ఉండాలి గదా! అని ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది. అయితే రావణుడి తపోబలం కూడా చాలా గొప్పదే. అదింకా అతడ్ని రక్షిస్తూంది. అయినా సీత తలుచుకుంటే అతడ్ని భస్మం చేసి వుండేది. తన భర్త రామచంద్రుడి చేతుల్లోనే అతడు శిక్ష పొందవలసి ఉందని సహించి ఊరుకుంది. ఇప్పుడు మీ ఆలోచన ఏమిటి? మనం ఇప్పుడే లంకకు వెళ్లి రావణుణ్ణి వధించి రాక్షస సమూహాన్ని నాశనం చేసి సీతను తీసుకువచ్చి రాముడికి సమర్పించి ఆయనను సంతోష పెట్టడమా? దీన్ని గురించి మీరు ఆలోచించాలి.

ఈ పని చేయడానికి తగిన శక్తి మనకు లేకపోలేదు. ఆ రాక్షసి మూకను నే నొక్కడనే నామరూపాలు లేకుండా నాశనం చేయగలను. నేనుకూడా ఎందుకు?- ఆ రాక్షస సేన నంతనూ నాశనం చేయడానికి జాంబవంతు డొక్కడే చాలు. వాళ్ళని నిశ్శేషంగా చంపటానికి కిష్కింధ యువరాజయిన వాలి కొడుకు ఒక్కడూ చాలడా? రావణుడితో సహా లంకను నిర్మూలించి తిరిగి రావడానికి పవనసుడు, నీలుడు వీళ్ళిద్దరి పరాక్రమమే చాలు. అశ్వినీ కుమారులైన మైందుడూ, విందుడూ ఈ ఇద్దరు మాత్రమే వెళ్లి ఈ కార్యాన్ని అవలీలగా సాధించి తిరిగి రాగలరు. పితామహుడి వరాలు పొందిన వీళ్ళు అతి తేలికగా రావణుణ్ణి చంపి విజయనాదాలు చేస్తూ తిరిగి రాగలరు.

రావణుణ్ణీ, అతడి రాకాసి మూకనీ కడతేర్చగల సమర్థులు మనలో బోలెడుమంది ఉన్నారు. 'రామదూతను నేను సుగ్రీవుడి మంత్రిని. మిమ్మల్ని మింగడానికి వచ్చాను' అని లంకలో సింహనాదాలతో ఘోషణ చేశాను. దురాత్ముడైన రావణుడి ఉద్యానవనంలో రాక్షస స్త్రీల మధ్య చెరబడివుంది. పతివ్రతామతల్లి అయిన.

వైదేహి. ఆ చెరలో పడి మేఘాలు కమ్ముకుని, కనిపించని చంద్రరేఖ లాగ ఉంది. రాముడి రాక ఎప్పుడా అని ఎదురుచూస్తూ ఆయన తప్ప అన్యధ్యానం లేకుండా వాడి, మాడి తపస్సు చేస్తూంది. క్రూర రాక్షసులు ఆమెను బాధించడం కళ్ళారా చూశాను. అడవిలో చిక్కిన పడిన జింకలాగ ఆ వనంలో అనాకారులైన రాక్షసస్త్రీల మధ్య చిక్కుకుని దుఃఖిస్తూంది. ఆమెను ప్రత్యక్షంగా చూసి మాటాడి ఓదార్చాను. 'రామ లక్ష్మణులు వచ్చేస్తారు. రావణుణ్ణి వధిస్తారు' అని ఊరడించాను. ఇక కర్తవ్యం ఏమిటో నిర్ణయించండి" అన్నాడు హనుమంతుడు.

అది వింటూ ఉన్న అంగదుడు కోపంతో చెంగున ఎగిరి లేచి "అసలు నే నొక్కడినే చాలు. అలాంటిది మనం ఇంతమంది వీరులమున్నామే!- ఇన్నాళ్ళ తర్వాత మనం సీతను తేకుండా రాముడి వద్దకు వట్టి చేతులూపుకుంటూ వెళ్ళడమా?- అలా వీల్లేదు. లంకకువెళ్ళి రాక్షస సేననూ రావణుణ్ణి చంపి సీతను తీసుకుని కిష్కింధకు మర్లుదాం" అన్నాడు.

యువరాజు మాటలు విని జాంబవంతుడు మెల్లగా ఇలా అన్నాడు :

"అలాక్కాదు. వానర రాజకుమారా! మనం ముందు రామలక్ష్మణులకు విషయమంతా చెప్పి ఆ తర్వాత వారు చెప్పినట్లు చేదాం. రామ కార్యాన్ని ఆయన కోరిక ప్రకారమే చేయాలి. అదే మంచి పద్ధతి." అని చెప్పాడు, గొప్ప అనుభవశాలి జాంబవంతుడు.

ఈ ఆలోచన సరి ఐందేనని అంగదుడూ, హనుమంతుడూ, తక్కిన వానరులూ అంతా అంగీకరించారు. వాళ్ళంతా అక్కడ్నించి ఆకాశానికి ఎగిరి వాయువేగంతో కిష్కింధకు బయలుదేరారు.

* * *

వాళ్ళంతా వానరరాజు ఉద్యానం అయిన మధువనం దగ్గర దిగారు. ఆ వనంలో ప్రవేశించి తేనె తాగారు. పళ్ళు తిన్నారు. కావలివాళ్ళు అడ్డువస్తే వాళ్ళని బాగా తన్ని తరిమివేశారు. ఇష్టం వచ్చినట్లు ఎగిరి

గంతులువేసి తోటను కూడా పాడు చేశారు. మధువనానికి రక్షకుడు దధిముఖుడు. అత డీకోలహలమూ, అట్టహాసమూ చూసి చేయగలిగింది లేక గబగబ వానరరాజు సమ్ముఖానికి వెళ్ళి మధువనమంతా పాడై పోయిందని విన్నవించాడు. "దక్షిణదిక్కుగా వెళ్ళి తిరిగి వచ్చిన వానరులు అక్కడ దిగి అల్లరి చేస్తున్నారు. నేను ఎంత చెప్పినా వినడం లేదు సరికదా నన్ను చావగొట్టి అవమాన పరచారు. వాళ్ళ ఇష్టం వచ్చి నట్లు తేనె తాగి పళ్లు తిని మైమరచి పడివున్నారు. చెట్లను తీగెలను ధ్వంసం చేసినవాళ్ళని దేవరవారు వెంటనే శిక్షించాలి" అని దధిముఖుడు చెప్పుకున్నాడు.

సుగ్రీవుడు విషయమంతా గ్రహించాడు. "హనుమంతుడు, జాంబవంతుడు అంగదుడు కార్యసిద్ధి పొంది వచ్చారు. విజయావేశంతో ఇలా చేశారు. అంతకంటె మరేంలేదు" అని చెప్పి ఆ విషయాన్ని లక్ష్మణుడికి తెలిపాడు.

"దధిముఖా! వెంటనే వాళ్ళ నందర్నీ ఇక్కడికి రమ్మను!" అని సుగ్రీవుడు ఆజ్ఞాపించగానే దధిముఖుడు కూడా పరిస్థితిని గ్రహించి వెంటనేపోయి వాళకు రాజాజ్ఞ అందించాడు.

76. దొరికింది సీతమ్మ - తెలిసింది తోవ!

సుగ్రీవుడు ఊహించి చెప్పినమాట రాముడి చెవులకు అమృతంలా అనిపించింది. వానరుల రాకకు వాళ్ళంతా ఆత్రంగా ఎదురుచూస్తూ ఉండగా పైన ఆకాశంలో గొప్ప కలకలం వినబడింది. వానరులు పెద్ద ఘోషచేస్తూ వచ్చి దిగారు.

* * *

హనుమంతుడ్ని ముందుంచుకుని అంగదుడు మొదలైన వానరులు రామలక్ష్మణులూ, సుగ్రీవుడూ ఉన్నచోటికి వేగంగా వచ్చారు.

హనుమంతుడు రామచంద్రుడికి నమస్కరించి "చూశాను సీతమ్మ తల్లిని! క్షేమంగా ఉంది. ఆమె ఉన్న దిక్కునకు నమస్కరిస్తున్నాను" అని దక్షిణ దిక్కుగా తిరిగి నమస్కరించాడు.

ఇలా సీత మానప్రాణాలకు ఎటువంటి బాధా లేకుండా క్షేమంగా ఉన్న వార్తను ముందుగా హనుమంతుడు రామచంద్రుడికి తెలిపాడు.

సుగ్రీవుడూ, లక్ష్మణుడూ రాముణ్ణి ఆలింగనం చేసుకొని ఆనందపరవశు లైనారు.

"వానరులారా! ఎక్కడ వుంది? సీత ఎక్కడ ఉంది? ఎలా ఉంది? ఎలా చూశారు? అంతా వివరంగా చెప్పండి. నేను ఆలస్యం సహించ లేకుండా ఉన్నాను" అని రాము డన్నాడు.

"కన్నదీ విన్నదీ రామచంద్రుడికి నీవే చెప్పాలి" అని వానరులు కోరగా హనుమంతుడు సీతను ధ్యానించి ఆమె ఉన్న దిక్కుగా తల వంచి నమస్కారం చేసి జరిగిన సంగతంతా చెప్పసాగాడు.

* * *

చేయవలసిన పనంతా తా నొక్కడే ధైర్యోత్సాహాలతో పూ ర్తి చేసి రామచంద్రుడి ఎదుటా తన రాజు ఎదుటా నిలిచినప్పుడు హనుమంతుడు అనుసరించిన అడకువ చూడండీ! తాను చేసిన ఘనకార్యానికి గర్వపడకుండా ఉండడం; యువరాజు అంగదుడు, జ్ఞానవృద్ధుడు అయిన జాంబవంతుడు తదితర వీరులకు మర్యాదచూపి వాళ్ల ఆజ్ఞాపించడానికి ముందు తా నేమీ మాట్లాడకుండా ఉండడం వాయు పుత్రుడి క్రమశిక్షణలో గల గొప్పతనానికి నిదర్శనం.

అదీకాక అంతటి ఘనకార్యాన్ని నెరవేర్చిన ఒక మహాత్ముడు ఆ కార్యాన్ని గురించి తొందరపడి తానుగా మాట్లాడడు. అది అలాంటి వారి లక్షణం. ఈ విషయాన్ని మనస్సులో ఉంచుకుని వాల్మీకి మహర్షి ఇలా అంటున్నాడు:

మరొక విషయాన్నికూడా మనం ఇక్కడ గమనించవలసి ఉంది. లంకలో జానకిని ప్రత్యక్షంగా చూసి ఆమెకు నమస్కరించింది మొదలు జగన్మాతను ధ్యానించడంలోను, ఆమె పట్ల భక్తిని వెల్లడించడంలోను హనుమంతుడు నిమగ్నుడైపోయాడు. రాముడి మీద

భక్తి కన్న జగన్మాతమీద అతడికి భక్తి ఎక్కువయింది. పరతత్వాన్ని తల్లిగా భావించి ఆనందించే మహా భక్తులందరికీ కూడా ఇది అనుభవమే.

* * *

"నూరు యోజనాల వెడల్పుగల సముద్రాన్ని దాటి దక్షిణ తీరంలో ఉన్న రావణాధముడి లంకానగరం చేరాను.

అక్కడ అంతఃపురోద్యాన వనంలో చెరలో ఉన్న సీతను చూశాను. రామనామ స్మరణతో ఆమె ప్రాణాలు నిలబెట్టుకొని ఉంది. అనాకారులైన కాపలావున్న రాక్షసస్త్రీల మధ్య దుఃఖిస్తూంది. తల దువ్వుకోక, నేలమీద పడుకుని ఉంది. దుఃఖంతో ముఖం వాడింది. శరీరం వన్నె తగ్గి, హేమంతకాలంలో తామరకొలనులాగా ఉన్న ఆమెను చూశాను. రాక్షసుడి బారినుంచి తప్పించుకోడానికి ఆమె ప్రాణ త్యాగం చేయాలనుకుంది. నేను తమ కీర్తిని మెల్లగా పాడగా అంతకుముందు పరిచయంలేని వానరుడనైనా నన్ను నమ్మింది. తర్వాత మాట్లాడాను. మీకూ సుగ్రీవరాజుకూ ఏర్పడిన సఖ్యాన్ని తెలియబరచాను. మీరు దుఃఖిస్తున్న సంగతికూడా చెప్పాను. మీకు ఆమెయందుగల గాఢానురాగాన్ని తెలిపి సంతోషపెట్టాను. ఆ సాధ్వి మీ కిమ్మని ఈ ఆభరణాన్ని ఇచ్చింది. మీరు నిద్రించినపుడు ఆమెను ఒక కాకి బాధించడాన్ని గురించి తాము విచారించిన విషయాన్ని గురించి నాకు చెప్పి మీకు ఆ ఉదంతాన్ని గుర్తుచేయమంది. ఒకప్పుడు ఆమె తిలకం జారగా మీరు ఎంతో అనురాగంతో తిలకం దిద్దిన సంగతి గుర్తు చేయమంది. 'ఒక నెలవరకు ప్రాణాలు నిలుపుకొని ఉంటాను. అంతకుమించి నా వల్లకాదు' అని మీతో నన్ను చెప్పమంది. వానరరాజుకు కూడా ఈ విషయాన్ని తెలియపరచమని నన్ను ఆజ్ఞాపించింది. ఇక మనం వెంటనే సైన్యాన్ని వెంటపెట్టుకొని లంకా నగరానికి వెళ్లి దేవిని చెర విడిపించి తెచ్చే కార్యాన్ని గురించి ఆలోచించుదాం" అని చెప్పి హనుమంతుడు సీత ఇచ్చిన చూడామణిని రాముడికి అందించాడు.

* * *

• •

రామచంద్రుడు ఆ చూడామణిని తీసుకుని పరీక్షించి చూసి విస్మయం చెందాడు. తర్వాత ఆనందమో, దుఃఖమో తెలియని ఒక చెప్పలేని స్థితి పొందాడు.

చూడామణిని రొమ్మున కద్దుకుని "లక్ష్మణా" అని ఎలుగెత్తి ఏడ్చాడు. "వీర వాయుపుత్రా! సీతను చూసిన వీరుడా! నీ లాగే నేను కూడా ఎప్పుడామెను చూడగలుగుతాను?" అని హనుమంతుణ్ణి కౌగలించుకొన్నాడు. "అన్ని విషయాలూ తిరిగి వివరంగా చెప్పు. ప్రియతముడైన వీరుడా! సీత ఏమని చెప్పింది? మళ్ళీ చెప్పు. హనుమా! దప్పిగొన్నవాడికి చల్లటి నీళ్ళలాగా నీ మాటలు నాకు రుచిస్తున్నాయి" అన్నాడు.

* * *

మారుతి జరిగిన సంగతులన్నీ వివరంగా అందరూ వినేటట్లు మళ్ళీ చెప్పాడు. సీత రాముడికి చెప్పమన్న మాటలను, ఆమె మధుర వచనాలుగానే చెప్పి రాముడి గుండె నీరయేటట్లు చేశాడు.

"ఎందరో రాక్షసులను చంపిన నా రాముడు నే నిక్కడ పరితపిస్తూ ఇలా పడివుంటే ఇంకా ఎందుకు రాలేదు? వీరుడైన నా నాథుడు ఎందుకు ఉపేక్షిస్తున్నాడు? నే నేం తప్పు చేశాను? నా కేమీ తెలియదే! అని ఇలా సీత చెప్పింది. నేను ఆమెకు ఊరడింపు మాటలు చెప్పాను. 'మిమ్మల్ని తలచుకొని తలచుకొని రామచంద్రుడు దుఃఖసముద్రంలో మునిగి తేలుతున్నాడు. ఒక్క క్షణంకూడా ఆయనకు నెమ్మది లేదు. రామలక్ష్మణులు మిమ్మల్ని మరచిపోయినట్లు భావించవద్దు. వాళ్ళ దుఃఖాన్ని వివరించడానికి నాకు మాటలు చాలవు. నేను పోయి మీ రిక్కడ ఉన్న సంగతి చెప్పడమే తరవాయి. వాళ్లు వెంటనే వస్తారు. ఇంక మరి ఆలస్యం ఉండదు. వచ్చేస్తారు. లంకను కాల్చి బూడిద చేసేస్తారు. రావణుణ్ణి అతడి పరివారాన్ని నిశ్శేషంగా నిర్మూలించి మీతో అయోధ్యానగరానికి వెళ్ళిపోతారు. నాకు ఏదో ఒకగుర్తు ఇస్తే వెంటనే పోతాను' అని నేను చెప్పాను. అలా చెప్పగానే చీర చెరగులో ముడివేసిన ఈ చూడామణిని విప్పి నాకు ఇచ్చింది. దాన్ని తీసుకొని నా శిరస్సున ఉంచుకుని పూజించి

భద్రంగా దాచుకుని తిరిగి రావడానికి బయలుదేరాను. అప్పు డామె 'హనుమా! వీరు లైన రామలక్ష్మణులకు, సుగ్రీవ రాజుకు, ఆయన మంత్రులకు నా క్షేమ సమాచారం చెప్పు! నేను మళ్ళీ రాముణ్ణి చేర గలిగే మారం ఏదో ఆయనకు చెప్పు. నిన్నే నమ్ముకున్నాను. నీవు క్షేమంగా పోయిరా. నీకు మంగళమగును గాక!' అని నన్ను దీవించి పంపింది. ప్రభూ! దుఃఖించకండి. కార్యంలో మనస్సు లగ్నం చేయండి. 'రామలక్ష్మణులు ఈ సముద్రాన్ని ఎలా దాటి వస్తారు? వానర సేన లంక కెలా చేరుకుంటుంది?' అని సీత సందేహించి మరి మరి దుఃఖించింది. ఆమెతో, నన్ను సందేహింపవద్దనీ, దూతగా వచ్చిన నేను సుగ్రీవుడి బలగంలో చాలా చిన్నవాడి ననీ గొప్ప వీరుడ్నెకదా రాజులు దూతగా పంపుతారు అనీ చెప్పాను. 'ఇక్కడున్న వీరులలో చాలామంది నాకన్నా ఎక్కువ బలశాలురు. ఆకాశాన ఎగురుతూ భూమండలా న్నంతా చుట్టిరాగల శక్తిమంతులు వానరులలో ఎందరో ఉన్నారు. రామలక్ష్మణులను నేనే బుజా న్నెక్కించుకుని సముద్రం దాటివస్తాను. విల్లమ్ములతో వాళ్ళిక్కడ దిగుతారు. మీరు నిశ్చింతగా ఉండండి' అని నేను దేవిని ఓదార్చాను. ఆమె కొ స్త మనశ్శాంతి పొందింది" అని హనుమంతుడు చెప్పాడు.

77. దండు కదిలింది

"ఎవరివల్లా కాని ఒక కార్యాన్ని – ఎవరూ ఊహించడానిక్కూడా సాధ్యంకాని ఒక కార్యాన్ని హనుమంతుడు సాధించాడు. ఇతనికి నే నేం ప్రత్యుపకారం చేయగలను?" అని రామచంద్రుడు హనుమం తుణ్ణి కౌగలించుకొని ఆనంద బాష్పాలు రాల్చాడు. తర్వాత ఇక కార్యక్రమాన్ని గురించి ఆలోచించాడు.

"సుగ్రీవా! హనుమంతుడు గొప్ప పని సాధించాడు. రాక్షస రక్షణలో ఉన్న లంకాపురి ప్రవేశించి సీతను చూసి ధైర్యం చెప్పి ఆమె ప్రాణం కాపాడాడు. అయితే ఇంకిప్పుడు సముద్రా న్నెలా దాట గలం? నీ సేనను అవతలి ఒడ్డుకు ఎలా చేర్చగలం? రావణనగరాన్నీ రాక్షస సేననూ ముట్టడించాలంటే ముందు మనం ఈ సముద్రాన్ని

• •

దాటాలి కదా? దీనికి మార్గం ఏమీ తోచడంలేదు. హనుమంతుడు సాధించిన ఘనకార్యం, దానివల్ల కలిగిన ఆనందం ఈ చింతతో కరిగిపోతున్నాయి" అని రాముడు ఆలోచనలో మునిగిపోయాడు.

రాముడి విచారం చూసి వానరరాజు "ఇదేంటి రామా! మీరు కూడా ఇలా మనో దౌర్బల్యానికి లొంగిపోతున్నారా? మీకు భయమేంటి? ఇరుగో నా వానర వీరులున్నారు. వీళ్లు మీ కోసం ప్రాణాలివ్వటానికూడా సిద్ధంగా ఉన్నారు. ఆ సంగతి నాకు తెలుసు. చింతించకండి. చింతవల్ల అధైర్యం కలుగుతుంది. మనస్సును చింతకు లోను కానీయకండి. మిమ్మల్నీ, మీ తమ్ముణ్ణి తీసుకుపోయి లంకకు చేర్చడం మా పని. దాన్ని గురించి సందేహించకండి. మీరు శత్రువును జయించి సీతను చెర విడిపించండి. ఈ విషయాన్ని గట్టిగా నమ్మండి. లంకను హనుమంతుడు ఎప్పుడు చూశాడో అప్పుడే ఆ కోట నశించిందన్నమాట. విచారంవల్ల ఫలితం లేదు. శోకించటం శూరుల లక్షణం కాదు. అది ధైర్యాన్ని మింగేస్తుంది. అందుకని శోకాన్ని వెంటనే వదలండి. అన్నీ తెలిసిన మీకు నేను చెప్పేది ఏముంది? మీకు మేం తోడుగా ఉన్నాం. ఇంక మీకు చింత ఎందుకు? నేనూ, నా వానర వీరులూ మీకు తోడుండగా మీరు ధనుర్బాణాలు పట్టుకు నిలిస్తే మిమ్మల్ని ఎదిరించగల వారెవరు? మీరు శోకాన్ని విడిచి క్షత్రియోచితమైన రోషాన్ని పూనండి. సముద్రాన్ని దాటడం ఎలాగో మీ సూక్ష్మబుద్ధితో ఆలోచించండి. నా వానర వీరుల శక్తి సామర్థ్యాలను తగినట్లు ఉపయోగించుకొండి. మనకు విజయం నిశ్చయం. నా హృదయంలో కలుగుతున్న భావావేశమే అందుకు సాక్షి" అన్నాడు.

ఇలా సమాధాన పరచి వానరరాజు రాముడికి ఉత్సాహం కలిగించాడు. తర్వాత రాముడూ, హనుమంతుడు లంకను గురించి మాట్లాడారు. నగరం, కోట, అగడ్త, మొదలైన వివరాలన్నీ రాముడు తెలుసుకున్నాడు.

లంకలోని ఐశ్వర్యాన్ని, సుభిక్షాన్ని, రాక్షసుల సంతోషాన్ని, రావణుడిమీద వాళ్ళకున్న నమ్మకాన్ని అంతా ఒక్కటికూడా విడిచిపెట్టకుండా హనుమంతుడు పూసగుచ్చినట్లు చెప్పాడు. రావణుడి సేనాబలం,

కోట, దాని అగడ్తలు, వాటి కాపలాలూ, వడిసెల యంత్రాలు, ప్రాకారాలు, వాకిళ్లు, అగడ్తలు, అగడ్తలపైన ఎత్తడానికీ దించడానికీ వీలుగా అమర్చిన కొయ్య వంతెనలు, మొదలైనవి ఎంత కట్టుదిట్టంగా అమర్చారో హనుమంతుడు రాముడికి వివరించి చెప్పాడు. సముద్ర తీరాన్ని గురించికూడా చెప్పాడు. నావలు అక్కడికి చేరలేవని అన్నాడు. త్రికూట పర్వతాన్ని, లంకా నగరాన్ని, కోటను శత్రువుకు చొరరాని పద్ధతిలో రావణుడు రక్షిస్తున్న సంగతి చెప్పి, "రావణుడి బలం, సంపద, సేనలు, వర్ణించాలంటే మాటలు చాలవు. అయినా వాటిని నాశనం చేయగల శక్తి మన వానర సేనలకుందని ధైర్యంతో చెప్పగలను. మనకు అంగదుడు, ద్వివిదుడు, మైందుడు, జాంబవంతుడు, పనసుడు, నలుడు, నీలుడు మొదలైన సాటిలేని వీరులున్నారు. గొప్ప సేనకూడా ఉంది. ఆకాశం మీదుగా ఎగిరి వెళ్లి లంకను నాశనం చేయగలం. దాని పర్వత దుర్గం ఒక లెక్కకాదు. దాన్ని పగలగొట్టి నాశనం చేస్తాం. మంచి మహూర్తం చూసి బయలు దేరడానికి ఆజ్ఞాపించండి" అని హనుమంతుడు చెప్పాడు.

* * *

ఉత్తర ఫల్గునీ నక్షత్రం రోజున విజయ ముహూర్తమైన మధ్యాహ్న సమయాన వానరసేన దక్షిణ సముద్రానికి బయలుదేరింది బయలుదేరేటప్పుడు అన్నీ శుభశకునాలే కనిపించాయి. రాముడు, సుగ్రీవుడు, లక్ష్మణుడు మాట్లాడుకుంటూ వెళ్ళారు.

"మనం బయలుదేరిన సంగతి సీతకు తెలిస్తే ధైర్యంగా ఉంటుంది." అన్నాడు రాముడు.

దారి తెలిసిన వానర వీరులు కొందరు ముందు నడిచి దారిలో ఎక్కడా శత్రువులు దారికాచి ఉండకుండా కనిపెడుతూ వెళ్ళారు. ఈ మహాసేనకు అహారపానీయాలు దొరికే స్థలాలను కనిపెడుతూ కొందరు వెళ్ళారు. వానరసేన రామలక్ష్మణులను భుజాన్నెంకించుకుని అడవులూ, కొండలూ దాటి అతివేగంగా ప్రయాణం చేసింది.

సైన్యంలో ఉత్సాహం పొంగి పొరలింది. వానరులు ఎగురుతూ, దూకుతూ, ఆడుతూ వెళ్ళారు. రావణుణ్ని నేను చంపుతానంటే నేను

చంపుతానని పోటా పోటీలు వేసుకోవడం విని రాముడికి ముచ్చట వేసింది. నీలుడూ, కుందుడూ సైన్యానికి ముందు మార్గాన్ని శోధిస్తూ వెళ్ళారు. చతురతగల వీరులు సైన్యం వెనకతట్టువుండి రక్షిస్తున్నారు. సుగ్రీవుడు, రామలక్ష్మణులు సైన్యం మధ్యని ఉన్నారు.

దారిలో కనిపించిన నగరాలకుగాని గ్రామాలకుగాని ఎలాటి ఇబ్బందీ కలిగించకుండా వెళ్ళాలని రాముడు ఖండితంగా ఆజ్ఞాపించాడు. సైన్యంచేసే సందడి సముద్రఘోషలా దశదిశలూ నిండింది. దుమ్ము ఆకాశానికి లేచింది.

మహేంద్ర పర్వతం వద్దకు చేరగానే రాముడు పర్వతం ఎక్కి సముద్రాన్ని చూశాడు

"ఇక ఈ సేనతో సముద్రా న్నెలా దాటడమా అన్న విషయం ఆలోచించాలి. అంతవరకూ ఇక్కడ ఆడవిలో సైన్యం మకాం చేయవచ్చు" అని రాము డన్నాడు. సుగ్రీవుడు ఆ ప్రకారమే సైనికులను ఆజ్ఞాపించాడు.

సముద్రతీరాన అడవిలో వానరసేన విడిసింది. పగవారి కుట్రల వల్ల ఏ అపాయమూ రాకుండా వీరులు నలుపక్కలా కనిపెట్టి చూస్తున్నారు. అందరికీ విడిది సౌకర్యంగా అమరిందా లేదా అని సుగ్రీవుడు, రామలక్ష్మణులూ పరిశీలించారు. తర్వాత రాముడు లక్ష్మణుడితో ఏకాంతంగా కూర్చుని ఇలా అన్నాడు :

"ప్రియమైన ఒక వస్తువును పోగొట్టుకొంటే రోజులు గడిచిన కొద్దీ దాని జ్ఞాపకం, దాన్ని పోగొట్టుకున్న దుఃఖం పోతాయని చెపుతారే కాని, లక్ష్మణా! సీత ఎడబాటు విషయంలో మాత్రం ఇది నాకు నిజ మని పించటంలేదు."

"రావణుడు సీతను అపహరించినపుడు, హా నాథా! హా రామా! హా లక్ష్మణా! అని విలపించిందే! మనం సహాయం చేయలేక పోయామే! అప్పుడు ఆమె దుఃఖాన్ని తలుచుకున్న కొద్దీ నా గుండె చెరు వవుతుంది. నే నేం చేసేది? విషం తాగితే అవయవాలన్నీ మండినట్లు నా వళ్ళంతా తాపంగా వుంది, నిప్పుతో కాల్చినట్లుంది. సీత ఆ రాక్షసుల మధ్య చిక్కు

కుని ఎంత పరితపిస్తూందో! జనకమహారాజు కుమార్తె, దశరథ మహారాజు కోడలు, ఇలా రాక్షసస్త్రీల మధ్య కటిక నేలను పడి ఉండటమా?" అని రాముడు వలవల ఏడ్చాడు.

"అన్నయ్యా ఏడవకు. రావణుణ్ని చంపి విజయంతోపాటు సీతను అయోధ్యకు తీసుకు వెళ్ళేరోజు సమీపిస్తూంది. ఆమె దేవకన్యలాగ అయోధ్యలో ప్రవేశిస్తుంది. దుఃఖం మాని ధైర్యాన్ని చేపట్టు" అని లక్ష్మణుడు అన్నను ఓదార్చాడు.

78. లంకలో కలవరం

ఇక రావణుడి కథ చూదాం. మహాకవుల నడకలో ఒక ప్రత్యేకమైన తీవి ఉంటుంది. ఏవగించుకోవలసిన పాత్రలను కూడా తమ కల్పనా శక్తితో వాస్తవికత కుంటుపడకుండా భావనాదృష్టితో తమాషాగా చిత్రిస్తారు.

మానవుల మనఃప్రవృత్తిని సాత్విక మార్గంలో ప్రవేశ పెట్టడమే మహాకవుల లక్ష్యం. అందుకోసం తామసం రాజసం గల పాత్రలను కూడా సామర్థ్యంతో ఉపయోగిస్తారు. పాఠకులలో రాజస తామస గుణాలు గల వారికి కావ్యం చదివేటప్పుడు ఆ గుణాలు గల పాత్రలమీద సానుభూతి కలుగుతుంది. ఇక తక్కువ రకం మనుష్యుల సంగతి చెప్పనే అక్కరలేదు. అలాంటివారు సాత్విక పాత్రల కృత్యాలను కేవలం కథలుగానే ఎంచుతారు. వేద పారాయణ విషయంగానో పూజా విషయంగానో దాన్ని భావిస్తారు. రాజస తామస గుణాలుగల పాత్రలను తమ బంధువులుగా అనుకుని వాళ్ళపట్ల సానుభూతి ప్రకటిస్తూ చదివి ఆనందిస్తారు.

'మిల్టన్' అనే ఇంగ్లీషు మహాకవి ('Paradise lost') "స్వర్గచ్యుతి" అనే క్రైస్తవ పురాణగాథను ఒక మహాకావ్యంగా రచించి చాడు. ఆ కావ్యం లోకఖ్యాతి గడించింది. ఆ కావ్యంలో లోకరక్షకుడూ, ఆయన మానస పుత్రుడయిన ఏసుక్రీస్తు, ఇంకా అనేకమంది దేవతలు పాత్రలుగా వస్తారు. కాని ఆ కావ్యంలో ప్రధాన

పాత్ర సైతాను. అతడు దేవుణ్ని ఎదిరించి ప్రపంచంలో పాపాలూ మరణాలూ పుట్టడానికి కారకుడయ్యాడు. మిల్టన్ మహాకవి ఈ సైతాను పాత్రను అత్యద్భుతంగా, చిత్రించాడని ఇంగ్లీషు కావ్య రసజ్ఞులు పొగడుతారు. జగత్ప్రసిద్ధి చెందిన నాటకకర్త అయిన షేక్స్పియర్ కూడా బీదవాళ్ళకీ, సామాన్యులకూ అధిక వడ్డీలకు అప్పు లిచ్చి వాళ్ళ నెత్తురు పీల్చే పరమలోభి షైలాక్ పాత్రను అతి సుందరంగా చిత్రించాడు. ఎన్నో దుర్గుణాలను పెట్టి కల్పించిన పాత్రలో అయినా చెడుగుణాలతోపాటు ధైర్యమూ, పట్టుదలా, సామర్థ్యమూ - ఇలాంటి ఉత్తమ గుణాలు ఈ పాత్రలో కనిపించేలా మహాకవులు చిత్రిస్తారు. పామరులమైన మనం ఆ పాత్రలవల్ల పొంద వలసిన జ్ఞానం చాలా ఉంది. ఆ పాత్రలు మనకు జ్ఞాపకం ఉండేలాగ ఆ పాత్రలలో ఎంతో వెలుగుపోసి కల్పిస్తారు.

వాల్మీకి రాసిన ఈ మహాకావ్యంలో రావణ కుంభకర్ణ పాత్ర లలో ఈ విషయాన్ని మనం ప్రత్యక్షంగా చూడవచ్చు. ఆహారపదా ర్థాలలో కొన్ని చేదుగావున్నా వండిన తర్వాత ఎంతో రుచిగా ఉంటాయి కదా ? అలాంటి పదార్థాలను చక్కగా వండడంలోనే ఉంది నేర్పు. అంతే. కావ్యం విషయం కూడా అంతే.

* * *

హనుమంతుడు లంకలో చేసిన సాహసకృత్యాలూ, కోతిచేష్టలూ రాక్షసరాజుకు సిగ్గు కలిగించాయి. అతడికి భయంకూడా పట్టుకుంది. కనుక సభలో మంత్రాలోచన చేశాడు.

హనుమంతుడి కృత్యాలకు అవమానం పొంది తలవంచుకొని మాట్లాడాడు.

"ఇంతవరకు పగవా రెవరూ మన నగరంలో ప్రవేశించింది లేదు. రాముడి దగ్గరనుంచి వచ్చిన కోతి లంకలో ప్రవేశించి చెరలో ఉన్న జానకినీ కూడా చూసి వెళ్ళిపోయాడు. తోటలూ భవనాలను ధ్వంసం చేసివేశాడు. గొప్ప గొప్ప వీరులను పొట్టన పెట్టుకున్నాడు. మన ప్రజలను గజగజలాడించి వేశాడు. ఇది ఇంత

LALA MEMORIAL LIBRARY D.P.R.I. Acc. No.

టితో ఆగదు. కనక ముందు జరగవలసిన కార్యాన్ని గురించి వెంటనే ఆలోచించాలి.

రాజు అయినవాడు ప్రతి పనినీ రాజు క్షేమాన్ని కోరే మంత్రులతో ఆలోచించే చేయాలి కదా? కాబట్టి ఈ సభ చేస్తున్నాను. మనకు రాముడు పగవాడు. అతడ్ని ఏం చేయ్యాలో బాగా ఆలోచించవలసి ఉంది. రాజు కేవలం తన సామర్థ్యాన్ని తన బుద్ధిబలాన్ని నమ్ముకొని పని చేయడంకన్న కష్టసుఖాల్లో భాగస్వాములు, శ్రద్ధగలవారూ బుద్ధిమంతులూ అయిన వారితో ఆలోచించి చేయడం శ్రేయస్కరం. మంత్రుల ఆలోచనలను, ప్రకృతిధర్మాలను కాదని పనులుచేసే రాజు చెడిపోతాడు. నీతిశాస్త్రాన్ని గమనించి దృఢమైన సిద్ధాంతాలను అనుసరించి ధైర్యంగా ఆలోచన చెప్పేవాడే మంత్రి. తమ బుద్ధిని ఋజుమార్గంలో పెట్టుకోలేక ఏ నిర్ణయానికీ రాలేక అటూ ఇటూ కాకుండా మాట్లాడేవాళ్ళు పనికిమాలిన మంత్రులు.

ఇప్పుడు మన ముందున్న విషయం చాలా ముఖ్యమైంది. రాముడు బలశాలి. అతడి సైన్యంకూడా బలం గలది. వాళ్ళు లంకను ముట్టడించడం నిశ్చయం. ఏదో ఒక యుక్తితో సముద్రాన్ని దాటి వాళ్ళు రావడం కూడా నిశ్చయమే. సముద్ర దుర్గాన్ని ఒక్కదాన్నే వమ్ముకుని మనం ఊరికే కూర్చోడం సమంజసం కాదు. మన నగరాన్నీ, సేనను ఎలా బలపరచి రక్షించాలో, మన క్షేమంకోసం ఏమేం చేయాలో చక్కగా ఆలోచించి సలహా చెప్పండి" అని రాక్షస రాజు అన్నాడు.

* * *

రాజు చెప్పిన మాటలు విని సభవారంతా ఏకగ్రీవంగా ఇలా అన్నారు:

"మహారాజా! మన సేనాబలానికీ, ఆయుధ బలానికీ, సాటి రాగలది ఈ ప్రపంచంలో లేదు. అటువంటప్పుడు తాము ఎందుకు భయపడటం? పగవాడు ఈ కోటను పట్టుకోలేడు. మన సేనను జయించలేడు.

• •

భోగవతీ నగరానికి వెళ్లి నాగరాజును ఎదిరించి తాము విజయం పొందలేదా ? అతిబలశాలి అయిన కుబేరుణ్ణీ, యక్షులనూ ఓడించి పుష్పక విమానాన్నీ, ఈ లంకనూ తాము గెలుచుకోలేదా?

మయుడు భయపడి తమతో స్నేహం చేసుకొని తన కుమార్తెను తమ కిచ్చి వివాహం చేయలేదా? పాతాళాన్ని ముట్టడించి తమ రెన్నో నగరాలను పట్టుకున్నారు. తమ బలపరాక్రమాలకు అంతులేదు. వరుణ పుత్రులను, యముణ్నీ కూడా మూడు చెరువుల నీళ్లు తాగించారు. ఈ రాము డనగా ఎంత? వీరుడు ఇంద్రజిత్తు ఒక్కడూ చాలడా ఈ రాముణ్నీ అతడి వానరసేననూ తుదముట్టించడానికి? ఇంద్రు డంతటి వాణ్నే దయదలచి చెరనుంచి విడిచి పెట్టలేదా ? ఈ రాముడూ అతడి కోతులూ ఎంత ? ఈ కోతి మూకని అంతమొందించ మని ఇంద్ర జిత్తుకు ఆజ్ఞ ఇవ్వండి. చాలు. వాళ్ల పని అయినట్లే."

ఇలా వారంతా తమ రాజును పొగడారు.

మహాశూరుడూ కారు మేఘంలాంటి శరీరం గలవాడూ అయిన ప్రహస్తుడు లేచి ఇలా అన్నాడు:

"ఒక్క కోతి వచ్చినప్పుడే మనం అజాగర్తగా ఉండి మోస పోయాం. మన అజాగరవల్లే హనుమంతుడు కుప్పిగంతులు వేశాడు. అలాంటిది మళ్లీ జరగనిస్తామా ? ఈ సారి ఇక్కడికి రానియ్యండి, నేను చూసుకుంటాను వాడి పని. ఈ కోతి జాతినే నిర్మూలిస్తాను. ఆజ్ఞ ఇవ్వండి. ఒక పొరపాటువల్ల ఏదో అపాయం వచ్చిందని చింతించ నవసరం లేదు."

తర్వాత దుర్ముఖుడు కోపంతో లేచాడు. "మన మ్నందర్నీ అవ మానపరిచిన ఆ వానరుణ్ణి విడిచి పెట్టడానికి ఎంతమాత్రమూ వీల్లేదు. నేను ఈ క్షణమే వెళ్లి ఆ వానరసేనను మూలమట్టంగా నాశనం చేసి వస్తాను" అని గర్జించాడు.

వజ్రదంష్ట్రు డనే శూరుడు భయంకరమైన ముసలాయుధాన్ని పట్టుకు నిలబడి "ఇదుగో చూడండి. ఈ రోకలి చూడండి. శత్రువుల రక్తమాంసా లింకా దీనికి ఆంటుకునే ఉన్నాయి. కోతిని గురించి

ఎందు కీం తిలా మాట్లాడుతున్నారు? మన శత్రువులు రామలక్ష్మణులు కదా? వాళ్లని నేను చంపి ఆ వానర సైన్యాన్ని కూడా తుద ముట్టించి తిరిగి వస్తాను. నన్ను పంపండి'' అన్నాడు.

"ఇంకా నే నొక ఆలోచన చెపుతున్నాను వినండి. కొందరు రాక్షస వీరులను మారు వేషాలతో రాముడి వదకు పంపుదాం. అలా వారు పోయి 'భరతుడు మమ్మల్ని మీ వదకు పంపాడు. వెనకనించి గొప్పసైన్యం వస్తూంది' అని చెప్పి అతణ్ణో అతడి సేననూ మభ్య పెట్టి మోసంలో పడవేదాం. అప్పుడు మన రాక్షససేన ఆకాశ మార్గాన వెళ్ళి వాళ్ళ నందరినీ అవతలి ఒడ్డునే మట్టు పెట్టవచ్చు. ఇదీ నా ఆలోచన'' అన్నాడు వజ్రదంష్ట్రుడు.

కుంభకర్ణుడి కొడుకు నికుంభుడు లేచి "మీ రంతా ఇక్కడే మహారాజుతో ఉండండి. నేను పోయి ఆ శత్రుసమూహాన్ని హత మార్చి తిరిగివచ్చి మీకు శుభవార్త తెల్పుతాను'' అన్నాడు.

* * *

ఇలా ఒకరి తర్వాత ఒకరుగా లేచి రావణుణ్ణి తృప్తి పరచడం కోసం వీరాలాపాలు చేశారు. అందరూ గుంపుగా లేచి ఆయుధా లెత్తి గర్జించారు.

రావణుడి తమ్ముడు విభీషణుడు లేచి అందరినీ కూర్చోమని చెప్పి చేతులు జోడించి ఇలా అన్నాడు:

"అన్నా! వీళ్ల ఆలోచనలు వినడాని కింపుగా ఉన్నాయిగాని సరియైనవి మాత్రం కాదు. ఇవి మీకు మేలుచేయవు. నీతిశాస్త్ర విరుద్ధంగా ఒక పనిచేస్తే దానివల్ల నష్టం కలుగుతుంది. సామ దాన భేదోపాయాలను ప్రయోగించడానికే వీలవుతుం దేమో మొదట చూసి వాటివల్ల కానప్పుడు మాత్రమే పగవాడిపైన దండోపాయాన్ని ప్రయోగించాలి. వీరులు చెప్పినట్లు వెంటనే యుద్ధం ప్రారంభిస్తే లంక నశిస్తుంది. మనం చస్తాం.

మనం ధర్మాన్నికూడా ఆలోచించాలి కదా. రాముడి భార్యను అపహరించి తేవడంలో న్యాయం ఏ మాత్రమూ లేదు. అది మహా పాపం కూడాను. ఆ పాపాన్ని మొదట కడిగేసుకోవాలి. రాముడు

మన కేం చెరుపు చేశాడు? దండకారణ్యంలో రాముడు చేసిన పనులన్నీ తననూ తనవారినీ రక్షించుకోడానికి చేసినవే కదా? అతడ్ని చంపడానికి వచ్చిన వాళ్లతోనే యుద్ధం చేశాడు. అంతేకాని అతడి భార్యను అపహరించి తేవడానికి ఇవి కారణా లెలా అవుతాయి? మనకు అతడిమీద కోపం ఉంటే అతడితోనే యుద్ధం చేసేసరి. అలా చేయడం మాని వాళ్లు లేని సమయం చూసి సీతను ఎత్తుకొని రావడం పాపకార్యం కాదూ?

తప్పు మన మీద ఉంచుకుని మొదటే మనం దండోపాయాన్ని అనుసరించడం సరికాదు. రాముడి బలం మనం తెలుసుకోవాలి. అతడి సేనాబలాన్ని కూడా చక్కగా తెలుసుకోవాలి. హనుమంతుడి బలాన్నీ సామర్థ్యాన్నీ చూడనే చూశాం. అతడ్ని గురించి అలక్ష్యంగా మాట్లాడడంవల్ల ఫలితం లేదు. అతడి పనులు చూసినవారు ఎవరు ఆశ్చర్యపడకుండా ఉంటారు? మన బలం గొప్పదే. అయినా ఎదుటి వాడి బలంతో పోల్చి చూసిం తర్వాతనే యుద్ధం చేయాలా లేక యుద్ధం లేకుండానే కార్యం సాధించుకోవాలా అన్న విషయాన్ని ఆలోచించాలి. ముందు సీతను వాళ్లకి అప్పగించడం ముఖ్యం. ఇదే నా అభిప్రాయం. రాముడూ వానరులూ లంకను ముట్టడించడానికి ముందు సీతను అప్పగించండి. అన్నా! మీకు నేను హితువు చెపుతున్నా నని కోపగించకండి. చేసిన తప్పును ముందు దిద్దుకుని తర్వాత మిగతా ఆలోచనలు చేద్దాం'' అని విభీషణుడు చేతులు జోడించి, అన్న రావణుణ్ని వినయంగా వేడుకున్నాడు.

రావణుడు మొదట తన మంత్రులూ, సేనాధిపతులూ చేసిన ప్రగల్భాలు విని ఆనందించాడు. అయినా అతడి మనస్సులో సందేహం ఉంది. కనక విభీషణుడు చెప్పింది విన్న తర్వాత "రేపు తిరిగి ఆలోచించుదాం" అని అప్పటికి సభ చాలించి అంతఃపురానికి వెళ్లిపోయాడు.

79. మంత్రాలోచన

మర్నాడు ఉదయమే లేచి విభీషణుడు రాజు వద్దకు వెళ్లాడు. తన మనస్సులోని విషయాన్ని బాగా ఆలోచించుకొని మరీ వెళ్లాడు. అన్న

మేలు కోరి అతడ్ని సన్మార్గానికి తిప్పి ఎలాగైనా కాపాడాలని అతడి ఆలోచన.

రాజభవనం ఎప్పటిలాగానే సకల సంపదలతో శుభలక్షణాలతో పూజలతో నిండి ఉంది. కవచాలు ధరించి ఆయుధాలు పూనిన స్త్రీలు అడుగడుగునా కావలి కాస్తున్నారు. బ్రాహ్మలు వేదఘోష చేస్తున్నారు. బాజాలవాళ్లు సుప్రభాతగీతాలను వాయిస్తున్నారు. ఇలా మంగళ ఘోషలతో నిండిన రాక్షసరాజు భవనంలోకి విభీషణుడు ప్రవేశించాడు.

రాజు ఎదుట చేతులు జోడించుకుని నిలబడ్డాడు. రావణుడు ముఖ్య మంత్రుల్ని తప్ప మిగతావాళ్లని అవతలికి పంపి తమ్ముణ్ని మాట్లాడ మని చెప్పాడు.

"అన్నా! నా మాటలో పొరపాటుంటే మన్నించు. నా లాభం కోసం నేను మాట్లాడ్డం లేదు. నీ మేలు కోరే చెపుతున్నాను. నేను చెప్పేది విని, బాగా ఆలోచించి ఆపైన ఏ పనైనా చేయవలసిందని కోరుతున్నాను" అని విభీషణుడు మొదలు పెట్టాడు:

"సీతను మీరు తీసుకొని వచ్చింది మొదలు లంకానగరంలో నేనూ, మిగతావాళ్లూ అన్నీ అపశకునాలే చూస్తున్నాం. హోమాగ్ని మండవలసిన పద్ధతిలో మండడం లేదు. సరియైన మంత్రాలతో హవిస్సును అర్పించినా అగ్ని మండడంలేదు. పూజాస్థలాలలో పాములు కనిపిస్తున్నాయి. నైవేద్య ద్రవ్యాలకు చీమలు పడుతున్నాయి. ఆవులు పాలు బాగా ఇవ్వడంలేదు. ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు, కంచరగాడిదలు ఆకోగ్యాలు తప్పి తిండి సరిగా తినక విపరీతంగా నడుచుకుంటున్నాయి. ఏ వైద్యం చేయించినా ఫలించడంలేదు. నగర విమానాలమీద కాకులు గుంపులు గుంపులుగా కూర్చుని కర్ణ కఠోరంగా కూస్తున్నాయి. గద్దలు తిరుగుతూ వేటగాళ్లని భయపెడతున్నాయి. నక్కలు నగరంలో ప్రవేశించి అకాలంలో కూస్తున్నాయి. అడవి జంతువులు నగరంలో తిరుగుతున్నాయి. అదంతా మనకు గొప్ప అపాయాన్ని నషాన్ని సూచిస్తూంది. దీన్ని మనం నిర్లక్ష్యం చేయ.

కూడదు. సీతను మళ్ళీ పంపించి వేయండి, ఆమెను కొనివచ్చింది మొదలు దుశ్శకునాలే కనిపిస్తున్నాయి. నేను చెప్పిన ఈ ఆపశకునాలు నిజమో కావో ఎవరి నైనా అడిగి చూడండి.

తీరికూచుని కయ్యం కొనితెచ్చుకోడంవల్ల ప్రయోజనంలేదు. సీతను వాళ్ళకి అప్పగించి సుఖంగా ఉందాం'' అని విభీషణుడు వినయంతో మనవిచేశాడు.

"అలా ఎన్నటికీ, వీల్లేదు ! సీతను తిరిగి పంపివేయమనిమాత్రం చెప్పకు ! ఈ శత్రువును నే నొక గొప్పవాడికింద లెక్కపెట్టడం లేదు. మనకు ఏం భయంలేదు. నీవు వెళ్లవచ్చు" అని రావణుడు అన్నాడు.

* * *

రావణుడు ఇంత పట్టుదలతో ఉన్నప్పటికీ సీతను గురించి తన కోరిక నెరవేరలేదే అనీ, తన ఆత్మీయులుకూడా తననే తప్పు పడుతున్నారే అనీ తెలుసుకొన్నాక అతనికి మనశ్శాంతి పోయింది. కాని దాన్ని దాచిపెట్టుకుని మళ్ళీ సభచేశాడు. కామ క్రోధాలవల్ల అతడి బుద్ధి పెడమారాన పడింది. అయినా తానుచేసిన పనిలో తప్పుం దని గ్రహించి ఇలరులతో ఆలోచించడం వల్ల కొంతవరకు తృప్తి పడవచ్చునని అనుకున్నాడు రావణుడు.

బంగారు రథమెక్కి కొలువుకూటానికి బయలుదేరాడు. జాతి గుర్రాలను పూన్చిన ఆ రథానికి ముంచూ వెనకా డాలు కత్తులుపట్టి చూడ ముచ్చటగా దుస్తులు ధరించి భటులు నడుస్తున్నారు. కొందరు రథాలు, ఏనుగులు, గుర్రాలు ఎక్కి భయంకరమైన గొడ్డళ్ళూ శూలాయుధాలు ధరించి రావణుడి రథంవెంట వెళ్ళారు. శంఖమూ, భేరీ, కాహళం మొదలైన యుద్ధ వాద్యాలు మోగాయి. లంకేశ్వరుడు ఇలా సపరివారంగా అతి గంభీరంగా వెళుతూ ఉంటే దారి కిరువెపులా నిలిచినవాళ్లు చేతులు జోడించి తలలు వంచి ఆయనకు నమస్కరించి హర్షనాదాలు చేశారు. శంఖధ్వానాలు, భేరీ ఘోషలు దిక్కులు బద్దలు గొడుతూ వుండగా రాక్షసరాజు కొలువుకూటానికి చేరాడు.

వెండిబంగారు స్తంభాలు, అందమైన ఆసనాలతో మయుడి శిల్ప సామర్థ్యాన్ని వెల్లడించే ఆ సభాభవనంలో రావణుడు వైధూర్య

సింహాసనంమీద కూర్చున్నాడు. వందలాది పిశాచాలు సభాభవనానికి కావలికాస్తూ నిలబడ్డాయి. రాక్షసరాజు ఆజ్ఞ ప్రకారం వేలాది వీరులు వచ్చి చేరారు. వాళ్లు వచ్చిన వాహనాలు సభాభవనం బయట లెక్కలేనన్ని ఉన్నాయి. వాళ్లు తమ తమ పదవులకు తగిన స్థానాలలో కూర్చున్నారు. వందల సంఖ్యలో పురోహితులు, వేదపండితులు వచ్చి బహుమతులు పుచ్చుకొని కూర్చున్నారు.

విభీషణుడు, శుకుడు, ప్రహస్తుడు మొదలైన వాళ్లు వచ్చి రావణుడికి నమస్కరించి తమ స్థానాలు అలకరించారు. సభా నిర్వాహకులు, ఉద్యోగులు తమ తమ స్థానాలలో కూర్చున్నారు. వాళ్లంతా నిపుణులు, శూరులు, రావణ భక్తులున్నూ.

సభామంటపంలో పరిమళాలు గుప్పు మన్నాయి. ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడ్డంలేదు. అంతా నిశ్శబ్దంగా గంభీరంగా ఉంది. మేధావులు, మహాబలశాలురు, చండశాసనులు నిండి ఉన్న ఆ సభ దేవేంద్ర సభలాగా ఉంది.

* * *

తన రాజ్యక్షేమం కోరేవాడు, స్వభావసిద్ధంగా మంచి మేధావీ అయినా రావణుడికి మోహం కళ్లుకప్పడం వల్ల మతిపోయింది. కామంవల్లా, అహంకారంవల్లా ఆలోచించలేని స్థితిలో ఉన్నాడు. సభకువచ్చిన తన ఆప్తులూ, శ్రేయస్సు కోరేవాళ్లూ అయిన రాక్షసులను చూసి ఇలా అన్నాడు:

"అన్నివిధాలా మీరు సమర్థులు. ఎంతటి చిక్కుసమస్యనైనా విడదీయడానికి తగిన ఆలోచన చెప్పగల బుద్ధికుశలురు. ఇంతవరకు మీరు ఆలోచించి చెప్పిన ఏ విషయమూ వ్యర్థం కాలేదు. కనక మిమ్మల్ని ఇప్పుడు అడుగుతున్నాను, నేను చేసిన పని మీకూ తెలుసు. దండకారణ్యంలో ఉంటున్న జానకిని తెచ్చాను. ఆమెమీద నా కున్న మక్కువను అణచుకోలేకుండా ఉన్నాను. ఆమెను నే నిప్పుడు తిరిగి పంపడం సాధ్యంకాదు. ఇప్పటికీ ఆమెమీద నా కున్న మనస్సు తిప్పడం సాధ్యంకాకుండా ఉంది. దీన్ని నేనే మీముందు ఒప్పుకుంటున్నాను.

• •

నా కోరికను ఆమె సమ్మతించలేదు. రాముడు వస్తాడు. తనను విడిపిస్తాడు అని నమ్ముతూంది. 'అతను రాలేడు. నిన్ను పొందలేడు. నన్ను చేపట్టి సుఖపడు' అని ఎంతో చెప్పి చూశాను. ఒక ఏడాది గడువు అడిగింది. నేను సరేనన్నాను. ఇప్పుడు మీ సలహా అడుగుతున్నాను. నా కోరిక తీరలేదు. సీతను రాముడికి అప్పగించి అతడ్ని క్షమాపణ కోరడానికి నా మనస్సు ఎన్నటికీ అంగీకరించదు. ఇంతవరకు నేను కాని వీరులైన మిమ్మల్ని ఏ యుద్ధంలోను ఓటమి అనేది ఎరగం. ఒక వానరుడు మాత్రం ఎలాగో సముద్రాన్ని దాటివచ్చి లంకను నాశనంచేసి పోయాడు. రాముడూ, వానరసేనా సముద్రం దాటడం కష్టం, దాటివచ్చినా భయంలేదు. బాగా ఆలోచించి చెప్పండి. రామ లక్ష్మణులను చంపే ఉపాయం చెప్పండి.

నేను ముందుగానే సభచేసి ఉండేవాడిని. కాని కుంభకర్ణుడు లేవలేదని కాచుకొని ఉన్నాను."

రావణుడిలా మోహంతో మతిపోగా తన చింతను దాచుకొని తన మాటలకు కొంత అబద్ధాన్నికూడా జోడించి మాట్లాడాడు. సీత గడువు కోరలేదు. ఏమీలేదు. తన గౌరవాన్ని కాపాడుకోడం కోసం రావణుడే ఇలా అబద్ధం కల్పించాడు.

80. తప్పబుట్టినవాడు

రావణుడి తమ్ముడు కుంభకర్ణుడు లేచి సభలో ఇలా మాట్లాడాడు :

"మహారాజా! నీతి శాస్త్రం తెలియనివాడిలా ప్రవర్తించి పెద్ద అపాయాన్ని కొని తెచ్చుకున్నారు. రామలక్ష్మణుల మీద మీకు పగ ఉంటే ముందు వాళ్లని ఎదిరించి, ఓడించి, సంహరించిం తర్వాత సీతను తెచ్చి ఉండ వలసింది. అలా చేసి ఉంటే సీత మిమ్మల్నితప్ప కుండా ప్రేమించి అంగీకరించి ఉండేది. నది సముద్రంలోకి ప్రవహించి నట్లు విజయం పొందిన వీరుడ్ని ఆమె వెంబడించి ఉండేది. అలా మీరు చేయలేదు. ఎవరి ఆలోచనా అడగకుండానే పాపం చేసి విరోధం సంపా దించుకొని ఇప్పుడు చెయ్యిదాటిపోయిం తర్వాత ఆలోచన అడుగు

తున్నారు. ఇది రాజుకు తగిన ఉత్తమ మార్గం కాదు. కనీసం మధ్యమ మార్గం కూడా కాదు.''

ఇంతవరకూ ధైర్యంగా చెప్పిన కుంభకర్ణుడు అన్న ముఖం చూశాడు. తన కఠినోక్తులు విన్న రావణుడి ముఖం వాడిపోయింది. అది చూసి కుంభకర్ణుడు సహించలేక పోయాడు. శూరుడైన కుంభకర్ణుడికి రావణుడిమీద ఎంతో ప్రేమ. జరిగిందేదో జరిగిపోయింది ఇక దాన్నిగురించి మాట్లాడి లాభంలేదు. అన్నను విడిచి పెట్టడానికి వీల్లేదు అని కుంభకర్ణుడు నిశ్చయించుకున్నాడు.

రాముడు సాటిలేని విలుకాడన్న సంగతి కుంభకర్ణుడికి తెలుసు. రావణుడు పొందిన వరాల లోటుపాట్లు. పరిమితులు కూడా కుంభకర్ణుడికి తెలుసు, అయినా ఇప్పుడు రావణుణ్ని విడిచి పెట్టడానికి వీల్లేదు. అతడ్ని అధైర్యపరచడం వల్ల ప్రయోజనం కూడా లేదు. అందుకని కుంభకర్ణుడు కూడా ఆ మంత్రాలోచన సభలో మిగతా వారిలాగే రావణుడికి ధైర్యం కలిగించే లాగానే మాట్లాడ నారంభించాడు.

''నీవు చేసేది తప్పు. ప్రయోగ విధానంకూడా తప్పు. తర్వాత చేయవలసిన పనిని ముందు చేశావు. ముందు చేయవలసిన పనిని తర్వాత చేస్తున్నావు. అయినా రాముణ్ణి నేను చంపుతాను. నువ్వు భయపడకు. అతడి బాణాలు ఒకటి రెండు నా మీద పడతాయి. అయినా అతడ్ని చంపి, నెత్తురు తాగి నేను మీకు విజయం సాధించి పెడతాను. అన్నా! ఇక చేయవలసిన పనిని నిశ్చింతగా చేసెయ్!'' అన్నాడు.

* * *

కుంభకర్ణుడేదో పూర్వాపర విరుద్ధంగా మాట్లాడాడనీ అతడి మందబుద్ధే దానికి కారణమనీ కొందరు వ్యాఖ్యానించడం కద్దు. శాపం వల్ల ఆరునెలలు నిద్రపోయినా అతడి జ్ఞానానికేమీ కొరతలేదు. మొదట యథార్థాన్ని జంకూ గొంకూ లేకుండా మాట్లాడాడు. తర్వాత రావణుడి పరిస్థితి చూసి జాలిపడి అతనిమీద గాఢానురాగం

వల్ల తనమాటలు మార్చుకున్నాడు. కుటుంబ రక్షణకు కావలసిన సద్గుణా లన్నీ ఆ వీరుడికి ఉన్నాయి.

రావణుడి ముఖ్య సలహాదారు ప్రహస్తుడు. అతడు రావణుడి బల పరాక్రమాలను వివరించి చెప్పాడు. అత డ్నెవరూ జయించలేరనీ అందు వల్ల విచారించవలసిన అవసరం లేదనీ చెప్పి సంతోషపెట్టాడు.

రావణుడుకూడా ఉత్సాహం పుంజుకున్నాడు. "కుబేరుణ్ణి జయించిన వాడనుగదా నేను! అతడ్ని తరుమగొట్టి లంకను హస్తగతం చేసుకున్న నన్ను ఇక్కడికి వచ్చి ఎదిరించగల వా రెవరో చూస్తాను గదా!" అన్నాడు. దాంతో సభ అంతా హర్షధ్వానాలు చేసింది.

* * *

సభలో ఉన్న విభీషణుడు మాత్రం ఆ కోలాహలంలో చేరలేదు. తన అన్న, రావణుడికి ఎంత కోపంవచ్చినా సరే, రాబోయే అపాయాన్ని ఎత్తిచెప్పి అతడ్ని అక్రమ మార్గంనుంచి మళ్లించి రాజ్యాన్నీ, రాక్షస కులాన్నీ కాపాడడం తన కర్తవ్యమని భావించాడు. అందుకనే మిగతావాళ్ళ మాటలను ఖండిస్తూ ఇలా అన్నాడు:

"సీత భయంకరమైన విషసర్పం లాంటిది. ఆమెను ఎందుకు ఎత్తుకొని వచ్చావు? ఆమెను తిరిగి రాముడికి అప్పగించడమే ఇప్పుడు మీ ప్రధమ కర్తవ్యం. ఆ పని చేయకపోతే అందరమూ నశిస్తాం. ఇది నిశ్చయం" అన్నాడు.

రాముడి శక్తి సామర్థ్యాలూ, ఆయుధ ప్రయోగ నైపుణ్యమూ అన్నింటినీ ధైర్యంతో వివరించి చెప్పాడు.

"రాముణ్ణి ఎదిరిస్తే అపజయం నిశ్చయం. మన అదృష్టం క్షీణిస్తుంది. సీతను అప్పజెప్పి, రాముణ్ణి శరణువేడి, మన రాజ్యాన్నీ, సంపదనూ, కాపాడుకుందాం" అన్నాడు.

ఇలా విభీషణుడు వదలకుండా అన్నను ప్రాధేయపడ్డం చూసి ఇంద్రజిత్తు సహించలేక పోయాడు.

"చిన్నాయనగారి మాటలు వింటూవుంటే నాకు సిగ్గుగా ఉంది. మన వంశమేంటి? మన శక్తి ఏంటి? పులస్త్య వంశంలో పుట్టిన వాడు ఇలా మాట్లాడడం, దాన్ని సభవారు సావధానంగా వింటూ ఉండడం నాకు ఆశ్చర్యంగా ఉంది. చిన్నతనం చూపిస్తున్నారు చిన్నాయనగారు. ఆయన మాటను నే నెన్నటికీ అంగీకరించలేను. ఇద్దరు మానవులను చూసి ఇలా ఎవరైనా భయపడతారా? ఇంద్రుణ్ణి ఎడి దేవగణాన్ని తన్ని తరిమి మనం జయం పొందలేదా? ఇప్పుడు లోకమంతా మనల్నిచూసి గజగజ లాడడంలేదా? విభీషణుడు చెపుతున్న ఈ ఆలోచన మనకు అవమానకరంగా ఉంది" అన్నాడు ఇంద్రజిత్తు.

అది విన్న విభీషణుడు "బాబూ ! నీకు అనుభవం చాలదు. ఇలాగే మాట్లాడుతావు. నువ్వు రాజపుత్రుడవే అయినా రాజును చెరచడానికి వచ్చిన శత్రువువని నా ఉద్దేశం. రాజుకు హితం చెప్పడానికి ఉన్న మంత్రులారా! రాజు నాశనం కాగల ఆలోచన చెపుతున్నారు. లంకేశ్వరా! నా మాట తిరస్కరించకు. జానకిని సగౌరవంగా రాముడికి అప్పగించి జరిగిన పొరపాటును క్షమించమని ప్రార్థించు. ఇంతకు మించి వేరే మార్గంలేదు. లేకపోతే అందరమూ నశించిపోతాం" అన్నాడు.

* * *

రావణుడికి కోపం రెచ్చిపోయింది.

"తమ్ముడవుకదా అని ఇంతవరకూ నీవు ఏం మాట్లాడుతున్నా ఊరుకున్నా లేకపోతే ఈ పాటికే నీ ప్రాణాలు ఎగిరిపోయి ఉండేవి. శత్రువైన తోబుట్టువుకన్న చెడిపేవారు మరొకరుండరు. శూరులకు అపజయాన్ని కొనితెచ్చేవాళు అసూయా పరులైన తమ్ములూ దాయాదులేనన్న సంగతి అందరికీ తెలిసిందే. వాళ్లు తమ మనస్సులోని కుళ్ళు పైకి పొక్కకుండా ఉంచుకొని సమయం వచ్చినప్పుడు ద్రోహం చేస్తూ ఉంటారు. కథలో అడవి ఏనుగులు ఏమన్నాయి? 'దావాగ్నికి మేం భయపడం. బోయవాడి ఈటెను లెక్కచేయం. ఉచ్చు పోసి ఈడ్చే తాడు కాని గొలుసు కాని మమ్మల్ని ఏమీ చేయలేవు. కాని ఈ

పాపిష్టి సాటి ఏనుగులు బోయలతో చేరి మమ్మల్ని బాధిస్తున్నాయి అన్నదే మా భయం!' అని, కథలో ఆ ఏనుగు లన్న మాటల్లో ఎంత నిజం వుంది. సుఖంగా ఉన్నంతవరకు తమ్ముడు నవ్వుతూ సంతోషంగా ఉంటాడు. అపాయం వచ్చినప్పుడు విడిచిపెట్టి పోతాడు. తియ్యగా తేనె తాగి, తర్వాత తేనెటీగ ఇంక ఆ పూవుమీద వుంటుందా? వేరే పూవును వెతుక్కుంటూ పోతుంది. దాయాదుల సంగతి కూడా అంతే. ఇలా మరొకరు మాటాడిఉంటే ఇక్కడి కిక్కడే హతమార్చి ఉండేవాడ్ని. నీచుడా! కులానికి కళంకం తేవడానికే పుట్టావు!" అని రావణుడు బుసకొడుతూ విభీషణుణ్ని నానా మాటలన్నాడు:

* * *

అవమానం సహించలేక విభీషణుడు లేచాడు. "అన్నా! మీరు ధర్మచ్యుతు లైనప్పటికీ నాకు ఇప్పటికీ అగ్రజులే ఈ సభలో మీరు చేసిన అవమానాన్ని నేను సహించలేక పోతున్నాను. కాలపాశం మిమ్మల్ని వినాశనమార్గానికి ఈడుస్తూంది. నేను చెప్పిన హితం మీకు రుచించడం లేదు. చెవుల కింపైన మాటలు చెప్పడం సులభం. మీ మంత్రులు చేస్తున్న పని అదే. మీ క్షేమాన్ని కోరే ఇది చెపుతున్నాను. అయినా అది మీకు నచ్చలేదు. రాముడి బాణాలు మిమ్మ్ము దహించాలని నేను కోరడం లేదు. అందుకనే ఈ హితవు చెపుతున్నాను.

నన్ను మీరు శత్రువన్నారు. సరే. మీరు క్షేమంగా ఉండండి. నగరాన్ని, మీ ప్రాణాన్ని కాపాడుకొండి! నేను వెళ్లిపోతున్నాను. మీరు సుఖంగా ఉండండి! ఆపదలో సాయపడదామని చూశాను. వీలుకాలేదు. మీ అభ్యుదయం చూసి అసూయ పడుతున్నా నని అనుకుంటున్నారు. వినాశకాలంలో మంచి ఆలోచనలు విషంగానే తోస్తాయి."

ఇలా చెప్పి విభీషణుడు ఇక లంకలో తనకు తావు లేదని నిర్ణయించుకున్నాడు. అన్నిటినీ వదిలివేసి, అక్కడనుంచి అప్పుడే ఆకాశానికి ఎగిరి రామలక్ష్మణులున్న తావుకు బయలుదేరాడు.

"రావణుడితో పొరపొచ్చం పుట్టింతర్వాత కాలుతున్న నేలమీద కాలు నిలవనట్లు అక్కడ అడుగులు కొలాయి" అని 'వడక్కుయార్' అనే భక్తుడు "యీడు" అనే వ్యాఖ్యానంలో చెప్పారు. విభీషణుడి వెంట మరి నలుగురు మిత్రులు కూడా వెళ్లారు.

81. శత్రువా? - మిత్రుడా?

పాపం చేయడంవల్ల వచ్చిన ఈ అపాయంనుంచి ఎలా తప్పించుకోవడమా అని రావణుడు సతమతమయ్యాడు. రాజుల ఆచారం ప్రకారం మంత్రాలోచన సభ జరిపించాడు. సభలో అంతా తీయతీయగా మాట్లాడారు. కాగా, రావణుడికి కోపం వచ్చేట్లు ఇద్దరు మాత్రం కఠినంగా మాట్లాడారు. "నీవు తప్పు చేశావు! అయినా నీ కోసం నేను ప్రాణాలిస్తాను." అని కుంభకర్ణుడన్నాడు.

"పాపం చేశావు. అయినా ఇప్పటికి కూడా తప్పించుకోడానికి దారి ఉంది. ఆ మార్గాన్ని అనుసరిస్తే మన మంతా నాశనం కాకుండా బతకవచ్చు. సీతను అప్పగించి రాముణ్ణి శరణువేడు!" అని విభీషణుడన్నాడు. దాన్ని కాదన్నాడు రావణుడు. అయితే నిన్ను విడిచి పోతున్నానన్నాడు విభీషణుడు.

ఏదైనా ధర్మసంకటం వచ్చినప్పుడు ప్రతివాళ్లూ తమతమ స్వభావాలను అనుసరించి నడుచుకుంటారు. అంతా ఒకే తీరుగా ఉండరు.

గర్వం విడవడానికి రావణుడి మనస్సు ఒప్పుకోలేదు. పాప కార్యం చేయడమే కష్టమైతే చేసిన పొరపాటును ఒప్పుకొని తన ఓటమిని అంగీకరించడం అంతకన్నా కష్టం. పాపం చేయడానికి ధైర్యం కావాలి. పాపం చేసినట్లు ఒప్పుకొనడానికి రెండింతల ధైర్యం కావాలి. ఆ ధైర్యం రావణుడికి లేదు. అతడి స్వభావంలో అలాంటిదానికి తావే లేదు.

అధర్మ మొకటి జరిగినప్పుడు పాపం చేసిన వాళ్ళ ఆప్తులకు ఒక పెద్ద సమస్య ఎదురవుతుంది. "ఈ యింట్లో నేను తిండి తిన్నానే

ఇతడ్ని ఎలా విడిచిపెట్టాలి? తోడబుట్టినవాడు తెలియక తప్పు చేశాడు. అతడ్ని నేను విడిచి పెట్టడం పిరికితన మవుతుంది" అని ఇలాంటి సమస్యలు, చిక్కులు ఎదురవుతాయి. తనవాళ్ళు చేసిన అధర్మంలో తాముకూడా భాగం పంచుకొనడమే వీరుల కర్తవ్యం అని కొందరు నిశ్చయించారు. అందుకు భిన్నంగా అనుకునే వాళ్ళూ ఉన్నారు. తప్పు చేసినవాళ్ళని సరిదిద్దడానికి కావలసిందంతా చేస్తారు. దానివల్ల కలిగే కోపతాపాలను, నష్టాలను లెక్కచేయకుండా తాము చేయగలిగిన ప్రయత్నమంతా చేస్తారు. ఆ ప్రయత్నమంతా వృధా అయిం తర్వాత పాపం చేసిన వాడినే వదిలేస్తారు. అంతేకాని ధర్మాన్ని మాత్రం వదలరు. అధర్మంతో చేరడం ఎన్నటికీ కర్తవ్యం కాదని వాళ్ళ అభిప్రాయం. చేయవలసిన ప్రయత్నాలు చేయకపోవడంకూడా అధర్మమే. అదంతా చేసింతర్వాత కూడా వాళ్ళ కర్తవ్యం యింకా ఉంటుంది. ధర్మాన్ని తిరస్కరించి అన్నకోసం తమ్ముడు కానీ, తమ్ముడికోసం అన్నకానీ అధర్మంలో భాగం పంచుకోవడం సరి కాదని వాళ్ళ నిర్ణయం.

రామాయణంలో కుంభకర్ణుడూ విభీషణుడూ ఈ రెండు పక్షాలకూ గొప్ప ఉదాహరణలుగా ఉన్నారు. "సీతను అపహరిద్దాం! దండకారణ్యానికి వెళదాం" అని రావణుడు ఎంత వేడుకున్నా విభీషణుడు వెళ్ళి ఉండేవాడా? అలా వెళ్ళి ఉండడానికి వీలయ్యేదా? వెళ్ళి ఉంటే విభీషణుణ్ణి ఎవరైనా మెచ్చుకుంటారా?

"ఇప్పటికైనా సీతను తిరిగి అప్పగించు. క్షేమంగా ఉంటావు. రాముడు మన్నిస్తాడు. అదే ధర్మం" అని చెప్పి చూశాడు. వినలేదు. నిజంగా పాపాల్ని తిరస్కరించే ఒక ఆత్మకు పట్టుదలతో మూర్ఖత్వంతో నిలిచిన రావణుణ్ణి విడిచిపెట్టడంకన్న వేరే మార్గంలేదు. కనక విభీషణుణ్ణి తప్పు పట్టడానికి వీల్లేదు. మనలో ధార్మికత లోపించడంవల్లనే విభీషణుడిలో తప్పు పడతాం.

అయినా కుంభకర్ణుడిది మాత్రం తప్పు అని చెప్పగలమా ? అది కూడా వీలుకాదు. రక్త బంధుత్వం అనే పాశానికి కట్టుబడి ప్రాణత్యాగం చేశాడు. మారీచుడు కూడా అలాగే చేశాడు. కుంభకర్ణుణ్ణి

నిందించడానికీ వీల్లేదని ఏ కారణంవల్ల చెపుతామో ఆ కారణం వల్లనే విభీషణుడు చేసిందికూడా తప్పు కాదనే చెప్పాలి. ఈ కాలంలో కొందరికి ధర్మ విరుద్ధంగా మాట్లాడడంలోనే ఎక్కువ అభిరుచి ఉంది. కనక ఈ విషయాన్ని ఇక్కడ పొడిగించి వ్రాయవలసి వచ్చింది.

పాపంచేస్తే మిత్రుల స్నేహాన్ని, బంధువుల సహాయాన్ని తప్పకుండా పోగొట్టుకుంటాం అన్న భయం ఉండాలి. ఎలాగైనా వీళ్లు మనకు తోడుగానే ఉంటారు, మనల్ని విడిచిపెట్టరు అన్న ధైర్యం కలిగించామంటే, లోకంలో పాపాన్ని అడ్డగించడం చాలా కష్టమైపోతుంది. సాధారణంగా ప్రజలను పాపాలవైపు ఈడ్చే భావాలకు బలం ఎక్కువ. దానికి ఇదికూడా తోడైతే ఇక చెప్పాలా?- ఇది జ్ఞాపకం ఉంచుకోకుండా కొందరు వాదిస్తారు. విభీషణుణ్ణి కులద్రోహి అని రావణు డొక్కడే తిట్టలేదు. మనలో చాలామంది కూడా విభీషణుణ్ణి ఇలాగే అంటున్నారు. తమ చెడు ప్రయత్నాలకు తమవాళ్ళ సాయాన్ని పొందగోరేవాళ్లు, దానికి ఎవరూ ఆటంకం కలిగించరాదని అనుకునేవారు. విభీషణుణ్ణి పాపి అనీ, ద్రోహి అనీ నిందించడం పరిపాటి. కులద్రోహి అయిన అన్న నిందకు భయపడకుండా విభీషణుడు అధర్మ పథంనుంచి వైదొలగాడు అలా వైదొలగిన విభీషణుడి గతి కష్టతరమే అయింది. మరింక జరిగిన సంగతి వినండి.

* * *

సముద్ర ఉత్తరతీరాన నిలిచిన వానరులు హఠాత్తుగా ఆకాశాన ఒక ప్రకాశాన్ని చూశారు. స్వర్ణ కిరీటాన్ని ధరించి ఆకాశ వీధిలో మేరు పర్వతంలాగ ఒక జ్యోతిర్మూర్తి జ్వలించడం చూశారు. మేఘాలమధ్య మెరుపుతీగె మాయమవకుండా అలాగే నిలిచినటు ఉంది ఆ కాంతి. తేరి చూడగా పెద్ద ఆకారాలుగల అయిదుగురు రాక్షసులు ఆకాశంలో నిలిచినట్లు తేలింది. వానర సేనాధిపతీ, రాజూ అయిన సుగ్రీవుడు ఇది చూసి "సందేహంలేదు. ఈ రాక్షసులు నన్ను చంపడానికే లంకనుంచి వచ్చారు" అన్నాడు.

• •

తమ రాజు ఇలా అనగానే వానరవీరులు చెట్లూ, బండలూ తీసుకుని యుద్ధానికి సిద్ధమయ్యారు. "మహారాజా! ఆజ్ఞ ఇవ్వండి. వీళ్ళనిక్కడే అడ్డగించి నేల కూలుస్తాం" అని గర్జించారు.

ఇలా వానరులు తమలో తాము చెప్పుకుంటూ సింహనాదాలు చేయడం విన్నాడు విభీషణుడు. అతడు చలించలేదు. అక్కడే నిలబడి నిష్కల్మష హృదయంతో గంభీరంగా ఇలా అన్నాడు:

"నేను రాక్షస రాజు రావణు డనే దుష్టుడి తమ్ముడ్ని. నన్ను విభీషణు డంటారు. ఇప్పుడు మీ ముందు నిలబడి ఉన్నాను. సీతను బలాత్కారంగా హరించి. జటాయువును సంహరించి, ఆమెను రాక్షస స్త్రీల కాపలాలో చెరపెట్టిన రావణుడి తమ్ముడ్ని నేను. 'ఇది తగని పని. సీతను రాముడికి అప్పగించి ఆయనను క్షమాపణ వేడు'మని నేను పరి పరివిధాల చెప్పి చూశాను. కాని అతనికి వినాశకాలం దాపురించడంవల్ల నా మాటలు పెడచెవిని పెట్టాడు. పైగా సభ మధ్య న న్నొక బానిస కన్నా నీచంగా చూసి, తిట్టి అవమానించాడు. కాబట్టి ఇక్కడికి వచ్చేశాను దేశాన్ని, నగరాన్ని, భార్యాబిడ్డలను కాదని రాఘవుణ్ణి శరణు వేడడంకోసం వచ్చాను. శ్రీపతికి ఈ విషయాన్ని శీఘ్రమే విన్నవించి నన్ను అనుగ్రహించండి."

సుగ్రీవుడు వెంటనే రాముడి దగ్గరికి వెళ్ళి విషయ మంతా చెప్పాడు. "రావణుడి తమ్ము డైన విభీషణుడు మరి నలుగురు రాక్షసులను వెంటపెట్టుకొని వచ్చి మిమ్మల్ని శరణు వేడుతున్నాడు. వాళ్లు వచ్చి ఆకాశంలో నిలబడి ఉన్నారు. నీతిశాస్త్రం తెలిసిన మీరు దీన్ని గురించి బాగా ఆలోచించండి. ఈ రాక్షసులు రకరకాల మాయ వేషాలు వేసారు. కంటికి కనబడకుండా ఉండి పనులు చేసారు. దుష్టులకుండే శక్తి సామర్థ్యాలన్నీ వాళ్ళకున్నాయి. వీళ్ళని నమ్మనే కూడదు. వీళ్లని రాక్షసరాజు రావణుడే పంపా డని నే ననుకుంటున్నాను. మనతో చేరి మన ఐకమత్యాన్ని చెడగొట్టడానికే వీళ్లు వచ్చారు. లేదా సమయం చూసి మనలో ముఖ్యుల్ని చంపేసి, తిరిగి పోతారు. ఈ విభీషణుడు ఎంత మంచివా డయినా మన పరమశత్రువుకు స్వంత తమ్ము డన్న విషయం మరవరాదు. పుట్టుకతోనే దుష్ట

స్వభావంగల రాక్షసుడు. ఇతడ్ని మనం ఎలా నమ్మగలం ? ఇదంతా రావణుడి కుట్రే. అందులో సందేహం లేదు. ఇతడ్ని, ఇతడి సహచరులను వధించడమే ఉత్తమం. ఇతడ్ని మనలో చేర్చుకుంటే సమయం చూసి మనలను మోసం చేస్తాడు. మనకు చెరుపు చేసి మరీ పోతాడు. దుష్టుడూ, దయాహీనుడూ అయిన రావణాసురుడి తమ్ముడు ఇతడు. ఇతడ్ని, ఇతడి సహచరులనూ వధించడానికి వెంటనే ఆజ్ఞాపించండి'' అన్నాడు.

తన అభిప్రాయాన్నిలా దాచకుండా చెప్పి రాముడి ఆజ్ఞ కోసం దురుచూస్తూ నిలబడ్డాడు సుగ్రీవుడు.

వానరరాజు చెప్పిన మాటలు విని రామచంద్రుడు పక్కనున్న హనుమంతుడు మొదలైన వానర ముఖ్యులతో ఇలా అన్నాడు : "నీతి శాస్త్రం తెలిసిన రాజు చెప్పిందంతా విన్నారు కదా ? రావణుడి తమ్ముడు వచ్చి నిలబడి ఉన్నాడు. అతడ్ని గురించి మీ అభిప్రాయం ఎమిటో చెప్పండి. క్లిష్ట సమయాల్లో బంధుమిత్రుల ఆలోచన చాలా ముఖ్యం. మీకు తోచింది మీరు జంకూ కొంకూ లేకుండా చెప్పండి."

ఒకొక్కళ్లూ తమతమ అభిప్రాయాలను చెప్పసాగారు :

యువరాజు అంగదుడు ఇలా అన్నాడు : "ఇతడు మన శత్రు సమూహంలోనుంచి వచ్చాడు. స్వయంగా వచ్చాడో, శత్రువులు పంపగా వచ్చాడో మనకు తెలియదు. ఇతడ్ని కాదనడం కూడా న్యాయం కాదు. పరీక్ష చేయకుండా చేర్చుకుంటే మనకు ప్రమాదం కలగవచ్చు. అందుకని ఇతడ్ని గురించి వెంటనే ఒకనిర్ణయానికి వచ్చేందుకు వీల్లేదు. ఇతడి నడవడి మనకు సందేహాస్పదంగా కనిపిస్తే అప్పుడు వెళ్ళగొడదాం. మంచివాడని తోస్తే చేర్చుకొందాం."

తరవాత శరభుడు ఇలా అన్నాడు : "ఇతడ్ని ముందు మనలో చేర్చుకొని ఆ తర్వాత ఒక నిర్ణయానికి రావడం అంత క్షేమకరం కాదని నా అభిప్రాయం. మనలో సమర్థులైన చారులను మొదటే పంపి పరీక్షించి ఒక నిర్ణయానికి రావడం మంచిది."

జాంబవంతుడు ఇలా అన్నాడు : "ఇలాంటి వాళ్ళని పరీక్ష చేయడంవల్ల ఏ సంగతీ బయటపడదు. మనస్సులో ఉన్న అభిప్రా

యాన్ని దాచుకుని వంచన చేదామనే ఉద్దేశంతోనే ఇతడు వచ్చి ఉంటే ఆ విషయాన్ని పరీక్షచేసి కనిపెట్టడం సాధ్యంకాని పని. రావణుడు మనకు పరమ శత్రువు. అత ్న హఠాత్తుగా విడిచిపెట్టి వచ్చినట్లు ఇతడు చెపుతున్నాడు. దీన్ని మనం అంగీకరించలేం. మన మింకా సముద్రాన్ని దాటలేదు. మన మింకా ఇవతలి ఒడ్డున ఉండగానే ఇతడు వచ్చి శరణు పొందడానికి కారణం ఏమిటి? ఇది చాలా సందేహంగా వుంది. ఇతడిది వంచక సమూహం. ఇతడ్ని మనలో చేర్చుకోకూడదని నా అభిప్రాయం."

మెందుడు ఇలా అన్నాడు: "కేవలం అనుమానంమీద ఒకళ్ళని తోసివేయవచ్చా?- ముందితడ్ని యుక్తిగా పరీక్షించి తర్వాత ఒక నిర్ణయానికి రావాలి. రావణుణ్ని విడిచిపెట్టి వచ్చినట్లు చెపుతున్నాడు. దీని నిజానిజాలను మనం చూడాలి. ఇతడితో కొందరు మాట్లాడి చూసిన పిమ్మట ఒక నిర్ణయం చేదాం. ఇందుకు కావలసిన శక్తి సామర్థ్యాలు మనలో లేకపోలేదు."

తర్వాత రాముడు జ్ఞాననిధియైన హనుమంతుణ్ని చూశాడు.

82. విభీషణ శరణాగతి

తన అభిప్రాయాన్ని తెలుసుకోవాలని రాముడు కోరడం చూసి వాయుపుత్రుడు ఇలా అన్నాడు:

"మీరు మమ్మల్నందరినీ అడగడం ఎందుకు? బృహస్పతి దిగివచ్చినా మీకన్నా ఎక్కువ ఏం చెప్పగలడు? నా కన్నా ముందు మాట్లాడిన వాళ్ళు సరిపోని యుక్తులలోనా కేం పసా కనిపించడంలేదు. అతడ్ని చేర్చుకొనడంలో అపాయం ఉంటే అలాంటి అపాయం వెంటనే వస్తుంది. అప్పు డిక పరీక్ష చేయటానికి అవకాశ మేదీ?- అదీకాక ఈ విభీషణుడు దొంగచాటుగా రాలేదుకదా. బహిరంగంగా వచ్చి మన అందరిముందూ నిలబడ్డాడు. అటువంటప్పుడు చారులు ఇతడివద్దకు పోయి వెతకడానికి రహస్యం ఏముంటుంది?

హఠాత్తుగా అకారణంగా ఒకడు శత్రు సమూహంనుంచి వచ్చి నిలబడితే అతడ్ని నమ్మడ మెలా అని కొందరు సందేహపడారు. తన అన్నయైన రావణుడి దుర్గుణాలను విభీషణుడు చూసి అతడ్ని ఏవగించుకుంటున్నా డంటే అందులో ఆశ్చర్య మేముంది? మీ పరాక్రమాన్నీ, ధర్మాన్నీ గొప్పతనాన్నీ ఇతడు చూశాడు. కాబట్టి ఇతడు వచ్చిన సమయ సందర్భాలను చూస్తే నా మట్టుకు నాకేం సందేహమూ కలగడంలేదు.

ఇతణ్ని చేర్చుకోడానికి ముందు దూతలుపోయి ప్రశ్నలు వేసి ఇతడి గుణగణాలను తెలుసుకొనవచ్చునని కొంద రన్నారు. ఒకర్ని గురించి మనం సందేహిస్తున్నట్లు అతనికి తెలియగానే అతడు స్వభావ విరుద్ధంగా మాట్లాడడం. నడచుకొనడం అతనికి వీలుకాదు. మనం అతడిలో దోషాలు వెతుకుతున్నా మనే బెరుకు ఉంటూనే ఉంటుంది. అదే అతడి సహజ స్వభావాన్ని దాస్తుంది. ఆ రాక్షసుడి ముఖకవళిక. మాటలతీరు చూస్తే నా కేమీ అనుమానం కలగడం లేదు. ఇతడి మనస్సులో వంచన లేదనడానికి చింతలేని ఇతడి ముఖమే తార్కాణం. మనస్సులోని మాటను ఎంత దాచుకోవాలని ప్రయత్నించినా ముఖం దాన్ని బైట పెడుతూనే ఉంటుంది. ఇది నీతిశాస్త్రం చెప్పే సత్యం. విభీషణుడు నిజంగానే మిమ్మల్ని శరణు వేడడానికి వచ్చాడని నా అభిప్రాయం. ఇలా ఇతడు రావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. రావణుడి దోషాలు ఇతడికి తెలుసు. లంకేశుడు ఓడిపోతాడని కూడా తెలుసుకున్నాడు. మీరు వాలిని వధించి సుగ్రీవుడికి రాజ్యం ఇచ్చిన సంగతి కూడా ఇత డెరుగును. అలాగే తానుకూడా లంకాధిపత్యం పొంద వచ్చు ననుకొని వచ్చినట్లు అనుకుందాం. ఇందులో దోషం ఏమీ లేదు; సందేహానికీ తావులేదు. కాబట్టి ఇతడ్ని మనలో చేర్చుకొనవచ్చు ననే నా అభిప్రాయం.

నా బుద్ధికి అందినంతవరకు చెప్పాను. ఇక మీరు నిర్ణయించి ఎలా బాగుంటే అలా చేయండి. మీ ఆలోచనకు మించిన ఆలోచన మా కెక్కడిది?'' అని హనుమంతుడు చెప్పాడు.

• •

వానర నాయకులు ఇలా విభీషణుణ్ణి గురించి రకరకాల ఆలోచనలు చెప్పారు.

సామాన్య ధర్మాన్ని అనుసరించి కుంభకర్ణుడు నడుచుకున్నాడు. అది అందరికీ బోధపడే విషయం. అందులో వింత ఏమీ లేదు.

సామాన్య ధర్మానికి అతీతమైన విశేషధర్మాన్ని అనుసరించి నడుచుకోవడమే విభీషణుడు చేసిన పాపం. ధర్మవిరుద్ధంగా అన్న చేస్తున్న పనులవల్ల అతడి అంతరాత్మ ఎంత క్షోభించిందో అతడికే తెలుసు. సామాన్యులకు అవి బోధపడదు. అందువల్ల అతడి నడవడి రాముడి దగ్గరవున్న వానరులకు కూడా సరిగా అర్థం కాలేదు. ఈ కాలంలో కూడా విభీషణుడు చేసిన పనిలో తప్పు లేదని ప్రజలు గుర్తించడం చాలాకష్టం. వాళ్ళకి నచ్చజెప్పాలంటే తలప్రాణం తోకకి వస్తుంది.

వానర నాయకులు చెప్పిందంతా రాముడు సావధానంగా విన్నాడు. ఆఖరికి వాయుపుత్రుడు చెప్పింది విని చాలా సంతోషించాడు. ధర్మ రక్షణలో సదా నిలకడగల రాముడికి హనుమంతుడి మాట నచ్చింది; మనశ్శాంతి నిచ్చింది. మంచివాడు తలపెట్టిన ధర్మ కార్యానికి ఇతరుల ఆలోచన కూడా వుంటే మనస్సుకు ఎంతో శాంతి వుంటుంది.

"స్నేహితుడ్నని చెప్పి ఒకడు నా వద్దకు వస్తే అతడ్ని నేనెలా కాదనగలను? ఇది నా ధర్మం. నా మిత్రులై, నా కోసం పాటు పడుతున్న మీ రంతా దీన్ని తెలుసుకోండి. 'శరణు' అని ఎవడు వచ్చినా అతడిలో దోషాలు ఎంచకూడదు" అని రాముడు చెప్పగా విని సుగ్రీవుడు సమాధాన పడ్డాడు.

"ఈ రాక్షసుడు మంచివాడే కావచ్చు. కాని తన అన్న పెద్ద ఆపదలో ఉన్నప్పుడు అతడ్ని విడిచి వచ్చాడు. ఇలాంటివాడు అదనులో మనల్ని విడచిపోతా డేమో! తన అన్నకు చేసిన మోసం మన కెందుకు చేయడు?" అని సుగ్రీవుడు అడిగాడు.

సుగ్రీవుడు ఇలా అడగ్గానే రాముడు లక్ష్మణుణ్ణి చూసి కనిపించీ కనిపించని మందహాసం చేశాడని వాల్మీకి మహర్షి చెపుతున్నాడు.

• •

సుగ్రీవుడు తన కథనే మరచిపోయి మాట్లాడ్డాన్ని గురించి వాల్మీకి మహర్షి ఇలా రసవంతంగా చూపాడు.

"మీరు చెప్పింది నాకు తెలుసు. అయినా నేను చెప్పేది కూడా వినండి" అన్నాడు రాముడు. "రాజ పదవిలో ఉన్నవాళ్ళు అన్న తమ్ముళ్లను దాయాదులను, ఇరుగుపొరుగు రాజులను గురించి ఎప్పుడూ సందేహిస్తూ ఉండడం సహజం. అలా సందేహించని మంచివాళ్లూ ఉన్నారు. కాని చాలామంది వాళ్ళని చూసి ఇతరులు అసూయ పడుతున్నా రనుకొంటారు. రావణుడు విభీషణుణ్ణి ఇలాగే సందేహించి నిందించడంలో ఆశ్చర్యం ఏముంది?

ఇంక లంకలో ఉంటే తనకు అపాయం తప్పదని విభీషణుడు భయపడడంకూడా సహజమే. కనక అతడు మనల్ని శరణు పొందడానికి రావడంలో కపటం ఏమీ లేదని నా అభిప్రాయం. అదీకాక రాజ్యంమీద ఆశఉండే వచ్చి ఉండవచ్చు. రావణుడు నశిస్తాడు. మనం విజయం పొందుతా మనీ, అన్న రాజ్యాన్ని తాను పొందవచ్చు ననే మన వద్దకు వచ్చాడని అనుకొందాం. అందులోమాత్రం దోషం ఏముంది? లక్ష్మణా! అంతా మన భరతుడి లాగానే ఉంటారా?" అన్నాడు రాముడు.

ఇలా అన్న రాముడిమనస్సులో ఒక్క క్షణంసేపు భరతుడు మెదిలాడు. "లోకంలో నాలాంటి భాగ్యవంతులు మరెవరు? భరతుడి లాంటి తమ్ముణ్ణి పొందాను. నేను అడవికి వెళ్లా నన్న దుఃఖంతో నాన్నగారు ప్రాణాలే వదిలారు. నాకూ, లక్ష్మణుడికీ అలాంటి ప్రియమైన తండ్రిగా రున్నారు. నీ లాంటి మిత్రులుకూడా నాకు తప్ప మరెవరి కున్నారు?" ఇలా అంటుండగానే కళ్లలో నీళ్లు తిరిగాయి రాముడికి.

"రావణుణ్ణి విడిచి పెట్టినట్లుగానే విభీషణుడు మనలనుకూడా విడిచి పెడతా డనే వాదనలో నాకు న్యాయం కనిపించడంలేదు. మనల్ని విడిచిపెట్టడానికి విభీషణుడికి కారణం ఏముంటుంది? ఆ రాజ్యంమీద మనకు ఆశ ఉందా? లేదు. మనం విజయం పొందినప్పుడుకదా అతడి ఆశ నెరవేరడం? ఈ కారణాలవల్ల మనం విభీష

ణుణ్ణి చేర్చుకోకుండా పొమ్మనడం పొరబాటు. నేను చెప్పిందంతా నీతిశాస్త్ర విషయం.

నిజానికి మంచివాడైనా చెడవాడైనా ఒకడు శరణంటూ వస్తే అతడ్ని నేను తిరస్కరించలేను. ఇదినా స్వభావం. అందువల్ల నాకు కష్టనష్టాలు వచ్చినా లెక్కపెట్టను. నా ప్రాణానికి ముప్పు వచ్చినప్పటికీ నా ధర్మాన్ని నేను కాపాడి తీరుతాను. అంతేకాని దాన్ని విడిచిపెట్టలేను. ఇతడివల్ల నా కేం అపాయం కలుగుతుందో అని నేను భయపడడంలేదు రావణుడే వచ్చి శరణన్నప్పటికీ మారు ఆలోచన లేకుండానే అభయమిస్తాను. అలాంటిది అతడి తమ్ముణ్ణి నే నెలా కాదంటాను? పోయి విభిషణుణ్ణి తీసుకురండి'' అని రాముడన్నాడు.

"రామచంద్రా! నేను కళ్ళు తెరిచాను. ఇప్పుడే తీసుకువస్తాను. విభీషణుడు కూడా మావలెనే మీకు ప్రియమిత్రుడగుగాక!'' అని చెప్పి సుగ్రీవుడు విభీషణుని వద్దకు వెళ్ళాడు.

* * *

రావణుణ్ణి కాదని వచ్చిన విభీషణుణ్ణి రాముడు తన ఆశ్రితులలో చేర్చుకున్న ఈ ఘట్టాన్ని, వైష్ణవ సంప్రదాయం ప్రకారం నడచుకొనేవాళ్ళు, మహాభారతంలో భగవద్గీతలాగా ఒక ప్రత్యేక శాస్త్రంగా పరిగణిస్తున్నారు పరమాత్మను ఎవరు శరణు పొందినా వారి దోషా లెంచక సందేహించక అభయమిస్తాడు. ఆ శరణాగతి ప్రయత్నంలోనే సకల దోషాలూ కాలి బూడిద అవుతాయి అన్న తత్వానికి ఈ విభీషణ శరణాగతి తత్వం, అమృతప్రాయంగా ఉంటుంది. శరణాగతి చేసినవారికి ముక్తి ఉంది. ఎలాంటివాళ్ళకైనా సరే శరణాగతివల్ల ముక్తి కలుగుతుందనేది వైష్ణవ సంప్రదాయానికి జీవగర్ర!

వైష్ణవ సంప్రదాయానికే కాదు—మన దేశీయులు అనుసరిస్తున్న అన్ని సంప్రదాయాలకూ కూడా ఇది జీవగర్ర అని చెప్పవచ్చు. ప్రతి మార్గంలోనూ ఉపదేశానికి దీన్నే విశేషంగా నొక్కి చెపుతారు. "భయపడకు. చింతించకు. అన్ని పాపాలనూ నేను తీరుస్తాను'' అని కృష్ణుడు

కేవలం అర్జునుడికి మాత్రమే చెప్పలేదు. ఆ కృష్ణుడు లోకంలో ఎక్కడెక్కడ అవతరించినా ఈ మాటే చెపుతుంటాడు.

రామాయణంలో రావణుడి తమ్ముడ్ని శ్రీరాముడు చేర్చుకొన్న ఈ ఘట్టాన్ని వాల్మీకి చిత్రించిన తీరును బట్టి రెండు భాగాలుగా విభజించవచ్చు. పగవాళ్ళనుంచి వచ్చిన ఒకర్ని తమలో చేర్చుకోడానికి పూర్వం నీతిశాస్త్రం ప్రకారం ఎలా విమర్శించి చూడాలో మహర్షి విపులంగా వివరించాడు. దాన్ని సుగ్రీవుడి నోటమ్మటా, సంస్కార సంపన్నుడూ సత్ప్రవర్తనకు శిఖరంవంటివాడూ అయిన హనుమంతుడి నోటా, ధర్మానికి దృఢంగా కట్టుబడే శ్రీరాముడి నోటా సంగ్రహంగా స్పష్టంగా పలికించాడు

నీతి శాస్త్ర వివరణ దగ్గర రాముడి సంస్కారాన్ని, సహజ సద్గుణాన్ని మనం చూస్తున్నాం. 'ఎవరు శరణన్నా లేదు పొమ్మనడం నాకు చేతకాదు. అది నా ధర్మం' అన్నాడు రాముడు.ఇదే రామచంద్రుడి ధర్మం. రావణుడే వచ్చి శరణన్నప్పటికీ అతడ్ని తిరస్కరిస్తానా ? అని సుగ్రీవుడ్ని ప్రశ్నిస్తున్నాడు.

రామచంద్రుడ్ని ఈశ్వరావతారంగా భావించే వాళ్ళకి ఈ ఒక్క వాక్యమే ఒక ప్రత్యేక శాస్త్రం. గీతలో "మాశుచఃచింతించకు" అని కృష్ణుడు చెప్పిన శాస్త్రాన్నే రామచంద్రుడూ విభీషణ శరణాగతి ఘట్టంలో సుగ్రీవుడికి చెప్పాడు పాపం పండిన లోకానికి ప్రాణాన్ని, ప్రకాశాన్ని ఇవ్వగల ఔషధం ఇది.

83. సేతుబంధనం

ఈమధ్యలో రావణుడు ఒక పిచ్చిపని చేశాడు. ఒక గూఢచారిని పంపి సుగ్రీవుడి మనస్సు మార్చడానికి చూశాడు. మహోడనే ఆ రాక్షసుడు ఆకాశ మార్గాన వచ్చి సుగ్రీవుడ్ని ఏకాంతంగా కలుసుకొని ఇలా చెప్పాడు :

"లంకేశ్వరుడు రావణుడు నన్ను మీ వద్దకు ప్రేమతో పంపాడు. మీరు రాజ్యాధిపతులు. రావణుడు కూడా రాజు. దేశభ్రష్టుడైన

ఈ రాముడు కూడా రాజేనా? దేశభ్రష్టు డైన ఈ రాముడితో మీరు చేరవలసిన పని ఏమీలేదు. రాముడితో చేరి ఒక రాజ్యాధిపతు లైన మీరు రావణుడి దీర్ఘ విరోధాన్ని ఎందుకు కొనితెచ్చుకుంటారు? మీరు రావణుడికి తమ్ముడి లాంటివారు. రాముడి భార్యను రావణుడు కోరి ఏదో చేశాడనుకున్నా దాంతో మీకేం సంబంధం? దానివల్ల మీకేం నష్టం? మీరు చక్కగా ఆలోచించి వివేకంతో నడుచుకొంటి. మీరూ మీ సేనా వెంటనే కిష్కింధకు మరలి పోవడం తెలివిగల పని."

ఇలా రావణాసురుడు సుగ్రీవుడి మనస్సు మార్చడానికి చూశాడు.

ఆ చారుడితో సుగ్రీవుడు ఇలా అన్నాడు : "నీచుడా! పోయి మీ రాజుతో ఇలా చెప్పు. 'నీవు నాకు అన్నవీ కాదు, నేను నీకు తమ్ముడనూ కాదని. నీవు దుష్టుడవు. రాముడు నా మిత్రుడు. అతడికి నీవు శత్రు వయ్యావు. కనక నాకూ నీవు శత్రువువే. నీవూ నీ మూకా త్వరలోనే నశిస్తారు. మూఢుడా! రాముడితో రొష్టుపడి నువ్వేం బతక గలవు? ఇది మాత్రం తెలుసుకో! నీవు పారిపోయి ఎక్కడ దాక్కున్నా ఏం లాభం లేదు' అని నేను చెప్పినట్లు మీ రాజుతో చెప్పు."

ఇలా సుగ్రీవుడు చారుడితో చెప్పగానే వానరులు అతడ్ని చుట్టి ముట్టి తలకొక మొట్టికాయ వడించారు. రాముడి ఆజ్ఞవల్ల అతడ్ని చంప కుండా మాత్రం విడిచి పెట్టారు. బతుకు జీవుడా అని అతడు వెంటనే లంకకు ఉడాయించాడు.

విభీషణుడు శరణు పొందగానే రాముడి ఆజ్ఞతో లక్ష్మణుడూ, సుగ్రీవుడూ అక్కడే విభీషణుడికి లంకా రాజ్యాన్ని పట్టం కట్టారు. సముద్రజలాలు తెచ్చి అభిషేకం చేయించారు. విభీషణుడు రాముడితో స్నేహ ప్రమాణం చేశాడు, రావణుణ్ని సంహరించకుండా తాను అయో ధ్యకు మరలేది లేదని రాముడు ప్రమాణం చేశాడు.

తర్వాత విభీషణుడూ, రాముడూ, లక్ష్మణుడూ సముద్రాన్ని దాట డం గురించి ఆలోచించారు. ముందు సముద్రరాజును ప్రార్థించడమే ఉచిత మని అంతా నిర్ణయించి ఆ మాట రాముడితో అన్నారు.

• •

రాముడుకూడా అదే తన ఉద్దేశ మన్నాడు. సముద్రతీరంలో దర్భలు పరచి రాముడు విధివిహితంగా సముద్రరాజు నుద్దేశించి ఉపవాసవ్రతం వూనాడు.

మూడు రోజులు అన్నపానీయాలు లేక మౌనవ్రత మాచరించి రాముడు సముద్రుణ్ని పూజించాడు. కాని సముద్రుడు వినిపించుకోలేదు. వెంటనే రాముడు లేచి ఇక తన భుజబలంతోనే కార్యం సాధించాలని నిశ్చయించుకున్నాడు. విల్లూ, అస్త్రాలూ తెమ్మని లక్ష్మణుడితో అన్నాడు.

సముద్రంమీద ప్రయోగించడానికి బాణం సంధించాడు. భూమి దద్దరిల్లింది సముద్రం అదిరిపోయింది. సముద్రరాజు తాళలేకపోయాడు. మేరు పర్వతంమీద ఉదయభానుడు ప్రజ్వలించినట్లు సముద్రరాజు ప్రసన్నుడై నిలిచాడు.

చేతులు జోడించి నిలిచి "రామచంద్రా ! నేను ప్రకృతి నియమాన్ని అనుసరించి నడుచుకోవాలి కదా? అగాధమైన లోతుతో, పెద్ద ప్రాణులకు చిన్న ప్రాణులకు ఆశ్రయంగా జలమయమై ఉండవలసిన విధి నాది. ఆ విధిని నే నెలా తిరస్కరించగలను? నా నియమా న్నెలా జవదాటను? అలలతో మార్గాన్ని అడ్డగించి నిలవడం నా ధర్మం. ఆ ధర్మాన్ని నేను విడిచి పెట్టడానికి వీల్లేదు కదా ? పెద్ద పెద్ద బండలూ చెట్లూ వానరులచేత తెప్పించి సేతువును నిర్మించండి. దానికి నేను అవకాశం యిస్తాను. నేను చేయగలిగిం దింతే. వానరులలో విశ్వకర్మ పుత్రుడు నలుడున్నాడు. అతడు కడు సమర్థతతో సేతువును నిర్మించగలడు. మీకు విజయ మగుగాక!" అన్నాడు.

రామచంద్రుడి ఆజ్ఞ ప్రకారం సేతుబంధన కార్యం మొదలైంది. లక్షలాది వానరులు గొప్ప కోలాహలంతో పనిచేసి అయిదు రోజులలో సేతుబంధనం పూర్తి చేశారు. వాల్మీకి మహర్షి ఈ సేతు బంధన కార్యాన్ని విపులంగా వర్ణించాడు. ఈ కాలంలో గొప్ప ఆనకట్టలను నిర్మించేటప్పుడు చేసే కోలాహలంలాగా వాల్మీకి మహర్షి సేతు బంధనాన్ని వర్ణించాడు. వానరులు అడవుల్లోకి వెళ్లి వేలకొలదీ చెట్లను పెకలించుకొని వచ్చి సముద్రపు ఒడ్డుకు చేర్చారు. పెద్ద వానరులు

• •

పర్వతాలను రాతి బండలను పెకలించుకొని తెచ్చారు. వృక్షాలూ, పర్వతాలూ సముద్రంలో పడినప్పుడు అలలు ఆకాశాన్ని అంటేటట్లు లేచాయి. నలుడు నిలబడి అన్ని పనులనూ అజమాయిషీ చేశాడు. గుంపులు గుంపులుగా చేరిన వానరులతో వానరనాయకులు పనులు చేయించారు. పర్వతాలనూ, మహా వృక్షాలనూ సముద్రంమీద పడవేసి దానిమీద కట్టెలూ గడ్డీ పరచి చదును చేశారు. ఆ సేతు నిర్మాణ కోలాహలం సముద్ర ఘోషను మింగివేసింది.

సేతు నిర్మాణం ముగిసింది. ఆకాశంలో స్వాతీనక్షత్ర వీధి లాగ సముద్రంలో ఈ సేతువు ప్రకాశించింది. ఆకాశాన దేవగణమూ భూమిమీద వానరగణమూ విజయఘోష చేశారు. "శత్రువును జయించి చిరంజీవి వగుదువుగాక!" అని రాముడ్ని దేవతలూ, ఋషులూ దీవించారు.

ఆంజనేయుడు రాముణ్ని తన బుజాన పెట్టుకొని బయలు దేరాడు. అంగదుడు లక్ష్మణుణ్ని ఎత్తుకు వెళ్ళాడు. వానరసేన సముద్రాన్ని దాటింది.

* * * *

ఇక్కడొక వేదాంత విషయముంది. ధనుర్ధారి అయిన రాఘవుడికి చేతులు జోడించి నమస్కరించి సముద్రరాజు ఇలా చెప్పాడు:

"ప్రియమైన ఓ రామచంద్రా! భూమి, వాయువు, ఆకాశం, జలం, అగ్ని, అనే ఈ పంచభూతాలు తమ తమ స్వభావాన్ననుసరించి నిలబడి ఉన్నాయి. వాటికి మార్పులేదు, అనాది ధర్మాన్ని అవి అనుసరిస్తున్నాయి. కామ లోభ మోహాలకు గాని, శిక్షకు భయపడి గాని నేను నా స్వభావాన్ని మార్చుకొనడానికి వీలవుతుందా చెప్పు? నీళ్ళు గట్టిపడి రాయిగా మారుతాయా? నా లోతును నేను మార్చుకొని కాలినడకను దాటగలిగే పిల్లకాలవను కాగలుగుతానా?"

ఇలా సముద్రరాజు కడు వినయంగా రామచంద్రుడికి తన అసమర్థత విన్నవించుకున్నాడు.

మన శాస్త్రాల్లోని మూల తత్వాన్ని వాల్మీకి మహర్షి సముద్రరాజు నోట చెప్పించాడు. ప్రకృతికీ ఈశ్వరుడికీ గల అనాది సంబంధాన్ని బోధిస్తున్నాడు. ఈశ్వరుడి నియమాలే ప్రకృతి. పరమేశ్వరుడు ఈ ప్రపంచం స్వయంగా నడవడంకోసం ప్రకృతి నియమాలను ఏర్పరచాడు. కర్మ, విధికూడా అంతే. పంచభూతాలు, జడాలు, జీవులు. అన్నీ ఈ శాశ్వత నియమం ప్రకారమే నడుచుకొంటాయి.

ప్రకృతి విధులు హటాత్తుగా మారి తారుమారయి, ఆశ్చర్యాన్ని కలిగించడం ద్వారా ఈశ్వర తత్వమూ ప్రభావమూ చిరూపిత మవు తుందని ఇతర మతాల వారంటారు. స్వభావ విరుద్ధమైన సంఘటన లను పురస్కరించుకుని ఈశ్వర నిరూపణ చేస్తారు. కాని మన శాస్త్రాలు అలా చెప్పవు.

శ్రీకృష్ణుడు అవలీలగా ఒక పర్వతాన్ని పై కెత్తేశాడంటే అది వేరే విషయం. దానివల్ల అతడు ఈశ్వరుడైపోయాడని చెప్పడానికి వీల్లేదు. రావణుడు కూడా కైలాసాన్ని ఎత్తాడు మరి. రావణుడు ఈశ్వరుడు కాలేదుగా.

హిందూ శాస్త్రాల ప్రకారం ఈశ్వర సంకల్పమే ప్రకృతిగా, కార్య కారణ విధిగా, మార్పులేని పంచభూతాల నియమంగా, కర్మగా, విధిగా గోచరిస్తుంది. ఇది భగవద్గీతలో తొమ్మిదవ అధ్యాయంలో వివరంగా ఉంది. వాల్మీకి మహర్షి దీనినే సముద్రరాజు నోట సంగ్రహంగా పలికించాడు.

84. యుద్ధారంభం

వ్యవహారాలు తుడనే వృద్ధ రాక్షసుడు రావణుడి కెంతో చెప్పి చూశాడు.

"నీకు మంచి రోజులు పోయాయి. పాపాలవల్ల నీ తేజస్సు తగ్గిపోయింది. నీ వరాలను ఇక నమ్మకు. మనస్సును ఒక దారికి తెచ్చుకో! ఇప్పుడు వచ్చిఉన్న ఈ సేనను చూడు. నరులు, వానరులు, భల్లూకాలుగల భయంకర సేన వచ్చి విడిసి ఉంది. ఎంత ఆశ్చర్య

కరంగా సేతువును కట్టారో చూడు. మహావిష్ణువే మనుష్య శరీరంతో వచ్చా డనుకుంటాను" అని ఆ వృద్ధుడు హితవు చెప్పాడు.

అలాంటి మాటలు వినడం రావణుడికి ఇష్టంలేదు. "మీ మాటలు నాకు కర్కశంగా ఉన్నాయి. మీరు శత్రువుతో చేరినట్లు కన్పిస్తూంది. మనుష్య జాతికి బలమెక్కడ? తండ్రి తరుమకొట్టగా అడవులు పట్టిన ఒక అల్ప మానవుణ్ని చూసి అంతా భయపడుతున్నారు. కోతులసూ. ఎలుగుబంట్లనూ నమ్ముకొని ఒక మానవుడు వచ్చాడు. అతడ్ని చూస్తే మీకు మహా భయం కలుగుతూంది. మిమ్మల్ని చూస్తే నాకు సిగ్గేస్తూంది.

నా మీద మీకు అసూయగా ఉందా? ఎందు కీలా మాట్లాడుతున్నారు? నేను రాముడికి తల ఒగ్గను. నీతిశాస్త్ర ప్రకారం ఇది దోషం అయితే అది నా స్వభావంలో ఉన్న దోషమే అనుకొండి. దాన్ని మార్చుకోవడం నా వల్ల కానిపని. యుద్ధంచేసి మృత్యువువస్తే మరణిస్తాను అంతే కాని రాముడి ముందు ప్రాధేయపడడం మాత్రం జరగని పని" అన్నాడు.

"బాగా ఆలోచించి ఉచిత మని తోచింది చెయ్యి. లంకేశుడు జయించుగాక! రావణుడు జయించుగాక!" అని చెప్పి మాల్యవంతుడు చింతతో ఇంటికి పోయాడు. ఇతడు రావణుడికి మాతామహుడు.

* * *

రావణుడు వీరు లందర్నీ ఒక్కొక్క స్థలానికి వ్యూహాలకు బాధ్యులుగా నిర్ణయించాడు. ప్రహస్తుణ్ని తూర్పు వాకిలికి, మహాపార్శ్వ మహోదరులను దక్షిణపు వాకిలికి, తన కుమారుడు, మాయలు నేర్చిన మహావీరుడూ అయిన ఇంద్రజిత్తును పడమటి వాకిలికి రక్షకులుగా నియమించి ఉత్తర ద్వారాన్ని తానే స్వయంగా రక్షించాలని నిర్ణయించుకున్నాడు. గొప్ప పరాక్రమశాలి అయిన విరూపాక్షుణ్ని నగరంలో ఉన్న సేనకు నాయకుడుగా నియమించాడు.

ఇలా తన సేనను, వీరులను విభజించి ఆయా స్థలాలలో నిలిపి తన కార్యం విజయవంతంగా నెరవేరుతుందని తృప్తిపడ్డాడు. వినాశకాలం

దాపురించినందువల్ల ఎవరు చెప్పినా వినకుండా రావణుడు ఇలా యుద్ధానికి సన్నాహాలు చేశాడు. మంత్రులు స్తోత్రాలు, విజయ ఘోషలు చేసి రాజును సంతోషపెట్టి వెళ్ళిపోయారు.

* * *

రాముడు, సుగ్రీవుడు, విభీషణుడు మొదలైనవారు యుద్ధ క్రమాన్ని గురించి ఆలోచించడానికి సమావేశమయ్యారు. రావణుడి ఏర్పాట్లను గురించి చారులు తెచ్చిన సమాచారాన్ని విభీషణుడు వివరించి చెప్పాడు.

"ఇప్పుడు రావణుడు చేర్చిన సైన్యం సంఖ్యాబలంలో, భుజ బలంలో! శౌర్యంలో కుబేరుణ్ణి ఎదిరించిన సైన్యంకన్న పెదది. అయినా రామచంద్రుడి విజయం నిశ్చయం. అందులో సందేహంలేదు" అని విభీషణు డన్నాడు.

రాముడు రాక్షససేనను ఎదిరించడం కోసం తన వీరులను విభ జించాడు. "నీలుడు తూర్పువాకిలి దగ్గర ప్రహస్తుణ్ణి ఎదిరించాలి. దక్షిణాన మహోదర మహాపార్శ్వుల్ని అంగదుడు ఎదిరించాలి. పడమటి వాకిల్ని రక్షిస్తున్న మహామాయావి ఇంద్రజిత్తును హనుమంతుడే ఎది రించాలి. లోక భీకరు డైన రావణుణ్ణి నేనూ, లక్ష్మణుడూ, ఎదిరించి లంకలో ప్రవేశిస్తాం. సుగ్రీవుడూ, జాంబవంతుడూ, విభీషణుడూ మా వెంట ఉంటారు" అని రాముడు సేనావిభాగం చేశాడు.

రాముడు ఆ రాత్రి సైన్యంతో సువేలాద్రిమీద ఆగాడు. మర్నాడు ఉదయమే లేచి అక్కడనుంచి పరికించి చూశాడు. త్రికూటపర్వతం మీద మనోహర సౌందర్యంతో ప్రకాశిస్తున్న లంకా నగరం ఆకాశం నుంచి వేలాడుతున్నట్లుంది. కోట గోడలను రక్షించడం కోసం నిలిచిన రాక్షసవీరుల పంక్తి మరొక ప్రాకారంలా ఉంది.

లంకానగర సౌందర్యాన్నీ, ఐశ్వర్యాన్నీ చూసి రాముడు "అయ్యో! కాలపాశం మెడకు చుట్టుకున్న ఒకడి మహాపాపాల ఫలి తంగా ఇంతటి ఐశ్వర్యమూ ఈ రాక్షస కులమూ నశించవలసి వచ్చిందే. ఉత్తమ కులంలో పుట్టిన ఇతడు తన జన్మ గొప్పతనం ఎరిగి,

ఉండికూడా మూర్ఖుడైపోయి తన మరణాన్ని తానే కొనితెచ్చుకుంటున్నాడు. అంతేకాదు, తన వాళ్ళని కూడా నాశనం చేస్తున్నాడు" అని జాలిపడ్డాడు.

"జరగవలసిన యుద్ధాన్ని చక్కగా జరిపి ఈ దుష్టుణ్ణి సంహరించడంలో మనస్సు లగ్నం చేస్తాను. యుద్ధంలో పెద్ద గందరగోళమవుతుంది. రాక్షసులు రకరకాల మాయవేషాలు వేసారు. కాని, మన సేనలోని వానరులు, భల్లూకాలు నిజస్వరూపంతో నిలిచి యుద్ధం చేస్తారు. రాక్షసరాజు తమ్ముడు, అతడి మిత్రులు మాత్రం మనుష్య రూపంలో మా వెంట ఉండవచ్చు. రాక్షసులు ఏ రూపమైనా ధరిస్తారు కాని, నరరూపం. వానరరూపం మాత్రం ధరించరు. వారి గర్వం ఆ రూపాలు ధరించడానికి తావివ్వదు. చక్కగా ఎదిరించి నిలబడితే శత్రువులను చంపవచ్చు. సహాయం చేయవలసిన వారికి తోడ్పడవచ్చు" అని రాముడన్నాడు.

* * *

సైన్యంతో సువేలాద్రి నుంచి దిగి లంకా నగరానికి చెందిన వనంలో ప్రవేశించారు. సముద్రంలాంటి వానరసేన ఆ వనంలో ప్రవేశించగానే అక్కడి మృగాలూ, పక్షులూ భయపడి పారిపోయాయి. ఆ వన సౌందర్యాన్ని వాల్మీకి మహర్షి తన ప్రత్యేక ఫణితిలో వర్ణించాడు. పైన పర్వత శిఖరంమీద గట్టి కాపలాలో ఉన్న లంకా నగరాన్ని కూడా వర్ణిస్తున్నాడు. విశ్వకర్మ నిర్మించిన ఆ పర్వత దుర్గాన్ని, కిందినుంచి చూసిన రాముడు "ఏం అందం! ఏం సంపద!" అని ఆశ్చర్యపోయాడు. రాక్షసవీరుల బలాన్ని, యుద్ధ కాంక్షను, ప్రాకారాన్ని, యంత్రాలను, చూసినకొద్దీ వానర వీరుల ఉత్సాహం పొంగులువారింది.

ఉన్నట్లుండి సుగ్రీవుడు తటాలున లంఘించి లంకానగరంలో ఒక గోపురం అరుగుమీద దిగాడు. అక్కడ రావణుడు తన పరివారంతో కొలువై ఉండడం చూసి ఏం చేశాడనుకున్నారు?—ఎర్రని సంజెఎరుపు చుట్టుకున్న నల్లని మబ్బులాగ రావణుడు ఎర్రటి శాలువ కప్పుకొని కూర్చున్నాడు. ఐరావతం దంతాలతో కుమ్మి

• •

నప్పుడు పడిన మచ్చ అతడి వక్షస్థలంమీద చంద్రబింబంలాగ ప్రకాశించింది.

"రావణా! చిక్కావులే! రాముడి మిత్రుణ్ణి దాసుణ్ణి అయిన సుగ్రీవుణ్ణి నేను. ఈ రోజుతో నీకు ఆయువు తీరింది" అని పైకెగిరి అతడి కిరీటాన్ని పడదోసి ఒక లెంపకాయ వేశాడు. తర్వాత ఇద్దరికీ మల్లయుద్ధం జరిగింది.

* * *

ఇద్దరూ కూడా మల్లయుద్ధంలో నిపుణులు. ఆ శాస్త్రంలో ఒడుపు లన్నింటినీ ఒకళ్ళమీద ఒకళ్లు ప్రయోగించుకున్నారు. రావణుడు అలిసిపోయాడు. అందుకని మాయవిద్యలోకి దిగాడు. అప్పుడు సుగ్రీవుడు అక్కడినుంచి లంఘించి రాముడున్న చోటికి చేరాడు.

ఇలా సూర్యపుత్రుడు అద్భుత కార్యం చేసి రావడం చూసిన వానర నాయకులు తమ రాజును పొగుడుతూ గొప్ప కోలాహలం చేశారు.

సుగ్రీవుడు క్షేమంగా తిరిగి రావడం చూసి రాముడు సంతోషించాడు. వానరరాజు వంటిమీద గాయాలూ, నెత్తురూ చూసి రాముడు ఇలా అన్నాడు:

"నీ పరాక్రమం ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కలిగించిన మాట నిజం. కాని ఇది సరైన పని కాదు. రాజు అయినవాడు ఇలాంటి సాహసం చేయకూడదు. ఎవరితోనూ ఆలోచించకుండా తటాలున ఇలాంటి ప్రమాదాలలో ప్రవేశించడం మంచిది కాదు."

రాముడిలా మందలించడం విని సుగ్రీవుడు, "నిజమే. మిమ్మల్ని అడక్కుండా ఎగిరివెళ్లి యుద్ధం చేయడం క్రమవిరుద్ధమే. కాని సీతకూ తమకూ అపకారం చేసిన ఆ పాపిని చూడగానే కోపం పొంగివచ్చింది. వళ్ళు తెలియలేదు. అందుకనే ఇలా చేశాను" అన్నాడు.

తర్వాత వానరసేన రాముడు ఆజ్ఞాపించిన పద్ధతిలో లంకను నలువైపులనుంచీ ముట్టడించింది.

• •

రాముడు అంగదుణ్ని పిలిచి అతడ్ని రావణుడివద్దకు రాయబారం వెళ్ళమనీ, రావణుడితో ఇలా చెప్పమనీ అన్నాడు.

"మహాపాపీ! నీకు కాలం సమీపించింది. రాముడు కోటవాకిట యుద్ధానికి కాచుకొని ఉన్నాడు. దేవతల వరాలను చూసుకొని గర్వించి నీవు దుష్టుడవైనావు. లోకాన్ని హింసిస్తున్నావు. లోకం ఇక క్షేమంగా ఉండగల సమయం వచ్చింది. బైటికి వచ్చి యుద్ధంలో మరణించావా ప్రాయశ్చిత్తం పొంది వీరస్వర్గానికి వెళతావు. ప్రాణంమీద ఆశ ఉంటే అక్రమంగా ఎత్తుకొని పోయిన సీతను తిరిగి రాముడికి అప్పగించి శరణుపొందు. ప్రాణాలు దక్కుతాయి. ఏమైనా పాపివైన నీవు ఇక రాజుగా ఉండడానికి తగవు. లంకా రాజ్యం ఇక విభీషణుడికే వస్తుంది. రాజుగా ఉండడానికి ప్రజా రక్షణకూ తగిన అర్హత అతడికి ఉంది. శరణు పొంది ప్రాణాలు దక్కించుకొనే ఉద్దేశం లేకపోతే వెంటనే ముందుగానే ఉత్తర క్రియలు చేయించుకొని మరణానికి సిద్ధమై బైటికి వచ్చి రాముడితో యుద్ధం చెయ్! అంగదా! ఇలా అని ఆ రాక్షసుడితో చెప్పు."

అంగదుడు అలాగే నని వెంటనే ఆకాశానికి లేచి మంత్రులతో కొలువై ఉన్న రావణుడి ముందు దిగాడు.

* * *

రాముడు చెప్పిన ప్రకారంగా అంగదుడు గంభీరంగా ఇలా అన్నాడు. "వాలి ఎవరో మీకు తెలిసే ఉంటుంది. నేను ఆ వాలి కుమారుణ్ని. రాముడి దూతగా వచ్చాను. మీ పాపాలు పండాయి. యుద్ధం చేసి వీరస్వర్గానికి వెళ్ళండి. రాముడూ, వానరసేనా సింహద్వారం దగ్గర ఉన్నారు. చేసిన పాపా లన్నిటినీ కడిగేసుకోవచ్చు. ఇంకా మీకు ప్రాణంమీద ఆశ ఉంటే రాముణ్ని శరణు వేడండి. లేకపోతే లేవండి, యుద్ధానికి బయలుదేరండి. యముడివద్దకు వెళ్ళడానికి సిద్ధంగా మరీ బయలుదేరండి. బంధువులవద్ద సెలవు తీసుకొని వేగరం ఉత్తరక్రియలుకూడా ముగించుకొండి. కులంతోసహా మీరు నశించిపోయే సమయం వచ్చింది. లంకను కడసారిగా కళ్లారా చూసుకొండి."

• •

రావణుడికి వళ్లమండి "పట్టుకొండి! చంపండి ఈ దుష్టుణ్ని!" అని అరచాడు.

వెంటనే ఇద్దరు రాక్షసులు అంగదుడి రెండు రెక్కలూ పట్టుకున్నారు. భూతాల్లా ఉన్న ఆ ఇద్దరు రాక్షసులతోనూ అంగదుడు ఆకాశానికి లేచి ఆ ఇద్దరినీ విదిలించి మరికొంచెం పైకి లేచి భవన విమానాన్ని ఒక్క తన్ను తన్ని రాముడివద్దకు చేరాడు.

అంగదుడి పని చూసి రాక్షసులకు బెంగ పట్టుకుంది. అయితే వాళ్లు తమ భయాన్ని దాచిపెట్టుకున్నారు. విమానం విరగడం చూసి రావణుడు ఒక్క నిట్టూర్పు విడిచాడు.

అంగదుడు తిరిగి రాగానే రామచంద్రుడు యుద్ధం ప్రారంభించవలసిందని సైన్యానికి ఆజ్ఞాపించాడు.

85. సీతకు శుభవార్త

భయంకరమైన వానరసైన్యం లంక పొలిమేర భూమి దద్దరిల్లేట్లు అట్టహాసంగా వచ్చి విడిసింది. ఒక పెద్ద వనంలో సుఖంగా బస చేసింది. యుద్ధానికి సిద్ధమైన లంకానగరంనుంచి కూడా రాక్షసుల ఘోష బయలుదేరింది. శంఖం, భేరీ, దుందుభి మొదలైన యుద్ధ వాద్యాల నాదం వినబడగానే వానరులు ఉత్సాహం పట్టలేకపోయారు. రామచంద్రుడు చేసిన విభజన ననుసరించి సైన్యం బారులు తీరి నిలిచింది.

రాముడు లంకను చూసి "ఆహా! లక్ష్మణా! చూశావా ఈ నగర సౌందర్యం?" అని అడిగాడు.

లంకను చూడగానే రాముడి మనస్సు సీత దగ్గరకు పరుగులు పెట్టింది. తాను సైన్యంతో వచ్చిన సంగతి ఇప్పుడు ఆమెకు తెలిసే ఉంటుంది కదా? ఆమె ధైర్యంగా ఉంటుంది కదా? అని అనుకొన్నాడు. అయినా ఆ ప్రస్తావన లేకుండా సేనావిభజన కార్యక్రమంలో నిమగ్నుడయ్యాడు.

* * *

శుకుడనే రాక్షస గూఢచారి రావణుడి వద్దకు తిరిగి వచ్చాడు. "తాము చెప్పినట్లు నా పని నేను చేశాను. అయితే ఫలితం మాత్రం శూన్యం. నన్ను పావగొట్టి పంపించారు. విరాధుడు, కబంధుడు, ఖరుడు మొదలైన వాళ్ళని అనాయాసంగా వధించిన రాముడు సీతను చెరపెట్టిన తావు తెలుసుకొని సుగ్రీవుడి సేనతో లంకకు వచ్చేశాడు వానరులు, భల్లూకాలు సముద్రాన్ని దాటివచ్చి లంకలో యుద్ధానికి సిద్ధంగా ఉన్నారు. ఆ సైన్యం విడిసినచోట నేల కనిపించడమేలేదు. ఇక మాటలవల్ల ఫలితంలేదు. వాళ్ళకి మనమీద రగులుతున్న ద్వేషం యుద్ధంవల్లే మాత్రమే చల్లారుతుంది. వేరే మార్గంలేదు. రాజా! బాగా ఆలోచించి చేయవలసింది చేయండి,"

ఇలా చెప్పి ఆఖరికి మెల్లగా "సీతను అప్పజెప్పినట్లయితే మనం బతకవచ్చు" అన్నాడు, శుకుడు.

రావణుడికి ఈ మాట చుర్రుమంది. "ఏంటన్నావు? సీతను తిరిగి అప్పజెప్పా లన్న ప్రసక్తి నా ముందు ఎవరూ ఎత్తడానికి వీలులేదు. నా శక్తి తెలియక ఇలా మాటాడుతున్నారు. దేవ దానవ గంధర్వ యక్షులెవరు వచ్చినా నా చేతులో మరణిస్తారు. ఇంద్రుడు దిగివచ్చినా సరే. యముడు వచ్చినా సరే. నా బాణాగ్నిలో వాళ్లు మాడిపోతారు. చూడు, ఈ రాముడూ అతడి సేనా ఎలా సర్వనాశన మవుతారో" అన్నాడు.

రావణుడు నిజంగా అలాగే అనుకున్నాడు. తన పూర్వ చరిత్రను తలచుకుని తలచుకుని గర్వంతో కళ్లు తెరవలేకుండా వున్నాడు.

తర్వాత ఇద్దరు మంత్రులను రప్పించి వాళ్ళతో ఇలా అన్నాడు; "సముద్రానికి సేతువు నిర్మించి, పెద్ద సైన్యంవచ్చి లంకలో విడిసినట్లు చారులు చెపుతున్నారు. ఇది ఆశ్చర్యంగా ఉంది. అయినా మించి పోయింది లేదు. మీరు వెళ్ళి శత్రుసేనను బాగా పరీక్షించి వాళ్ల ఆనుపానులన్నీ నాకు చెప్పాలి" అని వాళ్ళని పంపించాడు.

అలాగే వాళ్ళు వానర రూపం ధరించి వానర సేనలో ప్రవేశించి కలయదిరిగి చూశారు. విభీషణుడు వాళ్ళ మారువేషాలను ఇట్టే కనిపెట్టి పట్టుకుని రాముడి ఎదుట నిలబెట్టాడు.

• •

"స్వామీ! మేము దూతలం. మా రాజు పంపగా వచ్చాం. మమ్మల్ని విడిచి పెట్టండి" అని వారు ప్రార్థేయపడ్డారు.

అప్పుడు రాముడు ఇలా ఆజ్ఞాపించాడు: "వీళ్ళకి మన సేన నంతటినీ చూపించి మరపే విడిచి పెట్టండి. ఓ రాక్షస దూతలారా మీరు తిరిగిపోయి మీ రాజుతో ఇలా చెప్పండి: 'నీవు ఏ బలాన్ని నమ్ముకుని సీతను అపహరించి తెచ్చావో ఆ బలానికే నేడు పరీక్ష వచ్చింది. నీ కోట నగరం, సైన్యం అంతా రేపే నశించడం చూస్తావు. రామబాణాలు రేపు ఉదయం నీమీద పడతాయి.' అని మీ రాజుతో చెప్పండి"

రాముడు చెప్పింది విని రాక్షస దూతలు 'అలాగే' అన్నారు. అలవాటు ప్రకారం వాళ్ళ నోటివెంట, మీకు విజయ మగుగాక ! అన్నమాట వచ్చింది. అది ఒక శుభసూచన అని అంతా భావించారు.

ఆ దూతలు రావణుడి దగ్గరికు వెళ్ళి "స్వామీ! విభీషణుడు మమ్మల్ని కనిపెట్టేసి పట్టుకున్నాడు. కాని రాముడు మమ్మల్ని చంపకుండా విడిచిపెట్టాడు. రాజా! మన శత్రువులు ఒకే పట్టుదలతో ఉన్నారు. రామలక్ష్మణులూ, వాలి తమ్ముడైన సుగ్రీవుడూ, విభీషణుడూ ఐక మత్యంతో ఉన్నారు. వాళ్ళ నాయకత్వంలో వున్న సైన్యాన్ని మనం గెలవడం కష్టం. దశరథ కుమారుడైన రాముణ్ణి చూశాం. అతడొక్కడే చాలు మన సైన్యాన్నీ, నగరాన్నీ అంతమొందించడానికి. మాకు ఇలా తోస్తూంది. వానరసేన పరాక్రమాన్ని, యుద్ధానికి వాళ్ళు పడుతున్న ఆత్రం చూశాం. వాళ్ళతో రొష్టుపడటం మంచిది కాదనిపిస్తూంది. సీతను వెంటనే రాముడికి అప్పజెప్పడం మంచిది. ఆలోచించండి" అన్నారు.

రాయబారం వెళ్ళిన దూతలు తమ రాజు క్షేమంకోసం ఇలా చెప్పారేకాని రావణుడికి మాత్రం భరించలేని కోపం వచ్చింది.

"లోక మంతా నాకు విరోధులై నిలిచినా నేను భయపడను. దేవతలూ, గంధర్వులూ, దానవులూ ఒకటిగా చేరి వచ్చినా నేను సీతను ఇవ్వను, రాయబారం వెళ్ళిన మీరు శత్రువుచేత దెబ్బలుతిని భయపడి ఇలా చెపుతున్నారు. పిరికి పందల్లారా! నన్నెదిరించి నిలవగల వా డెవడు? ఏ శత్రువు నన్ను జయించగలడు?"

• •

ఇలా అంటూ రావణుడు స్వయంగా భవనం పైకెక్కి శత్రు బలగాన్ని పరీక్షించాడు. తర్వాత మంత్రులతో చాలాసేపు మంత్రాలోచన చేశాడు. శత్రుసైన్యంలో ఎవరెవరు ఎలాంటి వీరులు అన్న విషయాన్ని అడిగాడు.

వాళ్లకూడా ఒక్కొక్క వానరవీరుడి శక్తిసామర్థ్యాలను గురించి, వాళ్లు తెచ్చిన సైన్యాన్ని గురించి వివరంగా చెప్పారు. అడవులు, కొండలు, నదీతీరాలు ఇలా భూమండలంలో వున్న సమస్త ప్రదేశాలనుంచీ వచ్చిన వానరసైన్యం, భల్లూక సైన్యాల బలాబలాలను వివరించి చెప్పారు. వాళ్ల దేహ బలాన్ని గురించి, రాముడి మీద వాళ్లకి గల సాటిలేని భక్తివిశ్వాసాలను గురించి, వాళ్లలోగల ఐకమత్యాన్ని గురించి, రాక్షస సంహారం పట్లగల ఆత్రాన్ని గురించి మంత్రి అయిన సారణుడు సవిస్తరంగా చెప్పాడు. వానర సైన్యంలో ప్రవేశించడానికి సారణుడితో పాటు వెళ్లిన మరొక మంత్రికూడా వానర వీరుల్ని గురించి రావణుడికి వివరంగా చెప్పాడు.

"అడుగో చూడండి! అతడే రామచంద్రుడు! అడుగో అతడి ప్రక్కన ఉన్నవాడే లక్ష్మణుడు! నీతిశాస్త్రంలోనూ, యుద్ధ శాస్త్రంలోనూ మహాకుశలుడు. అతడు రాముడికి బహిఃప్రాణం. కుడిభుజం. అడుగో అతడి ప్రక్కన వాలి దివ్యమాలను ధరించి వున్నాడే, వాడే సుగ్రీవుడు. వాలితో సమానమైన వీరుడు. అడుగో అతడి పక్కన ఉన్నవాడు మీ తమ్ముడు విభీషణుడు! వీళ్లని జయించడం మాటలు కాదు. విజయానికి కావలసిన ప్రయత్నాలన్నిటినీ చక్కగా ఆలోచించి చేయండి!" అన్నాడు.

పగవాళ్ల బలాన్ని గురించి పొగడుతూ మాట్లాడిన మంత్రుల మీద రావణుడికి కోపం ముంచుకు వచ్చింది. మూర్ఖుల గుణం అలాంటిది. నిజంచెప్పే దూతలమీదా, క్షేమంకోరి మాట్లాడే మంత్రులమీదా బుద్ధిమంతుడైన రాజు కోపం తెచ్చుకోడు. అయితే ఇప్పుడు రావణుడికి మతి చెడింది. అతడి కిప్పుడు యథార్థం నచ్చదు. హితం రుచించదు.

• •

ఏదో ఆలోచన చేశాడు. తన మానసిక స్వభావాన్నిబట్టి రాముడి గుణాన్ని అంచనా వేశాడు. లోకస్వభావం ఇంతేకదా? సీత తనకు ఎలా గైనా లొంగిపోతే రాముడు అవమానంతో గుండె పగిలి తిరిగిపోతా డని అతడి ఉద్దేశం. కనుక ఇప్పుడు మరొక ప్రయత్నంచేసి ఆమె నెలాగైనా లొంగతీయా లని తనకు తెలిసిన యుక్తి లనుబట్టి నిశ్చయించుకున్నాడు. అందుకని ఒక మాయావి ఆయిన రాక్షసుడ్ని సహాయం కోరాడు.

"విద్యుత్‌జిహ్వాడా! నీకు మాయ విద్యలన్నీ తెలుసుకదా? నేను నీకు కబురు పంపుతాను. అప్పుడు నీవు వచ్చి సీత ఎదుట ఆమె భర్తఅయిన రాముడి శిరస్సులాంటి ఒక మాయ శిరస్సు తెచ్చి ఉంచాలి" అని చెప్పాడు. ఆ మాయావి 'అలాగే' అని ఒప్పుకొన్నాడు.

ఆపైన రావణుడు అశోక వనానికి వెళ్లాడు. జానకిని లొంగదీయడానికి ఎన్నో విధాల మాటలతో ప్రయత్నించాడు. "నీ భర్తా అతడి సేనా హతమయ్యారు. నా వీరులు సముద్రాన్ని దాటివెళ్లి రాముణ్నీ అతడి వానర సైన్యాన్నీ అలసిపోయి నిద్రిస్తున్న సమయంలో హఠాత్తుగా మీదపడి కొట్టి రాముడితో సహా అందర్నీ హతమార్చారు. సైన్యం చెదిరి పారిపోయింది. నీ భర్త రాముడి తలను నాకు చూపడం కోసం నా వీరులు తీసుకునచ్చారు. ఇంకా ఎందుకు ఈ పట్టుదల? నా అంతఃపురానికి నాయకురాలివై సుఖంగా ఉందువు గాని, రా. మొండితనం చేయకు! లంకకు రాణివై నన్ను ఏలుకో! నా మాట విను!" అని చెప్పాడు. ఒక రాక్షసుడ్ని పిలిచి, పోయి విద్యుత్‌జిహ్వాడ్ని రమ్మని చెప్పు అని ఆజ్ఞాపించాడు.

మాయావి ఐన విద్యుత్‌జిహ్వాడు రాముడి శిరలాస్సుంటిదే ఒక మాయ తలను తెచ్చి సీతముందుంచాడు.

సీత అది చూసి కలవరపడింది. తనగతి కొసకు ఇలా అయిందే అని విలపించింది.

ఇంతలో రాముడి సైన్యం లంకా నగరాన్ని సమీపించింది. అప్పుడు మంత్రులూ సేనాధిపతులూ అత్యవసరంగా రావణుణ్ని

దర్శించాలని వచ్చారు. రావణుడు సీతను విడిచి హడావుడిగా సభా భవానానికి పోవలసి వచ్చింది.

రావణుడు అక్కడ ఉన్నంతసేపే ఆ మాయ పనిచేస్తుంది. అత డక్కడనుంచి వెళ్ళి పోగానే ఆ మాయ కరిగి పోయింది. రాముడి మాయ శిరస్సు పొగలాగా మాయమై పోయింది.

విభూషణుడి భార్య సరమ సీతకు చెలికత్తె. రావణుడు చేసిన ఈ మాయను ఆమె సీతకు వివరించి చెప్పింది.

రాముణ్ని ఎవరూ చంపలేదు, ఏమీలేదు. అతడు, అతడి అపార సేనా లంకకు వచ్చి చేరారు. సముద్రాన్ని దాటడానికి అద్భు తంగా ఒక సేతువును కట్టారు. దాని మీదనుంచే మరొక సముద్రం లాగా వానర సైన్యం నడిచి వచ్చింది. రాక్షసు లంతా దిగులుపడు తున్నారు. రావణుడు నిన్ను మాయవిద్యతో మోసగించాలని చూస్తున్నాడు" అని సీతకు ఆమె యథార్థాన్ని విప్పి చెప్పింది.

సరమ సీతకు మరికొన్ని విషయాలు కూడా చెప్పింది.

"రావణుడి మంత్రులు చాలామంది అతడి క్షేమం కోరి 'సీతను రాముడికి అప్పజెప్పు. వినాశనాన్ని తప్పించుకోవచ్చు' అని చెప్పారు. కాని ఎంతచెప్పినా రావణుడు వినలేదు. 'యుద్ధంలో ప్రాణాలైనా ఇస్తాను కాని రాముడి ముందు మాత్రం నేను తలవంచి నిలబడను. సీతను అప్పగించి సంధి చేసుకోలేను' అని రావణుడు ఖచ్చితంగా చెప్పాడు. అమ్మా! నీకు ఎలాటి అపాయమూ లేదు. రాముడు జయి స్తాడు. ఈ క్రూరుడు మరణిస్తాడు."

ఇలా ఇక్కడ సరమ చెపుతూన్న సమయంలోనే వానర సైన్యంలో భేరి, శంఖం మొదలైన వాద్యాలు మారుమోగాయి.

రావణుడు నశించా డని సీత నిశ్చయించుకొని ఆనందించింది. అదే సమయాన లంకలో ఆ భేరీ శంఖధ్వానాలు విని రాక్షసులు భయంతో గడగడ వణకారు.

86. నా గా స్త్రా లు

సముద్రం లాంటి వానరసేనతో వచ్చి రాముడు లంకను నలు పక్కలా ముట్టడించా డని సేవకులు రావణుడికి చెప్పారు. అతను కోపం పట్టలేక పోయాడు. వృక్షాలూ, రాతి బండలూ పుచ్చుకుని నలు పక్కలా నిలిచిన వానరులను చూశాడు. వాళ్ళని మట్టుపెట్టడం ఎలాగా అని ఆలోచించాడు.

ఆ సమయాన రాక్షససేన రక్షణలో ఉన్న లంకానగరాన్ని రాముడు చూశాడు. "ఈ ప్రాకారాల మధ్యగదా సీత చెరలో నలిగి పోతూంది ?" అని అనుకుని కోపం రెచ్చిపోయి వానరసేనకు ఆజ్ఞ లిచ్చాడు. "కోటను పగలగొట్టండి! రాక్షసులను చంపండి!" దీంతో వానరులు ఉత్సాహంతో యుద్ధం ప్రారంభించారు.

"వానర రాజుకు జయం జయం. రామలక్ష్మణులకు జయం జయం. రాక్షసులను చంపండి!" అని నినాదాలు చేస్తూ కొందరు పర్వతాలను పగులగొట్టి, పెద్ద పెద్ద బండలను పైకెత్తి విసిరి ప్రహరీ గోడలను పగలగొట్టారు. కొందరు పెద్ద పెద్ద చెట్లను వేళ్ళతో పెకలించి తెచ్చి రాక్షసులను మోదారు. ప్రాకారాన్ని, సింహద్వారాలను పగలగొట్టసాగారు.

అది చూసి రావణుడు "వెంటనే వెళ్ళి ఆ కోతుల్ని చంపండి!" అని ఒక పెద్ద రాక్షస సేనకు ఆజ్ఞాపించాడు. ఆ ఆజ్ఞ వినగానే భేరీ భాంకారాలు, శంఖనాదాలతో రాక్షసుల రణఘోష సముద్రఘోషలాగ లేచింది. సమ సమమైన ఆయుధాలతో రాక్షస సైనికులు నగరం వెలుపలికివచ్చి వానర వీరులతో ఘోర యుద్ధం చేశారు.

వానరులు తమ ఆయుధా లైన రాతి బండలు, చెట్లు, వాడిగోళ్ళు, పిడికిళ్ళు మొదలై న వాటితో రాక్షసులను ఎదిరించారు. రెండు పక్కలా వేలకొద్దీ వీరులు నేల కొరిగారు. నేలంతా నెత్తుటి అడుసులో, తెగిపడిన అవయవాలతో మాంస ఖండాలతో మహా భయంకరంగా కనిపించింది.

• •

రెండు పక్కలా వీరులు చేతులూ చేతులూ కలిపి ద్వంద్వ యుద్ధం చేశారు. అంగదుడూ ఇంద్రజిత్తూ కలియబడి రుద్రుడూ, యముడూ పోరినట్లు పోరారు. ప్రజంఘు డనే రాక్షసుడికీ, విభీషణుడి మంత్రి అయిన సంపాతికీ యుద్ధం జరిగింది. జంబుమాలీ, హనుమంతుడూ తలపడ్డారు. అలాగే నీలుడూ నికుంభుడు, లక్ష్మణుడూ విరూపాక్షుడూ మొదలైన వీరులు ఒకళ్ళ నొకళ్ళు ఎదిరించి యుద్ధం చేశారు.

ఇంద్రజిత్తు రథం విరిగింది. గుర్రాలు చచ్చాయి. ఇంద్రజిత్తు గదాయుధం ఎత్తి అంగదుణ్ణి మోదాడు. జంబుమాలి శక్తిఆయుధంతో హనుమంతుణ్ణి కొట్టాడు. మారుతి జంబుమాలి రథాన్ని నుగ్గునుగ్గు చేశాడు. రాక్షసులు రాముడిమీద బాణవర్షం కురిపించారు. రాముడు ఆ బాణాలను ఖండించి తన బాణాలతో చాలామంది రాక్షసులను చంపాడు.

విద్యున్మాలి, సుషేణుడిమీద బాణాలు వేశాడు. సుషేణుడు ఒక పెద్దబండతో రాక్షసుడి రథాన్ని ధ్వంసం చేసేశాడు. విద్యున్మాలి గదతో నేలకురికి సుషేణుణ్ణి మోదాడు. సుషేణుడు ఒక పెద్ద రాతి బండతో కొట్టి రాక్షసుణ్ణి సంహరించాడు. ఇలాగే పలువురు వీరులు ఘోరంగా యుద్ధం చేశారు. ఎందరో వీరులు మరణించారు. పగ లంతా పోరు సాగింది. రాత్రి అయినా కూడా యుద్ధం నిలవకుండా సాగుతూనే వుంది.

రాత్రి యుద్ధం మహా ఘోరంగా జరిగింది. రక్తం ఏరులై పారింది. రెండువైపులా ఎంతోమంది మరణించారు.

ఇంద్రజిత్తును అంగదుడు కొట్టాడు. రాక్షసుడి గుర్రాలనూ, సారథినీ చంపి రథాన్ని ముక్కముక్కలుగా చేసేశాడు. అంగదుడి పరాక్రమం చూసి వానరులు ఉత్సాహంతో విజయఘోష చేశారు. వానర యువరాజు శక్తిసామర్థ్యాలనూ బలపరాక్రమాలనూ వానర వీరు లందరూ పొగిడారు. రథాన్ని పోగొట్టుకున్న ఇంద్రజిత్తుకు కోపం వచ్చి మాయ యుద్ధం మొదలు పెట్టాడు.

తన మాయాబలంతో ఎవరికీ కనబడకుండా దాగి ఉండి యుద్ధం చేశాడు. రామలక్ష్మణుల మీద రకరకాల బాణాలు ప్రయోగించి

బాధించాడు. అత డెక్కడున్నాడో కనిపెట్టడానికి ఎందరో వీరులు ప్రయత్నించి చూశారు. కాని మాయాబలంతో మాటునున్న రావణ కుమారుణ్ని కనుక్కోలేక పోయారు. అతడు బాణ వర్షం కురిపిస్తూనే ఉన్నాడు.

ఇంద్రజిత్తు రామలక్ష్మణుల మీద నాగాస్త్రం ప్రయోగించాడు. వాళ్ళు ఆ నాగాస్త్రాలకి కట్టువడి కదల్లేక నేలమీద పడిపోయారు. ఒకళ్ళ నొకళ్ళు చూసుకొంటూ ఏం చేయడానికీ తోచక దిగ్భ్రాంతు లయ్యారు. రాముడి సితి చూసి లక్ష్మణు డెంతో దుఃఖించాడు. వానరులు వాళ్ల చుట్టూ చేరి ఏడుస్తూ కూచున్నారు.

ఇంద్రజిత్తు రాక్షస సైన్యాన్ని పొగిడి ఉత్సాహపరచి లంకానగ రానికి తిరిగి వెళ్లాడు. విజయ ధ్వానాలతో తండ్రివద్దకు వెళ్ళి "రామ లక్ష్మణుల పని అయిపోయింది. యుద్ధభూమిలో కదలకుండా పడి ఉన్నారు. నా చేతుల్లోనే మరణించారు" అని చెప్పాడు. రావణుడు ఆనందపరవశు డయ్యాడు. కుమారుణ్ని గట్టిగా కౌగలించుకుని మహా వీరుడ వయ్యావు అని పొగిడాడు.

వానర వీరు లంతా దెబ్బతిని ఉన్నారు. రాజకుమారు లిద్దరూ పడి ఉండడం చూసి ధైర్యం చెడి ఇక తాము ఓడిపోయినా మనుకున్నారు. ఏం చేయడానికీ తోచక సుగ్రీవుడు కలవరపడి ఉండడం విభీషణుడు చూశాడు. "ఇలా దిగులు పడడం తగదు. రామలక్ష్మణుల ముఖం చూడండి, కాంతి తగ్గలేదు. భయపడకండి. శీఘ్రంగానే మెకంపోయి మళ్లా జయకరంగా యుద్ధం ప్రారంభిస్తారు" అని చెప్పి వానరరాజుకు ధైర్యం కలిగించాడు. వా రిద్దరూ వానరుల భయం పోగొట్టడానికి చేయవలసిన కార్యక్రమం మొదలుపెట్టారు. చెదరిన సైన్యాన్ని చేర దీసి బారులు తీర్చారు.

ఇంద్రజిత్తు రామలక్ష్మణులను వధించా డని లంకానగరంలో ప్రకటన చేశారు. రావణుడు రాక్షస స్త్రీలను పిలిచి "మీరు వెంటనే పోయి సీతతో చెప్పండి: 'రాముడు మరణించాడు. ఇద్దరు రాజ కుమారులూ యుద్ధభూమిలో చచ్చి పడివున్నారు. వాళ్ళ వానర

సైన్యంకూడా నశించింది' అని చెప్పండి. మాయా పుష్పక విమానంలో ఆమె నెక్కించుకొని వెళ్ళి ఆమెకు యుద్ధభూమి చూపండి. ఆ మొండికి ఇప్పుడు బోధపడుతుంది. నాకన్న వేరే దిక్కు లేదని తెలుసుకొని నన్ను చేపడుతుంది'' అన్నాడు.

రాక్షసస్త్రీలు అలాగే చేశారు. సీత ఆకాశంలో విమానంమీద నుంచి యుద్ధభూమి చూసింది. చూసి వలవల ఏడ్చింది. రామలక్ష్మణులు కదలకుండా నేలమీద పడిఉండడం, వాళ్ళ ఆయుధాలు నేలమీద చెదిరి పడిఉండడం చూసింది. ఇక తనకు గతేమిటని విలపించింది. "దైవజ్ఞులు నన్ను గురించి చెప్పింది అబద్ధమైందా? భర్త చనిపోతాడనీ నేను అనాథ నవుతా ననీ వారు చెప్పలేదే? బిడ్డలను కంటుందనీ, పట్టమహిషి అవుతుందనీ వాళ్లు చెప్పారే ? వాళ్లు చెప్పిందంతా ఇప్పుడు అబద్ధమై పోయిందే? అయ్యో కౌసల్యా! కొడుకు వస్తాడని ఎదురుచూస్తూ ఉన్న ఆమెను ఎవరు ఓదార్చగలరు? ఏరంతా ఈది తుంగలో మరణించినట్టు అయిందే! మీ దివ్యాస్త్రాలన్నీ ఏమయ్యాయి ? ఏ శత్రువూకూడా మిమ్మల్ని జయించలేడని చెప్పారే? అన్నీ అబద్ధాలేనా?" అని సీత విలపించింది. అప్పుడు సీతకు తోడుగా వున్న రక్షకురాలు త్రిజట సీతకు ధైర్యం చెప్పింది. "అమ్మా సీతా! నీవు దుఃఖించనవసరంలేదు. నీ భర్త కాని లక్ష్మణుడు కాని మరణించలేదు. వారి ముఖలక్షణాలు చూడు. ఎంత కళగా వున్నాయో! మరణించిన వాళ్ళ తీరే వేరేవిధంగా ఉంటుంది. వాళ్లు మాయాస్త్రంవల్ల కాస్సేపు కట్టుపడి ఉన్నారు. సైన్యంలో క్రమ శిక్షణ చూడు. నీవు ధైర్యంగా ఉండాలి. ఈ దృశ్యం చూసి భయపడకు" అంది. అమృతంలాంటి ఈ మాటలు విని సీత ధైర్యం పొందింది. తర్వాత విమానం లంకకు తిరిగిపోయింది. సీతను వాళ్లు తిరిగి అశోక వనంలో విడిచిపెట్టారు. ఆమె అక్కడ రాక్షసస్త్రీల మధ్య మళ్ళీ దుఃఖించసాగింది.

* * *

నాగపాశానికి శక్తి తగ్గింది. రాముడు కళ్ళు తెరచి చూశాడు. బలమైన గాయాలు తగిలాయి. అయినా ఆత్మబలాన్ని దేహబలాన్ని కూడగట్టుకొని లేచాడు. లేవగానే పక్కన పడిఉన్న తముడ్ని చూసి

"అయ్యో!" అని అరిచాడు. "నేను ఇంక విజయం పొందిమాత్రం ఏం లాభం? నిన్నుకూడా నే నెందుకు అడవికి పిలుచుకొని వచ్చాను? ఇలా చంపడానికా? నీవు లేకుండా నేను అయోధ్యకు ఎలా తిరిగి పోగలను? నేను దుఃఖించినపుడల్లా ధైర్యం చెపుతూ వచ్చావు, ఊర డిస్తూ వచ్చావు. ఇప్పు డెందుకు మాట్లాడకుండా మౌనంగా ఉన్నావు? నేను నిన్ను విడిచి ప్రాణాలతో ఎలా ఉండగలను? నీలాంటి వీరుడు మరొక డున్నాడా? అందర్నీ సంపాదించగలను కాని నీలాంటివాడ్ని నే నెక్కడ సంపాదించగలను? రెండు చేతులతోనే నీవు సహస్ర బాహు వులుగల కార్తవీర్యార్జునుడిలా శరవర్షం కురిపించి రాక్షసులను సంహ రించావే! నీవు నాతోకూడ అరణ్యవాసానికి ఎలావచ్చావో నేనుకూడా నీలో యమాలయానికి వస్తాను. నేను ఓడిపోయాను. విభీషణుడికి నే నిచ్చిన వాగ్దానం అబద్ధమైపోయింది. వానరరాజా! వానర వీరు లందర్నీ తీసుకుని కిష్కింధకు మరలిపో! నా కోసం మీరు శ్రమపడ్డారు. మిత్ర ధర్మానికి లోటు రాకుండా చేశారు. మీకు నా కృతజ్ఞతలు. ఇక మీరు మరణించడంలో ప్రయోజనంలేదు. మీరు మీ నగరానికి తిరిగి పొండి. నే నిక్కడే చస్తాను" అని రాముడు దుఃఖాన్ని భరించలేక ధైర్యం వీడి విలపించాడు.

ఆ సమయానికే విభీషణుడు గద పట్టుకొని అక్కడికి వచ్చాడు. నల్లగా ప్రకాశిస్తున్న ఆ బృహత్కాయుడ్ని చూసి ఇంద్రజిత్తే తిరిగి వచ్చాడనుకొని వానరులు బెదిరి పారిపోసాగారు. తర్వాత విభీషణుడని తెలుసుకొని ధైర్యం తెచ్చుకున్నారు.

దిగులుగా వున్న వానరులు విభీషణుణ్ణి చూసి ఇతడు ఇంద్రజిత్తే అని అనుకుని పారిపోతూ ఉండగా 'ఇదేంటి, వానరులు ఇలా బెదిరి పారి పోవడానికి కారణం ఏమి'టని సుగ్రీవుడు అడిగాడు.

"రామలక్ష్మణు గాయాలతో పడిఉండడం మీ రెరగరా?" అని అంగదు డడిగాడు.

"అదికాదు. వీళ్ల కలవరంతో పరుగులు పెట్టడం చూడు: వేరే మరొక కారణం ఉండి ఉంటుంది" అన్నాడు, సుగ్రీవుడు.

• •

ఇంద్రజిత్తు మాయలకు విసిగిపోయిన వానరులు విభీషణుణ్ణి చూడగానే అత డెవరైందీ తెలుసుకోలేక భయపడి పరుగులు పెడు తున్నట్లు సుగ్రీవుడు తెలుసుకున్నాడు.

జాంబవంతుడి ద్వారా వానరులకు విషయం చెప్పి పంపి, పరు గెడుతున్న వాళ్ళని ఆపి శాంతపరిచాడు.

విభీషణుడు రామలక్ష్మణులను చూశాడు. వాళ్ళ ఒంటినిండా బాణాలు గుచ్చుకుని కదల్లేకుండా పడి ఉండడం చూసి ఏడ్చాడు.

"పనంతా ఇలా పాడైపోయిందే! ఇంకేం చేయడం?" అని విభీష ణుడు విలపించడం చూసి సుగ్రీవుడు ధైర్యం చెప్పాడు. తన మేన మామ అయిన సుషేణుణ్ణి చూసి "మీరు రామలక్ష్మణులను తీసుకుని కిష్కింధకు వెళ్లండి. నేను ఈ రావణుడ్ని అంత మొందించి సీతను చెర విడిపించుకొని వస్తాను" అన్నాడు.

సుషేణుడు "ఈ రాజకుమారుల గాయాలను నయంచేసే ఔషధాలున్నాయి. ఆ ఓషధులున్న స్థలం మనలో కొందరికే తెలుసు. ఇదిగో హనుమంతుడున్నాడే ఆయనను పంపితే ఆ ఓషధిని కొని వస్తాడు." అన్నాడు.

ఇలా వీళ్లు మాట్లాడుతున్న సమయంలో గాలి హోరున వీచింది. సముద్రం కల్లోలమైంది. అదేం టని చూడగా ఒక గొప్ప పక్షిరాజు గరుత్మంతుడు రావడం కనిపించింది.

గరుత్మంతుడు రాగానే రామలక్ష్మణుల శరీరాన దూరి ఉన్న బాణాలు రివ్వున ఎగిరిపోయాయి. అవన్నీ విషసర్పాలు. ఇంద్రజిత్తు మాయాబలంవల్ల బాణాలుగా మారి రామలక్ష్మణుల శరీరాల్లో దూరాయి. వాటికి యముడైన గరుత్మంతుడు రాగానే రామలక్ష్మణుల దేహాలు విడిచి పారిపోయాయి.

తర్వాత గరుత్మంతుడు రామలక్ష్మణుల శరీరాలు నిమిరి వాళ్ళకి మళ్ళీ సకల శక్తులూ కలగజేశాడు. వాళ్ళు గాయాలన్నీ మానగా ఇద్దివర కటికన్న ఎక్కువ బలమూ తేజస్సుతో లేచారు.

• •

మాకు ఈ ఉపకారం చేసిన నీ వెవడవు? అని రాముడు అడగగా గరుత్మంతుడు, "నేను నీకు పరమ మిత్రుడను, సహచరుడను కూడా. నీకు మంగళ మగును గాక! నేను పోయి వస్తాను. యుద్ధంలో నీవు విజయం పొందగలవు. తర్వాత నే నెవడనో తీరికగా మాట్లాడు కోవచ్చు" అని పలికి, గరుత్మంతుడు వెళ్లిపోయాడు.

రామలక్ష్మణులు మళ్లీ ఆరోగ్యం కోలుకుని సంపూర్ణమైన బలంతో నిలబడగానే వానరులు ఆనందోత్సాహంతో రావణుడి కోటను ముట్టడించారు.

87. "రేపు రా!"

రాజభవనంలో ఉన్న రావణుడు ఈ వానరుల కోలహలమూ, విజయ ఘోషా విని ఆశ్చర్యపోయాడు. తన పక్కనున్న రాక్షసులను చూసి "ఏంటిది? ఆశ్చర్యంగా ఉందే! ఈ వానరులు ఇలా సంతోషించడానికి కారణం ఏంటి? రామలక్ష్మణులు గాయపడి తెలివి తప్పి పడి ఉంటే కలవరపడవలసిన ఈ సమయంలో వీళ్లు ఇలా ఉత్సాహంతో కోలాహలం చేయడానికి కారణమేంటి? ఏదో విశేషం జరిగి ఉంటుంది. చూచి రండి వెంటనే" అని పంపాడు.

కొంచరు రాక్షసులు ప్రాకారం ఎక్కి చూసి తిరిగి వచ్చి భయ పడుతూ భయపడుతూ రావణుడి కీసంగతి నివేదించారు. "రాజా! సుగ్రీవుడి నాయకత్వాన వానరసేన బలే ఉత్సాహంతో మన కోటను ముట్టడిస్తూంది. రామలక్ష్మణులు ప్రాణాలతోనే ఉన్నారు. కట్టుపడిన ఏనుగులు కట్టుతాళ్ళను తెంచుకొని బయలుదేరినట్లు రామలక్ష్మణులు నాగపాశాలను తెంచుకొని సైన్యంతో వస్తున్నారు. వాళ్లు సింహపిల్లల్లా తిరుగుతున్నారు. ఇంద్రజిత్తు వాళ్ళని బంధించిన నాగపాశాలు వ్యర్థమై పోయాయే" అని వాపోయారు.

రావణుడి ముఖం ముడుచుకుపోయింది. అతడికి చింత పట్టుకుంది. "ఇంతవరకు ఈ బాణాలనుండి తప్పించుకున్న వాళ్లెవరూ లేరు.

• •

మీరు చెప్పింది చూస్తే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈ బాణాలు వ్యర్థ మయినట్లయితే ఇక ఆపద వచ్చినట్లే" అన్నాడు.

అంతలో రోషం పొంగింది. "ధూమ్రాక్ష! నీ వుండగా నాకు చింత ఎందుకు? కావలసిన వీరుల్ని కొనిపోయి వెంటనే రామలక్ష్మణు లను చంపిరా!" అని ఆజ్ఞ ఇచ్చాడు.

ఆ మాట విని ధూమ్రాక్షుడు ఆనందించాడు. రావణుడు తన కింతటి గౌరవం ఇచ్చాడు కదా అని పొంగిపోయాడు. సైన్యాన్ని తన వెంటబెట్టుకు బయలుదేరాడు. కోట దాటి వచ్చి, వానరులను ఢీకొన్నాడు

హనుమంతుడి నాయకత్వాన పడమటి వాకిలిని ముట్టడిస్తున్న వానర సేనను ఎదిరించాడు. అక్కడ జరిగిన యుద్ధంలో రెండు పక్కలా చాలామంది మరణించారు. తుదకు ధూమ్రాక్షుడు, మారుతి చేతిలో మరణించాడు. రాక్షసులు చెల్లాచెదరై పారిపోయి కోటలో దూరి ప్రాణాలు దక్కించుకున్నారు. చాలామంది మర ణించారు.

ఈ ఓటమి సంగతి తెలియగానే రావణుడికి పట్టరాని కోపం వచ్చింది. మాటలు తడబడ్డాయి. దగ్గరున్న వజ్రదంష్ట్రిణ్ణి చూసి "వీరశిఖామణీ! వెంటనే పోయి ఈ దుష్టులను నిర్మూలించి తర్వాత మరొక పని చూడు. ఇక తామసించడానికి వీలులేదు" అని ఆజ్ఞా పించాడు.

వజ్రదంష్ట్రిడు రాజుకు ప్రదక్షిణం చేసి నమస్కరించి సైన్యం తీసుకుని దక్షిణద్వారం నుంచి బయలుదేరాడు. అక్కడ అంగదుడి నాయకత్వంలో వున్న వానర సేనను ఎదిరించాడు.

వజ్రదంష్ట్రిడి నాయకత్వంతో రాక్షసులు ఘోరంగా యుద్ధం చేశారు. ఆ పోరులో ఎందరో వానర వీరులు మరణించారు. అయినా వానరసేన వెనకాడలేదు. పెద్దపెద్ద బండలను వృక్షాలను పెకలించి విసిరి ఎందరో రాక్షసులను పిండి పిండి చేసి చంపారు. రెండు పక్షాల వారికీ అతి తీవ్ర యుద్ధం జరిగింది. అంగదుడికీ రాక్షస నాయకుడికీ

ముఖాముఖి పోరు చాలాసేపు సాగింది. వజ్రదంష్ట్రుడు చచ్చాడు. రాక్షస సేన చెల్లాచెదరైపోయింది. వానర సేన అంగదుడ్ని చుట్టూ చేరి విజయఘోష చేసింది.

* * *

రావణుడు ప్రహస్తుణ్ణి చూసి "యుద్ధకుశలుడైన అకంపనుడ్ని భయంకరులైన రాక్షస వీరులను ఎంచుకొని వెళ్లి ఈ వానర సైన్యాన్నీ, రాముణ్ణీ, సుగ్రీవుణ్ణీ వధించి రమ్మని చెప్పు. అకంపనుడి శౌర్య సామర్థ్యాలు వ్యర్థంకావు" అన్నాడు.

ప్రహస్తుడు రావణుడి ఆజ్ఞ ప్రకారం అకంపనుడి నాయకత్వంతో పెద్ద సేనను పంపించాడు. అకంపనుడు పేరుకు తగినవాడు. తొణుకూ బెణుకూ లేకుండా యుద్ధం చేయగల సమర్థుడు. ఆయుధాలను చేత బట్టి మహా సైన్యంతో యుద్ధభూమికి బయలు దేరాడు. దారిలో ఎన్నో అపశకునాలు కనిపించాయి. అయినా అతడుకాని అతడి సేనకాని వాటి నేమాత్రమూ లెక్కచేయలేదు. వాళ్లు చేసిన సింహనాదాలకు సముద్రం కలవరపడింది.

రెండుపక్షాల వాళ్ళకీ గొప్ప యుద్ధం జరిగింది. నెత్తురు ఏరులై ప్రవహించింది. ఎర్రడి ధూళి ఆకాశమెత్తున లేచింది. ఆ ధూళివల్ల నాలుగుపక్కలా చీకటి అలుముకుంది. ఉభయపక్షాలా లెక్కలేనంత మంది వీరులు మరణించారు. వానరవీరులైన కుముదుడు, నలుడు, మైందుడు, ద్వివిదుడు, అకంపనుడ్ని ఎదిరించారు. వాళ్లతో అకంపనుడు అతి శౌర్యంతో పోరు సలిపాడు.

రాక్షసుల ధాటికి తట్టుకోలేక వానరవీరులు పరుగులు పెడుతున్న సమయంలో హనుమంతుడు వచ్చి చేరాడు. అకంపనుడు శరవర్షం కురిపించాడు. హనుమంతు డాబాణాల వానను లెక్కచేయక ఒక పెద్ద బండను ఎత్తి గిరగిర తిప్పి అకంపనుడిమీద పడవేశాడు. రాక్షసుడు తన బాణాలతో ఆ బండను అడ్డగించి భేదించాడు. హనుమంతుడు తన దేహాన్ని పెంచుకొని సూర్యుడిలా మిరుమిట్లు కొలుపుతూ ప్రకాశించాడు. ఒక పెద్ద వృక్షాన్ని పెకలించి దాంతో రాక్షసుడ్ని కొట్టి సంహరిం

చాడు. భూకంపానికి చెట్లు అల్లాడినట్లు రాక్షసులు వణికిపోయి పరుగులు పెట్టారు. వెనక్కి తిరిగి చూడకుండా పరుగెత్తారు. చావగా మిగిలిన వాళ్ళంతా అలా పారిపోయి కోటలో దూరి ప్రాణాలు దక్కించుకున్నారు. హనుమంతుడి పరాక్రమాన్ని వానరులంతా కొనియాడి విజయ కోలాహలం చేశారు.

* * *

అకంపనుడి మరణవార్త వినగానే రావణుడి ముఖం వెలవెలపోయింది. కోపావేశంతో ఆలోచించడం మొదలుపెట్టాడు. నగర రక్షణ ఏర్పాట్లన్నీ ఒకసారి పరీక్షించి చూసి తృప్తిచెందాడు. సేనాధిపతి అయిన ప్రహస్తుడితో మంత్రాలోచన చేశాడు.

"ఈ వానరుల ముట్టడిని తుదముట్టించాలి. బలమైన సేనను కూర్చుకుని వెళ్ళి యుద్ధంచేసి వాళ్ళ నాయకులను హతమార్చినప్పుడే అది సాధ్యమవుతుంది. నేనూ, కుంభకర్ణుడు, నీవు, ఇంద్రజిత్తు, నికుంభుడు ఈ అయిదుగురిలో ఎవరో ఒక్కళ్ళు ఈ బాధ్యత వహించి సేనతో కోట వెలుపలికి వెళ్ళి యుద్ధం చేయాలి. ఈ వానరులను చూసి మనం ఇంతలా భయపడడమా? ఘన రాక్షసుల గర్జన వినగానే వాళ్ళకి ప్రాణాలు పోవాలి. యుద్ధ విజ్ఞానంకాని అభ్యాసంకాని లేని ఈ వానరులను తరిమికొట్టడం అంత కష్టంకాదు."

ప్రహస్తుడది విని వినయంగా ఇలా మనవి చేశాడు:

"మనం పూర్వం అనుకొన్నట్లే అన్నీ జరుగుతున్నాయి. సీతను మళ్ళీ అప్పగించడమే మంచి పద్ధతి. అదే మన శ్రేయస్సుకు మార్గం అని ముందే మనవి చేశాం. ఏమయినా నేను మీకు ఋణపడి ఉన్నాను. నా ధన మాన ప్రాణాలనూ, కుటుంబాన్నీ ఆహుతిచేసి యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నేనే స్వయంగా సేనతో వెళతాను."

ప్రహస్తుడు వెంటనే గొప్ప సైన్యాన్ని ఆయత్తం కమ్మని ఆజ్ఞాపించాడు. నగరంలో హోమం, శాంతి, బ్రాహ్మణపూజ మొదలైనవి జరిపించారు. గాలి అంతా పరిమళంతో నిండిపోయింది. భేరీ ఘోషతో ప్రహస్తుడు యుద్ధానికి బయలుదేరాడు.

* *

దారిలో అతడికి అపశకునాలు కనబడ్డాయి. ప్రహస్తుడి నాయకత్వంతో గొప్ప సేన కోటవిడిచి తూర్పు వాకిలిగుండా బైటికి రావడం చూడగానే వానరులు సింహనాదాలు చేస్తూ యుద్ధానికి తయారయ్యారు.

మంటమీదికి మిడతలదండు దూకినట్లు ప్రహస్తుడి నేతృత్వాన రాక్షస సేన వానర సైన్యం మీదికి దూకింది.

* * *

"ఆ మహా సేనతో వస్తున్న ఆ రాక్షసు డెవడు?" అని రాముడు అడిగాడు.

"అతడే ప్రహస్తుడు. రావణుడి సేనాధిపతి. లంకా సైన్యంలో మూడవవంతు ఇతడి అధీనంలో ఉంది" అని విభీషణుడు జవాబు చెప్పాడు.

తర్వాత చెట్లు గుట్టల ఆయుధాలతో వానర వీరులూ; కత్తి, శూలం, ఈటె, గొడ్డలి, ముసలం మొదలైన ఆయుధాలతో అపార మైన రాక్షసబలగమూ యుద్ధానికి తలపడ్డారు. రాళ్ల వర్షం, బాణ వర్షం కురిశాయి. రెండుపక్షాల వీరులూ బాహాబాహి యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో అసంఖ్యాక వానర వీరులూ, రాక్షస వీరులూ మరణించారు.

ప్రహస్తుడి వీరులైన మురాంతకుడు, మహానాధుడు, కుంభహనుడు మొదలైనవారు ద్వివిదుడు, దుర్ముఖుడు జాంబవంతుడు మొదలైన వానర వీరులను ఎదిరించి వాళ్ల చేతుల్లో మరణించారు. ప్రహస్తుడికీ నీలుడికీ చాలాసేపు పోరు ఘోరంగా సాగింది.

ఆఖరికి ప్రహస్తుడు ఒక ఇనప గదనెత్తి పట్టి నీలుడి మీదికి లంఘించాడు. నీలుడు వెంటనే ఒక పెద్ద బండనెత్తి ప్రహస్తుడి తల పగలగొట్టాడు. అది చూసి రాక్షస వీరులు చెల్లాచెదరయ్యారు. ఇలా గొప్ప విజయం పొందిన నీలుడు రామలక్ష్మణుల దగ్గరకు వెళ్లి వారికి నమస్కరించి జరిగిన యుద్ధాన్ని గురించి వివరించాడు. రామలక్ష్మణులు నీలుడి శౌర్య పరాక్రమాలు కొనియాడి గౌరవించారు.

* *

మహా భారతం, రామాయణం ఈ రెండింటిలో కూడా యుద్ధ గాథలు మనోరంజకంగా ఉండవు. ఒకే విధమైన వర్ణనలతో దీర్ఘంగా ఉంటాయి. వచ్చిన వర్ణనే తిరిగి వస్తూ ఉంటుంది. అలాంటి వన్నీ నేను సమగ్రంగా చెప్పి ముగిస్తున్నాను. మాటలు సంగ్రహంగా ఉన్నంత మాత్రాన యుద్ధం సంగ్రహంగా ముగిసిం దని మాత్రం అనుకోకండి, ఆయుధాలు, గాయాలు, రక్తప్రవాహం, ప్రాణనష్టం, అన్నీ బ్రహ్మాండంగానే ఉన్నాయి.

* * *

యుద్ధ భూమినుంచి పారిపోయినవాళ్లు అగ్నిపుత్రుడైన నీలుడు, ప్రహస్తుణ్ణి చంపాడని రాక్షసరాజుకు తెలియపరచారు. దాంతో రావణుడికి కోపం పొంగి పొర్లింది. "ఇంద్రుణ్ణి అతడి దేవసేననూ జయించగల ప్రహస్తుడు వానరసేనకు బలి అయ్యాడు. ఇక అలక్ష్యం చేయడానికి వీలులేదు. ఈ రామలక్ష్మణులనూ వాళ్ల కోతి మూకనూ తుదముట్టించాలి" అనుకొని స్వయంగా రథమెక్కి భూతగణాలతో ఉండే రుద్రుడిలాగా యుద్ధభూమికి బయలుదేరాడు. ధగధగ మని మెరుస్తున్న రథమెక్కి నగరంనుంచి వచ్చి పెద్ద కెరటాలతో ఘోషిస్తున్న సముద్రంలాంటి వానరసేనను చూశాడు.

రావణుడి నాయకత్వంలో రాక్షససేన రావడం చూసి వానరులు గుట్టలు చెట్టులు పట్టుకుని యుద్ధానికి సిద్ధంగా నిలిచారు. వచ్చిన రాక్షస వీరులను గురించి విభీషణుడు రాముడికి వివరించి చెప్పాడు. "అదిగో! ఆ రథంమీద బాలసూర్యుడిలా ప్రకాశిస్తున్నాడే! ఇంద్రజిత్తు" అని ఇలా అనేక వీరులను గురించి చెప్పాడు. "అదిగో! ఆ పెద్ద రథంమీద సూర్యతేజస్సుతో నిలబడిన పది తలలవాడే రావణుడు" అన్నాడు. రావణుడి ఆకారమూ, తేజస్సు చూసి రాముడు ఆశ్చర్యపడ్డాడు. "అతడు మహావీరుడు, మహా బలశాలి అన్న విషయంలో సందేహం లేదు. కాని మహాపాపి అయిన ఇతడ్ని చంపక తప్పదు" అన్నాడు.

రావణుడు వస్తూనే చాలామంది వానరులను కొట్టి చంపాడు. నీలుడు రావణుణ్ణి ఎదిరించి అనేక విధాలుగా హింసించాడు. ఆఖ

రికి రావణుడు ఆగ్నేయాస్త్రం ప్రయోగించి అతనికి స్పృహ తప్పేలా పడగొట్టాడు. అప్పుడు హనుమంతుడు రావణుణ్ని బలంగా ఢీకొన్నాడు. ఇద్దరికీ ముష్టియుద్ధం జరిగింది. రావణుడు చలించలేదు. ఎదిరించిన వానర వీరు లంతా రావణుడి బాణాలకు గుర్తై స్పృహతప్పి పడి పోయారు.

తర్వాత లక్ష్మణుడికీ రావణుడికీ యుద్ధం జరిగింది. లక్ష్మణుడు కూడా తెలివితప్పి పడిపోయాడు. అది చూసి హనుమంతుడు లక్ష్మణుణ్ని ఎత్తుకొని రాముడి దగ్గరకు తీసుకుపోయాడు. తర్వాత రాముడు హనుమంతుడి భుజంమీద కూర్చుని రావణుడితో యుద్ధం చేశాడు. రాముడి బాణాలతో రాక్షసేంద్రుడు బలంగా దెబ్బలు తిన్నాడు. అతడి కిరీటం పడిపోయింది. రథం విరిగిపోయింది. విల్లు విరిగిపోయింది. ఇతర ఆయుధాలన్నీ పోయాయి. ఏం చెయ్యడానికీ పాలుపోక రావణుడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

"ఇవాల్టి కింక తప్పించుకుపో ! బాగానే యుద్ధం చేశావు. పోయి సేదతీర్చుకొని రేపు ఆయుధాలతో మళ్ళీ రా !" అని రామచంద్రుడు అన్నాడు. రావణుడు అవమానంతో నగరానికి తిరిగిపోయాడు.

88. కుంభకర్ణుడికి మేలుకొలుపు

యుద్ధభూమిలో రావణుడి కిరీటం పడిపోయి అతడు అవమానంతో కోటకు తిరిగిపోవడం చూసి దేవతలు సంతోషంతో హర్షధ్వానాలు చేశారు. "మన కష్టాలు తీరే కాలం సమీపిస్తూంది" అని ఆనందించారు.

రావణుడు అవమానంతో చింతాక్రాంతుడై కోటలో ప్రవేశించాడు. ఆలోచించి ఆలోచించి, మనస్సు కుదుట పరచుకుని తమ్ముడైన కుంభకర్ణుణ్ని లేపవలసిం దని ఆజ్ఞాపించాడు.

కుంభకర్ణుడు శాపంవల్ల నెలల తరబడి అలా నిద్రపోతూనే ఉంటాడు. రావణుడు అవమానంతో తిరిగి వచ్చేటప్పటికి కుంభకర్ణుడు నిద్రపోయి కొద్దిరోజులే అయింది. అందుకని ఆ లేతనిద్రనుంచి అతడ్ని సులభంగా లేపవచ్చునని రావణుడు అనుకొన్నాడు. "ఎలాగైనాసరే తమ్ముడ్ని నిద్రలేపి యుద్ధానికి తయారు చేయాలి" అని తన మంత్రులకు ఉత్తరు విచ్చాడు.

"నా తపస్సు లన్నీ వ్యర్థమయ్యాయి. ఋషులు చెప్పినమాట యథార్థ మయ్యేటట్లు కనిపిస్తూంది. కోటను అన్నివైపులనుంచీ జాగర్తగా కనిపెట్టి ఉండండి. తమ్ముడు సుఖంగా నిద్రపోతున్నాడు. అత డలాగ నెలల తరబడి నిద్రపోతాడో! పడుకొని ఇప్పటికి తొమ్మిది రోజులే అయింది. అతడ్ని వెంటనే లేపండి. అతడు యుద్ధానికి వెళితే ఈ శత్రువు లంతా చెల్లాచెద రై పోతారు. కుంభకర్ణుడి ఎదుట నిలవగల వా రెవరు? అతడు లేచి యుద్ధానికి నిలబడితే ఇక నాకు ఏ భయమూ లేదు. నే నిలా విచారిస్తున్నా నని అతడికి తెలియదు. హాయిగా నిద్ర పోతున్నాడు."

ఇలా రావణుడు చెప్పగానే సేవకులు కుంభకర్ణుడి భవనానికి వెళ్లారు. కుంభకర్ణుడు లేచేసరికి అతడికి మితిమీరిన ఆకలి వేస్తుంది. అందుకని ఆహార పదార్థాలను తయారుచేసి గుట్టలు గుట్టలుగా పేర్చారు. తర్వాత అతడ్ని లేపడానికి భేరులు, శంఖాలు తెచ్చి పెద్ద ధ్వని చేశారు. రాక్షసులు అతడ్ని గుద్దారు. వాళ్ల హట్టహాసమూ భేరీ శంఖాది ధ్వనులు మిన్నుముట్టాయి. పక్షులూ మృగాలూ భయపడి పారిపోయాయి.

నిద్రలో మునిగిన కుంభకర్ణుడికి ఇదేమీ వినిపించనేలేదు. పడుకున్నవాడు పడుకున్నట్లే ఉన్నాడు. నిద్రలో ఉన్న కుంభకర్ణుణ్ని రాక్షసులు అనేక విధాలుగా హింసించారు. అతణ్ని ఏనుగులచేత తొక్కించారు. కర్రలతో మోదారు. ఇంతటి ఉపద్రవం చేసిం తర్వాత కుంభకర్ణుడు కొంచెం కన్ను తెరిచి నిద్రలో ఉన్నవాడు దోమను అదిలించినట్లు చేయి విదిలించాడు. దాని తాకిడికి రాక్షసులంతా తూలిపడ్డారు. కుంభకర్ణుడు ఒక్కసారి గట్టిగా ఆవులించాడు.

• •

అతను ఇలా నిద్రనుంచి లేపడానికి కారణం ఏమి టని చాలా కోపంతో అడిగాడు. విషయం తెలుసుకోకుండానే ఆకలితో ఉన్నందున గుట్టలుగా పడిన ఆహార పదార్థాలను, మాంసఖండాలను కబళించాడు. కడవలతో కల్లు తాగి దాహం తీర్చుకున్నాడు. అప్పటికి అతని కోపం కొంచెం చల్లారింది. రాక్షసులప్పుడు అతడ్ని సమీపించి విషయాన్ని వివరించారు.

రావణుడి మంత్రి విరూపాక్షుడు ఇలా చెప్పాడు: స్వామీ! యుద్ధంలో దెబ్బ తిని మనం అపాయంలో ఉన్నాం. సీత మూలముగా యుద్ధం వచ్చింది. వానరులు, రఘుకుమారులు కని విని ఎరుగని విధంగా మన సైన్యాన్ని వీరులనూ సంహరిస్తున్నారు. లంకానగరం చుట్టూ వానర సేన సముద్రంలాగా నిలిచి ఉంది. రావణేశ్వరుడే యుద్ధంలో దెబ్బతిని ఓడి వచ్చారు. ఆయన ప్రాణాలతో బతికి బైటపడడం నిజంగా మన అదృష్టం'' అన్నాడు. అది వినగానే కుంభకర్ణుడు పట్టరాని కోపావేశంతో ఊగిపోయాడు. "ఈ క్షణమే శత్రువులను నిర్మూలిస్తాను. వానర సేనను చంపి, రామలక్ష్మణుల నెత్తురు తాగుతాను. కార్యం ముగించుకొని తర్వాత పోయి రావణుణ్ని చూస్తాను.''

అని ఇలా కుంభకర్ణుడు రోషావేశంతో మాటలాడడం విని మంత్రులు సంతసించారు. "మొదట రాజుగారిని చూసి అలోచించి ఆ తర్వాత ఉచిత మని తోచింది చేయండి'' అని కుంభకర్ణుడికి విన్న వించారు.

కుంభకర్ణుడు సరే అలాగేనని చెప్పి ముఖం కడుగుకొని తన బలాన్ని వృద్ధి చేసుకొని భూమి కంపించేటట్లు అడుగులువేస్తూ లంకేశుడు కూర్చున్న మంటపానికి వెళ్లాడు. కుంభకర్ణుడు వెళ్ళడం చూసి రాక్షసులకు ధైర్యం వచ్చింది. దారిలోని వారు ఆనందంతో చేతులు జోడించి ఆయనకు నమస్కరించారు. అతడిమీద పుష్పవర్షం కురిపించారు.

కుంభకర్ణుడు రాజనగరుకు వెళ్లి రావణుడి ఎదుట నిలిచాడు. సాటిలేని వీరుడ్ని తన తమ్ముడు మేల్కొన్నాడన్న ఆనందంతో రావణుడతనికి ఎదురుగా వెళ్లి స్వాగత మిచ్చి కౌగలించుకున్నాడు.

• •

"ఏం చేయాలి అన్నా ?" అని కుంభకర్ణుడు అడిగాడు. "నన్నెం దుకు ఇప్పుడు లేపారు ? నీకు వచ్చిన ఆపద ఏంటి ? చావడానికి సిద్ధంగా ఉన్న వాళ్ళెవరు ? చెప్పు" అన్నాడు.

"తమ్ముడూ : నీకు తెలియదు. నీవు నిద్రలో మునిగి ఉన్నావు. నాకు ఈ రాముడి బెడద ఒకటి చాలా పెద దెపోయింది. వానర సేన సముద్రంలాగా లంకను చుట్టుముట్టింది. మన వీరులు వాళ్ళ నెదిరించి ఓడిపోయారు. ఎందరో చచ్చిపోయారు. రాముడు సముద్రంమీద ఒక సేతువును నిర్మించి గొప్ప సేనతో వచ్చాడు. మన కులాన్ని సమూలంగా నాశనం చేయాలని ఉన్నాడు. మన సంపద, మన సేనా బలం అంతా అయిపోయింది. ఇక నీ వొక్కడివే మన కులాన్ని కాపా డాలి; నిన్నే నమ్ముకున్నాను. నీవు యుద్ధంలో దేవతల నందరినీ కకా వికలు చేశావు. నా మీద నీ కెంత ప్రేమ ఉందో నాకు తెలుసు. యుద్ధం అంటే నీకున్న ప్రీతి, నీ శౌర్యం నాకు తెలుసు. వెంటనే వెళ్ళి ఈ శత్రువులను సంహరించి, నన్నూ లంకనూ రక్షించు" అన్నాడు రావణాసురుడు.

అది విని కుంభకర్ణుడు పకపక నవ్వాడు. రావణుడు విచా రంతో విలపించడం వినగానే కుంభకర్ణుడి సహజకోపం పోయింది. పూర్వ విషయాలన్నీ గుర్తు కు వచ్చి వివేకం ఉదయించింది. అన్న చేసిన తప్పిదా లన్నీ గుర్తు తెచ్చుకొని నవ్వాడు. తర్వాత ఇలా అన్నాడు :

"క్షమించు అన్నయ్యా ? ముందు మీరు మంత్రాలోచన చేసి నప్పుడే ఈ విషయాన్ని గురించి మే మంతా హెచ్చరించాం. మేం అన్నట్లుగానే ఇప్పుడు జరిగింది. మీ మేలుకోరి చెప్పిన మాటలను మీరు పెడచెవిని పెట్టారు. సీతను అపహరించిన పాపానికి ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నారు. కామ ప్రేరితు డై నవాడు మంచి చెడలు ఆలోచించకుండా ఒక పనిలో ప్రవేశించినప్పుడు దానివల్ల కలిగే కష్టాలను అనుభవించే తీరాలిగదా ? ముందు ఆలోచించి పనిలోకి దిగ డానికి మారు, పనిలోకి దిగిం తర్వాత ఆలోచించడం అసంబద్ధం; రాజనీతికి విరుద్ధం. ఈ విషయాన్ని నే నప్పుడే చెప్పాను. సీతమీద

అంత మోజు ఉంటే ముందు రామలక్ష్మణులను సంహరించి ఆ తర్వాత సీతను తెచ్చి ఉంటే బాగుండేది. అలాకాక మీరు తలకిందులుగా చేశారు. మంచిచెడ్డలు ఆలోచించి చెప్పగల మంత్రులు, బంధుమిత్రులతో చర్చించకుండా, లేదా వారు చెప్పిందా నైనా చెవిని పెట్టకుండా, చేసే పని అపాయాలకూ, కష్టనష్టాలకూ దారి తీసుంది. ఈ సంగతి మీకు తెలియదా? సరైన ఆలోచన చెప్పేవా రెవరో, చెప్పనివా రెవరో రాజైనవాడు తెలుసుకోవాలి.''

ఇలా కుంభకర్ణుడు చేసిన ధర్మోపదేశం, నీతిశాస్త్ర వివరణా రావణుడికి నచ్చనేలేదు. రావణుడి ముఖంలో కోపం గోచరించింది. అయినా తాను అపాయస్థితిలో ఉన్నందువల్ల ఆ కోపాన్ని ఒక విధంగా అణచుకొని మాట్లాడాడు. "తమ్ముడూ! ఇప్పుడు ఈ విమర్శలవల్ల ప్రయోజనంలేదు. సమయం మించి పోయింది. ఇప్పుడు నేను కోరేది నీ పరాక్రమ తీవ్రతను మాత్రమే. న్యాయమో, అన్యాయమో, వివేకమో అవివేకమో, గర్వమో అజ్ఞానమో దేనివల్లనైతేనేం- మయం మించిపోయిం తర్వాత ఆలోచిస్తూ ఉండడంవల్ల ప్రయోజనం ఏంటి? జరిగిం దేదో జరిగిపోయింది. ఇప్పు డీసంకట స్థితిలో ఏం చేయా లనేది ప్రశ్న. జరిగిన పొరపాట్లవల్ల కలిగిన కీడును నీవు నీ బలపరాక్రమాలతో సామర్థ్యంగా తొలగించాలి, అది నీ కర్తవ్యం. పొరపాట్లు చేసి చిక్కుల్లోను అపాయాల్లోను తగుల్కొన్న వాడికి సహాయం చేసినవాడే మిత్రుడు. నా మీద నీకు నిజంగా ప్రేమ అంటూ ఉందే ఇప్పుడు నాకు సహాయం చెయ్. నీ శక్తి సామర్థ్యాలు నాకు తెలుసు. అందుకే ఇలా మాట్లాడుతున్నాను. ఆత్రంతో బాధపడుతున్న నాకు ధైర్యం చెప్పి నన్ను విడిచి పెట్టక శూరుడిలా ప్రవర్తించు'' అన్నాడు.

అన్నమాటలు విని కుంభకర్ణుడిలా అన్నాడు: "మీ రింక చింతించకండి. మిమ్మల్ని భయపెట్టిన ఈ శత్రువులను ఇప్పుడే వధిస్తాను. నేను మీ తమ్ముడ్ని. మిమ్మల్ని ఎన్నటికీ విడిచిపెట్టను. ఇంక రామలక్ష్మణులు మరణించారనే మీరు నిశ్చయం చేసుకోవచ్చు. ఈ వానరసేనను ఛిన్నాభిన్నంచేసి వధిస్తాను. సందేహించకండి. రాముడి తల నరికి

తెచ్చి మీ పాదాలముందు పడేస్తాను. భయపడకండి. సుగ్రీవుడి రక్తం సెలయేరులాగ ప్రవహించడం మీరు చూస్తారు. నన్ను చంపిన తర్వాత కదా రాముడు మిమ్మల్ని ఎదిరించడం? నన్ను చంపగలవా డెవడూ లేడని మీకు తెలుసు."

ఇలా మాట్లాడుతూ వుంటే కుంభకర్ణుడికి వీరావేశం పొంగులు వారింది. "ఏశత్రువునైనాసరే హతమారుస్తాను. యముడే రానీ! సూర్యుడే వచ్చి ఎదిరించనీ! అగ్ని వచ్చినా సరే! అందర్నీ విరుచుకు మింగేస్తాను" అని వీరాలాపాలు పలికి అన్నకు ధైర్యం చెప్పి యుద్ధభూమికి బయలు దేరాడు.

* * *

కుంభకర్ణుడు మొదట గాఢ నిద్రనుండి లేవగానే విసుగుతో మాట్లాడాడు. తర్వాత కొంత ఆకలి తీరగానే కోపం చల్లారి ఇంగిత జ్ఞానంతో రావణుడికి విషయా లన్నీ వివరించి హితవు బోధించాడు. ఆ తర్వాత రావణుడి పరిస్థితి చూసి మనస్సు కరిగి మమకారంతో అన్నిం టినీ మరచిపోయాడు.

"నీవంటి వీరుడు, నీలాంటి తమ్ముడు, ఆపదలో ఆదుకొనే మిత్రుడు మరి యెవరున్నారు కుంభకర్ణా!" అని రావణుడు ఆనంద పరవశుడై తమ్ముడ్ని యుద్ధానికి పంపాడు. తమ్ముడు తప్పకుండా జయిస్తాడని రావణు డనుకున్నాడు. తాను చచ్చి బతికినట్లు ఆనం దించాడు.

కుంభకర్ణుడు శూలాయుధం పట్టుకొని ఒంటరిగా యుద్ధభూమికి బయలు దేరాడు. అప్పుడు రావణుడు అతణ్ని ఆపి "ఇలా ఒంటరిగా పోవద్దు. సైన్యాన్ని వెంట తీసుకుపో" అని చెప్పి తమ్ముడి మహాకాయా నికి నగలు అలంకరించి, పూలమాల వేసి, ఆశీర్వదించి "ఇక వెళ్లిరా వీరుడా! శత్రువులను నిర్మూలంచి విజయఘోషతో మళ్ళీ తిరిగి రా!" అన్నాడు.

కుంభకర్ణుడు దివ్యాభరణాలు ధరించి త్రివిక్రముడిలా ప్రకా శించాడు.

• •

కుంభకర్ణుడు అన్నకు ప్రదక్షిణ నమస్కారాలు చేసి పొడుగాటి శూలాయుధం పట్టుకొని బయలుదేరాడు. పెద్ద రాక్షససేన అతడి వెంట వచ్చింది. కుంభకర్ణుడు వెడుతూ ఉండగా లంకలోని రాక్షసులు అతడి మీద పూలవాన కురిపించారు. కుంభకర్ణుడు ఆ పూలమధ్య అగ్నిపర్వతం లాగా ప్రకాశిస్తూ వెళ్లాడు. ప్రాకారాన్ని లంఘించి యముడిలా వస్తున్న కుంభకర్ణుణ్ని చూసి వానరులు భయంతో ఇటూఅటూ పరుగులు పెట్టారు. వానర నాయకులు అతి కష్టంమీద వాళ్ళకి ధైర్యం చెప్పి కూడదీయగలిగారు.

89. నా రా యు ణు డే నా ?

అంగదుడి ప్రోత్సాహ వచనాలతో వానరులు ధైర్యంతెచ్చుకుని ఒకటిగా చేరి కుంభకర్ణుడిమీద పడ్డారు. పెద్దపెద్ద చెట్లను బండలను పెకలించి తెచ్చి అతడిమీద విసిరారు, పిడకిళ్ళతో కుమ్మారు. కాని కుంభకర్ణుడికి ఈగ వాలినట్టన్నా లేదు. అతడు నవ్వుతూ వానరులను హతమారుస్తున్నాడు. కుంభకర్ణుడు వీరావేశంతో చేసిన ఆ ఘోర యుద్ధంవల్ల వానరులు చెల్లాచెదరైపోయారు. ఆకాశమార్గాన అడవులవెంట పారిపోయి దాక్కున్నారు. అప్పుడు అంగదుడు మరొకమారు సేనలో వీరులకు ధైర్యంచెప్పి కూడదీసి కుంభకర్ణుడిపైకి పంపాడు. ద్వివిదుడూ, హనుమంతుడూ, నీలుడూ, వృషభుడూ, శరభుడూ మొదలైన వీరులు కుంభకర్ణుణ్ని బలంగా కొట్టారు. కాని అతడు దాన్ని లెక్కపెట్టలేదు. వానరులను ఒకళ్ళ తర్వాత ఒకళ్ళని కొట్టి నలిపి కూలేశాడు. వానర సైన్యానికి చాలా నష్టం కలిగించాడు. అంగదుడు దెబ్బలు తిని స్పృహతప్పి పడిపోయాడు. సుగ్రీవుడుకూడా దెబ్బతిని తెలివితప్పి పడిపోయాడు. అలా తెలివితప్పి పడి ఉన్న సుగ్రీవుణ్ని ఎత్తుకొని కుంభకర్ణుడు ఆనందంతో లంకలోకి పరుగెత్తాడు. రాక్షస సైన్యం ఆనందంతో కోలాహలంచేసింది. వానరరాజును రావణుడికి బహుమతిగా ఇవ్వాలని కుంభకర్ణుడు అనుకున్నాడు.

* * *

ఇలా తెలివి తప్పిన వానరరాజు నెత్తుకొని విజయ ధ్వానాలతో లంకా నగరంలో రాజవీధిలో కుంభకర్ణుడు నడుస్తూ ఉంటే మేడల మీద నుంచి రాక్షస స్త్రీలు చందన పుష్పాలు కురిపించారు. కొంత సేపటికి సుగ్రీవుడికి తెలివి వచ్చింది. ఇదేంటి? ఎక్కడ ఉన్నాను? అని నలుపక్కలా చూసి విషయం గ్రహించాడు. వెంటనే రాక్షసుడి ముక్కూ, చెవులూ కొరికి గోళ్ళతో గీరి గాయపరిచాడు. కుంభకర్ణుడా బాధ భరించలేక సుగ్రీవుణ్ణి కిందపడవేసి కాళ్ళతో తొక్కి వేయాలని చూశాడు. వెంటనే సుగ్రీవుడు నిలువెత్తున లేచి ఆకాశమార్గాన రామచంద్రుడి దగ్గరకు వెళ్ళిపోయాడు.

సుగ్రీవుడు ఇలా చేస్తాడని హనుమంతుడికి ముందుగానే తెలుసు. అందుకని కలత పడిన వానరసేనకు ధైర్యంచెప్పి వ్యూహ మమర్చి ప్రశాంతంగా యుద్ధానికి సిద్ధపరచి ఉంచాడు. ముక్కూ, చెవులూ తెగి రక్త ప్రవాహంతో కుంభకర్ణుడు సాయంకాల మేఘంలాగ కనిపించాడు. పట్టలేని కోపంతో ఒక పెద్ద ఇనుపగద పట్టుకొని కాలాంతకుడిలాగా యుద్ధభూమికి తిరిగి వచ్చాడు.

* * *

కుంభకర్ణుణ్ణి ఎవరూ అడ్డగించలేక పోతున్నారు. అతడు వానరులను చంపి తింటున్నాడు. కొండలాంటి అతడిమీది కెక్కి వానరులు పిడిగుద్దులు కురిపించారు, గోళ్ళతో చీల్చారు. కాని కుంభకర్ణుడు వాళ్ళని ఈగలను తోలినట్లు విదిలించి వేశాడు. వానరనాయకులెవరూ కూడా అతడ్ని అడుకోలేక పోయారు. లక్ష్మణుడు బాణాలు ప్రయోగించాడు. కాని కుంభకర్ణుడు అతడ్ని దాటిపోయి రాముడి మీదికి ఉరికాడు.

రామచంద్రుడు ఆ రాక్షసుడితో చాలాసేపు యుద్ధం చేశాడు. ఏడు మద్దిచెట్లనూ, వజ్రంతో సమానమైన వాలి శరీరాన్ని దూరిపోయిన బాణాలు ఈ రాక్షసుడి ముందు పనికిరాకుండా పోయాయి. అప్పుడు రాముడు అతి వాడిగావుండే బాణాలను వేసి కుంభకర్ణుడి చేతులూ కాళ్ళూ నరికివేశాడు. అయినా రాక్షసుడు యుద్ధం ఆపలేదు.

ఆ మొండికాళ్ళతోనే యుద్ధభూమి నలుపక్కలా వెళ్లి వానరులను మింగుతున్నాడు.

ఆఖరికి రాముడు తన విల్లు వంచి ఒక బాణం ప్రయోగించి ఆ రక్కసుడి తల నరికాడు. రామబాణ వేగానికి ఆ తల ఆకాశాని కెగిరి నెత్తురు ధారగా ప్రవహించగా లంకా నగరంలో ఒక పర్వతం లాగ పడింది.

* * *

"కాలాంతకు డైన మీ తమ్ముడు కుంభకర్ణుడు ఉత్తమలోకాలు పొందాడు. అనేక వేల వానరులను, వానర సేనను చాలసేపు గడగడ లాడించాడు. తర్వాత రామబాణానికి ఆహుతి అయ్యాడు. కాళ్ళూ చేతులూ తెగిన అతడి దేహం కారుచిచ్చులో కాలిన ఒక మహావృక్షం లాగ వికారంగా పడి వుంది. అతడి శరీరం తెగి ఒక భాగం సముద్రంలో పడింది. మరొక తునక ఒక కొండలాగ కోట సింహద్వారాన్ని మూసివేసింది. తల తెగి ఎగిరివచ్చి లంకలో పడింది. తమ ప్రియతము డైన సోదరుడు వీరస్వర్గానికి వెళ్ళాడు."

ఇలా రాక్షసులు తెలియపరచగానే తన ప్రాణాలే పోయినట్లు రావణుడు తల్లడిల్లాడు. శోకావేశంతో స్పృహతప్పి పడిపోయాడు. తెలివి వచ్చింతర్వాత "హా వీరా! అపార బలంగలవాడా! న న్నొంటరిగా విడిచిపెట్టి యమలోకానికి వెళ్ళిపోయావా? నా కుడిభుజం పడిపోయింది. శత్రువైనవాడు నీ దగ్గరకు రావడానికే భయపడే నీవు ఆఖరికి రాముడి చేతుల్లో మరణించావా? ఆకాశంలో దేవతలు సంతోషిస్తున్నారు. వానరులు ఆనందంతో చిందులు తొక్కుతున్నారు. ఇక ఈ రాజ్యం నా కెందుకు? నా ప్రియమైన సోదరుడు పోయిం తర్వాత నాకీ ప్రాణాలు ఎందుకు? నా తమ్ముడి ప్రాణాలు తీసిన వాడ్ని చిత్రవధ చేయాలి" అని దుఃఖమూ, రోషమూ, ముంచుకురాగా రావణుడు బోరు మని ఏడ్చాడు. "అయ్యో విభీషణుడి మాటలు వినక పోయానే!" అని కొంతసేపు వాపోయాడు.

త్రిశిరుడు మొదలైనవాళ్లు రావణుణ్ని ఓదార్చి, ఇలా విలపించడంవల్ల ఫలితం లేదన్నారు. బ్రహ్మదేవుడిచ్చిన శక్తి, కవచం.

* *

ధనుర్బాణాలు ఉండగా అధైర్య పడవలసిన పని ఏమిటని సమాధాన పరచారు. తర్వాత త్రిశిరుడు యుద్ధానికి బయలుదేరగా, నేను ముందంటే నేను ముందని రాక్షసవీరులు పోటాపోటీలు పడుతూ ఏనుగులమీదా, రథాలమీదా ఎక్కి అతడివెంట బయలుదేరారు.

వానరులకూ, రాక్షసులకూ గొప్ప యుద్ధం జరిగింది. నరాంతకుడు గుర్ర మెక్కి ఈటెతో వానరులను పొడిచి వాళ్ళకి ఊపిరి సలపకుండా చేశాడు. సుగ్రీవుడి మీదికి లంఘించిన నరాంతకుణ్ణి అంగదుడు నిరాయుధుడు చేసి ఎదిరించి గుర్రాలతో సహా కూలదోశాడు.

అలాగే దేవాంతకుడూ, త్రిశిరుడూ, మారుతి చేతుల్లోనూ, మహోదరుడు నీలుడి చేతుల్లోను మరణించారు. అతికాయుడు, లక్ష్మణుడి బాణాలకు బలి అయ్యాడు.

ఈ నలుగురు రాక్షసవీరులూ నలుగురు యములలాగా యుద్ధం చేసి వానరసేనకు చికాకు కలిగించి ఆఖరికి యమాలయానికి పోయారు

అతికాయుడి మరణవార్త వినగానే రావణుడికి మతి చలించింది.

"ఏమిటీ, ఆశ్చర్యం? పర్వతాల్లాంటివాళ్లూ సముద్రంలా గంభీరమైనవాళ్ళూ అయిన నా వీరులంతా ఒకళ్ల తర్వాత ఒకళ్ళుగా శత్రువు చేతుల్లో మరణిస్తున్నారు. ఇంతవరకూ అపజయ మన్నది ఎరగని ఈ శూరులు ఇలా ఓడి మరణిస్తున్నారే! సాటిలేని మేటివీరుడు నా కుమారుడు వేసిన నాగపాశాన్ని ఎలాగో తెంపుకోగలిగారు. ఈ రాముడి పరాక్రమం ఆశ్చర్యకరంగా ఉందే! నాకేం అర్థం అవడంలేదు. ఇతడు సాక్షాత్తు నారాయణుడే అనుకుంటాను."

అని రావణుడు ఇలా ఆశ్చర్యపడి ఆలోచనలో పడ్డాడు. అతడికి గుండె పగిలిపోయి నట్టనిపించింది

కోటలోకి, ముఖ్యంగా అశోకవనంలోకి శత్రువులు చొరడానికి వీలులేకుండా కట్టుదిట్టంచేసి రావణుడు దీనంగా అంతఃపురానికి చేరాడు.

• •

90. ఇంద్రజిత్తు మరణం

"నే నింకా ప్రాణాలతో ఉండగా తమ కీచింత ఎందుకు నాన్నగారూ" అని ఇంద్రజిత్తు రావణుడ్ని అడిగాడు.

తండ్రి కిలా ధైర్యం చెప్పి పెద్దసేనను కూర్చుకొని యుద్ధ భూమికి వెళ్లాడు. వానర సైన్యానికి చిక్కాకు కలిగించి లక్షలాది వానరుల ప్రాణాలు తీశాడు. ఎందరినో గాయపరచాడు. వానర సైన్యం ఓడిపోయి గడగడ లాడిపోయింది. ఏం చేయడానికీ తోచక చెల్లాచెదరైంది.

ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రానికి రామలక్ష్మణులు కూడా బంధింపబడి తెలివితప్పి పడిపోయారు. ఇంద్రజిత్తు, దిగాలుపడి వున్న తండ్రికి ఈ విజయవార్త చెప్పి సంతోష పెడదామని బయలు దేరాడు.

* * *

విభీషణుడు వానర నాయకులను వెతికి కూడదీసి ధైర్యం చెప్పాడు.

కొనప్రాణంతో ఉన్న జాంబవంతుడు మెల్లగా లేచి వెళ్ళి "మారుతయినా బతికి ఉన్నాడా?" అని వానరులను అడిగాడు. హనుమంతుడు "ఇదిగో ఉన్నాను" అని జాంబవంతుడికి పాదాభి వందనం చేశాడు.

"నాయనా! వెంటనే ఉత్తర దిశగా బయలుదేరు. సముద్రం దాటి హిమవత్పర్వత శ్రేణికి వెళ్ళి ఋషభ పర్వతం, కైలాస పర్వతాలకు మధ్యనున్న సంజీవిపర్వతానికి వెళ్ళి ఆ పర్వత శిఖరంమీద ఉన్న నాలుగు ఓషధులను తీసుకురా. అవి తెస్తే రామలక్ష్మణులకు వానర సేనకు స్పృహ వచ్చి గాయాలు మాని కోలుకుంటారు. ఆలస్యం చేయకుండా వెంటనే ఈ పని పూర్తి చేయాలి. నీ కొక్కడికే ఇది సాధ్యమౌతుంది" అన్నాడు జాంబవంతుడు.

* * *

హనుమంతుడు రివ్వుమని ఆకాశానికి ఎగిరిపోయాడు. ఆకాశ మార్గాన సంజీవి పర్వతాన్ని చేరుకున్నాడు. అయితే ఆ కొండమీద ఉన్న ఓషధులను గుర్తించలేక పోయాడు. అందుకని ఆ పర్వతాన్నే ఎత్తుకొని లంకకు బయలుదేరాడు.

* * *

హనుమంతుడు ఆ సంజీవి పర్వతంతో లంకకు సమీపించగానే ఆ ఓషధుల మహత్తువల్ల రామలక్ష్మణులకు, వానరులకు గుచ్చుకున్న బాణాలు ఊడిపోయాయి. వాళ్ళ గాయాలు మానిపోయాయి. అంతా ఉత్సాహంగా లేచి నిలబడ్డారు.

* * *

సుగ్రీవుడు రాముడితో ఆలోచించి కొందరు వానరులను పంపి లంకలో ప్రవేశించి నగరానికి నిప్పు పెట్టవలసిందని ఆజ్ఞాపించాడు.

వానరవీరులు రాత్రి తొలిజామున దివిటీలతో లంకలో ప్రవేశించారు. రక్షకభటులను మట్టుపెట్టి లంకలో భవనాలకు, గోపురాలకు నిప్పు పెట్టారు. వేలకొద్దీ భవనాలు భస్మమైపోయాయి. సకల సంపదలతో, నాగరికతతో విలసిల్లిన లంకానగరం సర్వనాశనమై పోయింది.

ఈ ఉదంతాన్ని వాల్మీకి మహర్షి వివరంగా చిత్రించారు. దాన్ని చదివితే ఈ కాలపు యుద్ధాలలో కొత్తదనం ఏమీ కనిపించదు.

వానరులు లంకా నగరాన్ని దహించడం చూసి రావణుడికి చాలా కోపం వచ్చింది. కుంభకర్ణుడి పుత్రులైన కుంభుణ్ణి, నికుంభుణ్ణి యూపాక్షుడు మొదలైన మరికొందరు రాక్షస వీరులను తోడిచ్చి యుద్ధానికి పంపాడు. రాక్షసులకు వానరులకు ఘోరయుద్ధం జరిగింది.

కుంభుణ్ణి సుగ్రీవుడు, నికుంభుణ్ణి హనుమంతుడు వధించారు.

ఖలుడి కుమారుడు మకరాక్షుడనే రాక్షసుడు రాముణ్ణి ఎదిరించి అతని ఆగ్నేయాస్త్రానికి బలి అయ్యాడు.

అలాగే చాలామంది రాక్షసవీరులు కూడా మరణించారు. అది చూసి రావణుడి ఆజ్ఞతో ఇంద్రజిత్తు మళ్ళీ యుద్ధానికి బయలు

దేరాడు. బయలుదేరేముందు అసుర యజ్ఞంచేసి రాక్షసుల శక్తులు పొందాడు. ఆ శక్తులవల్ల ఆతడు ఆకాశాని కెగిరి ఎవరికీ కనిపించకుండా ఉండి యుద్ధం చేశాడు.

* * *

ఇంద్రజిత్తు తన మాయాబలంతో ఒక మాయ సీతను చేసి ఆమెను తన రథంమీద ఎక్కించుకొని వానరసైన్యం చూస్తూ ఉండగా ఆమెను వధించాడు. అది చూసి వానరులు భ్రమపడి ఇక యుద్ధం చేసికూడా లాభం లేదనుకుని పోరు నిలిపి రాముడి దగ్గరికి ఆలోచన కోసం వెళ్లారు. ఇలా ఇంద్రజాలం చేసిన ఇంద్రజిత్తు మరొక గొప్ప అసురయాగం చేయడానికి అవకాశం కల్పించుకున్నాడు. ఇది వానర వీరులకు కానీ, రామలక్ష్మణులకు కానీ తెలియదు. వానరులు సీత మరణించిందని భ్రమపడి దుఃఖంతో ఏం చేయడానికీ తోచని స్థితిలో ఉన్నారు. అప్పుడు విభీషణుడు వచ్చి విషయ మేంటో తెలుసుకున్నాడు. జరిగిందంతా వానరు లతనికి తెలియజేశారు. "అయ్యో! మీరు ఇలా మోసపోతున్నారేంటి? రావణు డెన్నటికీ సీతను చంపనీయడు. ఇదొక ఇంద్రజాలం, మాయ, మోసం, ఇంద్రజిత్తు జిత్తు. ఇంద్రజిత్తు తన కుట్ర నెరవేర్చుకోటానికి, ఏ పద్ధతీ పనికిరాలేదు. అందుకని ఇప్పుడు అసురయాగం చేయడానికి వెళ్లాడు. ఆ యాగం ముగిసిందా మనం అతడ్ని జయించలేం. కనక వెంటనే ఆ యాగాన్ని ధ్వంసం చేయాలి. లక్ష్మణుడే వెంటనే వెళ్లి ఆ పని చేయాలి" అని విభీషణుడు ఆలోచన చెప్పాడు.

రామచంద్రుడు ఈ ఆలోచనకు అంగీకరించి తమ్ముడ్ని పంపించాడు. అతడివెంట ఆంజనేయుడు, విభీషణుడు, కొందరు వానరవీరులు వెళ్లారు.

ఇంద్రజిత్తు యాగం చేయ సంకల్పించిన చోటికి వాళ్లు వెళ్లి యజ్ఞాన్ని అడ్డుకొన్నారు. రెండుపక్కలా చాలాసేపు భయంకరంగా యుద్ధం జరిగింది. రావణ కుమారుడు రథం మీదనుంచి బాణాలు ప్రయోగించాడు. లక్ష్మణుడు ఆంజనేయుడి భుజం పైకెక్కి బాణ వర్షం కురిపించాడు. ఇద్దరూ కూడా ధనుర్యుద్ధంలో నిపుణులు. ఒకళ్ళ

కొకళ్ళు ఏ మాత్రమూ తీసిపోరు. వాళ్లిద్దరూ గొప్ప నైపుణ్యంతో చాలా సేపు యుద్ధం చేశారు. విభీషణుడు లక్ష్మణుడికి ఉత్సాహం కలిగిస్తున్నాడు. ఇంద్రజిత్తు రథం విరిగిపోయింది. వేలమీద నిలిచి ఇద్దరూ చాలా సేపు యుద్ధం చేశారు. ఆఖరికి లక్ష్మణుడు ఇంద్రాస్త్ర మంత్రాన్ని పఠించి రాముడిమీద ఒట్టుపెట్టి ఒక బాణం ప్రయోగించాడు. దాంతో ఇంద్రజిత్తు తల తెగి నిప్పులు కక్కుతూ నేలమీద పడింది. దేవ దానవ గంధర్వ లంతా ఆకాశం మీదినుంచి పూలవాన కురిపించారు.

ఇంద్రజిత్తును చంపి లక్ష్మణుడు రాముడి దగ్గరకు వెళ్లాడు. శరీర మంతా గాయాలై నెత్తురోడుతుండగా జాంబవంతుడి మీదా హనుమంతుడిమీదా ఆనుకుని మెల్లగా నడిచాడు. ఇంద్రజిత్తు చచ్చిన వృత్తాంతం తెలుసుకున్న రాముడు తమ్ముడ్ని ఆలింగనం చేసుకున్నాడు. "లక్ష్మణా! ఇక రాక్షస కులమే నశించింది" అని చెప్పి ఆనందపరవశుడయ్యాడు. వినయంతో ఒదిగి ఉన్న లక్ష్మణుణ్ణి తన ఒడిలో కూర్చొబెట్టుకొని శిరస్సు మూర్కొని తన ఆనందాన్ని వెలిబుచ్చాడు. "ఎవరి వల్లా కాని సాహసకార్యం చేశావు. ఈ రోజున నీవు రావణుడి కుడి భుజాన్ని నరికివేశావు. విభీషణుడికీ, హనుమంతుడికీ, నీకూ సాటి ఎవరు? ఇక నా కేచింతాలేదు. ఇంద్రుణ్ణి జయించిన వీరుడ్ని నీవు వధించావు. ఇక నాకు సీత దొరికినట్లే" అన్నాడు.

ఇంద్రజిత్తు లక్ష్మణుడి చేతిలో మరణించా డన్న వార్త రావణుడికి అందింది. "తన కుమారుడ్ని విభీషణుడి సహాయంతో లక్ష్మణుడు చంపేశాడు" అని వినగానే అతడికి కోపమూ, దుఃఖమూ పొంగి వచ్చాయి. దివిటీలనుంచి రాలే వేడినూనె బొట్లలాగా కన్నీరు జొటజొట రాలాయి. పొగలూ, సెగలతో అతని నిట్టూర్పు వెలువడింది.

"అయ్యో! నాయనా! అసమానవీరా! మహేంద్రుణ్ణి జయించిన శూరా! ఇంత కాలానికి యముడు నిన్ను జయించాడా? నీవు వీర స్వర్గ మలంకరించావు. నేను దుఃఖించకూడదు" అన్నాడు.

ఇంద్రజిత్తు లేని లోకం తనకు శూన్యంగా ఉందన్నాడు రావణుడు.

"మందోదరినీ, నన్నూ, నీ ముద్దుల భార్యనూ విడిచి పోయావా? నీ ప్రతిజ్ఞను నెరవేర్చకుండా కసితీర్చుకోకుండా మమ్మల్ని విడిచిపోయావా?" అని విలపించాడు.

"ఈ ఆపదల కన్నిటికీ కారణ మైన జానకిని చంపివేయవడమే ఉత్తమం నా కుమారుడు మాయాసీతను చంపినట్లు లోకులకు చూపించాడు. కాని ఈ రోజున నేను నిజమైన సీతనే చంపబోతున్నాను" అని కత్తి తీసుకొని బయలుదేరాడు.

రావణుడు అలా కోపంతో బయలుదేరడం చూసి మూర్ఖులైన కొందరు రాక్షసులు ఆనందంతో కోలాహలం చేశారు. కాని సుపార్శ్వుడనే మంత్రి రావణుణ్ని వారించి "మహారాజా! ఏం సాహసం చేస్తున్నారు? ఏం పని చేయబోతున్నారు? దశగ్రీవా! కుబేరుడి తమ్ముడిలాంటి మీరు ఒక ఆడదాన్ని చంపి స్త్రీ హత్యా పాతకానిన్నీ, అవమానాన్నీ సంపాదించ బోతున్నారా? కోపాన్ని తీర్చుకోడానికి ఇదా మార్గం? వేదాధ్యయనం చేసి సమస్త విద్యలూ నేర్చిన మీరు ఇలా చేయడం బాగాలేదు. అసలు మీకు సాటి ఎవడు? యుద్ధంలో మిమ్మల్ని ఎదిరించ గలవా డెవడు? యుద్ధంలో విజయం పొంది మీరు సీతను న్యాయంగానే పొందవచ్చు. అందుకు సందేహం లేదు, మీ కోపాన్ని రాముడి మీదికి తిప్పండి. ఇవాళ చతుర్దశి. ఈ రాత్రి గడిస్తే రేపు అమావాస్య. చతురంగ బలసమేతులై రేపు బయలు దేరితే రామలక్ష్మణులను చంపి విజయం పొందవచ్చు తర్వాత సీతను పొందవచ్చు. బ్రహ్మ మీకు ప్రసాదించిన కవచాన్ని ధరించి రథమెక్కి బయలు దేరండి!" అని చెప్పాడు.

సుపార్శ్వుడి హితం రావణుడికి నచ్చింది.

సింహాసనం మీద కూర్చుని కాస్సేపు ఆలోచనలో మునిగి మౌనం వహించాడు. తర్వాత సేనాధిపతులకు చేతులు జోడించి "మీరు సకల బలాలతోనూ వెంటనే వెళ్లి ఈ రాముణ్ని వధించండి. మీవల్ల కాకపోతే అప్పుడు నేనే వెళ్లి అతడ్ని వధిస్తాను" అన్నాడు.

పర్వతాలలాంటి ఏనుగులు, రథాలతో రాక్షసుల పూర్తి బలగం యుద్ధానికి బయలు దేరింది.

వానరులు చెట్లూ, గుట్టలూ, ఎత్తి రాక్షససేనను బలంగా మోదారు. రాక్షసులుకూడా వానరసేన మీద బలంగానే దెబ్బ తీశారు. రక్తం ఏరులై పారింది. వానరులు ఎగి రెగిరి రాక్షసుల రథాలను ముక్క ముక్కలు చేశారు. వాహనాలను చంపారు. ఆయుధాలను విరిచివేశారు. రాక్షసులను చీల్చి చెండాడారు. ఒక్కొక్క రాక్షసుణ్ణి అనేక వానరులు చుట్టుముట్టి చంపారు.

రాక్షసులు కూడా వానరులను విడిచిపెట్టలేదు. పదివేల మంది వానరులను బలంగా మోది పొట్టబెట్టుకున్నారు.

* * *

రాముడు విల్లు వంచి రాక్షసులమీద శరవర్షం కురిపించాడు. అతడి బాణాగ్నికి రాక్షస సైన్యం ఆహుతయింది. బతికి ఉన్న రాక్షసులు తమ తోటివాళ్లు పడి మరణించడం మాత్రమే చూడగలిగారు కాని ఆ బాణవర్షంలో వాళ్లు రాముణ్ణి చూడలేక పోయారు. అక్కడా ఇక్కడా ఎక్కడ చూసినా రాముడే ఉన్నా డనిపించింది. ఆ యుద్ధంలో లెక్కలేనంత మంది రాక్షసులు మరణించారు. దిక్కులేనన్ని ఏనుగులు చచ్చాయి. రథాలు విరిగాయి. రాక్షససేన నశించింది. తక్కినవాళ్ళు పారిపోయారు. దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, రాముణ్ణి కొనియాడారు. లంకలో రాక్షసస్త్రీలు ఒకళ్ల నొకళ్లు పట్టుకొని భోరుమని విలపించారు. రావణుడి అజ్ఞానంవల్ల ఇలా అయిందని ఏడ్చారు.

91. రావణుడి అంతం

లంకలో ప్రతి ఇంటిలోనూ ఏడుపులూ. పెడబొబ్బలే !

రావణుడికి దుఃఖమూ, సిగ్గూ, కోపమూ, ఉప్పెనలాగ పొంగాయి. ఇక తానే మూలబలంతో బయలుదేరి ఈ శత్రువును తుదముట్టించా లని నిశ్చయించుకున్నాడు. తన బల శౌర్యాలను గురించి కాని తన వర బలాన్ని గురించి కాని అతడి కెట్టి సందేహమూ కలగలేదు. కనుక చాలా ధైర్యంతోనే యుద్ధానికి బయలుదేరాడు.

ఎనిమిది గుర్రాలను పూన్చి సమస్తమైన ఆయుధాలతోనూ రథం ఎక్కాడు.

భూమి దద్దరిల్లేలాగా రథం సాగింది. రాక్షస వీరులు తమ తమ రథా లెక్కి అతడ్ని వెంబడించారు.

లంకనుండి రావణుడు బయలుదేరే సరికి పక్షులు కర కఠోరంగా కూశాయి. సూర్యకాంతి మందగించింది. ఇంకా రకరకాల దుశ్శకునాలు ఎన్నో కనిపించాయి. కాని వాటిని రావణుడు ఏ మాత్రమూ లక్ష్యం చేయలేదు. ఉత్తరపు ద్వారం దాటి యుద్ధభూమికి వెళ్లాడు. విరూపాక్షుడు, మహోదరుడు, మహాపార్శ్వుడు అనే రాక్షస వీరులు కూడా తమ తమ రథాలమీద రావణుణ్ని అనుసరించారు.

అలా అనుసరించిన ఆ రాక్షసవీరు లంతా నడిదారిలోనే సుగ్రీవుడి చేతుల్లోనూ అంగదుడి చేతుల్లోనూ ప్రాణాలు విడిచారు. లక్ష్మణుడు లంకేశుణ్ని ఎదిరించాడు. కాని లక్ష్మణుణ్ని రావణుడేమాత్రమూ లెక్క చెయ్యలేదు. లక్ష్మణుడు వేసిన బాణాలను అతడు తేలికగా ముక్కలు ముక్కలు చేసి ముందుకు సాగి రాముడితో ఢీకొన్నాడు. రావణుడు రాముడి మీద బలమైన బాణాలు ప్రయోగించాడు. వాటిని రాముడు తన బాణాలతో అడ్డగించడం చూసి అంతకన్నా శక్తిమంతమైన బాణాలను ప్రయోగించాడు. అయినా ఫలితం లేకపోయింది. యుద్ధం మాత్రం చాలసేపు ఘోరంగా జరిగింది.

రావణుడు వేసిన బాణాలు రాముడి నొసట తగిలాయి. కాని రాముణ్ని అవి ఏమీ చేయలేక పోయాయి. అలాగే రాముడి కోదండం నుంచి వెలువడిన బాణాలు కూడా రావణుడి కవచాన్ని భేదించలేక పోయాయి. రాముడు వేసిన బాణా లన్నిటినీ రావణుడు దారిలోనే ముక్కలుముక్కలు చేస్తూ వచ్చాడు.

ఇలా రావణుడికీ రఘువీరుడికీ అద్భుతయుద్ధం జరిగింది. ఇద్దరూ అస్త్రాలను ప్రయోగించారు. వాటి అద్భుతశక్తిని అంతవరకు ఎవరూ కనీ వినీ ఎరగరు. రావణుడి అస్త్రనైపుణ్యం చూసి రాముడు చాలా ఆశ్చర్యపడ్డాడు. ఇద్దరూ ఒకళ్ళని మించి ఒకళ్ళు శక్తిమంతమైన అస్త్రా

లను ప్రయోగించుకున్నారు. ఆ అస్త్రజ్వాలలతో ఆకాశమంతా ఒక్కసారి వేయిమంది సూర్యు లుదయించినట్లు ప్రకాశించింది.

రాముడు తన బాణాలతో రావణుడి శరీర మంతా తూట్లు పొడిచాడు. అయినా యుద్ధం ఒక కొలిక్కి రాలేదు.

తర్వాత లక్ష్మణుడూ, విభీషణుడూ రావణుణ్ని ఎదుర్కొన్నారు. రావణుడు తన తమ్ముడిమీద పట్టరాని కోపంతో ప్రాణాంతకమైన ఒక శక్తిని ప్రయోగించాడు. అది విభీషణుడి మీద పడబోవటం చూసి లక్ష్మణుడు తన బాణాలతో దాన్ని అడ్డుకున్నాడు. అది తెగి మండుతున్న కొరివిలాగ నేలమీద పడిపోయింది. రావణుడు మరొక శక్తి ఆయుధాన్ని విభీషణుడి మీదికి విసిరాడు. దాన్నికూడా లక్ష్మణుడు బాణాలతో పడగొట్టాడు. అది చూసి రావణాసురుడు ఇంకొక శక్తి ఆయుధాన్ని ఎత్తి 'ఇదిగో చచ్చావు' అని చెప్పి లక్ష్మణుడి మీదికి విసిరాడు. ఆ శక్తి ఢాటికి లక్ష్మణుడు తెలివి తప్పి పడిపోయాడు. అయితే అతని ప్రాణంమాత్రం పోలేదు.

రాముడిది గమనించలేదు. రావణుడిపై అలా శరవర్షం కురిపిస్తూనే ఉన్నాడు. అలా వాళ్ళిద్దరికీ యుద్ధం జరుగుతూ ఉండగా వానర వీరులు ఆలోచించి లక్ష్మణుడి ప్రాణాలు కాపాడడం కోసం హనుమంతుణ్ని సంజీవి పర్వతానికి పంపించారు. హనుమంతుడు ఈసారి ఆకాశమార్గంగా ఉత్తర దిక్కుకి పోయి ఓషధులను వెతకడానికి అవకాశం లేక ఆ పర్వతాన్నే పెకలించుకొని వచ్చాడు. ఓషధి ప్రయోగించటంవల్ల లక్ష్మణుడు తేరుకొని మళ్ళీ యుద్ధానికి దిగాడు.

ఇంతలో ఇంద్రుడి సారథి మాతలి రాముడికోసం ఇంద్రుడి రథాన్ని యుద్ధభూమికి తీసుకువచ్చాడు.

"దేవరాజు ఈ రథాన్ని తమకోసం పంపాడు. ఈ రథా న్నెక్కి దేవతలకు శత్రువైన రావణుణ్ని సంహరించండి" అని మాతలి చెప్పాడు. రాముడారథానికి ప్రదక్షిణ చేసి నమస్కరించి అందులో ఎక్కాడు.

• •

ఆతర్వాత యుద్ధం భయంకరంగా జరిగింది. రావణుడు బాగా దెబ్బలు తిన్నాడు. అతడికి మనోనిబ్బరం పోయింది. ఒక రకం మైకంలో పడిపోయాడు. అది చూసి అతడి సారథి రథాన్ని మళ్లించి యుద్ధభూమి దాటించి అవతలికి తోలుకుపోయాడు.

కొంతసేపటికి రావణుడికి మైకంపోయి కాస్త తెప్పరిల్లాడు. "రథాన్ని యుద్ధభూమి దాటించి ఇవతలి కెందుకు తెచ్చావు?" అని సారథిపై కోపించి రథాన్ని తిప్పమని చెప్పి, తిన్నగా వచ్చి రాముడి ఎదుట నిలబడ్డాడు. మళ్ళీ ఇద్దరికీ ఘోరయుద్ధం ప్రారంభమైంది.

అస్త్రానికి ప్రత్యస్త్రం వేస్తూ అంతవరకు కని విని ఎరుగని అద్భుతరీతిలో రథాలను నడిపిస్తూ చిత్రవిచిత్రంగా చాలాసేపు ఇద్దరూ యుద్ధం చేశారు. రెండువైపుల సైనికులూ ఆశ్చర్యంతో వాళ్లని అలాగే చూస్తూ నిలబడిపోయారు.

ఇది చూస్తున్న ఇంద్రసారథి మాతలి రాముడితో మెల్లగా ఇలా చెప్పాడు: "రాక్షసుడికి వినాశకాలం దాపురించింది. ఇంక ఆలస్యమెందుకు? బ్రహ్మాస్త్రాన్ని మరచిపోయారా?"

మాతలి ఇలా చెప్పగానే రాముడు బ్రహ్మాస్త్రమంత్రం పఠించి ప్రయోగించాడు. అంతకు ముందు రాక్షసుడి తలలు ఎన్నోసార్లు తెగాయి. కాని తెగిన వెంటనే కొత్త తలలు మొలుస్తూ వచ్చాయి.

బ్రహ్మాస్త్రం అగ్ని జ్వాలలతో వెళ్లి రావణుడి రొమ్ములో దూరింది. అతడి చేతులోవున్న విల్లు కింద పడిపోయింది. రావణుడు నేల కూలాడు.

అప్పుడు దేవ దుందుభులు మోగాయి. ఆకాశంనుంచి పూలవాన కురిసింది. రాముణ్ణీ అతడి రథాన్నీ ఈ పువ్వులు కప్పివేశాయి. విభీషణుడూ జాంబవంతుడూ మొదలైన వీరులు అతడి చుట్టూ చేరి పూజలతో ఆనందించారు

చచ్చి పడిఉన్న అన్నను చూసి విభీషణుడు "హా! వీరుడా! అద్భుత కార్యాలను చేసినవాడా! సకలశాస్త్రాలూ చదివి జ్ఞానంబడసినవాడా! వీరుడివి, సమస్తశాస్త్రాలూ తెలిసిన జ్ఞానివి. ఈనాడు బారలు చాచు.

కొని ఇలా నేల కూలావా?" అని విలపించాడు. అన్న మరణానికి తానే కారకుడు అయినా చచ్చిపడి ఉన్న అతడ్ని చూడగానే, అంతకు ముందు జరిగిందంతా మరచిపోయి పాత వాసనలు, పాత స్మృతులు జ్ఞాపకం వచ్చి, రక్త సంబంధం వల్ల అతడికి దుఃఖం పొంగిపొంగి వచ్చింది.

"అహంకారంతో మతి చెడి, చాడీకోరుల మధ్య చిక్కిన నీవు నేను చెప్పిందాన్ని తిరస్కరించావు నే నేం జరుగుతుందని చెప్పానో సరిగ్గా అదే జరిగింది. చేసిన గొప్ప తప్పిదానికి ఫలితం పొందావు, మదపుటేనుగు పడిపోయినట్లు నేలమీద పడి ఉన్నావు. శూరులలో శూరుడవు కదా రాక్షసేంద్రా!" అన్నాడు.

ఇలా విలపిస్తున్న విభీషణుణ్ని చూసి రామచంద్రుడు మెల్లగా ఇలా అన్నాడు :

"మహావీరుడిలా యుద్ధం చేశాడు. తన శౌర్య పరాక్రమాలను సంపూర్ణంగా చూపింతర్వాతనే ప్రాణాలు విడిచాడు. ఇది చాలా గొప్ప చావు. ఇందుకు దుఃఖించకూడదు. యుద్ధంలో వెన్నీయకుండా మరణించడమే వీరులు కోరే వీరమరణం. విజయమో వీర స్వర్గమో అని కదా వీరులు యుద్ధంలోకి దిగుతారు? రావణుడు వీర స్వర్గాన్ని పొందాడనడంలో సందేహమేం లేదు. ఇక మీదట జరగవలసిన కార్యాన్ని తమ్ముడివైన నువ్వు జరిపించాలి. మరణించడంతోనే శత్రుత్వంకూడా అంతమవుతుంది. లంకేశుడికి విరోధినైన నేనే ఉత్తర క్రియలు చేయవచ్చు. నీకు సోదరుడు నాకు కూడా సోదరుడే కదా?"

అని ఇలా రాముడు విభీషణుణ్ని ఊరడించి రావణుడికి ఉత్తర క్రియలు జరపవలసిందని చెప్పాడు.

రావణుడి రాణివాసం అంతా అక్కడికి చేరింది. వాళ్లవెనుక శోకమే ఆకారం దాల్చినట్లున్న పట్టమహిషి మండోదరి వచ్చింది. అందకత్తెలలోకెల్లా అందకత్తెఆమె. నేలను పడివున్న భర్తను చూడగానే హాయని ఎలుగెత్తి రావణుడి కాళ్లమీద పడి గొల్లుమంది.

"మీకు కోపం వస్తే ఇంద్రుడు ఎదుట నిలవలేడే! దేవర్షి గంధర్వులు మిమ్మల్ని చూడగానే గజగజలాడుతూ అష్టదిక్కులకూ పరు

గెత్తుతారే! అలాంటి మీకు కోపం రాలేదా? అడవిలో తిరుగాడే ఒక మానవుడు మిమ్మల్ని చంపాడా? ఇది నాకేం బోధపడడంలేదే? ముల్లోకాలనూ వణికించిన మీ పరాక్రమం దీన్నెలా సహించింది? అయ్యో! నేను ముందే చెప్పానుకదా- ఈ రాముడు మానవుడు కాడని? ఇంద్రుడు, అగ్ని, యముడుకూడా మిమ్మల్ని జయించలేరు, అలాంటి మిమ్మల్ని జయించిన ఇతడు ఆదిమధ్యాంత రహితుడైన శ్రీమహావిష్ణువే! మానవరూపంతో అవతరించాడు. ఈయన బహిరంగంగా నిలబడి మీ సోదరుడైన ఖరుణ్ని వధించినప్పుడే నేను చెప్పానుకదా? ఎవరికీ అలవికాని ఈ లంకలో హనుమంతుడు ప్రవేశించి నగరాన్ని నాశనం చేసినపుడే నాకు తెలుసు. ఈ విరోధం తెచ్చుకోకూడదని నేను చెప్పితే, వినలేదు. మహా పతివ్రత అయిన సీత మీద మీరు ఎందుకు మోహపడ్డారు? నాకన్న ఆమె అందం ఏమంత గొప్పదని మతి పోగొట్టుకున్నారు? ఒంటరిగా ఉన్న ఆమెను అపహరించడం మహాపాపం కాదా? ఆ పాపం చేసి ఇప్పుడు దాని ఫలితం అనుభవిస్తున్నారా? ఈ వినాశనం కోసమే మీకు మతిచెడింది. విభీషణుడు మంచి కీర్తి పొందాడు కదా? మీరో చచ్చిశవమై పడిఉన్నారు యముడు సీత రూపంలో మిమ్ము ఈడ్చుకుపోయి ఈ వినాశనానికి గురిచేశాడు. ఇప్పుడు సీతారాములు సంతోషంగా కలిసిపోయారు. మీరు మాత్రం నన్నూ మీ కులాన్నీ దుఃఖసాగరంలో ముంచిపోయారు. అయ్యో! మీ సుందర శరీరం ఈ స్థితిలో ఉందే? రామబాణాలకు తూట్లుపడి నెత్తురు, దుమ్ము కప్పడిపోయి కాంతి తగ్గి ఉంది. నేనిది చూడలేను. ఏంచేసేది! లంకేశుడు నా భర్త, ఇంద్రుణ్ని జయించినవాడు నా కుమారుడు- నాకేం కొరత అని గర్వించి పోయాను. ఒక్కమాట మాట్లాడరా? నన్ను అనాధను చేసేశారా?''

ఇలా విలపిస్తూ మండోదరి రావణుడి శరీరంమీద స్పృహతప్పి పడిపోయింది.

92. మంగళం

రామచంద్రుడి ఆజ్ఞానుసారం విభీషణుడికి లంకారాజ్య పట్టాభిషేకం వైభవంగా జరిగింది. పట్టాభిషిక్తుడైన విభీషణుడు లంకవెలుపల

గుహలో ఉన్న రామచంద్రుడి దగ్గరకు వెళ్లి ఆయనకు నమస్కరించాడు.

"రాజు అనుమతి తీసుకొని లంకలో ప్రవేశించి సీత సంగతి కనుక్కురా" అని రాముడు హనుమంతుణ్ని పంపాడు. అతడు విభీషణుడి అనుమతి తీసుకొని అశోకవనానికి వెళ్లాడు.

హనుమంతుడు సీతను చూశాడు. అప్పు డాజగన్మాత ఉప్పొంగిన ఆనందముతో మాట్లాడలేక పోయింది.

"ఏమమ్మా! మాట్లాడవేం?" అని హనుమంతుడు అడిగాడు.

"ఆనందంవల్ల నోట మాట రాలేదు నా తండ్రీ! నీ ఋణం ఏలా తీర్చుకోగలను? నీ వివేకం, నీ శౌర్యం, నీ మనోబలం, నీ ఓర్పు, నీ వినయం, లోకంలో మరెవరికి ఉన్నాయి? నీకు ఈడైన వాళ్లు ఈ భూలోకంలో ఎవరూలేరు" అంది.సీత. ఆమె కళ్లమ్మట ఆనందాశ్రువులు ధారలు కట్టాయి. అప్పుడు హనుమంతుడు ఆమెకు కావలి ఉన్న రాకాసిమూకను చూశాడు. వాళ్లని చూడగానే అతడికి పాతకోపం పొంగుకు వచ్చింది.

సీతను చూసి "మిమ్మల్ని బాధించిన ఈ పాపులను సంహరిస్తాను. ఆనతీయండి!" అని అడిగాడు.

"వద్దు తండ్రీ! వద్దు. తప్పు చేయనివాళ్లు లోకంలో లేరు!" అంది, సీత.

"నకశ్చిత్ న అపరాధ్యతి"- జగన్మాత పలికిన ఈ పలుకులను వైష్ణవ భక్తులు అమృత వాక్కులుగా భావిస్తారు. దేవి కృపఉండగా భయానికి చోటులేదు. ఎలాంటి పాపి అయినా జగన్మాత చరణారవిందాల దగ్గర జీవించవచ్చునని శాస్త్రం చెబుతూంది.

"వాళ్లు రాజాజ్ఞను నిర్వహించారు, అందులో వాళ్ల దోష మేముంది? రాజు మరణించాడు. వీళ్లనిప్పుడు దండించడం న్యాయం కాదు" అంది సీత.

"రాముడికి ఏం సందేశం తీసుకెళ్లమంటారు?" అని హనుమంతుడు అడిగాడు.

• •

"ఆయనను చూడాలనుంది. అంతే" అంది, సీత.

హనుమంతుడు రాముడి దగ్గరికి వెళ్ళి, సీత దర్శనము కోరుతున్నట్లు విన్నవించాడు. ఆ మాట విన్నగానే కారణమేంటో కాని రాముడి ముఖం పాలిపోయింది. కళ్ళలో కలత కనిపించింది. పెద్ద ఆలోచలో మునిగిపోయాడు. కొంతసేపైన తర్వాత "విభీషణా! సీతకు స్నానం చేయించి సకలాభరణాలూ అలంకరించుకున్నాక తీసుకురా" అన్నాడు.

ఈ వార్తను అశోకవనానికి తీసుకుపోగా "నేను ఈ స్థితిలోనే వెళతాను" అంది, సీత.

"అలాక్కాదు దేవీ! రాముడి ఆజ్ఞ ప్రకారమే చేయాలి" అని విభీషణుడు ఆమెకు నచ్చచెప్పాడు.

అప్పుడు సీత అలంరించుకుని పల్లకీలో బయలుదేరింది.

సీత వస్తూం దని తెలియగానే రాముడు తన ధ్యాన సమాధినుంచి మేల్కొన్నాడు. జరిగిన సంఘటన లన్నీ అతడి మనస్సును సముద్ర తరంగాలలా మోదాయి. రోషం, దుఃఖం, సంతోషం అన్నీ కలిసిన స్థితిలో పడ్డాడు.

వానరసేనావాహిని మధ్యనుంచి సీత పల్లకీ వస్తూ ఉంటే వానరులు దేవిని చూడాలని పల్లకీ చుట్టూ గుంపులు గుంపులుగా గుమికూడారు. వానర నాయకులు వాళ్ళని తొలగదోయగా వాళ్ళలో పెద్ద కలకలం బయలు దేరింది.

"ఎవరినీ అడ్డుపెట్టవద్దు, నాకు సహాయపడిన ఈ వానరులు నా ఆప్త మిత్రులు. నా చుట్టూ ఉండడమే వాళ్ళకి ఆనందం. ఎవరినీ పక్కకు నెట్టవద్దు" అని రాము డన్నాడు.

రాముడి మనస్థితి అతడి పక్కనున్న మిత్రు లెవరికీ బోధపడలేదు. ఆఖరికి లక్ష్మణుడికి కూడా అర్థం కాలేదు.

సీతాదేవి పల్లకి దిగి నేలకేసి చూస్తూ రాముడి దగ్గరికి వెళ్ళింది-ఆర్యపుత్రా!" అని ఒకే ఒక్కమాట అని వెక్కివెక్కి ఏడ్చింది.

"శత్రువును సంహరించాను. నిన్ను చెర విడిపించాను. నా క్షత్రియ ధర్మాన్ని నెరవేర్చాను. నా శపథం ముగిసింది" అన్నాడు, రాముడు.

రాముడు ఇలా ఎవరికీ అర్థంకాని రీతిలో ఎవరూ ఊహించని పద్ధతిలో మాట్లాడాడు. అతడి ముఖం ఎందుకో కళగా లేదు. ఆ తర్వాత ఆయన ఇంకా కఠినంగా మాట్లాడాడు.

"నీ కోసం కాదు ఈ ఘోరయుద్ధాన్ని నేను చేసింది. నా కర్తవ్యాన్ని నిర్వహించడానికి చేశాను. నీ పొందు నా కిప్పుడు ఆనందం కలిగించడంలేదు. అపవాదం అనే పొగ నిన్ను మరుగు పరుస్తూంది. ఇప్పుడు ఏం చేయాలనుకుంటున్నావు? నీవు నన్ను విడిచి ఒంటిరిగా ఉండాలి. మన బంధుమిత్రులు ఎవరి రక్షణలోనైనా ఉండవచ్చు. పరాయి ఇంట చాలాకాలం ఉన్న భార్యను క్షత్రియుడైనవాడు ఎలా స్వీకరిస్తాడు? నీ ఆలోచన ఏంటి?" అని అడిగాడు, రాముడు.

సీత, రాముణ్ని చూసింది. ఆ చూపుల్లో అగ్నికణాలు విరిశాయి. "తగని మాటలు పలికారు. హృదయాన్ని బద్దలు చేసే మాటలు విన్నాను. పామరులు ఆడవలసిన మాటలు ఆర్యపుత్రుడి నోట వచ్చాయి. రాక్షసుడు నన్ను బలాత్కారంగా ఎత్తుకొని వచ్చాడు. మీ కోపం వివేకాన్ని పోగొట్టింది. నాథా! నేను ఏ కులంలో పుట్టానో మరచిపోయారా?- జనక మహారాజు నా తండ్రి. ఆయన పెంపకంలో పెరిగాను. లక్ష్మణా! చితి పేర్చు! అగ్ని రగుల్చు" అంది, సీత.

రాముడి వైఖరి చూసి లక్ష్మణుడికి కోపం పొంగి వచ్చింది. ఇప్పుడు సీత అన్నమాట వినగానే రాముడి ముఖం చూశాడు.

రాముడు వద్దని చెప్పలేదు. మనస్సు కరిగిన చిన్నె లేవీ ఆయనలో కానరాలేదు.

సీత చెప్పినట్లే లక్ష్మణుడు చితి రగిల్చాడు. జగన్మాత నేల వేపే చూస్తూ రాముడికి ప్రదక్షిణం చేసింది. "దేవతలారా! మీకు నమస్కరిస్తున్నాను. మహర్షులారా! మీకూ నమస్కరిస్తున్నాను.

V.R. NARLA MEMORIAL LIBRARY V.R. NARLA & Co. Acc. No.

అగ్నిదేవా! నా పవిత్రతను నీ వెరుగుదువు. ఇదిగో నీలో ప్రవేశిస్తున్నాను'' అని చెప్పి, సీత ఆ మంటల్లో దూకింది.

* * *

అప్పుడు సమస్తమైన దేవతలు అక్కడికి వచ్చారు. బ్రహ్మదేవుడు రామున్ని చూసి ఇలా అన్నాడు:

"నారాయణా! రావణ సంహారానికి అవతరించిన సర్వేశ్వరా! ఈమె నీ పత్ని అయిన ఆదిలక్ష్మి కాదా?"

అంతా ప్రార్థిస్తూ నిలబడ్డారు. అప్పుడొచిత్రం జరిగింది.

ఆ మంటలలోనుంచి సాక్షాత్తు అగ్నిదేవుడు లేచి దివ్యవస్త్రాభరణ భూషిత అయిన సీతను రాముడికి సమర్పించాడు.

అప్పుడు రాముడు, బ్రహ్మను చూసి "నేను దశరథుడి కుమారుడను. నాకు తెలిసింది అంతే. నే నెవరినో, ఎక్కడనుంచి వచ్చానో మీకే తెలియాలి. ఆ విషయాన్ని మీరే చెప్పాలి'' అన్నాడు.

అలా బ్రహ్మకు చెప్పి దేవిని చేర తీసుకున్నాడు.

"సీతా! నీ నిష్కళంకత, నీ పవిత్రత నాకు తెలియవా? ప్రజల తృప్తి కోసమే ఈ అగ్నిపరీక్ష చేశాను. లేకపోతే రాముడు కామంతో కళ్లు కప్పుకోగా లోకమర్యాదకు విరుద్ధంగా నడుచుకొన్నాడు అని ప్రజలంటారు. ఇలా వాళ్లు అంటారుకదా అని నిన్ను పరీక్షించాను. అంతే.'' అని రాముడు చేతులు చాచి ఆమెను స్వీకరించాడు.

అప్పుడు దశరథుడు కూడా పితృలోకం నుంచి దిగివచ్చి, రామున్ని ఒళ్లో కూర్చోబెట్టుకొని ఆశీర్వదించాడు.

దశరథుడు సీతను చూసి, "బిడ్డా! నా కుమారుడ్ని మన్నించు. లోక ధర్మాన్ని కాపాడడంకోసం అతడు చేసిన ఆ తప్పును సహించు. నీకు మంగళ మగునుగాక!" అన్నాడు.

ఇంద్రుడు వాళ్లకి వరాలిచ్చాడు. యుద్ధంలో మరణించిన వానరులంతా బతికారు.

* * *

అడవిలో ఆశ్రమంలో ఒంటరిగా విడిచిన సీతను పోగొట్టుకొని దుఃఖంలో మునిగి, తర్వాత అడ్డాలన్నీ దాటి, మహాబల పరాక్రమ సంపన్నుడైన రాక్షసుణ్ణి సంహరించి రాముడు సీతను తిరిగి పొందాడు. సీతకూడా తన నాథుడ్ని పొందింది. ఇద్దరూ పుష్పక విమానంలో అయోధ్యకు మరలారు. మిత్రులైన వానర వీరులు, విభీషణుడు మొదలైన వారు కూడా వాళతో వెళ్ళారు. రావణుడి విమానం ఆకాశంలో వాయువేగంతో పోతున్నప్పుడు రాముడు, తానూ, లక్ష్మణుడూ తిరిగిన అడవులను, ఎన్నటికీ మరపురాని స్థలాలనూ సీతకు చూపించి, సంగతులన్నీ వివరించి చెప్పాడు: "ఇదిగో చూడు! నిన్ను నేను పొందడం కోసం నలుడు కట్టిన సేతువు! అదిగో చూడు! కిష్కింధ! హనుమంతుడితోను, సుగ్రీవుడితోను నేను స్నేహం చేసిన స్థలం ఇదే!" అని ఇలా ఆయా స్థల వివరాలను చెపుతూవెళ్ళాడు.

* * *

వారు భరద్వాజాశ్రమంలో నిలిచి గుహుడికీ, భరతుడికీ తమ రాకను గురించి విమానం పంపించారు.

అయోధ్యా నగరం ఆనంద సాగరంలో మునిగి తేలింది. రాముడు భరతుణ్ణి కలుసుకున్నాడు. గూని మంథరా, కైకా భరతుడికి రాజ్య పదవి కోరారు కదా! అలా కోరి ఏదో చేశారే కాని భరతుడు రాముడికి పాదాభివందనం చేసి, వాళ్ళు కోరిన ఫలితంకన్న పదిరెట్లు మహదానందాన్ని పొందాడు. రాముడి పాదాలివ్వగల ఆనందాన్ని ఏ కిరీటం ఇవ్వగలదు? భరతుడు పొందిన శాశ్వత కీర్తిని ఏ రాజ్య పదవి ఇవ్వగలదు?

'పవిత్రతలో భరతాళ్వారుకు సమానుడు కాడు భగవంతుడు. యోగ్యతలో భరతాళ్వారుకు భగవంతుడు సమానుడు కాడు' అని రాముడికన్న భరతుణ్ణి మిన్నచేసి చెపుతున్నారు కదా?

రాముడు తిరిగి వచ్చేదాకా పధ్నాలుగు సంవత్సరాలూ అన్నగారి పాదుకలను సింహాసనంమీద ఉంచి, రాజ్యాన్ని కనిపెడుతూ తపస్సు చేశాడు. ఇప్పుడు తండ్రి దశరథుడు మొట్టమొదట కోరినట్లు రాముడి

పట్టాభిషేకాన్ని చూసి, ఇన్నాళ్లుగా తపస్సు చేసిన భరతుడు హృదయం ఉప్పొంగగా ఆనందించాడు.

ఇక ఆంజనేయుణ్ని గురించి చెప్పాలా? రాముడు జగన్మాత మెడనుంచి ముత్యాలసరం తీసి హనుమంతుడి మెడలో వేశాడు. అలా వేసేటప్పుడు దేవి వదనంలో చిరునవ్వు మెరిసింది. హనుమంతుడికి అంతకన్న కావలసిం దేముంది?

* *

వాల్మీకి గానం చేసిన రామ కథను సంగ్రహంగా చెప్పాను. లెక్క చూడకుండా వ్రాస్తూ పోగా ఈ గ్రంథం ఎలాగో విజయదశమి నాడు సరిగ్గా లెక్క పెట్టినట్లు ముగిసింది. దీన్ని చదివినవాళ్ళు, విన్నవాళ్లు సమస్త పాపాలనుంచీ కష్టాలనుంచి విముక్తు లవుతారు.

దశరథ కుమారుడ్ని మనం స్తోత్రం చేసి, ఆరాధించి, ధ్యానించి హృదయంలో నిలుపుకొంటే చేసిన పాపాలన్నీ తొలగిపోతా యని జ్ఞాన సాగరుడైన శంకరుడు చెప్పాడు. రామావతారం తర్వాత మహాసులభ మూర్తిగా భగవానుడు అవతరించాడు. గోవిందుడు యాదవుల మధ్యా, మళ్ళీ పగమూ కోలా పట్టి అర్జునుడికి రథం తోలాడు. పార్థుడికి జ్ఞానోపదేశం చేసి ఆఖరికి భగవాను డిలా చెప్పాడు: "నే నొక్కడినే శరణ్య మని సంశయంలేని మనస్సుతో వుంటే నేను సాయం చేస్తాను. నిన్ను అన్ని పాపాలనుంచీ తప్పిస్తాను. ఇది సత్యం. ప్రియతముడా! చింతించకు!" శ్రీకృష్ణ పరమాత్మ చేసిన ఈ ఉపదేశం అందరికీ ఉపదేశమే. అర్జునుడు ఆ మాటను మన అందరికోసమూ భగవానుడి నోటి నుంచి రప్పించాడు.

మలిపలుకు

గాంధీజీ నేనూ మా యిద్దరికీ ప్రియమైన ఒక బిడ్డను గురించి ఒకనాడు ముచ్చటించుకుంటున్నాం. "ఈమె కీ ప్రియమైన మాటలూ ఈ ప్రేమపూరితమైన భావాలూ ఎలా కలిగాయి? ప్రేమ కథలు ఏమీ చదివినట్లు లేదే?" అన్నాను, నేను.

అది విని గాంధీజీ ఇలా అన్నారు: "చదవకేం, రామాయణం చదివింది-. అదికూడా ఒక ప్రేమ గాథే కదా:" నేను ఆలోచనలో పడ్డాను. తర్వాత వేరే మాటలలో పడిపోయాం.

దశరథుడి కష్టాలు ప్రేమతో కదా ప్రారంభ మయ్యాయి? సీతారాముల ప్రేమకూడా అయోధ్యాకాండలో ప్రధానాంశం. ధర్మ విరుద్ధం కాని ప్రేమ భగవత్స్వరూపం. దీన్నే శ్రీకృష్ణుడు అర్జునుడికి దివ్యమైన తన మహిమతో చూపించాడు. దీన్ని మనం భగవద్గీతలో చూడవచ్చు. ధర్మ విరుద్ధం కాని ప్రేమతోపాటు ధర్మ విరుద్ధమైన ప్రేమనుకూడా వాల్మీకి మహర్షి ఈ రామాయణంలో చిత్రించారు. కనక రామాయణం ఒక పెద్ద ప్రేమగాథ అని చెప్పవచ్చు.

సీతను ఆత్మగాను, రామున్ని పరమాత్మగాను వర్ణించి పరమాత్మను మరచిన ఆత్మను భగవానుడే వెతికి వెతికి పట్టుకుంటాడని పెదలు ఈ రామాయణానికి ఆధ్యాత్మికంగా అర్థం చెపుతారు. మనల్ని తనలో చేర్చుకొనడానికి భగవంతుడే ఆత్రంతో ఉంటాడనీ, మనం దానికి అడ్డుపడకుండా ఉంటే చాలుననీ దీని తాత్పర్యం.

మరొక విధంగా కూడా దీనికి అర్థం చెపుతారు. జగన్మాత ఈశ్వరుడి కరుణాతత్వానికి రూపకల్పన. ఆ కరుణామూర్తి భగవంతుడి హృదయసీమలో ఉన్నట్లుగా భావించి మహావిష్ణువును భక్తితో కొలుస్తున్నాం. భగవంతుడి చరణారవిందాలను పొందడానికి శ్రీదేవి కరుణా కటాక్షమే సాధన మని కూడా చెపుతారు.

దేవి వేరు, భగవంతుడు వేరు కాదు. ఈశ్వరుడూ, కరుణా వేరైనట్లయితే మన మందరం రావణుడు పడిన పాట్లనే పడవలసివస్తుంది.

మానవుల ప్రేమ తీవ్రతలాంటిదే ఈశ్వరుని కరుణా తీవ్రత కూడా.

రామాయణానికి ఇంకా అనేక వాఖ్యానాలు చేయవచ్చు. నిజమైన వజ్రాల కాంతిలో అనేక రంగులను చూడవచ్చు.

* * *

పదిహేడు నెలలకు ముందు భయం భయంతో ప్రారంభించిన కార్యం ఈ వారం (6-11-1955)తో పూర్తయింది. ఇది భగవత్సేవ కొబట్టి అందుకు కావలసిన శరీరారోగ్యాన్నీ, మనశ్శాంతినీ ఆ భగవంతుడే ప్రసాదించాడు.

నా రచనలోనూ, భావాలలోనూ పెద్దలకు ఎన్నో దోషాలు కానవస్తాయి. అందులో ఆశ్చర్యం లేదు. దోషాలను వదిలివెట్టి, నా రచన వల్ల కలిగిన సత్ఫలితాన్ని మాత్రమే తీసుకొండి.

బిడ్డల కొరకమాట! నేను ఈ రామాయణం రచించింది ముఖ్యంగా మీ కోసమే! వాల్మీకి రామాయణాన్ని పెద్దలు చదవవచ్చు. కంబ రామాయణాన్ని కూడా చదవవచ్చు. పాడనేర్చిన వారు త్యాగరాజస్వామివారి రామకీర్తనలను ఆనందంగా పాడుతారు. కాని బిడ్డలైన మీరు నేను వ్రాసిన ఈ రామాయణాన్ని ఎవరి సహాయమూ లేకుండానే చదువుకోవాలి.

రాముడు, లక్ష్మణుడు, భరతుడు, హనుమంతుడు మీకు తండ్రిలాగా అన్నలాగా సదా తోడుగా ఉంటారు. భరతుడూ, లక్ష్మణుడూ, హనుమంతుడూ వీళ్ళలాగా మీరు సమస్తమైన భాగ్యాలూ పొందండి.

తల్లులకు నేనేం చెప్పేది? నేను వ్రాసిన రామాయణాన్ని మీరుకూడా చదివి ఆనందిస్తూవచ్చినందువల్లనే, నా రచన ఇంత వరకూ సాగింది. బిడ్డలకోసమని వాక్యాలను సంధులు విడగొటి చిన్న శైలిలో వ్రాసినందుకు మీరు ఆక్షేపించకండి. మనం చేసేది అంతా బిడ్డలకోసమే కదా? సీత చరిత్రను మనసా అనుభవించడం ఒక్క తల్లులకే చేతనవుతుంది. నా వ్రాతలను గురించి చెప్పనక్కర

లేదు. ఆదికవి రచనలోను, కంబరుకవి రచనలోను సీత చరిత్రను ఒక్క తల్లులు మాత్రమే పూర్తిగా అర్థం చేసుకోగలరు. ఇంతెందుకు జటాయువు సాహసాన్నికూడా తల్లులే నూటికి నూరుపాళ్లు ఆనందిస్తారు. సీత కష్టాలు రామాయణంతో ముగియలేదు. తల్లుల జీవితంలో ఆ చరిత్ర ఇంకా జరుగుతూనే ఉంటుంది.

తాను ఈశ్వరావతార మని తెలియనిది రామావతారం. తాను ఈశ్వరు డన్న సంగతి పూర్తిగా తెలిసి అవతరించి లీలలు నడిపినవాడు శ్రీకృష్ణ భగవానుడు ఒక్కడే. మనం ఈ వ్యత్యాసాన్ని దృష్టిలో ఉంచుకొని రామగాథను కృష్ణగాథను చదవాలి. అవతార జ్ఞానంలేని రామచంద్రుడు పొందిన మనో దౌర్బల్యం కాని దుఃఖం కాని శ్రీకృష్ణుడికి లేవు. పూతన పాలు తాగినప్పుడు కాని, కవ్వాలతో దెబ్బలు తిన్నప్పుడు కాని ఆయనకు చింతా దుఃఖమూ కలగలేదు. యుద్ధంలో ఒకరిని నిమిత్తమాత్రులను చేసి ఆయుధాలు లేకుండానే దుష్టులను నిర్మూలించగల శక్తి కృష్ణుడు ప్రదర్శించాడు. కొన్ని కొన్ని ఘట్టాలలో ఈ రెండు పరిస్థితులనూ చక్కగా చూడవచ్చు.

* * *

వాల్మీకి మహర్షి వ్రాసిన రామాయణం ప్రకారమే నేనిది వ్రాస్తున్నాను. మహర్షికి చాలాకాలం ముందునుంచే ప్రజల్లో ఈ కథ ఆనోట ఆనోట వాడుకలో ఉండి ఉండాలి. ఈ కథ అంటే- అపవాదానికి భయపడి రాముడు సీతను అడవికి పంపిన కథ అన్నమాట. ఈ శోక గాథ మనదేశంలో స్త్రీ రత్నాల దుఃఖ సాగరంనుంచి పుట్టిన ఒక కల్పన. ఆ కల్పనే ఉత్తర రామాయణం లేక ఉత్తర కాండగా రూపు దాల్చింది. అది అందమూ దుఃఖమూ కలగలిపిన కావ్యం. అయినా అది మనకు నచ్చదని మాత్రం ఒప్పుకోవాలి. ఈ అపవాద ఘట్టాన్ని యుద్ధ భూమిలో అగ్ని పరీక్ష పెట్టి మహర్షి ఒక విధంగా ముగించాడు. నిజానికి ఈ పరీక్షకూడా రాముడికి తగింది కాదని నా బుద్ధికి తోస్తూంది. అది చదివేటప్పుడు మనస్సుకి కష్టంగానే ఉంటుంది.

శ్రీరాముడు మిథిలనుంచి అయోధ్యకు వస్తూ ఉండగా దారిలో పరశురాముడు కలిశాడు. ఆ కలయికతో పరశురాముడి విష్ణ్వావతారం ముగిసినట్లు పెద్దలు చెప్పగా వింటున్నాం. అలాగే రావణ సంహారంతో రామచంద్రుడి విష్ణ్వావతారం కూడా ముగిసినట్లే మనం భావించవచ్చు. ఆ తర్వాత రాముడు కేవలం ఇక్ష్వాకు వంశపు రాజుగా మాత్రమే మిగిలాడు. ఇలా భావించి నట్లయితే యుద్ధకాండలో సీత అగ్నిపరీక్ష, తర్వాత ఉత్తర కాండలో సీత వనవాసం– ఈ రెండు ఘట్టాలవల్లా ఏర్పడిన చిక్కులు తొలగిపోతాయి. ఆకాలపు లోకాచారాన్ననుసరించి అయోధ్య రాజు అలా నడుచుకున్నాడని మనం సమాధాన పడవచ్చు.

అనేక వేల సంవత్సరాలకు పూర్వం వ్రాయగా తాళపత్రాలమీద శిథిలాశిథిలమై వస్తున్న గ్రంథాన్ని గురించి దేనినీ నిశ్చయంగా చెప్పడానికి వీలుండదు. సీత యుద్ధకాండలో అగ్ని పరీక్షకు నిలబడ తర్వాత కూడా తిరిగి ఆదే సమస్యపై ఉత్తరకాండలో అడవికి పోయినట్లు ఉంది. ఆ జగన్మాత దుఃఖమే దుఃఖం. మన స్త్రీల మాటలకు కూడా అందనంత దుఃఖం ఇందులో ప్రతిఫలిస్తుంది.

దుఃఖమేంటి? సుఖమేంటి? అన్నీ ఈశ్వర లీలలు. ఈశ్వరుడే తన కరుణామూర్తి అయిన జగన్మాతతో మానవులుగా అవతరించి మానవులతో సమానంగా ఆ దుఃఖాలను లీలలుగా రామాయణంలో ఆడి చూపించారు.

ఆకాశంనుంచి వర్షం కురుస్తుంది. అది నదిగా మారి పారి సముద్రంలో పడుతుంది. ఆ సముద్రంనుంచి సూర్యుడు నీటిని పీల్చగా అది ఆకాశంనుంచి వానగా కురియడం, అది నదిగా పారడం ఈ క్రమం సాగుతూనే ఉంది. ఈ విధంగానే ప్రజా హృదయాలనుంచి లేచిన భావాలు మహర్షి హృదయంలో కవిత్వరూపం ధరించి అది మానవ హృదయాల్లోకి తిరిగి ప్రకాశాన్ని భావాన్ని కలిగిస్తుంది. ఇలా ఒకదాని కొకటి తోడ్పడుతూ అన్ని దేశాలలోనూ కూడా ప్రజల భావ సముద్రానికీ కవుల ప్రబంధానికీ సంబంధం ఉంటూ వస్తూంది. భారత స్త్రీల పవిత్ర సంస్కృతి, వాళ్లు పడుతున్న కడగండ్లు ఉత్తర

రామాయణ రూపం దాల్చాయి. అదే భారతనారి హృదయానికి కాంతినీ శాంతినీ ఇవ్వగల దివ్యజ్యోతి. ఒక దేశ ప్రజల విశ్వాసాలను పురస్కరించుకుని పురాణేతిహాస దివ్య ప్రబంధాలు పుట్టాయా? లేక పురాణేతిహాసాల మూలంగా ప్రజల నమ్మకాలు రూపొందుతున్నాయా? అన్నది ప్రశ్న. దీనికి ఎవరి ధోరణినిబట్టి వారు సమాధానం కల్పించుకొని తృప్తిచెందుతారు. చెట్టుముందా, విత్తు ముందా అన్న ప్రశ్న లాగానే ఇదికూడా ఒక తెగని ప్రశ్న. పక్షి ముందా, గుడ్డు ముందా? సముద్రంనుంచి మేఘాలు పుట్టాయా లేక వర్షాలు కురిసి యుగయుగాలుగా నదులు ప్రవహించడంవల్ల సముద్రాలు ఏర్పడ్డాయా? ఇలాంటి ప్రశ్నలు మనలను కొనకు ఈశ్వర పాదాల దగ్గర మాటల కందని చోటుకు తీసుకుపోతాయి.

మరొక విషయం. సీతను రావణాసురుడు ఎత్తుకొని పోయిన ఘట్టంలో వాల్మీకికి, కంబరామాయణానికి ఒక భేదం ఉంది. రావణుడు చేతులతో సీత నెత్తుకొని పోయాడని వాల్మీకి రామాయణంలో ఉంది. దాన్ని కంబరుకవి మార్చి రావణుడు సీతాదేవిని తాకకుండానే ఆమె నిలుచున్న స్థలాన్ని అలాగే పెళ్లగించి కొని పోయినట్లు వర్ణించాడు. హరిదాసులు ఈ కంబరామాయణంలో ఘట్టాన్నే కథల్లో చెపుతారు. మన ప్రజల మనస్సులకు అదే తగు సమాధానం కల్పిస్తుంది. అందుకే వాళ్లు అలా చెపుతున్నారు. ఒక క్రూరుడు ఒక స్త్రీపట్ల అధర్మంగా పశువులా ప్రవర్తిస్తే అందువల్ల నిరపరాధి అయిన ఆమెకు ఎట్టి పాపాలూ అంటవు. అది ఆమెకు అవమానం కూడా కాదు, అయినా అది ఆ స్త్రీకి ఒక కళంకం అని మన దేశంలో పొరపాటు అభిప్రాయం ఉంది. దీన్ని చూసిన కంబరు కవి, వాల్మీకి రామాయణంలోని ఈ ఘట్టాన్ని మార్చాడు. తులసీ రామాయణంలో రావణు డెత్తుకుపోయింది నిజమైన సీత కాదనీ, ఒక మాయ సీతను తన స్థానంలో ఉంచి జగన్మాత అదృశ్యమైందనీ ఉంది. ఈ మార్పునకుకూడా కారణం ఇదే. ఉత్తరదేశంలో రామాయణాన్ని అందరూ ఈ విధంగానే చెపుతున్నారు. అగ్ని పరీక్ష సమయంలో మాయసీత అగ్నిలో మాయమై పోయినట్లూ, నిజమైన సీత

అందులోనుంచి వచ్చినట్లు తులసీ రామాయణంలో చక్కగా చిత్రించాడు.

* * *

ఎక్కువ తెలిసినవాడిలాగ ఏదో చెప్పుకుంటూ పోయాను. చెప్పవలసింది ఇతరులకు ఉండవచ్చు. మరి నా కథ ఏమిటి?

ఇన్ని నెలలుగా రామాయణంలో మునిగి ఉన్నాను. ఆ కల ఇప్పుడు కరిగిపోయింది. సీతను ఎడబాసినపుడు రాముడు దుఃఖించాడు. అయోధ్యను విడిచినప్పుడు దుఃఖించాడు. నా మట్టుకూ నా సొంతకథ కూడా అలాగే ఉంది. అనేక విధాలైన సేవలు, భాధ్యతలు నిర్వహించి వాటినుంచి తప్పుకున్నాను. ఇలా తప్పుకోగానే ఇంటనే ఏంచేయడానికి తోచక కలవరపడాను. కాని ఇప్పు డీరామాయణ రచన ముగియగానే దేవుడులేని దేవాలయంలాగ అన్నీ శూన్యంగా కనిపిస్తున్నాయి. వ్యాపకంలేని జీవితం ఇలాగే ఉంటుందని అందరూ తెలుసుకోవాలి. సేవను ఒక భారంగా భావించకూడదు. ప్రాణానికి ప్రాణం పోసేది ఈ సేవే. 'కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషేత్ శతం సమాః ఏవం త్వయి నాన్యథేతో స్తి'' అని మహర్షులు చెప్పిందానికి అర్థం ఇదే. చేసే పనులమీద ఎంత సేవా యావ పెట్టుకోకూడదు. కాని సేవ చేస్తూ ఉండడంవల్ల మాత్రమే ఈ జీవితాన్ని సహించగలుగుతాం.

భూమిక

శ్రీ రాజాజీ తమిళంలో రచించిన "చక్రవర్తి తిరుమగన్" ("చక్రవర్తి పెద్దకొడుకు") అనే రామాయణానికి ఇది తెలుగు అనువాదం. ఆయన ప్రధానంగా వాల్మీకి రామాయణాన్ని అనుసరించి ఈ గ్రంథ రచన చేశారు. కాని కొన్నిచోట్ల కంబరామాయణంలోని విశేషాంశాలను కూడా వివరిస్తూ ఆ పద్యాలను చేర్చారు.

ఆ కంబరామాయణ పద్యాలకు, నా మీద సాటిలేని వాత్సల్యంగల విద్వత్కవికుల తిలక శ్రీ పూతలపట్టు శ్రీరాములు రెడ్డిగారు తెనిగించిన కంబరామాయణంలోని పద్యాలను వారి అనుమతితో చేర్చాను.

అలాగే "తిరుక్కురళ్" పద్యాలకు, కూడా వారు రచించిన "త్రివర్గము" అనే తెనుగు ద్విపదలను చేర్చాను.

—అనువాదకుడు

మహతి ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B127
పుస్తకం పేరు	రాజాజీ రామాయణం
తారీఖు	31 December 2025
ముందు అట్ట	No
వెనుక అట్ట	No
మొత్తం పేజీలు	503
పెద్ద సైజు పేజీలు	No VIII 492
ఖాళీ పేజీలు	A10
లేని పేజీలు	P. Jayamma P Jayamma
తయారు చేసినది	
పేజీలు విరిచినది	
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good